# కథా కౌముది

## 2012 - Part 1



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 76

కౌముది మాసపత్రికలో

2012 జనవరి నుంచి జూన్ 2012

వరకూ

వచ్చిన కథలు

| | | |
|---|---|---|
| 1. గౌతమి | శివాని | 5 |
| 2. అడుగడుగున గుడి ఉంది | జనార్దన రావు (జెన్ని) | 12 |
| 3. అమెరికాలో మనమ్మాయి | విజయ (కర్రా) గంటి | 20 |
| 4. ఆప్తమిత్రుడు | అనుసృజన: డా.వైజయంతి | 24 |
| 5. వెంటాడే గాంధీ | కండ్లకుంట శరత్‌చంద్ర | 29 |
| 6. సుఖాంతం | పొత్తూరి విజయలక్ష్మి | 41 |
| 7. అంతులేని పయనం | శిరంశెట్టి కాంతారావు | 50 |
| 8. మధురక్షణాలు | జ్యోతిర్మయి | 59 |
| 9. గొప్పదొంగ | డా.మృదులాంజలి | 61 |
| 10.విజ్ఞులు ప్రాజ్ఞులు | నాగేంద్ర కాశి | 69 |
| 11.దిద్దుబా(ట్లు)టలు | డా. నారాయణ గరిమెళ్ళ | 73 |
| 12.పగిడి | కె.బి.లక్ష్మి | 76 |
| 13. మానసిక పరివర్తన | కుంతి | 81 |
| 14. నేను చూసిన దైవం | సన్నిహిత్ | 85 |
| 15. అమ్మంటే | మంధా భానుమతి | 91 |
| 16. దీనాతి దీనార్ | మూలా రవి & వాసు | 98 |
| 17. మరో మర్యాదరామన్న | విజయ కర్రా | 105 |
| 18. మంచాన పడితే పడ్డాను | డి.ఆర్.రావు | 108 |
| 19. వాల్మీకి | గన్నవరపు నరసింహమూర్తి | 114 |
| 20. విధివిన్యాసాలు | డా.కె.వి.ఎస్.జ్ఞానేశ్వరరావు | 119 |
| 21. కృష్ణమూర్తి కళ్ళు | నాగేంద్ర కాశి | 123 |
| 22. సంధ్యావందనం | సత్యం మందపాటి | 128 |
| 23. మరోలోకం | వేమూరి వేంకటశ్వరరావు | 135 |
| 24. అనుక్కున్నదీ... అయినదీనూ | శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 142 |
| 25. ముళ్ళగులాబీ | ఉమాభారతి కోసూరి | 146 |
| 26. అదృష్టం | పి.ఎస్.నారయణ | 151 |
| 27. కాలచక్రం | అపర్ణ మునుకుట్ల గునుపూడి | 156 |
| 28. ఆనవాలు | వనజ వనమాలి | 160 |
| 29. మార్పు మంచిదే కానీ | కన్నెగంటి అనసూయ | 167 |
| 30. నాన్న రాసిన ఉత్తరం | యామిజల జగదీష్ | 172 |
| 31. తుంగచాప | ఎమ్మార్వీ. సత్యనారాయణ మూర్తి | 175 |
| 32. గొంగళిపురుగు | ఎమ్. సుగుణరావు | 180 |

| | | |
|---|---|---|
| 33. గ్రీన్ విలేజ్ | రవి వీరెల్లి | 188 |
| 34. రాతిముక్క కథ | గన్ను కృష్ణమూర్తి | 193 |
| 35. మనసు చూడ తరమా! | జి.ఎస్. లక్ష్మి | 197 |
| 36. గుడ్ బై మిస్టర్ సంపత్ | యల్లాప్రగడ | 205 |
| 37. సర్దుబాటు | ఆకెళ్ళ కృష్ణకుమారి | 208 |
| 38. ప్రేమ - ప్రేమ్ - ప్రేమాయణం | తాడికొండ కె. శివకుమార్ శర్మ | 211 |
| 39. అపరాధభావం | పోలంరాజు శారద | 216 |
| 40. నాన్నా ఒకసారి మళ్ళీ రావూ! | నాగ్ శర్మ రొట్టె | 220 |

# గౌతమి

## శివాని

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.**

**తులసి మొక్క మొదట్లో నీళ్ళు పోసి,** కళ్ళు మూసుకుని, చేతులు జోడించి, 'యమ్మూలే సర్వతీర్థాని, యన్మధ్యే సర్వదేవతా, యదగ్రేసర్వవేదాశ్చ, త్వాం తులసీం ప్రణమామ్యహం' అన్న శ్లోకం చెప్పుకుంటున్న కృష్ణవేణికి, తన కొంగు పట్టి ఎవరో లాగినట్టనిపించి, తల ప్రక్కకి తిప్పిచూసింది. చిన్నారి గౌతమి! ఆ పిల్ల చేతిలో తన కొంగుంది.

'అమ్మమ్మా! రా ఎవరో వచ్చారు' అంటోంది, చీర గట్టిగా గుంజుతూ, పాపకి మూడేళ్ళే అయినా మాటలు స్పష్టంగా ఉంటాయి.

'ఎవరమ్మా నీకు తెలీని ఆ క్రొత్తవాళ్ళు?'దండం పూర్తిచేసి, నవ్వుతూ అడిగింది, కృష్ణవేణి పాపతో ముందు హాలువేపు నడూస్తూ. 'తాతగారు లేరా?'

'తాత బజారు కెళ్ళారుకదా!' గుండ్రంగా కళ్ళు తిప్పుతూ 'మర్చిపోయావా అప్పుడే' అన్నట్టు చూసింది గౌతమి కృష్ణవేణి వేపు.

'అవునుకదూ! కూరలు తెమ్మని చెప్పాను.'

హాల్లో కడుగుపెట్టిన కృష్ణవేణికి, విస్మయం కలగడమేగాక, నవ్వు కూడా వచ్చింది, కుర్చీలో కూర్చుని, ఏదో పుస్తకంలో పేజీలు తిరగేస్తున్న మంజీరని చూస్తూనే, మంజీర మామూలుగా ఆ సమయంలో రాదు. వర్కింగ్ డే కదా!

'పిచ్చిమొద్దూ! ఎవరో నీకు తెలీదూ?'అని చిన్నగా, పాప తలపైన మెట్టి, వెళ్ళి మంజీర కెదురుగా మరో కుర్చీలో కూర్చుంది, కృష్ణవేణి.

'కులాసాగా ఉంటున్నావామ్మా?' పలకరించింది కూతుర్ని.

'ఆс....' అంది మంజీర, పాపనే చూస్తూ. 'ఇటువేపు సెమినార్ ఉంటే వచ్చావమ్మా. దగ్గర కదా, చూసి పోదామని వచ్చాను'

గౌతమి బుట్ట చేతుల పూల డిజైనున్న ఫ్రాకు వేసుకుంది. చెవులకి చిన్నలోలకులు. మెడలో పులిగోరున్న బంగారు గొలుసు. చేతులకి మాత్రం పగిలే ప్రసక్తిలేని ప్లాస్టిక్ గాజులు. నుదుట తీర్చిదిద్దినట్లున్న తిలకం. జుట్టు నున్నగా దువ్వి, రెండు జడలు వేసింది కృష్ణవేణి.

అమ్మమ్మ ఒడిలోకెక్కి కూర్చుని, అసలే పెద్దవైన కళ్ళింకా పెద్దవి చేసి చూస్తోంది, గౌతమి మంజీరవేపు.

'ఒకప్పుడు తన తల్లి ఒడిలో తనూ అలాగే కూర్చునుండేదేమో!' అనుకుంది మంజీర, పాప మీదినుండి చూపులు తిప్పుకునే ప్రయత్నం చేయకుండా.

కృష్ణవేణి గమనించకపోలేదు, కూతురిలో రూపుదిద్దుకుంటోన్న మార్పుని. ఆమె కళ్ళల్లో ఒకప్పుడు పాపని చూడగానే తారట్లాడే అసహనం క్రమంగా కరిగిపోతున్నట్టనిపించింది.

'అడగనేలేదు చూశావా. మంచినీళ్ళు కావాలా మంజూ? ఎండలు మాడ్చేస్తున్నాయి'అంది కృష్ణవేణి. అది ఉపచారానికన్న మాటేనని ఆమెకి తెలుసు.

ఎ.సికారులో తిరిగే మంజీరకి ఎండ బాధేం తెలుస్తుంది?

గౌతమి ఒక్క ఉదుటున, అమ్మమ్మ ఒడిలో నుండి క్రిందకి దూకి, అక్కడే కాస్త దూరంలో, స్టూలు మీద పెట్టిన కూడకున్న నల్లా తిప్పి, గ్లాసుతో నీళ్ళు పట్టుకొచ్చేసింది.

'ఇవ్వు' నవ్వుతూ చెయ్యిజాపింది మంజీర, గ్లాసందించి, దగ్గరగా నిల్చున్న పాపనడిగింది. 'నీ పేరు నాకు తెలీదు. చెపుతావా?'

'గౌతమి' ముద్దుగా అంటున్న పాపనొక్కసారి ఒళ్ళోకి లాక్కుని ముద్దులు కురిపించాలనుకున్న తనని, ఏదో అదృశ్యశక్తి వెనక నుండి పట్టి ఆపినట్టు ఆగిపోయింది మంజీర. ఈ పాప గురించి కాదూ కొన్ని నెలలపాటు, తనకీ, తల్లికీ మధ్య మాటల్లేవు. కొన్నాళ్ళపాటు రాకపోకలూ తగ్గిపోవడం.

'బాగా అల్లరిచేస్తావా?'

పాప జవాబివ్వలేదు. కృష్ణవేణి వేపు చూసింది పెదవులు బిగపట్టి.

'అంతలేదు మంజూ కాని నా వెనక వెనకే తిరుగుతూ ఏవో చక్కపెట్టేస్తుంటుంది. చిన్నప్పుడు నువ్వూ అలాగే చేసేదానివి' అంటూ గతుక్కుమన్నట్టు ఆపేసి, మంజీర కళ్ళల్లోకి చూసింది కృష్ణవేణి, తప్పు చేసినదానిలా.

మంజీర ఆ మాటలు పరకు చేయనట్టు, హేండ్ బ్యాగునుండి చాక్‌లెట్ తీసి గౌతమి కందిస్తూ, 'పద్యాలు నేర్పించావామ్మా నీ మనవరాలకి?' అన్నది.

'ఏదీ చేత వెన్నముద్ద పద్యం చెప్పమ్మా' కృష్ణవేణి అడగడమే ఆలస్యం, పాప గడగడా చెప్పేసింది. మాటలో స్పష్టత అంతే స్వచ్ఛత.

'వెరీగుడ్' మనస్ఫూర్తిగా అంది మంజీర.

'థాంక్యూ' కొత్తగా నేర్చుకున్న పదం ఉపయోగించేసింది పాప, చాక్‌లెట్ వేపు చూస్తూ.

'మీ తాతగారొచ్చినట్టున్నారు చూడు తల్లీ!' బైట కిర్రుమన్న గేటు శబ్దం విని అంది కృష్ణవేణి. పాప తూనీగలా వసారాలోకి పరుగుతీసింది.

'తాతయ్యా! ఇదిగో కావాలా?' అడుగుతోంది.

'బంగారు తల్లీ! నేనంటే నీకెంత ప్రేమమ్మా నాకొద్దులే. నువ్వే తిను. కాస్త దాచుంచేం' గౌతమి నెత్తుకుని రానే వచ్చాడు నాగేశం లోపలికి. మంజీరని చూస్తూనే పలకరింపుగా ఆయన కళ్ళు మెరిశాయి. 'తాతయ్యా చాక్‌లెట్.. ఆంటీ ఇచ్చింది' అంది గౌతమి.

'భడవా! ఎవరమ్మా నీకలా చెప్పింది?' ముద్దుగా కసిరాడాయనా పిల్లని.

గౌతమి జవాబివ్వకుండా కళ్ళు మిటకరించింది.

'బావున్నావామ్మా మంజూ? ఈ ముసలిప్రాణులమీద ఇన్నాళ్ళకి దయకలిగిందన్నమాట' పాపని దింపి, కుర్చీలో జేరగిలబడ్డాడు. 'అల్లుడుగారు కులాసానామ్మా?' వయోభారం తెలుస్తోందాయనలో.

'ఆయన బావున్నారు నాన్నా. నేను పోయినవారమే వచ్చాను. మీరూ, పాపా పార్కు కెళ్ళారని అమ్మ చెప్పింది'.

'అవున్లే తల్లీ! మీ అమ్మ నాతో చెప్పేవుంటుంది. ఏదీ గుర్తుంటేనా? మతిమరుపెక్కువైపోయింది'

'తాతయ్యా! మంచినీళ్ళు కావాలా?' పాప అడిగిందాయన్ని నాగేశం 'వూం' అన్నదే తడవుగా బాణంలా దూసుకెళ్ళి నీళ్ళు తెచ్చి అందించింది.

'అమ్మా! నా చిన్నప్పుడు నేను కూడా ఇంత సేవ చేసి ఉండనుకదూ?'

'అది సేవ ఎందుకయింది?' అంది కృష్ణవేణి 'అది మమతమ్మా. మనిషికీ మనిషికీ మధ్య ఉండేది. ఉండాల్సిందీ'

ఒక్క క్షణకాలం తల్లివేపు సాలోచనగా చూస్తుండిపోయిందిమంజీర.

'అదిసరేగాని. నేను ఆంటీని అని పాపకి చెప్పావామ్మా?'

'లేదు మంజూ.. కాని ఇంటికెవరన్నా అప్పీ తప్పీ వస్తే, ఫలానా ఆంటీ అనో, అంకులనో చెపుతుంటాను కదా. అది గుర్తుంచుకుని, నిన్నూ అలానే పిలిచింది.'

తన హృదయం కలుక్కుమనడం మంజీరకి తెలిసింది.

దేవుడు వరమిస్తే, నిజానికా పాప స్థానంలో తనకూతురు కాదూ ఉండాల్సింది. చేజేతులా తనుకాదూ ఆ అదృష్టాన్ని దూరం చేసుకుంది.

నాగేశం తను తెచ్చిన కూరలు సర్దడానికి వంటింట్లో కెళితే, పాప తాతగారిననుసరించింది.

'భోజనం చేసి వెళ్ళమ్మా మంజూ. ఇవ్వాళ వంట చేసేశాను. నువ్వు తింటానంటే, వేడిగా పుల్కాలు చేస్తాను' అంది కృష్ణవేణి కాస్త సందేహిస్తూనే దానికి కారణముంది. ఈ మధ్య ఎప్పుడూ తమ దగ్గరకు వచ్చినా, మంజీర ఏదో ఓ కారణం చెప్పి, గంటకన్నా ఎక్కువ ఉండకుండానే వెళ్ళిపోతోంది. అయినా తనది తల్లి హృదయం. అడగకుండా ఎలా ఉండగలదు?

'నేనూ మీతోనే భోంచేస్తానమ్మా! ఇవ్వాళ సాయంకాలందాకా ఉండి వెళతాను' అంది మంజీర. ఆ ఇంట్లో డైనింగ్ టేబులూ, కుర్చీల ఆర్భాటంలేదు. వంటింట్లోనే క్రింద చాపలేసుకుని భోజనం చేశారు. మంజీర గమనిస్తూనే ఉంది, తన తలిదండ్రుల ముఖాల్లో వెల్లివిరుస్తోన్న ఆనందపు ఛాయల్ని. తల్లి తను అంటూ, మధ్య మధ్య గౌతమికి అధరువులతో చిన్నచిన్న ముద్దలు చేసి పెడుతున్న ఆ దృశ్యం, తన బాల్యాన్ని జ్ఞప్తికి తెచ్చింది. గౌతమి అంత చిన్న వయసులోనూ ఎంత ఒబ్బిడిగా క్రిందామీదా పడకుండా తింటోంది.

'అమ్మా చాలాకాలానికి ఎంతో హాయిగా అనిపిస్తోంది'. మంచం మీద దిండుకి జేరగిలబడి కూర్చున్న మంజీర, వంటిల్లు సర్దుకుని వచ్చిన తల్లిని చూస్తూనే అంది. 'పాపేదీ?'

'అది వాళ్ళ తాతగారి ప్రక్కలో చేరి, ఎండని ఏడుచేపల కథ చెప్పించుకుని గాని పడుకోదు'. నవ్వుతూ మంచం మీద కూర్చున్న తల్లి తొడమీద, ఉన్నట్టుండి ఒరిగి, తల ఆనించి పడుకుంది మంజీర. 'అమ్మా! నాకూ ఆ కథ చెప్పవూ?' ఆమె కనుకొలుకుల్లో నీళ్ళు నిలిచాయి.

'ఏమయిందివ్వాళ అమ్మాయిగారికి?' అప్రయత్నంగా, కృష్ణవేణి కూతురి జుట్టులో వేళ్ళుజొనిపి సవరించింది. యూనివర్శిటీ రాంక్‌హోల్డర్, ఎండని ఏడు చేపల కథ అడుగుతోంది!

'నేనేం పోగొట్టుకున్నానో నాకు తెలుస్తోందమ్మా!'

'పిచ్చిపిల్లా రాకరాక వస్తావిక్కడికి. వేరే ఆలోచనలు పెట్టుకోక కాస్సేపు పడుకోరాదూ?'

'పాపని ఈ ఇంటికి తెచ్చినందుకు నిన్నెన్ని మాటలన్నానమ్మా! అవన్నీ నువ్వు మర్చిపోయావేమో, నేనెలా మర్చిపోగలను? నన్ను క్షమించమ్మా'.

'జరిగినవాటి గురించి పదేపదే బాధపడడం వల్ల నాకు లాభమేమీ కనిపించదు. నేను నమ్మిన ఫిలాసఫీ, వర్తమానంలో జీవించడం'

నిజం కాబట్టే కృష్ణవేణి అంత ధైర్యంగా, ఆ వయసులో గౌతమి పెంపకానికి పూనుకుంది. 'కృష్ణా, రామా' అనుకోవాల్సిన సమయంలో చోద్యం కాకపోతే, ఇప్పుడావిడకి పిల్లలు కావల్సి వచ్చారా అని చాటుమాటున బుగ్గలు నొక్కుకున్న బంధువర్గం మాటల్నీ, ఆఖరికి తమకన్న పిల్లలనుండి వ్యక్తమైన వ్యతిరేకతని కూడా లక్ష్యపెట్టలేదు.

కాస్సేపు ఇద్దరిమధ్యా రాజ్యమేలిన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మంజీర అంది. ‘పాపని నువ్వు కన్నతల్లిలా పెంచుతున్నావ్. అమ్మమ్మా అని పిలిపించుకుంటున్నావెందుకమ్మా?‘

‘నీకు తెలీదా మంజూ నిజంగా? జీవితంలో ఎంతో సహజమూ, అనివార్యమూ అయిన ఈ ఘట్టం మేమూ చాలాకాలమే మిస్సయ్యామమ్మా! దానికి పరిహారంగా అన్నట్టుగా ఆ పిల్ల ఈ ఇంట అడుగుపెట్టింది. ‘తాతయ్య‘ అన్న పిలుపు విన్నప్పుడల్లా మీ నాన్నగారికి కళ్ళల్లో మెరుపులూ, తెల్లమీసాల చాటున వెల్లివిరిసే చిరునవ్వులూ ఏ అంగట్లో వెలపోసి కొనగలమమ్మా? నువ్వనవచ్చు. అన్నయ్యకి పిల్లల్లేరా అని. నిజమే వాడికిద్దరు పిల్లలున్నారు. వాళ్ళ పుట్టుకగానీ, పెరుగుదలగానీ, ముద్దూముచ్చట గానీ ఏదీ కూడా మేమెరుగనంతదూరంలో, ఎక్కడో సముద్రానికావలితీరంలో ఉన్నారు. అంతా ప్రపంచాన్ని ‘గ్లోబల్ విలేజ్‘ అంటున్నా, మాలాంటి మధ్య తరగతికుటుంబీకులకి విదేశయానమెప్పుడూ అందని మానిపండేనమ్మా! మేమూ వెళ్ళలేము. వాళ్ళూ రాలేరు. వచ్చినా ఈ దేశంలో అటు అమ్మాయి తలిదండ్రులకి న్యాయం చేయాలో, ఇటు మాకు న్యాయం చేయాలో పాలుపోని పరిస్థితి వాడిది. మాదేమో, పిల్లల్ని షోకేసులో డాల్స్‌లా దూరందూరంగా దర్శించుకోవాల్సిన మనఃస్థితి కాస్త మాలిమి అయ్యేవేళకి వాళ్ళ ప్రయాణపు తేదీ దగ్గర పడనే పడుతుంది. తర్వాత వాళ్ళెవరో మేమెవరో. Out of sight, out of mind అంటారు చూడు, అదన్నమాట.

వాళ్ళని చూస్తూ, వాళ్ళ మాటల ధోరణి గమనిస్తూ కొడుకు పిల్లలే కనుక కానివాళ్ళనుకోలేక, అలాగని మురిపెంగా వాళ్ళు మా దగ్గరికి రానూరాక అదంతేలే అని సరిపెట్టుకుంటున్నట్టు మేము నటించలేక అదొక త్రిశంక స్వర్గం. పోదూ నీకు తెలీందేముంది మంజూ? కాలంలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. వాటినెంతగా ఆమోదించి సర్దుకుపోదామనుకుంటున్నా, అనుబంధాలూ, ఆత్మీయతల కోసం మాత్రమే వెంపర్లాడే మా తరం వాళ్ళకి నిరాశ తప్పడంలేదు. కాస్సేపు నడుం వాల్చమ్మా మంజూ. మీ నాన్నగారికి లేస్తూనే, ఫిల్టర్ కాఫీకావాలి. అలాగే పాలుకాచాలి? ‘ మృదువుగా అని లేచింది కృష్ణవేణి.

తల్లి వెళుతుంటే గమనించింది మంజీర. వృద్ధాప్యపు ముంగిట ప్రవేశించిందామె. చేతుల్లో ఉత్సాహాన్ని కొని తెచ్చుకుంటోంది.

దిండుమీదికొరిగి కళ్ళు మూసుకున్న మంజీరకి, తన గతించిన గతమే వాటిముందు తారాడడం తెలిసింది.

●●●

ప్రేమించి, పెద్దల అంగీకారంతోనే పెళ్ళి చేసుకున్నారు తనూ సారథీ. ఇద్దరిదీ పెద్ద చదువే. అట్టే కష్టపడకుండా మంచి ఉద్యోగాలొచ్చాయి. అత్తమామలు దూరంగా వేరేచోట ఉంటారు. మామగారికి మందుల వ్యాపారం. ఎప్పుడన్నా వచ్చినా రెణ్ణాళ్ళకి మించి ఉండేవారు కాదు. ఒకే ఒక్క ఆడపడుచు, సారథి కన్నా పెద్దది, నార్త్‌లో ఉంటుంది. ఉమ్మడి కుటుంబం. ఎక్కువ కదిలి వచ్చే ఆస్కారం లేదు. ఆమెకి ఒక్కత్తే అమ్మాయి.

ఏ విధమైన ప్రతిబంధకాలు లేని కులాసా సంసారం.

వృత్తిలో పూర్తిగా నిమగ్నమైపోయి, తమకి తామే ఓ పరిధి గీసేసుకున్నారు. అదే ఆనందంగా భావించారు. అటు అత్తమామలూ, ఇటు తలిదండ్రులూ, చెవినిల్లుకట్టుకుని పోరుతూనే ఉన్నారు. పెళ్ళైన రెండేళ్ళనుండీ మనవడినో, మనవరాలినో ఇమ్మని. వాళ్ళకళ్ళముందే మంజీరా సారథుల తర్వాత పెళ్ళాడినవారంతా అమ్మానాన్నలైపోతుంటే ఆ ముసలిప్రాణులకి ఆరాటంకాక మరేమిటి?

నవ్వుతూ వినేవారు తనూ సారథీ ఔననకా, కాదనకా.

కొన్నాళ్ళపాటు ఏ బాదరబందీలేని స్వేచ్ఛాయుత జీవనం గడపాలని ఇద్దరికీ ఉండేది. సెలవలు దొరికితే చాలు, విహారయాత్రలకి బైల్దేరేవారు. తను తన కంపెనీ పనులేకాక, థియేటర్ ఆర్టిస్ట్‌గా మొదలుపెట్టి, తనంతట తనే మరికొన్ని పనులూ నెత్తికెక్కించుకుంది.

ప్రశంసల పరంపర క్రమంగా తనని ఆ వలయంలో ఇరికించేసింది. సారథి కూడా కొలీగ్స్ ప్రోద్బలంతో స్పోర్ట్స్ క్లబ్‌లో చేరాడు. ఇద్దరిదీ పరుగుల జీవితమే అయిపోయింది.

ఒకే ఊళ్ళోవున్నా, ఆర్నెల్లకో, ఏడాదికో చూసిపోదామని వచ్చిన తన తలిదండ్రుల్ని కూడా మనసారా పలకరించలేనంత బిజీగా, తన వృత్తి ప్రవృత్తులలో మునిగిపోయింది, తను. క్రమంగా వాళ్ళూ రావడం మానేశారు. ఇంటికెళితే దొరకరని బంధువులూ, స్నేహితులూ రాకపోకలు లేవు. విశాలమైన మూడు పడగ్గదుల ఇల్లు తమది. ఇంట్లోలేని హంగులు లేవు. వంట మనిషీ, పనిపిల్లా సదా హాజరు. దిశానిర్దేశం చేసే పెద్ద దిక్కేలేదు. కానీ అది ఏనాడూ తమకి 'ఎసెట్'గానే తప్ప కష్టంగా అనిపించేదికాదు. 'లేట్ నైట్స్'కి సంజాయిషీలు లేవు. ఇష్టం వచ్చినప్పుడు లేవడం, ఎక్కడ వీలవుతే అక్కడ తినడం పెళ్ళి స్వాతంత్ర్యాన్ని మరింత పెంచిందని మురిసిపోయేది.

చూస్తుండగానే ఎనిమిది కాలెండర్లు మారాయి. మనవడికోసం ఆరాటపడీ, పడి, చివరికి అత్తమామలు ఆ ఊసు ఎత్తుకోవడమే మానేశారు.

కొన్నాళ్ళకి ఆ ఆరాటమేదో తనలో మొదలైంది.

ఒకప్పుడు పిల్లల్ని అప్పుడేనా అని తను వద్దనుకుంది.

ఇప్పుడు పిల్లలు తనని వద్దనుకుంటున్నట్టున్నారు.

చిన్నపిల్లల కేరింతలూ, ఆటపాటలూ లేని ఆ మూడు గదుల 'కొంప' బిక్కుమంటూంటుంది. తనూ, సారథీ చెరో గదిలో తమ తమ పనులు చేసుకుంటూ గడిపేస్తుంటారు. ఒక్కోసారి ఇద్దరి మధ్యా మాట్లాడదామన్నా మాటలుండవు.

తమ మధ్య వైవాహిక బంధంవుంది. కాని దాన్ని పరిపుష్టం చేసే సంధానకర్త లేడు. ఎంతో సంపాదన నెల తిరిగే సరికల్లా, మనసులో 'వాయిడ్'ని పూడ్చుకోవడానికి ఇంటిని కొత్త కొత్త వస్తువులతో నింపేస్తున్నారు. కాని అవేవీ అంతగా సంతృప్తినివ్వడంలేదు. 'ప్రేమ'నందుకుని స్పందించేందుకు. పాపం అవి జడపదార్థాలాయె! యాంత్రికంగా, అలవాటైన వృత్తినీ, ప్రవృత్తినీ నిర్వర్తించుకుని వస్తోంది. ఇటువంటి సమయంలో ఒకటే ఒక ఊరట. తల్లి దగ్గరకి రావడం. అంతరాంతరాలలో 'గౌతమి'ని చూడాలన్న కోరికే అందుకు ప్రేరేపణ.

●●●

గతం కంటిముందు తారట్లాడుతుండగానే, కంటిమీదికి కునుకురావడంతో, అలా ఎంతసేపో పడుకున్న మంజీరకి, అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది. చేతికున్న వాచ్ చూసుకుంది. లేచి ముంగరులు అలవోకగా సర్దుకుంటూ, ఎదురుగా ఉన్న అద్దంలోకి చూసేసరికి, భుజాలమీదికి రింగులు రింగులుగా పడుతున్న వెంట్రుకలు కనిపించాయి. తల్లి తననెప్పుడూ హెచ్చరిస్తూనే ఉండేది, 'కళ్ళు సగం కప్పేస్తూ, చికాగ్గా ఆ జుట్టేమిటమ్మా మంజూ చక్కగా జడేయించుకో బావుండదనిపిస్తే, క్లిప్పో, రబ్బరు బాండో పెట్టుకో' అంటూ. తనావిడ మాటల్నెప్పుడూ ఖాతరు చెయ్యలేదు. తన చేతులు గాజుల్లేక మొండిగా ఉండడం, మెడలో మంగళసూత్రాల స్థానంలో కనిపించీ, కనపడని గొలుసుండడం ఆవిడ్ని బాధిస్తూనే ఉండేది.

తన తల్లినుదుట నయాపైసంత కుంకుమ బొట్టు చూస్తూ పెరిగిన తన, ఆధునిక పోకడకి లోనై, నుదుటినెప్పుడూ ఖాళీగానే ఉంచేసేది. ఎంత బాధపెట్టిందో తన తల్లిని. మంజీర చేతులు రెండు పైకెత్తి, అప్రయత్నంగా జుట్టునంతా దగ్గరకి చేర్చి, ముడిలా పెట్టుకుంది. అద్దంలో తనకి తనే వింతగా అనిపించింది.

పాతకొత్తల మేలుకలయిక తన తల్లి తన చదువు విషయంలో, స్నేహితుల విషయంలో, తన భావజాలం విషయంలో, ఆఖరికి పెళ్ళి విషయంలోనూ, ఎంతో ఔదార్యం చూపిన ఆవిడ్ని 'పరమఛాందసం బాబూ' అని మనసులోనే తెగ కొట్టిపారేస్తుండేది తను. ఇంతకీ ఆవిడ ఛాందసమంతా దేనికటా? తన కడుపు పండి, మాతృత్వపు మాధుర్యం చవిచూడాలని కాదూ? విరబోసుకున్న జుట్టుని ముడివేసుకున్నంత సులభం కాదు పిల్లల్ని కనడం అని ఇప్పుడు కదా రూఢి అయింది.

తనూ, సారధీ ఎన్ని ప్రయత్నాలు చేశారు. చేస్తున్నారు. ప్రపంచ జనాభాకి తమద్వారా మాత్రం ఓ ప్రాణి రూపు దిద్దుకుని అంకితంగావడంలేదు.

నెమ్మదిగా అడుగులేస్తూ, వంటింటివేపు వచ్చిన మంజీర, అక్కడి దృశ్యానికి ముగ్ధురాలైనట్టు నిలుచుండిపోయింది. స్టవ్ ముందు నిల్చుని, కాగిన నూనెలోకి పకోడీల పిండి వదులుతున్న తల్లినోట అదే పాట, తన చిన్నప్పటిది. 'పట్టుకొమ్మ వంటిదీ రామనామమూ, పుట్టతేనె వంటిదీ కృష్ణనామమూ' ఆ పాటననుసరిస్తోంది గౌతమి తన చిట్టిగొంతుతో తన తండ్రి ఒడిలో గారంగా కూర్చుని తనూ అలాగే కూర్చునేది తండ్రి ఒడినెక్కి ఇంచుమించు అదే వయసులో ఏదీ ఆ మంజీర? ఉన్నట్టుండి గౌతమి పాడ్డం ఆపేసరికి, 'ఏం ఆపేశావేం?' అంటూ ప్రక్కకి తలతిప్పి చూసిన కృష్ణవేణి, గుమ్మంలో నిల్చున్న మంజీరని చూడగానే, 'రామ్మా! నీకిష్టమని కాలీఫ్లవర్ పకోడీలు చేస్తున్నాను' అంది చిరునవ్వుతో. 'ఇందాకే మీ నాన్నతో అంటున్నాను దాన్నిలేపకండి. ఎంత నిశ్చింతగా పడుకుందో అంటూ.'

'నేర్చుకుందా పాట నీ మనవరాలు?' గౌతమిని మురిపెంగాచూస్తూ అడిగింది మంజీర. అక్కడే ఉన్న కుర్చీపీట జరుపుకుంటూ 'అమ్మా ఇవ్వాళ గౌతమికి ఫ్రాక్ కొనాలనుకుంటున్నాను. వస్తారా నాతో?'

నాగేశం, కృష్ణవేణి ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

'ఏమ్మా? నాతో రాకూడదా?'

'అలాగని కాదమ్మా..' కృష్ణవేణికి తెలుసు, తన కూతురి షాపింగంతా పెద్ద పెద్ద మాల్స్‌లోనూ, పేరొందిన షాపింగ్ సెంటర్లలోనూ అని. తమకా తాహతులేదు.

'మొన్నామధ్య పండక్కి భాషా దగ్గర కుట్టించిన ఫ్రాకులున్నాయి.'

'భాషానా? ఏదీ నా చిన్నప్పుడు కుట్టేవాడే ఇంకా కుడుతున్నాడా? రిటైరవ్వలేదూ?'

'అయినట్టే అనుకో తన కుట్టుమిషను కోడలికిచ్చేశాడు' నవ్వింది కృష్ణవేణి.

'పోన్లేమ్మా కాస్సేపు సరదాగా పార్క్‌కెళదామందరమూ' తల్లి తన ప్రపోజల్ కాదనలేదని, అంది మంజీర.

మరి కాస్సేపటికి అంతా పడవలాంటి కారులో ఉన్నారు.

గౌతమికంతా కొత్తగా ఉంది. ఉత్సాహంగా కిటికీలోనుండి చూస్తూ, మధ్యమధ్య తాతగారి వేపూ, అమ్మమ్మవేపూ దృష్టిసారిస్తోంది.

పార్కులో కృష్ణవేణి ఓ బెంచి చూసుకుని కూర్చుంటే, నాగేశం, మంజీరా, పాపని పిల్లలాడే చోటికి తీసుకెళ్ళారు. ఎటు చూసినా పచ్చదనం పరుచుకుని, వీచే పిల్లగాలులతో ఆహ్లాదంగా ఉంది వాతావరణం. 'రమ్యహర్మ్య ఔన్నత్యాన్నే అభ్యుదయంగా భావించే మనిషి క్రమంగా ప్రకృతిలో తన సహజ సంపర్కాన్ని విస్మరిస్తున్నాడు' అనుకుంది కృష్ణవేణి.

గౌతమికా పార్కు, తోటిపిల్లలతో అలా ఉయ్యాలూగడం, తిరిగే చక్రపు బండిలో కూర్చోవడం నచ్చినట్టుంది. తెగకేరింతలాడ్తోంది.

గైనిక్ సమస్యతో, ఆ హాస్పిటల్‌కి చెకప్‌కని వచ్చిన తను, అనుకోకుండా గౌతమిని నాలుగురోజుల పిల్లగా, అక్కడ చూడడం జరిగింది. ఆ హాస్పిటల్ డాక్టర్ మాలతి తన ఒకప్పటి క్లాస్‌మేట్. అక్కడున్న కాస్సేపటికే అర్ధమైపోయింది తనకి, అడపాదడపా వచ్చే

నర్సులూ, ఆయాలు వచ్చి ఏడుస్తున్న ఆ పాపని సముదాయించడం, బాటిల్‌తో పాలు పట్టి ఊర్కోపెట్టడం గమనించాక, ఆ పసికందు త్యజింపబడిందని.

కళ్ళైనా తెరవని, పిడికిళ్ళయినా విప్పని ఆ చిన్నారిని కాదనుకుని వెళ్ళిన ఆ కసాయి తల్లి ఎవరో? మాలని అడగకుండా ఉండలేకపోయింది తను. మాలతికటువంటి కేసులు కొత్తకాదు. ఎందరో నవజాత శిశువుల్ని అనాథాశ్రమాలకీ, స్త్రీ శిశు సంక్షేమశాఖలకీ తన చేతులతో అందజేసింది. కానీ ఆ పాప విషయంలో త్వరపడి ఏ నిర్ణయానికీ రాలేకపోయింది. తన స్నేహితురాలు విమల మనవరాలా పాప. ఇరవయ్యేళ్ళన్నా లేని తల్లి పసుపుకుంకాలు చెరిపేస్తూ, కానరానిలోకాలకెళ్ళాడా పాప తండ్రి. అతనికీ పెంచిన మేనమామ తప్ప అయినవారెవరూ లేరు. పట్టుమని పదినెల్లన్నా సవ్యంగా కాపురం చేయని కూతుర్ని, జీవితమంతా మోడులా చూడలేక, పెళ్ళితో మధ్యలో ఆగిన చదువుని పూర్తిచేయించి, మళ్ళీ కొత్త జీవితాన్నివ్వాలనుకుంటున్న ఆ తలిదండ్రులకి పాప అవరోధంగా తోచడంలో ఆశ్చర్యమేముంది? కూతురి భావిని చక్కదిద్దే ప్రయత్నంలో, మనవరాలిగా ఈ ప్రపంచంలో కడుగిడిన పాప భావిని పణంగా పెట్టి, ఉన్నకొద్దీ బంధాలు చిక్కబడే ప్రమాదముందని, మాలతి పేరిట ఓ ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోయారు.

ఎవరైనా పిల్లలు లేని సహృదయులకి పెంపకానికివ్వమన్న అభ్యర్థన ఉందందులో. వాళ్ళు చేసినదానిలో తప్పొప్పులు బేరీజు వేయలేకపోయింది మాలతి.

చక్కని కనుముక్కు తీరుతో, పట్టులాంటి తలకట్టుతో, పచ్చని ఛాయతో, అమాయకంగా ఉయ్యాలలో నిద్రిస్తున్న ఆ పాప మటుకు తాను పరిత్యక్త అనుకుని ఉండదు. ఆ క్షణాన్నే కృష్ణవేణి ఓ నిర్ణయానికొచ్చేసింది.

ఆ పసిది తన ఒడిలో పెరుగుతుంది. ఓ కూతురిగా కాదు. ఓ మనవరాలిగా నాగేశం ముందు సందేహించాడు. ప్రొద్దువాలారే తమ వయసు అనుకూలించగలదా అని. ఎలాగూ అప్పటికే సన్నగిలిపోతున్న బంధుత్వాలాయన్ని భయపెట్టలేదు. అక్కడక్కడా వానతుంపర్లలా ఎదురైన వ్యతిరేకత, కృష్ణవేణి ధృడసంకల్పం ముందు వీగిపోయింది. హాస్పిటల్లో చిన్నారి 'గౌతమి'గా తమ జీవనప్రాంగణంలో కడుగిడి, క్రమంగా వెన్నెల వెలుగైపోయింది.

'ఏమిటోయ్ తెగ ఆలోచిస్తున్నావ్?' ఆయాసపడుతూ వచ్చి భార్యప్రక్కనే చతికిలపడ్డాడు నాగేశం.

'అబ్బే ఏంలేదు. తగుదునమ్మా అంటూ వయస్సు కూడా మరిచిపోయి, మనవరాలితో ఆటలకి దిగారు. ఎలా నిభాయిస్తున్నారో ఏమోనని ఆలోచిస్తున్నాను.'

'నిజమే కృష్ణవేణీ మన పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు, వాళ్ళ ఆటపాటలలో పాలుపంచుకునేందుకు బాధ్యతల బరువు వెనక్కిలాగేది. ఇప్పుడూ బాధ్యతలేవీ అంతగా లేవుగాని. వయసు బరువు వెనక్కి లాగేది. ఇప్పుడూ బాధ్యతలేవీ అంతగాలేవుగాని వయసు బరువునేనుంటానంటున్నది.'

'పాపపెంపకం తమకి బాధ్యతలెందుకయిందీ, బాధోపశమనంగాని' అనుకుంది. కృష్ణవేణి, ఊహ తెలిసేసరికి, ఇరువైపులా పెద్దవాళ్ళే మిగలని తన బాల్యం గుర్తుకువచ్చి.

ఆట అయిపోయింది కాబోలు, మంజీర పాపచేతిని పట్టుకుని నడిపించి తీసుకొస్తుంది. మంజీరా, పాపా ప్రక్కప్రక్కనే ఎంతో ముచ్చటగా ఉన్నారు.

ఒకవేళ గౌతమిని మంజీర తనతో తీసుకెళతానంటే.

ఆ భావనకే ఒక్క క్షణం తల్లడిల్లిపోయింది కృష్ణవేణి హృదయం.

ఒక్క ఉదటున పరుగెత్తుకొచ్చి, తన ఒడినెక్కిన గౌతమిని, గట్టిగా అదుముకుని, గబగబా ముద్దులు కురిపిస్తున్న తల్లిని, సంభ్రమాశ్చర్యాలతో చూసింది మంజీర.

'అమ్మా! ఇవ్వాళ నాకీ ప్రపంచం ఎంతో అందంగా, ఆనందంగా అనిపిస్తోంది. నా ప్రపంచం అని ఇన్నాళ్ళూ నేననుకున్నదానిలో లేనిదిక్కడ చూశానమ్మా నిజం' అంది మంజీర, నీళ్ళు చిప్పిలుతున్న నేత్రాలతో. తల్లిప్రక్కనే వచ్చి కూర్చుని, ఆవిడ భుజం మీద ఆపేక్షగా తల అనించుకుంది. 'త్వరలో నేను మీకు మరో మనవరాలిని ఇవ్వాలనుకుంటున్నానమ్మా. మరో 'గౌతమి'ని' ఎన్నాళ్ళుగానో సాగుతున్న అంతర్మధనానికి రూపమిస్తున్నట్టు జాలువారాయా మాటలు.

ఈసారి సంభ్రమాశ్చర్యాలు, నాగేశం కృష్ణవేణిలవి.

●●●

## అడుగడుగున గుడి ఉంది — పోల్నాప్రగడ జనార్ధన రావు

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.**

**"చూడరా చూడు. ఆ చిలిపి పనులు. ఆ ప్రత్యక్షనారాయుడ్ని అందుకుందామనే** దాని ప్రయత్నం, వెర్రిపిల్ల ఎగిరెగిరి పడుతోంది. దాని స్థానం నీళ్ళే అని తెలియదేమో ఆ చేపపిల్లకి"

"చూడు చూడు నీళ్ళంటే భయం ఉన్నది, నీటి ఒడ్డునే ఇల్లెందుకు కట్టుకోవాల్రా. ఎంత పరిగెడదామనుకున్నా కాయం కదిలితేగా ఆ పీతముండకి."

గోదావరికి స్నానానికి వెళ్ళినపుడు అమ్మమ్మ చెప్పే కబుర్లు కలకండ తిన్నట్టు ఉండేది మనవడి సత్యానికి. ఆమె పెంపకంలో సత్యం ప్రకృతారధుకుడిలా పెరిగాడు.

తల్లీ తండ్రీ యాక్సిడెంటులో పోతే అమ్మమ్మే అన్నీ అయి పెంచి పెద్ద చదువులు చెప్పించింది సత్యానికి. దేవుడి దయవల్ల హైదరాబాద్‌లో ఓ పెద్ద ఛార్టెడ్ ఎకౌంట్సు కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

"అమ్మమ్మా నేను మానసను ప్రేమించా, పెళ్ళిచేసుకుంటా"

"ఏం చూసి ప్రేమించావురా సత్యం"

"ఆమె టేస్టు నా టేస్టూ"

"టేస్టు ఎలా తెలిసింది? హోటలుకి తీసుకెళ్ళి తినిపించావా? లేక"

"ఫో అమ్మమ్మా" అంటూ ఆడపిల్లలా సిగ్గుపడ్డాడు సత్యం.

"పై మెరుగులు చూసి ముచ్చట పడకూడదురా నాన్నా. అవతల వాళ్ళ అభిరుచులు తెలుసుకోవడం ఓ కళ. ఆవేశంలో తీసుకునే నిర్ణయాల్లో ఆకర్షణే ఎక్కువుగా ఉంటుంది. ఆలోచించుకో"

ఎలాగైయితేనేం అమ్మమ్మ ఆశీర్వాదంతోనే సత్యం పెళ్ళి మానసతో అయింది. మనవడి పెళ్ళి కళ్ళారా తృప్తిగా చూసింది.

"నాన్నా సత్యం నువ్వు మీ అమ్మకి ఎన్నో పూజలు వ్రతాలు చేశాక ఆ అన్నవరం సత్యనారాయణ స్వామి దయవల్ల పుట్టావురా. అందుకే మీ అమ్మ నీకు ఆ స్వామి పేరు పెట్టుకుంది. నీ భార్యని తీసుకుని ఓసారి అన్నవరం వెళ్ళిరా. ఇది మీ అమ్మ మొక్కు" అంటూ అసలు సంగతి చెప్పింది అమ్మమ్మ.

"సత్యం.. భగవంతుడు గొప్ప రచయిత అన్నది సత్యంరా. ఏ పాత్రని ఎప్పుడు ముగించాలో ఆయనకు బాగా తెలుసు. నాకు పిలుపొచ్చింది. జాగ్రత్త నాన్నా. తొందరపడి మాట జారితే వెనక్కి తీసుకోలేవు" అంటూ మంచీ చెడు చెప్పి ఉత్తరాయణంలో ఉత్తమలోకాలకి వెళ్ళిపోయింది అమ్మమ్మ.

●●●

మానస ఎం.సి.ఎ పాసయి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కొత్త సంసారం సత్యం ఊహించినంత హుషారుగా లేదు. జీవితం ఏదో తెలియని వెలితితో రొటీన్‌గా రొటేట్ అవుతోంది. ఎందుకో మానస ప్రవర్తన అప్పుడప్పుడు అతని కళాత్మక దృష్టిలో కంట్లో నలుసైయింది. దానికి బీజం మొదటి రాత్రే పడింది. గతంలోకి తొంగి చూసింది అతని మనస్సు.

●●●

పెళ్ళి అయిన మరునాడు పసుపుబట్టలతో అన్నవరం వెడదామంటే మూడురాత్రులు అయ్యాక కూడా వెళ్ళొచ్చు అని పోస్ట్‌పోన్ చేసారు మా అత్తగారు, మావగారు. పోనీలే ఊరుగురించి మొదటిలోనే గొడవెందుకని ఊరుకున్నా.

మొదటి రాత్రి మానస తెల్లచీరతో పాలగ్లాసు పట్టుకుని వస్తుందని ఊహించాను. కానీ నైటీ వేసుకొచ్చింది.

"ఇదేమిటి? అంటే"

దిసీజ్ మోస్ట్ కన్వీనియంట్ అంది. పోనీలే ఎవరి కంఫర్ట్ వాళ్ళదని కనీసం తెల్ల నైటీ వేసుకొచ్చింది అని సరిపెట్టుకున్నా. ఆ గది అలంకరణలు వాసనలు చూస్తే మొదటిరాత్రి గదిలాలేదు. మల్లెలు లేవు. ఏదో సెంటు వాసన. "ఏమిటిది? " అన్నట్టు చూసా.

"సింపుల్ సిటీ. రూం అంతా జాస్మిన్ సెంట్ పెర్ఫ్యూం కొట్టా. పూలు ఒక్కరోజులో వాడిపోతాయి. పెర్ఫ్యూం జాగ్రత్తగా రాత్రుళ్ళే వాడుకుంటే నెల్లాళ్ళు వస్తుంది" అంది.

"నయమే ప్లాస్టిక్‌తో చేసిన ఆర్టిఫిషియల్ ఫ్రూట్స్ పెట్టలేదు జీవితాంతం వస్తాయని" అందామనుకుని మొదటి రాత్రే మొదలెట్టాడూ అని అంటుందేమోనని, అమ్మమ్మ మాటలు గుర్తొచ్చి నా అభిప్రాయాన్ని అణగదొక్కా..

మూడు నిద్దరలు అయ్యాక "ఇద్దరం లీవులో ఉన్నాం. అన్నవరం వెడదాం. అమ్మ మొక్కు తీరుద్దాం" అంటే.

"ఇద్దరికి లాంగ్ లీవు దొరికినప్పుడు ఏ కొడైకెనాలో, ఊటీయో వెళ్ళాలి. అన్నవరం తరవాత వెడదాం. బోల్డు టైముంది. మనం ఇంకా ముసలాళ్ళమవలేదు" అని వేళాకోళం చేసింది.

నాకు కోపం నషాళానికి అంటినా ప్రేమించిన పాపానికి ప్రాయశ్చిత్తం అవాల్సిందే అని ఊరుకున్నా.

ఓ ఆదివారం నూని, సున్నిపిండి రాసుకుని కుంకుడికాయ పులుసుతో తలంటుకున్నా. అలా చేయడం నాకు ఇష్టం. అమ్మమ్మ చేసిన అలవాటది. రొమాంటిక్‌గా నా నడ్డి రుద్దలేదు సరికదా, "దొరికేది వారానికి ఒక్క ఆదివారం. ఆ వేళ కాస్త లేటుగా లేచి, రెస్టు తీసుకుని, సరదాగా ఏ సినిమాకో వెళ్ళి, మంచి హోటల్లో భోజనం చేసి ఫ్రెండ్స్‌తో సరదాగా గడపాలికానీ, బాత్‌రూం కడుక్కోవడం

తోటే సరిపోతోంది వెధవ బతుకు" అంటూ మానస నసపెట్టి 'మీరా' షాంపూ కొని తెచ్చింది. అంతే అది కుంకుడి కాయల పులుసుతో నా ఆఖరి అభ్యంగన స్నానం. చిన్న చిన్న చిరుకోరికలు, మన పరిధిలో ఉన్నవి తీర్చుకోలేకపోతే బతుకెందుకు అనిపిస్తోంది.

పొరపాటున, సున్నితంగా నా అభిరుచులు చెపితే -

"ఇద్దరం ఉద్యోగస్తులం. పాలుకాచి తోడెట్టి పెరుగు చిలికి, వెన్నతీసి ఆనందపడటం కంటే బజార్లో బటర్ కొనుక్కోవడం బెటర్" అని లాజిక్కగా మాట్లాడేది కాని అలా చెయ్యడంలో ఉన్న కిక్కు అనుభవిద్దామని ఎప్పుడూ అనుకోలేదు.

ఎక్కడ సామను అక్కడే ఎక్కడ వదిలిన బట్టలు అక్కడే పడేస్తుంది. అలావుంటే నాకు చిరాకు. "ఏమిటంటే?" విసుగ్గా "ఆదివారం సర్దుదాం" అనేది.

కనీసం ఆదివారమైనా పెసరట్టు ఉప్మా చేసుకుందాం అంటే తొందరగా అవుతుందని 'మాగీ' చేస్తుంది. చక్కగా ఫిల్టర్ కాఫీ తాగుదామనుకుంటే పొద్దున్నే 'టీ' ఇస్తుంది నాకు ఇష్టంలేదు మొర్రో అన్నా.

నాకు జ్వరం వస్తే ఏదో మొక్కుబడిగా "నాకు అస్సలు లీవులు లేవు" అని ఒక్క రోజు లీవు పెట్టి ఆఫీసులో అర్జంటు పనులున్నాయని వెళ్ళిపోయింది, "అనవసరంగా జీతం కట్ అవుతుందని "లోలోపల అనుకుంటూ. నాకు జ్వరం వస్తే అమ్మమ్మ ఎంత గిలగిల్లాడిపోయేదో తలుచుకుంటే ఏడుపొస్తోంది. ప్రేమ అంటే ఇదా? అదా? ఏమో!

మా ఇంటి ముందున్న మొక్కలకి చక్కగా నీళ్ళుపోసి అవి తృప్తిగా దాహార్తి తీర్చుకుని ఇంక చాలు అన్నట్టు తలలూపుతోంటే చూసి ఆనందించేవాడిని. ఓరోజు మొక్కలు పీకి పారేసింది. ఇంట్లో ప్లాస్టిక్‌వి, డెకరేటివ్ ప్లాంట్స్ పెట్టింది.

"ఆ మొక్కలు మన ఫ్రెండ్స్ మానసా. మనం వదిలిన గాలి అవి పీల్చుకుని, మనకి కావల్సిన ఆక్సిజన్‌ని ఇస్తాయి"

"మన ఇంటిముందున్న పది మొక్కలూ రాష్ట్రాన్ని పొల్యూషన్ నుంచి కాపాడతాయి అనుకోవడం నీ భ్రమ. ఇవికూడా మంచి లుక్ ఇస్తాయి. ఎరువు వెయ్యక్ఖర్లేదు, నీళ్ళు పొయ్యక్ఖర్లేదు. వాటికి చాకిరీ ఎక్కువ ఫలితం అక్కువ అందుకే పీకి పారేసాను" అంటూ ఘాటుగా ముక్కుపుటాలు ఎగరేసుకుంటూ సమాధానం చెప్పింది.

"హు! భగవంతుడు సృష్టించిన మానవుడు మట్టిలో కలిసిపోతున్నాడు కానీ మనిషి కనిపెట్టిన ప్లాస్టిక్ మాత్రం మట్టిలో కలవటంలేదు. మనస్తత్వాలు కూడా అంతేనేమో. వికృతిగా మాట్లాడే వాళ్ళకి ప్రకృతి గురించి ఏం చెబుతాం" అని ఊరుకున్నా.

పాటలు బాగా పాడుతుంది మానస. నేను ప్రేమించడానికి అదీ ఒక కారణం. నేను మంచి మూడ్‌లో ఉన్నప్పుడు ఓ త్యాగరాజకృతి పాడమంటే సారీ అలిసి పోయా, అంతగా వినాలంటే బాలమురళి క్యాసెట్ పెట్టుకుని వినండి అనేది. భగవంతుడు మనకు ఇచ్చిన మంచి గాత్రాన్ని కూడా ఆశ్వాదించలేని యాంత్రిక జీవితం అయిపోయింది అప్పుడే మా కొత్తకాపురం.

ఆ రోజు నా అసహనానికి అభిరులకి అంత్యక్రియలు అయినరోజు. నేను ఆఫీస్‌నుంచి ఇంటికొచ్చేసరికి బాబ్డ్ హెయిర్‌తో ప్రత్యక్షమయింది మానస.

"ఏమిటీ అవతారం?"

"ఏం మీకు చుడ్డానికి బావోలేదా? రోజూ జడవేసుకోలేక చస్తున్నాను. తలంటే దిక్కెవ్వరు? షాంపూతో వదలడంలేదు. అందుకే కన్వీనియంటుగా ఉంటుందని"

"అస్సలు నువ్వు నా ఇష్టానికి నాకూ ఇంపార్టెన్స్ ఇవ్వడంలేదు. నీ కళ్ళంటే నాకిష్టం. అది గమనించి కూడా ఎప్పుడూ గాగుల్స్ పెట్టుకుంటావు. నీ మెడంటే నాకు మోజు అది తెలిసికూడా ఎప్పుడూ నెక్ ఉన్న జాకట్లే వేసుకుంటావు. నీ పొడుగాటి జడచూసే నిన్ను ప్రేమించా"

"అంటే ప్రాణంలేని జుట్టుమీదే మోజు మీకు. నామీద ప్రేమ కాదన్నమాట".

"ఆర్గ్యుమెంట్స్ అనవసరం మానస. నీవైనా, నాకిష్టమైన వాటికి నువ్వు ధ్వంసం చేసేముందు నాకు చెప్పడం నీ కనీస ధర్మం"

"అంటే నా అభిరుచులు, నేను, నా ఇష్టాలు అన్నీ మీ పర్మిషన్‌తో"

నేను సమాధానం చెప్పకుండా అక్కడినుండీ వెళ్ళిపోయా. ఆ మరునాడే అదృష్టం కొద్దీ నాకు మధ్యప్రదేశ్‌లో ఉన్న 'బబేలి'లో ఉన్న అయిరన్ ఓక్ ప్రాజెక్టులో ఆడిటింగు పడింది.

"నేనో నెల్లాళ్ళు క్యాంప్‌కి వెడుతున్నా మానసా.. నీకు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో ఉండడం అలవాటేగా, జాగ్రత్తగా ఉండు. ఉండలేకపోతే మీఅమ్మగారినో, చెల్లాయినో పిలిపించుకో" అని వెళ్ళిపోయా.

●●●

సత్యానికి కొండమీద గెస్ట్ హౌస్ ఇచ్చారు 'బబేలి'లో కంపెనీవారు. ప్రకృతి ఒడిలో పవళించిన పాపాయిలా ఉంది ఆ గెస్ట్ హౌస్. "భోజనం బావోలేదు" అని వాచ్‌మెన్ సీతయ్యతో చెబితే మరునాడు రుచికరమైన భోజనం అరిటాకులో వడ్డించాడు. "ఎక్కడిది?" అంటే "మా అమ్మాయి సీతాలు సేసింది. పెద్దోళ్ళు మాబోటోళ్ళ ఇంటి వణ్ణం భోంసేత్తారో సెయ్యరో అని సెప్పలేదు" అన్నాడు.

ఆకాశంలో చుక్కలు కనబడేసమయానికి కడుపులో చుక్క పడాల్సిందే చుక్కలోపలుంటే చక్కటి పద్యమో, పాటో బయటికి రావాల్సిందే రూపాంతరం చెంది. "చెల్లియో, చెల్లకో" అంటూ రాయబారంలో పద్యం అందుకుంటాడు. "చిల్లు చిల్లన్నా చిల్లెక్కడుందిరా రామా?" అంటూ దేవుడ్ని అడుగుతాడు సీతయ్య.

రాత్రి భోంచేసి చల్లగాలి పీల్చుకుంటూ సీతయ్య అవుట్ హౌస్ కేసి వెళ్ళాడు. ఇంటిముందు రకరకాల మొక్కలు తలవంచుకుని వినయంగా ఉయ్యాలలూగుతున్నాయి. అరటి చెట్లు వింజామరలు వీస్తూ రారమ్మని స్వాగతం పలుకుతున్నాయి. మల్లెలు - విరజాజులు విరగబూసి పరిమళాన్ని పంచుతున్నాయి. ఎంత చక్కటి అభిరుచి అనుకుంటూ పరిమళాన్ని ఆశ్వాదిస్తూ తిరుగుమొహం పట్టాడు సత్యం.

మర్నాడు కృష్ణాష్టమి. బాత్ రూములో వేన్నీళ్ళు, సున్నిపిండి, కుంకుడికాయల పులుసు చూసి పుకరించిపోయాడు. తలార స్నానం చేసి పూజ చేసుకుని బయటకొచ్చేసరికి పొగలు కక్కే కాఫీ.

"ఇవన్నీ నాకు ఇష్టం అని నీకు ఎలా తెలుసు సీతయ్యా?"

"నాకేటి ఇట్టమో నాకే తెల్దు. ఇంక మీకేటి ఇట్టమో నాకెట్టా తెలుత్తాది బాబు. ఇయన్నీ మా సీతాలు సూసుకుంటుంది. ఎర్రిది తల్లిలేని పిల్ల దానికి బగమంతుడే సాయం సెయ్యాల" అనుకుంటూ వెళ్ళిపోయాడు.

పౌర్ణమి రోజున గెస్ట్ హౌస్ బయట పున్నాగ చెట్లకింద మంచం మీద తెల్లటి దుప్పటి పక్కేసి, పక్కనే స్టూలు మీద మంచినీళ్ళ జగ్గూ, టేపు రికార్డు పెట్టి ఉన్నాయి. సత్యం భోజనం చేసి వచ్చేసరికి పాతపాటలు వింటూ కొత్త అనుభూతి పొందుతూ పడుకోబోతుండగా సీతయ్య పాటని మోసుకొచ్చింది చల్లగాలి.

"సీతయ్యా! ఎందుకు పాట మార్చిపాడతావు?"

"కడుపులోంచి వచ్చేదే కపిత్వం అవుతుందట. పీత కష్టాలు పీతవి. సీత కష్టాలు సీతవి" అంటూ "ఏ తీరుగ మము దయసూసెదవో ఇల వంశోత్తమ రామా. ఈ సియ్యని మూసుట నీ తరమా రామా' అంటూ తూలుకుంటూ వెళ్ళిపోయాడు సీతయ్య.

ఇంత మంచి అభిరుచులున్న సీతాలు ఎలా ఉంటుందో చూడాలన్న కోరిక సత్యంలో మొగ్గతొడిగి ఓ రోజు ఆఫీసు మధ్యలోనే గెస్ట్ హౌస్‌కి వచ్చేలా చేసింది.

రూమ్‌లోపల నుంచి శంకరాభరణం పాటలు వినిపిస్తున్నాయి. బాలు కంఠంతోపాటు, ఇంకో ఆడగొంతు వినిపించింది. రూములోకి వెళ్ళేసరికి, మట్టిరంగుచీర, పసుపు జాకెట్టు. తుమ్మచెట్టు పూసినట్టు వున్న ఓ పాతికేళ్ళ ముదర మనిషి రూం తుడుస్తూ ఠఫ్‌మని లేచి నుంచుంది సత్యాన్ని చూసి.

"ఎవరు నువ్వు?"

"సీ..సీ.. సీతాలండి. సీతయ్యకూతురిని" కొంగుకి చేతులు తుడుచుకుంటూ కంగారుగా చెప్పింది.

"నాకు అన్ని సదుపాయాలు చూస్తున్నది నువ్వేనా?" రుపానికి, టేస్టుకి పొంతనలేదే అని అనుమానంగా చూస్తూ అడిగాడు.

గంగిరెద్దులా తలూపింది. బిగుతు జడలో లూజుగా ఉన్న ముద్దమందారం, నేలను ముద్దుపెట్టుకుంటే, దాన్ని తీసి కళ్ళకద్దుకుని జడలో పెట్టుకుంది.

"ఎందుకు కళ్ళకద్దుకున్నావు సీతాలు?"

"పువ్వు మాయమ్మ. సెట్టు మా అయ్య"

"నీకు ఇంత మంచి అభిరుచులు ఎలా వచ్చాయి?".

"అభి అభి అంటే ఏంటండి?"

"మంచి ఆలోచనలు. అంటే ఏమిటనకు, నా రూం శుభ్రంగా ఉంచడం, రుచికరమైన భోజనం పెట్టడం. మీ ఇంటిముందు మొక్కలు పెంచడంలాంటివి."

"ఓస్ అవా అభిసురుసులు అంటే. అలావుంటే నాకిట్టం. మీలాంటోరికి ఈ జనమలో సేవలు సేత్తే వచ్చే జనమలో"

"ఊ వచ్చే జన్మలో"

సమాధానం చెప్పకుండా కళ్ళమ్మట నీళ్ళుపెట్టుకుంది, భాష చాలక భావం పలకలేక.

"ఏడ్వకు. అదిసరే. మీ నాన్న చాలా బాగా పాడతాడు కానీ, తాగి భాషనెందుకు ఖూనీ చేస్తాడు?. అది అది ఏ పాటకైనా చిల్లెందుకు పెడతాడు?"

సమాధానం చెప్పకుండా ఏడుస్తూ వెళ్ళిపోయింది సీతాలు.

●●●

"సీతాలూ నేను రేపు మా ఊరెళ్ళిపోతున్నా"

"అప్పుడేనా బాబు"

"ఇక్కడ ఆఫీసు పని అయిపోయింది. నీకు చాలా థాంక్స్. మా ఇంటికంటే ఇక్కడ నాకు చాలా ఆనందంగా ఉంది. కడుపు నిండా అమ్మలా అన్నం పెట్టావు. నీకు చాలా ఋణపడి ఉన్నా. నీకేం కావాలో కోరుకో"

"ఏం వద్దుబాబు ఏదో ఆశపడి మీకు సేవలు సెయ్యలేదు. ఇష్టపడి సేసా"

"అవును అది నాకు తెలుసు. కానీ నీకు ఏదో ఒకటి ఇవ్వకపోతే నేను చాలా స్వార్థపరుడ్ని అవుతా"

"అంతంత పెద్ద మాటలు నాకు అర్థమవవు బాబు - మీకు సేవసేత్తే పుణ్ణెం వత్తదని మా అయ్యసెప్పాడు."

"పుణ్యం పొట్టనింపదు. అన్నమే ఆకలి తీరుస్తుంది. నువ్వు ఏది కోరుకున్నా ఇస్తా అడుగు."

"ఒద్దుబాబూ! అడిగితే అందుకే సేసాననుకుంటారు"

"అడగకపోతే నామీద ఒట్టే"

"అంతమాటనకండి. ఏ జనమలో ఏ పాపం సేసానో ఈ జనమలో ఇలా పుట్టాను. వచ్చే జనమలోనైనా సరిగా పుట్టాలని ఆ దేవుడికి దణ్ణం పెట్టుకుంటున్నా"

"అడగవా? అయితే ఈసారొచ్చినప్పుడు ఇక్కడకిరాను. నీతో మాట్లాడను"

"ఏం అనుకోరుగా"

"అడగకపోతే అనుకుంటా"

"నవ్వరుగా"

"ప్రామిస్ నవ్వను. దేవుడిమీద ప్రమాణం చేసి చెపుతున్నా. నువ్వేం అడిగినా ఇస్తా"

"ఒక్కసారి నేను సచ్చేలోపు ఆ అన్నారం సత్తనారాయణ మూరితిని సూపించరూ!" అంటూ దణ్ణం పెడుతూ కళ్ళమ్మట నీళ్ళెట్టుకుంది సీతాలు.

ఆ మాట వినేసరికి గుండెలో గుడిగంటలు మోగినట్టూ, అమ్మమ్మ చెప్పిన అమ్మ మొక్కు కొండల్లో ప్రతిధ్వనించినట్టు అయి "తప్పకుండా ఆ స్వామి దర్శనం చేయిస్తా. ఈసారొచ్చినప్పుడు మీ నాన్నతో చెప్పి నిన్ను తీసుకెడతా" అని అనేసరికి, ఆ నటరాజు సీతాలు మొహంలో ఆనంద నాట్యం చేసినట్టు అనిపించింది సత్యానికి.

●●●

మానసకి స్కూటర్ యాక్సిడెంటు అయి కాలు విరిగింది. మల్టిపుల్ ఫ్యాక్చర్స్. అన్నీ మంచం మీదే. భార్యకి సీతాలు గురించి అన్ని వివరాలు చెప్పి, అత్తగారికి అప్పగించి సీతాల్ని తీసుకురావటానికి బబేలి వెళ్ళాడు సత్యం.

పాపం సీతయ్య చచ్చిపోయాట్ట. తాగుడువల్లో, గుండెలో చిల్లువల్లో తెలియదన్నారు. సీతాలుకి అన్నీ వివరంగా చెప్పాడు. "అమ్మగారికి అలావుంటే వదిలేసి ఎలా వచ్చారు నడవండి" అంది.

"నిన్ను తప్పక అన్నవరం తీసుకెడతా"న్నాడు.

అన్నిటికంటే పుణ్యం అవసరమైన వాళ్ళకి ఆసరా ఇవ్వడమే అన్న సిద్ధాంతం నమ్మిన సీతాలు "అవన్నీ అక్కడకెళ్ళిన తర్వాత సూసుకుందాం. ముందు నడవండి" అని తొందర చేసింది.

●●●

సీతాలొచ్చాక మానసకి మానసికంగా హాయిగా ఉంది. జీతం భత్యం అడక్కుండా ఇరవైనాలుగ్గంటలూ సొంత మనిషిలా, సొంతపనిలా ఎలా చేస్తోందో అర్థం అవలేదు. భర్తకి జ్వరం వస్తే తన జీతం కట్ అవుతుందని ఆఫీసుకి వెళ్ళిపోయిన సంఘటన గుర్తుకొచ్చి గిల్టీగా ఫీల్ అయింది.

కాస్త చనువు వచ్చాక "మీరేం అనుకోకపోతే ఇంటో పెట్టిన ఈ మొక్కలు పీకేస్తా. ఈటికి నీళ్ళు పొయ్యఖ్ఖర్లేదన్నాడు అయ్యగారు. ఏంటో నాకు ఆటికి సేవసెయ్యకపోతే సెయ్యిరిగిపోయినట్టుంది. పువ్వులు, కాయువు, వాసనెయ్యవు ఎందుకండి ఈ గొడ్రాలు బతుకు" అంది.

"నీ ఇష్టం నీకేది ఆనందంగా ఉంటే అది చెయ్యి" ఇల్లు అద్దంలా ఉంచిన మనిషికి, అసహ్యం లేకుండా బెడ్‌పాన్ పెట్టి పాకీ పనిచేసిన ఆమెకి ఏం ఇచ్చి ఋణం తీర్చుకోగలను అనుకుంది మానస.

మరునాడు మానస జుట్టుకి కొబ్బరినూనె రాస్తూ "అమ్మగారు మీ జుట్టెంత బాగుంటుందండి. ఏమెరువేత్తారు దుబ్బుగా ఉంది. కొప్పు ఒత్తుగా ఉంటే మొగాడు, పువ్వు కొత్తగా ఉంటే తుమ్మెద ఇట్టపడతారట మాయమ్మ సెప్పింది. ఈసారి కత్తిరించుకున్నారంటే నా మీద ఒట్టే"

"అయ్యగారొచ్చేసరికి తెల్లసీర కట్టుకోండి" అంటూ తనే ఇస్త్రీ చేసింది, కట్టింది. అమ్మగారు ఇలాటి పొడుగాటి గౌనులు పక్కేట్టేసుకుంటారు. ఇవేసుకుంటే మొగాడికి, ఆడదానికి తేడా తెలవదండి" అంటూ నైటీలన్నీ మూలపెట్టింది.

"పెసరట్టు ఇంత రోస్టుగా ఎలా కాల్చగలిగావు సీతలూ?"

"మనసుంటే మాడదమ్మగారు"

"ఇంత రుచిగా వంట ఎలాచేస్తారే?"

"మనోళ్ళు కడుపునిండా తినాలనుకుంటే రుసిగా అదే తయారవుద్ది" కాలక్షేపానికి గవ్వలు, వైకుంఠపాళీ ఆడించింది. తన్నిపాము మింగినా బాధపడలేదు. ఎదుటివాడు నిచ్చనెక్కినా ఏడవలేదు సీతాలు.

నాలుగు నెలలు ఇట్టే గడిచిపోయాయి. కాలు కట్టువిప్పారు. రోజూ కాలుకి తైలం రాయడం, భుజం మీద చెయ్యేసుకుని ఇంటిముందు నడిపించడం క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజ్ చేయించడం, ఈ పనులన్నీ సీతాలు ఓ ట్రయిన్డ్ నర్సులా చేస్తూంటే "ఇవన్నీ ఎలా నేర్చుకున్నావే?" అని అడిగితే.

"మనసుంటే అన్ని పనులూ వచ్చేత్తాయమ్మా" అంటూ నవ్వుతూ మొక్కల మధ్య నడిపించేది. మానస కాలు కరేల్ మంటే కళ్ళమ్మట నీళ్ళెట్టుకునేది సీతాలు.

ఒళ్ళంతా నూనిరాసి, నలుగుపెట్టి, కుంకుడికాయల పులుసుతో తలంటి సాంబ్రాణి వేసేది. సత్యం వీటి గురించి ఎందుకు ఇష్టపడేవాడో అప్పుడు అర్థం అవలేదు. మారాలనే మనసుంటే మారగలిగేది మనిషిక్కడే అనుకోవడం ప్రారంభించింది మానస.

సీతాలకి జ్వరం. పాపం ఆయాసంగా నీరసంగా పడుకుంది. "డాక్టర్ని తీసుకొస్తానంటే" వద్దు అదే తగ్గిపోతుందని వంటింటి వైద్యం చేసుకుంటోంది. రాత్రిళ్ళు విపరీతమైన పలవరింతలు "మొక్కు తీర్చుకోకపోతే దేవుడికి కోపం వస్తది. సామీ! నీకాడకి రాకుండా సచ్చిపోతానేమో? బాబూ అన్నారం తీసుకెళ్ళవూ"

సీతాలు లేవకపోతే చెయ్యివిరిగినట్టుంది ఆ దంపతులకి. తనది కుంటిబతుకు అవుతుందేమోనన్న భయం పట్టుకుంది సీతాలు పలవరింతవల్ల మానసకి.

"దానికి అన్నవరం తీసుకెడతానని ప్రామిస్ చేసి తీసుకొచ్చారు. రోజూ పలవరిస్తోంది. తీసికెళ్ళకపోతే పాపం అండి"

"మరి మా అమ్మ దేవుడికి చేసిన ప్రామిస్. అదే మొక్కు అది తీర్చకపోతే మనకి పాపం రాదా!"

కొరడాపుచ్చుకుని కొట్టినట్టు అయిద్మి మానసకి.

"సెలవు పెట్టండి అందరం వెడదాం"

"నువ్వు బాగా నడవగలిగినప్పుడు వెడదాం. ఇన్నాళ్ళూ"

"ఇంకేం మాట్లాడకండి. నాకేం ఫర్వాలేదు. సీతాలు ఉందిగా. టిక్కెట్లు రిజర్వ్ చేయించండి" అంది మానస మనస్ఫూర్తిగా.

పెళ్ళిరోజుకంటే ఎక్కువ ఆనందపడ్డాడు సత్యం.

●●●

ఆ రోజు వైకుంఠ ఏకాదశి. వైకుంఠంలో ఉన్న ముక్కోటి దేవతలు దిగివచ్చి అన్నవరంలో భక్తులతో కలిసి స్వామి దర్శనం చేసుకుంటున్నారా అన్నట్టు ఉన్నారు జనం.

సత్యంతో కలిసి సత్యనారాయణవ్రతం భక్తిగా చేసుకుంది మానస. పక్కన కూర్చుని ఆమెకి కావల్సినవన్నీ అందిస్తూ తనే వ్రతం చేసినంత తృప్తిపడిందు సీతాలు. గుడిచూసి, నదిచూసి, జనఘోషవిని, పులకించి పోయింది. భుజం మీద చెయ్యేసుకుని, భారం అంతా మోస్తూ, లైనులో వైకుంఠవాసికేసి అడుగులు వేయిస్తోంది మానస చేత సీతాలు.

ప్రవర్తన బట్టే ఆరోగ్యం, ఆలోచనలబట్టే ఆనందం, యోగం బట్టే అనాయాస మరణం, అంటూ మైకులో పురాణా శాస్త్రులుగారి కంఠం శ్రావ్యంగా వినిపిస్తోంది.

గర్భగుడి దగ్గరకి వచ్చేసరికి సీతాలకి ఆయాసం, నీరసం వచ్చాయి. ఎంత చెప్పినా వినకుండా పచ్చిమంచినీళ్ళు ముట్టకుండా కటిక ఉపవాసం చేసింది ఆ రోజు. కళ్ళు తిరిగినట్టు అయ్యాయి. సన్నగా గుండెల్లో నొప్పి వెన్నులోకి వచ్చినట్టు అయింది. ఇంతలో రద్దీ ఎక్కువై తోపులాట ప్రారంభమయింది. మానస వెనకపడింది. సత్యాన్ని, సీతాల్ని గర్భగుడి వైపు తోసారు భక్తులు.

"సామీ నా గుండె ఆగిపోయేలోపు లోపలకి రానివ్వవూ. నా గుండెలో సిల్లు సిట్లిపోయే లోపు నీ దర్శనం ఇవ్వవూ" అని సీతాలు మనసులో అనుకుంటూంటే, తోపులాట ఎక్కువై కళ్ళు మూసి తెరిచేలోపు గర్భగుడిలోకి ఇద్దరూ ఒకేసారి తూలిపడిపోయారు. ఆసరాగా సత్యం చేయి పట్టుకుని స్వామిని చూస్తూ, తన్మయత్వం పొందుతూ, ఆనంద భాష్పాలు రాలుస్తూ

"దర్శనం ఇచ్చావా అయ్యా! దయతలిచావా తండ్రీ! ఈ జనమకిది సాలు. నా కోరిక తీరింది. అందర్నీ సల్లగా సూడు" అంటూ నమస్కరిస్తూ గర్భగుడి గడపపై ఆఖరి శ్వాస వదిలింది సీతాలు.

గుడిగంటలు గట్టిగా మోగాయి. గుళ్ళో మంగళవాయిద్యాలు మారుమోగాయి.

భక్తుల్లో ఆహాకారాలు, గర్భగుడిలో పోయింది ఎవరో బక్తురాలు అని కొంతమంది, సంప్రోక్షం చేయించాలని పూజారులు, ఏం అదృష్టం వైకుంఠ ఏకాదశి నాడు వైకుంఠయానం అంటే పూర్వజన్మ సుకృతం అని మరికొందరు అనుకుంటూ -

ఇంతకీ పోయింది ఎవరూ? అని అడుగుతుంటే

ఎవరని చెప్పాలో తెలియక సత్యం కళ్ళమ్మట నీళ్ళొచ్చి స్వామి వారికి అభిషేకం చేసాయి. పోయింది ఎవరు? ఎవరు? అన్నఘోష గుడి గోపురం మీదనుంచి వైకుంఠం వరకూ వ్యాపించింది.

తను నమ్మిన సిద్ధాంతాన్ని మనసా, వాచా, కర్మణే, ఆచరించి, మానవసేవే మాధవుడ్ని చేరుకుందుకి మార్గం అనుకున్న సీతాలకి అశ్రుతర్పణం అర్పించింది మానస.

పాపం పోయింది అనాథేమో అన్నారు ఎవరో.

కాదు కాదు అనాథ కాదు "నా చెల్లెలు" అంది భోరున ఏడుస్తూ మానస.

●●●

# అమెరికాలో మనమ్మాయి

విజయ (కర్రా) గంటి

**"అమ్మడూ! లేచావా?"**

"ఊ"

"ఈ వేళ మీటింగ్ ఉంది, పొద్దున్నే వెళ్ళాలన్నావు?"

"లే.. స్తా.. ను, ఒక్క అయిదునిమిషాల్లో"

"రాధ పిన్ని చెప్పింది, మీకక్కడ ఇండియన్ షాప్స్‌లో రెడీమేడ్ పులిహోర, పొంగలు లాంటివి కూడా దొరుకుతున్నాయిట"

"అలాగే - చూస్తాలే. లేస్తున్నా నువ్వింక ఫోన్ పెట్టేయ్"

"ఉండు, ఉండు, ఓ మాట విను - మన బ్రహ్మీ అంకుల్‌లేరు. ఆయనకి బాగ తెలిసిన అబ్బాయిట, అమెరికాలోనే ఉంటాడుట."

"అమ్మా! తల్లీ పొద్దున్నే నా బుర్ర తినకు, జాబులో ఇప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నానా, ఒక్క ఆరునెల్లు మాట్లాడకు"

"సరెలే అమ్మడూ! వేళకి సరిగ్గా తిను. మరీ చిక్కిపోతే కూడా"

●●●

ఆఫీస్ వాతావరణం కొద్దిగా సీరియస్‌గా ఉంది. మీటింగ్ కదా, బాసులందరూ వచ్చేసి ఉంటారు. చిద్దు కళ్ళతోనే ఏదో చెప్పటానికి ట్రై చేస్తున్నాడు. కిచెన్లో డోనట్స్ ఉన్నాయా అంటూ సైగ చేసాను. కాదు! కాదు! అన్నట్లు బుర్ర ఊపాడు. మరి ఇంకేమిటి చెప్మా! అనుకుంటూ కంప్యూటర్ ఆన్ చేసాను. మీటింగ్ క్యాన్సిల్, ఓకే! అదన్నమాట! అనుకుంటూ ఓ గంట పనిచేసానో లేదో డోర్ దగ్గర టక్ టక్ మని చప్పుడు. చూస్తే మా అమెరికన్ పెద్ద బాసు. "శృతీ! ఓసారి వస్తారా! మాట్లాడాలి" అంటూ. చాలా ఇంపార్టెంట్ విషయాలు చెప్పాల్సిన వస్తే సీనియర్ బాసులు ఇలా స్వయంగా వస్తారు. గుండె ఐ ఫోన్ పట్టుకున్నంత భద్రంగా పట్టుకుని వెనకాలే వెళ్ళాను.

నా వర్కు, దాని పట్ల నా శ్రద్ధ గొప్పగా ఉన్నాయని మెచ్చుకుంటే 'థాంక్యూ, థాంక్యూ' అంటూ మురిసి ముక్కలవకముందే - 'ఉయ్ ఆర్ సారీ!' అంటూ పేల్చాడు అసలు బాంబు. బడ్జెట్ కట్ అవడంతో నాతో పాటు మరో ఇద్దరిని పీకి అవతల పారేసారు. మొదటిసారంత టెన్షన్ రాలేదు. ఇంటికొచ్చి, మా ఎంప్‌కి అంటే మా ఎంప్లాయిర్‌కి ఓ ఈ మెయిల్ కొట్టి, వెంటనే లాప్‌టాప్ కట్టేసి, సెల్‌ఫోన్ ఆఫ్ చేసేసి, మళ్ళీ ప్రాజెక్ట్ దొరికేలోగా మంచి నిద్రపోయి తీరాలి అని నాకు నేనే ప్రామిస్ చేసేసుకుని కంఫర్టర్‌లో దూరిపోయాను.

ఆ రోజు ఈవినింగ్ ఫోన్ చేసాడు మా ఎంప్. ప్రస్తుతం మార్కెట్ బానే ఉందని, అమెరికాలో ఏదో మూల నాకో ప్రాజెక్ట్ పట్టుకు తీరుతానని ప్రామిస్ చేసాడు. మరింక మొదలు రెస్యుమేలు తయారు చెయ్యడం, ఇంటర్వ్యూలకి ప్రిపేర్ అవడం. ఎందుకు దేవుడా! దేశం కాని దేశంలో ఈ శ్రుతికిన్ని కష్టాలు.

రెస్యుమే ఓపెన్ చేసి చూస్తున్నానో లేదో వచ్చింది ఫోన్. "పండూ! భోంచేసావా?" అంటు. ఇక్కడ మనం తినకపోతే అక్కడ అమ్మలకి ఎలా తెలిసిపోతుందో మరి. "పొద్దున్న చెప్పిన సంగతి ఏం ఆలోచించావ్?"

"ఓ సంవత్సరం తరువాత అడుగు చెపుతాను" అమ్మకి కోపం వచ్చి టక్కున ఫోన్ పెట్టేసింది. హమ్మయ్యా! అనుకుని మరింక నెట్‌వర్క్ మొదలుపెట్టాను. నా కజిన్స్ అప్పుకి, బుజ్జిగాడికి, మరో ముగ్గురు ఫ్రెండ్స్‌కి మెయిల్స్ పంపాను. 'నా ప్రాజెక్ట్ పోయిందోచ్! ఏవయినా ఉంటే చెప్పండోచ్!' అంటూ.

నిద్రొచ్చేస్తోంది. ట్విన్ బెడ్, కుడివయిపు తిరిగితే లాప్‌టాప్, ఎడం వయిపు తిరిగితే చెవి పక్కనే సెల్ ఫోన్. ఫోన్ పిల్లోకింద తోసాను. ఈ ప్రపంచంలో సెల్‌ఫోన్, లాప్ టాప్ మరింక ఇంటర్నెట్ ఇవే నా స్నేహితులు కనిపించని తీగలతో నన్ను నా వాళ్ళతో కట్టేసే గ్యాడ్జెట్స్. అందుకే ఇవి నాకు నాతో ఈ అపార్ట్‌మెంట్ షేర్ చేసుకుంటున్న మరో ఇద్దరికన్నా కూడా ఎక్కువే. వెబ్ క్యామ్‌లో కనిపించి 'ఎర్లీ టు బెడ్, ఎర్లీ టు రైస్' అంటూ నాన్న సీరియస్‌గా చెపితే ఆ మాట ఇంతవరకు వినకపోయినా స్క్రీన్ మీద డాడీని చూసినప్పుడు ఎందుకో మరి కళ్ళలో నీళ్ళొస్తాయి. అమ్మ స్పర్శ అందుబాటులో లేకపోయినా ఆమె గొంతులో ఒలికే ప్రేమ, ఆరాటం, ధైర్యం ఈ బుజ్జి ఫోనే కదా నాకందిస్తుంది.

●●●

"ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్" - 'అబ్బా!' అనుకుంటూ బలవంతంగా ఓ కన్ను తెరిచి చూస్తే ఇంకా ఎనిమిదే అదీకాకుండా సాటర్‌డే వీకెండ్ పది లోపల ఫోన్ చెయ్యకూడదని అమ్మకి ఆర్డర్స్ ఉన్నాయి. అయినా మహాతల్లి ఊరుకోదు.

"ఏంటమ్మా, మళ్ళీ ప్రాజెక్ట్ పోయిందిటా?"

ఇంకెవడు ఆ బుజ్జిగాడు పనే. వాళ్ళమ్మకి అంటే మా అత్తకి చెప్పి ఉంటాడు. ఆవిడ ఓ ఇద్దరికే చెప్పి ఉంటుంది. అడిగినవాళ్ళకి ఇంక అడగని వాళ్ళకి.

"ఏంటమ్మా! నువ్వూ, వీక్ ఎండ్ కూడా పడుకోనివ్వవూ?".

"దిగులు పడూతున్నావేమోనని చేసానమ్మా. ఇంతకీ నువ్విప్పుడు బెంచ్ పయిన ఉన్నట్లా?"

"బెడ్డుమీద ఉన్నాను. నన్ను కాస్త నిద్రపోనీ తల్లీ! మళ్ళీ జన్మలో కూడా నీ కడుపునే పుడతాను".

లేచాక ఫేస్‌బుక్ ఓపెన్ చేసి కాసేపు మెసేజులు చూసాను. 'అప్పూ! నీ ప్రొఫైల్ పిక్చర్ అదిరింది' అని కామెంట్ వ్రాసుంటే ఓ అయిడియా వచ్చింది. నాకు ప్రాజెక్ట్ కావాలని ఈ ఫేస్ బుక్లో అని. 'ఛ! మరీ బావుండదులే'.

పాపం లాస్ట్ రెండు కాల్స్‌లోను అమ్మ పైన విసుక్కున్నాను, అనుకుంటూ నేనే ఫోన్ చేసాను. "ఏం చేస్తున్నావ్?" అడిగింది.

"ఇప్పుడే పోటమాక్ నదిలో తలారా స్నానం చేసి, వంటకి రెండు బిందెల నీళ్ళు కూడా తెచ్చాను. నాన్న, నువ్వు ఈ పూట భోజనానికి ఇక్కడికే వచ్చేయండి". అమ్మ అవతల ముసిముసిగా నవ్వింది. మరో రెండు మాటల తరువాత మళ్ళీ మామూలే. "బ్రహ్మి అంకుల్ మళ్ళీ చెప్పారే, ఆ అబ్బాయి మళ్ళీ నెలలో వస్తున్నాడుట ఇండియాకి".

"నాకో మంచి ఐడియా వచ్చిందమ్మా"

"ఏంటీ" కుతూహలం. "ఫేస్ బుక్‌లో స్వయం వరం ప్రకటిద్దామని".

అమ్మ ఈసారి గలగలా నవ్వి చెప్పింది. "తెలుగు వచ్చినవాడు, వెజిటేరియన్ అయ్యుండేలా చూసుకో"

"అమ్మో.. మా అమ్మ! చాలా తెలివయింది".

"అవి సరే కాని, నవ్వితే జాన్ అబ్రహంలా బుగ్గలు సొట్టలు పడాలి" చెప్పాను.

"వాడెవడు మీ అమెరికా వాడా?".

"కాదు, మీ ఇండియా వాడే! జనరల్ నాలెడ్జ్ పెంచుకో"

ఆ తరువాత మా ఎంప్ నుంచి ఫోను. ఆ నెక్స్ట్ డే న ఓ కంపెనీ వాళ్ళు కాల్ చెయ్యవచ్చని వాళ్ళ కోసం ఫలానా, ఫలానావి చదివి ప్రిపేరుగా ఉండమని. ఆదివారం కూడా వదిలేలాగా లేరు. అయినా బెంచ్ పయిన వాళ్ళ కష్టాలు కుర్చీలో కూచునే వాళ్ళకి ఏం తెలుస్తాయి. కళ్ళు కూరుకుపోయే వరకు చదివి పడుకున్నాను.

●●●

నాకు నా సెల్ ఫోనుతో ఒకోసారి పడదు. మామూలుగా చాలా ముద్దొస్తువుంటుంది బుజ్జిముండ, కానీ అప్పుడప్పుడు గోడకేసి కొట్టాలనిపిస్తుంది. లేకపోతే సండే పొద్దున్న ఈ కాల్ ఏమిటి మరి. కళ్ళు విడిపడటం లేదు. రింగుటోను అమ్మది, ఎంప్‌ది కాదు. ఏదో ఇంటర్వ్యూ బాపతే. "హలో! శ్రుతి హియర్" ఎంత స్వీట్ గా అందామనుకున్నా ఏంటో బొంగురుగానే పలికింది.

"హాయ్! దిస్ ఈజ్ దినకర్" అంది అవతల గొంతు.

అన్న దినకరా! అందుకేనా ఇంత పొద్దున్నే లేపావ్! ఇంక టెక్నికల్ ప్రశ్నలేసి బుర్రతింటావు కాబోలు.

"మిమ్మల్ని పొద్దున్నే డిస్టర్బ్ చేయటం లేదు కదా?"

"నో! నో నాట్ ఎట్ ఆల్. నాట్ ఎట్ ఆల్."

"గుడ్! మీ కక్కడ వెదర్ ఎలా ఉంది?"

ఈ అమెరికాలో కుశల ప్రశ్నలన్నీ వెదర్‌తోనే మొదలవుతాయి. బెడ్ దిగి ఓ మాటు కిటికీలోనుండి తొంగి చూసి "కొద్దిగా క్లవుడిగా మరి మీకో ఐ మీన్, మీరెక్కడనుండి కాల్ చేస్తున్నారు?"

"ఆస్టిన్, టెక్సాస్"

"ఓ! ఒకే! మరి ప్రాజెక్ట్ అక్కడేనా?"

"ఆ ఇక్కడే, మీరే యూనివర్సిటి?" - (రెస్యుమేలో ఉందమ్మ).

చెప్పాకా 'అరె! నేను అక్కడే చదివాను' -

'ఏ ఇయరూ?' 'ఏ బ్యాచు?' 'మీకు ఫలానా వాళ్ళు తెలుసా? - (నాతలకాయ, నీ బుర్రకాయ, ఈ సంగతులన్నీ నీకెందుకు).

"మూవీస్ చూస్తారా?"

"ఎప్పుడన్నా, రేర్‌గా"

"నాకు తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం, ఎంత దూరమయినా వెళ్ళి చూసేస్తూ ఉంటాను" (నేనూ అంతే, కానీ నీకా విషయం చెప్పను).

"మీ హాబీలేమిటి?"

"టెక్నికల్ పేపర్లు చదవటం, ఓపెన్ సోర్స్‌తో ఎక్స్‌పరిమెంట్లు చెయ్యడం"

"యూ ఆర్ సో ఫన్నీ!" (నీ ఫన్నీగానే ఉంటుంది బాబు! ఫేస్ బుక్, ట్విట్టర్‌లతో టైం పాసు, మూవీస్ చూడడం, టైం దొరికినప్పుడల్లా నిద్రపోవడం అంటే నేను సెలెక్ట్ అవుతానేంటి?).

"ఇంతకీ ప్రాజెక్ట్ వివరాలు చెప్పలేదు" అడిగాను.

"నా ప్రాజెక్టా, జావా బేస్డ్"

"అహా! మీది కాదు, నన్ను ఇంటర్వ్యూ చేస్తున్న పొజిషన్ ఏది, ఏ ప్రాజెక్ట్ కోసం అని".

అవతల నుండి ఓ క్షణ సైలెన్స్ తరువాత "మీరేదో పొరపాటు పడుతున్నారు".

"పొరపాటా, అదేంటి?"

"మీ అమ్మగారు మాట్లాడారుట, బ్రహ్మి అంకుల్ మీ ఫోన్ నెంబర్ ఇచ్చారు."

అర్ధంకావడానికి నాకో రెండునిమిషాలు పట్టింది.

"మీరేదో జాబ్ ఇంటర్వ్యూ కోసం వెయిట్ చేస్తున్నట్లున్నారు, మరెప్పుడయినా కాల్ చేస్తాను"

"హమ్మా" అంటూ గట్టిగా అరిచాను. పక్కరూములోంచి జెన్నీ తొంగి చూసి "యూ ఓకే?" అంది. నా బొంద ఓకె. ఆ దినకర్ నన్నో గీక్ అనుకుని ఉంటాడు. అనుకుంటే అనుకున్నాడు హూ కేర్స్! ఎనీవే ఐయాం నాట్ ఇంట్రెస్టెడ్ - నన్ను నేను నచ్చచెప్పుకున్నా. అయినా సరే మనసెందుకో బావోలేదు.

తరువాత రోజంతా ఫోన్లే లేవు. అమ్మకూడా చెయ్యలేదు. సాయంత్రం మా ఎంప్ నుండి మెయిల్ వచ్చింది. ఈవేళ ఇంటర్వ్యూకి కాల్ చేస్తానన్న వాళ్ళు సండే ఎందుకు మర్నాడు చేస్తామన్నారట. ఆహా! ఎంత తొందరగా తెలుసుకున్నారు. ఎందుకో ఎవరిమీదో తెలియని కోపం. నాకు కోపం వచ్చినప్పుడు చాలా చాలా సీరియస్ పనులు చేయడం అలవాటు. అందుకే ఇంటర్నెట్ ఓపెన్ చేసి జావా, డాట్ నెట్, మరోటి మరోటి ఇంటర్వ్యూలకి ఏ ప్రశ్నలు అడగొచ్చు, ఎన్ని రకాలుగా అడగొచ్చులాంటివి వెతికి వెతికి మరీ ప్రిపేర్ అయ్యాను.

●●●

"ఎప్పుడు జాయిన్ అవుతారు?" అడిగాడతడు.

"ఈ రోజే" చెప్పాను ఉషారుగా.

అతడు నవ్వి "రండి, మీ ఆఫీసు చూస్తాను" అంటూ లోపలికి నడిచాడు.

వెనకాలే వెళ్ళి "అరె! ఇది శివవిష్ణు టెంపుల్ కదా!" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును, ఇక్కడే మీ ప్రాజెక్ట్, అదిగో అదే మీ ఆఫీసు" అన్నాడతడు మరింత నవ్వుతూ. నవ్వుతుంటే బుగ్గ సొట్టలు పడుతున్నాయి. ఎవరో బాగ తెలిసిన వాడిలా ఉన్నాడు. ఓ టేబుల్, పక్కనే ఫోన్, షెల్ఫ్‌లో బుక్స్.

"నేనిక్కడ ఏం చెయ్యాలి?"

"భక్తులకి అర్చనలికి, పుస్తకాలకి ఇచ్చిన డబ్బులు తీసుకుని వాళ్ళకి రిసీప్టులు ఇవ్వండి. మన వెబ్ సైటులో చూసి పూజల వివరాలు చెప్పండి. ఇదేకదా ఇన్ని రోజులుగా మీరు ఎదురు చూస్తున్న డ్రీం జాబు?"

"అరె! మీకెలా తెలుసు!" అంటూ ఉండగానే అతను నవ్వుతూ వెళ్ళిపోయాడు. 'హమ్మయ్య! ఇంక జావాలు, డాట్ నెట్లు వీటితో పనిలేదు' అనుకుంటూ కూర్చున్నాను. ఈలోగా గుడిగంటలు వాటంతటవే మ్రోగసాగాయి. టంగ్, టంగ్, టంగ్, టంగ్ చెవి దగ్గర శబ్దం పెరిగిపోతోంది. అర్థం అయ్యేటప్పటికి తెలిసింది నేను కలకంటున్నానని, నా ఫోన్ కాల్స్‌కి తెల్లవారిందని.

"హలో! శృటీ".

ఇంకెవరు మా అమెరికన్ పెద్ద బాసు, ఐ మీన్ నా ఎక్స్ బాసు. చెవిలో షుగర్ సిరప్ పోసినట్లు ఓ మంచి న్యూస్ చెప్పాడు - అదే కంపెనీలో మరో ప్రాజెక్ట్‌కి నా స్కిల్ సెట్ చాలా పనికొస్తాయని, వచ్చి మర్నాడు చేరి పొమ్మని. అంటే ఓ రోజు తరువాత అన్నమాట. అహా! ఏమి నా లక్కు.

ప్రేమ దోమ, పెళ్ళి, గిళ్ళి, సినిమా షికారు, లేకపోయినా ఉండొచ్చు కాని ఈ దేశంలో జాబ్ లేకుండా ఉండలేం కదా! అలా ఎక్స్ బాసు కాస్తా మళ్ళీ పెద్ద బాసు అయిపోయిన ఆ క్షణంలో, కనీసం ఓ నాలుగు గంటలయినా నిద్రపోయి తీరాలని ఒట్టేసుకుని, వెంటనే సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, కంఫర్టర్‌లో దూరిపోయాను.

## ఆప్తమిత్రుడు మూలం: డివోటెడ్ ఫ్రెండ్ (ఆస్కార్ వైల్డ్)

## అనుసృజన: డా.వైజయంతి

**నున్నగా మెరుస్తున్న నల్లపూసల్లాంటి కళ్ళు,** ముదురు బూడిద రంగు మీసాలు, రబ్బరులా సాగుతున్న తోక ఉన్న ఒక నీటి ఎలుక తన కలుగులోంచి తలను బయటకు పెట్టింది.

అక్కడే ఉన్న చెరువులో ఒక తల్లి బాతు ఈదుతూ, తన పిల్లలతో, ‘నీ తల ఎత్తుకుని నువ్వు నిలబడకపోతే సంఘంలో బతకడం చాలా కష్టం‘ అంటూ బుద్దులు చెబుతోంది.

‘ఏం పిల్లలూ! అమ్మమాట వినకపోతే ఎలాగ?‘ అని కొంచెం గట్టిగా అంది నీటి ఎలుక.

‘వాళ్ళని అలా కోప్పడకు, ప్రతివారు పని చేసేటప్పుడు ఏవో ఒడిదొడుకులు వస్తుంటాయి. తల్లిదండ్రులు ఓరిమితో అన్నీ నేర్పాలి‘ అంది తల్లిబాతు.

‘తల్లిదండ్రుల భావాల గురించి నాకు తెలీదు. ఈ ప్రపంచంలో ఉన్నతమైనది, అరుదైనది స్నేహం మాత్రమే. అయితే ఆప్తమిత్రుడు అంటే నీ ఉద్దేశంలో అర్థం ఏమిటి?‘ చెట్టు తొర్రలో కూర్చుని ఇదంతా కుతూహలంగా గమనిస్తున్న గ్రీన్ లిన్నెట్ ప్రశ్నించింది.

‘ఎంత పిచ్చి ప్రశ్న? నా ఆప్తమిత్రుడు నాకే అంకితమైపోవాలనుకుంటాను‘ అంది.

‘మరి దానికి కృతజ్ఞతగా నువ్వేం ఇస్తావు?‘ అని రెక్కలు టపటపలాడిసూ, వెండి తీగల మీద ప్రయాణిస్తున్న చిన్నపక్షి అడిగింది.

‘నేను నీకో కథ చెప్పాలనుకుంటున్నాను‘ ఒడ్డునే నిలబడి కథ ప్రారంభించింది లిన్నెట్.

‘పూర్వం హన్స్ అనే నిజాయితీ పరుడైన పిల్లాడు ఉండేవాడు. దయార్ద్రమైన హృదయం, నవ్వు తెప్పించే గుండ్రటి ముఖం అనే నిజాయితీ పరుడైన పిల్లాడు ఉండేవాడు. దయార్ద్రమైన హృదయం, నవ్వు తెప్పించే గుండ్రటి ముఖం తప్ప వాడిలో ప్రత్యేక గుణాలేవీ లేవు. చిన్న కుటీరం కట్టుకుని అందులోనే పచ్చటి తోట ఏర్పాటు చేసుకుని పనిచేసుకునేవాడు. ఆ పల్లెలో అక్కడ తప్ప అంత పచ్చదనం మరెక్కడా లేదు. అందమైన గిలీ, గులాబీలు, తెల్లపూలు. ఎన్నో రకాల పూలమొక్కలు ఉన్నాయి. ఋతువులు మారినప్పుడల్లా తోటలోకి కొత్తమొక్కలు వచ్చేవి. అందువల్ల ఆ ప్రాంతం ఎప్పుడూ రకరకాల పూలతో అందంగా, సుగంధం వెదజల్లుతూ ఉండేది. చిన్న హన్స్‌కి మిల్లర్ అయిన హగ్ అంటే చాలా ఇష్టం. తన తోటలో కాసిన పళ్ళు కోయకుండా వెళ్ళేవాడు కాదు హగ్.

'నిజమైన స్నేహితులయితే వారి అభిప్రాయాలు కూడా ఒకటిగానే ఉండాలి' అన్నాడు మిల్లర్. మిల్లర్ ఎప్పుడూ హన్స్‌కి ఏమీ ఇవ్వకపోవడం ఇరుగుపొరుగువారికి ఆశ్చర్యంగా ఉండేది. పిండిమిల్లు, ఆరు పాడి ఆవులు, పెద్ద గొర్రెలమంద ఉన్నప్పటికీ ఎప్పుడూ ఇంత కూడా సాయం చేయలేదు. హన్స్ మాత్రం ఎప్పుడూ అలాంటి ఆలోచనలతో తన బుర్ర పాడుచేసుకోలేదు. మిల్లర్ నిస్వార్థ స్నేహం గురించి చెప్పే మాటలు వింటూ ఆనందించేవాడు.

వసంత ఋతువులో చాలా ఆనందంగా ఉండేవాడు. శీతాకాలం వచ్చేటప్పటికి పళ్ళు, పూలు లేకపోవటంతో చలితో పాటు ఆకలి బాధనూ అనుభవించేవాడు హన్స్. దానికితోడు మిల్లర్ ఆ సీజన్‌లో గార్డెన్‌కి వచ్చేవాడు కాదు. అందుకని చలికాలం చాలా ఒంటరిగా అనిపించేది.

'ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు వారిని ఒంటరిగా వదిలేయాలే కానీ పరామర్శించకూడదు. స్నేహం అంటే నా ఉద్దేశ్యంలో అదే. పంచభక్ష్య పరమాన్నాలతో నిండిన భోజనాన్ని, మన రెడ్ వైన్‌ని చూస్తే వాడిలో కుళ్ళుమోత్తనం రావచ్చు. ఈర్ష్యను మించిన భయంకరమైన వస్తువు ఈ ప్రపంచంలో ఇంకోటి లేదు' అని మిల్లర్ భార్యతో అన్నాడు.

'నిజంగా నువ్వెంత బాగా మాట్లాడావో' అంది భార్య.

'చాలామంది బాగా నటించగలరు, కానీ కొంతమంది మాత్రమే బాగా మాట్లాడగలరు, ఆచరించగలరు. నిజానికి మంచిగా మాట్లాడటం చెప్పినంత తేలికకాదు' అన్నాడు మిల్లర్.

●●●

'శీతాకాలం వెళ్ళిపోయింది, గులాబీలు తమ పచ్చని నక్షత్రాలను విచ్చుకుంటున్నాయి. ఇప్పుడు చిన్ని హన్స్‌ని చూడడానికి అక్కడికి వెడతాను' అన్నాడు భార్యతో మిల్లర్.

'నీదెంత మంచి మనసు. వెళ్ళేటప్పుడు పెద్ద బుట్ట తీసుకెళ్ళడం మర్చిపోకు,' అంది భార్య.

'గుడ్ మార్నింగ్ హన్స్. శీతాకాలం అంతా ఎలా గడిపావు?'

'చాలా బాగా గడిచింది'

'నన్ను మర్చిపోయావేమోనని భయపడ్డాను'

'స్నేహానికి మరపు ఉండదు. అదే దాని గొప్పదనం'

'తోటలో చాలా పూలు ఉన్నందుకు సంతోషంగా ఉంది'

'వీటిని నేను బర్గో మాస్టర్ కూతురికి అమ్మి, ఆ డబ్బుతో నా గార్డెన్ బండిని విడిపించుకోవాలనుకుంటున్నాను.'

'నీ బండిని కాని అమ్మేసెయ్యలేదు కదా.'

'నిజం చెపుతున్నాను, శీతాకాలం తినడానికి కూడా డబ్బులు లేని పరిస్థితిలో ఉన్నాను. అందుకని కోట్‌కి ఉన్న వెండి గుండీలు, వెండి గొలుసు, పెద్ద పైప్ తాకట్టు పెట్టాను. చివరగా నా గార్డెన్ బండిని సైతం తాకట్టు పెట్టాను. అయితేనేం ఇప్పుడు అన్నిటినీ ఒక్కొక్కటిగా విడిపించి తెచ్చుకుంటాను,' అని ఎంతో సంబరంగా చెప్పాడు.

'నీకు నా బండి ఇస్తాను. కొద్దిగా పాడయ్యింది. బాగుచేసుకోవచ్చు. దానికి బదులుగా ఈ బుట్టనిండా నీ తోటలోని పువ్వులు ఇవ్వు.'

'పూర్తిగా నింపేస్తే నా దగ్గర అస్సలు పువ్వులుండవు. సిల్వర్ బటన్స్ వెనక్కి తెచ్చుకోవడానికి నా దగ్గర అస్సలు డబ్బులుండవు. అయినా ఫరవాలేదు. నా తోటలో పూలన్నీ ఎప్పుడూ నీకు స్వాగతం పలుకుతాయి. నాకు నా సిల్వర్ బటన్స్ కంటే నీ మాటలే బావున్నాయి' అంటూ పరుగులాంటి నడకతో తోటలోకి వెళ్ళి గబగబ పూలన్నీ తీసుకొచ్చాడు.

●●●

మరుసటి రోజు చెట్ల పూలలో ఉన్న తేనెను చూస్తూ ఆనందంగా ఉన్నాడు హన్స్. సరిగ్గా ఆ సమయంలో మిల్లర్ పిలవడం వినిపించింది.

'హన్స్, ఈ బస్తాలో ఉన్న పిండిని మార్కెట్‌కి తీసుకెళ్ళి అమ్ముకొస్తావా?'

'ఇవాళ నాకు చాలా పనుందే తీగలన్నిటినీ కత్తిరించి, చెట్లకి నీళ్ళు పెట్టాలి.'

'నేను నీకు బండి ఇస్తున్నందుకు నువ్వు నాకీ సహాయం చేస్తావనుకున్నాను'

'అలా అనకు' అంటూ పరిగెత్తుకెళ్ళి టోపీ తెచ్చుకుని వచ్చి, బస్తా వీపు మీద పెట్టుకుని బయలుదేరాడు. కొంతదూరం నడిచేసరికి నీరసపడినప్పటికీ ఎలాగోలా మార్కెట్ చేరుకుని పిండి బస్తాను అమ్మి ఇంటి ముఖం పట్టాడు.

'ఇవ్వాళ చాలా అలసటగా ఉంది. అయినా నా ప్రాణస్నేహితుడికి సహాయం చేసినందుకు సంతోషంగా ఉంది,' అనుకున్నాడు.

మరుసటి రోజు పొద్దున్నే పిండి అమ్మిన తాలూకు డబ్బుకోసం మిల్లర్ హన్స్ ఇంటికి వచ్చాడు. హన్స్ అలసిపోయి ఉండటంతో పొద్దున్నే నిద్రలేవలేకపోయాడు.

'హన్స్, నువ్వు చాలా బద్ధకస్తుడివి. సోమరితనాన్ని మించిన పాపం లేదు. నా మాటల్ని నువ్వు తేలికగా తీసుకోకు. మనసులో ఉన్నమాట చెప్పకపోతే నిజమైన స్నేహానికి విలువేది? ప్రతివాడు తియ్యటి కబుర్లు చెపుతాడు. కానీ ప్రాణస్నేహితుడు మాత్రం ఎప్పుడూ కటువుగానే మాట్లాడతాడు. అవతలివారి మనసు కష్టపెట్టాలని మాత్రం కాదు. మంచి మిత్రుడు ఇటువంటి వాటినే ఇష్టపడతాడు. వాటిని అనుసరిస్తాడు' అన్నాడు మిల్లర్.

'నను క్షమించు. నిన్న బాగా అలసిపోవడంతో పక్షుల కిలకిలారావలు వింటూ మరికాసేపు పడుకుందామనుకున్నాను' అన్నాడు హన్స్.

'నువ్వు బట్టలు మార్చుకుని మా ఇంటికి వచ్చి పైకప్పు బాగుచేసి వెళ్ళు' అన్నాడు.

రెండురోజులుగా మొక్కలకి నీళ్ళు లేవు. అయితే మిల్లర్ మాట కాదనలేకపోయాడు.

'నేను 'కాదు' అంటే స్నేహాన్ని ధిక్కరించినట్టే అంటావా' అని మంద్రంగా జంకుగా అన్నాడు హన్స్.

'తప్పకుండా! నేను నీకిచ్చే బండి కంటే ఇది పెద్దపనేం కాదు. నువ్వు కాదమే నేనే చేసుకుంటాను,' అన్నాడు మిల్లర్.

'లేదు లేదు, తప్పకుండా వస్తాను' అంటూ మంచం మీద నుంచి ఒక్క ఉదుటన లేచి, బట్టలు మార్చుకుని మిల్లర్ ఇంటికి వెళ్ళి పని మొదలుపెట్టాడు. సూర్యాస్తమయ సమయానికి మిల్లర్ వచ్చి, హన్స్ ఎలా పని చేస్తున్నాడో గమనించాడు.

'ఓహ్' ఇతరులకు సహాయం చేయడానికి మించిన ఆనందం లేదు' అన్నాడు మిల్లర్.

'నువ్వు మాట్లాడుతుంటే వినాలనిపిస్తుంది. నీకు వచ్చినట్టుగా నాకు అంత అందమైన ఆలోచనలు ఎందుకురావో అర్థంకాదు' అన్నాడు హన్స్.

'నీకు కూడా వస్తాయి, కొన్ని రోజులు పోయాక నీకు స్నేహం అంటే తెలుస్తుంది. ఇంక నువ్వు ఇంటికి వెళ్ళి విశ్రాంతి తీసుకోవడం మంచిది, రేపు నా గొర్రెల్ని మేపడానికి కొండమీదకి తీసుకువెళ్ళాలి' అన్నాడు మిల్లర్. హన్స్ ఏమీ మాట్లాడలేకపోయాడు. మరుసటి రోజు వాటిని కొండమీదకి తీసుకెళ్ళాడు. ఆ రోజంతా అక్కడే గడిచిపోయింది

'నా తోటలో ఉంటే నాకెంత బావుంది,' అనుకుంటూ తోటపని ప్రారంభించాడు.

మిల్లర్ తన పని తనను చేసుకోనివ్వడంలేదు, అనుక్షణం గార్డెన్ చుట్టూ ప్రదిక్షిణలు చేస్తూ, తనకి సంబంధించిన పనులలో సహాయపడమని అడుగుతున్నాడు. ఒక్కోసారి హన్స్‌కి కోపం కూడా వస్తోంది. "నా తోటలోని పూలన్నీ నేను వాటిని మర్చిపోయాయనుకుంటాయేమో" అని సంశయం పడ్డాడు. మళ్ళీ వెంటనే మిల్లర్ తన స్నేహితుడు కదా, ఇలా ఆలోచించకూడదు అనుకున్నాడు.

మిల్లర్ స్నేహం గురించి చెప్పిన వాటన్నటినీ ఒక పుస్తకంలో రాసుకుని రాత్రిళ్ళు చదువుకుని, జ్ఞానం సంపాదించుకుంటున్నందుకు ఆనందించేవాడు.

బాగా చలిగా ఉండటంతో హన్స్ నిప్పు రాజేసుకుని కూర్చునుండగా, హఠాత్తుగా గట్టిగ తలుపు తట్టిన శబ్దంవినిపించింది. అది చాలా భయంకరమైన రాత్రి. గాలి గర్జిస్తూ ఇంటిని చుట్టుముడుతోంది. అదేదో తుఫాను అనుకున్నాడు ముందు. మళ్ళీ రెండోసారి కూడా తలుపు తట్టిన శబ్దం వినిపించింది. మూడోసారి కూడా వినిపించింది. ఒకసారికి మించిన శబ్దంతో మరోసారి శబ్దం వస్తోంది.

'ఎవరో పేద యాత్రికుడు అయి ఉంటాడు' అనుకుంటూ హన్స్ తలుపు తియ్యడానికి లేచాడు. తలుపు తెరిచి చూసేసరికి గుమ్మంలో ఒక చేతిలో లాంతరు, మరో చేతిలో పెద్ద కర్ర పట్టుకుని మిల్లర్ కనిపించాడు.

'హన్స్, నేను చాలా పెద్ద కష్టంలో ఉన్నాను. మా అబ్బాయి నిచ్చెన మీంచి కిందపడి దెబ్బ తగుల్చుకున్నాడు. ఈ సమయంలో డాక్టరు దగ్గరకు నువ్వు వెళ్ళడమే నయం,' అంటూ గద్గద స్వరంతో అన్నాడు మిల్లర్. 'తప్పనిసరిగా. అయితే బాగా చీకటిగా ఉంది. నీ లాంతరు ఇవ్వు' అన్నాడు హన్స్.

'నేను ఈ లాంతరు నీకివ్వలేను. కొత్తగా కొన్నాను. ఒకవేళ ఇది పాడయ్యిందంటే నాకు చాలా ఇబ్బంది' అన్నాడు మిల్లర్.

'పోనీలే పరవాలేదు. నేను లాంతరు లేకుండానే వెడతాను' అని తన ఉన్నికోటు తీసుకుని, క్యాప్ పెట్టుకుని తలచుట్టూ మఫ్లర్ చుట్టుకుని బయలుదేరాడు.

మూడు గంటలు నడిచిన తరువాత డాక్టరు ఉండే ప్రదేశానికి చేరుకుని, తలుపు తట్టి, "మిల్లర్ వాళ్ళబ్బాయి నిచ్చెన మీంచి పడి, దెబ్బలు తగుల్చుకున్నాడు. అందుకని మిమ్మల్ని రమ్మన్నాడు" అని చెప్పాడు.

'సరే పద!' అంటూ గుర్రం, బూట్లు లాంతరు తెమ్మని పురమాయించి మెట్లు దిగి, గుర్రం ఎక్కి మిల్లర్ ఇంటివైపుగా బయలుదేరాడు. వెనకాలే పరుగెత్తాడు హన్స్.

వాన బాగా పెరిగి వరదగా మారింది. ఆ వరద ఉధ్ధృతి అంతకంతకీ పెరగడం మొదలయ్యింది. హన్స్ చిత్తడినేల మీద నడవలేక నడవలేక నడుస్తున్నాడు. ఓ పక్క చీకటి మరోపక్క వరద, ఇంకోపక్క జారుతున్న నేల. హన్స్ నడుస్తూ ప్రమాదకరమైన గుంటలో పడ్డాడు. మరుసటి రోజు గొర్రెలకాపరలు అతని శరీరం ఒక చెరువులాంటి చోట తేలియాడటం చూసి ఇంటికి మోసుకొచ్చారు.

'వరద ఉధ్ధృతి అంతకంతకీ పెరుగుతుండడం మొదలయ్యింది. వాన నీరు గుంటలుగుంటలుగా ఏర్పడింది. హన్స్‌కి గుర్రం ఎటువెడుతుందో కనిపించడంలేదు. చిత్తడి నేల నడుస్తూ కాలుజారి ప్రమాదకరమైన గుంటలోకి పడి, మునిగిపోయాడు. మరుసటి రోజు గొర్రెలకాపరులు అతని శరీరం ఒక చెరువులాంటి చోట తేలియాడటం చూసి ఇంటికి మోసుకొచ్చారు.

హన్స్ అంత్యక్రియలలో ఎక్కువగా విలపించినవాడు మిల్లర్.

'నేను వాడి ప్రాణస్నేహితుడిని, వాడి తల దగ్గర నడవడం యోగ్యంగా అనిపిస్తోంది' అంటూ ముందుకి నడిచాడు. నడుస్తున్నంతసేపు జేబులోంచి కర్చీపు తీసి కళ్ళు తుడుచుకుంటూనే ఉన్నాడు.

'హన్స్ లేకపోవడం అందరికీ లోటే' అన్నాడు కమ్మరి.

'నాకు మాత్రం నిజంగా తీరని లోటే' అన్నాడు మిల్లర్. నా బండి వాడికి ఇవ్వాలని ఉంచాను. ఇప్పుడు దానితో ఏం చేయాలో తోచట్లేదు. ఇంకెప్పుడూ నేను ఎవ్వరికీ ఏదీ ఇవ్వను. దాతృత్వం కారణంగా వారు బాధలు అనుభవిస్తున్నారు', అనుకున్నాడు.

●●●

'కథ బావుంది' అంది నీటి ఎలుక.

'అదేనా ముగింపు' అంది లిన్నెట్.

'మిల్లర్ ఏమయ్యాడు?'అంది నీటి ఎలుక.

'ఏమయ్యాడో తెలీదు. అయినా నేను దేన్నీ పట్టించుకోను' అంది లిన్నెట్.

'అంటే నీ జీవితంలో నీకు ఎవ్వరిమీదా సానుభూతి లేదా' అంది నీటి ఎలుక.

'ఇందులో నీతి నీకు అర్ధం కాలేదనుకుంటాను' అంది లిన్నెట్.

'ఏముంది?' నవ్వింది నీటి ఎలుక.

'నీతి' అంది లిన్నెట్.

'అంటే నువ్వు ఈ కథలోని నీతి చెప్పాలనుకుంటున్నావా?' అంది నీటి ఎలుక.

'అవును' అంది లిన్నెట్.

'నిజంగానా. నువ్వు ప్రారంభించడానికి ముందు చెప్పావనుకుంటున్నాం. కాదంటే నేను మొదటినుంచి వినలేదన్నమాట' అంటూ మీసాలు తడుముకుంటూ కన్నంలోకి వెళ్ళిపోయింది నీటి ఎలుక.

'నీకెలా ఉంది కథ నీటి ఎలుకా?' అని ప్రశ్నించింది బాతు.

'వాడి దగ్గర చాలా మంచి విషయాలు ఉన్నాయి. నా దగ్గర మాత్రం అమ్మలో ఉండే చాలా లక్షణాలు ఉన్నాయి. నేను మాత్రం బ్రహ్మచారుల కళ్ళల్లో ఉండే నీటిని మాత్రం చూడను.

"నేను వాడిని ఎదిరించానేమోనని భయంగా ఉంది" లిన్నెట్ అంది. నేను నీతి ఉన్న కథే చెప్పాను. అది నిజం.

"అలా ఉండటం ఎప్పటికైనా ప్రమాదమే" బాతు అంది.

నేను దానితో పూర్తిగా ఏకీభవిస్తాను.

●●●

# వెంటాడే గాంధీ

కండ్లకుంట శరత్ చంద్ర

**"భారతదేశంలో తీవ్రవాదాన్ని అంతం చేస్తాం.."** అనే ప్రధానమంత్రి ప్రకటన తాలూకు వార్తను మధ్యలోనికి చింపి దినపత్రిక తాలుకు ఆ కాగితంలో వడాపావ్ పెట్టి ఇచ్చాడు, బండివాడు. నేను, డబ్బు చెల్లించి బ్రెడ్ మధ్యలో పెట్టిన వడను తింటూ నా భుజానికున్న సంచిలో ఉన్న రెండు ఆర్.డి.ఎక్స్ బాంబులను తడుముతూ ముంబైలోని ఓ చిన్న పార్కులో కూర్చుని పార్కు మధ్యలో ఉన్న గాంధీ విగ్రహాన్ని చూడసాగాను.

సమయం ఉదయం ఏడున్నర అయ్యింది.

ఆఫ్ఘనిస్తాన్‌లో రెండేళ్ళపాటు శిక్షణ తీసుకున్న యాభైమంది పాకిస్తానీయులలో నేనూ ఒకడిని పాకిస్తాన్‌లో నా ఇద్దరు భార్యలు. రుక్సానా, నహీదా ఎలా ఉన్నారో నా పిల్లలు ఎలా ఉన్నారో నాకు తెలీదు.

పవిత్రమైన మతయుద్ధం కోసం ప్రాణాలు అర్పించడానికి కంకణం కట్టుకున్న మా మతసంస్థలోని సభ్యులకు భవబంధాలు ఉండకూడదు. ఉండవు కూడా.

బాంబులు ఎక్కడ పెట్టాలో ఆలెడీ పథకం తయారయ్యుంటుంది. కానీ ఎక్కడ పెట్టాలో నాకింకా సమాచారం రాలేదు. మా ఆపరేషన్స్‌లో ఒకరు పథకం వేస్తారు. ఒకరు సమాచారం ఇస్తారు. ఒకరు ఎగ్జిక్యూట్ చేస్తారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో ఒక అప్లికేషన్ తయారు చెయ్యడానికి స్థూలంగా ఐదు దశలుంటాయి Requirements Collection, Analysis, Design, Implementation, Testing. మా రంగంలో ఒక ప్రదేశంలో బాంబు పెట్టడానికి చాలా దశలుంటాయి! చాలామంది అవసరమౌతారు. తమాషా ఏమిటంటే ఒక దశలో పనిచేసేవారితో మరొకరికి ముఖపరిచయం కూడా ఉండదు. ఈ రెండు బాంబులున్న సంచిని నేను దాదర్‌లోని ఓ పూలదుకాణంలో కలెక్ట్ చేసుకున్నాను. సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ జరిగాక మెయింట్‌నెన్స్ అని మరో దశ ఉంటుంది. మాకు అలాంటి దశ ఏమీ ఉండదు. బాంబు పేలిపోయే సమయానికి మాకు ఇచ్చిన శిక్షణ ప్రకారం మేము ఏ కాకాహోటల్‌లోనో కూర్చుని చాయ్ తాగుతూ టి.విలో వార్తలు చూస్తుంటాం.

"తీవ్రవాదాన్ని ఫలానాయన ఖండించాడు" అనే వార్తలను కామెడీగా చూస్తుంటాము. నేను, వడాపావ్ తినేసి కాగితాన్ని విసిరేసాను.

"ఇలా ఎక్కడిపడితే అక్కడ కాగితాలను పడెయ్యొద్దు నాయనా! పార్కులో use me అని చెత్తకోసం కుందేలు, కోతి ఆకారాలలో డస్ట్‌బిన్‌లను పెట్టారు. చూడలేదా!" ఓ వృద్ధుడి కంఠం వినిపించింది.

మహారాష్ట్ర టోపీ, తెల్లని చొక్కా, తెల్లని ధోవతి, జేబులో ఇంకుపెన్ను, చేతిలో కర్ర, పాదాలకు తోలుచెప్పులు. 1947కు ముందు భారతదేశంలో పుట్టి ఆకాలంలోనే ఆగిపోయినట్లున్నాడనిపించింది. వేషభాషలు చూస్తుంటే!

ఆయనే కాగితాన్ని తీసి డస్టుబిన్‌లో వేసి గాంధీ విగ్రహానికి నమస్కరించి కూర్చున్నాడు.

మాకు ఇచ్చిన శిక్షణలో భాగంగా 'ఆపరేషన్‌లో మునిగివున్నప్పుడు ఎవ్వరితోనూ అనవసరంగా మాట్లాడకూడదు!' అనే విషయం నేర్చుకున్నాను.

"ఏం బాబూ? ఏ రాష్ట్రం మీది?" అడిగాడాయన.

"నాది ఏ రాష్ట్రమైతే నీకెందుకురా నాయనా! నీ మానాన నువ్వుండొచ్చుగా" మనసులో అనుకుని, "ఎందుకు?" అడిగాను.

"రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటయిరయ్యాను. అన్ని రాష్ట్రాల ప్రజలనూ చూడగానే పోల్చుకోగలను. కానీ నిన్ను పోల్చుకోలేకపోతున్నాను. చూడడానికి పంజాబ్ వాడిలా ఉన్నావ్ కానీ నీ జుట్టు రంగు మాత్రం అలా లేదు అందుకే అడిగాను" చెప్పాడు వృద్ధుడు.

'హమ్మనా ముసలీ' మనసులో అనుకుని, "పంజాబ్ వాడినే స్టైల్ కోసం జుట్టుకు రంగు వేసుకున్నాను" చెప్పాను.

అంతలో అక్కడికి ఓ ఇడ్లీ ప్యాకెట్‌తో ఓ యువకుడు వచ్చి గాంధీ విగ్రహం ముందున్న సిమెంటు ఛప్టామీద కాళ్ళు పెట్టి ఇడ్లీలు తినసాగాడు.

"నాయనా చూస్తుంటే తమిళనాడు వాడిలా ఉన్నావ్. నీ కాళ్ళు కాస్త గాంధీగారి వైపునుండి మరోవైపుకు తిప్పి కూర్చోవచ్చుకదా. హబ్బే మరేం లేదు. ఎంతైనా మన జాతిపిత కదా. కాస్త గౌరవం ఇద్దాం. ఏమంటావ్?" అడుగుతూనే తాను చెప్పాలనుకున్నది చెప్పాడు ఆ వృద్ధుడు.

"హుఁ ! జా..తి..పి..త" ఆ యువకుడు విసుక్కుంటూనే కాళ్ళు తీసేసాడు.

"ఎందుకు నాయనా అలా విసుక్కుంటావ్"

"విసుక్కోక అక్కడికేదో గాంధీ అంటే ఏదో పెద్ద హీరోలాగా చూస్తారేంటి? మన దేశం రెండు ముక్కలవడానికి కారణం ఈ గాంధీనే. గాంధీ ముస్లింల పక్షపాతి" అన్నాడు ఆ యువకుడు ఇడ్లీ తింటూ.

ఆ వృద్ధుడు చిరునవ్వు నవ్వి, "గాంధీ గురించి నీకు ఏం తెలుసు నాయనా? ఈ రోజుల్లో ప్రతీ అడ్డగాడిదా గాంధీని తిట్టేవాడే ఆయన పేరు ఉచ్చరించడానికి కూడా అర్హతలేని వారందరూ ఆయనను తిడుతుంటారు. చరిత్రను విశ్లేషించని ప్రతివెధవా గాంధీని విమర్శించడమే హుఁ" అన్నాడు.

"గాంధీ పాకిస్తాన్‌కు వెళ్ళిపోయుంటే బావుండేది. అనవసరంగా ఇక్కడ చచ్చి జాతిపిత అయ్యాడు" హేళనగా అన్నాడు యువకుడు.

"బాబూ గాంధీ అంటే ఒక స్వేచ్ఛామారుతం. ఈ ప్రపంచంలో అన్ని దేశాలకూ గాంధీజీ గొప్పతనం తెలుసు. ఒక్క మన ఇండియాకు తప్ప. గాంధీ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడలేదు. వారి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడారు.

ఈ విగ్రహమే కాకుండా ప్రతీ విగ్రహంలోనూ గాంధీని వృద్ధుడిలా చూపిస్తారు. గాంధీ జవసత్వాలూడిన వృద్ధుడు కాదు నాయనా గాంధీ ఆనాడు బ్రతికి ఉన్న అతి కొద్ది మంది యువకులలో ఒకరు.

గాంధీ కర్రలతో, కత్తులతో, బరిసలతో, బాంబులతో పోరాడలేదు నాయనా. ఆయన పిరికివాడు కాదుగా. ఆయన సత్యం, అహింసలతో పోరాడారు" చెప్పాడు..

ఆ యువకుడు ఇడ్లీలు తిని, కాగితం విసిరేసి వెళ్ళిపోయాడు.

వృద్ధుడు ఆ కాగితాన్ని తీసి, చెత్తకుండీలో వేస్తూ "చిత్తుకాగితాలు చెత్తకుండీలో వెయ్యాలని తెలీదు. వీడు గాంధీగారిని తిడతాడు" అన్నాడు.

నేను ఏమీ మాట్లాడలేదు. తలెత్తి గాంధీ విగ్రహాన్ని చూసాను. గాంధీ బోసినవ్వులు నవ్వుతున్నాడు. ఈ నవ్వుతోనే బ్రిటీషర్స్‌ను తరిమికొట్టాడు.

ఓసారి తాలిబాన్లతో మాకు సమావేశం జరిగింది.

అందులో "మనమెందుకు గాంధీగారి సిద్ధాంతాన్ని అనుసరించకూడదు?" అని మా దేశస్తుడు, వాళ్ళను అడిగాడు.

"భారత్‌కూ, మీదేశానికీ, బంగ్లాదేశ్‌కూ గాంధీగారు ఒక గొప్ప ఉదాహరణ? దక్షిణాఫ్రికాలో ఫస్ట్‌క్లాస్ రైల్వే కంపార్ట్‌మెంట్ నుండి ఆయనను మెడపట్టుకుని గెంటేస్తే ఆయన ఊరుకోకుండా మీ దేశాలనుండి తెల్లవాళ్ళందరినీ మెడపట్టుకు గెంటాడు. కానీ సమస్య ఏంటంటే గాంధీగారి విధానాలను అనుసరించడం అంత సులభమైన విషయం కాదు. ఎవరైనా తంతుంటే తన్నించుకోవడం, అహింసను పాటించడం, సత్యం మాట్లాడడం. ష్చ్.. మెషీన్ గన్ పేల్చడం కంటే కష్టమైనవి" చెప్పాడు తాలిబాన్ నాయకుడు నిజాయితీగా.

నాకెందుకో ఇప్పుడు ఆ విషయం గుర్తొచ్చింది. ఇండియా సంగతి నాకు తెలీదుగానీ మా పాకిస్తాన్ లోనూ, ఆఫ్ఘనిస్తాన్‌లోనూ గాంధీగారిని ఎవ్వరూ ఏకవచనంతో సంబోధించరు. విమర్శించరు.

'బ్రిటీషర్స్‌కు గాంధీని చంపాలనే ఆలోచన ఎప్పుడూ రాలేదు. స్వతంత్ర భారత్ గాంధీని కొన్నినెలలు కూడా భరించలేకపోయింది!' ఇది మా సోషల్ స్టడీస్‌లో పాఠం!

నా సెల్ ఫోన్ మోగింది.

"హలో"

"హలో ఎవరెస్టు శిఖరం ఎత్తు ఎంత? "

"143 అంగుళాలు" చెప్పాను.

ప్రశ్న - కోడ్ మ్యాచ్ అయ్యాయి.

"బాంబు అంధేరీలో ఉన్న ఓ టిఫిన్ సెంటర్‌లో పెట్టు. టిఫిన్ సెంటర్ పేరు మహాత్మా టిఫిన్స్ భండార్."

"ఎన్నింటికి ఫిక్స్ చెయ్యాలి?"

"తొమ్మిదిన్నరకు పేలాలి. పెట్టేసి అక్కడినుండి రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న మహాత్మాగాంధీ హార్ట్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్ళు. ఆసుపత్రి దగ్గర ఓ సైకిల్ ఉంది. సైకిల్‌కు అమితాబచ్చన్ బొమ్మ ఉంది. సీటు ఆకుపచ్చరంగులో ఉంది. సైకిల్ హాండిల్‌కు బ్యాగ్ తగిలించి ఆసుపత్రిలోకి వెళ్ళిపో! సరిగ్గా తొమ్మిదీ నలభైకి 9887767090 నెంబర్‌కు ఫోన్ చెయ్యి. చాలు. సైకిల్‌కి పెట్టిన బాంబు పేలుతుంది." ఫోన్ కట్ అయ్యింది.

నేను గబగబా వెళ్ళి ఓ ట్యాక్సీ ఎక్కి అంధేరీకి వెళ్ళాను. మహాత్మా టిఫిన్స్ భండార్‌లోనికి వెళ్ళి ఛాయ్ తాగి నా సంచిలో నుండి ఒక బాంబును తీసి మూలనున్న ఓ బెంచీ క్రింద చాకచక్యంగా అమర్చి బిల్లు చెల్లించి బయటపడ్డాను.

ఇరవై నిమిషాలు నడిచి మహాత్మా గాంధీ హార్ట్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చాను. నాకు కావల్సిన సైకిల్ కనిపించింది. అటూ ఇటూ చూసి సైకిల్‌కు సంచి తగిలించి ఆసుపత్రి లోపలికి నడిచాను.

ఆసుపత్రి ఆవరణలో పేషెంట్లు, వారి తాలూకు బంధువులు తిరుగుతున్నారు.

ఆసుపత్రిలో ఒక మూలన గాంధీ విగ్రహం ఉంది. ఇప్పటికీ మా దేశంలోని వృద్ధులు గాంధీజీ గురించి కథాకథలుగా చెపుతుంటారు. అఖండ భారతాన్ని ఏకత్రాటిపై నడిపించిన ధీశాలి అనీ, ఏనాడు పదవులకోసం ఆశించని యోగి అనీ, నిరంతరం పోరాడే ఆయుధమనీ, తాను నమ్మిన సిద్ధాంతంకోసం స్వీయార్పణం చేసుకున్న విరుడనీ కథలు గానం చేస్తారు. భారతదేశం విడిపోకూడదని శాయశక్తులా ప్రయత్నించిన మహర్షి అని చెపుతారు.

'గాంధీజీకీ మిగతానాయకులకూ ఉన్న తేడా ఏమిటంటే ఆయన తానే స్వయంగా విషయాలను కనుక్కుంటారు. ప్రతిదీ పరీక్షిస్తారు. ఆయన ఎక్కడో ఓ చోట కూర్చుని ఉపన్యాసాలు ఇవ్వలేదు. దేశమంతా తిరిగారు. ప్రజలలో కలిసిపోయారు. రైతుల్లో రైతుగా కూలీలలో కూలీగా కార్మికులలో కార్మికునిగా అంటరానివారని ఆనాడు దూరంగా పెట్టినవారికి మిత్రునిగా, హిందువులకు భాయ్‌గా, ముస్లింలకు సోదరునిగా దేశం నలుమూలలా తిరిగారు'

మా రావల్పిండీ తాతయ్యలు, సాయంత్రపు నమాజ్ తర్వాత గాంధీజీ గురించి చెప్పేవాళ్ళు.

నేను గాంధీజీ విగ్రహాన్ని చూస్తూ ఆసుపత్రిలో ఒక బెంచీమీద కూర్చున్నాను. ఒకటిమాత్రం పచ్చి నిజం. గాంధీజీ అనే వ్యక్తి లేకపోతే ఆంగ్లేయులు మా దేశాలలోని సంపదను మరింత దోచుకునేవారు. మరిన్ని సంవత్సరాలు మేము బానిస బ్రతుకులు బ్రతికేవాళ్ళం.

నేను ఆలోచిస్తూనే తలతిప్పి ఎడమవైపు చూసాను.

ఒక మందుపాతర నా కాళ్ళకింద పేలినట్లయ్యింది.

ఆ గోడకున్న ఫోటో నాదే!

నా ఫోటో ఈ ఆసుపత్రి గోడపై ఎందుకుంది?

అయితే అదేమీ వాంటెడ్ ఫోటోకాదు.

నేను గబగబా వెళ్ళి తలెత్తి గోడకున్న ఆ ఫోటోను జాగ్రత్తగా పరిశీలించాను.

ఫోటోలో ఉన్నది నా మొహమే! కానీ నేను కాదు.

ఆ ఫోటోలోని వ్యక్తి నుదుటికి కుంకుమ ఉంది. మీసాలూ, గెడ్డం లేవు. జుట్టు కాస్త నెరిసిపోయి ఉంది.

ఆ వ్యక్తి చచ్చిపోయినట్లున్నాడు. పూలదండ వేసుంది. కానీ నా పోలికలతో ఎందుకున్నాడు?!

ఒక నర్స్ అటుగా వచ్చి నన్ను చూసి దెయ్యాన్ని చూసి అరిచినట్లుగా కెవ్వున అరిచింది.

నేను అదురుకున్నాను. నలుగురు నర్సులూ, ఇద్దరు డాక్టర్లు వచ్చారు.

ఆ ఫోటోనూ, నన్నూ మార్చి మార్చి చూస్తున్నారు.

ఒక వృద్ధలేడీ డాక్టర్ గట్టిగా నా చేతిని పట్టుకుని, "నీ పేరేంటి? ఎవరు నువ్వు?" అడిగింది.

ఆమె ఉద్వేగం చూస్తుంటే నాకు ఇబ్బందికరంగా ఉంది.

నా పేరు ఆఫ్ఘనిస్తాన్‌లో జమాలుద్దీన్, పాకిస్తాన్ ప్రభుత్వ రికార్డుల్లో ఖలీల్ భాషా, లష్కర్-ఏ-తొయిబా పాకిస్తాన్ పశ్చిమ విభాగంలో నా పేరు సయ్యద్, పాస్ పోర్టులో నా పేరు ఫరూక్, దుబాయిలో గఫార్ ఖాన్, భీజర్ బాబా ఇలా చాలా పేర్లు. ప్రస్తుతం ముంబయ్‌లో ఫరాన్! నాకు ఒక్క పేరంటూ లేదు.

"ఏం ఎందుకు?" అడిగాను.

ఆ ఫోటోలోని వ్యక్తికీ, నాకూ ఏదో సంబంధం ఉందని తెలుస్తోంది. అదేంటో తెలుసుకోవాలి, కానీ ఆపరేషన్‌లో ఉన్నప్పుడు ఇతర విషయాల పట్ల ఎక్కువ ఉత్సాహాన్ని మేము చూపించము.

"ఈ ఫోటోలోని వ్యక్తి నా తండ్రి. జగన్నాథ్ వాడేకర్! నా పేరు విజయలక్ష్మి. మీతో కాస్త మాట్లాడొచ్చా?" అంది.

నేను అయిష్టంగానే తలూపాను.

ఆమె తన గదివైపు నడిచింది. నేను ఆమెను అనుసరించాను.

ఇద్దరం ఆమె గదిలోనికి వెళ్ళి కూర్చున్నాం. ఆమె గదిలో గోడకు మహాత్మాగాంధీ ఫోటో ఉంది.

"ప్రపంచమంతా కేవలం తర్కంతోనే నడవడంలేదు. జీవితమంటేనే కొంత హింస ఉంటుంది. ఐతే మనం తక్కువ హింస ఉన్న మార్గాన్ని వెతుక్కోవాలి - హరిజన్ పత్రిక, 28-9-1934, గాంధీ!" అని ఆ ఫోటో క్రింద రాసుంది.

"మీ పేరు చెప్పలేదు" అంది డాక్టర్ విజయలక్ష్మి.

"ఇబ్రహీం" నోటికొచ్చిన పేరు చెప్పాను.

నిజానికి ఓ హిందువు పేరు చెప్పెయ్యొచ్చు. కానీ నా గెడ్డం, నా కళ్ళక్రిందున్న సుర్మా చూసి నన్నెవరూ హిందువు అనుకోరు. ఆమె వయసు అరవై అయిదూ డెబ్బై మధ్యన ఉండొచ్చేమో.

"ఓ అలాగా!" అంది.

"............"

"మా నాన్న ఫోటో మీ పోలికలు ఎందుకు మ్యాచ్ అవుతున్నాయో అర్థం కావడంలేదు. మా నాన్న స్వాంతంత్ర సమరయోధుడు. మేము ఇద్దరు సంతానం నేనూ నా తమ్ముడు కాంతికిరణ్. 1948లో దేశ విభజన అనంతరమూ అల్లర్లయ్యాయి. ఆ అల్లర్లలో ముస్లీం సారీ ఏమనుకోవద్దు. ముస్లీం ఛాందసులు మా అమ్మను మానభంగం చేసి చంపేసారు. మా ఇల్లు తగలబెట్టారు. అది చూసి ఎనిమిదేళ్ళ వయసున్న నా తమ్ముడు ఇంట్లోంచి పారిపోయాడు.

గాంధీగారికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి నేనూ, నాన్నా సబర్మతి ఆశ్రమానికి వెళ్ళాం. వచ్చేసరికి ఇదీ జరిగింది! మా తమ్ముడి కోసం వెతికించాం. ఎక్కడా దొరకలేదు"

"............"

ఆమె పైకి లేచి, అల్మేరా తెరిచి అందులో నుండి ఓ ఆల్బమ్ తీసి నా చేతికి ఇచ్చింది. నేను ఆల్బమ్ చూసాను. మొదటిపేజీలో బ్లాక్ అండ్ వైట్ ఫోటో.

ఆ కుర్రాడు నా తండ్రి ఖాజామైనుద్దీన్.

"ఆ కుర్రాడే నా తమ్ముడు కాంతికిరణ్. ఆ చిన్న అమ్మాయి నేనే! నా తల్లీ తండ్రీ" అంది.

నా చెవుల ప్రక్కన ఫిరంగులు మోగుతున్నట్లయ్యింది.

నా తండ్రి చిన్నప్పటి ఫోటో ఇప్పటికీ మా ఇంట్లో ఉంది. నా తండ్రి కూడా చాలా మందిలాగే ఇండియా నుండి పాకిస్తాన్‌కు వలస వచ్చాడనుకున్నానుకానీ అతడు హిందువని నాకు తెలీదు.

ఏ ముస్లిం మానవతావాదో ఆయనను పాకిస్తాన్‌కు తెచ్చుంటాడు బహుశా ఆయనను పెంచిన ముస్తఫా తాతయ్యో నఫీస్ నాయనమ్మో తెచ్చుంటారు.

అంటే ముస్తఫా, నఫీస్ నా తాతయ్య, నాయనమ్మాకారన్నమాట.

ఆ ఊహే చాలాదారుణంగా అనిపించింది. నేను హిందువుకు పుట్టాననే భావన. నన్ను కాల్చేస్తోంది. నా ఎదురుగా కూర్చున్నది నా మేనత్త అన్నమాట. వయసు విషయంలో నా అంచనా తప్పు. ఆమె వయసు డెబ్బైపైనే అన్నమాట.

నేను ఆల్బమ్ తిరగేసాను. మా తాతయ్య ఫీ కాదు కాదు. నా తండ్రికి తండ్రి. అచ్చం నాలాగే ఉన్నాడు. కాదు నేను, ఆయనలా ఉన్నాను.

ఒక ఫొటోలో నా తండ్రి మూడు నిలువు నామాలు, మెడలో రుద్రాక్షమాలో తులసిమాలో, చేతిలో ఏదో గ్రంథం భగవద్గీతో రామాయణమో.

మరికొన్ని పేజీలు తిప్పాను. విజయలక్ష్మి, ఆమె భర్త పెళ్ళిఫోటో.

"ఆయన నా భర్త. మిలటరీలో కమేండర్. 1965లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మరణించారు" చెప్పింది.

ఆశ్చర్యం. అదే యుద్ధంలో పాకిస్తాన్ తరపున సైనికుడిగా పోరాడి నా తండ్రీ చనిపోయాడు. అదే సంవత్సరం నేను పుట్టాను.

మరికొన్ని పేజీలు తిప్పాను.

భార్యా భర్త, ఒక చిన్నపిల్లాడు.

"వాడు నా కొడుకు. ఆమె నాకోడలు వాళ్ళ పిల్లాడు. హ్మ్ ఇరవైఏళ్ళ క్రితం ముంబై మహాలక్ష్మి టెంపుల్ ముందు పేలిన తీవ్రవాదుల బాంబులో చచ్చిపోయారు."

నా గూబ అదిరింది.

ఆ బాంబు పెట్టిన గ్రూప్‌లో నేనూ ఉన్నాను. అయితే అప్పటికి టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి సాధించలేదు. మామూలు బాంబు పెట్టాం.

ఇప్పుడు నేను ఫిక్స్ చేసిన రెండు బాంబుల దెబ్బకు కనీసం వందమంది చస్తారు. నాది ఒకటే కోరిక. అమెరికాలో ఇలాంటి బాంబులు పేల్చాలి. అమెరికన్ శవాలను చూసి నా కడుపు నిండాలి. మా ముస్లీం దేశమైన ఆఫ్ఘనిస్తాన్‌నూ, మా మతస్తులుండే ఇరాక్‌నూ బాంబులతో ధ్వంసం చేసారు.

నాకు బాగా గుర్తు. ఇరాక్‌లో అమెరికన్ ఎంబసీ నుండి. నలుగురు అమెరికన్‌లను లాక్కొచ్చి నేనూ, నా సంస్థ సభ్యుడు ఎ.కె.47తో పేల్చబోయినప్పుడు వాళ్ళు ఏడుస్తూ "మేము అమాయకులో మమ్మల్ని వదిలెయ్యండి" అని ఏడ్చారు.

"ఏం అమెరికా ఏమైనా ప్రపంచ పోలీసా? మా మతస్తులపైకి అమాయకులపైకి బాంబులు విసరలేదా? ఇరాక్‌లో పట్టుబడినా యుద్ధఖైదీలను క్రూరంగా మీ అమెరికన్‌లు హింసించారా? - లేదా? అప్పుడు మీరేం చేస్తున్నారురా? బీరు తాగాలా బ్రాందీ తాగాలా అని ఆలోచిస్తుండి ఉంటారు. ఇంటర్‌నెట్‌లు, పబ్‌లు, డిస్కోలు, ఆటలు, గ్యాంబ్లింగ్, వీడియో గేమ్‌లు, పెట్రోలు మీలోకం మీది. మీరంతా అమాయకులు. మనిషిని మనిషి హింసిస్తుంటే పట్టించుకోకుండా మీ ఆనందాలలో మునిగే అమాయకులు" అని తిడుతూ షూట్ చేసి పారేసాం. కన్నుకు కన్ను, పన్నుకు పన్ను కాలుకు కాలు ప్రాణానికి ప్రాణం. మేము నేర్చుకున్నది ఇదే అమలు చేసేదీ ఇదే

"ఈ ఆసుపత్రిని నేనే కట్టించాను.. విదేశాల నుండి ముఖ్యంగా అమెరికా నుండి చందాలు వస్తాయ్. వాటితోపాటు రతన్ టాటా, లక్ష్మీమిట్టల్ సహాయం చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో ఫ్రీగా గుండె ఆపరేషన్లు చేస్తాం. అన్నీ నేనే చెబుతున్నాను. మీరు ఎవరసలు? ఎందుకు మా నాన్నపోలికలో ఉన్నారు?" అడిగింది.

నేను సమాధానం చెప్పబోతుంటే నా సెల్‌ఫోన్ మోగింది.

"హలో"

"జేమ్స్‌బాండ్ పాత్రధారి రోజర్ మూర్ భార్య పేరేంటి?"

"లలితాసింగ్"

"కోడ్ మ్యాచ్ అయింది. సమయం తొమ్మిందింపావు అయ్యింది. తొమ్మిదీ ఇరవై అయిదుకు నువ్వు ఆసుపత్రి నుండి బయటికొచ్చి దూరంగా ఉన్న బస్టాప్‌లో నిలబడి సరిగ్గా తొమ్మిదీ నలభైకి సైకిల్ కున్న బాంబు పేలేందుకు ఫోన్ చెయ్యి."

"ఊఁ"

"ఆ తర్వాత పూనే వెళ్ళిపో"

"సరే"

అవతల ఫోన్ కట్ అయ్యింది.

"క్షమించాలి. నాకు కొంచెం పనుంది నేను మళ్ళీ కలుస్తాను" చెప్పాను.

"మంచిది. కానీ మీరు మా తండ్రి పోలికల్లో"

"ఏమో అర్థం కావడంలేదు. మాది పంజాబ్ నేను ముంబైలో ఓ రెస్టారెంట్‌లో షెఫ్‌ను" చెప్పాను పైకి లేస్తూ.

"హాస్పిటల్‌కు ఎందుకు వచ్చారు?" అడిగింది.

"నా స్నేహితుడొకడు మీ ఆసుపత్రిలో చేరిన వాడి బంధువు కోసం వస్తానన్నాడు. అందుకే వచ్చాను" అబద్దం చెప్పాను.

"ఐసీ ఎవరా పేషంట్?"

"సారీ పేషెంట్ వివరాలు నాకు తెలీదు" చెప్పాను.

"ఎందుకో ఖచ్చితంగా మీకూ, మా కుటుంబానికీ ఏదో సంబంధం ఉంది. అదేంటో తెల్సుకుంటేగానీ నా మనసు శాంతించదు. మీరేమో వెళ్ళిపోతానంటున్నారు" అంది బాధగా.

"తప్పకుండా మళ్ళీ కలుస్తా" చెప్పి, ఆ గదినుండి బయటికి నడిచాను. వేగంగా బయటికి నడిచి ఆసుపత్రి బయట ఓ వైపున్న సైకిల్‌నూ, సంచిని గమనిస్తూ దూరంగా ఉన్న బస్టాప్‌లో నిలబడ్డాను.

"హ్హిహ్హిహ్హి" వెకిలిగా ఏదో నవ్వు వినిపించింది.

నేను తలతిప్పి చూసాను.

బస్టాప్‌కు ఆమడదూరంలో ఓ పదేళ్ళకుర్రాడు సిల్వర్ రంగు పెయింట్‌ను పూసుకుని కర్రపట్టుకుని గాంధీజీ విగ్రహంలా నిలబడున్నాడు.

మా పాకిస్తాన్‌లోనూ ఇలాంటి భిక్షగాళ్ళు ఉంటారు. లండన్‌లో చార్లిచాప్లిన్, టూటెంకమెన్, దేవదూత, హిట్లర్ ఇలా రకరకాల వేషాలలో నిలబడి అడుక్కుంటుంటారు.

ఇక్కడ నిలబడిన పిల్లాడిని మరో నలుగురు కుర్రాళ్ళు వచ్చి వెక్కిరిస్తూ ఆటపట్టిస్తున్నారు.

"ఏయ్ గాంధీ రూపాయల నోట్ల మీద మొత్తం నువ్వే ఉంటావ్. నీ దగ్గర డబ్బులు లేవా?

"నిన్ను ఎప్పుడో చంపేసారు కదా మళ్ళీ వచ్చావేం?"

"గాంధీ నీకు ఐదురూపాయలిస్తా. అమితాబచ్చన్ దీవార్‌లో క్లైమాక్స్ డైలాగ్ చెప్పు"

"గాంధీ మూగోడురా. మాట్లాడడంలేదు"

"రేయ్ ఎంతరా పందెం. నేను ఈ గాంధీతో మాట్లాడిస్తా"

"కష్టంరా ఇలా అడుక్కునేవాళ్ళు మాట్లాడరు"

ముంబై యాసతో కూడిన హిందీలో మాట్లాడుకుంటున్నారు.

ఓ కుర్రాడు జోక్ చెప్పాడు. "ముగ్గురు పిల్లలు మాట్లాడుతున్నారు. ఒరేయ్ మా డాడీ పెద్ద మెజీషియన్ తెలుసా ఒక పేకముక్కల కట్టలో నుండి ఏ నెంబర్ కార్డు కావాలంటే అది తీస్తాడు అన్నాడు ఓ కుర్రాడు. మాడాడీ అంతకంటే పెద్దమెజీషియన్ తెలుసా ఒక కోడిగుడ్డును క్షణంలో మాయచేస్తాడు చెప్పాడు రెండో కుర్రాడు.

ఒరేయ్ మా డాడీ ఇంకా పేద్ద మెజీషియన్! రాత్రి పడుకోబోయేముందు నిద్రపుచ్చుతూ నా ప్రక్కన పడుకుంటాడా! తెల్లారి లేచేసరికి మా అమ్మ పక్కలో ఉంటాడు అన్నాడు మూడో కుర్రాడు. హ్హిహ్హిహ్హి"

ఆ జోక్‌కు కుర్రాళ్ళందరూ పగలబడి నవ్వారు.

గాంధీలా నిలబడిన కుర్రాడు మాత్రం నవ్వలేదు! నేను ఆలోచనలో మునిగాను. గాంధీలా నిల్చున్న కుర్రాడు ఎందుకు నవ్వలేదని కాదు నా ఆలోచన.

పదేళ్ళ వయసున్న కుర్రాళ్ళు ఒక అడల్ట్ జోక్‌కు నవ్వడం గురించి.

ఆఫ్ఘనిస్తాన్‌లో ఇంటర్ నెట్ ఉండదు, టి.విలు, సినిమాలు, షోకులు ఉండవు. ఎందుకు మమ్మల్ని ప్రపంచం అర్థం చేసుకోలేకపోతోంది.

మేమూ బంకర్‌లలో గ్రెనేడ్‌లను తలక్రింద పెట్టుకుని జోకులు చెప్పుకుంటాం.

"అసాధ్యం అనేది నా డిక్షనరీలో లేదు అన్నాడు నెపోలియన్. హింస అనేది నా డిక్షనరీలో లేదు అన్నాడు గాంధీ. కొనేటప్పుడే అన్ని పదాలు ఉన్నాయో లేవో చూసుకుని కొనాలయ్యా అన్నాడట ఒబామా"

మా జోకులన్నీ ఇలాగే ఉంటాయి.

"ఈ గాంధీ నవ్వాడురా" అని ఓ కుర్రాడు, తన జేబులో నుండి వందరూపాయల నోటు తీసి, "గాంధీ నవ్వు నవ్వితే కాదుకాదు నవ్వి, మూడు పిల్లిమొగ్గలు వేస్తే ఈ నోటు ఇస్తా" అన్నాడు.

గాంధీ కుర్రాడిలో చలనం వచ్చింది. పకపకానవ్వాడు.

అది చూసి పిల్లలు కేరింతలు కొట్టారు.

గాంధీ కుర్రాడు పిల్లిమొగ్గలు వేసి, దుమ్ము దులుపుకుంటూ చెయ్యిచాచాడు.

"హ్హిహ్హిహ్హి నేను మాటమీద ఎప్పుడూ నిలబడను" అని, వందరూపాయలు జేబులో పెట్టుకున్నాడు.

"బాబూ బాబూ మా అమ్మ జ్వరంతో పడుంది బాబూ. పనిలోకి పోలేకపోతోంది. మా నాన్న చచ్చిపోయాడు బాబూ నిజం బాబూ ఇవ్వండి బాబూ" గాంధీ కుర్రాడు, వాళ్ళ కాళ్ళావేళ్ళాబడుతున్నాడు.

నలుగురు కుర్రాళ్ళూ ఓ ఆటో ఎక్కి వెళ్ళిపోయారు.

గాంధీ కుర్రాడు ఏడుస్తూ మళ్ళీ శిల్పంలా నిలబడ్డాడు.

"దొంగనాయాళ్ళు గాంధీ గెటప్‌లో నిల్చుని అడుక్కుంటారు. బాగయ్యింది వెధవికి" నోటో ఉన్న పాన్‌పరాగ్ తుప్పుమని ఊసేస్తూ అన్నాడొకాయన.

ఇదే ఆఫ్ఘనిస్తాన్‌లో అయితే ఆ నలుగురు కుర్రాళ్ళ ప్యాంట్లలో తొండల్ని వదిలి ఉండేవాళ్ళం.

జకాత్ అంటే దానం. జకాత్ ఇవ్వడం అల్లాను ఆరాధించడంలో భాగం.

నేను వెళ్ళి ఆ కుర్రాడికి అదువందలు ఇచ్చాను. అల్లాపేరిట.

ఆ కుర్రాడు నాకాళ్ళకు మొక్కబోయాడు. బహుశా నేను చేసే పనేమిటో తెలిస్తే అదే క్రతో నా మీద దాడి చేసేవాడో నా మొహాన తుపుక్కున ఉమ్మేసేవాడో!

గాంధీ కుర్రాడు వెళ్ళిపోయాడు.

సమయం సరిగ్గా తొమ్మిదిన్నర అయింది.

మహాత్మా టిఫిన్స్ భండార్‌లో నేను అమర్చిన బాంబు పేలి ఉంటుంది.

వార్త మీడియాకు వెళ్ళుంటుంది. మావాళ్ళూ టీవీలలో చూసేందుకు సిద్ధమౌతుంటారు.

నేను సెల్‌ఫోన్‌ను నా చేతిలోనికి తీసుకున్నాను. ఆ పదినిమిషాలు నాకు ముళ్ళమీద నిలబడినట్లు ఉంది.

నేను నెంబర్ డయల్ చెయ్యసాగాను, సైకిల్‌కు తగిలించిన సంచిలో ఆర్.డి.ఎక్స్ దానికి అనుసంధానం చెయ్యబడి ఉన్న సెల్‌ఫోన్‌కు ఫోన్ వస్తే చాలు. సరూక్యూట్ క్లోజ్ అవుతుంది. బాంబు పేలుతుంది.

నెంబరు నొక్కాను.

9.ఆసుపత్రిలో ఉన్నది నా మేనత్త అయినా సరే, నా తల్లి అయినా సరే బాంబు పేలుస్తా.

8. ఆసుపత్రి అయినా, థియేటర్ అయినా, రైలు అయినా పార్కుఅయినా భారతీయులు చావాల్సిందే.

8. భారత్, అమెరికాలను ఇథియోపియా, సూడాన్‌లుగా చూడాలని ఉంది.

7. లక్షలాదిమంది ఆఫ్ఘన్‌లు రష్యన్‌ల క్రూరత్వానికి బలైతే, నోరు మెదపని అమెరికా వారి రెండు బిల్డింగులు కూలగానే తీవ్రవాదాన్ని అంతం చేస్తానని నిద్రలేచింది.

7. భయంతోనూ, భక్తితోనూ అవసరంతోనూ అమెరికాకు సహాయం చేసింది. మా పాకిస్తాన్. పాకిస్తాన్ ప్రభుత్వకార్యాలయాలను ఖబరస్తాన్‌గా మార్చేదాకా బాంబుల మోత ఆపం.

6. ఒసామా బిన్ లాడెన్ మృతికి బదులు తీర్చుకునేందుకు మా ప్రతేకదళం సిద్ధమౌతోంది. అమెరికన్ డాలర్ విలువ హ్హాహ్హాహ్హా చిల్లపెంకులతో సమానమయ్యేలా ధ్వంసం.

7. తీవ్రవాదంపై ఇండియా పోరాడుతుందా? వీళ్ళ రాజకీయ నాయకుల స్కాములను కడిగి, తోమి ఉతకడానికే వీళ్ళకు సమయం లేదు. చీల్చి చెండాడుతాం.

0. మరో వెయ్యేళ్ళు పట్టనీ ప్రపంచమంతా మా సిద్ధాంతమే ఉండాలి.

9. ఈ ఆసుపత్రిలో అమెరికన్‌లు ఉంటే బావుండును. నాకు మనశ్శాంతి దొరికేది.

0 గాంధీలాంటి ఒక్కడంటే ఒక్కడున్నా మా మసీదు కూలేదికాదు. గుజరాత్‌లో మా వాళ్ళను ఊచకోత కోసేవారు కాదు.

జీహాద్ మనసులో అనుకుని కాల్ బటన్ నొక్కబోతూ షాక్ తలిగిన కాకిలా ఆగిపోయాను. ఆసుపత్రినుండి జనం పరుగెత్తుకొస్తున్నారు. అందులో నా రెండోభార్య తమ్ముడు రఫీ కూడా ఉన్నాడు. వాడికి ఓ కాలులేదు. క్రసాయంతో కుంటుతుంటాడు.

వీడు ఇక్కడెందుకున్నాడు?

"మహాత్మా టిఫిన్ సెంటర్‌లో బాంబు పేలిందట" జనాలు అరుస్తున్నారు.

నా పెదవుల మీద చిరునవ్వు.

నేను రఫీకి కనిపించకుండా మొహం అటు తిప్పుకున్నాను.

"అరే ఏడవకు భాయ్. మీ అక్కయ్యకు ఏమీ అయ్యుండదు" ఆసుపత్రి తాలూకు వార్డ్‌బాయ్ రఫీతో అంటున్నాడు.

"మా అక్కయ్య చాలామంచిది" వాడు ఏడుస్తున్నాడు.

వాడికి ఉన్నది ఒకే అక్కయ్య. ఆమే నా రెండోభార్య. నా రుక్సానాకు ఏమవడమేమిటి?

"ఈ మధ్య ముంబైలో బాంబు పేలుళ్ళు ఎక్కువయ్యాయి బయ్యా మీ అక్కయ్యకేం కాదు." జనాలందరూ అటూఇటూ పరుగెత్తుతున్నారు.

నేను గందరగోళానికి గురయ్యాను.

"ఏమైంది?" ఎవరో అడుగుతున్నారు.

"మహాత్మా టిఫిన్ సెంటర్‌లో బాంబు పేలింది. పాపం ఆ పాకిస్తాన్ కుర్రాడి అక్కయ్య టిఫిన్‌కోసమని వెళ్ళిందట" ఇంకెవరో చెపుతున్నారు.

నా గుండెలో బాంబు పేలినట్లయ్యింది. రుక్సానా అంటే నాకెంతో ప్రేమ.

"అయినా పాకిస్తాన్ వాళ్ళు ఇక్కడికెందుకొచ్చారు?"

"ఈ మహాత్మా గుండెల ఆసుపత్రిలో పాకిస్తాన్ వాళ్ళకూ ఆపరేషన్‌లు చేస్తారు. మా డాక్టర్ విజయలక్ష్మిగారు పాతకాలం మనిషి. గాంధీగారితో చిన్నప్పుడే తిరిగిన మనిషి, అందుకేనేమో ఆపరేషన్‌లు ఫ్రీగా చేస్తుంది చెయ్యిస్తుంది. నాలుగురోజుల క్రితం రుక్సానా అని ఓ పాకిస్తానీ తన పదిహేనేళ్ళ కూతురికి గుండెలో రంధ్రం ఉందని ఆ అమ్మాయినీ, తన కుంటి తమ్ముణ్ణీ వెంటపెట్టుకొచ్చింది. నిన్ననే ఆపరేషన్ అయ్యింది."

నా కూతురు ఉజ్మాకు గుండెసమస్యా? నా చేతిలోని సెల్ ఫోన్ వణికింది.

"ఏం ఆమె పొగుడు రాలేదా?"

"పాస్‌పోర్ట్ సమస్యో, లేదా వీసా దొరకలేదో ఏదో చెప్పిందిలే. ఛ ఒక్క ఆటో లేదు. బాంబు పేలిందని తెలిసి పారిపోయుంటారు. బస్ వస్తే బావుండును"

నా శరీరం వణికింది. నా తలలోనుండి స్వేదం నాకాళ్ళలో కంపనం.

నేను గబగబా సైకిల్ దగ్గరికి వెళ్ళి సంచిని భుజాన వేసుకున్నాను. సంచిలో చెయ్యిపెట్టి ఫట్‌మని బటన్ ఆఫ్ చేసి అందులోని సెల్ ఫోన్‌నూ ఆఫ్ చేసాను.

ఆ తర్వాత గబగబా టిఫిన్ సెంటర్ వైపు పరిగెత్తాను.

పోలీసులూ, విలేఖరులు, జనాలు.

టిఫిన్ సెంటర్ మంటల్లో తగలబడుతోంది. శవాలు ఎగిరిపడున్నాయి.

కాళ్ళూ, చేతులూ, వేళ్ళూ, తలలూ, చీరలూ చొక్కాలు రక్తం.ఈ వాతావరణం మాకు మామూలే కానీ నా రుక్సానా?

ఒకచోట బల్ల దాని ప్రక్కన నాలుగు శవాలు. గాంధీ కుర్రాడిని ఏడిపించిన పిల్లలవి.

ఆటో ఎక్కి ఈ టిఫిన్ సెంటర్‌కు వచ్చినట్లున్నారు.

ఒక బెంచీ ప్రక్కన తల. రుక్సానాది.

నా మనసులో రక్తం స్రవించింది.

పావుగంట క్రితం నా తల్లి ఉన్నా బాంబుపేలుస్తా అనుకున్నది నేనేనా?

నా రుక్సానా. నేను ఇల్లు వదిలేసి నెలలతరబడి సంవత్సరాల తరబడి సంస్థ కార్యకలాపాలలో తిరుగుతుంటే నా పిల్లలను ఛా మా పిల్లలను కష్టపడి పెంచుతూ ఎన్నో అవమానాలూ, బాధలూ సహిస్తూ నా రుక్సానా.

నేను రుక్సానానూ, పిల్లలనూ చూసి రెండేళ్ళయ్యింది.

దూరంగా పోలీసులు కుక్కలు.

నేను వేగంగా వెనక్కి తిరిగి ఆసుపత్రివైపు పరుగెత్తాను.

నా కూతురు ఏ గదిలో ఉందో?

నా సెల్‌ఫోన్ మోగింది.

"హలో"

"సెప్టెంబరు పదకొండున ఏం జరిగింది?"

"కెన్యాకు క్రికెట్‌లో వరల్డ్ కప్ వచ్చింది."

"కోడ్ మ్యాచ్. ఏమయ్యింది? హాస్పటల్ ముందు బాంబు పేలలేదేం?"

"అ అదీ ఏదో టెక్నికల్ ప్రాబ్లం వచ్చింది."

"దాన్ని పదిసార్లు చెక్‌చేసాం."

"........."

"మనకు భవబంధాలు ఉండకూడదు. ఆసుపత్రిలో నీ కూతురుంది. అందుకేనా బాంబు పేల్చలేదు."

"........" నా గుండె వేగం మరింత పెరిగింది.

అంటే ఈ ఆసుపత్రిలో నా కూతురికి గుండె ఆపరేషన్ జరిగిందన్న విషయం మా సంస్థవాళ్ళకు తెలుసన్నమాట.

"నీలా ఉన్న వ్యక్తి ఫోటోను ఆ ఆసుపత్రిలో నీ భార్యా, నీ బావమరిది చూసారు. అయినా వాళ్ళు మౌనంగా ఉన్నారు. నువ్వు తీవ్రవాదివని తెలుసుగా వాళ్ళకు అందుకే. చూడు జిహాద్‌కు తల్లీ, పిల్లా, పెళ్ళాం అంటు లేదు. 46 ఏళ్ళ వయసున నీకు 28 ఏళ్ళ వయసున్న నేను జ్ఞానాన్ని బోధించడం విడ్డూరంగా లేదూ. బాంబు పేల్చి పూనే వెళ్ళిపో" ఫోన్ కట్‌అయ్యింది.

నాకు పిచ్చెక్కిపోతోంది. ఈ బాంబు పేలిస్తే బిన్‌లాడెన్ కుడిభుజం ప్రస్తుత ఆల్‌ఖాయిదా నేత ఒమర్ ఫరూకుద్దీన్ దృష్టిలో నేను గొప్పవాడినౌతాను.

నా పరిస్థితి ఘోరంగా ఉంది. కొన్ని పరిస్థితులను మాటల్లో వర్ణించలేము. అనుభవిస్తేనే తెలుస్తుంది.

ఈ బాంబు పేల్చను.

పాకిస్తానీలకు సైతం ఫ్రీగా వైద్యం చేసే ఇండియన్ ఆసుపత్రి.

ఐతే సంవత్సరాల తరబడి నేను నిర్మించుకున్న సిద్ధాంతాలు, బలమైన పునాదులు ఇలాంటి నాటకీయ పరిణామాలతో కూలిపోవు.

ఐతే అమెరికా, ఇండియా పాకిస్తాన్‌ల పై నా పోరాటం ఆగదు.

బాంబులు పేల్చను. మరో సిద్ధాంతాన్ని అన్వేషిస్తాను.

భౌవ్ భౌవ్ కుక్కల శబ్దం.

అవి ఖచ్చితంగా నన్ను పట్టుకుని తీరతాయి. నేను ఆసుపత్రి లోపలికి వెళ్ళలేదు. కుడివైపు సందులోనికి తిరిగి వేగంగా పరుగెత్తాను. సందులు గొందులు దాటి జనంలో కలిసిపోయాను.

మళ్ళీ నా ఫోన్ మోగింది.

"హలో"

"చచ్చిపోవడానికి సిద్ధంగా ఉండు" క్లిక్.

ఆపరేషన్ ఫెయిలవడానికి నేనే కారణం. రెండో బాంబు పేల్చనందుకు నా మీద క్రమశిక్షణా చర్య అన్నమాట.

నేను ఓ కూడలి దగ్గర ఆగాను.

"రఘుపతి రాఘవ రాజారాం. పతిత పావన సీతారాం.

ఈశ్వర్ అల్లా తేరేనామ్. సబ్‌కో సమ్మతి దే భగవాన్"

గాంధీజీ ఆశ్రమం నుండి పిల్లలు పాడుతున్న పాట తరంగాలలా వినిపిస్తుంది.

ఎందుకు గాంధీ ఈ రోజు నన్ను వదలడం లేదు.

నేను అటూఇటూ చూసి సంచిని ఓ చెత్తబుట్టలో వేసి, పోలీసులకు ఈ సంచి గురించి సమాచారం అందించి నా సెల్ ఫోన్ నుండి సిమ్‌కార్డు తీసేసి గాంధీజీ ఆశ్రమం వైపు వడివడిగా నడిచాను.

లోపల చాపల మీద వృద్ధులు కూర్చునివున్నారు. పిల్లలు పాట ఆపారు.

ఒక వృద్ధుడు మైకు ముందుకొచ్చి, "గాంధీజీ 1894 జులై 5న దాదాభాయ్ నౌరోజీకి ఉత్తరం వ్రాస్తూ నేనింకా చిన్నవాడిని అనుభవం చాలదు. తప్పులు చేసే అవకాశాలున్నాయ్. నేను వహించిన బాధ్యత నా సమర్థతకు మించిన వ్యవహారం ఈ పనిని నేను ఏవిధమైన ధనాపేక్ష లేకుండా చేస్తున్నానై మనవి చేస్తున్నాను. ఈ విషయమై వ్యవహారం జరపడానికి ఇనేనొక్కడినే ఉన్నాను. కావున, తాము దయచేసి నాకు తగిన సలహాలనిచ్చి నన్ను సరైన మార్గంలో నడిపిస్తే కృతజ్ఞుణ్ణి. తండ్రి సలహాలను బిడ్డ పాటించినట్లే మీ సలహాలు పాటిస్తాను అని వ్రాసారు. అంతా నాకు తెలుసు. అనే భావన గాంధీజీకి ఎప్పుడూ లేదు. ఆయన నిరంతర విద్యార్థి.

అప్పట్లోనే ఆయనను కమ్యూనిస్టులు విమర్శించారు, ఆవేశపూరితమైన యువకులు విమర్శించారు. కొన్ని సందర్భాలలో నెహ్రూ విమర్శించారు, హిందువులు విమర్శించారు, ముస్లింలు విమర్శించారు. కానీ ఆయన మాత్రం తన సత్యాహింసలను వదలలేదు.

ఈనాడు గాంధీని విమర్శించే భారతీయులే ఎక్కువ ఆయన గురించి అర్థం పర్థంలేని విమర్శలూ, వ్యాఖ్యానాలు వింటున్నా, ప్ప ఆయనను గురించి ఎంత ఎక్కువగా తెలుసుకుంటే మన అజ్ఞానం అంత ఎక్కువగా బయటపడుతుంది.

రద్దీలో రైలెక్కేప్పుడు తన ఎడమ చెప్పు పడిపోతే కేవలం ఒక్క చెప్పు ఎలా తొడుక్కుంటాడు అని తన కుడి చెప్పునూ విసిరేసి తన చెప్పులని దొరికించుకునే వాడి గురించి ఆలోచించిన గాంధీ గురించి చాటి చెప్పండి.

ముఖ్యపాత్ర పోషిస్తూ గ్రూప్ ఫోటోలలో కిందకూర్చునో వెనకబిలబడో ఫోటో దిగిన నిగర్వి గాంధీ అని అరిచి చెప్పండి! విధ్వంసంతో ఎన్ని లక్షలమందిని చంపి మీ భావాలకు అనుగుణంగా 'దేశాన్ని నడిపిస్తామ'ని పలుకుతున్నారు అని కమ్యూనిస్టులను ప్రశ్నించిన అహింసావాది గాంధీ అని విడమరచి చెప్పండి.

లక్షమంది ఆంగ్లేయులు అఖండ భారతాన్ని దాస్యంలోనికి నెడితే దాన్ని తొలగించేందుకు వందల ఏళ్ళుగా ఒక్కడూ ముందుకురాని దురవస్థ మనది అని శోకించిన వ్యక్తి గాంధీ అని చెప్పండి.

ఒక బక్కప్రాణి అహింసతో సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన చరిత్ర మనది అని ఈనాటి వారికి చెవులు తుప్పు వదిలేలా చెప్పండి.

మతోన్మాదం, తీవ్రవాదం హింసతోనో, ప్రభుఇంసతోనో మాసిపోవని గాంధీలా ఎదుర్కోవాలనీ చెపుతూనే ఉండండి"

మేముకూడా ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలు వింటుంటాం. ప్రతీవాక్యం చివర 'స్వర్గంలో నీకు సీటు దొరుకుతుంది', 'భగవంతునికి ప్రీతిపాత్రులవ్వండి', 'పవిత్రకార్యంకోసం ప్రాణాలివ్వండి' అంటు ఆ ఉపన్యాసాలు నడుస్తుంటాయి.

ఒకటి మాత్రం నిజం! మా నాయకుడు ఒసామా బిన్ లాడెన్ మరణించినా తీవ్రవాదం ఆగదు. హింస ప్రతిహింస ఆగవు. గాంధీలాంటి వ్యక్తి వస్తే కొన్నేళ్ళు దీనికి 'కామా' ఉంటుంది.

గాంధీకీ గాంధీకీ మధ్యనున్న కాలమే హింస.

హింసకూ హింసకూ బలమైన కామా గాంధీ.

దురదృష్టవశాత్తూ చరిత్రలో ఒక్కడే గాంధీ. ఉన్నా లేకపోయినా వెంటాడుతూనే ఉంటాడు.

మనం వెనక్కి తిరిగిచూడం అంతే.

నేను బయటికి వచ్చేసాను.

గాలిలో లీలగా ఏదో ధ్వని దేమిటో నాకు తెలుసు. తుపాకీ పేలిన శబ్దం దూరంనుండి.

గాంధీ ధ్యాసలో పడిన నేను రియాక్టవడంలో అరసెకను ఆలస్యం అయ్యింది.

బుల్లెట్ నా తల వెనకభాగానికి తగిలిన విషయం మాత్రమే నా చివరి జ్ఞాపకం.

●●●

# సుఖాంతం

పొత్తూరి విజయలక్ష్మి

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.

**డోర్ బెల్ మోగింది.**

వంటింట్లో కాఫీ వేడిచేసుకుంటున్న శ్రీలక్ష్మికి ఏడుపొచ్చేసింది.

ఈ ఆపదనుంచి ఎలా గట్టెక్కుతానో ఏమో? చివరికి ఆకలికి ప్రాణాలొదిలేస్తానేమో అనుకుంది. ఏమైనా సరే కాఫీ తాగి కానీ కదలను అనుకుని ఆపని పూర్తిచేసి అప్పుడు వెళ్ళి తలుపుతీసింది.

ఎదురుగుండా కొరియర్ అబ్బాయి

"ఇంట్లోనే ఉన్నారా? ఇంతసేపు చేశారేం మేడమ్ తలుపు తియ్యడానికి?" కాస్త విసుగ్గానే అడిగాడు.

"మా పన్లు మాకుంటాయి కదబ్బాయ్. మీరొచ్చి తలుపు తడతారని ఎదురుచూస్తూ కూర్చోలేం కదా!" శ్రీలక్ష్మికూడా విసుగ్గానే సమాధానం చెప్పింది.

"సర్లెండి.. సైన్ చెయ్యండి " అన్నాడు.

ఆ కాయితం అందుకోబోయిందల్లా 'ఎవరొచ్చి ఏ ఉత్తరం ఇచ్చేసి సంతకం పెట్టమన్నా హడావిడిగా సంతకాలు పెట్టకు. ఎవరి దగ్గర్నుంచి వచ్చిందో తెలుసుకుని మరీ తీసుకో' అన్న భర్త హెచ్చరిక గుర్తుకువచ్చింది.

"ఎక్కడ్నుంచి నాయనా? ఎవరు పంపించారు?" అని అడిగింది.

ఆలస్యంగా తలుపు తీసినందుకే చిరాగ్గా ఉన్న ఆ అబ్బాయి మరింత విసుగ్గా కవరు చూసి "బ్యాంక్ నుంచీ వచ్చింది" అన్నాడు.

సంతకం పెట్టి తీసుకుంది శ్రీలక్ష్మి.

అతను వెళ్ళిపోయాడు. గేటు చప్పుడు అయింది. ఎవరో ఇద్దరు వచ్చారు. "టు లెట్ బోర్డు పెట్టారు కదండీ" అంటూ అడిగారు.

"అవునండీ. పాత మోడల్ పోర్షను. శాకాహారులకీ, కుటుంబాలకి మాత్రమే ఇస్తాం. అద్దె రెండువేల అయిదొందలు." అరిగిపోయిన రికార్డులాగా సమాధానం చెప్పింది. వాళ్ళు వెళ్ళిపోయారు.

అదో పాత ఇల్లు. ఎనిమిదివందల గజాల స్థలంలో ఇల్లు. కింద రెండు వాటాలు. పైన రెండు వాటాలు. శ్రీ లక్ష్మి మామగారు నలుగురు కొడుకుల కోసం కట్టించారు. ముందు గది, హాలు, వంటిల్లు. రైలు పెట్టెల్లా వరసగా ఉంటాయి.

మిగిలిన వాళ్ళెవరూ ఇక్కడ లేరు. శ్రీలక్ష్మి, భర్త భాస్కర్, మాత్రం ఇక్కడుంటారు. ఇంటి మంచీ చెడ్డా చూస్తుంటారు. కింద ఒక భాగంలో వీళ్ళుంటారు. పక్క పోర్షన్ అద్దెకివ్వరు. పిల్లలొస్తే కావాలని వీళ్ళ కిందే ఉంచుకున్నారు. పైన రెండు వాటాలూ అద్దెకిస్తారు.

ఆ వాటాలు ఏడాదికి మూడుసార్లు ఖాళీ అయిపోతుంటాయి. సెంటర్లోనే ఉంది ఇల్లు. కానీ పాత మోడల్ పోర్షన్ కాబట్టి ఎవరూ ఇష్టపడడంలేదు. ఇంకెక్కడా దొరక్క ఇందులో చేరిపోతారు.

కనీసం ఓ ఏడాది అయినా ఉండాలి. ఈలోగా ఖాళీ చేస్తే అడ్వాన్స్ తిరిగి ఇవ్వం అని ఖచ్చితంగా చెప్తారు వీళ్ళు. అలాగే మూడేళ్ళదాకా మీరు పొమ్మన్నా పోం అని భరోసా ఇచ్చి ఇంట్లో దిగుతారు. మూడునెలలు కాగానే, ట్రాన్స్‌ఫర్ అయినదనో, పిల్లాడికి దూరం అయిపోతుందని వంక పెట్టి ఖాళీ చేసేస్తారు. ఏదో విధంగా అడ్వాన్సు రాబట్టుకుంటారు.

మళ్ళీ టూలెట్ బోర్డు పెట్టడం. తిరణాల లాగా జనం రావడం. ఇల్లు ఖాళీ అయింది కదా. ఎవరైనా అద్దెకు వచ్చాక వెళ్ళండి ఊరికి అని ఎంత చెప్పినా వినకుండా తమ్ముళ్ళని చూసొస్తానని వెళ్ళిపోయాడు భాస్కర్. శ్రీలక్ష్మి వంటరిగా వచ్చే వాళ్ళందరికీ సమాధానాలు చెప్పలేక సతమతం అయిపోతోంది.

దానికి తోడు ఏవో ఆస్థిగొడవలు. కోర్టుకీడ్చి కక్కిస్తాను అని కాలుదువ్వుతున్నాడుట రామకృష్ణ. 'ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను' అని ఏదో ఫంక్షన్‌లో అందరెదుటా సవాలు చేశాడుట..

'ఎవరు ఎన్ని చెరువుల నీళ్ళు తాగిస్తారు మేమూ చూస్తాం. చిల్లిగవ్వ ఇవ్వం' అన్నాడుట రవి. శ్రీలక్ష్మికి ఫోన్ చేసి 'వాళ్ళు నోటీసులేమైనా పంపుతారేమో నువ్వు తీసుకోకు వదినా! ఆ తెచ్చిన వాడికి ఓ పదిరూపాయలిస్తే ఇల్లు తాళం పెట్టివుందని రాసుకుని పోతాడు' అని జాగ్రత్తలు చెప్పాడు.

ఉత్తరం అయితే డబ్బాలో పడేసిపోతాడు. కానీ కొరియర్ అలాకాదు కదా! ఏ వేళప్పుడు వచ్చినా తలుపు తీసి కవరు అందుకోవాలి. పనికొచ్చేవీ పనికిరానివీ కలిసి అరడజను ఉత్తరాలొస్తాయి కొరియర్లు. ప్రతీసారీ ఎవరు పంపించారు చూసుకోవాలంటే అదో అదనపు శ్రమ. విసిగిపోతుంది శ్రీలక్ష్మి.

కంచంలో అన్నం పెట్టుకునే సరికి మళ్ళీ మోగింది డోర్ బెల్. ఈసురోమంటూ వెళ్ళి తలుపుతీసింది. 'టూలెట్ బోర్డు పెట్టారు' అంటూ బ్రోకరు కుర్రాడు కాబోలు ఓ పెద్దమనిషిని వెంటబెట్టుకుని వచ్చాడు. మళ్ళీ రూల్స్ అన్నీ చెప్పింది శ్రీలక్ష్మి.

"నా పేరు వేణు. బ్యాంక్‌లో పనిచేస్తున్నాను. శాఖాహారులమే. కుటుంబంతోనే ఉంటాను" అన్నాడతను.

"పాత పోర్షను. మీకు నచ్చుతుందో లేదో" అంది శ్రీలక్ష్మి అనుమానంగా.

"చూస్తాం" అన్నాడు బ్రోకరు కుర్రాడు. తాళం చెవులు ఇచ్చి పంపించింది.

అన్నం తిని చెయ్యికడుక్కుని వచ్చేరికి మేడమెట్లమీద కూర్చుని ఉన్నారు ఇద్దరూ. "మాకు ఇల్లు నచ్చింది. రెండు భాగాలూ నేనే తీసుకుంటాను" అన్నాడు.

శ్రీ లక్ష్మికి ప్రాణం లేచి వచ్చింది. మిగిలిన వివరాలన్నీ చెప్పింది. అడ్వాన్స్ ఇచ్చేసి 'గురువారం పొద్దున వస్తా' అని చెప్పి వెళ్ళిపోయాడు. అతని నడకలో కాస్త తేడా ఉండటం గమనించింది శ్రీలక్ష్మి.

బుధవారం నాడు ఇల్లంతా శుభ్రంగా కడిగించి ఉంచింది.

గురువారం తెల్లవారుతుండగానే తలుపు తట్టాడు వేణు. తలుపు తీసింది శ్రీలక్ష్మి.

"నా భార్య సునీత, మా అమ్మ జానకి, మా మామయ్య గోపాలం. మా అత్తగారు సుభద్ర"

అని కుటుంబ సభ్యులని పరిచయం చేశాడు. మామూలుకుటుంబాలకు భిన్నంగా ఉన్న ఆ కుటుంబం ఆశ్చర్యాన్ని కలిగించినా చిరునవ్వుతో పలకరించి ఇంటి తాళాలు ఇచ్చింది శ్రీలక్ష్మి.

కార్లో వాళ్ళొచ్చారు. వెనకాల ఓ చిన్నలారీలో సామాన్లు నలుగురైదుగురు కుర్రాళ్ళు వచ్చారు. భార్యా భర్తా ఉంటేనే రెండు పెద్ద లారీల నిండుగా సామానుంటుంది. మరి ఈ కుటుంబానికి ఇంత తక్కువ సామాన్లు ఏమిటో అనుకుంది.

లోపలికి వెళ్ళి కాఫీ కలిసి ఫ్లాస్క్‌లో పోసి సామాన్లు చేరవేస్తున్న కుర్రాడికిచ్చి పైకి పంపించింది. ఆ రోజంతా పైనుంచి చిన్న చిన్న శబ్దాలు. సాయంత్రం జానకి వచ్చి ఫ్లాస్కు ఇచ్చేసింది. "శ్రమ తీసుకుని కాఫీ పంపించారు" అంది.

"అయ్యో ఈ మాత్రం దానికేనా" అనేసింది శ్రీలక్ష్మి.

మర్నాడు తెల్లవారి బయటికి వచ్చిన శ్రీలక్ష్మి తెల్లబోయింది. ఇది తమ ఇల్లేనా అని అనుమానం వచ్చింది. ఇంటిముందు గేటుదాకా ఉన్న సిమెంటు దారి అంతా శుభ్రంగా కడిగి ముగ్గులేసి ఉన్నాయి. ఇంటి చుట్టూరా పెరిగిన పిచ్చిమొక్కలన్నీ పీకేసి పోగుపెడుతున్నారు గోపాలం, సుభద్రా, జానకి.

'అయ్యో మీకెందుకండీ శ్రమ. ' అంటే 'శ్రమేవిటండీ. మాకు సరదాగా ఉంది ఈ రోజుల్లో ఇంత ఖాళీస్థలం ఎక్కడుంటుంది. ' అన్నారు ముగ్గురూ.

వేణు భార్య సునీత స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. భార్యాభర్త ఆఫీసులకి వెళ్ళిపోగానే ఈ ముగ్గురూ రంగంలోకి దిగుతారు. ముగ్గురికీ ఏదో పని దెయ్యం ఉంది. ఏదో పని కల్పించుకుని చేస్తూనే ఉంటారు.

ముగ్గురూ చేరి ఇంటి చుట్టూ శుభ్రం చేసి చెట్లకు పాదులు చేశారు. కూరల పాదులు పెట్టారు. వాళ్ళింటికి రాకపోకలూ ఎక్కువే. ప్రతిరోజూ ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. ఆయన పేరున్న బోర్డు పెట్టి మేడమీద అని రాయబట్టి సరిపోయిందిగానీ లేకపోతే వచ్చేపోయేవాళ్ళకు సమాధానాలు చెప్పలేక సతమతం అయిపోయేదాన్ని అనుకుంది శ్రీలక్ష్మి.

వాళ్ళు మిక్సీ వాడరు. రాయి కింద వేసుకున్నారు. రుబ్బడాలు దంచడాలు జానకిగారే చేస్తూ ఉండేది. శ్రీ లక్ష్మికి కాలక్షేపం కాక ఆవిడ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేది.

'ఎవరో వచ్చినట్లున్నారు ఇందాక?' అని శ్రీలక్ష్మి అడిగితే పూర్తి వివరాలు చెపుతుంది ఆవిడ. 'వాడా? మా నర్సిమ్ములు. పాపం చిన్నతనంలోనే తండ్రిపోయాడు. తల్లీ జబ్బుమనిషి. కష్టాల్లో ఉంటే మాకు తెలిసిన రైల్వే ఆఫీసరుగారికి చెప్పి బంగళా ప్యూన్‌గా ఉద్యోగం ఇప్పించాం.'

'ఆయన సీతాపతిగారు. బతికి చెడ్డమనిషి. భార్య మెళ్ళోని రెండు పేటల గొలుసూ తాకట్టు పెట్టాడు ఏదో అవసరం వచ్చి. ఆ తాకట్టు కాస్తా వాకట్టై పోతుంటే మా తమ్ముడు ఆ డబ్బుకట్టి నగవిడిపించాడు. '

'మధ్యాహ్నం కార్లో వచ్చినాయన శ్రీధరంగారు. వాళ్ళబ్బాయి బైక్ మీద వెళుతుంటే ఎవరో గుద్దేసి పారిపోయారు. మా తమ్ముడు ఆ సమయానికి అక్కడే ఉన్నాడు. రక్తం మడుగులో పడివున్న పిల్లాడిని హాస్పిటల్ కి చేర్చాడు. బిడ్డది గట్టిప్రాణం గండం గడిచింది. వాడు ఇప్పుడు అమెరికాలో ఉన్నాడు. వచ్చేనెల పెళ్ళట. పిలవడానికొచ్చారు.' అని చెపుతూ ఉంటుంది.

వీళ్ళింటికి వచ్చిన వాళ్ళంతా వీళ్ళ వల్ల సాయం పొందిన వాళ్ళేట. అవన్నీ వింటుంటే శ్రీలక్ష్మికి అనుమానం వచ్చేది. కోతలూ గొప్పలూ కాదుకదా! అని అనుమానం వేసేది. ఓ రోజు ఆ అనుమానం పటాపంచలు అయిపోయింది.

ఆ వేళ మధ్యాహ్నం గేటు దగ్గర్నించి ఎవరో పిలినట్టు అయి బయటికి వచ్చింది శ్రీలక్ష్మి. గేటు దగ్గర ఓ ముసలి జంట. ఓ పడుచు జంట, ఇద్దరాడవాళ్ళ చంకలోనూ, ఏడాది వయసున్న మగపిల్లలు, పాప్ కార్న్ తింటూ ఓ నాలుగేళ్ళ పిల్ల. "అమ్మా! బేంకులో పనిచేసే వేణుగారుండేది ఈడనేనా? "అని అడిగింది పడుచుపిల్ల.

శ్రీలక్ష్మి సమాధానం చెప్పేలోగా పైన మనుషులెవరో కనిపించారు.

"అదుగో పెద్దమ్మ. అమ్మా బావుండావా?" అంటూ క్యూలో నిలబడ్డ భక్తులు దేవుడు కనిపించగానే పరవశించిపోయినట్లు పరవశించి చేతులెత్తి, మొక్కుతూ పరుగులెత్తుతూ మెట్లెక్కి వెళ్ళిపోయారు.

ఆ వచ్చిన వాళ్ళు రెండురోజులున్నారు. ఈ కుటుంబంలోని వాళ్ళకు తగిన వాళ్ళే. వాళ్ళూ క్షణం కూర్చోలేదు. మగవాళ్ళు ఇంటిచుట్టూ తవ్వి అంగుళం ఖాళీలేకుండా బోలెడన్ని విత్తనాలు జల్లారు. ఓ చిన్నసైజు వ్యవసాయ క్షేత్రంలా మార్చేశారు ఇంటిని. ఆడవాళ్ళూ అంతే. ఏవిటి దంచనూ చెరగనూ, ఇల్లు సర్దనూ. పిల్లలు ఆటలూ అల్లరి. మేడమీదంతా సందడే సందడి.

ఈ హడావిడంతా చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది శ్రీలక్ష్మికి. ఎవరు వీళ్ళూ అనే కుతూహలం కూడా కలిగింది. వచ్చినవారిలో పెద్దావిడ తిరగలి ముందు కూర్చుని కందులు విసురుతూ ఉంటే వెళ్ళి పక్కనే కూర్చుంది. మాటకలిపింది.

"వీళ్ళు మీకెలా పరిచయం?" అని అడిగింది.

చేస్తున్న పని ఆపేసి చేతులెత్తి దణ్ణం పెట్టింది ఆ మనిషి.

"మాపాళిటి దేవుళ్ళు అమ్మా" అని మొదలుపెట్టి చెప్పుకొచ్చింది.

ఆవిడపేరు కిట్టమ్మ. మెదక్ దగ్గర జోగిపేట పక్కన పల్లెటూరు వాళ్ళది. ఒక్కత్తే కూతురు లచ్చిమి. తమ్ముడికే ఇచ్చి పెళ్ళిచేసి ఇంట్లోనే అట్టిపెట్టుకుంది. వ్యవసాయం చేసుకుంటారు. లచ్చిమికి మొదటి కాన్పులో ఆడపిల్ల. రెండోసారి కడుపుతో ఉన్నప్పుడు కవల పిల్లలని తెలిసింది. జోగిపేటలో లేడీ డాక్టరుకి చూపించారు. ఆవిడ పర్యవేక్షణలో అంతా బాగానే ఉంది. ఎనిమిది నెలలు నిండాక, మరో పదిహేనురోజులాగి ఆపరేషన్ చేస్తాను అందట డాక్టరమ్మ.

అంతలోనే హఠాత్తుగా ముంచుకొచ్చింది. వెంటనే డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాలి. రోడ్డుమీదికి తీసుకొచ్చారు లచ్చిమిని. ఆ వేళ ఏదో బంద్ కారణంగా బస్‌లు తిరగడంలేదు కుక్కలా రోడ్లమీద తిరిగే ఆటోలు లేవు. ఏందారిరా భగవంతుడా అని భయపడుతుంటే వేణుగారి కుటుంబం కార్లోవెళుతూ వీళ్ళని చూసి ఆగారుట. జోరున వాన. విషయం తెలుసుకుని వాళ్ళు కారుదిగి వీళ్ళని జోగిపేట పంపించారు.

సమయానికి హాస్పిటల్‌కి చేరారు. డాక్టరమ్మ వెంటనే ఆపరేషన్ చేసేసింది. తల్లీ పిల్లలు క్షేమంగా ఉన్నారు. అంతా చెప్పి కళ్ళు తుడుచుకుంది కిట్టమ్మ.

"ఆ ఏడుపాయల దుర్గమ్మే వీళ్ళరూపంలో వచ్చిందమ్మా. ఆ యాదగిరి నరిసింహమ్మస్వామే వీళ్ళరూపంలో వచ్చాడు. కాకపోతే రోడ్డుపక్కన ఆగున్న మాలాటి మామూలు వాళ్ళని చూసి ఆగి వాళ్ళు కారు దిగి వానలో తడుస్తూ మమ్మల్ని కారెక్కించి పంపిస్తారా అమ్మా?" అని మరోసారి చేతులెత్తి దణ్ణం పెట్టింది.

మర్నాడు వాళ్ళంతా మొదటి పండక్కి వచ్చిన వియ్యాలవారిలా కొత్తబట్టలు కట్టుకుని శ్రీలక్ష్మికి చెప్పి వెళ్ళిపోయారు. వాళ్ళను సాగనంపి మేడమీదకి వెళ్ళబోతున్న వాళ్ళని ఆపేసింది శ్రీలక్ష్మి. "రండి కాసేపు కూర్చుని వెళుదురుగాని" అంది.

సుభద్ర, గోపాలం వెళ్ళిపోయారు జానకి మాత్రం వచ్చింది. సుభద్ర ఎప్పుడూ మాట్లాడదు. కలుపుగోరు స్వభావం కాదు. అసలా ఇంట్లో అందరూ అంతే. వాళ్ళేమో వాళ్ళగోలేమే. జానకి మాత్రమే మాములుగా ఉంటుంది.

లోపలికొచ్చి కూర్చున్నాక కాఫీ ఇచ్చింది శ్రీలక్ష్మి. "ఆ కిట్టమ్మ మిమ్మల్ని చాలా పొగిడింది. మీరు చాలాసాయం చేశారుట కదా!" అంది.

"అంతా ఆ దేవుడి దయ. సరిగ్గా ఆ వేళ్టికి అటువైపు వెళుతున్నాం. వాళ్ళు మాకారు ఆపనే లేదు. అంత వానలో చెట్టుకింద నిండు గర్భిణిని పెట్టుకుని ఎందుకున్నారా అని మా తమ్ముడికి అనుమానం వేసిందిట. కాస్త దూరం వెళ్ళిన వాళ్ళం వెనక్కి వచ్చాం. రావడం మంచిదే అయింది. సరైన సమయానికి హాస్పిటల్‌కి చేరింది లక్ష్మి. ఇంకాస్త ఆలస్యం అయివుంటే ప్రమాదం జరిగేదిట" అంది జానకి.

శ్రీలక్ష్మికి ఆశ్చర్యం వేసింది. "ఏమిటి వీళ్ళ పద్ధతి. రోజూ ఎవరో ఒకరు వాళ్ళని వెతుక్కుంటూ వస్తూనే ఉంటారు. వాళ్ళంతా వీళ్ళవల్ల ఉపకారం పొందిన వాళ్ళే. ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారం అనుకునే ఈ రోజుల్లో ఇంత పరోపకార బుద్ధి ఉండటం సాధ్యమేనా? కుటుంబంలో ఎవరో ఒకరు కాస్త ఉదారంగా ఉందామనుకున్నా మిగిలిన వాళ్ళు వెనక్కిలాగుతారు. ఇదేదో వింతగా ఉంది!" అనుకుని ఆపుకోలేక ఆవిడనే అడిగేసింది

బరువుగా నిట్టూర్చింది జానకి. "ఏం చెప్పమంటారు? అదో పెద్దకథ. నాకు ఇద్దరు తమ్ముళ్ళు పెద్దవాడు రామచంద్రుడు. వాడి భార్య సుభద్ర. రెండోవాడు గోపాలం. వాడి భార్య కాత్యాయని. చిన్నతనానే మా అమ్మానాన్నా చనిపోతే వాళ్ళిద్దరూ నా దగ్గరే పెరిగారు. మాకూ ఒక్కడే కొడుకు. మేనకోడలినే మా అబ్బాయికిచ్చి వివాహం చేశాం. వాడికి ఇద్దరు సంతానం. పెద్దది ఆడపిల్ల మైధిలి. రెండోవాడు శశాంక్.

మా అబ్బాయికి ప్రమోషన్ వచ్చిన శుభ సందర్భంలో అందరం షిరిడీ వెళ్ళాం. తిరుగు ప్రయాణంలో మా బండిని లారీ గుద్దేసింది.

స్పృహ వచ్చేసరికి హాస్పిటల్లో ఉన్నాం.

ఏక్సిడెంట్లు నా భర్త పోయారు. మా పెద్దతమ్ముడు పోయాడు. చిన్నతమ్ముడి భార్యపోయింది. మనవరాలు మనవడు పోయారు.

మా వేణుకి ఎడమకాలి పాదం తెగిపోయింది. సునీతకి రెండు ఫ్రాక్చర్లు.

ఒక్కో వార్తా పిడుగులా తెలుస్తూవుంటే తల్లడిల్లిపోయాం. దాదాపు ఆరునెలలు హాస్పిటల్లోనే ఉండాల్సి వచ్చింది. మా ముగ్గురికీ చిన్న చిన్న దెబ్బలే తగిలాయి. శారీరకంగా కోలుకున్నా మానసికంగా కోలుకోలేని దెబ్బకదా! ఎవరిని ఎవరం ఓదార్చాలి? మాకు మేమే ధైర్యం చెప్పుకున్నాం పోయినవాళ్ళు పోగా ఉన్న వాళ్ళనైనా కాపాడుకోవాలికదా! గుండెరాయి చేసుకుని జీవచ్ఛవాల్లా జీవించటం మొదలుపెట్టాం.

చెప్పానుకదా చాలా నెలలపాటు హాస్పిటల్లో ఉండిపోయామని. ఎంతమందిని చూసేవాళ్ళం. పిల్లవాడికి జబ్బుచేస్తే వైద్యం చేయించుకోలేని తల్లిదండ్రులు, తండ్రిని బతికించుకోవాలని ఆరాటపడే పేదకొడుకు. ఎన్నో కష్టాలు పడుతున్నవాళ్ళు ఎదురయ్యారు.

పోయిన వాళ్ళందరి పేరిట ఇన్సూరెన్సు డబ్బు చాలానే వచ్చింది మాకు. ఆ డబ్బులోంచి కొంచెం తీసి వాళ్ళకు ఇచ్చాం. వాళ్ళకు కలిగిన ఆనందం తృప్తీ చూసి మండిపోతున్న మా మనసులకు కాస్త శాంతి కలిగింది. ఆ బాటనే ఎంచుకున్నాం.

ఆపదలో ఉన్నవాళ్ళకు ఆర్థికంగా, శారీరకంగా, సాయం చేస్తూ ఎంతో తృప్తిపొందుతున్నాం. మా జీవితాలకి ఓ అర్థం ఏర్పడింది. పోయిన మనుషులను రప్పించుకోలేం. ఎదుట ఉన్న వాళ్ళు మనవాళ్ళు అనుకుంటున్నాం. ఏదో గడిచిపోతున్నాయి రోజులు. చాలాసేపు కూర్చున్నా! వస్తానండి మరి.'' అనేసి లేచి వెళ్ళిపోయింది జానకి.

రాయిలా ఉండిపోయిన శ్రీలక్ష్మి చాలాసేపటి తర్వాత లేచి లోపలికి వెళ్ళింది. మంచమ్మీద పడుకుంది. ఎన్నాళ్ళుగానో దాచుకున్న ఆవేదన లావాలా బయటికి వచ్చింది. గుండెలవిసిపోయేలా ఏడిచింది. మనసులోని బాధ తీరిపోయింది. మెల్లిగా లేచి పాత ఉత్తరాలు వెతికింది. అదృష్టం బాగుండి వెతుకుతున్న ఉత్తరం దొరికింది. ఎప్పుడో ఏడాది క్రిందట రాసిన ఉత్తరం అది. విప్పి చదివింది. కళ్ళనీళ్ళు జలజలారాలాయి.

ఫోన్ మోగింది. తీస్తే రవి. ''ఏమ్మా? ఏం చేస్తున్నావ్?'' అన్నాడు.

''ఏం లేదయ్యా!'' అంది.

''ఎందుకమ్మా అలావున్నావు?'' తేడా కనిపెట్టాడు. కంగారుగా అడిగాడు.

''ఏంలేదు?కాస్త జలుబు చేసింది అంతే'' చెప్పింది.

''లెటర్స్ ఏం రాలేదుగా! వాడేం ఫోన్ చెయ్యలేదుగా! చేసినా నువ్వేం బెదరకు వదినా మేమందరం ఉన్నాంగా. వాడిని ఏదో కేసుమీద జైల్లో పారేయిద్దాం'' అని చెప్పాడు. తర్వాత ఫోన్ తీసుకుని కాసేపు కబుర్లు చెప్పాడు. ''ఇంట్లో అద్దెకు దిగారు కదా! నువ్వూ రావచ్చుకదా!'' అన్నాడు.

'చూద్దాం లెండి' అంది. నిజం చెప్పాలంటే 'ఇల్లొదిలి ఎలా రాను?' అని సాకు చెపుతుంది గానీ అదో పెద్ద సమస్య కానేకాదు. గత ఏడాదిగా మనశ్శాంతిలేదు. ఏదో అలజడి.

ఆవేళంతా కలత నిద్రపోయి తెల్లవారు ఝామునే లేచింది శ్రీలక్ష్మి. స్నానం పూజ పూర్తిచేసి టిఫెన్ తిని ఆ పాత ఉత్తరం తీసుకుని ఇల్లు తాళం పెట్టి బయలుదేరింది.

రెండు బస్సులు మారి ఆకాలనీకి చేరేసరికి పదిన్నర అయింది. వెతుక్కుంటూ వెళితే ఆ ఇల్లు దొరికింది కానీ అందులో తనకు కావాలిసిన వ్యక్తులు లేరు. ఆ పక్కనున్న కిరాణా కొట్లో అడిగితే ఇల్లు మారారనీ ఫలాన చోట ఉన్నారనీ చెప్పారు. వాళ్ళే ఆటో మాట్లాడి పెట్టారు. ఆటోఎక్కి వెళ్ళింది శ్రీలక్ష్మి.

అదో టైలర్ షాపు. పక్కన తాడుకి తలిగించి ఉన్న డ్రెస్‌లూ, జాకెట్లు కింద నేలమీద పడివున్న చీరెలూ, ఫాల్స్ కుడుతూ, మిషన్లమీద జాకెట్లు కుడుతున్న అయిదుగురు ఆడవాళ్ళు. ఆ షాపు బాగా నడుస్తుందని తెలియజేస్తున్నాయి.

ఎదురుగా బల్లదగ్గర నిలబడి దీక్షగా జాకెట్లు కత్తిరిస్తున్న అమ్మాయిమీద పడింది శ్రీలక్ష్మి దృష్టి. 'చక్కని పిల్ల. అంతా తండ్రి పోలికే. ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టిన ఆడపిల్ల అని ఎంత సంబర పడిపోయామో అందరం.' గతం గుర్తు చేసుకుంటూ నిలబడి పోయిన శ్రీలక్ష్మి ఆ అమ్మాయి పలకరించేసరికి ఉలికి పడింది.

''ఏం కావాలి మేడమ్?'' వినయంగా అడిగింది ఆ అమ్మాయి. కలుక్కుమంది శ్రీలక్ష్మి మనసు.

''మిమ్మల్ని ఇక్కడ ఎప్పుడూ చూడలేదు. కొత్తగా వచ్చారా మేడమ్?'' మళ్ళీ అడిగింది. మేడమ్, మేడమ్ అంటుంటే వినలేకపోతోంది శ్రీ లక్ష్మి. సొంత బిడ్డ పరాయి వాళ్ళలాగా పలకరిస్తుంటే అంతకంటే నరకం ఇంకోటి ఉంటుందా?

నిజం చెపితే దాని పరిణామం ఎలా ఉంటుందో అని అదో భయం.

"ఏం కావాలి మేడమ్? అడ్రస్ వెతుక్కుంటున్నారా?" పనివేళ వచ్చి ఉలుకూ పలుకూ లేకుండా నిలబడిపోయిన ఆ పెద్దావిడ ప్రవర్తన అర్థంకావడంలేదు ఆ అమ్మాయికి.

శ్రీలక్ష్మికి మనసు అదుపు తప్పింది. 'హిమా' అంది మెల్లిగా.

అదిరిపడింది ఆ అమ్మాయి. సామాన్యంగా అందరూ బిందూ అనే పిలుస్తారు. ఇంట్లో వాళ్ళు మాత్రమే హిమా అనిపిలుస్తారు. చేతులో పని వదిలేసింది తేరిపార చూసింది.

"మీరు.. మీరు?" అంది తడబడుతూ.

"నేనమ్మా మీ అమ్మని. లక్ష్మి అమ్మని" చెప్పేసింది శ్రీలక్ష్మి.

నిర్ఘాంతపోయింది హిమబిందు. మరుక్షణం 'అమ్మా' అంటూ వచ్చి కావలించుకుంది.

ఆ ఒక్క క్షణం ఒక యుగంలా అనిపించిది. శ్రీ లక్ష్మి పసిబిడ్డలా గుండెలో పొదుపుకుని బావురుమంది. హిమబిందుకీ దుఃఖం ఆగలేదు.

కాసేపటికి ఇద్దరూ తేరుకున్నారు. "రా అమ్మా ఇంటికెళదాం" అని పనివాళ్ళకి చెప్పి బయలుదేరింది. ఇద్దరూ ఆటో ఎక్కారు. దారంతా కబుర్లు చెపుతూనే ఉంది హిమ.

ఇంటిముందు ఆగగానే "అమ్మా ఎవరొచ్చారో చూడు" అంటూ లోపలికి పరిగెట్టింది.

"ఎవరూ? ఎవరొచ్చారు" అంటూ బయిటికి వచ్చిన భవాని తోటికోడల్ని చూడగానే నిర్ఘాంతపోయింది.

"భవానీ ఎలా ఉన్నావే?" తనే పలకరించింది శ్రీలక్ష్మి.

"రా అక్కయ్యా ఎన్నాళ్ళైంది నిన్ను చూసి" గొంతు పూడిపోయింది భవానికి. ఆదరంగా లోపలికి తీసుకెళ్ళింది. ఒక చిన్నగది. ఒక పెద్దగది, చిన్న వంటిల్లు. గోడమీద శంకర్ ఫోటో. పూలదండ.

"నా వయసుదేగా తనుకూడా! నేనెందుకు దణ్ణం పెట్టాలిటా? ఎందుకు తన మాట వినాలిటా?" పెళ్ళై కాపురానికొచ్చిన కొత్తల్లో ప్రతి విషయంలోనూ వంతు పెట్టుకుని దెబ్బలాడే పదిహేనేళ్ళ శంకర్, 'నీ వయసుదే అయినా నీకు వదిన కదా! దాన్ని పట్టుకుని దయ్యం రాక్షసి అనొచ్చా తప్పుకదూ! ఇంకోసారలా అంటే దెబ్బలు పడిపోతాయి జాగ్రర్త' అని కోప్పడే అత్తగారు కళ్ళముందు మెదిలారు.

శ్రీలక్ష్మికి తల్లి లేదు. మేనత్త తన పెద్దకొడుకు భాస్కరానికి ఇచ్చి పెళ్ళిచేసింది. అక్కడుండి ఏం చేస్తుంది. ఇక్కడే ఉండి చదువుకుంటుంది అని పధ్నాలుగేళ్ళ పెద్దకోడల్ని తన ఇంటికి తెచ్చేసుకుంది. శ్రీలక్ష్మి, పెద్ద మరిది శంకర్ ఒకే క్లాసు. రెండోవాడు కృష్ణ, ఆఖరివాడు రవి. నలుగురూ కలిసే వేళ్ళేవారు స్కూలుకి.

భాస్కర్ కాకినాడలో ఇంజనీరింగ్ చదువుకుంటూ ఉండేవాడు.

మరుదులకీ వదినగారికీ మంచి దోస్తీ. ఇంటరుదాకా చదివి భర్తతో బందరు కాపురానికి వెళ్ళింది శ్రీలక్ష్మి. మరుదులు మాత్రం చదువులు కొనసాగించారు. శలవలు ఇస్తేచాలు అన్నయ్య దగ్గరకి పరుగులు పెట్టేవాళ్ళు తమ్ముళ్ళు ముగ్గురూ. భాస్కర్ ఆఫీసు నుంచీ రాగానే ఇంటావిడ మొరపెట్టుకునేది. "నీ భార్యా తమ్ముళ్ళూ ఏకమై ఇల్లు పీకి పందిరేస్తున్నారు నాయనా! అల్లరి భరించలేకపోతున్నాం కాస్త మందలించు" అనేది.

"వాళ్ళు చిన్నపిల్లలు. నీ బుద్ధి ఏమైంది? అని భార్యనీ ఒరే వెధవల్లారా సాయంత్రం బస్సెక్కిస్తాను. పొండి ఇంటికి" అని తమ్ముళ్ళను కోప్పడేవాడు భాస్కర్. దాంతో ఒక్కరోజు ఊరుకుని మళ్ళీ మొదలు.

వాళ్ళకీ చదువులైపోయి ఉద్యోగాల్లో చేరిపోయారు. పెళ్ళిళ్ళు అయ్యాయి. శంకరం భార్య భవాని, కృష్ణ భార్య సుధ. రవి భార్య వసుంధర. అంతా కలిసిమెలిసి ఉండేవాళ్ళు. నలుగురూ ఇంజినీర్లే. మంచి ఉద్యోగాలు. అందరూ పిల్లా పాపతో లక్షణంగా ఉన్న సమయంలో శంకర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఏదో వ్యాపారం మొదలుపెట్టాడు.

బ్రహ్మాండంగా కలిసివచ్చింది. కార్లు, స్వంత ఇల్లు, నగలు డబ్బు వైభోగం అంతా ఇంతా కాదు. దాంతో భవానికి కళ్ళు నెత్తికి ఎక్కాయి. కన్నూ మిన్నూ కానకుండా తయారైంది. అన్నదమ్ముల మధ్య చిన్నగొడవలొచ్చాయి.

ఓ నాలుగేళ్ళు ఓ వెలుగు వెలిగాడు శంకర్. మరెక్కడ తేడా వచ్చిందో కరిమింగిన వెలగపండు లాగా అయిపోయింది అతని ఐశ్వర్యం. రోడ్డున పడ్డాడు. అన్నీ అమ్ముకున్నాడు. అప్పులవాళ్ళు వచ్చి పీకలమీద కూర్చుమే పిత్రార్జితంలో తనవాటా పంచమని గొడవ మొదలుపెట్టాడు. తండ్రి అప్పటికే పోయాడు. తల్లిమాత్రం ఉంది.

ఉన్నవన్నీ పోయాయి. ఈ ఆస్థికూడా పోతే ఎట్లా అని మిలిగిన ముగ్గురి గొడవ. ఇస్తారా చస్తారా అని అతని గోల. అప్పటికప్పుడు ఇంట్లో ఓ భాగం అమ్మడం ఇష్టంలేక అవతలి వాటా ఎంతో లెక్క కట్టి మిగిలిన ముగ్గురూ కలిసి ఆ డబ్బు శంకర్‌కి ఇచ్చేశారు.

ఆ తర్వాత వాళ్ళతో రాకపోకలు పూర్తిగా మానేశాడు.

రెండు నెలలు గడిచాక హఠాత్తుగా కబురు. శంకర్ పోయాడు. చెరువులో శవం తేలింది. ప్రమాదమో, ఆత్మహత్య మరి ఆ భగవంతుడికే ఎరుక.

కర్మ స్వంత ఇంట్లోనే చేశారు. భవాని చేసిన గొడవ అంతా ఇంతాకాదు. మమ్మల్ని చూసి అందరూ కళ్ళల్లో నిప్పులు పోసుకున్నారంది. భర్త పైకి రావడం చూడలేక ఏ చేతబడో చేయించారంది. భర్త చావుకు కారణం బావగారు, మరుదులేనని దుమ్మెత్తిపోసింది. ఆ పన్నెండురోజులా నరకం చూపించింది.

ఆ మాటలు పడలేక ఎదురు తిరిగి నాలుగు దులుపుదామనుకున్న వాళ్ళు కూడా కడుపు శోకంతో కుమిలిపోతున్న తల్లిని చూసి కోపం దిగమింగుకున్నారు.

పదమూడోరోజు తెల్లవారేసరికి ప్రయాణం కట్టింది భవాని. ఇక్కడుంటే నా పిల్లల్నీ పొట్టన పెట్టుకుంటారు. అని చెప్పి పిల్లల్ని వెంట బెట్టుకుని వెళ్ళిపోయింది. అంతే ఆ తర్వాత అక్కడుందనీ గాలికబుర్లు తప్ప రాకపోకలూ లేవు. ఉత్తర ప్రత్యుత్తరాలూ లేవు. పుష్కరం గడిచిపోయింది.

హఠాత్తుగా క్రిందటేడు భవాని బావగారికి ఒక ఉత్తరం రాసింది.

అప్పట్లో తమ వాటా చాలా చవగ్గా అమ్మేశారు. ఇప్పుడు ధరలు బాగా పెరిగాయి కాబట్టి కొంత డబ్బిస్తే తనకు లాభంగా ఉంటుందని మర్యాదగానే రాసింది.

భాస్కర్ తటస్థంగా ఉండిపోయాడుగానీ కృష్ణ, రవి ససేమిరా అన్నారు. 'అప్పటి ఖరీదుని బట్టి లెక్కకట్టి ఇచ్చాం. మా దగ్గరుండి ఆ భాగం కొనుక్కోలేదు. అవసరం వచ్చింది కాబట్టి అప్పుచేసి కొన్నాం. అప్పు తీర్చడానికి తంటాలు పడ్డాం. ఇప్పుడు తగుదునమ్మా అని తయారైతే ఎట్లా?' అని మండిపడ్డారు. ఆ ఉత్తరం చింపి అవతల పడెయ్యండి అన్నారు.

చింపలేదుగానీ పక్కన పడేశారు.

ఆ వ్యవహారం అంతటితో ఆగలేదు. భవాని అన్నయ్య రామకృష్ణ తలదూర్చాడు. 'మైనర్లుండగా ఆస్థి ఎలా అమ్మారు? ఎవరు కొన్నారు? మంచిగా ఇవ్వకపోతే కోర్టుకెళతాం' అని బెదిరించాడు. 'నీ దిక్కున్న చోట చెప్పుకో' అన్నారు వాళ్ళు.

ఏడాదిగా అడపాదడపా ఏవో గొడవలు. మనశ్శాంతి కరువైపోయింది.

శ్రీలక్ష్మికి మనసు చివుక్కుమంది. పంతాలకి పోయారుగానీ ఇవ్వలేకకాదు. ఈ పిత్రార్జితం పక్కన పెడితే కృష్ణా, రవి వేరే ఇళ్ళు కట్టుకున్నారు.

పిల్లలందరూ వృద్ధిలోకి వచ్చారు. అమెరికాలో ఉన్నవాళ్ళు ఇక్కడున్నవాళ్ళు కూడా మూడు ఇళ్ళు ఆరు స్థలాలు అమర్చుకుని దర్జాగా ఉన్నారు. కానీ మీరు సర్దిచెప్పండి. వాళ్ళకి అని భర్తతో చెప్పినా ప్రయోజనం కనిపించలేదు.

"వాళ్ళంత వాళ్ళు అయ్యారు. నేనేం చెప్తాను? అయినా న్యాయంగానే మాట్లాడుతున్నారు కదా! భవానికి సాయం చెయ్యాలంటే పుట్టింటి వాళ్ళు చెయ్యలేరా?" అంటున్నాడు భాస్కర్.

శ్రీలక్ష్మికి మాత్రం బాధగానే ఉంది.

"అక్కయ్యా! మొహం కడుక్కుంటావా? భోజనం చేదాం. ఈలోగా కాస్త కాఫీ ఇవ్వనా?" భవాని మాటలకు ఇహలోకంలోకి వచ్చింది శ్రీలక్ష్మి.

"కాసేపాగి తిందాంలే" అంటే కాఫీ తెచ్చిచ్చింది.

"పిల్లలెలా ఉన్నారు? బావగారు బావున్నారా? కృష్ణా, రవీ ఎలాఉన్నారు?" అంటూ అందరి యోగక్షేమాలు అడిగింది.

సమాధానం చెప్పింది శ్రీలక్ష్మి. "మీరెలా ఉన్నారు? " అంటే చెప్పింది. కొంతకాలం అన్నదమ్ములేదో సాయం చేశారుట. తర్వాత విడిగా వచ్చేశారుట.

"పిల్లలిద్దరూ బుద్ధిమంతులే అక్కయ్యా. కిరణ్ ఇంటర్ దాకా చదివి డ్రైవింగ్ నేర్చుకున్నాడు. మొదట్లో ఒక డాక్టరు గారి దగ్గర నెలజీతానికి పనిచేసేవాడు. తర్వాత అది మానేసి మరో నలుగురైదురిని పోగేసి కార్ డ్రైవర్గా పనిచేస్తున్నాడు. బాగానే ఉంది. రోజుకి మూడు నాలుగొందలు వస్తాయి. హిమని చూశావుగా దాని షాపు బాగానే నడుస్తోంది. నెలకి పదివేలు పైగా మిగులుతోంది ఖర్చులు పోను. అప్పట్లో దాని పెళ్ళికోసం బావగారికి ఉత్తరం రాశాను. ఆ విషయం తెలిసి పిల్లలిద్దరూ కోప్పడ్డారు. మేము సెటిలయ్యాక పెళ్ళిచేసుకుంటాం అనవసరంగా వాళ్ళని ఇబ్బంది పెట్టద్దు అన్నారు. ఆలోచిస్తే నాకూ అదే అనిపించింది అందుకే మళ్ళీ ఉత్తరం రాయలేదు" అంది భవాని.

"అవును అమ్మా. అమ్మ మీకు ఉత్తరం రాసిందని మాకు తెలియదు. మీ మనసు బాధపెడితే క్షమించండి" అంది హిమ. శ్రీలక్ష్మి మనసు దహించుకుపోతుంది.

అంతలోనే వచ్చాడు కిరణ్. వీళ్ళిద్దరికంటే ఎక్కువగా ఆనందించాడు. అమ్మా అంటూ వచ్చి ఒడిలో దూరిపోయాడు.

వాళ్ళు వద్దంటున్నా, రానంటున్నా నాలుగు అక్షింతలు వేసి బయలుదేరదీసింది శ్రీలక్ష్మి. అక్కడినుంచే భర్తకు ఫోన్ చేసింది. మీ తమ్ముళ్ళనీ మరదళ్ళనీ వెంటబెట్టుకుని వెంటనే రండి మిగిలిన విషయాలు ఇక్కడ మాట్లాడుకుందాం అంది.

ఆవిడంత సీరియస్గా చెప్పిందంటే ఏదోకారణం ఉందని వెంటనే బయలుదేరి తెల్లరు ఝామున వచ్చేశారందరూ.

ఇంట్లో అడుగుపెట్టగానే భవానీని పిల్లలనీ చూసి ఆశ్చర్యపోయారు. భవాని చాలా మొహమాట పడిపోయింది. పిల్లలిద్దరూ భయం భయంగా ఉన్నారు.

అందర్నీ కూర్చోబెట్టి అంతా చెప్పింది శ్రీలక్ష్మి. "గతం గతః మీరిద్దరూ ఏం ఇవ్వద్దు. మా వాటా భవానికీ పిల్లలకీ ఇస్తాం. మా ఇద్దరికీ మాకొచ్చే పెన్షన్ చాలు. ఈ గొడవలన్నీ మర్చిపోయి కలిసి మెలిసి ఉందాం" అంది.

"ఆస్థి ఏం వద్దమ్మా. వస్తూపోతూ ఉందాం" అంది హిమ.

"అవునమ్మా! అప్పుడూ నాన్నగారు అమ్మేశారు. ఆస్థివద్దు. నేను కాస్త సెటిల్ అయ్యాక చెల్లాయ్ పెళ్ళిచేసేస్తాను. ఇలా మీ అందర్నీ మళ్ళీ కలుసుకున్నాం. ఈ తృప్తి చాలు" అన్నాడు కిరణ్.

రవికి గుండె నీరైపోయింది. "చాల్లే వేలెడు లేరు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు అంటూ పిల్లలని దగ్గరికి తీసుకున్నాడు. 'మీకోసంకాకపోతే ఎవరికిరా ఇదంతా మేను కట్టుకుపోతామా!' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు"

కలతలన్నీ పొగమంచులా కరిగిపోయాయి. డబ్బు ఎక్కువై కొన్నాళ్ళు తక్కువై కొన్నాళ్ళు అయినవారి నుండి దూరం అయిపోయిన శంకర్ కుటుంబం తనవారికి దగ్గరైంది. పోయినవాడు పోగా మిగిలిన వారందర్నీ ఒకచోట చూసుకుని శ్రీలక్ష్మి మురిసిపోయింది. పెద్దకోడలివి. ఈ కుటుంబాన్ని ఒక్కతాటి మీద నడపవలసిన బాధ్యత నీదేనమ్మా అని ఎన్నోసార్లు చెప్పిన అత్తగారి మాటలు గుర్తుకొచ్చాయి.

పిడుగు పడినా ఒకరికొకరు అండగా నిలబడి పరోపకారంలో ఆనందాన్ని వెతుక్కుంటున్న వేణు కుటుంబం శ్రీలక్ష్మి తెరిపించింది. ఒక్క వ్యక్తిని పోగొట్టుకుని ఆ సమస్య ఎదుర్కోలేక దూరమైపోయి కొట్టుకు చస్తున్న తమ పరిస్థితికి పశ్చాత్తాపం కలిగింది. పరిస్థితిని చక్కదిద్దుకుంది.

అయినవారిని ఆదుకుంటేనే ఇంత ఆనందంగా ఉంది. మరి జానకిగారు చెప్పినట్లు పరులకి సాయం చేస్తే ఇంకెంత ఆనందంగా ఉంటుందో చవిచూడాలి అనుకుంది

## అంతులేని పయనం — శిరంశెట్టి కాంతారావు

●●●

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.**

**సూర్యాపేట సజ్జల చెరువు కట్టకు ఆనుకుని దక్షిణ దిశలో** కుడివైపున చిలుకలు వాలిన చెట్టులా పిల్లల కేరింతలతో కళ, కళ్ళాడుతున్న ప్రభుత్వ పాఠశాలా, ఆ పాఠశాలకు ఆనుకుని ఎడమవైపున చితిమంటల చిటపటలతో శ్మశానవాటికా పక్కపక్కనే కనిపిస్తుంటాయి.

ఆ వైరుధ్యాన్ని జీర్ణించుకోలేని సజ్జల చెరువు తన అలల తలలను చెరువుకట్టడాల రాళ్ళకేసి బాదుకుంటుంది.

చైత్రమాసపు ఉదయపు టెండ గండు చీమ కాటులా చురుక్కుమంటుంటే నన్ను, మా బావను శ్మశానం దగ్గర దించిన ఆటోవాలా డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు.

కబ్జాల బారి నుండి కాపాడడం కోసమా అన్నట్టుగా శ్మశానం చుట్టూ కట్టిన ప్రహరీ గోడ కొత్తగా కనిపిస్తోంది.

ఆ ప్రహరీకి వాయువ్యం మూలగా పెద్ద, పెద్ద ఇనుపగేట్ల ద్వారమొకటుంది.

ఆ ద్వారానికి కుడిపక్క పాతశాల గోడనానుకుని ఓ పెద్ద రేకుల షెడ్డు తలుపులు, ద్వారబంధాలు లేకుండా వయసు ఉడిగిపోయిన ఒంటెలా వికారంగా కనిపిస్తుంది.

ఎడమ పక్క గేటునానుకుని సిమెంట్ చేసిన గోడమీద నలుపు రంగులో తాటికాయంత శావు అక్షరాలతో "వీరబాహు బ్యాగరి(కాటికాపరి) సంఘం సంప్రదించాల్సిన నెంబర్లు" అంటూ వంకరటింకరగా రాసిపెట్టిన బోర్డు ఒకటి కనిపిస్తుంది.

ఆ బోర్డును చదివిన మా బావ స్వరంలో సెల్ ఫోన్లమీద కాటికాపర్లను పిలిచే రోజులొచ్చాయన్న విస్మయమో, విచారమో అర్థంకాని భావం ఒకటి తొంగి చూస్తుంటే "ఆ నెంబర్లకు ఫోన్ చేస్తే వస్తారేమోరా" అన్నాడు.

"అంతేకావచ్చు" అనుకున్న నేను శ్మశానంలోపలికి పరికించి చూశాను.

శ్మశానవాటిక మధ్యలో ఏర్పాటు చేసిన ఎత్తైన దహన ఘట్టాలు పొగచూరి పొడలు, పొడలుగా కనిపిస్తున్నాయి. ఆ దహన ఘట్టాలకు దూరంగా ఈశాన్య మూలలో ఒక బోర్, దానిపక్కనే ఓవర్ హెడ్ ట్యాంక్, ఆ ట్యాంకు చుట్టూ గచ్చు చేసి, ఏడెనిమిది పంపులు కూడా ఏర్పాటు చేయబడి ఉన్నాయి.

"ముందసలీ షెడ్డులో ఎవరైనా ఉన్నారేమో చూద్దాం పదా" అంటూ నన్ను షెడ్డువైపుకి నడిపించాడు మా బావ.

దగ్గర కెళ్ళి షెడ్డులోపల పరికించి చూస్తే లోపలెవరో ఆడమనిషి ముఖం మీద పైట చెంగు కప్పుకుని గచ్చు నేలమీద వళ్ళు తెలియని నిద్రపోతుంది. రేకుల పైకప్పు కోసం ఉపయోగించిన ఇనుప పైపులతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరికొన్ని పైపులకూ గోడల చుట్టూ ఏర్పాటు చేసిన పెద్ద, పెద్ద చిలుక కొయ్యలకూ యాదగిరిగుట్ట గుడిలో వేళ్ళాడగట్టిన కొబ్బరికాయల మాదిరిగా తెల్లగుడ్డలో వేళ్ళాడగట్టిన వందలకొద్దీ మట్టి ముంతలు కనిపించాయి.

ఆ ముంతలకు కట్టిన తెల్లటి గుడ్డల మీద నల్లటి అక్షరాలతో ఏవో వివరాలు రాసి పెట్టి ఉన్నాయి.

పొద్దు పొద్దున్నే ఓ శ్మశానంలో అంత ఘాడంగా నిద్రపోతున్న ఆ ఆడమనిషిని, ఆ ముంతలను, ఆ షెడ్డు వాతావరణాన్ని చూసేసరికి ఒక్కసారిగా మా శరీరాలు గగుర్పొడుస్తుంటే సంబాళించుకుంటూ "ఎవరమ్మా! పడుకుంది?" అంటూ నాలుగైదు పిలుపులు పిలిచాము.

ఆఖరికి లేచి కూర్చున్న ఆ ఆడమనిషి నిద్రకళ్ళతోనే "ఏంటి?" అన్నట్టు చూసింది. ఆ చూపులో ఎదుటివాళ్ళకు అర్థంకాని ఏవో లోతులు తొంగిచూస్తున్నాయి.

నలుపు, తెలుపుతో ఉన్న జుట్టును వేలుముడి వేసుకుంది. బొట్టులేని ముఖం అక్షరం వ్రాయని పలకలా తేలగా ఉంది. చిన్న, చిన్న కళ్ళు తమ్మెలు కొంచెం పైకి లేచిన సన్నటి ముక్కు, కొంచెం ఎత్తు పళ్ళు, పాసిరంగు నేతచీరమీద, అదేరంగు జాకెట్ తొడుక్కుంది. మెడలో నల్లటి కాశీదార్మ, చేతులకు రబ్బరు గాజులు వేసుకుంది.

"సంగతేందో సెప్పకుంత నా మొకంకెల్లి గట్ల సూస్తరేంది?" చీదరించుకున్నట్టూగా అన్నదావిడ.

ఆ ఈసడింపుతో వాస్తవంలో కొచ్చిన మేము సిగ్గుపడుతూ "మా దగ్గరి బంధువొకాయన పోతే ఆ పనిమీదొచ్చాం" అంటూ విషయాన్ని క్లుప్తంగా వివరించాం.

"అగో గా గోడమీన సెల్లునెంబర్లున్నై కొట్టి సూడండ్రి. వస్తరుగాని" లోపల ఉన్నావిడ లేచి బయటకొస్తూ అంది.

"మీరు కాదా?" ఓ ఆశ్చర్యం విరుపు నా గొంతు గోడలను రాపాడుకుంటూ ప్రశ్నగా వెలికి దూసుకొచ్చింది.

"కాదు" నిర్లిప్తమైన సమాధానం.

"మరి మీరిక్కడ" సందిగ్ధంగా అడిగాడు బావ.

"వాచ్ మెన్ని" ఆమె మాటల్లో నిర్లిప్తత.

"ఒక ఆడమనిషి శ్మశానికి వాచ్‌మెనా?" అప్పటిదాకా మేమెరుగని ఒక వాస్తవం కళ్ళముందు సజీవంగా కనిపిస్తుంటే దిగ్భ్రాంతికి లోనవుతూనే సెల్ తీసి గోడమీద ఉన్న నెంబర్లలో ఒక నెంబరికి రింగ్ చేశాను.

అవతలి వ్యక్తితో మాట్లాడిన నేను ఫోన్ కట్ చేయగానే "ఏమన్నరు?" అంటూ అడిగిందావిడ.

"వస్తాం ఉండమన్నారు" సెల్ జేబులో పెట్టుకుంటూ చెప్పాను.

"వస్తర్లేగానీ అట కూర్సోండ్రి" రేకుల షెడు నీడ కింద ఉన్న పాఠశాల ప్రహరి వంక చూపిస్తూ అంది.

ఆమె చూపించిన దగ్గర ఆ పాఠశాల గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో మాలాగే వచ్చేవాళ్ళు అక్కడ కూర్చుంటారన్నట్టుగా ఆనవాలు కనిపిస్తుంటే మౌనంగా వెళ్ళి దానిమీద కూర్చున్నాం.

మాకు ఎదురుగా పచ్చిక నేల మీద తనకోసమే ఏర్పాటు చేసుకున్నట్టున్న ఓ చిన్నరాయి మీద కూర్చున్న ఆవిడ "మీదేవూరు సారూ?" అంటూ మాటల్లోకి దిగింది.

మాదేవూరో చెప్పిన నేను "మీ పేరేమిటి?" అంటూ అడిగాను.

చెరువుకట్ట మీదుగా సాగిపోతున్న జంగిలి గొడ్ల వంక చూస్తూ "సీతమ్మ" అంది.

ఆ తరువాత మరికాసేపు ఆ మాటా, ఈ మాటా మాట్లాడిన నేను "నువ్వేమనుకోనంటే నేనో మాటడుగుతాను" పాఠశాలలో నుండి వినవస్తున్న పిల్లల కేరింతలు ఆలకిస్తూ అడిగాను సీతమ్మను.

"చెప్పదగ్గ మాటైతే చెపుతా" తడుముకోకుండా అంది సీతమ్మ.

"నువ్వు చేస్తున్న పనికి, నీ పుట్టుకకు పొంతన లేదనిపిస్తుంది నిజమేనా?" అడిగాను.

"గా ముచ్చట అడగనికి అంతేసేపు పస్తాయిస్తిరి?" అంటూ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకున్న సీతమ్మ ఒక్కసారిగా ఊపిరి తీసుకుంటూ చెప్పడం మొదలుపెట్టింది.

●●●

"నాలుగొందలెనభై పున్నాలకింద ఈ సూర్యాపేట పల్లె లెక్కనే ఉండేటిది అప్పటి గ్రామ సర్పంచి సత్తెన్నారాయణ సేటూ, మా నాయినా చిన్ననాటి దోస్తులు.

మా నాయినకు పెండ్లై మేం పుట్టినంక పెద్ద రోగమొచ్చి ఒల్లు కరాబై మమ్మల్ని సాదలేక సతమతమైతుండె అగో గటువంటి సమయాన ఒకసారెందుకో సర్పంచి మా ఇంటికొచ్చిండు. మా నాయిన వంటి తీరు మా ఇంటి తీరు సూసి "అరే బ్రహ్మన్నా! ఈ రోగంతోటి నువ్వింక ఔసలి పని ఏంజేస్తవ్‌గాని మనూరి బైట కాష్టాలగడ్డన కాపలుండుపో. దానాలకు, కర్మలకు వచ్చెటోల్లకు అదో, ఇదో అర్సుకుని ఆల్లతాన పావులో, బేడో అడిగి తీసుకుంటుండు. ఇంతల నేను నీ సంగతి పంచాయితీల బెట్టించి నెలకో ఇర్వయో, పాతికో జీతం ఇచ్చేటట్టు వాచ్‌మెన్ పోస్ట్ పెట్టిస్తగాజ్జెప్పి మాకోదారి సూపించిండు.

అప్పట్నుంచి మా నాయన ఈ బొందలగడ్డ మీదనే గుడిసేస్కొని దానాలకు, కర్మలకు వచ్చేటోల్లకు కావల్సిన సౌలతులు జూసుకుంట ఉండిపోయిండు.

ఇంతల నెలకు ఇరవై రూపాయల జీతం తోటి మా నాయిన పేరు పంచాయితి లెక్కల కెక్కింది. దాంతోటి మాకు యాల్లకు నాలుగేల్లు నోట్లెకు పోబట్టినై. కాని, మా నాయన రోగం రోజు, రోజుకు ఎక్కువై నవిసి, నవిసి సచ్చిండు. మా పని మల్ల

మొదటికొచ్చింది. మమ్ములను ఎట్ల సాదాల్నో తోసుబాటుగాని మా అమ్మ ఏరే బతుకు తెరువు లేక మా నాయిన జేసిన పనే తాను చేపట్టింది.

అమ్మ ధైర్యానికి ఊరు ఇస్తుబోయింది.

అట్ల మూడొందల పున్నాలు గడ్సిపోయినై.

మేమంత పెద్దోల్లమై పెండ్లిల్లు గూడా అయిపోయినై.

నా రాత బాగాలేక ఇద్దరాడపిల్లలు కల్గినంక పనికి బోయ్యొస్త ఎడ్లబండి మీంచి బడి మా ఆయిన సచ్చిపోయిండు. దాంతోటే పిల్లలను వెంట బెట్టుకుని మల్ల పుట్టిల్లు జేరిన.

ఏండ్లు గడుస్తున్న కొద్ది ఈ ఊరు పెరిగి, పెరిగి మున్సిపాలిటైంది. ఈ బొందల గడ్డల పని పెరిగిపోయింది.

ఇంతల వయసు మీద బడ్డ మా అమ్మకు సాత్తిమి సేతగాకుంటై మూలనబడ్డప్పటి నుంచి నేనీ బొందలగడ్డ జూసుకుంట బతుకుతున్న''

●●●

'ఢాం' అంటూ ఏదో వస్తువు కిందబడి పగిలినట్టు రేకుల షెడ్డులో నుండి శబ్దం వినరావడంతో ''అయ్యో! ఎవలదో ముంత బగిలినట్టుంది'' అనుకుంటూ అప్పటిదాకా తన బ్రతుకు కథ చెప్పుకొస్తున్న సీతమ్మ వెంటనే లేచి షెడ్డులోకి దారితీసింది.

ముంత పగలడమంటే ఏమిటో అర్థం కాని మేమూ ఆమె వెనుకే లేచి వెళ్ళి షెడ్డులోకి తొంగి చూశాము.

అక్కడ షెడ్డు మధ్యలో పైపుకు వేళ్ళాడగట్టిన ముంతల్లో ఒక ముంతకు కట్టిన గుడ్డ చీకిపోయి, చీకిపోయి తెగినట్టుంది. దాంతో ముంత కాస్తా కిందబడి భళ్ళున బద్దలైపోయింది.

దారిలో షెడ్డునిండా కుండపెంకులు, బూడిద, ఎముకలు వెదజల్లినట్లుగా చిందిపడ్డాయి. వాటిని చూసిన మాకు ఆ ముంతలన్నీ అస్థికల ముంతలని అప్పుడర్థమైంది.

సీతమ్మ లోపలికి వెళ్ళిన వెంటనే ఓ మూలకున్న చేట, చీపురు అందుకుని కొంగునెత్తిన కప్పి ఆ బూడిదను, అస్థికలను, కుండపెంకులను ఒక్క దగ్గరికి ఊడ్చి చేటలోకి ఎత్తి భుజం మీద పెట్టుకుని ఎదురుగా ఉన్న సజ్జల చెరువులోకి వెళ్ళింది.

ఇంతలో..

రెండు మోటార్ సైకిళ్ళొచ్చి షెడ్డు ముందాగాయి.

వాటిమీద నుండి దిగిన నలుగురు మనుషుల్లో అందరికన్నా పెద్ద కనిపిస్తున్న తను మా వంక చూస్తూ ''పోస్జేసింది మీరేనా?'' అడీగాడు జీరగొంతుతో.

''ఔను'' వాళ్ళను పరికించి చూస్తూ అన్నాడు మా బావ.

''సీతమ్మక్కెటో పోయిందేమో?'' సీతమ్మకోసం అటూ, ఇటూ చూసిన వాళ్ళల్లో ఒకడూ అందరినీ ఉద్దేశిస్తు అన్నాడు.

''ఇప్పుడే ఆ చెరువులోకి పోయింది.'' చెయ్యిపెట్టి చూపిస్తూ అన్నాడు మా బావ.

మాటల్లోనే ఖాళీ చేటను పట్టుకుని కట్టదిగి వస్తున్న సీతమ్మను చూడగానే ఆమె చేసివస్తున్న పనేంటో? అదెంత గొప్పపనో అర్థమయ్యేసరికి మేవలు మనస్సుల్లోనే ఆమెకు అంజలి ఘటిస్తూ నిశ్శబ్దమైపోయాము.

''ఏందక్కా! ఎవరియో బొక్కలు జల్దిల గలిపోస్తున్నట్టున్నవ్‌గా'' సీతమ్మ వంక ఆప్యాయంగా జూస్తూ పలుకరించాడు వాళ్ళల్లో ఒకడు.

"ఉప్పరి రాజన్న బొక్కలు జల్దిల గలిపొస్తున్నట్టున్నవ్ గా" సీతమ్మ వంక ఆప్యాయంగా జూస్తూ పలకరించాడు వాళ్ళల్లో ఒకడు.

"ఉప్పరి రాజన్న బొక్కలు తమ్మీ!" చేటను, చీపిరిని లోపల పెట్టివస్తూ చెప్పింది సీతమ్మ.

"గదేంది?! అల్ల కొడుకులు తీస్కపోలే?" ఆశ్చర్యపోతున్నట్టుగా అన్నారు వాళ్ళు.

"యాడతమ్మీ! ఆ ముంత ఈడ గట్టిపొయ్యి నాలుగేండ్లయితుండే రాజన్న కొడుకులు, కోడల్లు ఈ కరువురోజుల్ల ఉప్పరి పన్లు జేసుకుంట ఏకానని రాజ్జెం బొయ్యింండ్రో? ఆల్లకీ ముంత మీద యాదికుందో? లేదో? ముంతగ్గట్టిన గుడ్డ సీకి, సీకి ఇయ్యాల్టిరోజున తెగిపోయింది." కాళ్ళూ చేతులు కడుక్కోవడానికి పంపు దగ్గరికి వెళుతూ అంది సీతమ్మ.

"ఔనక్కా! వొట్టి మొదనష్టపు కాలమొచ్చిపడింది. ఊర్లల్ల జనానికి బతుకు దెరువు లేక పొట్ట చేతబట్టుకొని వలసలెల్లి పోతుండ్రు." వాళ్ళల్లో అందరికన్నా పెద్దవాడు, తన గుండెలోతుల్లోని ఏ అనుభవాలు ప్రకంపనలు కదిలించాయోగాని తన మాటలను పూర్తిగా వ్యక్తం చెయ్యలేక మౌనంగా మారిపోయాడు.

"ఔతమ్మీ! దునియ అంత గట్లనే నడుస్తుంది. కష్టం చేసేటోనికి బువ్వ దొరకని రోజులొచ్చినై. జనం గోసబడ్తున్నరు. అయినా గామొచ్చట్లన్ని ఒక నాటికి వడిసేయకావుగాని, గాసార్లొచ్చి వలిసెంతసేపాయే. సంగతేందో కనుక్కోండి!" అంటూ వాళ్ళ కర్తవ్యాన్ని గుర్తుజేసింది సీతమ్మ.

"ఔనక్కా! సార్లు ఫోన్ జెయ్యంగనె జల్ది ఎల్లొస్తనే ఉంటిమి గాదు." మా ఆర్థిక స్థితి ఏమిటో అంచనా వేస్తున్నట్టుగా మా వంక పరిశీలనగా చూస్తూ అన్నాడొకడు.

కాస్సేపు తర్జన, భర్జనల తరువాత సీతమ్మ చెప్పినట్టుగా కట్టెకు, కిరోసిన్‌కి, పాడె పేర్చి సందుకు మొత్తం గలిపి ఆరువేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఆఖరున "సాయంత్రం నాలుగ్గంటలకల్లా పీనుగును తీసుకుని వచ్చేస్తాం. ఈ లోపల మీ పని మీరు పూర్తి చేసి ఉంచండి" తన జేబులోనుండి మూడువేలు తీసి, వాళ్ళకిస్తూ అన్నాడు మా బావ.

"ఇంగ మీరు బేఫికర్‌గా మీ పన్లు జేసుకుని, పీనిగను తీసుకొచ్చుకోండ్రిసారూ! మా ఏర్పాట్లు మేం చేసుకుంటాంగాని" డబ్బులు అందుకున్నవాడు భరోసా ఇస్తున్నట్లుగా మాట్లాడాడు.

అనుకున్న ప్రకారం నాలుగ్గంటలకల్లా బ్యాగరి సంఘం వాళ్ళు కూడా చితిపేర్చి మాకోసమే ఎదురుచూస్తున్నారు.

చితి పేర్చిన ఆ దహన చట్టం చుట్టూ అంతకు ముందు పడి ఉన్న చెత్తా చెదారం ఊడ్చి శుభ్రం చేసి, మోటర్ వేసి ఓవర్ హెడ్ ట్యాంక్ నిండా నీళ్ళు నింపి, పంపుల కింది గచ్చునంతా కడిగి ఉంచింది సీతమ్మ.

కన్నవాళ్ళు డాలర్లవేటలో విదేశాలకు వెళ్ళిపోగా మాలాంటి బంధువుల సహకారంతో అన్నీ ఉండి, ఏమీలేని వాడిలా వెళ్ళిపోయిన మా మేనమామ కట్టెను కట్టెలమీదికి చేర్చి నిప్పంటించగానే అప్పటిదాకా మొహమాటానికో, మొక్కుబడిగానో శవయాత్రలో పాలుపంచుకున్న మా బంధువుల్లో సగం మందికి పైగా స్నానాలు చేసి, ఇంటికెళ్ళి దీపం కూడా చూడకుండానే ఎక్కడివాళ్ళక్కడ నిశ్శబ్దంగా జారుకున్నారు.

నేనూ మా బావతో పాటు మరో నలుగురైదుగురు దగ్గరి బంధువులం కపాల మోక్షం కోసం ఎదురుచూస్తూ రేకుల షెడ్డు వెనుక గుమ్మం ఎదురుగా ఉన్న వేపచెట్టు కింద సమాధుల మీద కూర్చున్నాము.

"పదవరోజు బూడిద ఎత్తిపోసేదాకా మేం ఇటు రావాల్సిన పనిలేదుగదమ్మా!" మాకు ఎదురుగా నిలబడి చితిమంటలవైపు నిర్వికారంగా చూస్తున్న సీతమ్మను అడిగాడు మా బావ.

"ఏమో సారూ! కులానికొక రివాజుంటది. అదే బాపనోల్లో, కోమటోల్లో అయితే నిత్యకర్మలుంటై. రోజు పొద్దున్నే ఈడికొచ్చి కర్మచేసుకుని పోతంటరు. అదే సూద్దరోల్లకైతే అయ్యన్ని ఉండవు" నేరుగా మాకులమేంటే అడక్కుండానే అడిగిన సీతమ్మ లౌక్యానికి మా వాళ్ళు ముఖాముఖాలు చూసుకుని " మాకటువంటి వేమీలేవులే. పదవరోజు వచ్చి బూడిద ఎత్తిపోసి, అస్థికలు ఎత్తిపెట్టి, పక్షికేసి పోతాం" అంటూ మా పద్దతులేవో కొంతసేపు వివరించారు మావాళ్ళు.

"సరె సారూ! మీ పద్దెతెమ్మటె జరిపించురి" అన్నీవిని అణకువగా చెప్పింది సీతమ్మ.

ఇంతలో

'చిట్' మంటూ చితిలో నుండి వినబడీ, వినబడనట్టు సన్నటి సవ్వడి వినిపించింది.

ఆ వెంటనే "తలపెంక కూడా పగిలింది సారూ!" అప్పటిదాకా అందుకోసమే కాలుతున్న కాష్ఠం చుట్టూ నిల్చుని చితిమంటలను ఎగదోస్తున్న కాటికాపర్లు పంపుల దగ్గరకెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కుని మా దగ్గరికొస్తూ అన్నారు.

వాళ్ళకివ్వాల్సిన మిగతా డబ్బులిచ్చిన మా బావ సీతమ్మ వైపు తిరిగి "నీకెంతివ్వమంటావ్?" అంటూ అడిగాడు.

"నాకిప్పుడేం వద్దులే సారు! బూడిదెత్తిపోసిన్నాడిద్దుర్లే" అంది మొహమాటంగా.

"ఫర్వాలేదులే ఉంచు" అంటూ ఓ వందనోటు సీతమ్మ కందించాడు మా బావ.

ఐదున్నరదాటి పోవడంతో ఉదయం పిల్లలతో సందడిగా ఉన్న పాఠశాల ఇప్పుడు మౌనంగా మారిపోయి గుండెలోతుల్లో అదో విధమైన భీతిని రేకెత్తిస్తోంది.

ఎదురుగా ఉన్న సజ్జల చెరువు కట్టమీద సర్కార్ తుమ్మ చెట్లపైన చేరిన కొద్దిపాటి ఊరపిచ్చుకలు అదేపనిగా మొత్తుకుంటున్నాయి.

నేలతల్లి చీకటి చీరను చుట్టబెట్టుకుంటుంది.

నింగి జవ్వని మెలమెల్లగా చుక్కల కన్నులు విప్పి అప్పడప్పుడే మేల్కొంటూ కిందికి చూస్తుంది.

చితిమంటల వెలుగులో సమాధులన్నీ దీర్ఘ నిద్రపోతున్నాయి.

డబ్బులు చేతిలో పడ్డంతోనే కాటికాపర్లు నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు.

ఇక మేం కూడా బయలుదేరుతూ "నువ్వు ఇంటికి పోవా?" అడిగాము సీతమ్మను.

"లేదు సారూ! ఏడుగంటలకు ఒకలు ఆస్తులకోసమొచ్చేదుంది. అల్లియ్యాల కాశికి బోతున్నరంట అయ్యి అప్పజెప్పిందాంక ఈన్నే ఉండాల" తనకింకా ఆ రోజుకు మిగిలి ఉన్న పనేంటో వివరించిద్మి సీతమ్మ.

ఈ చీకట్లో, ఈ సమాధుల మధ్య, ఆ చితిమంటల వెలుగుల్లో ఒక స్త్రీకి ఎంతో ధైర్యం ఉంటే తప్ప సాధ్యం కాని పని అనుకుంటూ మేము వెనుదిరిగాము.

●●●

మరునాడు ఉదయం పదిగంటల సమయంలో "రాత్రి కాడు పూర్తిగా కాలిందో లేదో చూద్దాం" అనుకుని నేనూ మా బావా ఆటోలో బయలుదేరి శ్మశానానికి చేరుకున్నాం.

అప్పటికే అక్కడ సీతమ్మగాక మరికొంత మంది ఆడమగ వేపచెట్టు కింద సమాధుల దగ్గర నిలబడి ఏదో విషయం మీద చర్చించుకుంటున్నారు.

"నలభైఏండ్ల సంది ఈ బొందల గడ్డను నమ్ముకుని మా కుటుంబం బతుకుతుంది. ఇయ్యాల్టిరోజున తినే తినే అన్నమ్ల మన్నుబోస్తమంటుండ్రు ఇదేమన్నా నాయం గున్నదా?" సీతమ్మ గొంతు దుఃఖంతో పూడుకుపోతుంటే తన ఎదురుగా నిల్చున్నవాళ్ళతో అంటోంది.

"గదంత మాకు తెల్వదమ్మా! మాపెయోళ్ళు జెప్పినట్టు జేస్తున్నం. ఐనా మేం యాడాది నుంచి నీకు చెప్పకుంట వస్తనే ఉన్నం గాని నువ్వే మా మాట చెవెన బట్టలేదు? దానికి మేమేం జెయ్యాల?" తప్పంతా సీతమందేనన్నట్టు మాట్లాడసాగారు వాళ్ళు.

"మీ మాట ఏం ఇనలేదు సారూ! ఆనాడు మా అమ్మ నాయనలకు నెలకింత జీతమిచ్చుకుంట వచ్చిన పంచాయితీ నాకాడికొచ్చే తలకి జీతంలేదు, గీతం లేదు దానాల కొచ్చే వాల్లనే పదో, పరకో అడుక్కుని బతకమంటే గట్లనే బతుకుతున్నగాదు. ఇయ్యాల అదికూడా లేకుంట ఎవలకో గీబొందలగడ్డ కాంట్రాటుకిచ్చినం ఎల్లిపొమ్మంటే యాడికి బోవాల? గంత పెద్ద సర్కారోనికి నా నోటిముందటి కూడు తియ్యకుంటే ఎల్లదా? జరమీరన్నా జెప్పండ్రి బాంచన్" రెండు చేతులు కలిపి దోసిలి ఒగ్గుతూ దీనంగా ఆ మున్సిపల్ ఉద్యోగులను ప్రాధేయపడుతున్న సీతమ్మను చూస్తున్న మా గుండెలు ద్రవించిపోయాయి.

"నీకు తెల్వదమ్మా! ఇప్పుడు సర్కార్ అన్ని మున్సిపాలిటీల కరెంట్ కాష్టాలు ఏర్పాటు జెయ్యాలని ఒక పెద్ద కార్యక్రమం దీసుకుంది. ఆ కాంట్రాక్ట్‌ను కూడా ఓ పెద్ద విదేశీ కంపెనీకిచ్చింది అందుల బాగంగనే నిన్ను తీసేస్తుండ్రు" అంటూ అసలు విషయాన్ని సీతమ్మకు వివరించే ప్రయత్నం చెయ్యసాగారు.

అదే సమయానికి విద్యుదహన వాటికలను మోసుకొచ్చిన లారీలు రెండు నేరుగా వచ్చి శ్మశానం ముందర ఆగాయి.

ఆ లారీలను చూసిన సీతమ్మ, పాపం ఒక్కసారిగా దుఃఖంతో కుప్పగూలిపోయింది.

●●●

"ఏమ్రిరా రామూ! పిలిచినా పలక్కుండా అంతగా ఆలోచిస్తున్నావేంట్రా?" ఎప్పుడొచ్చాడో ఏమోగాని మా బావ వచ్చి పిలవడంతో ఒక్కసారిగా ఆలోచనల్లోనుండి బయటకొచ్చిన నేను "ఏంలేదు బావా! అదుగో అక్కడ లేబర్ వార్డ్‌లో ఊడుస్తున్నావిడ సీతమ్మలా అనిపిస్తుంటే"

"సీతమ్మలా ఏమ్రిరా? సీతమ్మే" అని మా బావ అంటున్నాడో లేదో పిలిచినట్టే సీతమ్మ మా దగ్గరికి వచ్చిద్మి.

"సీతమ్మా! నన్ను గుర్తుపట్టావా?" అంటూ పలుకరించాను.

"గుర్తుబట్టిన సారు!" చేతిలో బకెట్ కింద పెడుతూ అంది సీతమ్మ.

ఇంతలో బయటనుండి వచ్చిన నా మిత్రుడు రాఘవ హఠాత్తుగా నన్ను హాస్పిటల్లో చూసి "అరే! అమెరికా నుండి నువ్వెప్పుడొచ్చావ్‌రా?" అంటూ రెండు సంవత్సరాల తరువాత అమెరికా నుండి వచ్చిన నన్ను ఆశ్చర్యంగా పలుకరించాడు.

"మా మేనకోడలికి కొడుకు పుట్టాడని అక్క ఫోన్ చేస్తే వచ్చానా." అంటూ చెబుతుండగానే రాఘవకోసం ఎవరో రావడంతో "ఇప్పుడేవస్తానా" అంటూ పక్కకెళ్ళాడు.

అప్పటిదాకా నాతో మాట్లాడాలనుకుని నిల్చున్న సీతమ్మను చూస్తూ "మున్సిపాలిటీవాళ్ళు మళ్ళీ నీకేదైనా పని చూపించనేలేదా?" అంటూ అడిగాను.

"లేదు సారూ! ఇంగ వాళ్ళు సూపించరు అందుకే ఈడజేరిన. నారెక్కల్లో సత్తువ ఉండాలేగాని చేసేదానికి పనికేం కరువు ఏదో ఒకటి దొర్కుతనే ఉంటది, బతుకు బండి నడుస్తనే ఉంటది సారూ! " అంటూ బకెట్ తీసుకుని వెళ్ళిపోయింది సీతమ్మ.

వెళ్ళిపోతున్న సీతమ్మను చూస్తున్న నా కళ్ళముందు 'ఓ కర్మయోగి' కనిపించాడు.

●●●

**కారు మలుపు తిరిగి ఇంటిముందుకు వచ్చింది.** పచ్చటి లాన్, లాన్‌కి చివరన అంచులా వున్న బంతిపూలు అందంగా తలలూపుతున్నాయి. కారు గరాజ్‌లో పార్క్ చేసి తలుపు తీసి లోపలికి వచ్చింది కృష్ణ. వాజ్‌లోని రోజాపూలు తాజాగా ఆహ్లాదంగా వున్నాయి. గోడమీది బాపుబొమ్మ, టీవీ పక్కగా ఉన్న కొంటె కృష్ణుడు, కుండీలోని మనీప్లాంట్ ఇవాళ మరీ అందంగా కనిపిస్తున్నాయ్. సరాసరి బెడ్ రూంలోకి వెళ్ళి ఫ్రెష్ అయి తన కిష్టమైన వైట్ మీద పింక్ కలర్ ఫ్లవర్స్ ప్రింట్ చేసి ఉన్న స్కర్ట్, పింక్ టాప్ వేసుకుంది. అప్పటికి టైం ఆరవుతోంది. 'మధు ఇవాళ ఎప్పుడొస్తాడో? ' అనుకుంటూ ఫోన్ చేసింది, అవతల నుండి మెస్సేజ్. ఈ లోగా వంట చేద్దామని కిచెన్‌లోకి వెళ్ళి 'ఈ వేళ బయట తినేద్దాంలే' అనుకుంటూ బయటకు వచ్చింది కృష్ణ.

సమ్మర్ లాంగ్ ఈవినింగ్, అప్పుడే ఎండ తగ్గుముఖం పడుతోంది. ఉదయం నుండి వెయిట్ చేస్తున్న పిల్లలు సైకిళ్ళు, స్కూటర్లతో ఒక్కక్కరే బయటకు వస్తున్నారు. క్రిస్టీన్, అమేండా వాకింగ్‌కి వెళ్తూ కృష్ణను చూసి విష్ చేశారు. కుక్క పిల్లతో ఆడుతూ ఉన్న ఎదురింటి జాస్మిన్‌ను చూసి పలకరింపుగా నవ్వింది కృష్ణ. ఆ పాప సిగ్గుగా నవ్వి మళ్ళీ ఆటల్లో పడింది. 'మూడేళ్ళుంటాయేమో బొద్దుగా, రింగుల జుట్టుతో ఎంత బావుంటుందో' అనుకుంటూ మొక్కలకు నీళ్ళు పెట్టడానికి పైప్ తీసికుంది. ఈ లోగా సెల్ ఫోన్ మోగింది.

నెంబరు చూసి 'హాయ్ మధూ బయలుదేరావా? ' అడిగింది ఉత్సాహంగా.

'లేదురా ఇవాళ రిలీజ్ ఉంది లేట్ అవుతుంది, నా కోసం వెయిట్ చెయ్యకు.'

'అదికాదు ఇవాళ...'

'సారీ కృష్ణా అర్జంట్ పనుంది మళ్ళీ మాట్లాడదాం.' కృష్ణను కట్ చేస్తూ ఫోన్ పెట్టేసాడు మధు.

పైప్ కట్టేసి మెల్లగా లోపలి వెళ్ళి సోఫాలో కూర్చుంది. మధ్యాన్నం ఫోన్ వచ్చిందగ్గర్నుండీ మధు కోసం చాలా ఆత్రుతగా ఎదురు చూస్తోంది కృష్ణ. ఏం చెయ్యాలో తోచక టీవీ చూస్తూ, ఎన్నాళ్ళుగానో ఈ విషయం మధుతో ఎలా చెప్పాలో ఈ సాయంత్రం ఎలా గడపాలో అని వేసుకున్న ప్లాన్స్ ఇలా అప్‌సెట్ అవ్వడం నిరాశగా నిట్టూర్చింది. ఎలాగూ మధు రావడం లేటవుతుందిగా అనుకుంటూ ఫ్రిజ్‌లో మిగినకూరలు, రెండు చపాతీలు తీసి వేడి చేసి ప్లేటులో పెట్టుకుని టేబుల్ దగ్గర కూర్చుంది. పోనీ అమ్మతో మాట్లాడితేనో అనుకుంటూ ఫోన్ తీసికుంది.

'హలో అమ్మలూ ఏంటింత పొద్దున్నే ఫోన్ చేసావ్?'

'ఏం లేదు మధు ఇంకా రాలేదు... అందుకని' విషయం ఎలా చెప్పాలో తెలియక ఏదో చెప్పేసింది.

'సరే, అలాగయితే నాన్న వెళ్ళాక చెయ్. ఈ పూటసలే పనితెమలడంలా. '

'అలాగేలే' అంటూ ఫోన్ కట్ చేసింది. ఏమీ తినాలనిపించలేదు. బెడ్‌రూం లోకి వెళ్ళి పడుకుని పుస్తకం తెరిచింది ఏవేవో ఆలోచనలు.

●●●

నిద్రలేమితో ఎర్రబడిన కళ్ళు బలవంతంగా తెరుస్తూ టైం చూసింది కృష్ణ. 'మైగాడ్ అప్పుడే ఎనిమిదయ్యిందా?' అనుకుంటూ లేచింది కృష్ణ. మధు పక్కనే గాఢనిద్రలో ఉన్నాడు. అలసిపోయి నిద్రపోతున్న మధు మొహం పసిపిల్లాడిలా కనిపించింది. మెల్లగా చప్పుడు చేయకుండా రెస్ట్‌రూంలోకి వెళ్ళి మొహం కడుక్కుని, సీరియల్ బౌల్‌లో పెట్టుకుని ఈవేళ 'వర్క్ ఫ్రం హోం' తీసికోవాలనుకుంటూ మెయిల్ ఓపెన్ చేసింది. ఆఫీసులో ఏదో ప్రాబ్లం తప్పనిసరగా వెళ్ళాలని మెయిల్. 'అన్నీ ఒక్కసారే వస్తాయనుకుంటూ' మధు కోసం కొంచం నూడుల్స్ చేసి అతన్ని లేపకుండానే ఆఫీసుకి బయలుదేరింది. మధ్యాహ్నమవుతుండగా మధు ఫోన్ చేసాడు.

'గుడ్ మార్నింగ్ మధూ'

'నన్ను లేపకుండానే ఆఫీసుకి వెళ్ళిపోయావేం?'

'పాపం రాత్రంతా వర్క్ చేసి వుంటావ్ కదా! ఎందుకులే అని, నువ్వివాళ ఆఫీసుకెళ్ళాలా?'

'ఇంకో గంటలో ఫ్లైట్ ఉంది. డెన్వర్ వెళ్ళాలిగా మరచిపోయావా?'

'అస్సలు గుర్తే లేదు. నువ్వెళ్ళాల్సిందేనా తప్పదా?' దిగులుగా అడిగింది.

'నువ్వలా అంటే నేనసలు వెళ్ళలేను బేబీ. ఇంపార్టెంట్ కాన్ఫరెన్స్ తప్పకుండా వెళ్ళితీరాలి ఎంత త్రీ డేస్‌లో వచ్చేస్తాగా.'

'ఓకే మరి, నా మీటింగ్‌కి టైం అవుతోంది ఫ్లైట్ ల్యాండ్ అవగానే ఫోన్ చేయి.'

'బై బాబీ. ఐ లవ్ యు.'

'బై'

●●●

ఆఫీసులో పని అయ్యేప్పటికి రాత్రి అయింది. ఇంటికి వచ్చి ఫ్రెష్ అయి కాఫీ తాగి ఈ విషయం ముందుగా అమ్మకు చెప్పాలనుకుంటూ ఫోన్ చేసింది.

'ఎప్పుడు చేస్తావా అని ఎదురు చూస్తున్నా, నిన్న మళ్ళీ ఫోన్ చెయ్యలేదేం?'

'పడుకుండి పోయానమ్మా. ఏంటి కబుర్లు?'

'ఎప్పుడూ ఉండేవే. నిన్న మీ పెద్దమ్మ ఎం చేసిందో తెలుసా? ' అంటూ ఇంట్లో ఏదో గొడవ గురించి చెప్పుకుపోతూ ఉంది. ఆ ప్రవాహం ఓ అరగంటక్కానీ ఆగలేదు.

అంతా అయ్యాక కృష్ణకి ఇంకేమీ చెప్పాలనిపించలేదు 'నువ్వవన్నీ ఏం మనసులో పెట్టుకోకు. సరే అమ్మా నిద్రొస్తోంది, మళ్ళీ మాట్లాడదాం!' అంటూ ఫోన్ కట్ చేసింది.

ఉదయం నుండి పొంచి ఉన్న ఒంటరితనం మెల్లగా పక్కకు చేరింది. దాన్ని తరిమేయడానికి ఏవో టీవీ ప్రోగ్రాంస్‌తో కాలక్షేపం చేసి ఆ రాత్రిని దాటించింది.

●●●

# మధురక్షణాలు

జ్యోతిర్మయి

సాయంత్రం ఇంటి దగ్గరకు రాగానే మధు కారు చూసి మూడు రోజులుగా దాచుకున్న ఉత్సాహం నిలువెల్లా ఆవరించగా ఒక్క ఉదుటన లోపలికి వచ్చింది. మధు విశ్రాంతిగా సోఫాలో కూర్చుని లాప్ టాప్ లో ఏవో బ్రౌజ్ చేస్తున్నాడు.

'అదేంటి అప్పుడే వచ్చేశావ్? రేపు కదా నీ ఫ్లైట్?' అంటూ పక్కన కూర్చుంది.

'నువ్వు వెళ్ళాలా? అని దిగులుగా అడిగావుగా అందుకే త్వరగా వచ్చేసాను' అన్నాడు దగ్గరకు తీసుకుంటూ.

'నీ కోసం ఎంత ఎదురు చూసానో తెలుసా!?' అంది మధు గుండెల్లో ఒదిగిపోతూ.

ఈ లోగా ఫోన్ మోగింది. మధు ఫోన్ తీసుకుంటూ నంబెర్ చూసాడు. 'అన్నయ్య ఫోన్.. నువ్వు త్వరగా ఫ్రెష్ అయిరా డిన్నర్ కి బయటకెళదాం' అన్నాడు మధు.

'జస్ట్ ఫైవ్ మినిట్స్' హుషారుగా బెడ్ రూంలో దూరింది మధు. రెడీ అయి తనకిష్టమైన ఎస్టీ లాడర్ స్ప్రే చేసికుంటుండగా కంగారుగా మధు గొంతు వినిపించింది.

'డాక్టర్ గారు ఏమన్నారు? '

'.....'

'కంగారేమీ లేదుగా? '

'.....'

'అమ్మెలా ఉంది? '

'.....'

'మేము వెంటనే వచ్చేస్తాము.'

'.....'

'అలాగే ఓ గంట తరువాత ఫోన్ చేస్తాను.'

విషయం అర్థం గాక అయోమయంగా చూస్తూ 'ఏమిటి అత్తయ్యగారికి ఏం అయింది? ' అడిగింది కృష్ణ.

'అమ్మకి కాదు నాన్నకి రాత్రి స్ట్రోక్ వచ్చిందంట డాక్టర్ స్టంట్ వెయ్యాలంటున్నారట. ఇప్పుడు నాన్న 'ఐసియు'లో ఉన్నారట.'

'మరి వెంటనే టికెట్స్ చూడు, నీకు ఆఫీసులో లీవ్ దొరుకుతుందా?'

'లేదు ఇండియా నుండి వర్క్ చెయ్యొచ్చు.' అంటూ టికెట్స్ చూడడం మొదలుపెట్టాడు.

'ఇప్పుడేమన్నా సర్జరీ చేయ్యాలట్నా? ' అడిగింది కృష్ణ.

'అక్కర్లేదట అంత ప్రమాదం ఏమీ లేదన్నారట అన్నాడు మధు.'

'మధూ మన గ్రీన్ కార్డు ఇప్పుడు స్టేజి 3లో వుంది కదా. మనం ఇప్పుడు వెళ్ళాలంటే అడ్వాన్స్ పెరోల్ తీసికోవాలేమో?' సందేహం వెలిబుచ్చింది కృష్ణ.

ఒక్కసారిగా నిస్పృహ ఆవహించింది, లాప్ టాప్ మూసి పక్కన పెడుతూ, 'నాకా విషయమే గుర్తు రాలేదు. ఇప్పుడెలా?' తనలో తాననుకున్నట్లు మెల్లగా అన్నాడు మధు.

'డాక్టర్ గారు ఫరవాలేదన్నారుగా. పైగా మూడు నెల్ల క్రితం మా మామయ్యక్కూడా ఇలాగే బాగాలేకపోతే స్టంట్ వేసారుగా, ఇప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. రేపుదయం పర్మిషన్‌కి అప్లై చేసి వెంటనే వెళదాం. సరేనా?' అనునయంగా అంది కృష్ణ.

'అలాగే ఇంకా చేసేదేం ఉందీ' అని దిగులుగా కూచున్నాడు.

మధు ఎంత వద్దన్నా కొంచెం అన్నం కలిపి బలవంతంగా తినిపించింది కృష్ణ. ఆ రాత్రంతా మధు వాళ్ళ నాన్నగారి గురించి, ఆయనతో తనకున్న అనుబంధం గురించి కృష్ణకు చెపుతూనే ఉన్నాడు.

పెర్మిషన్‌కు అప్లై చేస్తే ఓ వారం దాకా రాదని తెలిసింది. ఏం చెయ్యాలో తోచలేదు. అప్పటికి మధు వాళ్ళ నాన్నగారికి స్టంట్ వెయ్యడం పూర్తయ్యింది. ఆయన మధుతో మాట్లాడి ప్రయాణాన్ని వారించాడు. ఆ తరువాత ఓ వారానికి వాళ్ళ నాన్నగారు ఇంటికి వచ్చాక్కాని మధు మామూలు మనిషి కాలేకపోయాడు.

●●●

శనివారం పొద్దున లేస్తూనే నాన్న ఆరోగ్యం గురించి కనుక్కుని కిచెన్ లోకి వచ్చాడు మధు.

మధు కిచెన్ టేబుల్ దగ్గర కూచుని మౌనంగా బయటకు చూస్తూ ఉంది.

'ఈ మధ్య కృష్ణ ఎందుకో డల్ గా ఉంటోంది. ఏమై ఉంటుంది?' అనుకుంటూ, 'బయటకు వెళ్ళి చాలా రోజులైంది కృష్ణా, ఎక్కడికైనా వెళదామా?' అడిగాడు మధు.

కృష్ణ లేచి ఫ్రిజ్‌లో మిల్క్ కాన్ బయటకు తీస్తూ, 'ఎక్కడి కెళదాం?' అంది.

'స్మోకీస్‌కి వెళదాం ఫాల్ కలర్స్ చూడొచ్చు' అన్నాడు కాఫీ పౌడర్ తీస్తూ...

అలాగే అంటూ మౌనంగా తలూపింది.

కృష్ణకు సైట్ సీయింగ్ అంటే చాలా ఇష్టం. ఎప్పుడైనా 'బయటకు వెళ్దాం' అంటే యెగిరి గంతేసేది. 'ఒంట్లో బాగాలేదా?' అనడిగాడు కృష్ణ.

'బాగానే ఉంది' అంటూ కళ్ళలో తడి కనపడనీయకునా కాఫీ కలిపే నెపంతో తల వంచుకుంది.

'సరే అయితే నేను స్నాక్స్ అవీ పెడతాను' అంటూ లేచి పాంట్రి తలుపు తెరిచాడు మధు. కావలసినవి ఒక్కటొక్కటే బయటకు తీస్తున్నాడు. అప్పుడు కనిపించింది ప్రీనాటల్స్ డబ్బా, ఆశ్చర్యంగా చేతిలోకి తీసికుని, సాలోచనగా కృష్ణ వైపు చూసాడు. కృష్ణ కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూ కనిపించింది.

జరిగినదేమిటో మధుకు అర్థమయ్యింది. మెల్లగా వచ్చి కృష్ణ ఎదురుగా నిలబడి దగ్గరకు తీసికున్నాడు. కృష్ణ కళ్ళలో దాచుకున్న తడి మధు ఎదను తడిపేసింది

# గొప్పదొంగ

డా.మృదులాంజలి

**కుకూ్కా....కుకూ్కా....**

గోడమీద ఉన్న కుక్కూ క్లాక్ పలికింది.

చేతిలోని ఆఖరి షాంపైన్ గ్లాసు తుడిచి దాని ప్లేసులో పెట్టేసాడు వాసు.

చివరిసారి బార్ టాప్ గుడ్డతో తుడుస్తూ చుట్టూ చూసాడు.

నిశ్శబ్దంగా, చిరు వెలుతురలలో విచిత్రంగా ఉంది పబ్.

ఒక గంట క్రితం వరకు మ్యూజిక్‌తో, ఆట పాటలతో, యువతీయువకుల కేరింతలతో దద్దరిల్లిన ప్రదేశం అదేనంటే ఎవరూ నమ్మరు!

పనిలో చేరిన క్రొత్తలో వాసుకి తలనొప్పి వచ్చేది, కాని క్రమంగా అలవాటయ్యింది.

మధ్య తరగతికి, పేదరికానికి మధ్యస్తంగా ఉండే కుటుంబంనుండి వచ్చిన వాసుకి, అక్కడి వాతావరణం వింతగా ఉండేది.

ఎక్కువగా టీనేజి పిల్లలు, కొంతమంది పెద్దవాళ్ళు చేరి, తిని త్రాగుతూ, విలాసంగా అంతసేపు గడపటం ఆశ్చర్యంగా ఉండేది.

ముఖ్యంగా వాళ్ళంతా డబ్బంటే లెక్కలేనట్లు ఖర్చు చేయడం చూస్తుంటే మతి పోయేది.

కాని ఈ రెండేళ్ళలో అందరిని పుస్తకాల్లా చదివేసాడు వాసు.

"గుడ్ నైట్ బాస్ " కౌంటర్‌లో లెక్కలు చూసుకుంటున్న డేవిడ్‌కి చెప్పి డోర్ కేసి నడిచాడు.

డేవిడ్ అక్కడ సూపర్ వైజర్‌గా చాలాకాలంగా చేస్తున్నాడు.

"వాసు.. వెయిట్ " డేవిడ్ పిలిచాడు.

వాసు ఆగి అతనికేసి చూసాడు.

"రేపు పార్టీ ఉంది, చేస్తావా ?" డేవిడ్ అడిగాడు.

వాసు ఉదయం పూట కాలేజి అటెండ్ అవుతాడని డేవిడ్‌కి తెలుసు.

వాసు ఏమి అనలేదు, ఆలోచిస్తున్నాడు.

పార్టీ అంటే ఎక్కువ టైం ఉండాలి, కాని టిప్స్ బాగుంటాయి.

అసలే ఎగ్జామ్స్ టైం, కొంచెం డబ్బుతో అవసరం ఉంది.

ఇంకా చెల్లి కూడా బుక్స్ కొనాలంటుంది.

అమ్మకి కూడా కొన్ని అవసరాలకి పనికొస్తాది.

అన్ని ఆలోచించుకొని "వస్తాను" చెప్పాడు వాసు.

"గుడ్ సిటీలో బిగ్ షాట్ జిబికె కొడుకు బర్త్‌డే పార్టీ, యూత్, పెద్దలు కూడా ఉంటారు." టిప్స్ బాగుంటాయి అన్న విషయం చెప్పకనే చెప్పాడు డేవిడ్

డేవిడ్‌లో నచ్చేది అదే వాసుకి, ఎప్పుడు ఎవరిని చులకన చేయడు. వాళ్ళ అవసరాలని బట్టి సలహాలు ఇస్తుంటాడు.

"ఒకే, ఏ టైం కి రావాలి ?" అడిగాడు.

"మామూలు టైం చాలు. అందరు చేరేసరికి లేట్ అవుతాది. వర్కింగ్ డే కదా!"

"ఒకే. బై " వాసు బైటికి నడిచాడు.

పబ్ బైట కూడా సందడి లేదు. పార్కింగ్ పూర్తిగా ఖాళీ అయిపోయింది.

ఓనర్ స్కోడా కార్, ఇంకా రెండు బైక్‌లు మాత్రమే ఉన్నాయి.

సన్నగా మబ్బు పట్టిన ఆకాశం అప్పుడప్పుడూ చినుకులు విదిలిస్తుంది.

ఏదో పాత పాటలో, " పూలవాన కురియాలి" అన్న మాట గొర్తొచ్చింది.

ఎవరో అపుడపుడు పూలు విసురుతున్నట్లే చినుకులు పడుతున్నాయి.

ఇలా వాతావరణం ఆస్వాదిస్తూ వెళితే తెల్లారుతుంది అనుకుంటూ నడక వేగం పెంచాడు వాసు.

పబ్ నుండి ఇంటికి రెండు కిలో మీటర్లు దూరం ఉంటాది, కాని ఆ టైంలో సిటి బస్ గాని, ఆటో గాని ఉండవు.

మిగతా వాళ్ళంతా బైక్ మీద వస్తారు, కాని తన ఇంటి వైపు వెళ్ళే వాళ్ళు లేరు.

మరీ లేట్ అయితే ఎవరో ఒకరు డ్రాప్ చేస్తారు, కాని రోజూ నడవడమే వాసుకి ఇష్టం.

వాన పెద్దది కాకముందే ఇల్లు చేరాలి అనుకుంటూ నడక వేగం పెంచాడు వాసు.

●●●

"కొంచెం అన్నం పెట్టుకుని మజ్జిగ వేసుకో నాన్నా," అమ్మ ఎదురుగా కూర్చుని పెడుతుంటే తింటున్నాడు.

ఉన్న ఒక గదిలో ఒక ప్రక్కగా చాప మీద చెల్లి మాలతి నిద్రపోతోంది.

దగ్గరలోని గవర్నమెంట్ స్కూల్లో పది చదువుతోంది.

దానికి అయిదేళ్ళ వయసులో నాన్న చనిపోయాడు. నాన్నతో గడిపిన గుర్తులు కూడా లేవు.

దాని ఉద్దేశంలో ఏమన్నా కావాలంటే వాసూనే తేవాలి. ఇంటి పెద్ద అంటే వాసూనే !

పదోతరగతికి ఆల్ ఇన్ ఒన్ అని పుస్తకం ఉంటుంది, తెమ్మని చాలారోజులుగా అడుగుతోంది.

వాసు ఒక రోజు బుక్ షాప్‌కి వెళ్ళాడు, కాని ఆ బుక్ ధర అయిదు వందల చిల్లర అనేసరికి వెనక్కి వచ్చేసాడు.

రోజూ మాలతి అడుగుతోంది, షాపుల్లో దొరకటం లేదు అని తప్పించుకుంటున్నాడు.

అందరికి దొరుకుతుంది, నీకే ఎందుకు దొరకదు అని దెబ్బలాడతోంది.

అంతమటుకు వాసు వచ్చే వేళకి నిద్రపోతుంది కాబట్టి, వాసు ఊపిరి తీసుకోగలుగుతున్నాడు.

రేపు పార్టీ తరవాత తప్పక కొనిపెట్టాలి అనుకున్నాడు.

"నీకు ఏదో కార్డు ముక్క వచ్చిందిరా" గిన్నెలు సర్దుతూ అమ్మ చెప్పింది.

దేవుడి గూట్లో పెట్టి ఉన్న పోస్టల్ కార్డ్ తీసి చదివాడు.

పరీక్ష ఫీజు కట్టడానికి లాస్ట్ డేట్ గురించి. మరో రెండు రోజులే ఉంది.

" ఏమటి అది? " అమ్మ అడిగింది.

" పరీక్ష ఫీజు గురించి " చెపుతూ కార్డు మరల దేవుడి బొమ్మ పక్కన పెట్టేసాడు.

"మాలతి పుస్తకం గురించి మళ్ళీ అడిగిందిరా, అటు కిరాణా షాపు వాడు కూడా రెండు వేలు అవుతూంది, ఏమన్న డబ్బు కడితేనే సరుకులు ఇచ్చేది అంటున్నాడు. ఇంటి వోనర్ కూడా వచ్చి వెళ్ళాడు. " మాట్లాడుతూనే అమ్మ మూలనున్న చెక్క బీరువా తీసి, చీరల మడతల్లోంచి చిన్న గుడ్డ మూట తీసింది.

ఆ మూట ఏమిటో వాసుకి తెలుసు.

పార్వతమ్మ పెళ్ళికి ఆమె ఇంటి వాళ్ళు పెట్టిన జత గాజులు, జత చెవి దుద్దులు, ఒక ఉంగరం ఇంకా మంగళసూత్రాల గొలుసు.

భర్తకి హార్ట్ అటాక్ వచ్చినపుడు గాజులు అమ్మింది.

వాసుకి కాలేజి అడ్మిషన్ అపుడు చెవులవి అమ్మింది.

ఇక మిగిలింది సూత్రాల గొలుసు, చిన్న రింగు.

ఇప్పుడు మళ్ళ ఆవిడ ఆ మూట చేతిలోకి తీసుకుంటే వాసుకి గుండె పిండి నట్టయ్యింది.

"రేపు పార్టీ ఉందమ్మ, యెల్లుండికి అన్ని కట్టేస్తాను "

వాసు మాటలు వినపడనట్టే పార్వతమ్మ మూట విప్పింది.

"అన్ని ఖర్చులకి చాలవురా ! పాపం దానికి ఆ పుస్తకం కొని పెట్టు. కిరాణా కొట్లో కొంత కట్టు. రేపు ఇది అమ్మితే కొంత కలిసొస్తుంది." మాట్లాడుతూనే ఉంగరం పాత బ్రష్‌తో రుద్ది , చిటికెడు పసుపుతో మెరుగు పెట్టింది.

వాసు మనసు బాధతో మెలి తిరుగుతోంది కాని తప్పదు. ఎంత బాగా టిప్పులు వచ్చినా ఈ ఖర్చులన్నిటికి చాలవు.

మౌనంగా అమ్మ ఇచ్చిన ఉంగరం తీసికొని తన చిటికెన వేలుకి పెట్టుకున్నాడు.

ప్యూర్ గోల్డ్ ఉంగరం, చిన్న పువ్వులాంటి డిజైన్ చెక్కి ఉంది.

పార్వతమ్మ మిగతా వస్తువులు మరల లోపల సర్దింది.

"పడుకో, బాగా పొద్దు పోయింది " కొడుక్కి చెప్పి, వెళ్ళి కూతురి పక్కన నడుం వాల్చింది.

వాసు అసలు ఇవాళ కొంత సేపు చదవాలని అనుకున్నాడు, కాని ఈ సంగతులన్నిటితో మనసు వికలం అయ్యింది.

లైటు ఆర్పి మంచం మీద వాలాడు.

ఇంచుమించు తెల్లవారుతుందనగా చిన్నగా కునుకు పట్టింది.

●●●

"శ్రీనివాస్, ఆర్ యు లిసెనింగ్ టు మి ?" గంభీరంగ సాగుతున్న లెక్చర్ ఆపి అడిగాడు అక్కౌంట్స్ లెక్చరర్.

ఏదో ఆలోచనలలో ఉన్న వాసు ఉలిక్కి పడ్డాడు.

"యస్ సర్ "

"పే అటెన్షన్" మరల పాఠం చెప్పసాగాడు.

కష్టపడే తత్వం ఉన్న వాసు అంటే కాలేజీలో అందరికి ఇష్టమే !

సరిగా నిద్ర, చదివే సమయం లేకపోయినా, అన్ని సదుపాయాలు ఉన్న చాలా మందికన్నా మంచిమార్కులు తెచ్చుకుంటాడు వాసు.

బోర్డు మీద ఉన్న లెక్క మీద మనసు పెట్టే ప్రయత్నం చేసాడు వాసు కాని వేలికున్న అమ్మ ఉంగరం తన బాధ్యతలను పదేపదే గుర్తు చేస్తుంటే, మనసు లగ్నం కావట్లేదు.

మూడున్నరకి క్లాసు వదలగనే బయట పడ్డాడు.

"వాసు, కామర్సు నోట్స్ అడిగావుకదా, " అంటూ మురళి వచ్చాడు.

"థాంక్స్‌రా, ఎప్పుడివ్వనూ ?"

"అంత అర్జెంట్ ఏమీ లేదు, నీవు రాయడం అయ్యాకనే ఇవ్వు" మురళి అన్నాడు.

ఇద్దరు కలిసి అడుగులు వేస్తున్నారు.

"పబ్‌కేనా ?"

"లేదురా, మార్వాడి కొట్టుకెళ్ళాలి " వేలికున్న ఉంగరం చూపుతూ చెప్పాడు వాసు.

"మళ్ళీ ఏమిటి ?"

"మామూలే, ఇంటి ఖర్చులు, పుస్తకాలు, ఫీజులు" నిర్వేదంగా అన్నాడు వాసు.

"పద, నేను వస్తాను" మిత్రులిద్దరూ బజారు కేసి నడవసాగారు.

మురళి వాసుకన్న కొద్దిగానే మెరుగైన స్థితిలో ఉన్నాడు, కాని సహాయం చేయలేకపోతున్నానని బాధ.

అదృష్టమో, దురదృష్టమో ఎప్పుడూ వెళ్ళే చమన్ లాల్ షాపు మూసి ఉంది.

అటు ఇటు చూసి పక్కనున్న మరో షాపు లోకి వెళ్ళారు.

"వెల్ కం సర్, ఏమి చూస్తారు ?" మర్యాదగ ఆహ్వానించాడు సేల్స్‌మేన్.

వాసు తడబడ్డాడు.

మురళి అందుకొని "ఇవ్వాళ గోల్డ్ రేటెంత ?" అడిగాడు.

"పద్దెనిమిది యాభై సర్, ఏమి చూపించమంటారు, చైన్స్ కొత్త వెరైటి వచ్చాయి. చూస్తారా ?" గబగబ కౌంటర్ మీద వెల్వెట్ గుడ్డ వేస్తూ అడిగాడు.

"ఓహో, రేటు బాగానే ఉంది. అయితే ఈ ఉంగరం ఎంత ఉంటుంది ?" కాజువల్‌గా అడిగినట్టు అడిగాడు మురళి.

బాక్సులలోంచి గొలుసులు తీసి సర్దబోతున్న సేల్స్‌మేన్ అనుమానంగా చూసాడు.

"వెయిట్ బట్టి సర్, " అతని గొంతులో మార్పు స్పష్టంగా తెలుస్తుంది.

"వెయిట్ చూసి ఎంత రేటు ఉంటుందో చెప్పు " మురళి చెప్పాడు.

అతను తల ఊపి, వాసు ఇచ్చిన ఉంగరం తీసుకున్నాడు.

తరవాత తీరుబడిగా కౌంటర్ సర్ది, కాష్ దగ్గర ఉన్న వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు.

వాళ్ళిద్దరూ తలలు దగ్గరకి చేర్చి మాట్లాడుతూ, అనుమానంగా తమవైపు చూస్తుంటే వాసుకి తలకొట్టేసినట్లుంది.

పది నిమిషాల తరువాత సేల్స్‌మేన్ తిరిగి వచ్చాడు.

"తొమ్మిది వందలు వస్తుంది" నిర్లక్ష్యంగా చెపుతూ ఉంగరం వాసు చేతిలో పెట్టాడు.

అవాక్కయ్యారు మిత్రులు.

"అంత తక్కువా?"

"ఎక్కడినుండి తెచ్చారు ?" కొద్దిగా హేళన నిండిన గొంతుతో అడిగాడు.

స్వరున లేచిన కోపాన్ని అదిమిపెట్టి షాపు బయటకు నడిచారు.

"మరీ అంత తక్కువ చెపుతున్నాడేమిట్రా ?" నిస్పృహగా అన్నాడు వాసు.

"అంతేరా, మనం కొనాలంటే ఎక్కువ రేటు, అమ్మాలంటే తక్కువ రేటు. అంతా దోపిడి " కసిగా అన్నాడు మురళి.

" సరే రేపు చూద్దాము, ఇప్పుడు వర్క్ కెళ్ళిపో" మురళి చెప్పి ఇంటి దారి పట్టాడు.

ఇక ఎక్కువ ఆలోచించే టైం లేదు అనుకుంటూ, పబ్ కేసి నడిచాడు వాసు.

●●●

వాసు పబ్ లోనికి వచ్చే టైంకి అంతా సందడిగా ఉంది.

డేవిడ్ మిగత కుర్రవాళ్ళతో కలిసి డ్రింక్స్ స్టాక్ చెక్ చేస్తున్నాడు.

"హాయ్" అందర్ని పలకరిస్తూ తన కౌంటర్ దగ్గరకు నడిచాడు వాసు.

విశాలంగా ఉండే హాల్ని రెండుగా విడదీస్తూ, మధ్యలో ఉన్న పార్టిషన్ క్లోజ్ చేసారు.

అందువల్ల ఇప్పుడు అయ్యే పార్టీ ప్రైవేట్ అని అందరికి తెలుస్తుంది.

ఇన్విటేషన్ ఉన్న వాళ్ళని మాత్రమే అనుమతిస్తారు.

మిగతా వాళ్ళంతా అటు పక్క హాల్లోకి వెళ్ళాలి.

డిస్క్ జాకి అర్షద్ తన కన్సోల్ చెక్ చేసుకుంటూ, సీడీలు అరేంజ్ చేసికుంటున్నాడు.

కాక్ టెయిల్స్ కౌంటర్‌లో జాన్ తన సామాన్లు సరిచూసుకుంటున్నాడు.

జాన్ మంచి కండలు తిరిగిన శరీరంతో, చెరగని చిరునవ్వుతో అందర్ని ఆకర్షిస్తాడు.

అమ్మయిలకి జాన్ అంటే పిచ్చి.

బోలీవుడ్‌లో జాన్ అబ్రహాంకి ఉన్న క్రేజ్, ఇక్కడ జాన్‌కి ఉంది.

ఇక కాక్ టెయిల్స్ కలిపేటప్పుడు, అతను బాటిల్స్‌తో చేసే విన్యాసాలు అందరి మతులు పోగొట్టేవిగా ఉంటాయి.

అతను డేవిడ్‌కి మేనల్లుడు, అయినా పని చేసినంత సేపు, చాలా నమ్రతగా ఉంటాడు.

"డేవిడ్, కం హియర్" పబ్ వోనర్ అగర్వాల్ గొంతు వినిపించింది.

అగర్వాల్ తనతో మరో వ్యక్తిని వెంట పెట్టుకొని వస్తున్నాడు.

"యస్ సర్" డేవిడ్ చేతిలో బాటిల్ కింద పెట్టి ఎదురు వెళ్ళాడు.

"దిస్ ఈజ్ కార్తిక్, పర్సనల్ అసిస్టెంట్ టు జిబికె. లుక్ ఆఫ్టర్ హిం" అప్పచెప్పి వెళ్ళిపోయాడు.

"డేవిడ్ ఎట్ యువర్ సర్వీస్ సర్" డేవిడ్ చేయి చాస్తూ అన్నాడు.

"కమాన్, నో ఫార్మాలిటీస్ " డేవిడ్ చేయి అందుకుంటూ అన్నాడు కార్తిక్.

వాసు అతనికేసి పరిశీలనగాచూసాడు.

వయసు ముప్పయికి అటు ఇటుగా ఉన్నాడు. పెద్ద చెప్పుకోదగ్గ రూపం కాదుకాని, చూపులు బాగా షార్ప్‌గా ఉన్నాయి.

"జస్ట్ ఏర్పాట్లు చూద్దామని వచ్చాను. మీరు అంతా పర్ఫెక్ట్‌గా చేస్తారని తెలుసు గాని, జస్ట్ అలవాటు." చుట్టూ చూస్తూ అన్నాడు.

"థేంక్యూ, మావాళ్ళని మీట్ అవ్వండి." డేవిడ్ ఒక్కళ్ళగా అందరిని పరిచయం చేసాడు.

అందరి తో చేతులు కలిపి చక్కగా మాట్లాడాడు కార్తిక్.

"డ్రింక్స్ ఎక్కువ జిన్, బియర్ ఉండేలా చూడండి. అమ్మాయిలు ఎక్కువ ఉంటారు. ఇక కేక్ కట్టింగ్ తరువాత అందరికి షాంపెయిన్ సర్వ్ చేయాలి. ఫుడ్ అంతా అనుకున్నట్లే వచ్చింది. "

"ఓకే సర్, ఓకే సర్..." తలూపుతూ డేవిడ్ అంటున్నాడు.

"ఏమన్న స్పెషల్ ప్రోగ్రాంస్ ఉంటాయా ?" కన్నుగీటుతూ అడిగాడు జాన్.

"అఫ్ కోర్స్, జిబికె ఇచ్చేపార్టీలో స్పెషల్ లేకపోతే ఎట్లా? ముంబై నుండి డాన్సర్స్ వస్తున్నారు. కుర్రాళ్ళ పార్టీ కదా ! కొంచెం కిర్రెక్కేలా ఉండాలి." తనూ కన్ను గీటుతు అన్నాడు కార్తిక్.

అందరూ నవ్వుకుంటూ తమతమ పనుల మీద దృష్టి పెట్టారు.

తరవాత టైం ఎలా గడిచిందో ఎవరికీ తెలీలేదు.

గోడమీద కుక్కుబర్డ్ ఎన్నిసార్లు అరిచిందో ఎవరూ గమనించలేదు.

క్రమంగా హడావిడి తగ్గటం మొదలైంది.

వాసు కొంచెం ఊపిరి తీసుకోగలిగాడు.

చాలామంది నెమ్మదిగా బయటపడుతున్నారు.

అక్కడక్కడ మిగిలిన వాళ్ళు అలిసిపోయి టేబుళ్ళ వద్ద కూలబడి, కార్డ్సు ఆడుతున్నారు.

మధ్యలో టేబుల్ మీద జిబికె కొడుకు, అతని స్నేహితులు ఉన్నారు.

అందరూ ఆటలో మునిగిపోయి ఉన్నారు.

"ఓహ్ గాడ్ ! మళ్ళీ ఫుల్ కౌంట్." ఒక అబ్బాయి గట్టిగా అరిచాడు.

"ఓ...ఓఓఓ..." అంటూ అందరూ వాడిని ఆటపట్టిస్తున్నారు.

ఒక కంట వాళ్ళని చూస్తూ పనిచేసుకుంటున్న వాసు పెదాలమీద సన్నగా నవ్వు మెదిలింది.

ఆ అబ్బాయికి ఆట సరిగా రాదనుకుంట. అప్పటికే చాలా డబ్బు పోగొట్టుకున్నాడు.

ఇప్పుడు మళ్ళా !

సరిగ్గ వాసు నవ్వుతున్నప్పుడే వాడు వాసుని చూసాడు. వాసు పెదాలమీది నవ్వు వాడి దృష్టిలో పడింది.

"హే, ఒక బీరు తీసుకురా " ఉక్రోషంగా అరిచాడు.

వాసు త్వరగా బీరు గ్లాసు తీసుకొని వెళ్ళాడు.

"ఏమిటి నవ్వుతున్నావు ?" గ్లాసు తీసుకోకుండా తీక్షణంగా వాసు ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"సారి సర్. " ఎక్కువ మాటలు పొడిగించకుండ కళ్ళు వాల్చి చెప్పాడు వాసు.

"ఇటు చూడు, నువ్వు నన్ను చూసే నవ్వావు కదా ?" వదలకుండా రెట్టించాడు.

తలెత్తి అతని కళ్ళలోకి చూసాడు వాసు.

తాగిన బీర్లు, కోపం, అలసట, అన్ని కలగలిపి, అతని కళ్ళూ., ముఖం ఎర్రగా ఉన్నాయి.

ఇంచుమించు వాసు వయసు వాడే కాని కష్టం తెలీకుండా పెరగడం వల్ల చిన్నగా కనిపిస్తున్నాడు.

"లేదు సర్ " దృఢంగా చెప్పాడు వాసు.

"కాదు, నువ్వు నన్ను చూసే నవ్వావు. నేను ఓడిపోతుంటే నీకు సరదాగా ఉందికదా !"

గొంతుపెంచి అతను అరుస్తుంటే, అతని ఫ్రెండ్స్ అంతా నవ్వుతున్నారు.

వాళ్ళనవ్వులకి వీడికి ఇంకా ఉక్రోషం వస్తుంది.

దూరంనుండి చూస్తున్న డేవిడ్ వచ్చాడు.

"సారి సర్. నేను చూస్తాను " మరో మాటకి అవకాశం ఇవ్వకుండా వాసు చేయి పట్టుకుని తీసుకెళ్ళిపోయాడు.

"నేనేమి చేయలేదు బాస్ " వాసు చెప్పబోయాడు.

"హుష్. ఏమీ మాట్లాడకు. నాకు తెలుసు, కాని వాళ్ళతో గొడవ పడలేము." వాసుని వేరే కౌంటర్ లో పెట్టి వెళ్ళాడు.

మరో అరగంట గడిచింది.

పేకాట జోరుగా నడుస్తూంది.

మరో టేబుల్ మీదున్న జిబికె, చాలా సీరియస్‌గా ఏదో మాట్లాడుతున్నాడు.

అంతలో కలకలం.

కుర్రాళ్ళున్న టేబుల్ వద్దనుండి అందరూ లేచిపోయారు.

"సరిగా చూడండీ. ఇక్కడే ఉంటుంది." ఎవరో అరుస్తున్నారు.

అందరి చూపులు ఆ టేబుల్ మీదకి మళ్ళాయి.

"ఏమయ్యింది?" జిబికె అడుగుతున్నాడు.

వెతకండి, వెతకండి... ఎవరూ సరిగా చెప్పటంలేదు.

డేవిడ్, అగర్వాల్ కూడా చేరుకున్నారు.

"ఏమయ్యింది? ఏమన్నా పోయిందా ?"

జిబికె కొంచెం గొంతెత్తి అరిచాడు, " ఏమయ్యింది?"

"డాడ్, వీడి రింగ్ పడిపోయింది" వాళ్ళ అబ్బాయి చెప్పాడు.

అంతకుముందు వాసుతో గొడవపడిన వాడిదే రింగు పడిపోయిందట !

రింగు అనగానే వాసు అప్రయత్నంగా తన వేలికేసి చూసుకున్నాడు.

అమ్మ ఉంగరం భద్రంగానే ఉంది. హమ్మయ్య !

"ఓహ్, గోల్డేనా ?" ఎవరో అడుగుతున్నారు.

"అవునంకుల్, ప్యూర్ గోల్డ్. చిన్న పువ్వులాంటి డిజైన్ ఉంటుంది."

కుతూహలంగా చూస్తున్న వాసు ఉలిక్కి పడ్డాడు.

వాసుని నిలదీసిన కుర్రాడు వాసునే చూస్తున్నాడు.

అతని కళ్ళల్లో కసి స్పష్టంగా తెలుస్తుంది.

అప్రయత్నంగా ఉంగరం ఉన్న చేతిని వెనక్కి పెట్టుకున్నాడు వాసు.

కాని గుండె క్రిందికి కృంగుతున్న భావం నెమ్మదిగా పెరుగుతుంది.

ఏదో తెలిసీ, తెలీని భయం చుట్టు ముడుతుంది.

"ఇక్కడ ఏమి లేదు. వేలినుండి జారిందా ?" ఎవరో అడుగుతున్నారు.

"ఏమో తెలీదు. లేకపోతే ఎవరో తీసేసి ఉంటారు" వాసునే చూస్తూ అంటున్నాడు

ఒక్కసారిగా అందరూ సైలెంట్ అయిపోయారు.

ఆ మాటకు అర్థం ఏమిటో అందరికి తెలిసింది.

"అగర్వాల్ " జిబికె పిలిచాడు.

"యస్ సర్ " అర్థం అయినట్లు కదిలాడు అగర్వాల్.

వాసుకి ఆందోళనతో చెమటలు పడుతున్నాయి.

"కం బాయ్స్ " డేవిడ్ కూడా అర్థం అయినట్లు పిలిచాడు.

అంతవరకు చకచక తిరుగుతూ, అందరి అవసరాలు తీరుస్తున్న కుర్రాళ్ళు బరువుగా కదిలారు.

ఒక మూలగాఉన్న కౌంటర్ దగ్గర ఆగాడు డేవిడ్ వెయిస్ట్ కోట్ పోకెట్‌లో దూర్చిన కర్చీఫ్ తీసి ముఖం, మెడ తుడుచుకున్నాడు.

"బాస్టర్డ్" కొంచెం గట్టిగానే తిట్టాడు.

ఖిన్నుడై చూస్తున్నాడు వాసు.

"వాసు, ఉంగరం పెట్టుకున్నావా?" డేవిడ్ అడిగాడు.

నెత్తిమీద బాంబు పడ్డట్టు ఫీల్ అయ్యాడు వాసు.

"బాస్, అది మా అమ్మది. అమ్మడానికి తెచ్చాను" కళ్ళనిండా నీళ్ళు తిరుగుతుండగా చిన్న గొంతుతో చెప్పాడు.

గట్టిగా నిట్టూర్చాడు డేవిడ్, " ఆయాం సారి వాసు. నాకు తెలుసు. అయినా ఏమీ చేయలేము. ఒళ్ళు కొవ్వెక్కిన వెధవలు వీళ్ళు. నీమీద కసి పెట్టు కున్నాడు. సర్వ్ చేస్తున్నపుడు వేలికి ఉంగరం చూసి ఉంటాడు. బాస్టర్డ్" మరల తిట్టాడు.

వాసు కంట్లోని నీళ్ళు ధారలుగా చెంపల మీద కారుతున్నాయి.

"సార్, ఫీజులు కట్టాలని అమ్ముదామని తెచ్చాను. ప్లీజ్ సార్, " ప్రాధేయపడుతున్నాడు.

"వాసు, నా మాట విను. అది నీదే, కాని ఈ వెధవలతో పెట్టుకోకు. పోలీసులని, అరెస్ట్ అని అల్లరి చేస్తారు. అది ఇలా ఇవ్వు" చేయి చాచాడు డేవిడ్

జాన్ వాసు భుజం మీద చెయ్యేసి నొక్కాడు. బేలగా చూసాడు వాసు.

"డేవిడ్, త్వరగా " అగర్వాల్ అరిచాడు.

"యస్ సర్ కమింగ్ " వాసు చేతికున్న ఉంగరం తీసుకుని అటునడిచాడు డేవిడ్

"ఇదేనా సర్ ?" ఉంగరం వాళ్ళకి చూపుతూ అడిగాడు.

అందరూ దానికేసి చూసారు.

" ఇదే, ఇదే." ఆ అబ్బాయి అరిచాడు.

"ఓహ్ థాంక్ గాడ్, దొరక్క పోతే చాలా విచారంగా ఉండేది." జిబికె తేలికైన స్వరంతో అన్నాడు.

"ఎవరు తీసారు, ఎక్కడ ఉంది?" కావాలనే వాసుకేసి చూస్తూ అడిగాడు.

"మీ రింగు దొరికింది. ఇక వదిలేయండి." డేవిడ్ గొంతులో కోపం ధ్వనించింది.

"ఓకే, ఓకే. ఇక ముగిద్దాము. గుడ్ నైట్ టు యు ఆల్" జిబికె కదిలాడు.

ఒక్కొక్కరుగా అందరూ బయటకు వెళుతున్నారు.

హంగామా చేసిన కుర్రాడు కావాలనే వాసు దగ్గరగా వచ్చాడు.

" చూసావా నాతో పెట్టుకుంటే ఏమవుతాదో? జాగ్రత్తా !" హెచ్చరిస్తున్నట్లు అన్నాడు.

"ఆహా, అలానా, బయటకు రా చూద్దాము" వాసు భుజం మీద చేయి వేస్తూ జాన్ అన్నాడు.

జాన్ ఆకారం చూసి గబగబ వెళిపోయాడు వాడు.

"జాన్, నో ఫైటింగ్స్" డేవిడ్ వెనక నుండి అన్నాడు.

అంతవరకు అణచిపెట్టిన దుఃఖం పెల్లుబుకింది వాసులో.

"సారీ వాసు, కాని మనం ఏమీ చేయలేని పరిస్థితి. పేరుకే గొప్పవాళ్ళు వీళ్ళు, బుద్దులకి మరగుజ్జులు" డేవిడ్ మాట్లాడుతూ సైగ చేసాడు.

మిగతా కుర్రాళ్ళంతా తమతమ జేబుల్లోని డబ్బు తీసి డేవిడ్ చేతిలో పెట్టారు.

"ఇదిగో, నీ ఉంగరం వెల అనికాదు కాని, మా చేతనైన సాయం. ఫీజుల పని చూడు. ప్రతీ సారీ ఇలాంటి వెధవలు తగలరు. నువ్వు త్వరపడి పని మానకు" అనునయంగా చెప్పాడు డేవిడ్

కారుచీకట్లో కాంతిరేఖలా, ఆ అవమానంలో, వాళ్ళ ఆదరణ వాసుకి ధైర్యాన్నిచ్చింది.

అవును, గొప్పతనం డబ్బులో లేదు, గుణంలో ఉంటుంది !

అన్ని లక్షలు ఖర్చుపెట్టి పార్టీ ఇచ్చిన జిబికె కన్న, తన అవసరం తెలుసుకొని తమకున్న కొంచెంలోనే దాతృత్వం చూపిన తన మిత్రులు గొప్పవారు.

లేకితనంతో డబ్బు వృధా చేయడమేకాకుండా, ఒక పనివాడి దగ్గర ఉంగరం కొట్టేసిన గొప్పింటి బిడ్డ గొప్ప దొంగ !

## విజ్ఞులు ప్రాజ్ఞులు

**నాగేంద్ర కాశి**

●●●

**నా పేరు వీర. నేను ఓ మూడు నాలుగు సంవత్సరాల నుంచీ** ఈ ఇంట్లోనే ఉంటున్నాను. నాతో బాటు మా యజమాని దీపక్, వాళ్ళావిడ, పదేళ్ళ వయస్సున్న కొడుకు అకీ ఉంటారు. నన్ను అందరూ బాగానే చూసుకుంటారు. కానీ రాను రాను మనుష్యుల ప్రవృత్తి, ప్రవర్తన చూస్తుంటే అసహ్యమేస్తుంది నాకు. ఏమి? వీళ్ళెక్కడకెళుతున్నారు? అనిపిస్తుంది. కానీ నా బాధ ఎవరికి చెప్పుకోను? వీళ్ళ ఇంటి ఉప్పు తింటూ వీళ్ళ ఉప్పు తింటూ వీళ్ళ గురించి ఉన్నది ఉన్నట్టు. ఎలా చెప్పాలి.

కానీ మీలో కూడా నాలాగే బతికే వాళ్ళున్నారు బయట. బాధ చెప్తేనే గానీ తీరేలా లేదు. అందుకే మీరు ఎవరితోనూ చెప్పరని చెబుతున్నాను.

జన్మ సంస్కారం నాకుంది గానీ వీడికి లేదు. 'వీడు' అంటున్నందుకు నాకూ బాధగానే ఉంది. కానీ తప్పట్లేదు. వీడు చేసే పనులు చూసి నాకు అలా అనాలనిపిస్తుంది. నన్ను ఇంటికి తీసుకొచ్చినప్పుడు నాకూ మంచి అభిప్రాయమే ఉండేది. నాకు కావలసినవి అన్నీ కొనిపెడతాడు. ఒంట్లో ఏమన్నా నలతగా ఉన్నా వెంటనే ఇంకో పనోడి చేత నన్ను హాస్పిటల్‌కి పంపిస్తాడు. కానీ నేను అంతకుమించి

పనిచేస్తాను కదా! ఎందుకు చెయ్యడు అన్న అహంభావం నాలోనూ ఉంది. ఇంతకు ముందు వీడి పక్కన గౌరవంగానే అణిగి మణిగి ఉండేవాణ్ణి. కానీ ఈ మధ్య ఫోన్లో వీడి సంభాషణలూ, ఈ ఇంటికొచ్చే వాళ్ళ సంభాషణలు బట్టి వీడు 'పెద్ద వెధవ' అని ఫిక్సైపోయినా.

వీడి మావగారు ఒక ఎమ్.ఎల్.ఏ. ఆయన వ్యవహారాలు అంటే ఆయనకొచ్చే లంచాలు, కమీషన్లు, కొత్త ఉద్యోగాల బేరసారాలు, కొత్త కాంట్రాక్టుల గురించి వాటాలు అన్నీ ఈయనే చూస్తాడు. వాటికన్నింటికీ ఈ ఇల్లే అడ్డా. కొంతమందిని భయపెడతారు, కొంతమందిని బుజ్జగిస్తారు, కొంతమందిని కులం పేరుతో బుట్టలో వేస్తారు. ఇవన్నీ మామూలే. పాపం అంతా ప్రజల సొమ్ము. ఇలాంటి విషయాలన్నీ సాధారణంగా రాత్రే జరుగుతాయ్. అదే డాబాపైన పెంట్ హౌస్‌లా ఉంటుంది. అక్కడ. ఇక మీటింగంటే చెప్పేదేముంది మందూ, మటన్ మామూలే కదా. అలాంటప్పుడు నన్ను పక్కనే ఉంచుకుంటాడు. నేనంటే కొంచెం ధైర్యంగా ఉంటుందనుకుంటా.

మొన్న ఫోన్లో మాట్లాడుతూ..

"ఆఁ. మావయ్యకి ఆ కాంట్రాక్టరు పదే ఇచ్చాడని చెప్పు. నేను కాంట్రాక్టర్‌తో ఆల్రెడీ చెప్పే ఉన్నాను. నీది నీకిస్తాలే." అన్నాడు. కొంచెం ఆలోచిస్తే వీడు కొంచెం నొక్కేసాడని అర్థమైంది.

ఆ మర్నాడు వీడి మావయ్య వచ్చాడు.

వంగి కాళ్ళమీద పడి "ఆశీర్వాదం" అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూసాను. కానీ ఆ రాత్రే తెలిసింది. వీడికి కూడా మున్సిపాలిటీ ఎలక్షన్‌లో నుంచోడానికి పార్టీ టికెట్ కావాలంట.

అందుకా వీడి దొంగనాటకం అనుకున్నాను.

ఆ మధ్య వీళ్ళకు తెలిసిన అంటే వీడి నాన్నగారు పంపించిన కుర్రాడొకడొచ్చాడు. వినయంగా నిలబడి.

"మీ నాన్నగారు పంపించారు సార్. మన ఊర్లో పంచాయితీ దగ్గర వాటర్ ట్యాంక్ దగ్గర అటెండర్ కావాలని చెప్పారంట ప్రెసిడెంట్‌గారు. అది నాకు ఇప్పించమని తమరి మావయ్యగారికి చెప్పమని పంపించారు సార్" అన్నాడు.

"ఆఁ చూద్దాం. అటెండర్ పోస్ట్‌కైనా చాలామంది అబ్బాయిలు రెడీగా ఉన్నారు. నాన్న పంపించాడంటున్నావు కాబట్టి ఓ పదివేలు ఇచ్చేసి వెళ్ళు. మావయ్యతో నే మాట్లాడతా. ఊఁ. సరేనా. రైట్ మరి" అని ఇంట్లో కొచ్చేసాడు.

పాపం వాడి దగ్గర ఎందుకు డబ్బులు తీసుకోవడం. చెప్పండి. వీడుకున్నదంతా ఏం చేసుకుంటాడు.!

వీడికి లేని చెడు లక్షణమంటూ లేదు. నైట్ ఠంచనుగా మందు పడాల్సిందే మందు తాగిన తర్వాత చూడాలి వీరి నిర్వాకం. అందర్నీ అమ్మనా బూతులు తిడతాడు. నాకెప్పుడూ మందు పోయలేదు గానీ చికెన్, మటన్ ముక్కలు ఇస్తూ ఉంటాడు. అవి నేను లాగించేస్తూ ఉంటాను.

అవును మర్చిపోయాను. వీడికో సెకండ్ సెటప్ ఉంది. నైట్ ఫోన్లో వీళ్ళావిడ నిద్రపోయిన తర్వాత ఒక్కోసారి మాట్లాడుతుంటాడు. నేనున్నా పెద్ద పట్టించుకోడు. నేనెవరికీ చెప్పనని వీడి ప్రగాఢ విశ్వాసం. చెప్పలేను. చెప్పను. అంటుంటే నాకు నోరు లేదనుకునేరు. గట్టిగా మాట్లాడనంటే టాపు లేచిపోద్ది.

నాకు ఈ ఇంట్లో కొచ్చేవరకూ ఏమీ తెలియదు. ఏదో అందరూ మాట్లాడుకుంటే వినడం వల్ల మీకు చెప్పగలుగుతున్నాను.

ఇక వీళ్ళావిడ...

కాకికి ఎంగిలి చేయి కూడా విదపదు మహాతల్లి. పనోళ్ళని ఎంత హీనంగా చూస్తుందంటే నాకంటే కూడా హీనంగా చూస్తుంది. ఆ విషయంలో నేను కొంచెం అదృష్టవంతుణ్ణే. కానీ పాపం వాళ్ళేం జేస్తారు. పొట్టకోసం పూట తిండి కోసం పనిజేసుకునే వాళ్ళు. వీళ్ళని ఎదిరించి ఏం చేయగలరు.

పొద్దున్న మా యజమాని నాన్నగారు ఊర్నుంచి వచ్చారు ఎండన పడి. కనీసం 'మంచి నీళ్ళు తాగుతారా?' అని కూడా అడగలేదు. మనవడిని చూసి ముద్దాడబోతే వాడు ఆయన్ను పక్కకి గెంటేసి పెరట్లోకి పోయాడు. వాడు కూడా కనీసం 'తాతయ్యా' అనికూడా అనలేదు. అస్సలు పెద్దలంటే గౌరవంగానీ, భక్తిగానీ ఏమీలేవు వాడికి. వాడిది కాదు తప్పు. అంతా మా యజమానురాలుదే! అలా పెంచుతుంది వాడిని. వీడికి రానురానూ పెంకితనం ఎక్కువైపోతుంది. 'అయ్యో! ఈయన తాతయ్య అలా అనకూడదు తాతయ్యగారూ అనో 'తాత' అనో. పిలవాలి' అని చెపుతుందా అంటే ఏమీ చెప్పదు అలా టీవీల్లో వచ్చే సీరియల్స్ చూస్తూ ఉంటుంది. పాపం ఒక గంట కూడా ఉండలేదు. వెంటనే జంప్. ఈయనేకాదు. మా యజమాని తరుపు  ఎవరొచ్చినా అంతే.

నా మొగుడ్ని కంట్రోల్‌లో పెట్టుకున్నానని ఈవిడనుకుంటుంది. నా పెళ్ళాన్ని, మావగార్ని కంట్రోల్ లో పెట్టుకున్నానని 'వాడు' అనుకుంటాడు.

ఈ మధ్యన సీరియళ్ళ పిచ్చి బాగా పట్టుకుంది మా యజమానురాలుకి. భర్తలను ఎలాబాధపెట్టాలి.. ఎన్ని విధాలుగా మనిషిని చిత్రహింసలకు గురిచెయ్యొచ్చు. ఎంత నీచంగా బతకొచ్చు..లాంటి వన్నింటినీ చూస్తూ వాటిలో కొన్నింటిని నా మీద, పనోళ్ళు నాతోబాటు పనిచేసేవాళ్ళ మీద ఒక్కొక్కసారి ట్రైల్ వేస్తూ ఉంటుంది. పడతాం. ఏం చేయం.

అంతేగాని పిల్లాడిని దగ్గరకు తీసుకుని వాడి స్కూలు విషయాలు, స్నేహితులు విషయాలు గురించి సరదాగా మాట్లాడుతుందా అంటే అదీ లేదు. ఒకే ఒక్కరోజు వీడ్ని పట్టించుకుంటారు. అదీ బర్త్‌డే ఆ రోజు మాత్రం వీడి మెళ్ళో నాలుగు గొలుసులూ, నోట్లో రెండు కేకు ముక్కలు కుక్కి ఆనందపడిపోతారు. పార్టీ జరుగుతుండగానే మా యజమాని పక్కకొచ్చి మందేస్తాడు. ఆవిడేమో నగలు గ్రటా చూపిస్తూ సొల్లు కబుర్లు చెపుతుంది స్నేహితులతో.

ఇంక వాడు కుర్రాడు. ముందు ముందు వెధవలా తయారవ్వడానికీ, అచ్చోసిన ఆంబోతులా తిరగడానికి కావలసిన లక్షణాలనూ, సరంజామాను ఇప్పుడే సిద్ధపరుచుకుంటున్నాడు.

మొన్న టీవీలో ఏదో సీరియల్ వస్తూంది. దాంట్లో ఒక పిల్లాడు వాడి నాన్నని గట్టిగా రిమోట్ తీసుకుని కొట్టి "దెబ్బంటే ఇలా ఉండాలి. పసిచేతులు నావే ఇంత రఫ్‌గా ఉంటే పాతికేళ్ళొచ్చి పది సంవత్సరాలు దాటింది. నీవెంత రఫ్‌గా ఉండాలి. వెళ్ళు వెళ్ళి దాన్ని అదే అమ్మని నానా చిత్రహింసలూ పెట్టి నీ టాలెంట్ చూపించుకో అప్పుడే నిన్ను నాన్నా అని పిలుస్తాను. పో" అంటాడు.

వీడు ఈ కుర్ర కుంకడు అది చూశాడు. ప్రయోగం చెయ్యాలి. ఎవరిమీదా? వాడి నాన్నమీద అలాగే వేస్తే వాడు ఇరగదీస్తాడు మరెవరున్నారు. నేనే. రిమోట్ తీసుకుని నన్ను మొహం మీద ఒక్కటి కొట్టాడు. కళ్ళు తిరిగినంత పనయ్యింది. నేనూ ఒక్కటేద్దామనుకున్నా.

నేను వేస్తే అట్లా ఇట్లా ఉండదు. నా దెబ్బకి హాస్పిటల్‌లో మందులు కూడా దొరకవు. నా సంగతి వీడికి తెలియదు. ఇప్పటికైనా నా పేటలోకి వెళ్ళి రోడ్డు మీద నుంచుని పెద్ద కేక వేశానంటే హడలి చస్తారు జనాలు. కానీ నన్ను వీళ్ళు పూర్తిగా మార్చేశారు.

కానీ అందరి ఇళ్ళల్లోనూ ఇలాగే పెరుగుతున్నారా? పిల్లలు అని నా డౌటు.

నిజం చెప్పాలి. మీకు నేను కూడా ఈ మధ్య సీరియల్స్ చూస్తున్నాను. ఆ హింస, రక్తపాతం, స్వగతం, కుట్ర భలే బావున్నాయి. ఆ టైములో ఎవరు బెల్లుకొట్టినా చచ్చినా చూడను. ఎవరొచ్చారో ఏమిటోనని. అయినా మీకు చెబుతున్నానేమిటి! చిత్రంకాపోతే! మీరు కూడా అవిలేకుండా ఉండలేరు కదా! నిజం చెప్పండి.

మా బాస్ సీరియల్ చూడడు కానీ సిగరెట్ తాగుతాడు. ఏది చెడు వ్యసనం అని చాన్నాళ్ళూ ఆలోచించాను. వెధవ బుర్రకి ఆ ఇంగితం ఏడిస్తేగా. చివరికి ఎలాగొలా ఆ సీరియల్సే చెడ్డవనుకున్నాను. మరేమో నాకు తెలియదు. విజ్ఞులు. సంస్కార పరాయణులు. మీరే చెప్పాలి.

ఈ పదాలన్నీ ఎలా వచ్చాయనుకుంటున్నారా ఒక పనివాడికి ఏదో అలా అలా నేర్చుకున్నాను. కొన్ని సంస్కృత పదాలు మా యజమాని పూజ చేసేటప్పుడు విన్నాను.

పూజ వాడు పూజ చేస్తాడు. వాడి పూజ తగలడా. అదేం పూజ. అగరొత్తులు వెలిగించి అవి ఆరకుండానే అరటి పళ్ళు తీసేస్తాడు. ఎందుకంటే ఒక గంట ముందు సిగరెట్ కాల్చి ఉంటాడు. ఆ సిగరెట్ ఎందుకంటే నైట్ రెండయ్యే వరకూ తాగుతూ ఉండడం వల్ల వచ్చిన హాంగోవర్ పోవడానికి.

దీనికేమైనా ఫలితం ఉంటుందా?

నేనైతే దేవుడ్ని నమ్మను. పనిని నమ్ముతాను. నన్ను నమ్ముకుంటాను. నన్ను పోషిస్తున్న వీడ్ని నమ్ముతాను.

ఎన్ని చెప్పుకున్నా. ఏం లాభం.

ఈ మనుష్యుల జీవితాల్లో గుట్టులేదు. ప్రేమలేదు. నిజాయితీ లేదు.

ప్రతివాడు గొప్పోడుగా గుర్తింపబడాలన్న వెర్రి ఆశతో బయటికెళ్ళేటప్పుడు అనుచరుల్ని తీసుకెళ్ళటం, బంగారం వేసుకోవటం, డబ్బు, కార్లు, బంగళాలు.. అధికారం. ఇవన్నీ లేకపోతే ఒక మనిషిని 'గొప్పోడు'గా ఎవరూ గుర్తించరేమో?

మా యజమాని ఆఫీసు రూములో ఒకాయన ఫోటో ఉంటుంది. బాగా ముసలాయన ఒక కర్రపట్టుకున్నాడు.

వంటిమీద సరిగా బట్టకూడా లేదు. కళ్ళజోడు. మొదట్లో వీడి చుట్టాలేమో అనుకున్నా ను. తర్వాత బయటి కెళ్ళినప్పుడు చూస్తే చాలా చోట్ల విగ్రహాలున్నాయ్. అన్నివున్నాయంటే మరి ఆయన దగ్గరేమున్నట్టు?

నా వల్లకాదు. నేనాలోచించలేను. ఏ చదువూ సంధ్యలేనివాడిని. పూర్వజన్మలో మేధావినయ్యుంటాను. కానీ ఈ జన్మలో ఇలా అనాకారి వెధవలూ ఒకరి కాళ్ళు దగ్గర పనిచేసేవాడిలా పుట్టాను.

మీరు దేవుడ్ని కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు కదా! అయితే పర్వాలేదు.

అయినా మా వాళ్ళననాలి.

'విశ్వాసం' మన జాతి లక్షణం అని నాకు నూరిపోశారు. నేనేం మాట్లాడను.

"భౌ భౌ.. భౌభౌ' అనడం తప్ప.

ఆఁ మీరే చెప్పండి! విజ్ఞులు. ప్రాజ్ఞులు.

●●●

# దిద్దుబా(ట్లు)టలు

డా. నారాయణ గరిమెళ్ళ

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.

**ఎంత వద్దనుకున్నా నవ్వు ఆగడం లేదు.** ఇది నా ఒక్కది పరిస్థితే కాదు. నాలాంటి మరో ఇరవై ఎనిమిది మంది స్నేహితులు కూడా ఆపుకోలేకుండా నవ్వుతున్నారు. ఎంతో విషాదకరమైన ఈ సమయంలో నవ్వుతున్నామని తెలిస్తే అందరూ ముక్కున వేలేసుకుని మరీ మమ్మల్ని అసహ్యించుకుంటారనీ, ఆశ్చర్యంగా చూస్తారనీ తెలుసు. కానీ ఇందుకు పూర్వాపరాలు తెలిస్తే మీరు కూడా మాతో శృతి కలిపి నవ్వుతారనే నా నమ్మకం.

●●●

పదేళ్ళ క్రితం. మేం ముప్పైమంది క్లాస్‌మేట్స్‌మి పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమో - ఇంజనీరింగ్ చదువులు వెలగబెడుతున్న రోజులు. ముప్పైమందిమీ ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడుకునేంతలా కాకపోయినా, ఒక మోస్తరుగా అదే పంథాలో పోతున్న రోజులు. ఎంతో కొంత అలా గర్వంగా చెప్పుకునేంత సాన్నిహిత్యంతో సామూహిక కార్యక్రమాల్ని సాగించాం. మచ్చుకి కొన్ని విషయాలు చెపితే మా సంఘటిత పర్వం సంగతేంటో మీకే అర్ధమైపోతుంది.

ప్రారంభంలో సీనియర్స్ నుండి ర్యాగింగ్ బెడద మొదలైనప్పుడు మూకుమ్మడిగానే దాన్ని ఎదుర్కొన్నాం. జనరల్ - హెడ్ అనబడే ఒక పెద్ద లెక్చరర్ మా కాలేజీ మొత్తం మీద ర్యాగింగ్ అనేది లేకుండా చెయ్యటానికి కంకణం కట్టుకున్న మహానుభావుడని విని, అతనికి కంప్లైంట్ చేసి సీనియర్స్ ఎవరూ మా జోలికి రాకుండా చేసుకున్నాం. ఆ తర్వాత వాళ్ళు ఒక సంవత్సరం పాటు మా మీద గుర్రుగా ఉండి మాటలు ఆపేసారు, అది వేరే సంగతి.

కొన్నిసార్లు, ఏవైనా కారణాలతో క్లాసులు జరగకపోతే అందరం ముకుమ్మడిగా 'రాము(లు)డు మంచిబాలు(రు)డు' లా పోయి ఎక్స్ట్రా క్లాసులు తీసుకోమని లెక్చరర్స్‌ని బతిమాలి మరీ ఏదీ మిస్సవ్వకుండా శ్రద్ధగా వినే వాళ్ళం. తిరిగి అదే ఐకమత్యంతో క్లాస్‌మేట్స్ ఎవరికీ ఇష్టం లేనప్పుడు క్లాసులు జరుగుతున్నా కూడా బలవంతంగా రద్దు చేయించి మరీ 'రావణు (లు)డు చెడ్డ బాలు(రు)డు' అని కూడా నిరూపించుకున్నాం. ఇంతెందుకూ, మా యూనిటీ గురించి చెప్పాలంటే ఒక్కరు కూడా తప్పకుండా ముప్పైమంది మీ కలిసి అనేకసార్లు ఛలో అంటూ సినిమాలకూ, షికార్లకూ, పిక్నిక్ లకూ వెళ్ళి మాదైన ఉమ్మడి ముద్రని సొంతం చేసుకున్నాం. 'ఇందులో ఆశ్చర్యం ఏముందీ?' అని మీకు అనిపించొచ్చు. కానీ, సెల్ ఫోన్లంటే ఏమిటో తెలియని రోజుల్లో గట్టు కొకరూ పుట్టకొకరుగా రూముల్లో బతికే ముప్పైమంది క్లాస్ మేట్స్ కేవలం పదిహేను సైకిళ్ళతో, మిగిలిన కాలి నడకలతో దీన్ని సాధించారంటే ఆశ్చర్యమే కదా! పైగా అంతకు ముందున్న సీనియర్లు కానీ, తర్వాతొచ్చిన జూనియర్లు కనీ సృష్టించలేని ఒరవడిని మూడు సంవత్సరాలకు పైగా మేము అప్రతిహతింగా సాగించామంటే అది ఖచ్చితంగా గొప్పే. అంతేకాదు, మా మూర్తిగాడు కాలేజీ ఎలక్షన్లలో పోటీ చేసినప్పుడు రాత్రనక, పగలనక కాన్వాసు చేసింది మేమే, బ్యానర్లు కట్టింది మేమే. పరీక్షలకి కూడా అందరం కలిసే తయారయ్యేవాళ్ళం. ఇలా చెప్పుకుంటూ పోతే మా మధురానుభుతుల చిట్టా అంతా కలిపి కొండవీటి చాంతాడంత.

'భిన్నత్వంలో ఏకత్వానికి మేమే ప్రతీక' అని జబ్బలు చరచుకునేవాళ్ళం కాస్తా, డీలా పడిపోయేది ఒక్క నర్సింగుగాడి విషయానికి వచ్చేసరికే! వాడందరికీ ఒక పజిల్. వాడంటే అందరికీ ఏదో తెలియని చికాకు, ఆశ్చర్యం, ఇష్టం, కోపం. ఇంకా ఇలా అనేకానేక భావాలు కలగాపులగంగా ఉండేవి. కొన్ని ఉదాహరణలు చెపితే ఇట్టే అర్థమైపోతుంది. ఎప్పుడూ ఒక పట్టాన ఏ విషయానికీ అవునో కాదో చెప్పకుండా నాన్చేవాడల్లా, ఒక్కసారి, హఠాత్తుగా అందర్నీ ఆశ్చర్యపరుస్తూ నిర్ణయాలు తీసుకునేవాడు. పరీక్షలలో ఎక్కువ మార్కుల కోసమని చచ్చీ చెడీ తను సంపాదించుకున్న బుక్స్‌నీ, కొశ్చన్ పేపర్లనీ ఉదారంగా అందరికీ పంచిపెట్టేసేవాడు. ఎంత సామూహిక హీరోలమని డాంభికాలకి పోయినా, పరీక్షలు దగ్గరకు వచ్చేసరికి ఎవడి స్వార్థం వాడిదిగానే ఉండేది మిగిలిన అందరికీ. కానీ, దాన్ని కూడా తోసిరాజనే వాడిలా తన కరుణా కటాక్షాలతో అందరికీ పరీక్ష పెట్టేవాడు మా నర్సింగు గాడు. వాడి దయవల్ల అందరూ పాసయ్యేవాళ్ళు. ఎప్పుడూ ఎక్కువ మార్కులు వచ్చే వాళ్ళకి కూడా వాడు అందరితో సమంగా ఉపకారం చెయ్యడంతో, ఎప్పుడూ తక్కువ మార్కులు వచ్చే వాళ్ళకి అరికాలి మంటని నెత్తికెక్కించేది. మరొకలా చెప్పుకోవాలంటే అందరూ కూల్ డ్రింక్ తాగేటప్పుడు వాడొక్కడూ నిర్మోహమాటంగా మంచి నీళ్ళు తాగే రకం. లేదంటే అట్నించి ఇటైనా వాడికి సాధ్యమే. మండు టెండలో వేడి వేడి ఛాయ్‌ని చప్పరిస్తూ తాగాలన్నా, ఎముకలు కొరికే చలిలో లొట్టలేస్తూ ఐస్ క్రీముని తినాలన్నా అది నర్సింగుగాడికే చెల్లు. సంతోషించవలిసిందల్లా ఉద్దేశపూర్వకంగా వాడెప్పుడు ఎవర్నీ నొప్పించలేదు.

*******

డిప్లొమా చదువులయ్యాక ఉద్యోగాల పేరుతో అందరం తలొక దిక్కూ చెదిరిపోయాము. మొన్న మొన్నటి వరకూ ఉత్తర ప్రత్యుత్తరాలూ, ఫోను సంభాషణలూ మాత్రమే మమ్మల్ని కలిపి ఉంచితే, ఇప్పుడు సెల్ ఫోన్లూ, ఈ మెయిళ్ళ పుణ్యమాని బిజీ జీవితాల్లో కూడా ఎంతో కొంత ముచ్చటించుకుంటున్నాం, పదేళ్ళ కాలం ఎలా గడిచిపోయిందో ఎవరూ గుర్తుతెచ్చుకుని చెప్పగలిగే పరిస్థితిలో లేరు.

వారం రోజుల క్రితం అందరికీ పిడుగులాంటి వార్త తెలిసింది. అది 'నర్సింగు గాడు కేన్సర్ బారినపడి నేడో రేపోగా ఉన్నాడని'. నిజం చెప్పొద్దూ, పెళ్ళాం బిడ్డలకి ప్రాణం మీదికొచ్చినప్పుడు కూడా ధైర్యంగా ఎదుర్కొని వాళ్ళని తిరిగి మాములు మనుషుల్లా చేసుకున్నవాడిని కాస్తా ఒక్కసారే బావురుమని ఏడ్చేశాను. నా భార్యాపిల్లలు విస్తుపోయి నా వంక చూస్తున్నారన్న ధ్యాసైనా లేకుండా ఆ స్థితిలో ఎన్ని గంటలుండిపోయానో నాకే తెలీదు.

తర్వాత మిత్రులంతా మాట్లాడుకుని ఎంత డబ్బు పోగేసైనా వాడ్ని బ్రతికించుకోవాలనుకున్నాం. కానీ, అప్పటికే అనేక మంది డాక్టర్లని సంప్రదించి ఉన్నవాడి కుటుంబ సభ్యులు అది వృథాప్రయాసే అవుతుందని కుండ బద్దలు కొట్టేసారు.

వాడు త్వరలో చనిపోతాడన్న విషయం రూఢీ అయిపోటంతో అందరం చివరిసారిగా వాడిని కలవాలని నిర్ణయించుకున్నాం. పదేళ్ళ తర్వాత అందరూ కలుసుకునే సందర్భం ఇంత విషాదంగా ఉంటుందని కల్లోకూడా ఊహించలేదు.

*******

హాస్పిటల్‌కి వచ్చిన మా అందరికీ నర్సింగుతో మాట్లాడుకునే వెసులుబాటు కల్పించటం కోసం వాడి కుటుంబ సభ్యులందరూ బయటికి వెళ్ళిపోయారు. నర్సింగుగాడ్ని చూసి జాలిగా మాట్లాడకూడదని ముందే నిర్ణయించుకున్నవారమల్లా 'వాడి ధైర్యం, ఎప్పటిలా చెక్కుచెదరని వాడి చిరునవ్వు' చూసి స్థాణువులమైపోయాం. ఎంత వద్దనుకున్నా అందరికీ దుఃఖం కట్టలు తెంచుకుని వస్తోంది. అయినా సరే అందరం తమాయించుకునే మాట్లాడుతున్నాం.

మూర్తిగాడు అడిగాడు. "ఒరేయ్ నర్సీ, నీకేమైనా పనులు చేసి పెట్టాలంటే మేమంతా ఉన్నాం. సంశయించకుండా చెప్పు" ప్రత్యక్షంగా చెప్పకపోయినా నర్సింగు గాడి చివరి కోరికలేంటో మూర్తి కనుక్కుంటున్నాడని అందరికీ తెలుస్తోంది. అందరం ఎలా అడగాలా అని తటపటాయిస్తున్న విషయాన్ని మూర్తిగాడు కాస్తా అంత సునాయాసంగా అడిగెయ్యడం అందరికీ నచ్చింది.

నర్సింగ్ అన్నాడు "మీ అందరికీ థాంక్స్‌రా. ఎంతో కష్టపడి సెలవులవీ పెట్టి మరీ నాకోసం దూరాభారాల నుండి వచ్చారు. ఇంట్లో అందరూ కూడా మీలాగే అడిగారు. వాళ్ళకీ ఏవో చెప్పాను. నా మాట కాదనలేక చెప్పినట్టే చేసారు. ఇప్పుడు మీరుకూడా అడుగుతున్నారు"

నీరసంగా మాట్లాడుతున్నా, వాడి మాటల్లో స్పష్టత మమ్మల్ని ఆశ్చర్యపరుస్తోంది మళ్ళీ నర్సింగ్ "ఒరేయ్, చాలా రోజుల్నుండీ మీతో సంబంధం ఉన్నా, కొన్ని విషయాలు నాలో అలాగే నలిగిపోతున్నాయ్. మీరు నన్ను ఏమనుకున్నా అవి ఇవ్వాళ చెప్పక తప్పదు." వాడి తెగింపు మా అందరికీ ఏదో అనిర్వచనీయమైన అనుభూతి నిచ్చింది. అంతలోనే వాడేం చెబుతాడోనని కుతూహలం పెరిగిపోయింది.

"మొదటిది: మనం అందరం కలిసి, రవిగాడి మీద చెయ్యిచేసుకోబోయాడని, కక్షకట్టి జనరల్ - హెడ్‌సార్‌ని కాలేజీలో అందరి ముందూ అవమానించి మరీ క్షమాపణలు చెప్పించుకున్నాం. నాకది ఎంత మాత్రం నచ్చలేదు. ఒకొప్పుడు, మనం జూనియర్లుగా ఉన్నప్పుడు ఆయనే మనకు ర్యాగింగ్ బారినుండి కాపాడాలన్న తాపత్రయంతో రవిగాడ్ని మందలించాడని మనం అహంకారంతో రెచ్చిపోయాం రా. ప్లీజ్, అతనికి ఎలాగైనా మీరందరూ క్షమాపణలు చెప్పండిరా."

నర్సింగుగాడి మాటలకి అంత దుఃఖంలో కూడా మా అందరికీ నవ్వు వచ్చినంత పనయ్యింది. ఎందుకంటే చనిపోయే మనిషికి ఇలాంటి ఒక కోరిక ఉంటుందని ఊహ కూడా రాలేదు. అందులోనూ. ఇంత పాత విషయం, నర్సింగుగాడి ప్రత్యక్ష ప్రమేయం ఏమీలేకుండా జరిగిన, ఇలాంటి విషయం పట్ల వాడి అపరాధ భావన మాకందరికీ అర్థం లేనిదిగా అనిపించింది. పైగా ఆ రోజు జనరల్ హెడ్ సార్ టాప్ సీనియర్ రవిని మందలించడం మేమెవ్వరమూ జీర్ణించుకో లేకపోయాం. "మరి రెండోది?" నర్సింగ్ వైపు చూస్తూ నేను అడిగాను.

"ఒరేయ్ మన ఆఫీస్ క్లర్క్ రాందాసు పదిరూపాయలు లంచం అడిగాడని కాలేజీ అంతట్నీ ఏకం చేసి, యాజిటేషన్ చేసి మరీ అరీ అతనికి సస్పెన్షన్ ఆర్డర్లు ఇప్పించినంత పనిచేశాం రా.. అదే, పెద్ద తలకాయలు నిర్లాక్ష్యంగా వేలల్లో మనల్నించి లంచం గుంజినా ఏమీ చెయ్యలేకపోయాం. మనలో ఇప్పటి వరకూ లంచం ఇవ్వకుండా బతికినవాడు ఒక్కడూ లేడు. అలాంటప్పుడు, ఆ క్లర్కులాంటి పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ఎంతవరకు సబబు? ఆలోచించండ్రా. ఆయన్ని కూడా క్షమించమని అడగండ్రా."

నర్సింగ్గాడి కోరికలకి అందరికీ మతిపోతోంది. "ఇంకేమైనా ఉన్నాయా?" పెదాల మాటున నవ్వు కనిపించకుండా చెయ్యి అడ్డుపెట్టుకుని అడిగాడు మూర్తిగాడు. "ఒరేయ్ నువ్వు ఒకసారి విశాలాంధ్రా బుక్ షాప్ వాళ్ళు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తే డబ్బులు కట్టకుండా 'మహాప్రస్థానం' పుస్తకాన్ని కొట్టేసావురా. అప్పటికీ, ఇప్పటికీ కూడా నీకు పది రూపాయలు లెక్కలోది కాదు కదా! ప్లీజ్ విశాలాంధ్రాకెళ్ళి ఆ డబ్బులు కట్టేసి వాళ్ళని క్షమించమని అడగరా. 'మహాప్రస్థానం'లాంటి పుస్తకాన్ని దొంగతనం చెయ్యటంలో అర్థంలేదు" అది విన్న మూర్తిగాడి మొహం ముడుచుకుపోయింది. ఇంకా ఎవరెవరికి ఎన్నెన్ని అవమానాలున్నాయో అని అందరూ భయపడుతున్నారు.. ఈసారి రవిగాడు అడిగాడు "ఇంకా?"

"మనలో కొంతమంది నాగలక్ష్మి అనే జూనియర్ అమ్మాయిని ర్యాగింగ్ చేస్తే, ఆమె భయపడి పూర్తిగా చదువు మానేసిందిరా. ఆ అమ్మాయిని కూడా క్షమించమని అడిగి, వాళ్ళ కుటుంబం బాగోగులు పట్టించుకోండిరా. ర్యాగింగులు చేసి ఎవరూ ఎవరి ప్రగతిని ఆపెయ్యకూడదురా."

నర్సింగుగాడి కోరికలు విన్నాక, వాడి రూంలో నుండి బయటికొచ్చి అందరం పడీపడీ నవ్వుతున్నాం. ఆ నవ్వులో కళ్ళనుండి నీళ్ళు కూడా వస్తున్నాయి. ఆ నీళ్ళు ఆనంద బాష్పాలేనా నిజంగా...? ఇప్పుడు మీరు కూడా నవ్వుతున్నారా? మాలాగే నవ్వుతున్నారా? ఆ నీళ్ళు ఆనంద భాష్పాలు కావూ? నిజంగా కావూ? గుండె మంటల వలన ఉబికి వస్తున్న చిక్కటి కన్నీళ్ళు. ఈ నవ్వులన్నీ ఏడుపుల్లా భీకరంగా కన్నీళ్ళని చిలకరిస్తుంటాయి వాడి కోరికలు తీరేంతవరకూ.

●●●

## పగిడి

కె.బి.లక్ష్మి

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.

**"ఈసారి అంత సీన్ ఏమిటి? అసలు సీనే లేదు. నా లైఫ్‌లో ఫస్ట్ టైం తెలుసా, ఇలా జరగడం"**

పొద్దున్న లేచి ఇది పదో పదహారో ఫోను. చేసినవాళ్ళందరికీ చెప్పిన డైలాగ్ చెప్పకుండా ఓపిగ్గా చెప్పుకొస్తోంది శ్యామల. గత రెండు రోజులనుండీ ఇదే వరస. అలాంటి సంగతులు చెప్పేటపుడు సాధారణంగా ఆమె గొంతులో హుషారు గంతులేస్తూ ఉంటుంది. ఇవాళ అసహనం, ఉక్రోషం కలగలిసి కట్టలు తెంచుకుంటున్నాయి. అది ఏ క్షణంలోనయినా ఉప్పెనగా మారి నన్ను ముంచెయ్యొచ్చు.

కానీ నేనందుకు సిద్ధంగా లేను. ఇన్నేళ్ళ ప్రవర్తనారీతుల్ని బేరీజు వేసుకుంటూ ఆలోచనల సంఘర్షణలో తలమునకలై ఉన్నాను. ఆలోచనల ఉప్పెన నన్ను అనూహ్యతీరాలకి విసిరేసింది. తడి ఆరని తలపులతో లేచి నిలబడి ఇపుడిపుడే మెల్లిగా అడుగులు సారిస్తున్నాను. ఆ అడుగులు పరుగులు పెడతాయని తెలిసిన తర్వాత ఆమె మనస్థితిని ఇప్పుడే అంచనా వేయదల్చుకోలేదు. ఆ పరుగు ఆమెకి మనస్తాపం కావచ్చు. తప్పదు. ఏదయినా తనంతట తాను తెలుసుకోవాలేగానీ, ఇతరులు చెబితే అర్థం చేసుకోవడానికి సుతారమూ ఇష్టపడని ధోరణి.

తనవైపు ఒక వేలు చూపిస్తున్నాను గానీ, మిగతా నాలుగు వేళ్ళూ నా వైపు ఉండి నిలదీస్తున్నాయన్న స్పృహ ప్రతాప్ వల్లే వచ్చింది. అందుకు రాకేష్‌కి కూడా కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

●●●

"గుడ్ మార్నింగ్ సార్" ప్రోటోకాల్ ప్రకారం కారు వెనక డోర్ తీస్తూ వినయంగా విష్ చేశాడు రాకేష్.

చిరునవ్వుతో తిరిగి విష్ చేసి "వెనక వద్దు. నేను ముందు నీ పక్కనే కూర్చుంటాను" అన్నాను. ఆశ్చర్యంగా చూసి, సంతోషంగా ఫ్రంట్ డోర్ తెరిచారు.

"రాకేష్, ఆఫీసు పని అయిపోయింది. ఇపుడు నేను మామూలు పర్యాటకుడిని మాత్రమే. ఫ్రెండ్లీగా ఉందాం. ఈ పెద్ద హోటళ్ళలో కాఫీలు, టీలు తాగి, తిని విసుగొచ్చింది. ఏదైనా రోడ్డు పక్క టీస్టాలు చూడు. మనిద్దరం చాయ్ తాగుదాం" అన్నాను కూర్చుంటూ.

"నిజంగానా! చలో, మీ అద్భుతమైన ఝఫ్‌డ్ చాయ్ తాగిస్తా" అంటూ వేగం పెంచాడు. ఉదయం వేళ, జనం అంతగా లేని రోడ్డుమీద కారు హాయిగా సాగిపోతుంది.

చమత్కారం, సెన్సాఫ్ హ్యూమర్ ఉన్న రాకేష్ మంచి మాటకారి. స్థానిక రాజస్థానీ యువకుడు. ముప్ఫయి ఆరేళ్ళుట. పన్నెండేళ్ళ కూతురు, పదేళ్ళ కొడుకు. చదువుకుంటున్నారు. భార్య గ్రామంలో చిన్న పచారీ దుకాణం నడుపుతుంది. రెండు గేదెలు, నాలుగు ఆవుల పాడి, అమ్మ నాన్న, తమ్ముడు, పెళ్ళి కావల్సిన చిన్న చెల్లెలు వీళ్ళింటి దగ్గరలోనే ఉంటారు.

తనుకూడా చదువుకున్నారు గానీ ఇంగ్లీష్ అంతగారాదు. అందుకే విదేశీ పర్యాటకులకి తను డ్రైవర్‌గా వెళ్ళలేదుట. టిప్పులివ్వడంలో భారతీయుల కంత ఉదారత లేదన్నాడు. ఉన్నంతలో తన హిందీ మాటకారితనానికి స్ఫురద్రూపానికే డ్రైవర్ ఉద్యోగం దొరికిందన్నాడు. స్టీరింగ్ మీద పట్టున్న డ్రైవింగని రాత్రివేళ ఘాట్ రోడ్డు ప్రయాణం చెప్పింది.

జైపూర్‌లో ఆఫీసుపని. పనయ్యాకా ఇంకో నాలుగురోజులుండి మౌంట్ అబూ, ఉదయపూర్, చిత్తర్ ఘడ్ అవీ చూడాలనుకున్నాను. వాళ్ళే ట్రావెలర్స్‌తో మాట్లాడి మంచి కారు ఏర్పాటు చేసి పెట్టారు.

చిన్న చాయ్ కొట్టుముందు కారాపాడు. తెలిసినవాళ్ళే అంతా. రెగ్యులర్ డ్రైవర్ కదా! నవ్వుతూ పలకరింపులు, కార్లోకే తెచ్చిస్తానన్నాడు. నేనూ దిగాను. కొట్టుముందు చెట్టుకింద ఉన్న రాతి బల్లమీద కూర్చున్నాను. గాజుగ్లాసులో వేడివేడిగా చూడ్డానికే ఎంతో బాగుంది. అల్లం టీ రుచి అదిరింది. డబ్బులిస్తుంటే వారించి తనే రెండు టీలకి పదిరూపాయలిచ్చాడు.

"పది పక్కన ఇంకో సున్నా పెట్టినా స్టార్ హోటల్ టీకి ఈ రుచి రాదు" అన్నాను కారెక్కాక.

"చిన్న చిన్న జీవితాల్లోనే గొప్ప ఆనందం ఉంటుంది. గొప్ప గొప్పవి మాన్యుమెంట్స్‌లాంటివి. రెండింటి అనుభవాలు, అనుభూతులు వేర్వేరు సార్. చిన్నవి హృదయానికి హత్తుకు పోతాయి. గొప్పవి హృదయందాకా వచ్చిపోతాయి" అన్నారు యధాలాపంగా. అంతే కాదు తమ కుటుంబ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వాటికొచ్చే ప్రాధాన్యత, ఆడవాళ్ళెలా మసులుకుంటారు, మగవాళ్ళెలా ఉంటారు అన్నీ చెబుతూ పోతున్నారు. ఆశ్చర్యపోతూ, మెచ్చుకోలుగా చూస్తూ, ఆనంద పడుతూ మధ్యమధ్య మనవాళ్ళతో పోల్చుకుని కించిత్ విచారిస్తూ 'ఆ.ఊ..' అంటూ అతని వాక్ప్రవాహంలో కొట్టుకుపోతున్నాను.

మధ్యాహ్నం శాకాహారి భోజనాలయ్‌లో రాజస్థానీ థాలీ తింటూ అడిగాను, "నువ్విలా రోజుల తరబడి రోడ్డుమీదే ఉంటే మరి భార్యా పిల్లలు?" అని.

మనసారా నవ్వాడు. "నా పెళ్ళయిన కొత్తల్లో అమ్మవాళ్ళతోనే ఉండేవాళ్ళం. తర్వాత నాన్న పక్కనే ఇల్లు కొనుక్కునేందుకు సాయంచేశారు. కుటుంబం కలిసి ఉన్నట్లే కానీ ఎవరి సొంత బాధ్యతలు వాళ్ళవి. ఆమెను వదిలి ట్రావెలర్స్ డ్రైవర్‌గా ఊళ్ళు తిరగడానికి జంకేవాణ్ణి. ఎన్నో వింటున్నాం. యవ్వనంలో, చిన్నవయసులో ఉన్న నా భార్యని ఎవరైనా ప్రలోభ పెట్టొచ్చు. తనే ప్రలోభపడచ్చు అని ఆలోచించేవాణ్ణి. సాధ్యమైనంత వరకు సిటీ సైట్ సీయింగ్‌తో సరిపెట్టేవాడిని. దానికి తగ్గట్టు డబ్బులు బొటాబొటి. వెంట వెంటనే పిల్లలు, ఖర్చులు. ఉన్న పాడిని అమ్మినా ఇల్లు కష్టం మీద గడిచేది. నా భార్య ఇందిరే నాకు ధైర్యం చెప్పింది. ఆమె ప్రవర్తన నాకు నమ్మకాన్నిచ్చింది. ఇప్పుడు నాకే చింతా లేదు. ఇల్లు, పిల్లలు, చదువులు, అమ్మానాన్న అన్నీ ఆమే చూసుకుంటుంది. నా కంటే ఎక్కువే చదువుకుంది. ఇప్పుడు పిల్లల పుస్తకాల్లోంచి ఇంగ్లీష్ కూడా నేర్చుకుంటోంది.."

బిట్ కొశ్చెన్‌కి ఎస్సే ఆన్సర్ రాసినట్లు విస్తారంగా మాట్లాడుతాడు రాకేష్. రాజస్థానీ యాసతో అతని హిందీ, మధ్య మధ్య ఇంగ్లీష్ పదాల గమ్మత్తు ఉచ్చారణతో వింటున్న కొద్దీ వినాలనిపిస్తుంది. పర్స్‌లోంచి నలుగురూ ఉన్న ఫ్యామిలీ ఫోటో తీసి చూపించాడు.

వాళ్ళ పిన్నికొడుకు పెళ్ళిలో ఈ మధ్యే తీసిందిట. ఇందిర ఫక్తు రాజస్థానీ వస్త్రధారణలో ఉంది. తండ్రీ పిల్లలు జీన్స్, టీ షర్ట్‌లు మోడ్రన్‌గా ఉన్నారు.

"సార్ లంచ్ తర్వాత మిమ్మల్ని ఒక చోటికి తీసుకెళతాను. మహారాణీ చీరలు, ఉంగరంలో పట్టే బాందినీ షిఫాన్ చీరలు, రాజ్‌స్థానీ హస్తకళలు.. అవీ, ఇవీ" అన్నాడు.

నా జేబులో శ్యామల రాసిచ్చిన చాంతాడంత లిస్ట్ కాగితం మడతలు రెపరెపలాడాయి "ఇప్పుడేం వద్దు. ప్రదేశాలు చూడ్డమే ముఖ్యం" అన్నాను.

"ఆశ్చర్యంగా ఉంది. ఇక్కడికి వచ్చిన వాళ్ళంతా తెచ్చిన డబ్బులు సరిపోక 'డాక్ పార్శిల్స్'తో సరుకులు, బట్టలు, నగలు పంపుతారు. మీరు అలాకాదు. సింపుల్. నాకు నచ్చారు" అన్నాడు. 'నా పూర్వానుభవాలు నీకేం తెలుసు? అందుకే అలా అనుకుంటున్నావు' అనుకున్నాను మనసులో.

నిదానంగా, విస్తారంగా చారిత్రక స్థలలన్నీ చూస్తున్నాను. రాకేష్ నాకు గైడ్ కమ్ డ్రైవర్. వాటి నేపథ్యంలో నా డిజిటల్ కెమెరాతో బోల్డన్ని ఫోటోలు కూడా తీశాడు.

వాటిల్లో చిత్తోర్ ఘడ్‌లో కోట మీద ఒక చోట నాకు రాజస్థానీ దుస్తులు వేయించి, వీరుడిలా ఫోజు పెట్టించి, కరవాలం చేతిలో పెట్టి విడిగానూ, గుర్రం మీద, ఒంటిమీద రకరకాలుగా ఫోటోలు తీశాడు. దుస్తులు వేసినందుకు, గుర్రం వాడికి, ఒంటెవాడికి ఒక్కొక్కరికీ పదిరూపాయలే! పర్యాటకుల్ని లూటీ చేయడం లేదక్కడ, పదిరూపాయల కున్న విలువ నమ్మశక్యంకాలేదు.

"ఊటీ జైపూర్లో ఉంటుంది సార్. ఈ కోటమీద ఉండదు. మీలాంటి వారు రోజుకి పది, పదిహేను మంది వస్తే చాలు వాళ్ళకి. వీళ్ళంతా ఒకరికొకరు ఆత్మీయులే. అదిగో ఆ ఫోటోలు తీసే అతను ఫోటో తీసి ఇచ్చినందుకు ముప్పయ్ రూపాయలే తీసుకుంటాడు. టూరిస్ట్‌ని కిందనుండి ఫాలో చేసి, ఇక్కడదాకే తెచ్చి, దుస్తులిప్పించి వీళ్ళకో పదిరూపాయల రాబడి చూపిస్తాడు." అంటూ చెప్పుకొచ్చాడు. నిజమే! జైపూర్ మ్యూజియం దగ్గర తను ఫోటోకి వంద అడిగాడు. సహకారాన్ని సహృదయతతో అందించేవారి జీవన సరళికి జోహారులర్పించాను.

తిరుగు ప్రయాణం చివరి మజిలీలో ఒక దాబా దగ్గర ఆగాడు. అక్కడే తన దూరపు బంధువు మామయ్య వరసయిన ప్రతాప్‌ని పరిచయం చేశాడు రాకేష్. రోటీలు, కూరా, పప్పూ వచ్చేలోపల కబుర్లలో పడ్డాం. రాకేష్ చాలా సమజ్దారని మెచ్చుకున్నాడు ప్రతాప్.

అరవైదాటిన నిక్కాకు శరీరం ప్రతాప్‌ది. నల్లగా, సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. ముఖానికి మీసాలు, తలమీద పెద్ద తలపా అతనికి బరువైన గాంభీర్యాన్ని తెచ్చిపెట్టాయి. అనుకోకుండా అక్కడ కలిసిన వాళ్ళిద్దరూ ఏవో కుటుంబ ముచ్చట్లలో పడ్డారు. కుటుంబ సంబంధాలకి, అన్ని బంధాలకి, మానవీయ విలువలకి వాళ్ళిచ్చే విలువ మర్యాద చూస్తుంటే ముచ్చటేసింది.

రోటీలు తిని, లస్సీ తాగాను. వాళ్ళిద్దరూ టీ చెప్పారు. సెల్ మోగితే మాట్లాడ్డానికి ఇవతలకి వస్తూ రాకేష్ చేతిలో బిల్ కోసం ఐదువందల నోటు పెట్టాను. ఇద్దరూ వారించారు. నేను వినలేదు. కాస్త దూరంలో పెద్దచెట్టుకింద దాభా వాళ్ళు కట్టిన చప్టామీద కూర్చున్నాను. కాస్సేపటికి ఇద్దరూ వచ్చి నా పక్కనే చతికిలబడ్డారు. బిల్లు కట్టగా మిగిలిన డబ్బులు నా చేతిలో పెట్టాడు రాకేష్.

రాజస్థాన్‌లో దారి పొడుగునా నా దృష్టికి వచ్చిన తలపాగాల గురించి అడిగాను. రాకేష్ ప్రతాప్‌ని చెప్పమన్నాడు.

వేడుకులకి పెట్టుకునేవి, సంప్రదాయంగా శుభకార్యాల్లో ధరించేవి, అలంకార ప్రాయమైనవి అంటూ వాటిల్లో రకాల గురించి చెప్పుకొచ్చాడు ప్రతాప్.

"విప్పితే పెద్ద చీరంత ఉండే బట్టని మెలివేసి, నెత్తిమిద బుట్ట బోర్లించినట్లు భారంగా కనిపించే మీ తలపాగా సంగతి? మీలాంటి వారు ఈ ప్రయాణంలో తరచూ తారసపడుతున్నారే!" అనడిగాను.

ప్రతాప్ నవ్వుతూ రాకేష్ కేసి చూశాడు. రాకేష్ నువ్వే చెప్పమన్నట్లు సైగ చేశాడు.

"మా సంప్రదాయంలో తండ్రిపోయిన పదోరోజున కర్మ చేసేటప్పుడు ఇంటి పెద్దకొడుకు నెత్తిన ఈ పగిడీ పెడతారు. అది మొదలు వాడు తండ్రి తర్వాత ఇంటికి పెద్దగా కుటుంబ బరువు బాధ్యతలన్నీ స్వీకరించాలి. కష్టసుఖాలు, మంచి చెడ్డలు చూసుకోవాలి. అంతా తండ్రి ఉన్నప్పటిలాగే, తండ్రి తర్వాత తండ్రి అంతటివాడిగా సర్వం భరించాలి, అటుపైన ఏ సందర్భంలోనైనా బంధుమిత్రులెవరైనా సరే, పెద్దకొడుక్కి బట్టలు పెట్టాల్సి వస్తే, బట్టలతో పాటు పగిడీకూడా పెట్టాల్సిందే, స్తోమతును బట్టి పగిడీ బట్ట నాణ్యత. స్నానం చేసేటపుడు, పడుకున్నప్పుడు మాత్రమే మేమిది తలమీంచి తీస్తాం. ఇంకెప్పుడూ తియ్యం. అలవాటయిపోయిన ఈ పగిడీ శిరోభారమనిపించదు. అనిపించినా తప్పదు. నిరంతరం కర్తవ్యాన్ని, బాధ్యతను గుర్తుచేస్తూంటుంది. పగిడీతోనే పెద్దకొడుకుగా గుర్తించి అందరు కూడా "ఏరా? ఏమిటి సంగతి? అంతా బాగేనా?" అని క్షేమసమాచారాలడుగుతుంటారు" అన్నాడు ప్రతాప్ మీసం సవరించుకుంటూ.

"మీ బాధ్యతలు తీరాయా మరి?" వేశాక అనిపించింది పిచ్చి ప్రశ్న అని.

"తీరినా ఇది ధరించాల్సిందే ఇది సాధారణ పగిడీకాదు. తండ్రి తర్వాత కుటుంబం పట్ల శ్రద్ధ వహించి, వాళ్ళ అక్కరలు నెరవేర్చి, తీర్చిదిద్దినవాడిగా, పెద్దరికం నిలబెట్టుకున్నందుకు ఇది గౌరవ చిహ్నం కూడా. ఇది తలమీదుంటే ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందే" అన్నాడు గర్వంగా మెరిసే కళ్ళతో లేచి నిలబడి. సంప్రదాయాన్ని, అనుబంధాన్ని మర్యాదించే నిలువెత్తు సహృదయ సంస్కారం సాక్షాత్కరించినట్లయింది.

వెంటనే లేచి అతడిని కౌగలించుకున్నాను. భుజం తట్టి అభినందించాను. రాకేష్ చేతికి కెమెరా ఇచ్చాను. ఒక నోబెల్ శాంతి బహుమతి విజేతతో ఫోటో తీయించుకున్న ఉద్వేగ భరిత అనుభూతికి లోనయ్యాను.

"మీరెటు వెళ్ళాలి? మాతో రండి కార్లో" అన్నాను.

"లేదు. నాకు వేరే పనుంది. మోటర్ బైక్ మీద వచ్చాను. వస్తాను. మీ పరిచయం చాలా ఆనందం. రాకేష్ బేటా, మళ్ళీసారెపుడైనా ఈ సార్ వస్తే మనింటికి తీసుకురా, వస్తాను సాబ్" అంటూ బైక్ వైపు నడిచాడు. 'చేతక్' వైపు నడుస్తున్న రాణా ప్రతాప్‌లా.

బైటి ఊరి ఆఫీస్ పని ఇంత రిలీఫ్‌ని ఇదివరలో ఎన్నడూ ఇవ్వలేదు.

●●●

"ఎంతసేపలా సిస్టం ముందు కూర్చుని చూసిన ఫోటోలే చూసుకుంటూ ఉంటారు? వెళ్ళేటప్పుడు ఏం కావాలని అడిగిమరీ జాబితా తీసుకెళ్ళారు. అందులో ఒక్కదానికీ గతిలేదు. ఇన్సల్ట్"

"నేను పక్కనే ఉన్నా కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు ఎందుకంత గట్టిగా మాట్లాడతావ్? అక్కడి ఫోటో ఆల్బమ్స్, చరిత్ర ఘనతని చెప్పే పుస్తకాలు, సిడీలు తెచ్చానుగా, కలిసి చూద్దాంరా"

"నాకేం అక్కర్లేదు. కోటలు, గోడలు అన్నిచోట్లా ఉంటాయి, మన ఊళ్ళో మాత్రంలేవా గోల్కొండలు, చార్మినార్లూ?" శ్యామ గొంతులో విపరీతమైన కోపం, విసుగు.

"నీకు మాత్రంలేవా వార్డ్‌రోబుల నిండా బట్టలు, నగలు? బట్టల దుకాణాలు, సిల్క్ ఫ్యాబ్‌లు, అన్నిరకాల ఎగ్జిబిషన్స్‌ని ఏటికేడాదీ పోషిస్తూనే వుంటావు. మనింట్లో లేని వస్తువులు, హ్యాండీ క్రాఫ్ట్‌లేవు. వాటిని సరిగా సర్ది పెట్టడానికే మనకి సమయం లేదు. పైగా ఎక్కడికెళ్ళినా మళ్ళీ మనింటికోస్మ కొన్ని, గిఫ్ట్‌ల కోసం కొన్ని. ఎందుకు చెప్పు వట్టి పుణ్యానికి వేలకు వేలు తగలెయ్యడం? మన అవసరం ఉన్నవాళ్ళకిస్తే సంతోష పడతారు శ్యామా. నా మాట విను." తనతో మాట్లాడుతూనే ఫోటో షాపింగ్ చేస్తున్నాను. స్క్రీన్ మీద ప్రతాప్‌తో తీయించుకున్న ఫోటో జూమ్‌లో ఉంది.

"నా ఫ్రెండ్స్ అందరికీ ఎన్నో చెప్పాను. రేపు కిట్టీ పార్టీకి ఏ ముఖం పెట్టుకుని వెళ్ళాలి? ఛఛ, ఇన్సల్ట్"

"నీ ముఖం పెట్టుకునే వెళ్ళు. అవమానం దేనికి? అయినవాళ్ళని అహంభావంతో దూరం చేసుకున్నందుకు అవమానపడాలి. తాత, నానమ్మ, అత్త, చిన్నాన్న ఎవరి పట్లా ప్రేమలు లేకుండా పిల్లల్ని పెంచి, ఉద్యోగాల వేటలో సుదూరాలకు తోలేసినందుకు అవమానమపడాలి. మనిషివనన్న స్పృహ కోల్పోయి ఒంటిపిల్లి రాకాసిలా మారినందుకు, ఇంకా చాలాచాలా వాటికి అవమానపడాలి. పశ్చాత్తాప పడాలి. ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. మనమేం చిన్నపిల్లలం కాదు. నా జీవితంలోకి వచ్చిన నీ సున్నితమైన మనసుని కలత పెట్టకూడదని ప్రతిదానికీ సరేనంటూ వచ్చాను. ఆ ఒత్తిడిని భరించినందుకు ఫలితం?

మనిద్దరి మధ్య కృతకత్వం నిండిపోతోంది. బతుకు మెటీరియలిస్ట్‌గా మారిపోయింది. ఇంక ఈ యాంత్రికతని నేను సహించలేను. పరిస్థితుల్ని అదుపు చేయలేకపోవచ్చు. కానీ ఆలోచనల్ని, ఆచరణలని అదుపు చేసుకోవచ్చు. ప్రయత్నించు. నన్ను విసిగించకు. నువ్వూ నీ టెంపరిమెంట్స్ నుండి బైటికిరా. ఇన్నాళ్ళూ ఈ మాట నేను చెప్పలేకపోయినందుకు చెప్పనందుకు సిగ్గుపడుతున్నాను. నా ఆవేశం నీకు కొత్తగా ధ్వనించవచ్చు. కాస్సేపు నిశ్శబ్దంగా నీలోకి నువ్వు చూసుకో, జీవిత ప్రయోజనం అర్థం అవుతుంది.

అలా చూడకు. ఇది ఉపన్యాసం కాదు. హితోపదేశము కాదు. సంవత్సరాలుగా గుండెల్లో చెడ్డ కొలెస్ట్రాల్‌లా పేరుకుపోయిన బాధ, ఇవాళ దానికి ఈ ఫోటోలోని ప్రతాప్ చేసిన వైద్యంతో కరుగుతోంది. అన్ని గిఫ్ట్‌ల కంటే జీవితం గొప్ప గిఫ్ట్ శ్యామా. అర్థం చేసుకో నన్ను. నో డౌట్ ఐ లవ్యూ సోమచ్. అంటే అందర్నీ దూరం చేసుకుని, రాకపోకలు కట్టడి చేసి మనిద్దరం ఒక వలయం గీసుకుని అందులో ఉండి పోవాలనికాదుగా. నీకు మంచి చెప్పే మీ అమ్మానాన్నలన్నా పడదు. ప్చ్! ఏం సాధించాం శ్యామా? సంపాదన తప్పు? ఆపేక్షలు లేక మానసికంగా ఎంత పేదవారమో ఆలోచించావా? పిల్లలు పెళ్ళీడుకొచ్చారు. మన నెత్తిమీద తెల్లవెంట్రుకలు మెరుస్తున్నాయి. అజ్ఞానానికి సూచనగా."

శ్యామల నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. అంటే ఆలోచిస్తోందన్నమాట. ఆశ ఎంత శక్తినిస్తుందో అవగతమౌతోంది.

కంప్యూటర్ తెరమీద ప్రతాప్, నేనూ ఉన్న ఫోటో మాయమై, ఆత్మీయతానురాగాలు రాశిపోసినట్లు నా కుటుంబ సభ్యులందరి గ్రూప్ ఫోటో ప్రత్యక్షమైంది. అది ఒక బలమైన భావన.

జీవితంలో ప్రత్యేకించి పొరపాట్లూ యాదృచ్ఛికాలూ ఉండవు. ప్రతి సంఘటనా పాఠం నేర్పేదే. కర్తవ్యం భుజం తడుతోంది. తలకెత్తుకోవాల్సిన బాధ్యత తచ్చాడుతోంది. క్షణం కళ్ళుమూసుకుని తెరిచాను.

ప్రతాప్ తలమీది పగిడీ తీసి ఫోటోలోని నాతలపై పెట్టాను, అతని కళ్ళల్లోని గర్వరేఖ నా కళ్ళల్లో ప్రతిఫలిస్తోంది. దట్స్ఇట్. తేలికైన మనసుతో పగిడీతో ఉన్న నా ఫోటో విడిగా కట్ పేస్ట్ చేసి, ప్రింటవుట్ తీశాను.

"ల్యామినేషన్ కివ్వండి" అంది శ్యామ నా భుజాల మీద చేతులేసి సున్నితంగా నొక్కుతూ.

తల వెనక్కి వాల్చి ఆమె గుండలకి ఆనించి, కళ్ళెత్తి తన కళ్ళల్లోకి చూసాను. ఇద్దరి పెదవులపై హాయైన చిరునవ్వు. ***

# మానసిక పరివర్తన

కుంతి

**ఎవరో వచ్చినట్లు అలికిడైతే కళ్ళు తెరిచాడు.** నర్సు నవ్వుతూ పలుకరించింది. దగ్గరికి వచ్చి 'లాస్ట్ ఇంజక్షన్, దీనితో మీకివ్వాల్సిన 'కోర్స్ ఆఫ్ మెడిసన్ ముగిసింది' అంటూ సున్నితంగా ఇంజక్ట్ చేసి వెళ్ళిపోయింది. కళ్ళు మూసుకున్నాడు.

●●●

**ప్రియమైన దివ్య,**

ఎంతగానో ప్రిపేరై నీకీ నాలుగు ముక్కలు వ్రాస్తున్నాను. నీవు గెలిచావు. నేను ఓడిపోయాను. నిన్ను ప్రత్యర్ధిగా చేసుకుని, నీవు ఆడని, నేను ఆడిన ఆటలో నీవు గెలిచావు. నీ ఔన్నత్యం, ఔదార్యం, కారుణ్యం, మానవత్వం, దౌర్భల్యం, నీచత్వం నన్ను కుంచింపచేస్తూ, గంగ ఆకాశం నుండి నేలకు ఆపై పాతాళానికి దిగినట్లుగా నన్ను పాతాళానికి చేర్చింది. ఔను! నిన్ను ఓడించాలని నేను గెలవాలని అనుకుంటే నీవు గెలిచావు. నేను గెలవాలని నీవు ఓడాలని నీవు అనుకుంటే నేనోడిపోయాను.

ఏమిటి ఇదంతా? ఏమిటి వ్రాస్తున్నాడు? అర్ధం కాలేదు కదూ. మన రెండేళ్ళ సంసారంలో నీవు నాకొక తెరిచిన పుస్తకం. నేను నీ పాలిటి ప్రహేళిక. చిత్రకవిత్వం. నేను పెళ్ళి చూపుల్లో నిన్ను చూడగానే ఒక్కసారిగా నాకు కలిగిన అదృష్టానికి అబ్బురపడ్డాను. ఆ తరువాత భయపడ్డాను. నీవు చాలా అందమైన దానివి. బాగా చదువుకున్న దానివి. ఆస్తిపాస్తులున్న దానివి. ఉన్నతోద్యోగివి. ఉన్నత సంస్కృతీ, సంప్రదాయ కుటుంబం నుండి వచ్చిన దానివి. మరి నేను కురూపిని. పెద్దగా చదువుకోలేదు. ఆస్తిపాస్తులు లేవు. కంట్రాక్ట్ ఉద్యోగిని. నాదొక ఇరుకు ఇల్లు, నావాళ్ళొక కరుకు మనుషులు. నేను నీకు ఏ రకంగా సరిపోను. టోటల్లీ మిస్ మ్యాచ్. పెళ్ళిలో మీ వాళ్ళ ఆతిథ్యం, స్నేహం మా బంధువుల్లో నిన్ను, నీ కుటుంబ సభ్యులను అంతెత్తున నిలబెట్టింది.

అప్పటి నుండి నాలో, ' ఇంత ఉన్నతమైన లక్షణాల గల స్త్రీ నన్ను పెళ్ళి చేసుకోవడమేమిటి? ఇంత ఉన్నతమైన కుటుంబానికి నేను నచ్చడమేమిటి? ' అన్న సందేహాలు రాసాగాయి. నీవు మా ఇంటికి వచ్చినప్పటి నుండి మా గంపెడు సంసారాన్ని నెత్తిన కెత్తుకుని ఒక వైపు ఆఫీసు పనులు, మరొక వైపు ఇంటి పనులతో సతమౌతూనే నాపై అపరిమితమైన అనురాగాన్ని చూపేదానివి. నేను నీతో బాగానే ఉంటున్నప్పటికీ, నా మెదడులో నీ గురించి ఆలోచనలు తొలిచి వేసేవి.

అప్పుడప్పుడు తీరిక వేళల్లో మనము 'చెస్' ఆడేవారం. ఎప్పుడు నేనే గెలిచేవాడిని. నిజానికి నాకు చెస్ అంతగా రాదు. నేనెందుకు గెలుస్తున్నాను అన్న సందేహం కలిగేది. ఒకసారి నీవు లేనప్పుడు నీ పెట్టెను వెదికాను. అందులో చెస్‌లో నీవు పొందిన సర్టిఫికెట్లు కనిపించాయి.

అదేవిధంగా నాకు వెహికల్ డ్రైవింగ్ రాదు. మనమెక్కడికి వెళ్ళినా నీవు డ్రైవ్ చేస్తే, నీ వెనుక నేను కూర్చునేవాడ్ని. నీవు, నీకు డ్రైవింగ్ అంతగా తెలియనట్లుగా, నాకు తెలిసినా నీతో డ్రైవింగ్ చేయిస్తున్నట్లుగా మాట్లాడుతూ డ్రైవింగ్‌లో మెళుకువలు, సలహాలు అడిగేదానివి.

ఇక నీ ఆధ్యాత్మిక జ్ఞాన సౌగంధిక పరిమళం, సాహిత్య లోకపు లోతైన జ్ఞానం, అనేక భాషల పట్ల నీకున్న పట్టు నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేది. అయితే నా దగ్గర పామరత్వం వహించి ఉండేదానివి. నాకు మాట్లాడడమే చాతకాదు. నీ సంభాషణా చాతుర్యం

అమోఘం. ఇక నా మొహానికి నవ్వే తెలియదు. 'నీవు నవ్వినా ఏడ్చినట్లుంటుందని' నన్ను నా మిత్రులు అనేవారు. మరి నీ మోములో పండు వెన్నెల వాన. నాలో నేను నాకై బ్రతుకుతాను. నీవు పదిమందితో, పదిమందికై బ్రతుకగలవు.

అయినా నీకన్నా ఎక్కడైనా ఒక మెట్టు ఎక్కువ ఉండాలని తపించేవాడిని. అంతరంతరాలలో అన్నిరంగాలలో నాకంటే ఎత్తుగా ఉండే నిన్ను సహించలేకపోయేవాడిని. నా పురుషాహంకారము, మగడు అన్న భావం నీకంటే తక్కువగా ఉండడం సహించకపోయేది.

అన్నట్లు మగడు అంటే గుర్తుకు వచ్చింది. నాలో నేను ముడుచుకుపోయే గొంగళిపురుగు తనము వల్లనో మరెందు వల్లనో ఆ మధ్య కొన్నిరోజులు పడగ్గదిలో మగాడిని కాలేకపోయాను. అది గమనించి నీవు నాదేమి తప్పులేదన్నట్లుగా, నీలో లోపమే దానికి కారణమన్నట్లుగా చెప్పేదానివి. కానీ నిజం నాకు తెలుసు.

ఏమిటి? నాలో ఇన్ని లోపాలున్నా ఇన్ని తక్కువలున్నా ఈమె ఇలా ఉంటుందేమిటి? అంటే వీటన్నిటికీ మించి ఇంకా ఏదైనా పెద్ద లోపం ఉందా? పూర్వ వైవాహిక జీవితంలో ఏదైనా పాపం చేసిందా? అసలు ఈమె పెళ్ళికి ముందు కన్యయేనా? ఇలాంటి ఆలోచనలు రాగానే నీ గురించి ఆరా తీసాను. నీవు చదివిన కాలేజీలకు వెళ్ళాను. నీ పాత స్నేహితురాళ్ళను కలిసాను. నీలో ఏ చెడు నడత లేదని తెలుసుకున్నాను, నీవు పనిచేసే ఆఫీసులో నీ ప్రవర్తన గురించి కనుక్కున్నాను. నిప్పుకు చెదలు అంటదని, నా కళకు పచ్చ కామెర్లని తెలుసుకున్నాను. నీకేవైనా పెద్దరోగాలు ఉన్నాయేమో, అవి దాచుకుని నాతో కాపురం చేస్తున్నావేమోననిపించింది. వెంటనే జనరల్ చెకప్ పేరుతో నిన్ను హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళాను. డాక్టర్ల డయాగ్నసిస్‌లో, నీవు పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్ అని, నేను మెంటల్లీ సిక్ అని తేల్చాయి.

అన్ని రంగాలలో ఎంతో ఎత్తులో ఉన్న నీవు మాములు గృహిణిలా అత్తా, మామలకు, భర్తకు సేవ చేయగలవో, లేదో చూడాలని అనుకున్నాను. ఆ మధ్య ఒకసారి కావాలనే మాయరోగం తెచ్చుకుని పడకేసాను. ఇంట్లో వాళ్ళను ఇటు పుల్ల అటు పెట్టనివ్వకుండా చూసుకున్నావు. మావాళ్ళను నెత్తిన పెట్టుకుని చూసావు. ఒకవైపు ఉద్యోగం, మరొక వైపు సాహిత్య, సామాజిక సేవలు చేస్తూనే నన్నూ, నా వాళ్ళను అంతకంటే ఎక్కువగా సేవించావు.

నీకు నేను ఆడే నాటకాలన్నీ తెలుసు, తెలిసినట్లుగా ఉండవు. సూత్రధారుడి ఆదేశాలతో పాత్రధారుడిలాగా చేస్తూ పోతావు.

ఒకసారి నా పుట్టినరోజు సందర్భంగా నీవు మా ఇంటిల్లిపాదికి కొత్తబట్టలు తెచ్చావు. నేనవి వేసుకుని ఆఫీసుకు వెళ్ళాను. 'చింపాంజీకి సూట్ తొడిగినట్లుంది' అని ఒకరు, పెళ్ళాం సంపాదిస్తుంటే కులుకుతున్నాడని మరొకరు. ఇలా తలా ఒకరు తలా ఒక కామెంట్ చేసారు.

ఆ రోజు నీపై చాలా కోపం వచ్చింది నిన్ను ఏ విధంగానైనా చంపేయాలని అనిపించింది. కానీ ఆ ప్రయత్నాలు చేయలేదు.

ఇంకొక విషయం గుర్తుకు వస్తుంది. ఒకసారి మనం మా ఊరికి వెళ్ళాం. అక్కడ చెరువు గట్టు మీద నడుస్తూ, నేనేదో చెబుతూ ఉంటే నీవు ఊకొడుతున్నావు. మాటల్లో నీకు నీళ్ళంటే భయమన్నావు. నీలో మొదటిసారిగా లోటు కనిపించింది. నాలో ఏదో తెలియని కసి. నిన్ను భయపెట్టాలనుకున్నాను. నీళ్ళంటే భయపడని నా ఆధికత్యను చూపాలనుకున్నాను. కానీ విచిత్రం అక్కడ ఉన్న బురదలో కాలు జారి నేను నీళ్ళలో పడిపోయాను. నాకు ఈతరాదు. నీవు వెంటనే చెరువులోకి దూకి, నన్ను ఒడ్డుకు చేర్చావు. నా అల్పత్వం బయటపడింది. బయట పడినందుకు చచ్చేంత సిగ్గుపడ్డాను. చచ్చినా బాగుండు అనుకున్నాను. ఆ తరువాత 'నీళ్ళంటే భయం కదా' అన్నాను. 'ఔను! కానీ ఈత వచ్చు. చిన్నప్పుడు నేర్చుకున్నాను. అది ఇప్పుడు ఉపయోగపడింది' అన్నావు.

ఇలా మన ఈ రెండు సంవత్సరాల కాపురంలో అనుక్షణం నిన్ను పరీక్షించాను. ప్రతి పరీక్షలో నీవు గెలుస్తూ, నేను ఓడుతూ వచ్చాను. నా ఈ బాధ, స్థితి నా మిత్రుడికి చెప్పుకున్నాను. 'నీ భార్య దేవత. ఆమె, మామూలు మనుష్యులకుండే అసూయా, ద్వేషాలు వంటి స్థితిని ఏనాడో దాటింది. ఆమె నీకు దేవుడిచ్చిన వరం. ఇక నీవో మూర్ఖుడివి. చేతిలో ఉన్న బంగారాన్ని మట్టి ముద్ద

అనుకుంటున్నావు. నీకున్నది ఆత్మన్యూనతా భావం, అనుమానరోగం. దీనికి తోడు మగాడిని అన్న అహం. ఆమె పైన ఎలాగైనా ఆధిక్యత కనబరుచుకోవాలనే తపనతో నీవీ పరిస్థితిలోకి వచ్చావు. కొందరి మగాళ్ళకు భార్యా రూపవతి శత్రువు కాని నీ విషయంలో భార్యా అనుకూలవతి శత్రువు. నీవు అల్పుడవు. నీ గురించి, నీవు చేసిన పనుల గురించి తెలుచుకుంటేనే కంపరం పుడుతుంది. వీలైతే నీ ఆలోచనా విధానాన్ని మార్చుకో. ఏదైనా ఒక రంగంలో బాగా కృషిచేసి, పేరు ప్రఖ్యాతులను సంపాదించుకో. ఆమె కన్నా ఎత్తుకు ఎదిగే ప్రయత్నం చెయ్యి. కానీ ఆమె నీ కన్నా ఎత్తుగా ఉండని ఆమె కంఠాన్ని కోసే ప్రయత్నం చేయకు. వెళ్ళు! వెళ్ళి నీ భార్యను మనస్ఫూర్తిగా ప్రేమించు. ప్రపంచంలో ఏ కొద్ది మందికో లభించే అరుదైన భార్యను పొందావు. మతిహీనులు భాగ్యాన్ని పొందికూడా, ఆ భాగ్యాన్ని ఆస్వాదించలేరు. ఆ కోవలోకి నీవూ వెళ్ళకు` అని తెగేసి చెప్పాడు.

ఈ సంఘటనల పరంపరలో నీవు దినదినం మరింత ఎదుగుతూ మహాభారత యుద్ధంలో అర్జునుడికి దేదీప్యమానంగా విశ్వరూప సందర్శనమిచ్చిన శ్రీకృష్ణుడిలా, బలిని మూడు అడుగులు కోరి ముల్లోకాలను దర్శింప చేసిన వామనుడిలా కనిపించసాగావు.

నేను నిన్ను జయించాలన్న తపనలో నీచమైన ఎత్తుగడలనే పాకుడు రాళ్ళను పట్టుకొని ఎగబాగాల్సి ప్రయత్నిస్తూ, అంతకంతకు దిగజారిపోయాను. నేత్ర రోగి దీపం చూడలేనట్లు నేను నీ ప్రాభవాన్ని చూడలేకపోయాను.

పురాణాలలో, ఇతిహాసాలలో మహా మునుల కోపాగ్నికి శపించబడి, రాక్షస కృత్యాలు చేస్తున్న కొందరిలో, పూర్వజ్ఞానము ఉండి, తాము చేసేది తప్పు అని తెలిసి ఉన్నట్లుగా, నేనిన్ని చేస్తున్నా నాలోని నాకు ఇవన్నీ తప్పులని తెలుస్తూనే ఉన్నాయి. నన్ను అను నిత్యం సచేతన పరుస్తూనే ఉన్నాయి.

నాకొక విషయం అర్థమైంది. నీవు దేవతవు. నీకు చెడు తెలియదు. నీవు ప్రేమించగలవు. క్షమించగలవు. నేను అల్పుడిని అసమర్థుడిని. ఈ స్థితిలో నీతో కలిసి బ్రతకలేను. విడాకులు తీసుకుందామా అంటే ఏ దోషం నీపై ఆరోపించాలి. ఒక వేళ దూరంగా ఉండగలవు. పోనీ వదిలేసి దూరంగా ఉందామా అంటే నాకై జీవితాంతం ఎదురు చూస్తూ ఉండగలవు.

ఎట్లా చచ్చేది.

ఔను ఎట్లా చచ్చేది?

ఇది పరిష్కారం కాదు. నేను చనిపోయినా, నా కుటుంబానికి సేవ చేస్తూ జీవితం గడిపేస్తావు. కానీ తప్పదు. అందుకే భర్తగా శాసిస్తున్నాను. నీవు నేను చనిపోయిన తరువాత మా ఇంటికి దూరంగా వెళ్ళిపో. సర్‌నేమ్ మార్చుకో. గోత్రం త్రెంచి వేయి. కొత్త జీవితం ప్రారంభించు. ఈ కాంప్లెక్స్ సైకాలజీ రోగిని క్షమించు.

నాకు తెలుసు పరుసవేది కసాయి కొట్టులోని కత్తిని సహితం బంగారంగా మార్చినట్లు, నీవు ఎవరినైనా క్షమించగలవు. కన్ఫూషియస్ తేలు కథలో, నేను తేలును నీవు కన్ఫూషియసువు. క్షమిస్తావని ఆశిస్తూ..

**నీ భర్త**

**సుమన్**

●●●

'హలో యంగ్ మ్యాన్! హౌ ఆర్ యూ! ' అన్న పలకరింపుతో కళ్ళు తెరిచాడు. ఎదురుగా చిరునవ్వుతో డాక్టర్ గారు.

'మీ దయవల్ల నేను ఫర్‌ఫెక్ట్‌లీ ఆల్ రైట్.'

'నిన్ను డిస్‌చార్జ్ చేస్తున్నాను నీవు వెళ్ళవచ్చు. మై బెస్ట్ విషెస్ విత్ యూ!' అంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు డాక్టర్. వెళ్ళిపోయిన తరువాత దాహంగా అనిపిస్తే, పక్కన ఉన్న కప్ బోర్డ్ వైపు తిరిగి బాటిల్ తీసుకోబోయాడు. బాటిల్ క్రింద ఒక అందమైన కవర్, అందులో చూడముచ్చటైన దస్తూరితో వాక్యాలు కనిపించాయి.

'నీవు నాకోసం
నేను నీకోసం
మన మధ్య మృత్యువు
దేనికోసం' -దివ్య.

చదివిన తరువాత కాగితం మళ్ళీ కవర్‌లో పెట్టాడు. సెల్‌లో మెసేజ్ అలర్ట్ వచ్చింది మెసేజ్ చూసాడు.

'వి ఆర్ ఫిట్ ఫర్ ఈచ్ అదర్ -- వి ఆర్ మేడ్ ఫర్ ఈచ్ అదర్' - దివ్య

కవిత, సెల్ మెసేజ్ చూసి ఆలోచనల్లో పడిన అతడికి, చేతిలో క్యారియర్‌తో, బ్యాగ్‌తో తనముందుకు వచ్చిన దివ్య కనిపించింది.

ఆవిడ దగ్గరికి వచ్చింది. అతడికి చేరువగా కూర్చుంది. ఆప్యాయంగా అతడి కళ్ళలోకి చూసింది.

అతడి కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. 'నాకు ఆనందంగా ఉంది. నీవు నాకు దక్కావు. నేను అదృష్టవంతురాలిని' అన్నది.

'కాదు నీతోపాటు సరికొత్త జీవితాన్ని ప్రారంభించే అవకాశాన్ని భగవంతుడు కల్పించాడు. నేనే అదృష్టవంతుడిని. ప్రతి వ్యక్తిలో నిగూఢమైన శక్తియుక్తులుంటాయని, అవి వెలికి తీసే ప్రయత్నం మానేసి ఇతరుల అభ్యున్నతికి చింతిస్తూ, ఇతరులను ద్వేషిస్తూ బ్రతకడం తప్పని ఈ రెండు మూడురోజులలో తెలుసుకున్నాను. అంతేకాదు ఆత్మన్యూనత వదిలి స్వయం శక్తిని అనుభవంలోకి తెచ్చుకోవాలని, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని తెలుసుకున్నాను. నా ఈ మానసిక పరివర్తనకు కారణమైన భగవంతుడుకి కృతజ్ఞతలు. గాడ్ ఈజ్ గ్రేట్' అన్నాడు.

'ఇంకొక్క విషయం నీవు పనిచేసే సంస్థ నిన్ను రెగ్యులరైజ్ చేసింది. ఇవిగో ఆర్డర్స్' అంటూ బ్యాగ్‌లో నుండి ఆర్డర్ తీసి ఇచ్చింది.

ఆర్డర్ చూడగానే అతడి ముఖం విప్పారింది. 'గాడ్ ఈజ్ గ్రేట్' అన్నాడు. అంతేనా 'మరొక్క విషయం' అంటూ, సిగ్గుపడుతూ అతడి చెవిలో చెప్పింది. 'గాడ్ ఈజ్ ట్రిబుల్ గ్రేట్' అంటూ ఉత్సాహం తెచ్చుకుని ఆమెను కౌగిలించుకున్నాడు.

●●●

# నేను చూసిన దైవం సన్నిహిత్

**" పిల్లాడికి జ్వరం తగ్గడం లేదు...**రోజా బంతిలా ఆడుకునే వాడు సాయంత్రం కాగానే బెడ్ మీద వాలిపోతున్నాడు... తిరుపతి వెంకటేశ్వర స్వామికి మొక్కుకుని సంవత్సరం అయిపోయింది...వెళ్దామంటే అదిగో ఇదిగో అంటావు...దేవుడితోనే నీకు పరాచికాలా? చెప్పేది నీకే!... వినపడుతోందా..? " విరుచుకు పడుతోంది బిందు, నా భార్య. అవేమీ నా చెవులకు సోకనట్టు, ధ్యానంలో ఉన్న ఋషిలా లాప్ టాప్ ముందు కూర్చుని సాఫ్ట్ వేర్ కోడ్ చూసుకుంటున్నాను. అటువంటి సిచ్యుయేషన్‌లో నా భార్యకు సమాధానం చెబితే వచ్చే ప్రమాదం బాగా అనుభవం కాబట్టి నోరు తెరవకుండా వింటున్నాను.

సంవత్సరం క్రితం - అప్పటి నా పరిస్థితులు బాగు లేనప్పుడు తిరుపతి వస్తానని వెంకటేశునికి మొక్కుకున్నాను. కానీ తర్వాత ఏవో కారణాల వల్ల వెళ్ళడం కుదరట్లేదు. దాని ఫలితమే 'ఇప్పటి చికాకులని' నా భార్య అభిప్రాయం. పోనీ ' వెళ్దాం లేవే! ' అని భరోసా ఇద్దామంటే ధైర్యం సరిపోవడం లేదు. ఆఫీసులో పీకల్లోతు పని, ప్రాజెక్ట్ డెడ్ లైన్స్. వేళాపాళా లేని బతుకు. టెన్షన్! సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవాడి జీవితం ఇంతకంటె గొప్పగా ఉండటానికి వీల్లేదు కదా!

"అబ్బా! నన్ను సతాయించకు. లీవు కోసం ట్రై చేస్తున్నాను , దొరగ్గానే వెళ్దాం...ఓకేనా! ' అంటూ అప్పటికి తప్పించుకున్నాను.

●●●

"సార్! " వీలైనంత వినయంగా పిలిచాను.

కంప్యూటర్ ముందు నుండి తల తిప్పి నా వైపు చూసి "చెప్పు సురేష్ ! ఏం కావాలి? " మృదువుగా అడిగాడు కార్తీక్. అతను మా ప్రాజెక్ట్ లీడర్!

" తిరుపతి వెళ్ళాలి...రెండ్రోజులు లీవ్ కావాలి...వీకెండ్‌తో కలుపుకొని నాలుగు రోజులవుతుంది" నెమ్మదిగా చెప్పాను

" నాలుగు రోజులా! కష్టమేమో? సరే...చూద్దాం..." అని చెప్పాడు. కార్తీక్ అలా చెప్పాడంటే నో డౌట్! సెలవు దొరుకుతుంది. నా సీట్ కొచ్చాక నెట్‌లో ఐ.ఆర్.సి.టి.సి సైట్ ఓపెన్ చేసి రైల్లో థర్డ్ ఏసీకి టికెట్లు రిజర్వ్ చేసాను. వెంటనే బిందూకి ఫోన్ చేసి చెప్పాను. తను కూడా సంతోషించింది. తిరుపతి ప్రయాణం కన్‌ఫర్మ్ అయినందుకు 'మా అబ్బాయి ఆరోగ్యానికి ఇక ఢోకా లేదు' అనిపించి మనసులో ఉన్న అలజడి కాస్త తగ్గింది. మనిషికి నమ్మకం ఇచ్చినంత సంతృప్తి ఇంకేదీ ఇవ్వదేమో! మెషిన్ దగ్గరకు వెళ్ళి కాఫీ తెచ్చుకుని సిప్ చేస్తూ రిలాక్స్ అవసాగాను.

●●●

తిరుపతి రైల్వే స్టేషన్‌లో దిగేసరికి పొద్దున్న ఏడు కావస్తోంది. లగేజ్ తీసుకొని స్టేషన్ బయటకి వచ్చేటప్పటికి 'ఆటో కావాలా సార్? రూం కావాలా సార్? కొండ పైకి వెళ్ళాలా సార్?' అంటూ బ్రోకర్‌లు మా చుట్టూ మూగారు. వాళ్ళనందరినీ తప్పించుకుని నెమ్మదిగా నడుచుకుంటూ బస్‌స్టాండ్ వైపు నడిచాము. తిరుమలకు వెళ్ళడానికి టికెట్స్ తీసుకుని బస్‌లో కూర్చున్నాము.

ఏదో హడావుడిగా తిరుపతి దాకా వచ్చేసాం కానీ తిరుమల కొండపైన ఉండేందుకు మాకు ఎకామిడేషన్ లేదు. ఏ ఎమ్మెల్యేదో , ఎంపీదో రికమెండేషన్ లెటర్ తెచ్చుకుందామంటే అంత టైం కుదరలేదు. 'నా ఫ్రెండ్ సుధాకర్ అక్కడ ఒక గెస్ట్‌హౌస్‌లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నాడు, వాడికి నా పేరు చెప్పు గురూ, వాడే చూసుకుంటాడు' అని కార్తీక్ చెప్పడంతో ధైర్యంగా వచ్చేసాము. కొండ పైకి చేరగానే గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాము.

నలభయ్యేళ్ళ వ్యక్తి ఒకరు రిసెప్షన్ లో ఉన్నాడు. నేను దగ్గరగా వెళ్ళి "సుధాకర్ అంటే మీరేనాండీ! హైదరాబాద్ నుండి వచ్చాము...కార్తీక్ మీకు చెప్పే ఉంటాడు కదా!" అన్నాను.

"ఆ... నిన్న రాత్రి ఫోన్ లో చెప్పాడు. ఫర్వాలేదు నేను చూసుకుంటాను. ఫార్మాలిటీస్ చెప్పాడు కదా!" అన్నాడు.

అర్థమైంది అన్నట్లు తల ఊపి 'అయిదు వందల' రూపాయల నోటు అతని చేతిలో పెట్టాను.

వెంటనే ఎవరికో ఫోన్ చేసి ఏదో మాట్లాడాడు. తర్వాత మా వైపు తిరిగి "ఇక్కడి నుండి ఒక అర కిలోమీటర్ దూరంలో కౌంటర్‌లు ఉంటాయి . అక్కడికి వెళ్ళి నా పేరు చెప్పండి మీకు రూము ఎలాట్ చేస్తారు. రూం రెంట్ కంటే ఏభై రూపాయలు ఎక్కువ ఇవ్వండి" అని సెలవిచ్చాడు. సంతోషంగా తల ఊపి అక్కడి నుండి నడుచుకుంటూ కౌంటర్ దగ్గరికి వచ్చాము. అతడు చెప్పినట్లు గానే చేసాక కౌంటర్ వ్యక్తి ఒక స్లిప్ మా చేతిలో పెట్టాడు. అది చూసాను.

సందేహమొచ్చి – "సార్! ఎకామిడేషన్ రెండు రోజులకే ఇచ్చారు. మేము ఇక్కడ నాలుగు రోజులుండాలని అనుకుంటున్నాము." అని అడిగాను

"ముందు మీరు వెళ్ళి రూములో సెటిల్ అవ్వండి సామీ! తర్వాత సంగతి మళ్ళీ చూద్దం!" విసుక్కున్నాడు.

సరే! దొరికిందేదో దొరికింది అనుకుని అక్కడి నుండి మాకు ఎలాట్ చేసిన వేరే గెస్ట్‌హౌస్‌లోని రూంకి వచ్చేసాము.

●●●

రూము చాలా విశాలంగా, నీట్‌గా ఉంది. బాత్రూంలో వేణ్ణీళ్ళు, చన్నీళ్ళు పుష్కలంగా వస్తున్నాయి. కిటికీ తెరిస్తే పచ్చటి చెట్లు పలకరిస్తున్నాయి. లగేజ్ పడేసి బెడ్ మీద వాలగానే హాయిగా అనిపించింది.

"డాడీ! నాకు నీ లాప్‌టాప్ కావాలి. గేం ఆడుకుంటాను" అని నా లాప్ టాప్ తీసుకున్నాడు ఆరేళ్ళ మా అబ్బాయి. నేను నా సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టుకున్నాను. బిందు లగేజ్ అంతా ఒక పక్కన సర్దసాగింది. కాసేపయ్యాక "మీరిద్దరూ వెళ్ళి గుండ్లు గీయించుకొని రండి . తర్వాత వీలు చూసుకుని దర్శనానికి వెళ్దాం" అని ఆర్డరేసింది.

"అలాగే మేడం ! " అని చెప్పి 'క్షవర శాల' వైపు వెళ్ళాం నేనూ, నా కొడుకూ!

అక్కడ పెద్ద క్యూ ఉంది. టోకెన్ తీసుకుని లైన్‌లో చాలా సేపు ఉన్నాక మా వంతు వచ్చింది. క్షురకుడికి మా తలలు అప్పగించి కూర్చున్నాము. కత్తితో పర పరా గీయ సాగాడు. మూడు నిముషాల్లో చక చకా పని పూర్తి చేసాడు. లేచి వచ్చేస్తుండగా 'ఏంటి సామీ అట్నేపోతున్నావు' అంటూ చేయి చాపాడు. అర్థమైంది. మా ఇద్దరికీ కలిపి ఏభై రూపాయలు దక్షిణగా ఆయనికి ఇచ్చాను. అక్కడి నుండి రూముకొచ్చాక తల స్నానాలు చేసి డ్రెసప్ అయ్యాము. అప్పటికే బిందు ఫ్రెష్ అయి రడీగా ఉండటంతో అందరం రూము లోనుండి బయట పడ్డాము

●●●

కాస్త టిఫిన్ తిన్నాక, స్వామి వారిని దర్శించు కోవడానికి ' మూడు వందల రూపాయల' క్యూలో చొరబడ్డాం. క్యూ నిండు చూలాలులా నెమ్మదిగా కదులుతోంది. కాలం గడిచిపోతోంది. వేరు సెనక్కాయలు, టీ, కాఫీ అమ్మే వాళ్ళు లైన్ పొడవునా హడావుడిగా తిరుగుతున్నారు. షుమారు ఒక ఆరు గంటల సమయం తర్వాత మా క్యూ గుడి ప్రాంగణంలోకి వచ్చింది. ఆ తర్వాత ఒక ఇంచ్ కూడా కదలడం లేదు. ఏమైందో అర్థం కాక జనాల్లో అసహనం. నేను క్యూ నుండి బయటకు వచ్చి కొంత దూరం ముందుకు వెళ్ళి వాకబు చేసాను.

" ఎవరో వి.ఐ.పి లు వచ్చారంట సార్! అందుకే మీ క్యూ వదలడం లేదు" అని చెప్పాడు అక్కడి సెక్యూరిటీ గార్డ్. సరే అనుకుని వెను దిరిగి మళ్ళీ క్యూ లోకి వచ్చేసాను. ఇంతలో లైన్‌లో నుండి ఒక నడి వయసు వ్యక్తి బయటకు జంప్ చేసి కోపంతో గట్టిగా అరుస్తున్నాడు. " ఏంటండీ ఇది! మనం ఏమైనా పశువులమా?, కట్టిపడేసినట్టు ఇలా గంటల తరబడి పడి ఉండటానికి? వెధవలకు బుద్ధి లేదండీ! స్పెషల్ దర్శనం అని టికెట్ పెట్టి ఇలా మనల్ని చంపుతారా? " అంటూ విరుచుకు పడుతున్నాడు. అందరి మనసుల్లోనూ కొంచెం అసహనం, కొంచెం భక్తి, అందుకే అందరూ అతడి విన్యాసాన్ని చూసి ఆనందిస్తున్నారు. నాకు మాత్రం దేవుడి దర్శనం కోసం ఆ మాత్రం వెయిట్ చేయడం సబబే అనిపించింది.

ఒక గంట తర్వాత మా క్యూలో కదలిక వచ్చింది. జనమంతా 'గోవిందా! గోవిందా!' అని గట్టిగా స్మరించుకుంటూ కదులుతున్నారు. కాసేపటికి 'కంపార్ట్ మెంట్' లోనికి ప్రవేశించాము. అక్కడ కూర్చోడానికి కుర్చీలు అవీ ఉండటంతో హాయిగా అనిపించింది. అంత వరకు మా బాధను చూసిన ఆలయ నిర్వాహకులు మాకు తినడానికి వేడి వేడి పరమాన్నం సప్లయ్ చేస్తున్నారు. అది చూసి భక్తుల తోపులాట మొదలైంది. నేను ఎలాగో శ్రమ పడి ఒక ప్లేటు పరమాన్నం సంపాదించాను. ఇందాక క్యూలో అలయ నిర్వాహకులని తిట్టిన వ్యక్తి అందరినీ నెట్టుకుంటూ ముందుకు వెళ్ళి 'నా ఇష్టమండీ ...నేను ఎన్ని ప్లేట్లు అయినా తింటాను...మీరెవరు చెప్పడానికి...ఇంకో ప్లేట్ ఇవ్వండి' అని అరుస్తున్నాడు. అంతకు క్రితమే రూల్స్ మాట్లాడిన సంగతి మర్చిపోయాడేమో!.

చూస్తుండగానే, ఒకర్ని ఒకరం నెట్టుకుంటూ గర్భ గుడిలోకి వచ్చేసాము. విపరీతమైన తోపులాట. అక్కడి దాకా మామూలుగా వచ్చిన జనం ఒక్కసారిగా ఉద్విగ్నతకులోనై, తామే ముందుగా వెళ్ళాలనే ఆరాటంతో ఒకర్ని ఒకరు కుమ్ముకుంటూ ముందుకు వెళుతున్నారు. నాకు ఊపిరి ఆడ్డం లేదు. మా అబ్బాయి కూడా గింజుకుంటున్నాడు. నేను వాడ్ని నా భుజాల మీద ఎక్కించుకున్నాను. ఒక చేత్తో నా భార్యను పట్టుకున్నాను. పద్మవ్యూహంలోకి ప్రవేశించిన అభిమన్యుడిలా ముందుకు దూసుకెళ్ళాను. సరిగ్గా కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి విగ్రహం దగ్గరకు వచ్చాము. ఆ దివ్య మంగళ తేజస్సుని చూసి తేరుకుంటున్న లోపే 'వెళ్ళాలి! వెళ్ళాలి!తొందరగా వెళ్ళండి! ఎంత సేపు ?' అంటూ అక్కడి సెక్యూరిటీ గార్డ్‌లు మమ్మల్ని ముందుకు తోసేసారు. క్షణాల్లో బయటకు వచ్చి పడ్డాం. ఎంతో కష్టపడి దేనికోసమైతే వచ్చామో ఆ 'దర్శనం' చిటికెలో అయిపోయింది! కేవలం సెకనులో వెయ్యో వంతు టైము మాత్రమే ఆ దేవ దేవుడిని దర్శించుకో గలిగాను. నా భార్య మొహంలో విపరీతమైన సంతోషం కనబడుతోంది. నాకు మాత్రం అసంతృప్తి కలిగింది. ఇంకాసేపు చూడనిస్తే వీళ్ళ సొమ్మేం పోతుంది అని బాధ పడ్డాను. దాన్ని దిగమింగి, ప్రసాదం తీసుకొని వచ్చేసాము.

●●●

రాత్రి పదయింది. భోజనం చేసి రిలాక్స్ అవుతున్నాము.

"రేపటి ప్రోగ్రాం ఏంటి ?" అడిగింది నా భార్య.

"ఏముంది...చుట్టుపక్కల ఉన్న ప్రదేశాల్ని చూద్దాం.అంత కంటే చేసేదేముంది! " అన్నాను.

"అయినా మన ఎకామిడేషన్ కూడా రేపటితో అయిపోతుంది, ఒక సారి ఆ సుధాకర్‌తో మాట్లాడు " అని చెప్పింది.వెంటనే అతనికి ఫోన్ చేసాను.

"చూద్దాంలే గురూ ! ఇంకా టైం ఉంది కదా! ఈ లోగా ఒక పని చెయ్ ...ఎవరైనా అడిగితే మాకు ఇంకా దర్శనం కాలేదు , అందుకే ఉన్నాము అని చెప్పు" సలహా ఇచ్చాడు.

"సరే!" అని చెప్పి ఫోన్ కట్ చేసాను

మర్నాడు పొద్దున్న లేచి రడీ అయి టాక్సీ మాట్లాడుకొని విహారానికి బయలు దేరాం. పాప వినాశనం, వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీ వారి పాదాలు, ఈ మూడు స్థలాలు చూపడానికి టాక్సీవాడు ఐదు వందలు తీసుకున్నాడు. ఎత్తైన కొండ పైన శ్రీ వారి పాదాల్ని స్పృశించి తరించాము. తర్వాత వేణు గోపాలుడిని దర్శించుకున్నాము. పక్కనే హాథీ రాం బాబా గుడి కూడా చూసాము. అక్కడి నుండి పాపవినాశనం దగ్గరికి వెళ్ళి నెత్తి మీద పడే జల ధారను ఆనందించాము. తడి బట్టలతో పక్కనే ఉన్న చిన్న గుడిలో దేవుడి దర్శనం చేసుకున్నాము. అక్కడి పూజారి డబ్బులిచ్చిన వాళ్ళకే కొబ్బరి కాయ కొట్టి, దేవుడి ముందు పెట్టి తిరిగి ప్రసాదంగా ఇస్తున్నాడు. ఇవ్వని వాళ్ళని ' మీరే కొట్టుకోండి సామీ ! ' అని కోపంగా అంటున్నాడు. నవ్వొచ్చింది నాకు.

అలా సాయంకాలం దాకా తిరిగి తిరిగి టీ తాగి రూంకి వచ్చేటప్పటికి రాత్రి ఏడవుతోంది. నాకు గుండెల్లో గుబులుగా ఉంది. ఎందుకంటే ఒక గంట తర్వాత మా ఎకామిడేషన్ టైం అయిపోతోంది. ఆ తర్వాత మేము రూంలో ఉండటానికి వీళ్ళేదు . తిరుమల లో అప్పటికే మేము రెండ్‌రోజులు ఉన్నాము కాబట్టి మళ్ళీ ఫ్రెష్‌గా బుక్ చేసుకుందామన్నా ఇస్తారో ఇవ్వరో తెలీదు. పైగా కొత్త మిత్రుడు సుధాకర్ నుండి ఎటువంటి ఇంఫర్మేషన్ లేదు. నాకు టెన్షన్ మొదలంది. వెంటనే మా గెస్ట్ హౌస్ రెసెప్షనిస్ట్ దగ్గరకు వెళ్ళాను.

" మేము ఒక గంట తర్వాత రూము ఖాళీ చెయ్యాల్సి ఉంది. కానీ ఇంకా ఉండాలనుకుంటున్నాము. ఏదో ఒక మార్గం చెప్పండి " అని బ్రతిమాలుకున్నాను.

" అబ్బెబ్బే !ఎలా కుదురు తుంది సామీ ! రూల్స్ ఒప్పుకోవు! " అంటూ మూలిగాడు. నాకు అర్థమైంది. ఒక వంద రూపాయల నోటు అతని చేతిలో పెట్టాను. కొంచెం శాంతించాడు.

" చూడు సామీ! నా షిఫ్ట్ ఇప్పుడు అయిపోతుంది. నేను వెళ్ళాక ఇంకో తమిళోడు వస్తాడు.వాడి పేరు నటరాజన్! చాలా గట్టివాడు. అయినా ప్రయత్నించండి. పొద్దున్న దాకా మేనేజ్ చెయ్యమనండి. తర్వాత మీరు వేరే చోట ఎకామిడేషన్ చూసుకోవచ్చు " చెప్పాడు. అంటే ఈ ఒక్క రాత్రి ఇక్కడ మేనేజ్ చేస్తే సరిపోతుంది. రేప్పొద్దున్న కొండ దిగి తిరుపతి వెళ్ళి అక్కడ ఏదో హోటల్‌లో ఉండవచ్చు అనుకున్నాను. ' సరే ' అనిచెప్పి రూం కి వెళ్ళి ఫ్రెష్ అయి డిన్నర్‌కి వెళ్ళాము. డిన్నర్ నుండి తిరిగొస్తూ కౌంటర్ వైపు చూసాను. పొట్టిగా నల్లగా ఉన్న ఒక కొత్త వ్యక్తి తన ముందున్న రిజిష్టర్‌లో ఏవో చూసుకుంటున్నాడు. అతడి దృష్టిలో పడకుండా మేము నెమ్మదిగా మా రూము లోకి వెళ్ళిపోయాము. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకొని పదింటికల్లా నిద్రపోయాము.

●●●

షుమారు రాత్రి పన్నెండు కావస్తోంది. గాఢ నిద్రలో ఉన్నాము. తలుపు మీద ఎవరో కొడుతున్న చప్పుడైంది. లేచెళ్ళి తలుపు తీసాను. ఎదురుగా గెస్ట్‌హౌస్ రెసెప్షనిస్ట్ నటరాజన్ !

"ఏంది సామీ ! ఎంత సేపు నుండి కొడుతున్నా తలుపు తీయడం లేదు. అయినా రూములో ఇంకా ఎందుకు ఉన్నారు? మీరు ఇప్పటికే ఖాళీ చేసి వెళ్ళి పోవాలి కదా ! " నెమ్మదిగా అడిగాడు.

"కరక్టే నటరాజన్ ! కానీ మేము దర్శనం చేసుకుని వచ్చేటప్పటికి ఇంతసేపయింది. ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళతాము?" విసుగ్గా అడిగాను.

"అది నేనెలా చెప్పగలను సామీ ! మీరు చూసుకోవాలి. ఇప్పుడు ఇదే రూం వేరే వాళ్ళకి ఎలాట్ అయి, వాళ్ళు ఇప్పుడు వస్తే నేను ఏం చెయ్యాలి? " ఎదురు ప్రశ్న వేసాడు.

"సరే!ఇప్పుడేం చేద్దాం ! వేరే రూం ఏదైనా ఖాళీగా ఉంటే చూడు, కావాలంటే నీకు డబ్బులు కూడా ఇస్తాను" ఆశ చూపించాను, అలాగైనా లొంగుతాడని.

"నేను నిన్ను కావాలని ఇబ్బంది పెట్టడం లేదు సామీ ! నా డ్యూటీ నేను చేస్తున్నాను" నిదానంగా చెప్పాడు. నాకు ఒళ్ళు మండింది. ఇదంతా వీడు కావాలనే చేస్తున్నాడు. తలచుకుంటే ఏదో రకంగా ఎడ్జెస్ట్ చేయగలడు, కానీ చెయ్యడం లేదు. రూల్స్, రెగ్యులేషన్స్ మాట్లాడుతున్నాడు. నాకు సహనం తగ్గిపోతోంది.

"సరే ! పోనీ రూల్స్ ప్రకారం అయినా ఏం చెయ్యాలో చెప్పు" కోపంగా అడిగాను. ఈ గొడవకి నా భార్య కూడా నిద్ర లేచింది.

నటరాజన్ నాతో "మనం ఇప్పుడు వెళ్ళి కొంత డబ్బు కడితే పొద్దున్న మూడు గంటల దాకా ఉండటానికి అవకాశం ఇస్తారు. నాతో రండి ...వెళ్దాము" అన్నాడు.

" సరే పద ! వెళ్దాం" అని పేంట్ వేసుకుని బయలు దేరాను. మా అబ్బాయి గాఢ నిద్రలో ఉన్నాడు. పరిస్థితి అర్థమై లగేజ్ సర్దడం మొదలు పెట్టింది నా భార్య.

●●●

పాత డొక్కు లూనాని పార్కింగ్‌లో నుండి బయటకు తీసి " రండి సామీ ! వెనక కూర్చోండి " అన్నాడు నటరాజన్.

"ఏ కాలం నాటిది బాబూ ఈ లూనా ...ఇంత కొత్తగా ఉంది" వెటకారంగా అన్నాను.

" నాది కాదు సామీ ! నా ఫ్రెండ్‌ది. మీ కోసం అడిగి తీసుకున్నాను" అన్నాడు. నేను లైట్‌గా షాక్ అయ్యాను. వెనక కూర్చోగానే బండిని రయ్యిన లాగించాడు. టైము అర్థ రాత్రి పన్నెండున్నర కావస్తోంది. దర్శనం కోసం వెళ్ళే వాళ్ళు, దర్శనం చేసుకుని వస్తున్న వాళ్ళు అక్కడక్కడ కనిపిస్తున్నారు రోడ్డు మీద. కొంత దూరం వెళ్ళాక లూనా సడన్‌గా ఆగి పోయింది.

"ఏమైంది?" చిరాగ్గా అడిగాను.

"ఏమో సామీ ! నాక్కూడా అర్థం కావడం లేదు" అని కాసేపు భీకరంగా ప్రయత్నించాడు స్టార్ట్ చేద్దామని. కానీ అది మొరాయించింది.

" నువ్వు బండి మీద కూర్చో సామీ ! నేను తోస్తాను...అట్నే వెళ్ళిపోదాము" అన్నాడు.'సరే !' అని కూర్చున్నాను. అతను వెనక నుండి తోస్తుంటే నేను హేండిల్ పట్టుకొని బండిని నడప సాగాను. కొంత దూరం వెళ్ళాక కౌంటర్ వచ్చింది. నటరాజన్ కౌంటర్ దగ్గరకు వెళ్ళి అందులో నిద్ర పోతున్న క్లర్క్‌ని లేపాడు. నా సంగతంతా వివరించాడు. వెంటనే క్లర్క్ నా దగ్గర కొంత డబ్బు కట్టించుకొని స్లిప్ మీద ఏదో వ్రాసి ఇచ్చాడు. నటరాజన్ మొహంలో రిలీఫ్ కనపడింది. నిజానికి అతడు ఇంత శ్రమ పడవలసిన అవసరం లేదు.

టిటిడి అధికారులు గెస్ట్ హౌస్‌కి వచ్చి చెకింగ్ చేస్తే తప్పు నా మీద నెట్టేయ వచ్చు. కావాలంటే నా దగ్గర లంచం తీసుకొని ఖాళీగా ఉన్న రూములో ఏదో రకంగా ఎడ్జెస్ట్ చేయవచ్చు. కానీ అతడు అలా చేయలేదు. తన వృత్తి ధర్మం నిర్వహించాడు. సంతోషం అనిపించింది.

"పదండి సామీ ! నడుచుకుంటూ వెళ్ళిపోదాము. ఈ లూనా రేప్పొద్దున్న తీసుకుంటాను " అన్నాడు నటరాజన్.

"అలాగే" అని అతడిని అనుసరించాను. ఇద్దరం నడవ సాగాము. ఇందాక వచ్చిన రూట్ కాకుండా ఏదో షార్ట్ కట్‌లో తీసుకెళుతున్నాడు. నాకు అతడి కేరక్టర్ ఇంట్రెస్టింగ్‌గా అనిపించి మాటల్లోకి దించాను.

" నటరాజన్ ! ఈ దేవస్థానం లో ఎప్పడి నుండి పనిచేస్తున్నావు? " అడిగాను

"అబ్బో ! ఎప్పుడో నా చిన్నతనంలో వచ్చాను సామీ! ఎవరో కాంట్రాక్టర్ తీసుకొచ్చి మొదట నన్ను గార్డెన్ పనిలో పెట్టాడు. మొక్కలకి నీళ్ళు అవీ పోస్తుండే వాడిని. చాలా కాలం దాకా రక రకాల పనులు చేసుకుంటూ ఉండే వాడిని. తర్వాత కొంత కాలానికి అంటే ఒక సంవత్సరం క్రితం ఈ డ్యూటీలోకి వచ్చాను" అన్నాడు

"పెళ్ళి చేసుకున్నావా? పిల్లలున్నారా? సొంత ఇల్లు కొనుక్కున్నావా? " ప్రశ్నల వర్షం కురిపించాను. చాలా సేపటి నుండి నడవటం వల్ల ఆయాసంగా అనిపించి కాసేపు ఆగాము. అక్కడే ఉన్న ఒక చప్టా మీద కూర్చుని బీడీ వెలిగించాడు నటరాజన్. దూరంగా ఉన్న గుడిలో నుండి భక్తి గీతాలు గాలిలో తేలుకుంటూ వినవస్తున్నాయి. గుండెల నిండా దమ్ము లాగి నా ప్రశ్నలకి సమాధానం చెప్పసాగాడు.

"పెళ్ళి అయింది సామీ ! ఇద్దరు పిల్లలు. తిరుపతి లోని ఒక ఇంట్లో అద్దెకుంటాను. వచ్చిన జీతం డబ్బులు తిండి గింజలకి, ఇంటి అద్దెకు సరిపోతాయి. మిగతా ఖర్చులు గడవడానికి చిన్నా చితకా పనులు చేస్తుంటాను. ఏదో ఆ భగవంతుడి దయ వల్ల గడిచిపోతోంది" అని చెప్పాడు.

"మరి డబ్బులు సరి పోనప్పుడు సైడ్ ఇన్‌కం కోసం ప్రయత్నించొచ్చు కదా" రెచ్చ గొట్టాను

చిన్నగా నవ్వి చెప్పాడు "నాకెందుకు సామీ వేరే వాళ్ళ సొమ్ములు. నేను నా కష్టాన్ని నమ్ము కున్నాను. ఎప్పుడో చిన్నతనంలో ఒక కూలీగా వచ్చిన నన్ను ఈ దేవస్థానం ఉద్యోగిని చేసింది. జీతమిచ్చి పోషిస్తోంది. అంత కంటే ఇంకేం కావాలి. డబ్బు కోసం కక్కుర్తి పడి నాకు తిండి పెడుతున్న ఈ ఉద్యోగానికి చెడ్డ పేరు తేలేను సామీ ! " అన్నాడు. మాటల్లో పడి గెస్ట్‌హౌస్‌కి వచ్చేసాము.

" నువ్వు పోయి కాసేపు పడుకో సామీ ! మూడు గంటలకి రూము ఖాళీచేసి వెళ్ళిపోండి" చెప్పాడు నటరాజన్.

రూములోకి వెళ్ళే సరికి లగేజ్ అంతా సర్ది పెట్టి నా కోసం వెయిట్ చేస్తోంది నా భార్య. అప్పటికి టైం రెండు కావస్తోంది. ఇక పడుకోవడం అనవసరమని మాటల్లో పడ్డాము. జరిగిన విషయాలన్నీ నా భార్యకు చెప్పసాగాను. గడియారం మూడు కొడుతుండగా ప్రత్యక్ష మయ్యాడు నటరాజన్ " సామీ ! ఖాళీ చేస్తున్నావా ? " అంటూ.

నిద్ర పోతున్న మా అబ్బాయిని భుజం మీద వేసుకుంది నా భార్య. లగేజ్ అంతా నేను పట్టుకున్నాను. రిసెప్షన్ దగ్గరకు వెళ్ళి రిజిష్టర్ లో చెక్ ఔట్ చేసినట్లుగా సంతకం చేసాను.

"నటరాజన్ ! ఇప్పుడు తిరుపతి వెళ్ళడానికి బస్సులేమైనా ఉంటాయా? " అని అడిగాను.

"ఒక గంట తర్వాత తిరుమల బస్ స్టాండ్ నుండి ఉంటాయి సామీ ! జాగ్రత్తగా వెళ్ళిపోండి. తిరుపతిలో ఏదైనా హోటల్‌లో ఉండండి" అని చెప్పాడు.

' సరే !' అని చెప్పి ఒక వంద రూపాయల నోటు అతని చేతిలో పెట్ట బోయాను.

'వద్దు సామీ!' అని సున్నితంగా తిరస్కరించాడు. అక్కడి నుండి బయటకు వచ్చి బస్‌స్టాండ్ వైపు నడుచుకుంటూ వచ్చేసాము నేనూ నా భార్యా.

టైము నాలుగ్గంటలయింది. అప్పుడే తెల తెల వారుతోంది. మేము ఎక్కిన బస్ చాలా వేగంగా కొండ పైనుండి కిందికి దిగుతోంది. బస్ కుదుపులకి నా భార్య ఒళ్ళో నిద్ర పోతున్న మా అబ్బాయి కదులుతున్నాడు. వాడ్ని జోకొడుతూ నా భార్య "హడావుడిగా బయలు దేరి వచ్చేసాము. చిన్న చిన్న ప్రాబ్లమ్స్ ఉన్నా చక్కగా మొక్కు చెల్లించుకో గలిగాము. స్వామి దర్శనం కూడా చాలా బాగా జరిగింది" సంతృప్తి గా చెబుతోంది.

ఎందుకో నాకు నటరాజన్ గుర్తొచ్చాడు. చేస్తున్న పని పట్ల అతని అంకిత భావం గుర్తొచ్చింది. ఈ సమాజాన్ని, మనుషులని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యడానికి అవకాశమున్నా కూడా లొంగకుండా ఏటికి ఎదురీదుతున్న అతని వ్యక్తిత్వంలో నాకు 'దైవత్వం' కనిపించింది. గర్భ గుడిలో కిక్కిరిసిన జనంలో అరక్షణం సేపు మాత్రమే వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నప్పుడు కలిగిన అసంతృప్తి నెమ్మదిగా తొలగ సాగింది. ఆ భగవంతుడి లీల అర్థమైంది.

"అవును ...' దైవ ' దర్శనం చాలా బాగా జరిగింది " అన్నాను నవ్వుతూ. బస్ తిరుపతి వైపు దూసుకెళుతోంది.

●●●

# అమ్మంటే

మంథా భానుమతి

**ఒక వెండి మబ్బు క్రమంగా కరిగి నీలి ఆకాశంలో లీనమవుతోంది.** ధగధగా మెరిసే సూర్యుడు తెర తొలగి తొంగి చూస్తున్నాడు. ఎవరో ఒక దేవత రెండు చేతులూ చాచి కొన్ని కిరణాలని పట్టుకుని సూర్యుడి దగ్గరకి వెళ్ళడానికి పైపైకి పాకుతోంది, పట్టువదలకుండా. ఆమె కూడా కదిలే సూర్యుడిలా ఉంది.

భరించరాని వెలుగు. కళ్ళలోకి తీక్షణంగా పడుతోంది. అసంకల్పితంగా చేతులు అడ్డం పెట్టుకుని కళ్ళు తెరిచాను.

ఏదో ఊరు దగ్గరవుతున్నట్లుంది. రైలు ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగింది. మెడ సవరించుకుంటూ కిటికీకి ఉన్న తెర తొలగించాను. అలా కిటికీకి ఆనుకుని ఎంతసేపు నిద్రపోయానో!

కిటికీలోంచి ఒక దృశ్యం. మెడ సంగతి మర్చిపోయి చూస్తూ ఉండిపోయాను. బాగా ఎండగా ఉందేమో నీలి అద్దాల్లోంచి కూడా కనిపిస్తోంది.

పచ్చని గడ్డి నేలంతా పరచుకునుంది. అనేక ఆవులు, దూడలు ఏకాగ్రతతో గడ్డి మేస్తున్నాయి.

ఒక నల్ల మచ్చల తెల్లావు. పక్కనే దాని తెల్లని బుజ్జి తువ్వాయి. ఎగిరెగిరి పాలు తాగుతోంది. ఆవు మాత్రం మరింత పరవశంగా, నిదానంగా గడ్డి భోంచేస్తోంది.

ఉన్నట్లుండి వాటిని అదిలిస్తూ గోపాలుడు వచ్చాడు. బకాసురుడి తమ్ముడిలా ఆపకుండా లాగించేస్తున్న దూడని వెనకనుంచి వంగి పక్కకి లాగబోయాడు. దూడ ఎగిరి పొదుగు అందుకునేటప్పుడు పట్టి పట్టి లాగుతుంటే ఏమీ అనిపించలేదు గోమాతకి. కానీ గోపాలుడు దూడని లాగినప్పుడు తెలిసిపోయింది, స్పర్శలోని తేడా. అంతే వెనుక కాలితో ఒక తాపు తన్ని, తల విదిలించి వెనక్కి చూస్తూ కాలు నేలకేసి రాస్తోంది. ఆ మాతృమూర్తి విదిలింపులో కోపం, బాధ ఆవేశం. తనకి స్నానం చేయించి, గడ్డిపెట్టి, తన పాకని శుభ్రం చేసి ఎంతో సేవచేసే రక్షకుడు కనిపించలేదా గోవుకి. తల్లిని, పిల్లని విడదీసే రాక్షసుడు కనిపించాడు.



కౌముది

గోపాలుడు, లేచి దులుపుకుని నవ్వుకుంటూ తల్లినీ, పిల్లనీ సముదాయిస్తున్నాడు.

నాకు గుండె అంతా బరువెక్కిపోయింది. పశుపక్ష్యాదులకి సమస్త జంతుజాలానికి మానవులకీ అందరికీ ఒకటే అమ్మ ప్రేమ.

"అమ్మ!" అమ్మా అంటేనే ఒక అనిర్వచనీయమైన భావం మనసంతా ఆక్రమిస్తుంది. అమ్మలేని ప్రపంచాన్ని ఊహించుకోలేం. అమ్మంటే ఒక ప్రేమ, ఒక త్యాగం, ఒక అర్పణ. ఒక ఆనందం. ఎన్ని భావాలని చెప్పగలం? విష్ణుమూర్తి పదే అవతారాలు ఎత్తాడేమో. కానీ అమ్మ? ఎన్ని అవతారాలు. ఎవరైనా తన బిడ్డ జోలికి వస్తే డొక్క చీల్చి డోలు కట్టేసే మహిషాసుర మర్దిని. బిడ్డ ఆకలి చెప్పకుండానే గమనించి తీర్చే అన్నపూర్ణ అల్లరి చేస్తే ఆనందించే యశోద. అ ఆలు నేర్పించే సరస్వతి. కాస్త ఒళ్ళు వెచ్చబడితే ధన్వంతరి. దుఃఖంలో స్నేహమయి. సంతోషాన్ని పంచుకునే నేస్తం. చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో!

రాత్రంతా నిద్రలేక పొడారిపోయి మండిపోతున్న కళ్ళు మూసుకున్నాను. భుజం మీద ఎవరిదో చెయ్యి పడింది. రైలు కదిలింది. ఎగురుతూ పరుగులు పెడుతున్న తువ్వాయి. ఆవులు, పశువుల కాపర్లు. అందరూ వెనక్కి వెళ్ళిపోతున్నారు.

"అక్కా!" నా తమ్ముడు సన్నని గొంతుతో పిలుస్తున్నాడు. తల తిప్పి చూశాను. పెదవులు వణుకుతున్నాయి. భుజం మీద తలవంచి వెక్కుతున్నాడు. ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్. ఆజానుబాహువు ఆనంద్.

కాళ్ళు పైన పెట్టుకుని, మఠం వేసి, వాడి తల ఒళ్ళో పెట్టుకున్నాను. ఆనంద్ జరిగి మోకాళ్ళు ముడిచి చంటి పిల్లాడిలా పడుకున్నాడు. నుదుటి మీద అడ్డదిడ్డంగా పడుతూ పల్చబడుతున్న జుట్టు సవరిస్తూ వాడి మొహంలోకి చూశాను. ఒత్తైన ఉంగరాల జుట్టు దువ్వలేక అమ్మ అవస్థ పడుతుంటే, దువ్విన వెంటనే చేత్తో చెరిపేసుకుని పారిపోయిన చిన్నారి ఆనంద్ గుర్తుకొచ్చాడు. పెదవులపైకి చిన్న నవ్వు వచ్చింది.

సెకండ్ ఏసీ కంపార్ట్‌మెంట్‌లో మేం కూర్చున్న క్యూబికల్ తెర వేసేసుకున్నాం.

"హైదరాబాద్ తీసుకొచ్చి కేర్ హాస్పటల్‌లో చేర్పిస్తానంటే మొండికెత్తిందక్కా అమ్మ. ఏం చెయ్యను. అన్నీ చెయ్యగలిగి నిస్సహాయుడ్నయ్యాను. మనూర్నుంచి కదల్నంటే కదలనంది."

చీర కొంగుతో వాడి కన్నీళ్ళు తుడిచాను. నాకూ ఏడవాలనే ఉంది. కానీ ఒళ్ళో నాకంటే ఐదేళ్ళ చిన్నవాడైన తమ్ముడు. ఎదురు సీట్లలో బిక్కమొహాలేసుకుని కూర్చున్న ఇద్దరు చెల్లెళ్ళు. వాళ్ళందర్నీ ఓదార్చవలసిన బాధ్యత నామీదుంది.

అందరం ఎవరి వృత్తుల్లో, సంసారాల్లో స్థిరపడిన వాళ్ళమే. నా ఆఖరి చెల్లెలికే నలభై ఏళ్ళు దాటాయి. నాకు యాభై నిండుతాయి త్వరలో. అమ్మ ఆఖరు క్షణాల్లో ఉందంటే అందరం మా ఊరు వెళుతున్నాం. ఉబికి ఉబికి వస్తున్న మా అందరి దుఃఖానికి అదీ కారణం.

మేమందరం కూడా మా పిల్లల్ని జాగ్రత్తగా, ప్రేమగా పెంచిన వాళ్ళమే. మా అక్కచెల్లెళ్ళ భర్తలు ఉన్నతోద్యోగాల్లో ఉన్నారు. తమ్ముడు సరేసరి. మరి "అమ్మంటే ఇలా ఉండాలి" అని మా అమ్మనే ఎందుకనుకుంటాం? అందరి పిల్లలూ అలానే అనుకుంటారేమో నాకు తెలియదు.

నా చెల్లెళ్ళిద్దరినీ చూస్తుంటే నాకు నాభిలోంచీ దుఃఖం వస్తోంది. నాన్న దగ్గిర మా ఎవరికీ అంత చనువులేదు. పైగా నాన్న మాకు శాశ్వతంగా దూరమైపోయినప్పుడు కొండంత అండగా అమ్మ ఉండి మమ్మల్ని ఓదార్చింది. ఎంత వయసు వచ్చినా కూడా. అమ్మ ఇంక కనిపించదంటే గుండె పిండేసే బాధ.

ఇంకా నాలుగు గంటలు పైనే పడుతుంది మా ఊరు చేరడానికి. ఏం చెయ్యాలి. నా పిల్లలకి కాస్త ఊరట కల్పించాలి. అవును వీళ్ళు ముగ్గురూ నా పిల్లలే. నా కళ్ళకి ఎప్పుడూ పసిపిల్లల్లాగే కనిపిస్తారు. అమ్మ వెనుకే ఉంటూ, అమ్మకి సాయం చేస్తూ. వీళ్ళకి గోరుముద్దలు తినిపించీ, జడలు వేసి, తలంట్లు పోసి, హోం వర్కులు చేయించీ, రాత్రిళ్ళు కథలు చెప్పి.

అవును. వీళ్ళకి కథ చెప్తాను. కాసేపు అమ్మ ధ్యాస నుంచి మరలిస్తాను. ఏ కథ. ఇంకే కథ, ఓ అమ్మ కథే చెప్తాను.

కాళ్ళు తిమ్మిరెక్కుతున్నాయి. కదలబోయాను. తమ్ముడు తేరుకుని సర్దుకుని కూర్చున్నాడు. మంచినీళ్ళ సీసా తీసి గడగడా తాగాను.

"ఇంకా చాలా టైముంది. ఏదైనా కథ చెప్పక్కా?" తమ్ముడ్ని చూసి గర్వంతో నా గుండె పొంగింది. ఏ సమయానికి ఏం చెయ్యాలో ఎంత బాగా తెలుసు వీడికి. అందుకే మామూలు స్కూలు మాస్టరు ఇంట్లో పుట్టినవాడు ఐపీయస్ ఆఫీసరయ్యాడు.

చెల్లెళ్ళిద్దరూ కూడా కుతూహలంగా చూస్తున్నారు. గొంతు సవరించుకున్నాను.

●●●

"అనగనగా ఒక ఊళ్ళో."

అందరి మొహాల్లోనూ నవ్వు కనిపించింది. ఒక్కసారి నలభై ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయారు. కొబ్బరి చెట్ల మధ్యలో నులక మంచాలమీద కూర్చుని, చందమామని చూస్తూ. అమ్మ పెట్టే గోంగూర పచ్చడి ముద్దల్ని, వెన్న నంజుకుని తింటూ అక్క కథలకి ఊ కొడుతున్న అనుభూతి పొందుతున్నట్లు తెలిసి పోతోంది.

అప్రయత్నంగా అందరం ఆహ్లాద వాతావరణంలోకి వచ్చేశాం.

"సంక్రాంతి దగ్గర పడుతోంది. పోటీల మీద వీధుల్లో ముగ్గులు వెలుస్తున్నాయి. ఆ రోజు. పన్నెండేళ్ళ చిట్టి హడావుడిగా ఉంది. ఇన్నాళ్ళకి అత్తయ్య సంది గొబ్బిళ్ళ పేరంటం చెయ్యడానికి ఒప్పుకుంది. చిట్టి, పుట్టగానే తల్లిని పోగొట్టుకుంది. తండ్రి దేశాలు పట్టిపోయాడు. దయగల మేనమామ తన ఇంటికి తీసుకొచ్చాడు. ఊళ్ళో ఉన్న వీధి బళ్ళో ఐదోక్లాసు పాసయిపోయింది. పొరుగూరు పంపించే స్తోమత లేదు.

అత్తయ్య మంచిదే కానీ తన పిల్లలకే మూడుపూటలా తిండి పెట్టలేకపోతోంది. ఒక పొట్టే అయినా అదనపు భారమే. చిట్టి మేనమామ చిన్న చిన్న పౌరోహిత్యాలు చేస్తాడు. అందులో ఆడపిల్లంటే పెళ్ళీ, పురుళ్ళూ! ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే అప్పుడప్పుడు విసుక్కుంటుంది.

నాలుగు సంవత్సరాల తర్వాత కరణం గారింట్లో లక్షపత్రి పూజ చేసి, నెలకి సరిపోయే సంభారాలిచ్చారు. పోన్లే పిల్లలు సరదా పడుతున్నారని అత్తయ్య పేరంటం చెయ్యడానికి ఒప్పుకుంది. ఇంక చిట్టికీ, మామ పిల్లలు కనకం, వరాల్లకీ కాళ్ళు నిలవటం లేదు.

తులసి కోట దగ్గిర పొద్దున్న వేసిన ముగ్గులు చెరిపేసి, ముగ్గులో కొత్తబియ్యం దంచిన పిండి కలిపి ముత్యాల్లా మెరిసే ముగ్గులు వేశారు. ఊరంతా తిరిగి ఆవుపేడ పట్టుకొచ్చి సందెగొబ్బెమ్మనీ, మూడు పిల్లగొబ్బిళ్ళనీ తయారుచేసి బంతీ, చామంతులతో అలంకరించారు.

చిట్టి అందరికంటే పెద్దది. కరణం అత్తయ్య తన పాత పట్టుచీర చింపి ముగ్గురికీ పరికిణీలు కుట్టించింది. దానిమీదికి జరీ కొంగుతో బుట్టచేతుల జాకెట్లూ కోడలిది చిరిగిపోయిన జార్జెట్ చీరలో బాగున్న భాగం తీసి, అంచులు కుట్టించి ఓణీ కూడా ఇచ్చింది చిట్టికి. కనకం, వరాలూ చిన్నపిల్లలు. ఓణీ వయసు రాలేదు. ఎంత పాతదయినా కంచిపట్టు చీరేమో. కుంకుడు కాయరసంలో ఉతికితే తళతళా మెరిసిపోతోంది.

మెళ్ళో కాశీతాడే వేసుకున్నా. పట్టుబట్టలు కట్టుకున్న చిట్టి మహాలక్ష్మిలా కళకళ్ళాడుతోంది.

సంధ్యకాంతులతో దీటుగా మెరిసిపోతూ ఊర్లో ఉన్న ఆడపిల్లలందరూ వచ్చేశారు. కరణం గారి మనవరాలికి ఐదేళ్ళుంటాయి. వాళ్ళమ్మ కృష్ణుడి వేషం వేసి పంపింది. చిన్ని కృష్ణుడ్ని మధ్యలో పెట్టి "కొలని దోపరికి గొబ్బిళ్ళో.. గొబ్బిళ్ళు" అంటూ గుండ్రంగా తిరుగుతూ నాట్యం చేస్తున్నారు అందరూ.

రెండు వృత్తాలుగా, ఎత్తుని బట్టి విభజించి కోలాటం ఆడుతూ తిరుగుతున్నారు. అందరిలో చిట్టి చురుగ్గా అడుగులు వేస్తూ పాటనీ, కోలాటాన్నీ నడిపిస్తూ. తళుక్కుమనే నక్షత్రాల్లో తారలా మెరిసిపోతోంది.

సరిగ్గా అప్పుడే వచ్చారు శివరామశాస్త్రిగారూ, వారి భార్య రామలక్ష్మిగారు. నాలుగూర్ల అవతల తాలుకాలో ఉంటారు.

చిట్టి గొబ్బిపాటలు అయి ప్రసాదం సర్దడానికి వెళుతూ చూసింది. మావయ్య, అత్తయ్య మర్యాదలు చేస్తున్నారు. కరణం గారింట్లో పూజకి వెళ్ళినప్పుడు చూసింది. అంత ధనవంతులు ఇక్కడికెందుకు వచ్చారబ్బా! జరీ అంచు ఖద్దరు పంచ, సిల్కులాల్చీ వేసుకుని గంభీరంగా కూర్చున్నారు శాస్త్రిగారు. రామలక్ష్మిగారయితే చెప్పక్కరలేదు. మెళ్ళో చంద్రహారాలూ, మామిడిపిందెల నెక్లెసు. చేతికి నాలుగేసి బంగారు మిరియం గాజులు. మధ్యలో ఎర్ర గాజులు. ఠీవిగా పెరటరుగు మీద వేసిన చాప మీద కూర్చుంది.

నానబెట్టి పొగిచిన సెనగలు, అటుకుల, కొబ్బరి, బెల్లం వేసి దంచిన ఉండలు, అరటిపళ్ళు నైవేద్యం పెట్టి, చిన్న చిన్న అరటిపాయల్లో జాగ్రత్తగా అందరికీ అందించింది చిట్టి.

ప్రసాదం అందుకుంటూ చిట్టిని పరీక్షగా చూసింది రామలక్ష్మి. చిట్టికి ఎందుకో ఆవిడని చూస్తుంటే సన్నగా వణుకు. ఏదో తెలియని భయం. కాళ్ళు తడబడుతుండగా దూరంగా కూర్చుని నిశ్శబ్దంగా సెనగలు నోట్లో వేసుకుంది. తలొంచుకుని తింటున్నా, ఎవరో తనని పరిశీలిస్తున్నారనే భావం. మరింత ముడుచుకుని కూర్చుంది. అమ్మాయిలందరూ వెళ్ళిపోయాక దగ్గర కూర్చోబెట్టుకుని అనేక ప్రశ్నలడిగింది రామలక్ష్మి.

ఆ రాత్రి చిట్టిని వాళ్ళబ్బాయికి చేసుకుంటామంటున్నారు. అబ్బాయి ప్రాధమిక పాఠశాలలో మాష్టరట. 'మనం ఒప్పుకుంటే కనకం పెళ్ళికి పదివేలు ఇస్తారుట" మావయ్య గొంతు సన్నగా.

"చూడబోతే చాలా ధనవంతుల్లా ఉన్నారు. మన చిట్టిని ఎందుకడుగుతున్నారో మరి."

"పిచ్చి మొహమా! చిట్టికేమే మహలక్ష్మిలా ఉంటుంది. ఈ చుట్టుప్రక్కల పది గ్రామాల్లో ఇలాంటి పిల్ల దొరుకుతుందా?"

"ఒకసారి వాళ్ళింటికి వెళ్ళి అబ్బాయిని చూసివస్తే"

"అలాగే! మంచిరోజు చూసుకుని వెళ్ళొస్తా."

చిట్టికి పల్లకీలో ఊరేగుతున్నట్లు కలలొచ్చాయి. పెళ్ళికొడుకు మాత్రం మసకమసకగా కనిపించాడు.

●●●

చిట్టీ, రాజారాంల పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది.

"అంత ఉన్నవాళ్ళయినా ఏ మాత్రం భేషజం లేకుండా పిల్ల పరిస్థితులు అర్థం చేసుకుని సర్దుకుపోయారు. చిట్టి ఎంత అదృష్టవంతురాలో!" బంధువులు అనుకుంటుంటే చిట్టి మురిసిపోయింది.

"అంత ఉన్నవాళ్ళయితే చిన్నమెత్తు బంగారం పెట్టలేదేం? మనం పెళ్ళికి చేసిన అప్పు తీర్చడానికి ఎన్నాళ్ళు ఒంటిపూట భోంచెయ్యాలో" అత్తయ్య చాటుగా మావయ్యతో అంటుంటే విన్న చిట్టికి బంగారు గాజులు, గొలుసులతో కళకళ్ళాడిన అత్తగారు కనిపించింది. చిట్టి కలలు కన్న పల్లకీ ఊరేగింపు కూడా లేదు. అవన్నీ గ్రహించగల శక్తీ, వయసూ లేవు. కళ్యాణం బొట్టు. కరణం అత్తయ్యగారిచ్చిన పరికిణీ ఓణీ, ఆవిడే చేయించిన మంగళసూత్రాలతో అత్తవారింట అడుగు పెట్టింది చిట్టి.

కాపురం చేసే వయసు వచ్చాక పంపుదామా అనుకున్న అత్తయ్యకి, అప్పు గుర్తుకొచ్చి నోరు మూసుకుంది.

"అబ్బా! ఎంత పెద్దిల్లో" అనుకుంది చిట్టి, రాజారాం చిటికిన వేలు పట్టుకుని అత్తవారింట్లో అడుగు పెడుతూ.

"కుడికాలు ముందు పెట్టమ్మా" ఎవరో కొత్తావిడ. అచ్చు అత్తగారిలాగే ఉంది. కొంచెం లావుగా. పెద్ద కుంకుమ బొట్టు, హారతి పళ్ళెం పట్టుకుని నిల్చుంది. చుట్టూ చూసింది చిట్టి. ఇంకెవరూ లేరు. పేర్లు చెప్పమనడాలూ, సరదా వేళాకోళాలూ. ఎంతో ఊహించుకున్న చిట్టికి ఏడుపొచ్చేసింది. కనకం, వరాలూ గుర్తుకొచ్చారు. ఇక్కడ ఒక్కదాన్నే ఉండాలా. చిట్టికి రెట్టింపు పొడవున్న రాజారాం ఎప్పుడో చిటికిన వేలు వదిలేశాడు.

"మా అక్క ఇక్కడే ఉంటుంది" రామలక్ష్మిగారు ముక్తసరిగా అని లోపలికి వెళ్ళిపోయింది. ఎందుకో చిట్టికి ఆవిడ్ని అత్తయ్యా అనబుద్ధికాలేదు.

బెదురు చూపులతో ఇంట్లోకి అడుగుపెట్టింది చిట్టి. పెద్ద మండువా ఇల్లే చీకటి చీకటిగా, పాడుపడిపోయినట్లుంది.

●●●

పొత్తి కడుపు లోపల మెలి తిప్పుతున్న బాధ.

"అమ్మా!" అమ్మెలా ఉంటుందో తెలియని చిట్టి అమ్మని తలుచుకుంటూ చేతిలో చీపురు కింద పడేసి దబ్బున కూలబడింది. రెండేళ్ళనుంచీ ఎప్పుడూ చిర్రున చీదైనా ఎరుగని చిట్టి కేకవిని, గుమ్మానికి పసుపు రాసి బొట్లు పెడుతున్న పెద్దత్తయ్య మెట్లు దిగి వచ్చింది. "రామలక్ష్మీ" చిట్టిని చూస్తూనే గట్టిగా అరిచింది. చిట్టిని లేవదీసి, వీధరుగు మీదున్న గదిలో తాటాకు చాప వేసి కూర్చోబెట్టారు. అక్కచెల్లెళ్ళిద్దరూ కలిసి.

"వాళ్ళ మావయ్యకి కబురంపుదామా?"

"ఆయనొచ్చేం చేస్తాడు. పిల్లకి కుంకం, ఓ రవికలగుడ్డైనా తేలేడు. అదో దండగ. మనవే కానిచ్చేద్దాం." రామలక్ష్మి మాటలు వింటూ తల మోకాళ్ళ మీద పెట్టి కళ్ళు మూసుకుంది చిట్టి.

గడిచిన రెండేళ్ళూ కళ్ళముందు కదిలాయి.

శాస్త్రిగారిది పైన పటారం. లోన లొటారం. ఉన్న ఆస్థి అంతా ఆయనగారి పేకాట వ్యసనానికి కర్పూరంలా హరించి పోయింది. రామలక్ష్మిగారు వేసుకున్న వస్తువులన్నీ ఉమా గోల్డువే. ఆవిడ ఇంట్లో ఇక్కడి పుల్ల అక్కడ పెట్టదు. అక్క మీద అజమాయిషీ చెయ్యడం తప్ప. అక్క ఇక్కడెందుకుంటుందో ఆవిడ సంసారం ఏమయిందో ఏమీ అర్థం కాదు. ఊర్లో వాళ్ళెవరూ రామలక్ష్మి నోటికి జడిసి వీళ్ళింటికి రారు. రామలక్ష్మిగారి తండ్రిది ఈ ఇల్లు. ఇద్దరే కూతుళ్ళు ఆయనకి. అందుకనే ఇదైనా మిగిలింది. అక్కకి తగని నీరసం వచ్చి పనులు చేసుకోలేకపోవడంతో ఇంట్లో పనిమనిషి కావలసి వచ్చింది. జీతం లేని పనిమనిషి ఎలా వస్తుంది. కొడుక్కి పెళ్ళి చేస్తే. కొడుకు మేస్టరీలో వచ్చే జీతమే ఆధారం. అలా చిట్టి ఆ ఇంట్లో అడుగు పెట్టింది.

చిట్టిని బైటికి వెళ్ళనియ్యరు. వెళ్ళాలన్నా ఇంటి పనితో సమయం ఉండదు. ఎప్పుడైనా మధ్యాహ్నం అత్తలిద్దరూ పడుకున్నప్పుడు, భయం భయంగా పెరట్లో జామచెట్టు కింద కూర్చుంటే పక్కింటి పద్మ పిలిచి గోడ మీంచి చెప్పిన సంగతులు ఇవి.

●●●

"చిట్టీ గుమ్మం దగ్గర ముగ్గేశావా?" పెద్దత్త.

"కాఫీ తీసుకురా. ఇంత నీళ్ళలా ఉందేవే?" రామలక్ష్మిగారు.

"నా కండువా తెచ్చిపెట్టు. త్వరగా" రాజారాం కేకలు.

"ఈ కందిపప్పు పచ్చడి రుబ్బేయ్. అబ్బాయి భోజనానికి వచ్చేస్తున్నాడు"

"చిట్టీ, ఈ నూతి పళ్ళెం చూడు. ఎలా పాకుడు పట్టిపోయిందో. ఏం చేస్తున్నావే పగలంతా. మూడుపూటలా సుష్టుగా మింగడం తప్ప. "సందెవేళ చూసుకోకుండా నడుస్తూ కాలుజారిన రామలక్ష్మి అరుపులు."

"నడుం నొప్పా వేషాలు. పద గదిలోకి. పదకొండయింది. ఎంతసేపూ పనిపనంటావు. నా పనేంటి?" వంటిల్లు కడుగుతున్న చిట్టి చెవులో రాజారాం గుసగుసలు.

పెళ్ళయి మూడేళ్ళయింది. ఒక అర్ధరాత్రి.

రాజారాం చేతుల్లోంచి బైటపడి మంచం దిగింది చిట్టి. ఏడాది నుంచీ కాపురం చేస్తున్నా ఊపిరాడనట్టే గాభరా. ఎప్పుడెప్పుడు గదిలోంచి బైటపడి, మండువా వార చాపమీద పడుకుందామా అని ఉంటుంది. చీరకొంగుతో చెమట తుడుచుకుంటూ మండువా స్థంభం దగ్గరికి వచ్చినప్పుడు కంట పడింది ఆ దృశ్యం.

మామగారు పెద్దత్తయ్య గదిలోంచి వస్తున్నాడు. వెనకే అత్తయ్య. ఆవిడ చూడనే చూసింది, స్థంభం చాటున ఉన్న చిట్టిని. ఆయన రామలక్ష్మిగారి గదిలోకి వెళ్ళగానే చిట్టిని పెరట్లోకి తీసుకెళ్ళి, అరుగు మీద కూర్చోబెట్టి భోరుమంది.

"నాకు తెలుసే. ఎప్పటికైనా నీకు తెలియకపోదని. కానీ నేను చేసే పని తప్పుకాదు. అగ్నిసాక్షిగా పెండ్లాడిన భర్తతోనే చీకటి సంసారం చేస్తున్న దౌర్భాగ్యురాలిని. సమయం చూసుకుని అంతా చెపుతాను. ఇప్పటికి నిద్రపో" గుసగుసగా చెప్పి లోపలికి వెళ్ళిపోయింది. స్థంభానికానుకుని రాత్రంతా అలాగే కూర్చుంది చిట్టి, మనసంతా మొద్దుబారిపోగా.

●●●

"మా అమ్మ రామలక్ష్మి పుట్టగానే పోయింది, జబ్బుచేసి. దానికంటే ఎనిమిదేళ్ళు పెద్దయిన నేనే పెంచాను. రాజారాం తండ్రితో నా పెళ్ళి అయినప్పుడు దానికి పదేళ్ళు. తల్లి లేని పిల్ల అని నేను, నాన్న చేసిన గారాం దాన్ని మొండిదానిగా మార్చింది. అడిగింది ఏది ఇవ్వకపోయినా రాద్ధాంతం రచ్చ. పడలేక అన్నింటికీ దాని మాటే నెగ్గేలా చేశాం. అదే నేనూ నాన్నా చేసిన పెద్ద తప్పు. బడికి పంపి చదువుకోమంటే ఊర్లో అందరితో పోట్లాటలు పెట్టుకునేది. అలా అని ఇంట్లో ఉంచడం సాధ్యమయేది కాదు. నా పెళ్ళి నాటికి దానికి పధ్నాలుగేళ్ళు. అవును, నాకు అప్పటి రోజుల ప్రకారం ఆలశ్యంగానే అయింది పెళ్ళి, ఇంట్లో అమ్మలేకపోవడం వల్ల. అందుకునే పురిటికి రామలక్ష్మే రావలసి వచ్చింది.

అప్పుడు మాకు ఆస్థి బాగానే ఉండేది. ఇల్లంతా, పాడి పంటలతో కళకళ్ళాడుతూ ఉండేది. పురిటికొచ్చిన రామలక్ష్మికి ఆ వైభోగవంతా చూస్తూ కళ్ళు తిరిగినట్లయింది. నా అదృష్టానికి అసూయ. ఇంటికి వెళితే వృద్ధుడైన నాన్న సేవ, ఎప్పటికైనా తనకి పెళ్ళి చెయ్యగలడన్న నమ్మకం లేకపోవడం. నాకు సేవచెయ్యాలని వచ్చింది. నాకే సవతి అయి కూర్చుంది. బాబు పుట్టినప్పుడు నాలుగు నెలలు ఆడతోడు లేకపోడాన్ని తట్టుకోని మొగుడు దాన్ని వల్లో వేసుకున్నాడు, పెళ్ళి చేసుకుంటానని చెప్పి. దానికి తోడు, నాకు పిల్లాడు పుట్టాక తగని నీరసం పట్టుకుంది."

"అంటే?" చిట్టి ఆపేసింది, పెద్దత్తని సందేహంగా చూస్తూ. రామలక్ష్మీ, మామాగారూ వారం రోజుల తర్వాత మాట్నీ సినిమాకి వెళ్ళారు. వాళ్ళు వెళ్ళగానే మండువాలో కూర్చోపెట్టి చెప్పసాగింది ఆవిడ.

"అవును. రాజారాం నా కొడుకే. కానీ ఆ సంగతి వాడిక్కూడా తెలియదు. మీ మామగార్ని కొంగుకట్టేసుకున్న రామలక్ష్మి, వాడిని కూడా నాకు దూరం చేసింది. ఊర్లో బాగా చితికిపోయి, మేం ఈ ఊరొచ్చేసినప్పుడు, అందరికీ తన కొడుకే అని చెప్పింది. మొదట్లో నేను అడ్డుకోబోతే పిల్లాడిని నూతిలో పడేస్తానని బెదిరించింది. మొగుడి ఆదరణ లేని నేను అంతకన్నా ఏం చెయ్యగలను.

మాకు బంధువులు కూడా ఎవరూ లేరు. ఏదో రాజారాంకి ఉద్యోగం ఉంది కనుక ఈ మాత్రమైనా వేళ్ళు నోట్లోకి వెళుతున్నాయి. ఎంతకాదనుకున్నా అప్పుడప్పుడు ఆయన నా గదిలోకి..''

''అయిందా చెప్పడం?'' ఎప్పుడొచ్చిందో రామలక్ష్మి, క్రోధంగా చూస్తోంది. తనకి సంబంధించిన విషయాలు కానట్లు మామగారు గదిలోకి వెళ్ళిపోతుంటే భయపడుతూ లేచి పరుగెట్టబోతున్న చిట్టిని జడ పట్టుకుని ఆపింది.

''మీరు.. సినిమా..?'' పెద్దత్త మాట పూర్తవలేదు.

''ఓహో! సాయంత్రం వరకూ ఉన్నవీ లేనివీ ఎక్కిద్దామనుకున్నావా? పాపం. మీ దురదృష్టం. మాకు టిక్కెట్లు దొరకలేదు. ఇది వచ్చాక నీకు బాగా ఎక్కింది. దీన్ని వెళ్ళగొడితే మీ ఇద్దరి తిక్కలూ కుదురుతాయి'' చిట్టి జడ పట్టుకుని గుంజి వీధిలోకి తోసేసింది.

సరిగ్గా అదే సమయానికి, కనకం పెళ్ళి కుదిరిందన్న శుభవార్త చెప్పి, ఇస్తామన్న పదివేలూ తీసుకెళదామని వచ్చిన మేనమామ చిట్టిని గుమ్మాల్లోంచి దొర్లిపోకుండా పట్టుకున్నాడు.

''నేను ముందుగానే మీకు అన్ని వివరాలు చెప్పాకదమ్మా. మా పిల్ల పెళ్ళికి''

''ఇంక అదొక్కటే తక్కువ. ఇక్కడేం రాసులు పోసుక్కూర్చోలేదు. ఆడపిల్లనిచ్చుకున్నాక అదెలా అఘోరిస్తోందో అత్తింట్లో ఏం కాల్చుకు తింటోందో పట్టించుకునేదేం లేదా. అసలు మీ వంశమే'' అడ్డూ ఆపూ లేకుండా సాగిపోతున్న రామలక్ష్మి నోటికి ఝడిసి, చిట్టిని తీసుకుని వెనక్కి తిరిగాడు మేనమామ.

వెళ్ళిన వాడు తన ఊరినుంచి పెద్దల్ని తీసుకొచ్చి, తాలుకాలో మునసబుగారి ఇంట్లో రాజారాంనీ, తండ్రినీ, రామలక్ష్మినీ పిలిపించి పంచాయితీ పెట్టించాడు.

రామలక్ష్మి కూడా ఊరుకోలేదు. కోడలి మీద అనేక అభియోగాలు మోపింది. ససేమిరా చిట్టి ఇంటికి రావడానికి వీల్లేదంది. అయినా ఇచ్చిన మాట ప్రకారం పదివేలూ, రాజారాం జీతంలో నాలుగో వంతు భరణం ఇవ్వాల్సిందేనని తీర్పు చెప్పారు పెద్దలు. తిట్టుకుంటూ కొడుక్కి తెలియకుండా దాచుకున్న డబ్బు ఇచ్చేసింది రామలక్ష్మి. రాజారాం ప్రతినెలా డబ్బు పంపించేవాడు.

చిట్టి మేనమామ ఇంట్లో వచ్చి పడింది. ఈసారి డబ్బు కూడా వస్తోంది. అత్తయ్య ఏమీ మాట్లాడలేదు. కనకంకీ, వరాలుకీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. మేనమామ, అత్తయ్యా కాలం చేశారు. చిట్టి వంటరి అయిపోయింది.

రాజారాం జీవితంలో కూడా మార్పులు వచ్చాయి. చిట్టి వెళ్ళిపోయాక, మళ్ళీ పెళ్ళి చేసింది రామలక్ష్మి ఇంకో పేదింటి పిల్లని తెచ్చి. ఈ కోడలు, నెమ్మదైందే కానీ తెలివయింది. అత్తలిద్దర్నీ నెగ్గుకొచ్చి, రాజారాంనీ, మామగార్నీ కూడా కంట్రోల్లో పెట్టింది. కాలక్రమంలో అత్తలిద్దరూ, మామగారూ పోయారు. ముగ్గురు పిల్లలు. మూడో కానుపులో భార్యని పోగొట్టుకున్న రాజారాంకి దిక్కు తోచలేదు. ఊర్లో పెద్దలిచ్చిన సలహాతో చిట్టి దగ్గరకి వెళ్ళి అడిగాడు''

కథ ఆపి, మంచినీళ్ళ సీసా అందుకున్నాను.

''చిట్టి ఒప్పుకుందా అక్కా? నేనైతే పాచిపని చేసుకుని బ్రతికేదాన్ని కానీ ఛస్తే ఆ ఇంటికి వెళ్ళేదాన్నికాను.'' చిన్న చెల్లెలు అంది ఆవేశంగా.

''కానీ చిట్టి సంగతి వేరురా! అప్పటి కాలం కూడా వేరు. నలభై ఐదేళ్ళ క్రితం పరిస్థితులు వేరుగా ఉండేవి, మన ఊర్లలో. అందుకే ఒంటరి ఐపోయిన చిట్టి, దేవుడు తోడూ, నీడా పంపించాడని ఆనంద పడింది. ముగ్గుర్నీ, తనకి పుట్టిన బిడ్డనీ.''

''అక్కా ! ఆగు. చిట్టి మనమ్మే కదూ'' పెద్ద చెల్లెలి గొంతులో ఏదో అడ్డుపడ్డట్లు మాట పూర్తి చెయ్యలేకపోయింది.

ఆనంద్ నిటారుగా అయ్యాడు. చిన్న చెల్లెలు కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది. "నాకు కొద్దిగా గుర్తుకొస్తోందక్కా. చిన్ని తమ్ముడ్ని తీసుకుని కొత్త అమ్మ మనింటికి రావడం. ఇన్ని రోజులూ ఎలా మర్చిపోయాను? నాకు ఐదేళ్ళున్నాయప్పుడు. ఒకటో క్లాసు చదువుతున్నా కూడా" పెద్ద చెల్లెలు ఆశ్చర్యంగా చూసింది. దానికళ్ళ నిండా నీళ్ళు. ఏ క్షణంలోనైనా జారి కిందపడేట్లున్నాయి.

"అమ్మ మహత్యం అదంతా. నాకయితే ఎనిమిదేళ్ళు. వచ్చిన రోజునుంచే అమ్మ లోటు తెలియకుండా చేసింది. చిన్న చెల్లి ఒక్కతే అమ్మ కన్నబిడ్డ. అమ్మ మనింటికొచ్చేసరికి ఆనంద్ పదిహేను రోజుల పసివాడు." చెయ్యి వెనక్కి తిప్పి కళ్ళు తుడుచుకుంటూ అన్నాను.

"అదేం కాదక్కా! అందరం అమ్మ సొంతపిల్లలమే. అమ్మంటే మనమ్మే!" ఆనంద్ కళ్ళ నిండా నీళ్ళతో.. ఇద్దరు చెల్లెళ్ళూ నాకూ ఆనంద్‌కీ మధ్యన చేరి మా భుజాల మీద తలలు పెట్టుకుని కన్నీళ్ళు కారుస్తున్నారు. మేము వాళ్ళిద్దరినీ గట్టిగా పట్టుకున్నాం. అమ్మ ఒళ్ళో ఎప్పుడు వాలిపోదామా అని ఆత్రుతతో ఎదురుచూస్తూ!

●●●

## దీనాతి దీనార్ — మూలా రవి & వాసు

**"ఏరా సీతరాజా, పైడిరాజు కనిపించేడా?" వాసు అడిగేరు.**

"ఆడికి మల్లీ పనుంతే ఆడే వొత్తాడు. లేకపోతే అంతే, మరి కనిపించడు" సీతరాజు చెప్పాడు.

సీతరాజు వాళ్ళ స్వగ్రామం విజయనగరం జిల్లాలో చింతల వలస. పుష్కర క్రితం, స్కూల్లో 'మేస్సేరండీ' అనీ, ఇంట్లో 'వాసూ' అనీ, పిలువబడే, వాసుదేవరావు చింతల వలస ఎలిమెంటరీ స్కూల్లో కొత్తగా ఉజ్జోగంలో జాయినయ్యాడు. అదే సమయంలో, సీతరాజు ఐదోక్లాసుతో చదువు ఆపేస్తున్నాడని తెలిసింది. కారణం: ఈ చదువు, ఊళ్ళో ఉన్న చిల్లర కొట్టుని కిరాణా కొట్టుస్తాయికి తీసుకెళ్ళడానికి చాలన్న పెద్ద(ల) నమ్మకం. అదీకాక రెండు మైళ్ళ దూరంలో ఉన్న చల్లపేట హైస్కూల్లో జాయిన్ చేస్తే, 'ఈడొక్కడికీ ఇంకో సయికిలు కొనాల, మజ్జానం భోజనం కేరేజీ కొనాల,' లాంటి ఇతర తక్షణ ఆర్థిక కారణాలూ ఉన్నాయి. అప్పుడు, చింతలవలసలో ఈర్రాజు అని పిలువబడే, వీర్రాజుని వాసు పిలిపించి, 'మరో ముప్పై ఏళ్ళు ఈ ఊళ్ళోనీ చిల్లరకొట్టుకేం ఢోకాలేదు, నువ్వొక్కడివీ చూసుకోగలవు. మీవాణ్ణి కొట్టువేపు రానీకుండా కాలేజీవరకూ చదివిస్తే, ఇలాంటి వంద దుకాణాలకి సరుకు సప్లై చేసేంత పెద్ద వ్యాపారి అవుతాడు.' అని ఆశపెట్టి, నచ్చజెప్పి, స్వేచ్ఛాజీవి కాబోతున్న సీతరాజుని కట్టిపడేశాడు, వాసు. 'ఈ ఎదవ పదోక్లేసు పేసవుతాడా?' అని సందేహిస్తూనే, 'నేకపోతే అప్పుడే కొట్టుకాడ కూకుంతడు' అని సర్ది చెప్పుకున్నాడు, వీర్రాజు. ఆరో క్లాసునుండి పదోక్లాసు వరకూ, సీతరాజు టైమంతా - వేసంగితో సహా - వాసు ఇంటిదగ్గరే గడిచింది. తిండికి ఇంటికీ, స్కూలున్న రోజు హైస్కూలికి వెళ్ళేవాడు. అందరూ భయపడే ఇంగ్లీషూ, లెక్కలూ వాసే చెప్పాడు. మిగిలిన సబ్జెక్టుల్లో ప్రగతిని సమీక్షిస్తూ, అవసరమైతే హైస్కూల్లో వాడి మేష్టర్లతో మాట్లాడేవాడు.

ఐదేళ్ళ పాటు 'మేస్సేరండీ' పెట్టే మొట్టికాయల్తో, సీతరాజు బుఱ్ఱా, అందులో బుద్ధి గట్టిబడి, సగటుకన్నా ఎక్కువ చదువే అబ్బింది. బాగా నొప్పెట్టినప్పుడు మాత్రం, 'కొట్టుకాడే బాగుండేది' అనుకున్నా, చింతల వలస గ్రామ చరిత్రలో - బేమ్మర్ల పిల్లల్ని

మినహాయిస్తే - పదోక్లాసు పాసయిన ప్రథముడిగా నిలిచినప్పుడు, చాలా గర్వపడ్డాడు. ఫస్టు క్లాసు బోనస్ విజయమే, ముఖ్యంగా గ్రామస్తుల దృష్టిలో. అంతవరకూ ఊళ్ళో ఈ్రరాజు కొడుకుగా పిలువబడే సీతరాజుకి, స్వంత గుర్తింపు వచ్చింది.

సీతరాజు సాలూర్లో ఇంటర్ జాయినయిన మూణ్ణెల్లకి వాసు ఇంగ్లీషు లెక్చెరర్‌గా సెలెక్టయి వస్తున్నట్టు తెలియగానే, అమ్మాయిల ముందు మొట్టికాయలు పెడతారేమోనని భయపడ్డాడు. కానీ వచ్చిన మొదటిరోజే, ఒకమ్మాయిని రూళ్ళకఱ్ఱతో మండ మీద కొట్టేరని విన్నాకా, 'నా భయంలో అర్థంలేదు' అనుకున్నాడు.

ఆ తర్వాత మూడేళ్ళకి, వాసు డిగ్రీ కాలేజ్ లెక్చరర్‌గా కాకినాడ వచ్చాకా, మరో రెండేళ్ళ తర్వాత ఎం.బి.ఏ కోసం సీతరాజు కూడా కాకినాడ వచ్చాడు. ఒకరకంగా చెప్పాలంటే, వాసు ఉద్యోగహోదా, సీతరాజు చదువూ, సమాంతరంగా పెరిగాయి, భౌగోళిక స్థానచలనాలతో సహా.

పైడిరాజు, సీతరాజుకి దూరపు బంధువు. తమ్ముడి వరస. సాలూర్లో వాసుకి స్టూడెంట్. కాలేజీ బయట మాష్టారిని పెద్దగా కలిసింది లేదు. పైడిరాజు బీ.ఈడి జాయినింగ్ కోసం కాకినాడ వచ్చినప్పుడు, అనుకోకుండా ఫీజుకి పదివేల రూపాయలు తక్కువ పడితే, సీతరాజు వాణ్ణి మాష్టారు దగ్గరకి తీసుకొచ్చేడు. అప్పటికి వాసే డబ్బు సర్దేడు. ఆ తర్వాత ప్రతీ ఆదివారం ఈ రాజులిద్దరూ కలిసే వాసు ఇంటికి వచ్చేవారు.

అలాంటి నాలుగాదివారాలు గడిచేకా, వాసు డబ్బులడిగినప్పటినుండీ, అంటే గత ఎనిమిది ఆదివారాలుగా పైడిరాజు పత్తాలేడు. వాసు ఎకానమీ, వానాకాలంలో గలగలా పారే కొండవాగు లాంటిది. ఒకటో తారీకున జీతం రూపంలో వాన కురవకపోతే ఐదో తారీఖునాటికి చెలమ తవ్వినా తడి తగలనంతగా ఎండి పోతోంది. ఇన్నేళ్ళ ఉద్యోగంలో సంవత్సరానికి సరిపడా నీరు నిలిచే రిజర్వాయర్ మాట అటుంచి, నెల్లాళ్ళు నిలిచే, చిన్న చెక్‌డేం కూడా కట్టుకోలేకపోయాడు, వాసు. కట్టుకోవాలని ప్రయత్నించకపోవటం కూడా నిజమేననుకోండి.

"వాడికి పనుంటే వస్తాడన్నది నిజమేన్రా. కానీ ఇప్పుడు నేనెవణ్ణి అప్పు అడగాలి?"

"ఏటవదు మేస్సేరూ. ఆడియ్యకపోతే, ఆళ్ళింటికాడి కెళ్ళి నేను తీసుకొత్తాను" సీతరాజు హామీ.

"వాడెగ్గొడతాడన్న భయం నాకు లేదురా. నా జీతంలో సగం డబ్బులు అక్కడ చిక్కుకుపోతే ఎలా? పోనీ నేనేమన్నా డబ్బులు తేకుండా మా ఇంటికిరావద్దని వాడికి చెప్పేనా?"

మొత్తమ్మీద ఆ తర్వాతాదివారం పైడిరాజు కూడా వచ్చాడు. తట్టాయి, బుట్టాయ్, తాటికాయ్ లాంటి సంజాయిషీ అయ్యాకా పైడిరాజు చెప్పిన సారాంశం ఇదీ: సౌదీలో ఉన్న వాళ్ళన్నయ్య రెండు నెలల క్రితమే ఇక్కడికి రావలసి ఉన్నా, వాళ్ళ కంపెనీ అతన్ని మూడు నెలల పనిమీద ఇరాన్ పంపింది. అదయ్యాక వచ్చే నెల డబ్బుతో వస్తాడు.

నెల తర్వాత వాళ్ళన్నయ్య వచ్చాడని విజయనగరం వెళ్ళి, మళ్ళీవారం తర్వాత వచ్చాడు. వాడి ముఖకవళికల్ని బట్టి, తన పదివేలూ వాయిదా పడ్డట్టు పసిగట్టేసాడు వాసు. "మా యన్నియ్య నా ఎకవుంటు నెంబరు తీసుకున్నాడండీ, ఒచ్చేనెల అందులోనేస్తానన్నాడు."

సరే అన్నాడు వాసు.

మళ్ళీవారం వస్తూనే సంతోషంగా, "మేష్టేరూ, సుబవార్త," అరిచేడు పైడిరాజు.

"చెప్పరా" నీరసంగా అన్నాడు వాసు.

"మాయన్నియ్య నాకోసం తెచ్చిన పరుసులో డబ్బులు మరిచిపోయేడు."

"ఎంత మరిచిపోయేడు?"

"ఇదిగోటండీ" అంటూ, ఒక నోటు తీసి ఇచ్చాడు.

దాని మీద పదివేల అంకె ఒకటే మాష్టారు చదవగలిగింది. మిగతా అంతా ఏభాషో కూడా తెలియట్లేదు. పదివేల అంకె లేకపోతే, ఆ నోటును సరిగ్గా పట్టుకున్నామో, తిరగేసి పట్టుకున్నామో కూడా తెలీకుండా ఉంది.

"దీన్ని నేనేం చేసుకోనురా?"

"దీనార్ ఒకటీ పదిరూపాయలు చేస్తుంది. బేంకులో మార్చుకుంటే లక్షరూపాయలు వొత్తాయండీ, టేక్సులూ, ఖర్చులూ, మీ డబ్బులూ, పోయాక మిగిలితే నాకు బైక్ వస్తుంది."

"ఓరెదవా, మరి నాకేటీ ఇయ్యవేట్రా?" సీతరాజడిగేడు.

"నువ్వు కూడా బండి కొనుక్కుందికి అప్పిత్తాన్లేరా. ఉజ్జోగం వొచ్చేకా తీరుద్దుగాని. వొడ్డీ వొద్దులే."

"తొందరగా మార్చి తీసుకురా. అందరం ఆకలిగానే ఉన్నాం." వాసు.

"నాకెవర్నీ తెలీదండీ. ఈ నోటుతో నేను బేంకి కెళితే, మేనేజరు పోలీసులకి పట్టించేస్తాడేమో. మీరే మార్పించండి మేస్సెరూ"

"మీ అన్నయ్య నడగరా, ఎలా మార్చుకోవాలో"

"ఈ నోటు మర్చిపోయేడని మా అన్నయ్యకి తెలిస్తే, మీ పదివేలూ పోనూ, మిగిలిన డబ్బులు మా ఇంట్లో ఇచ్చీమంటాడు."

"ఈ నోటు నేను మార్పించేనని తర్వాత మీ ఇంట్లో తెలిస్తే, 'మేష్టరు ఇంగ్లీషుతో పాటు దొంగ బుద్ధులు కూడా నేర్పుతున్నారు.' అనుకుంటార్రా"

"అలకెలగ తెలుస్తాది మేస్సెరూ. నేను సెప్పను, సీతరాజుగాడు సెప్పడు." తిరుపతి వెంకటేశ్వరుడి మీద ఇద్దరూ ఒట్లు వేసారు. వెంకటేశ్వరుడే ప్రత్యక్షమై, 'మీవాళ్ళకి నిజం చెప్పండ్రా' అన్నా ఇంక చెప్పరు.

తర్వాత వారం రోజులూ, రోజొక అరగంట చొప్పున పర్మిషన్ పెట్టి, కాకినాడలో ఫారెన్ ఎక్స్చేంజ్ సదుపాయం ఉన్న అన్ని బేంకులూ తిరిగేసాడు వాసు.

"మేం డాలరూ, యూరో, పౌండూ మాత్రమే మార్చగలమండీ. వైజాగ్‌లో ప్రయత్నించండి" అన్నారు అందరూ బేంక్ మేనేజర్లందరూ"

తర్వాత ఆదివారం రాజులిద్దరూ ఆశగా వచ్చారు. విషయం తెలుసుకుని ఉస్సురుమన్నారు.

"మీకన్నా ఎక్కువ నేనేడవాలి. మా కాలేజ్‌లో మూడేళ్ళ సర్వీసులో అడగనన్ని పర్మిషన్లు ఒక వారంలోనే అడిగేను. మా హెడ్ ఇకపై సెలవు అడిగినా ఫోజు కొడతాడు. ఆటోలకి మూడొందలైంది." గయ్యిమన్నాడు వాసు.

ఆ రాత్రి వైజాగ్‌లో ఉన్న తన తమ్ముడికి ఫోన్ చేసి విషయం చెప్పాడు వాసు.

తమ్ముడు చెప్పాడు "అది వైజాగ్ పంపించు వాసూ. రేపుదయం మా ఫ్రెండ్ ఒకడు కాకినాడ నుండి ఇక్కడికి టేక్సీలో వస్తున్నాడు. బయలుదేరేముందు నీ దగ్గరకి రమ్మంటాను. నోటు పేపర్లలో చుట్టి కవర్లో పెట్టివాడికి ఇవ్వు. వాడికి విషయం తెలిస్తే వాటా అడుగుతాడు. అసలే ఫైనాన్స్ బిజినెస్‌లో ఉన్నాడు."

మర్నాడుదయాన్నే ఫోన్. నేను ఫోన్ చేసేసరికే వాడు కాకినాడనుంచి బయలుదేరి కత్తిపూడి వరకూ వచ్చేసాడట. మళ్ళీ కాకినాడ వెళ్ళిరావటానికి టేక్సీవాడు ఐదొందలు ఎక్కువ అడుగుతున్నాడట. వాణ్ణి అక్కడ ఆగమన్నాను.

"సర్లే, మీ ఫ్రెండ్‌ని రమ్మను. ఈ కవరూ, ఐదొందలూ ఇస్తాను. ఇందుకోసం నువ్వు ఇంకేం ఖర్చు పెట్టినా ఎకౌంట్ మెయింటెయిన్ చెయ్యి. పైడిరాజుగాడి దగ్గర తీసుకుందాం. ఈ పనిమీద బేంక్‌కి వెళ్ళేటప్పుడు, పాస్ పోర్టూ, పేన్ కార్డూ, బేంక్ ఎకౌంట్ డీటెయిల్సూ తీసుకెళ్ళు." వాసు చెప్పాడు, తమ్ముడితో.

రెండ్రోజుల తర్వాత తమ్ముడి ఫోన్. "కెనడా, ఆస్ట్రేలియా, చైనాతో సహా అన్నిదేశాల కరెన్సీ ఇక్కడ మారుతుందట." ఊపిరి తీసుకుందికి ఆగాడు.

"ఒక్క గల్ఫ్ కరెన్సీ తప్ప." తమ్ముడు చెప్పేడు.

"మరి ఈ నోటు శ్రీకాంత్ కెలా చేరుతుంది?" శ్రీకాంత్ అంటే, వీళ్ళ కజిన్. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కార్గో మేనేజర్‌గా చేస్తున్నాడు.

"కొరియర్ చేస్తాను." తమ్ముడు చెప్పాడు.

"లోకల్ కొరియర్ వద్దు. వైజాగ్ ఎయిర్ పోర్టుకెళ్ళి అక్కడే కొరియర్‌లో పంపి, శ్రీకాంత్‌కి ఫోన్ చేస్తే ఏ ఫ్లైట్‌లో వస్తోందో కనుక్కుని, ఎయిర్ పోర్ట్‌లోనే కలెక్ట్ చేసుకుంటాడు."

రెండు రోజుల తర్వాత శ్రీకాంత్ ఫోన్. "ఏర్ పోర్ట్ ఫారెక్స్ కౌంటర్‌లో అడిగేను. వాళ్ళు ఇండియన్ డబ్బుకి దీనార్లిస్తారుట గానీ, ఇది తీసుకుని ఇండియన్ డబ్బివ్వరట."

"పోనీ ఎవరైనా దీనార్లడిగినప్పుడు ఈ నోటు వాళ్ళకి, వాళ్ళ రూపాయలు మనకి ఇవ్వమని అడిగేవా?"

"దీనార్లు ఏటిఎం వెండింగ్ మెషిన్‌లో నేరుగా గల్ఫ్ నుంచే వస్తాయిట. వీళ్ళు ఇండియా డబ్బే లెక్కబెడతారట. నేనిచ్చిన నోటు చూడ్డానిక్కూడా వాడొప్పుకోలేదు. ఇలాంటిపని చేస్తే, ఏ హవాలా కిందో జైల్లోపలికి వెళ్ళిపోతారట."

"మరేం చేద్దాం?"

"చూద్దాం. ఇంకెలాగైనా వీలౌతుందేమో."

రెండు రోజుల తర్వాత మళ్ళీ శ్రీకాంత్ ఫోన్. "ఈ రోజు దుబాయ్ వాడొకడు లగేజ్ విషయంలో ఇబ్బంది వచ్చి నా దగ్గరకు వచ్చాడు. హవాలా భయం తెలిసినప్పటినుంచీ నాక్కూడా భయం మొదలైంది. సరే, ఈ షేక్ నా సాయం కోసం వచ్చాడని చెప్పి, కౌంటర్‌లో కాకుండా, వాణ్ణి నా రూంలోకి తీసుకెళ్ళి, వాడి మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ చెయ్యమని రిక్వెస్ట్ చేసి కాఫీ ఆఫర్ చేసాను. ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్ కదా వందరూపాయలొదిలింది"

"వంద రూపాయలదేముందిలే. అయినా ఎయిర్ పోర్ట్‌లో మీకు కాఫీ కూడా ఫ్రీకాదా." వాసు ఆశ్చర్యం.

"గజపతి నగరం రైల్వే స్టేషన్‌లో టీలు అమ్ముకునేవాడు స్టేషన్ మేస్టారుకి ఫ్రీ టీ ఇచ్చినట్టు ఇక్కడెవరూ ఎవ్వరు. ఇచ్చేదంతా జీతంలా ఇస్తున్నాం, మీరు కూడా అందర్లాగా కొనుక్కోవలసిందే అంటారు."

"పోనీలే, పదివేల దీనార్లున్నాయికదా. ఈ ఖర్చు కూడా అందులోంచే రాబడదాం."

"విషయమేంటంటే, ఇది దుబాయ్‌లో చెల్లదట. ఆ షేక్ చెప్పేడు." శ్రీకాంత్.

"కొంపతీసి దొంగనోటు కాదుకద." వాసు భయం భయంగా అడిగేడు.

"కాదులే. ఇరానీ రియాల్స్. ఇరాన్ వెళ్ళేవాణ్ణిగానీ, ఇరాన్ నుంచొచ్చేవాణ్ణిగానీ కదిపి చూడమన్నాడు."

"సరే అలాగే ప్రయత్నించు."

"కానీ చాలా రిస్కు వాసూ. అసలే ఇరాన్ అంటే అమెరికాకి పడదు. ఒబామాకి జలుబు చెయ్యగానే మన్మోహన్‌కి తుమ్మొస్తుంది. అఫీషియల్ డ్యూటీ కాకుండా ఇరాన్ వాణ్ణి కలవాలంటే భయంగా ఉంది. అదీకక పాసింజర్లలో ఇతర గల్ఫ్ దేశాల వాళ్ళతో పోలిస్తే ఇరానీలు చాలా తక్కువ"

"ముందు మన సేఫ్టీ చూసుకో. లేకపోతే వైజాగ్ వెళ్ళేటప్పుడు ఆ నోటు తమ్ముడికి ఇచ్చెయ్. పైడిరాజుగాడికి తిరిగిచ్చేస్తే వాడి దయున్నప్పుడు నా పదివేలూ ఇస్తాడు." వాసు.

మర్నాడు పైడిరాజుతో, "నీ నోటు మారట్లేదు. నువ్వే తీసుకోరా." అన్నాడు, వాసు.

"మేస్సేరండీ, పదివేల దీనార్లనే పదివేల రూపాయలనుకోండి. ఎలాగైనా మీరే మార్పించాలి. నకేటీ ఇవ్వొద్దు."

"నీ డబ్బు నాకెందుకురా."

"పోన్లెంది మేస్సేరూ. మీరే మార్చి మీ పదివేలూ పోగా, మిగిలింది సగం సగం పంచుకోండి. మీరు మార్చకపోతే ఆడివల్లేటౌతది. ఇప్పుడాలన్నియ్యతో సెప్తే ఆణ్ణే తిడతాడు." సీతరాజు రాజీ ఫార్ములా ప్రతిపాదించేడు.

అంతలో ఫోన్ మోగింది. "హలో" ఫోన్ ఎత్తి అన్నాడు, వాసు.

"ఏమిటి చేస్తున్నావ్?" అటుపక్క కిరణ్. వాసు తమ్ముడికి క్లాస్ మేట్. వాసు బీ.ఈడీ రోజుల్లో వీళ్ళిద్దరూ ఎనిమిదోక్లాసు. అంచేత వాసు దగ్గర పాఠాలు నేర్చుకున్నా 'వాసూ' అని పేరు పెట్టే పిలుస్తాడు. ఎవరికైనా చెప్పేటప్పుడు వాసు నా టీచర్ అంటాడు. వాసు మాత్రం కిరణ్‌ని ఎవరికైనా పరిచయం చేసేటప్పుడు, 'హి ఈజ్ మై ఫ్రెండ్' అంటాడు. ఈ మనిషి, సొంత జిల్లాలో గవర్నమెంటుజ్జోగం కాదని ఓ జాతీయ సంస్థలో చేరి వాళ్ళు చేసే ట్రాన్స్‌ఫర్ల వల్ల 'భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు' అని చిన్నప్పుడు వాసు దగ్గరే చదువుకున్న సాంఘిక శాస్త్రపాఠాల్లో నిజానిజాలు స్వయంగా తిరిగి తెలుసుకుంటున్నాడు. అలా ఇంతవరకూ, హిమాలయాల్లో చలినీ, రాజస్తాన్‌లో వేడినీ, చూసేడు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న, నాందేడ్‌లో ఉన్నాడు.

"ఈగలు తోలుకుంటున్నానురా." కిరణ్‌తో ఇలాంటి వెటకారపు మాటలు వాసుకలవాటే.

"అది నా వృత్తిలో భాగం. నువ్వు చెయ్యకూడదు" కిరణ్ చదివింది ఎంటమోలజీ. అందులో భాగంగా, హానిచేసే కీటకాలూ, మేలుచేసే కీటకాలూ, విషకీటకాలూ, వగైరాలు చర్చిస్తూ ఉంటాడు. తన వృత్తి అనుభవాలు వాసుతో చెబుతూ ఉంటాడు.

అలా ఓ పది నిమిషాలు మాటాడుకున్నాక, "నీకు హైదరాబాదులో ఇరానీ వాణ్ణెవళ్ళైనా తెలిసే అవకాశం ఉందా." వాసు కిరణ్‌ని అడిగాడు.

"ఒక మాంస ఎగుమతి పరిశ్రమలో ఇరాన్ వాళ్ళు, వాళ్ళ వెటర్నరీ డాక్టర్‌ని, ఒక ముల్లానీ ఉంచేరు. ఐదేళ్ళ క్రితం బిజినెస్ పనిమీద వాళ్ళ కంపెనీకి వెళ్ళినప్పుడు తెలిసింది. ఇప్పుడున్నారో లేరో? అడగాలి."

"ఇండియాలో ముల్లాలు, పశువుల డాక్టర్లూ దొరకరా? ఇరాన్నించెందుకు తెప్పించుకున్నట్టు?" వాసు డౌటు.

"జబ్బుపడ్డ పశువుల మాంసం పంపించేస్తారేమోనని, ఇరాన్‌లో మాంసం దిగుమతిదారుల భయం. అంచేత, వాళ్ళ పశువుల డాక్టర్ పాస్ చేసిన గేదెల మాంసాన్నే వాళ్ళు కొనుక్కుంటారు. అలాంటి మాంసానికి ప్రీమియం ఖరీదు ఇస్తారుట. ఇక్కడి ఫేక్టరీకొచ్చే పశువుల్లో నూటికి ఇరవయ్యే, వాళ్ళ వాళ్ళ డాక్టర్ పాస్ చేస్తాడు"

"మరి మిగిలిన పశువులని ఏం చేస్తారు?" వాసు సందేహం.

"వేరే గదిలో కోసి, మామూలు రేటుకి ఎగుమతి చేస్తారు. రైతు బజారు కూరలకీ, సూపర్ బజార్ కూరలకీ ఉన్న తేడాలాంటిదే, ఈ రెండు రకాల మాంసాలకి, ధరలోనూ, నాణ్యతలోనూ ఉంటుంది"



కౌముది

"ముల్లా ఏం చేస్తాడు."

"ప్రతీ జంతువునీ వాళ్ళ ఆచారం ప్రకారం, హలాల్ చేస్తున్నారో లేదో చూడ్డం, హలాల్ సమయంలో వల్లించాల్సిన మంత్రాల్లాంటి వాక్యాలు చదవటం వగైరాలు చేస్తాడు."

"ఎంటమోలజీ చదివిన నీకూ, గేదె మాంసానికీ, ఏమిటి సంబంధం?"

"వాళ్ళ ఫేక్టరీలో, సహజ పద్ధతుల్లో కీటక నియంత్రణకి, వెళ్ళేను. ఈగల మందులు స్ప్రే చేస్తే, అవశేషాలవల్ల అంతర్జాతీయ మార్కెట్లో మాంసం తిరస్కరించబడుతుంది."

"ఇప్పుడు వాళ్ళని కాంటాక్ట్ చెయ్యగలవా?" విషయం మొత్తం కిరణ్‌కి చెప్పేడు, వాసు.

"ఇప్పుడు కూడా వాళ్ళు హైదరాబాద్‌లోనే ఉంటే నేను ఈ-మెయిల్లో విషయం తెలియజెప్పి, సాయం చెయ్యగలడేమో అడుగుతాను. ఫోన్ లో అయితే వాళ్ళ ఇంగ్లీషు యాసా, మన యాసా కలవ్వు."

మూడ్రోజుల తర్వాత కిరణ్, ఆ డాక్టర్ వివరాలిచ్చి, "శుక్రవారం వాళ్ళకి సెలవు. ఇంటిదగ్గర కలవొచ్చు" చెప్పేడు.

తరువాత శుక్రవారం శ్రీకాంత్ సెలవు పెట్టుకుని అతన్ని కలవాలనీ, సెలవు మూలంగా తనకయ్యే ఒకరోజు జీతాన్ని, ఇందులోంచే రాబట్టాలనీ నిర్ణయించారు.

శుక్రవారం ఉదయం శ్రీకాంత్ ఫోన్ "నేను, కిరణ్ చెప్పిన ఇరానీ డాక్టర్ ఇంటినుండి మాట్లాడుతున్నాను."

వాసు ఆత్రుత హెచ్చింది. అంతకంటే టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు, ఆ రోజు కాలేజీలు ఎగ్గొట్టి వచ్చిన రాజులిద్దరూ.

"మనం ఎంతరావచ్చనుకున్నాం?" శ్రీకాంత్ అడిగాడు.

"లక్ష కదా?"

"అది దుబాయ్ దీనార్ విలువ. ఇది ఇరానీ రియాల్"

"టెన్షన్ తట్టుకోలేకపోతున్నాం. ఎంతో చెప్పు"

"ఐదు ఇస్తానంటున్నాడు, ఇరానీ డాక్టర్."

"ఐదు లక్షలే!" ఫోన్‌లో ఆశ్చర్యపోయి వెంటనేఫోన్ పెట్టేసి, కిరణ్‌కి ఫోన్ చేసి విషయం చెప్పేడు.

"నీ థేంక్స్ అక్కర్లేదు. నా కమీషన్ ఎంత?" కిరణ్ డిమాండ్ చేసాడు.

"నువ్వొచ్చినప్పుడు మంచి పార్టీ చేసుకుందాం." ఫోను పెట్టేసి వైజాగ్ తమ్ముడికి ఫోన్ చేసాడు, వాసు.

"ఒరేయ్ బుజ్జీ, కత్తిపూడి టేక్సీ, ఎయిర్ పోర్ట్ నుంచి కొరియరూ, అన్నింటికీ ఫలితం వచ్చిందిరా."

"లక్షా వచ్చేసిందా."

"ఐదు లక్షలు."

కొంచెం సేపు ఇద్దరూ సంబరపడ్డాకా, "రేపూ ఎల్లుండీ మాకు వీకెండ్ కదా అక్కడికి వస్తాన్లే." ఫోన్ పెట్టేశాడు, తమ్ముడు.

తనకి రెండు లక్షల పైన వస్తుందన్నందుకు సంతోషించాలో, తన అన్నయ్య మరిచిపోయిన డబ్బులోంచి, మాష్టారికి రెండు లక్షలివ్వాల్సి వస్తున్నందుకు ఏడవాలో పైడిరాజుకర్థం కావట్లేదు. మాష్టారు వాడి ముఖకవళికలు చదివే మూడ్‌లో లేరు. అందరి మూడ్సూ గమనిస్తున్నది సీతరాజొక్కడే తనే మాష్టారిచేత పదివేలిప్పించినందుకు ఇన్నాళ్ళుగా వాడు పడ్డ బాధంతా పోయింది. అదీకాక, తను బండి కొనుక్కుందుకి, వడ్డీలేని అప్పు వస్తోంది.

మళ్ళీ వాసు ఫోన్ మోగింది."హలో"

"అంత తక్కువ ఫోన్ పెట్టెయ్యాలా?" శ్రీకాంత్.

"కిరణ్‌కి థేంక్స్ చెప్పి, బుజ్జిగాడికి విషయం చెప్పేను."

"ఏమన్నారు?"

"లక్ష అనుకున్నది ఐదు లక్షలనగానే అందరూ ఎగ్జైట్ అయ్యేరు."

"అంత తొందర పడకు. ఈ ఇరాన్ డాక్టరుకి ఏడు శాతం టేక్స్ పడుతుందట. అది కోసుకుని చెక్కు ఇస్తాట్ట."

"పోనీ అలాగే కానీ. ముప్పై ఐదు వేల టేక్సే కదా?"

"కానీ వీడిచ్చే ఇంటర్నేషనల్ చెక్కులో ఎమౌంట్ చూసి బేంక్ వాళ్ళు మార్చలేకపోవచ్చు."

"అదేంట్రా. కోట్ల రూపాయల చెక్కులు మారుతున్నాయి."

"నీ ముందు కంప్యూటర్ ఆన్‌లో ఉందా?" శ్రీకాంత్.

"ఉంది. నెట్ కూడా కనెక్ట్ అయ్యే ఉంది ."

"ఇండో ఇరానియన్ ఫారెన్ ఎక్సేంజ్ రేటు గురించి, నేను వెబ్ సైట్ చెబుతాను. అది చూడు."

ఫోన్ డిస్కనెక్ట్ చెయ్యకుండా స్పీకర్ మోడ్‌లో పెట్టి శ్రీకాంత్ చెప్పిన వెబ్ సైట్ ఓపెన్ చేసారు. పక్కనున్న సీతరాజు, హోమ్ పేజ్‌లోని ముందు కనిపించిన వాక్యాల్ని చదివేడు.

"ఈచ్ రుపీ ఈజ్ ఈక్వల్ టు టూ హండ్రెడ్ రియాల్స్. రూపాయికి రెండొందల రియాల్సండీ, మేస్టేరూ"

వాసు తుళ్ళిపడి స్వయంగా కంప్యూటర్ స్క్రీన్ చూసాడు. సీతరాజు చదివింది నిజమే.

"అంటే అది యాభై రూపాయలనోటా?" మాష్టారు అరిచేరు.

"ఐదు లక్షలు కాదు, పదులు అని చెప్పనీకుండా ఫోన్ పెట్టేసావ్. అందులో మూడున్నర టేక్స్ పోనీ, వీడిచ్చే నలభయారున్నర రూపాయల చెక్కు, ఏ బేంక్‌లో వెయ్యమంటావ్?" స్పీకర్ ఫోన్‌లో శ్రీకాంత్ గొంతు.

"పైడిరాజుగాణ్ణడుగుతాను." ఒక చేత్తో రూళ్ళకర్ర అందుకుంటూ, అటూ, ఇటు చూసి, "ఏడిరా వీడు?" అడిగేడు.

"పారిపోయాడండీ. నేను ఈడుచుకొత్తానుండండి." సీతరాజు లేచాడు.

●●●

# మరో మర్యాదరామన్న

విజయ కర్రా

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**ఆమె అతని జీవితంలోకి మెరుపులా వచ్చింది.** ఏం జరుగుతోందో తెలిసీ, తెలియక, తెలేసే లోపల అతని అర్ధాంగి అయ్యింది.

ఆ రోజు నాన్నమ్మ స్నేహితురాలి మనవడి పెళ్ళి. దగ్గరుండి ఆవిడని పెళ్ళికి తీసుకు వచ్చిన రాంబాబు పెద్దవాళ్ళు ఇద్దరూ కూర్చుని భోంచెయ్యడానికి వీలుగా టేబులు, రెండు కుర్చీలూ వేసాడు. ఆవిడకి, ఆవిడ స్నేహితురాలికి కావలసినవన్నీ రెండు ప్లేట్లలో వడ్డించుకొని వస్తున్నప్పుడు... మెరుపులా వచ్చి ఓ ప్లేట్ అందుకుంది ఆమె. మంచి నీళ్ళు తెస్తానంటూ వెళ్ళాకా "ఎవరీ అమ్మాయి?" అని రాంబాబు మనసులో అనుకున్న ప్రశ్నే నాన్నమ్మ అడిగేసింది.

"నా మనవరాలు, పెళ్ళి కొడుకు బాబయ్య కూతురు, నీకు తెలుసుగా నా కొడుకు లిద్దరూ ఒకే ఇంట్లో వుంటారు, పిల్లలందరూ కలిసి పెరిగారు" ఆవిడ చెప్పుకు పోతోంది.

నీళ్ళ పాత్ర తీసుకుని నవ్వుతూ నడచి వస్తున్నా ఆమె అతనికి అమృతం తెస్తున్న దేవతలా కనిపించింది. వాళ్ళతో కబుర్లు చెపుతూ, నవ్వుతూ, మధ్య మధ్యలో చనువుగా అతనికి "నెయ్యి తీసుకు రండి, ఆ చేత్తోనే రెండు బూరెలు " అంటూ పురమాయిస్తూ - అలా అల్లుకున్న ఆమె తాలుకు ఆలోచనలతో అతను ఇంటికి తిరిగి వచ్చాడు.

ఓ వారం తిరక్కుండానే "మొన్న మనం చూసిన అమ్మాయిని, అదే వరలక్ష్మిని నీకు చెప్పొచ్చారుగా. నీకిష్టమేనా?" అని నాన్నమ్మ అడుగుతుంటే అతడు మొదట తెల్లబోయి, ఆ తరువాత ఆశ్చర్యపోయి, ఆ తరువాత ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. కళ్ళ మెరుపే సమాధానం అయి, తల వూపే అతని అంగీకారమయింది.

అలంకరించిన పట్టె మంచం పయిన తన పక్కనే కూర్చున్న ఈ ముద్దు గుమ్మ తనదేనా, అనుకుంటే అతనికి ఇంకా ఆశ్చర్యం గానే వుంది. వాళ్ళ నాన్నమ్మ చెపితే తనను పెళ్ళి చేసుకోవడానికి వప్పుకుందా అనుకుని అదే అడుగుతే, కిల కిలా నవ్వింది. అమ్మ తరపు అమెరికా అబ్బాయి, అన్న మెచ్చిన స్నేహితుడు స్టైల్‌గా, డ్రెస్సులు నలగకుండా ఫోజులు కొడుతూ వుంటే ఏ బేషజాలు లేకుండా, "ఎంతో అభిమానంగా పెద్దవాళ్ళ సేవలో మునిగి పోయిన ఈ అబ్బాయే నాకు నచ్చాడు" అంటూ చెపితే - వరాలిచ్చే దేవతలు ఇలాగే వుంటారు కామోసు అనుకుని 'మౌనమే వరమై, వరమే తనదై' అతనామెని దగ్గరికి తీసుకున్నాడు.

●●●

"ఏంటి రాంబాబు, నువ్వసలు వాడన్ని వెటకారం మాటలు అంటుంటే అసలెలా వూరుకున్నావ్? " కోపంలో వరలక్ష్మి మొహం ఎర్ర మందారంలా వుంది.

ఎవరి పెళ్ళిలో మొదట వాళ్ళు కలుసుకున్నారో ఆ అక్కిరాజు, వరలక్ష్మి పెద్దనాన్న కొడుకు, ఆ రోజు వాళ్ళిద్దరిని డిన్నర్‌కి పిలిచాడు.

"అసలు వాడెవడు? నీ ఉద్యోగాన్ని, నీ జీతాన్ని హేళన చెయ్యడానికి, కుళ్ళు మొహంగాడు. అయినా వాడి ఫ్రెండ్‌ని నేను వద్దన్నానని కోపం. ఫ్రెండ్‌తో కలిసి బిజినెస్ చేద్దామనుకున్నాడులే" లేచి రాంబాబుకి దగ్గరగా వచ్చింది. "అది కాకుండా వాడు మందు కొడితే మనిషి కాదు. ఏం మాట్లాడుతాడో వాడికే తెలియదు."

"అదీ, నువ్వే చెపుతున్నావు కదా అతని కారణాలు అతనికి వున్నాయి పాపం, అందుకే అలా మాట్లాడి వుంటాడు."

"అవి మాటలా, ఇన్సల్ట్ చెయ్యడం రాంబాబు, అయినా నువ్వో పెద్ద మొద్దబ్బాయివి" అంటూ అతని బుగ్గలు గట్టిగా పిండేసి "చూస్తూ వుండు ఆరు నెలలలో నిన్ను మార్చాకపోతే" వరలక్ష్మి గొంతులో ఉక్రోషం.

కందిన చెంపలని రాసుకుంటూ నవ్వాడు రాంబాబు.

"ఏంటి, నవ్వుతావు ఆరు నెలలు సరిపోవా, సరే ఆరు సంవత్సరాలు అనుకుందాం, ఈ ముద్దపప్పు అవతారానికి ఆ మాత్రం టైం పడుతుందిలే. నేర్చుకోరా బుజ్జికొండ" అంటూ వొళ్ళో వాలిపోతున్న ఆమెతో అన్నాడతడు "మా నాన్నమ్మ కూడా నన్నెప్పుడు ఇన్ని పేర్లు పెట్టి పిలవలేదు."

●●●

ఆరేళ్ళ ప్రణాళిక నుండి అరవయి వసంతాలకి సరిపడా బంగారు కలలు సృష్టించిన వరలక్ష్మి అతనితో పట్టుమని ఆరు నెలలు కూడా కలిసి గడపలేదు. ఓ నాలుగు నెలలు తనవాళ్ళతో కలిసి వున్నాక, ఓ చిన్న పోర్షన్ రెంట్‌కి తీసుకుని, మంచి రోజు చూసుకుని ఆ ఇంట్లో చేరారు వాళ్ళిద్దరు.

హాల్ నిండా సర్దుకోవలసిన సామాను, పక్క బట్టలు, కొత్త కర్టెన్స్, ఆ పక్కనే దేవుడికి దీపం పెట్టి, పాలు పొంగించి "నేను వచ్చే వరకు ఏమి ముట్టుకోకు, ఇద్దరం కలిసి సర్దుకుందాం" అన్న భర్తకి నవ్వుతూ వీడ్కోలు చెప్పింది ఆమె. అదే ఆమె ఆఖరి వీడ్కోలు అయ్యింది. ఆఫీసుకి వెళ్ళిన రెండు గంటలలోనే వార్త అంది తిరిగి వస్తే, అప్పటికే మంటల్లో మసిబారి పోయి, అతనికి అందనంత దూరాలకి వెళ్ళిపోయింది.

ఓదార్పులకి లొంగని బాధ, జ్ఞాపకాలని కడగలేని కన్నీళ్ళు.. తెలిసీ తెలియని జనం ఆఫీసులోను, బయట రకరకాల అనుమానాలు వ్యక్త పరుస్తూ ముందూ, వెనుకా మాట్లాడుతుంటే, ప్రచారాలు చేస్తుంటే తేరుకోవడానికి చాల ఏళ్ళు పట్టింది అతనికి. మళ్ళీ పెళ్ళికి ఒప్పించాడానికి అయిదేళ్ళు పట్టింది అతని వాళ్ళకి. కాలం ముందుకి కదిలి పదిహేడేళ్ళ వాడయ్యాడు రాంబాబు కొడుకు.

●●●

'మానిన గాయాన్ని కెలకడం' అన్న సామెతలోని తీవ్రత అనుభవంలోకి వస్తేనే తెలుస్తుంది.

ఎప్పుడో జాబులో చేరిన కొత్తలో పరిచయం పరమేశంతో రాంబాబుకి. చాల ఆప్పుడిలా పలకరించాడు. ఇప్పుడు మళ్ళీ మెయిన్ బ్రాంచ్‌కి ట్రాన్సఫర్ అయి వచ్చాడు, పని చేసేది ఒకే బిల్డింగ్ కాకపోయిన ఇక్కడా, అక్కడా, అప్పుడప్పుడు కలవడం.

ఓ రోజు కలిసి రాంబాబుని కాఫీకి రమ్మని ఆహ్వానించాడు. అక్కిరాజు తనకి చిన్నప్పటి స్నేహితుడని, అతని ద్వారా తనకి ఈ మధ్యే అన్ని సంగతులు తెలిసాయని చెప్పాడు.

"ఇంత చిన్నప్పటినుండి తెలుసు నాకు వరం, ఎంత చురుగ్గా వుండేదనుకున్నావు, అసలా తెలివి తేటలు అది, ఏ కలెక్టర్ భార్యో అవుతుందనుకునే వాళ్ళం. అసలేమిటో దాని రాత" అంటూ నిట్టూర్చాడు.

"మీరు ఇక్కడికి వచ్చే ముందు ఎక్కడ వర్క్ చేసారు సార్?" మాట మార్చడానికి ప్రయత్నించాడు రాంబాబు.

ఎదుటి మనిషి మనసుతో కాని, మాటతో కాని లెక్క లేదు పరమేశానికి. తన స్నేహితుడు కల్పించిన కథలకి, కబుర్లకి మరిన్నీ రంగులు అద్ది మాటల బాణాలు వదలడమే అతని ధ్యేయం ఇప్పుడు.

"అప్పుడప్పుడు సాయంత్రాలు కలుస్తుంటాను అక్కిరాజుని, ఓ పెగ్గేసుకుని కూర్చుంటాము. వాడు ఇప్పటికీ మరచి పోలేదనుకో వరాన్ని, చిన్నప్పటి ఫోటోలో చూపించి ఎంత ఏడ్పించాడనుకున్నావ్. మహారాణి యోగం ఇప్పిస్తానంటే కాదని వెళ్ళి పోయిందని ఒకటే రాగాలు."

'మందు మత్తులో ఇంకేం చెప్పుంటాడో' గొనుకున్నాడు రాంబాబు. వరలక్ష్మి పోయిన తరువాత బాగా తాగి, ఇంచు మించు ప్రతి రోజు అతడు తన ఇంటికి రావడం, "నువ్వే చంపావు దాన్ని, నిన్ను జైలుకి పంపించకపోతే చూడు" అంటూ బెదిరించడం నిన్నా, మొన్నా జరిగినంత పచ్చిగా గుర్తుకొచ్చాయి అతనికి. మనసు పిండినట్లయింది.

"అయినా నువ్వింట్లో ఉన్నప్పుడే, అలా ఎలా చూడకుండా అంత ఘోరం ఎలా జరిగి పోయిందోయ్?"

ఎవరో తనని బలంగా విసిరి గోడకేసి కొట్టినట్లయింది రాంబాబుకి. లేచి వెళ్తున్న పరమేశం మోహంలో శాడిజం తాలుకు మెరుపు.

●●●

మరోసారి ప్రింటర్ రూంలో కనిపించాడు పరమేశం. దారి కాచి మరీ మాట్లాడాడు. "అన్నట్లు నీకు తెలుసో లేదో, అక్కి రెండో అబ్బాయి కూడా అమెరికాకి వెళ్ళిపోతున్నాడు. వీడికే పాపం కాళ్ళకేదో ప్రాబ్లం. మెట్లు అవి ఎక్కలేడు. లేకపోతే వరలక్ష్మి పుట్టిన రోజున గుడికి వెళ్ళి దాని ఆత్మశాంతికి పూజ చేయించకుండా వుంటానా అని తెగ బాధ పడ్డాడనుకో".

"ఎన్నో ఏళ్ళయిపోయింది సార్, ఇప్పుడు మా మధ్య ఎలాంటి పరిచయాలు లేవు. ఇప్పుడా సంగతులెందుకండి" బేలగా పలికింది రాంబాబు గొంతు.

"నీకలాగే వుంటుంది లేవోయ్, ఎంతయినా వాళ్ళిద్దరూ సొంత అన్నాచెల్లెళ్ళకన్నా ఎక్కువగా పెరిగారు. అయినా వాడి బాధ నీకెలా అర్థం అవుతుంది" పరమేశం నోరు మాట్లాడుతోంది, నొసలు వెక్కిరిస్తోంది.

పచ్చి పుండయిన మనసుతో ఇంటికొచ్చాడు రాంబాబు. ఆ రోజు అన్నగారింట్లో డిన్నర్. భార్య పిల్లలని ముందు వెళ్ళమన్నాడు. షవర్ తిప్పి నించున్నాడు. తలపయినుండి జారుతున్న నీళ్ళతో కన్నీళ్ళు కలిసి పోతున్నాయి. శబ్దం రాకుండా ఏడ్చే ప్రయత్నంలో అతని భుజాలు కదిలి పోతున్నాయి. చాలా ఏళ్ళ తరువాత మూసుకున్న కళ్ళ ముందు వరలక్ష్మి మొహం, ఎర్ర మందారంలా "ఏంటి రాంబాబు ఎప్పుడు నేర్చుకుంటావు?" అడుగుతోంది కోపంగా.

●●●

కాఫీ తాగి లేవబోతున్న రాంబాబు వంకర నవ్వుతో అప్పటికే తన ముందు కూర్చుంటున్న పరమేశాన్ని చూసి ఉలిక్కి పడ్డాడు. "అన్నట్లు మంచి న్యూసోయ్, అక్కిరాజు అమెరికాకి వెళ్తున్నాడు. వాళ్ళ అబ్బాయి ఎప్పటినుండో రమ్మని అడుగుతున్నాడనుకో. వెళ్తే కాస్త మార్పుగా వుండి, మనసు కుదుట పడుతుంది కూడాను. ఏమంటావ్?"

"నేనేమంటాను సార్, ఎన్ని సార్లు చెప్పినా, మీరు పదే పదే అతడి విషయాలే నాతో ఎందుకు చెపుతున్నారో అర్థం కాక కొట్టుకుంటున్నాను. మరో సారి మీకు చెప్పేదేమిటంటే, వరలక్ష్మి నా మనసులో ఎప్పుడూ సజీవంగానే వుంది. కాని అన్నీ తెలుసుండి నన్ను అనుమానించి, అవమానించేవాడే, ఎవరూ? మీ స్నేహితుడు, వాడు నా దృష్టిలో ఎప్పుడో చచ్చిపోయాడు. ఇకపయిన వాడి విషయాలు నా దగ్గర మాట్లాడితే ఏ మాత్రం మర్యాదగా వుండదు."

గట్టిగా, ఆవేశంగా మాట్లాడుతున్న రాంబాబు గొంతు విని అప్పటికే క్యాంటీన్‌లో చాలా తలలు వాళ్ళ కేసి తిరిగాయి. గతుక్కుమన్న పరమేశం అటూ, ఇటూ ఇబ్బందిగా చూస్తూ అన్నాడు "అహా, అదేంటోయ్ అలా అంటావ్, ఇద్దరికీ తెలిసిన వాడిని, మీ శ్రేయోభిలాషిని "

"నా శ్రేయోభిలాషి" గట్టిగా నవ్వాడు రాంబాబు. "సరేలెండి మీతో నాకు మాటలెందుకు కాని" అంటూ విసురుగా లేచి వెళ్ళిపోయాడు.

అన్నగారి కూతురి పెళ్ళి, ఆ తరువాత కొడుకుని ఇంజనీరింగ్‌లో చేర్పించడానికి చెన్నయ్ వెళ్ళి రావడం, ఓ ఇరవయి రోజుల తరువాత ఆఫీస్‌కి వచ్చాడు రాంబాబు. లిఫ్ట్ కోసం ఎదురు చూస్తూ కనిపించాడు పరమేశం.

'సిగ్గులేని మొహానికి నవ్వే సింగారం'. నవ్వుతూ "ఏంటోయ్, ఏంటి సంగతులు? బొత్తిగా కనపడటం లేదు?" అడుగుతున్న పరమేశం కేసి రెండు క్షణాలు ఎవరో కొత్త మనిషిని చూసినట్లు చూసి తన వెనుక ఎవరినయిన పలకరిస్తున్నాడేమో అన్నట్లు ఓ సారి వెనక్కి తిరిగి చూసి మెట్లకేసి నడిచాడు రాంబాబు.

●●●

## మంచాన పడితే పడ్డాను — డి.ఆర్.రావు

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**రోజూ లాగే రాత్రి పదిన్నరకి** నాకు చాలా ఇష్టమైన డిస్కవరీ ఛానెల్ చూస్తున్నాను. మృగరాజు తన సింహభాగాన్ని రాజసంతో కైవసం చేసుకున్నాకే మిగిలిన చిల్లర జంతువులు ఆహారాన్ని పంచుకునే అటవీ ప్రొటొకాల్ లాగే, మా ఇంటి ఆడమహారాజు టీవి రిమోట్‌ని కైవసం చేసుకుని పదింటిదాకా నానా చెత్త తెలుగు సినిమాలు చూస్తూ నిద్రలోకి జారుకున్నాకే, నేను మెల్లిగా ఆ రిమోట్‌ని కైవసం చేసుకుని డిస్కవరీ పెట్టుకుంటాను. సబ్జెక్ట్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది.

జూలియస్ సీజర్ కాలం నాటి రోమన్ మహా సామ్రాజ్యం తన శత్రువుల్నీ, తమ క్రూర పరిపాలనని విమర్శించేవారినీ, కుట్రదారుల్నీ, తిరగబడే బానిసల్నీ ఊహించనలవిగాని చిత్రవధలు చేసేందుకు, వారినుండి నిజాలను రాబట్టేందుకు, దారుణ శిక్షలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అణచివేసేందుకు పాలకుల ఆదేశానుసారం నాటి శాస్త్రజ్ఞులు, మేధావులూ భయంకరమైన హింసా పరికరాల్నీ, యంత్రాలనీ కనిపెట్టారు. శిక్షలకు గురైన నిందితులపై ఆయంత్రాలెలా పనిచేస్తాయో ఆధునిక శాస్త్రావగాహనతో వివరిస్తున్న కార్యక్రమం అది. విచిత్రంగా నేడు నిత్యజీవితంలో ఇళ్ళల్లో మనం ఉపయోగిస్తున్న అనేక సౌకర్యవంతమైన అనేక వస్తువులు, పనిముట్లు ఆనాటి చిత్రహింసా పరికరాలను మరింత మెరుగుపెట్టి అభివృద్ధి చేసినవే, వాటికొనసాగింపే అని వివరిస్తూంటే నిర్ఘాంతపోయి చూస్తున్నాను. నేడు వంటింటో వేడిపాలగిన్నె దించడానికి ఉపయోగిస్తున్న పటకారు మొదట ఆనాడు నిందితుల శరీరపు కండలను వెలికి దీయడానికి కనిపెట్టిందే అంటే ఒళ్ళు జలదరించదా? ఈ చిత్ర వధల పరికరాల్ని కనిపెట్టడంలో వాటి రోమన్, చైనా సామ్రాజ్యాలతో

పాటు - మునులు, రుషులు, వేదాలు, ఉపనిషత్తులు, ఆధ్యాత్మికతా అని ఊదరగొట్టే ప్రాచీన భారత దేశం కూడా ఏమీ తీసిపోలేదని చాణిక్యుని కాలం నాటి చిత్రహింసా పరికరాల మోడళ్ళని చూపిస్తోంటే నోరెళ్ళబెట్టాను.

ఆ పరికరాలకి నేరస్తుల్ని కట్టేసి ఎముకల్ని నుజ్జు నుజ్జు చెయ్యడం, ఇనుప మేకుల్తో గుచ్చడం, చాకులు, బాకులు కత్తుల్తో కండల్ని చిప్స్ తరిగినట్టు తరిగెయ్యడం, సజీవంగా దగ్ధం చేయడం - చూసే వాళ్ళకే భయంతో ప్రాణాలు ఎగిరిపోతాయ్. ఇదంతా చూస్తూంటే ఏ కాలంలో ఐనా మానవ సంక్షేమం కన్నా మానవ సంహారం వైపే మనిషి మేధస్సు చురుగ్గా పనిచేస్తుంది కాబోలు అనిపించింది. నేటికీ ప్రపంచమంతటి అన్ని దేశాల్లోనూ న్యాయం కోసం, సమానత్వం కోసం, మానవత్వం కోసం పోరాడేవాళ్ళని పాలకులు జైళ్ళల్లో, పోలీస్ స్టేషన్లలో, రహస్యస్థావరాలలో బంధించి నిరంతరం మానవనాశనాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని వ్యాఖ్యాత చెపుతూండగానే ఫోన్ మోగింది. పదకొండవుతూంటే ఈ సమయంలో ఫోనేవిటబ్బా అనుకుంటూనే ఫోన్ తీసాను. అర్చన కంఠం.

"అంకుల్ ఈ సమయంలో ఫోన్ చేసానని ఏమనుకోకండి. మీరు పన్నెండు వరకూ పడుకోరని మాకు తెలుసు. అంతా కులాసాయేనా అంటే ఏం చెప్పాలో తోచడం లేదు. డాడీ ప్రస్తుతం హాస్పిటల్‌లో బెడ్ మీదున్నారు. మూడురోజుల క్రితం ఈవెనింగ్ వాకింగ్‌కి వెళ్ళి వస్తూండగా ఏక్సిడెంటై తుంటికి బాగా దెబ్బ తగిలింది. సర్జరీ చేసి మెటల్ బాల్ అమర్చారు. కుడి ముంజేతికి కూడా దెబ్బ తగిలింది. మెంటల్‌గా అప్‌సెట్ అయ్యారు. డాడీ మనస్తత్వం మీకు తెలుసుగా అంకుల్. ఎవరి మీదా ఆధారపడకూడదనుకుంటారు. ఎవరి చేతా సేవచేయించుకోడానికి అస్సలు ఇష్టపడరు. ఆత్మాభిమానం ఎక్కువ. ఇప్పుడు తప్పనిసరై సేవ చేయించుకోడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇందాకే నిద్రలోకి జారుకున్నారు. తన సంగతి ఎవరికీ చెప్పొద్దన్నారు - మీకు కూడా. ఇబ్బంది పడి వస్తారని. తనవల్ల ఎవరికీ ఇబ్బంది కలగకూడదనుకుంటారు. డాడీకి మీరొక్కరే ఆత్మీయులైన స్నేహితులు కదా. అందుకే ఆయన ఒద్దన్నా ఆయనకి తెలియకుండా మీకు చేస్తున్నాను. అహ! మీరు పనిగట్టుకు రావద్దు. రేపు ఏదో సమయంలో మీరోసారి డాడీకి ఫోన్ చేయండి. మీ పలకరింపులో ఆయన రిలాక్సవుతారు. తమ్ముడి సెల్ డాడీ దగ్గరే ఉంది. ఆ నెంబర్‌కే చేయండి. అంతే, మీరూ కులసా కదా ఉంటాను అంకుల్."

నా దృష్టీ, ఆలోచనా టీవీ మీదనుండి చెదిరిపోయింది. నాకు చాలామంది మిత్రులున్నా, రఘురామ్‌కి మాత్రం నేనొక్కణ్ణే మిత్రుడ్ని. జీవితంలో చాలా ఇబ్బందులు అనుభవించి, పిల్లల బాధ్యతలు, బరువులు వదిలి, రిటైరై ఇపుడే కాస్త ప్రశాంతంగా ఉన్నాడనుకుంటే ఇప్పుడీ ఏక్సిడెంటా? మానవజీవితాన్ని ఏదో అదృశ్య శక్తి నడిపిస్తోందని చాలామంది భావిస్తారు. అదే నిజమైతే గుడ్డిదీ, వివేకం లేనిదీ అని నేనంటే మీరు కోపం తెచ్చుకోవచ్చుగాక. నేను మాత్రం నా మాటమీదే నిలబడతాను.

రఘురామ్‌దీ నాదీ ఒకే పల్లెటూరు. చిన్నప్పటినుంచీ ఒకరికొకరు తెలుసు. కానీ రఘురామ్ నాకన్నా నాలుగైదేళ్ళు పెద్దవాడవటం వల్లా, నాక్లాసు మేటేమీ కాకపోవడం వల్లా ఎపుడూ మాట్లాడుకుని ఎరగం. నేను ఏడో తరగతిలోకి వచ్చేసరికే అతను స్కూల్ ఫైనల్ విద్యార్థి. పరస్పరం తెలిసున్న కుటుంబాలు కావడం వల్ల ఎపుడైనా తటస్థపడితే రఘురామ్ పలకరింపుగా చిరునవ్వు నవ్వేవాడు. నేనూ అంతే. రఘురామ్ ఎంతో ప్రతిభావంతుడైన విద్యార్థే అయినా, తండ్రి చేసిన నిర్వాకం వల్ల పై చదువులకి నోచుకోక గవర్నమెంటు గుమస్తాగా చేరిపోయాడు. నా పరిస్థితీ అటువంటిదే అయినా ఆత్మాభిమానం చంపుకుని పరుల దయాధర్మం మీద ఆధారపడి నానా తిప్పలూ పడి డిగ్రీ అయిందనిపించాను. కూడా రావొద్దంటే ఎత్తుకోమని ఏడ్చినట్టు, డిగ్రీ చెయ్యడానికే గతిలేనివాడిని పిజీ డిగ్రీ చేస్తాననడం లోకం పిచ్చితనంగా భావిస్తుందని గ్రహించి విజయనగరం పోలీస్ బెటాలియన్ ఆఫీసులో టైపిస్టుగా చేరిపోయా - అదికూడా పిల్లతో బాటు ఆ ఉద్యోగం ఇప్పించిన మామగారి ధర్మమా అని.

రఘురామ్ కూడా అప్పుడు అదే ఊళ్ళో పనిచేస్తూండటం వల్ల ఓ రోజు కాకతాళీయంగా అతన్ని చూసి అతని ఆఫీస్‌కి వెళ్ళి కలుసుకున్నాను. అదే నేను మొదటిసారిగా రఘురామ్‌తో మాట్లాడటం. మాఊరి వాడు అనే ప్రేమ కాబోలు. నేను నా అర్ధాంగినింకా కాపురానికి తీసుకు రాలేదు. కొత్త కాపురానికి మకాం కోసం వెదుకుతున్నాను. నాకు లౌక్యం తెలీదు. ఎవరితో ఎలా మాట్లాడి పని జరుపుకోవాలో అసలు తెలియదు. ఆ సమయంలోనే రఘురాం తటస్థపడటం, నన్ను చూసి సంతోషించి చాలా ఆప్యాయంగా ఒక పెద్దన్నలా ఇంటికి తీసుకెళ్ళాడు.

దాసన్న పేటలోని ఆ ఇల్లు - పంచతంత్రం కథలో చిరు జంతువులూ, నానాజాతి పక్షులూ సహజీవనం చేసే పెద్ద బూరుగు వృక్షంలాటి, పాడుపడిన పెద్ద సత్రం లాటి పెంకుల్లేని పెద్ద పెంకుటిల్లు. దాన్ని ఇల్లు అనడానికి మనసొప్పకపోయినా మనుషుల్లా కనిపించే ఐదారు కుటుంబాలు కాపురం ఉంటున్నాయి కాబట్టి ఇల్లులాటిది అనక తప్పదు. తన గుమస్తాలకి ఏలినవారిచ్చే జీతాలకి అంతకన్నా, చిన్నపాటి కనీస సౌకర్యాలతో కాస్త మానవీయంగా ఉండే నివాసాలు లభ్యంకావనే కఠోర వాస్తవం కాపురం పెట్టకుండానే నాకు అర్థమైపోయింది. పాడుబడ్డ ఆ గబ్బిలాల కొంపలోనే రెండు గదులనబడే గాలి వెలుతురూ ఏ కోశానా చొరబడని, ముతక కంపుకొట్టే, పెచ్చులూ, పెంకులూ, దుమ్మూ తెగరాలే ఇరుకులో రఘురామ్ తల్లీ, భార్యా, ముచ్చటైన ముద్దమందారాల్లాటి ఇద్దరు కూతుళ్ళూ, ఇంకా పాకుతున్న కొడుకూ. విధి చూసిన చిన్న చూపుతో అకాల వైధవ్యం పొంది చిన్న కొడుకుతో తండ్రిలాంటి అన్న పంచన చేరిన చెల్లెలుతో మొత్తం ఎనమండుగురు, ఒక్కడి జీతంపై బతుకుతూ ఆ చీకటి గుయ్యారంలో గబ్బిలాలతో సహవాసం చేస్తున్నారు. ఆ పక్కనే ఖాళీగా ఉన్న ఒకటింపావు గదిలాటిది నా కొత్తకాపురానికి అద్దెకిచ్చేలా రఘురామ్ ఆ ఇంటి యజమానిని ఒప్పించాడు. వెంటనే నేను నా పెట్టి, సైకిల్తో కొత్తింట్లో చేరిపోయి రాబోతున్న నా తల్లీ, అర్ధాంగి కోసం వెల్‌కమ్ బోర్డ్ రాసి గుమ్మానికి కట్టేసాను.

ఆ ఇంటికి బాత్రూమ్ లాటివేమీ లేవు. మండువా మధ్యలో ఉన్న కప్పీతో నీళ్ళుతోడుకునే ఇక్ష్వాకుల నాటి పురాతన బావి దగ్గరే అందరి బహిరంగ స్నానాలూను. కైలాసంలో కూడా బాత్రూమ్ లేకే కాబోలు, ఆ జగన్మాత పార్వతీదేవి పులిచర్మం గావంచతో తిరిగే మొగుడ్ని అడిగినా కట్టించడని తెలిసే స్నానమాడేవేళ నలుగుపిండి వినాయకుడ్ని గుమ్మం దగ్గర కాపలా పెట్టినట్టు - కైలాసానికెక్కువా, వైకుంఠానికి తక్కువా అన్నట్టుండే మా ఆనంద నిలయంలో కూడా అరడజను కుటుంబాల ఆడవాళ్ళు పరాచికాలాడుతూ స్నానమాడే కోలాహలపు వేళ మగమహారాజులు అటువైపు రాకుండా, రాకండి రాకండని అరుస్తూ పదేళ్ళ పిల్ల కర్రపుల్లతో కాపలా. నాకు బహిరంగ స్నానం అలవాటు లేదు. నడిబజారులో నగ్నంగా నుంచున్నట్టు వారందరి ఎదుటా అంగవస్త్రం చుట్టుకుని స్నానం చెయ్యడానికి సిగ్గుతో చిమిడిపోయి, ఇలాకాదనుకుని, బకెట్‌తో నీళ్ళు నా మూడడుగుల వంటింట్లోకి మోసుకుపోయి, యుద్ధ రంగంలోంచి పారిపోయి వచ్చిన ఖడ్గతిక్కనలాగ వంటింటి తూము దగ్గరే దబదబ నాలుగు చెంబులు గుమ్మరించుకుని స్నానం అయిందనిపించేవాడిని. అంతమందికీ కలిపి ఒకటే మలం ఎత్తిపోసే పాతకాలపు పాయిఖానా. దాని తలుపుకున్న గడియ విరిగిపోయింది. దాన్నెవరూ బాగుచేయించరు. అంచేత తలుపునో చేత్తో గట్టిగా నొక్కిపట్టుకుని ఎవరూ దభాలున తోసుకురాకుండా గట్టిగా దగ్గుతూ ఆపని కానివ్వాలి. ఆ ఇంట్లో ఓ రోజు జీవితం గడిపిన వాడు ఏ నరకాన్నయినా నవ్వుతూ భరించేయగలడని చెప్పేయచ్చు.

ఎపుడొస్తుందా ఎపుడొస్తుందా అని ఎదురు చూసిన ప్రభుత్వోద్యోగం వచ్చినా, జీవితం గోచీకి పెద్దదీ, పంచెకి చిన్నదీ అని మూడు నెలల సర్వీసుకే అర్థమైపోయింది. దరిద్రం కొత్తకాకపోయినా, ఈ దరిద్రం హిమాలయాల్లాగే శాశ్వతం అని అర్థమైపోయి, రోజూ చచ్చేవాడికి ఏడ్చేవాడెవడన్నట్టు దరిద్రాన్ని చీదరించుకుంటూ దరిద్రంగా బతకడం కన్నా, ఉన్నంతలోనే జీవితాన్ని చిన్న చిన్న ఆనందాలతో ఓ పూమాల చేసుకోవడం బెటరనిపించింది. అటువంటి ఆనందాల్లో రఘురామ్‌తో స్నేహం ఒకటి, ఎంతో ఆత్మీయంగా నన్ను అక్కున చేర్చుకున్న రఘురామ్ తన తండ్రి ఆస్థికి బదులు అప్పులు అప్పగించిపోయిన ఫలితంగా వాటిని తీర్చడంకోసం నానా ఇబ్బందులు

పడుతున్నాడని కొన్నాళ్ళవరకూ నాకు తెలియదు. రఘురామ్ తన ఇబ్బందుల్ని ఎవరికీ తెలియనివ్వడని అర్థమైంది. ఇంట్లో అందరూ ఒక్కపూట మాత్రమే భోజనం చేసి, రాత్రుళ్ళు కూరా నారా అవసరంలేని ఏ ఉప్పిడి పిండితోనో, నూకల గంజితోనో గుట్టుగా కాలక్షేపం చేస్తున్నారనే విషయం నన్ను కుదిపేసింది. అటువంటి పరిస్థితుల్లో కూడా ఆదివారాలు, పండగరోజుల్లో నన్ను పిలిచి చక్కగా భోజనం పెట్టేవారు. నేనెంత మొహమాటస్థుడనైనా వారి ఆత్మీయతకి తలొగ్గక తప్పేదికాదు. తల్లిదండ్రుల రుణం లాగే మిత్ర రుణం కూడా తీర్చలేనిదే అని నాకు అర్థమైంది. రఘురాంకి కొలీగ్స్ తప్ప స్నేహితులంటూ ఎవరూ లేరు నేను తప్ప - ఈనాటికీ.

రఘురామ్ తన వైష్ణవ మత సంప్రదాయాన్నీ, ప్రాచీనుల జీవన విధానాల్నీ గౌరవిస్తూ అత్యంత నియమ నిష్ఠలతో పాటించే వ్యక్తి. పంచకావ్యాలు, ఆధ్యాత్మ రామాయణాలు, భారత భాగవతాలూ శ్రద్ధగా చదివినవాడు. నేను అందుకు పూర్తిగా భిన్నం. వైదికపు కుటుంబంలో పుట్టినా పౌరోహిత్యపు జీవితాన్నీ, బ్రాహ్మణ భావజాలాన్నీ వ్యతిరేకించాను. అన్ని మతగ్రంధాలతో పాటు, సైన్సు గ్రంధాలు, ప్రపంచ చరిత్రలు, ఆంత్రోపాలజీలు విపరీతంగా చదివి పక్కా భౌతిక వాదిగా నిరీశ్వర వాదిగా మారాను. ఒద్దన్నప్పటికీ వినక పెద్దలు ఉపనయనం చేసినందుకు నిరశనగా ఒడుగు భోజనాలైన మధ్యాహ్నమే అందరూ చూస్తూండగానే జంధ్యాన్ని తీసి బయట పారేసి మతాన్నీ, కులాన్నీ, వాటికి సంబంధించిన సమస్థ ఆచార వ్యవహారాల్ని నా జీవితంలోంచి బహిష్కరించాను. మా ఇద్దరి మధ్యా ఇంతటి జీవన వైరుధ్యం ఉన్నా మా స్నేహం చక్కని పొదరిల్లులా అల్లుకు పోవడానికి మా విభేదాలు అడ్డురాలేదు. పరస్పరం చర్చించుకున్నా, విమర్శించుకోలేదు. గౌరవం ఇష్టం నమ్మకం ఉన్నచోట వైరుధ్యాల మధ్య విరోధం ఉండనవసరం లేదనడానికి మా ఎడతెగని మైత్రే చిహ్నం. అలా విజయనగరంలో కలసి ఉన్నది ఒక్క సంవత్సరమే. అవినీతికీ అసమర్ధతకీ ఆలవాలమైన ప్రభుత్వ సర్వీస్ పట్ల తీవ్రమైన అసంతృప్తిని పెంచుకున్న నేను నా స్వేచ్ఛా లౌకిక భావాలకీ, నాకిష్టమైన నిరంతర గ్రంధపఠనం సాగించడానికీ, సంగీత సాహిత్యాలని ఆస్వాదించడానికీ, చిత్రలేఖన - శిల్పకళల్లో కృషిచేయడానికి బడిపంతులుద్యోగమే బెటరని భావించి, ట్రయినింగై సంగీత సాహిత్యాలకి కాణాచి అయిన నాకిష్టమైన ఊరు రాజమండ్రిలో టీచర్‌గా సెటిలైపోయాను. రఘురామ్ ఏ వూళ్ళో ఉన్నా వీలుచూసుకుని కలుస్తూనే ఉండేవాళ్ళం. మా స్నేహాన్ని ఎరిగినవాళ్ళు మా అనుబంధాన్ని "ఎ టేల్ ఆఫ్ టూ ఫేమిలీస్" అనేవాళ్ళు నవ్వుతూ.

రఘురామ్ కనీస సౌకర్యాలు కూడా ఏనాడూ అనుభవించకుండానే కుటుంబం కోసం పొదుపుగా గుట్టుగా జీవిస్తూ పిల్లల్ని విద్యావంతుల్నీ, ఉద్యోగస్తుల్నీ చేసాడు. పెళ్ళిళ్ళూ చేసాడు. రఘురామ్ పెద్ద కుటుంబంతో పడుతున్న పాట్లు చూసి, పిల్లలంటే ఎంత ఇష్టమున్నా, ఒక్క సుపుత్రుడితో ఫుల్‌స్టాప్ పెట్టేసాను. అందువల్ల రఘురాం అనుభవించినన్ని తిప్పలు నేను అనుభవించలేదు. మతమూ, కులమూ లేని తిక్కమనిషిగా నా తిప్పలు వేరే రకంవి. పెను తుఫాన్‌కి ఎదురు నిలిచే పొగరు నాది. ఆ కాసేపూ ఆ ప్రచండ మారుతానికి తలొగ్గి ఘర్షణకి చోటివ్వని వాడు రఘురామ్. రఘురామ్ రిటైరై కాకినాడలో ఓ ఇల్లుకొనుక్కుని సెటిలయ్యాడు. పిల్లలూ అక్కడే సెటిలయ్యారు. నాన్ స్టాప్ బస్సెక్కి గంటన్నరలో వాళ్ళింట్లో వాలేవాడ్ని. పిల్లల్తో, మనవల్తో రఘురామ్ ఇల్లు సందడిగా కళకళలాడుతూ ఉండేది. "అంకుల్! మీరొస్తే డాడీకి పండగే. వీలైనపుడల్లా వస్తూండండి.. అంకుల్" అంటారు అతని పిల్లలు.

వయసు మీదపడేకొద్దీ శారీరకంగా సహజంగా వచ్చే మార్పులు, అనారోగ్యాలు బాధలు, తిప్పలు ఎవరికీ తప్పకపోవచ్చు. కానీ జీవితపు సెకండ్ హాఫ్‌లో మానసికంగా తృప్తిగా, ఆనందంగా ఉండటం కన్నా అదృష్టం మరొకటి లేదు. లోకంలో అందరూ అంత అదృష్టవంతులు కా(లే)రు. ఈ విషయాలమీద తరచూ చర్చించుకుంటూ ఉండేవాళ్ళం. ఎన్ని విషయాల్లో మా మధ్య విభేదాలున్నప్పటికీ - నా జీవితంలో నా అంతరంగంలోకి చొచ్చుకు పోగలిగిన స్నేహితుడివి నువ్వొక్కడివే అనేవాడు. అటువంటి రఘురామ్ మంచాన పడి హాస్పటల్లో ఉన్నాడని వింటోంటేనే మనసుకి బాధకలిగింది. ఫోన్ చెయ్యడం కాదు, రేపే వెళ్ళి చూసిరావాలి అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

●●●

ఆ రేపు అనుకున్నది కాస్తా నా కంట్రోల్లో లేని పనుల ఒత్తిడి వల్ల మూడ్రోజులు ఆలస్యమైంది. ఎలాగూ వెడతాను గదాని ఫోనూ చెయ్యలేదు. ఉదయం పదిగంటలకి బస్ దిగి హాస్పటల్ వెదుక్కుంటూ పట్టుకుని, అతను ఉన్న గది గురించి వెదుకుతుంటే, రఘురామ్ కొడుకు వినయ్ ఎదురుపడి నన్ను చూసి సంబరపడుతూ - "రండంకుల్, మిమ్మల్ని చూస్తే డాడీ ఎంత సంతోషిస్తారో" అంటూ నా చెయ్యిపట్టుకుని తండ్రి వద్దకు తీసుకువెళ్ళాడు. ఆత్మీయులెవర్నీ ఎపుడూ ఏ స్థితిలో చూడకూడదనుకుంటామో ఆ స్థితిలోనే రఘురామ్‌ని చూసాను బెడ్ మీద. తుంటికి చేసిన ఆపరేషన్ వల్ల నడుముకి అంతా పెద్దకట్టు. కాలికి ట్రాక్షన్ కోసం ఆ కాలంతా కట్టు. ముంజేతి గాయానికి మరోకట్టు. నన్ను చూస్తూనే ఎప్పట్లాగే నవ్వాడు - ఏమీ జరగనట్టు. ఏం జరిగినా ఏమీ జరగనట్టు నవ్వడం అందరూ చెయ్యలేరు. పక్కన కూర్చుని అతని చాచిన చేతిలో నా చెయ్యి వేసాను. ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"కొన్ని సంఘటనలు అవి జరగకపోయుంటే కొన్ని విషయాలు తెలిసేవికావు. లేదా కొన్ని అభిప్రాయాలు ఏర్పడి ఉండేవి కావు. " ఉపోద్ఘాతంగా అన్నాడు. అవునన్నట్టు తలూపాను. అతను కంటిన్యూ చేసాడు -

"చిన్నతనంలో నేను ఎలిమెంటరీ స్కూల్‌కి సంచి భుజాన వేసుకుని వెళ్ళేదారిలో ఓ పాత పెంకుటింట్లో ఓ వృద్ధ దంపతులుండేవాళ్ళు. వాళ్ళ రూపురేఖలు ఇప్పటికీ నాకు కళ్ళకి కట్టినట్లుగా గుర్తున్నాయ్. కైలాసంలోని పర్వతీ పరమేశ్వరులు ముసలివాళ్ళయితే ఎలా ఉంటారో అలా అనిపించేవారు నాకు - చేతులెత్తి నమస్కరించాలనిపించేలా. సాయంత్రం బడినుండి తిరిగి వచ్చే టైంలో మాత్రం విచిత్రంగా ఆ ఇంట్లోంచి ఆ దంపతులు ఏడుపులు వినిపిస్తూండేవి. వాడి ఏడుపులతో పాటు ఎవరివో చాలా గట్టిగా కేకలు, అరుపులు, తలుపుల్నీ, బిందెల్నీ తన్నిన శబ్దాలూ, ఎవరో ఎవర్నో కొట్టిన చప్పుళ్ళూ వినిపించేవి. ఓ రోజు సాయంకాలం మాత్రం ఆ శబ్దాలేం లేవు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ ఇంటి ముందో పెద్ద గుంపు. కుతూహలంతో దూరి చూసాను. వాకిట్లోని నూతిపక్కన విగతజీవులైన ఆ వృద్ధదంపతుల శరీరాల మీద తెల్లగుడ్డలు కప్పిఉన్నాయ్. ఎవరూ ఏడవడం లేదు. వాళ్ళకోసం ఏడ్చేవాళ్ళెవరూ లేరు కాబోలు. రోజూ ఆ తల్లితండ్రుల్ని ఏడిపించే ఆ కొడుకు మెట్లమీద నిర్వికారంగా కూర్చునున్నాడు - గొప్ప కొడుకు. పేకాటకీ తాగుడికీ ముండలకీ డబ్బులకోసం అమ్మా బాబూ నూతిలో దూకి చచ్చేదాకా పీడించుకు తిన్నాడు. ఇటువంటి కొడుకులెందుకు పుడతారో? ధూ! ముదనష్టపు వెధవ ఎలా గుండ్రాయిలా కూర్చున్నాడో చూడు, బిందిచ్చుకు ముఖం పగల కొట్టక! - ఎవరో ఒకావిడ చాలా కసిగా అంటోంది. ఆ దృశ్యం నా లేత మెదడులో ముద్రవేసింది.

విజయనగరంలో మనం ఉన్న ఇంట్లో, నువ్వు రాకముందు ఓ వాటాలో ఓ ముసలాయన, కొడుకూ - కోడలు, ఇద్దరు పిల్లలూ ఉండేవాళ్ళు. వీధిలో పనులన్నీ ఆ ముసలాయనే నెమ్మదిగా ఊతకర్రతో నడుచుకుంటూ వెళ్ళి చేసుకొచ్చేవాడు. నైట్ డ్యూటీ చేసొచ్చే ఆ కొడుకు మధ్యాహ్నంగానీ లేచేవాడు కాడు. ఓ రోజు ఆ ముసలాయన్ని ఓ రిక్షా గుద్దేసి కాలువిరిగి మంచాన పడ్డాడు. ఆయనకి వైద్యమూ లేదు, మందులూ లేవు. రన్నింగ్ కామెంట్రీలా కోడలి స్వగతం ఆ కొంపలోని నలభైమందికీ వినిపించేలా కంచుకంఠంతో మారుమోగేది - 'ఈయన వద్దన్నా వినక వీధిలోకి వెడతాడు. ఇలాకావాలని దెబ్బలు తగిలించుకుని మంచమెక్కుతాడు. మంచాన పడ్డ మనిషికి చాకిరీ చేసి చావాల్సింది నేనేగా, చేసేవాళ్ళుంటే మంచానపడటవంత సుఖం మరోటిలేదు. మహర్జాతకులు మాత్రమే ఇలా దెబ్బలు ఒంకెట్టి మంచమెక్కుతారు సేవచెయ్యకేం చేస్తారో చూద్దావని కాబోలు. ఆస్తులివ్వకపోయినా కొడుకులకి దరిద్రాన్ని మాత్రం ఇచ్చి దర్జాగా మంచాలెక్కుతారు - ఎన్నాళ్ళో ఈ తిప్పలు మాకు. ' అలా మాట్లాడటం తప్పు అని ఆ కొడుకూ భార్యని వారించలేదు. ఆ అవమానం భరించలేక పాపం ఆ ముసలాయన ఓ రోజు స్లీపింగ్ పిల్స్ మింగి ఆ స్వగతాల్ని సుప్రభాతంలా వినే దౌర్భాగ్యపు పరిస్థితినుండి విముక్తుడయాడు. ఇటువంటివి చూసీ చూసీ నా ఆలోచనలెపుడూ మానవ సంబంధాల చుట్టూనే తిరుగుతూండేవి. పిల్లలవల్ల

చెప్పుకోడానికి వీలులేని అవమానాలు భరిస్తూ కుమిలిపోతూ, పైకి మాత్రం అంతా బాగానే ఉందనే నవ్వు ముఖం పెట్టుకోడానికి విశ్వ ప్రయత్నాలు చేసేవాళ్ళని నా చుట్టూ అనేక మందిని చూసాను. కానీ ఆ కృతకపు నవ్వే వాళ్ళ గుండెల్లో భగ్గుమనే మంటని పట్టిస్తుంది. ఆ నవ్వుకి జీవమూ వాసనా ఉండదు - ప్లాస్టిక్ పువ్వులాగ. అటువంటివి చూసినపుడు - ఆస్తులివ్వ(లే)ని తల్లిదండ్రుల్ని పిల్లలు గౌరవించరు కాబోలు అనిపించేది.

బతుకు బండి లాగలేక లాగలేక ఎన్నిసార్లు అలసిపోయినా, నిజాయితీ కూడు పెట్టదని తెల్సినా నా సంస్కారం నన్ను పక్కదార్లు పట్టనీయలేదు. నిజాయితీపరుడు శ్రీమంతుడు కా లేడు. శ్రీమంతుడు నిజాయితీగానూ ఉండడు. నా పిల్లలెపుడూ నాకిది కావాలని నోరు తెరచి అడలేదు - అడిగినా తెచ్చివ్వలేననే ఓ గ్రహింపు వల్లనేమో. నేనూ ఎప్పుడూ భార్యాపిల్లల్ని మీకేం కావాలని నేనూ అడగలేదు - తీరా ఫలానాది కావాలని అడిగితే ఎటూ ఇవ్వలేను కాబట్టి. ఇలా భార్యా పిల్లలతో జీవితం గుంభనంగానే నడిచింది. ఈ గుంభనపు జీవితం సరికాదని అనిపిస్తూనే ఉండేది. చదువులు చెప్పించడం, పెళ్ళిళ్ళు చేయడం నా కనీస బాధ్యత కాబట్టి అవి చేసానే తప్ప అంతకు మించి వాళ్ళకేం చేయలేకపోయాననే అనే చింత వెంటాడుతూనే ఉండేది. నాకు పుట్టినందుకు చాలా కాలం వాళ్ళు నా దారిద్ర్యాన్ని అనుభవించారు. వాళ్ళ కోర్కెలు తీర్చలేని, వాళ్ళని సంతోష పెట్టలేని, ఆస్థులు ఇవ్వలేని నా అసమర్ధత పట్లా, చాతకానితనం పట్లా వాళ్ళ అంతరంగాల్లో అయినా నా పట్ల అసంతృప్తీ, లోకువా ఉండవా అనుకునేవాడిని. ఉన్నా చేయగలిగేదేవీ లేదనుకో.

అనుకోకుండా ఇలా హాస్పటల్ పాలైన నాకిపుడు నా పిల్లల మనసులో నాకెంతటి ఉన్నత స్థానముందో, నాపై ఎంత గాఢానురాగం ఉందో అర్ధమైంది. నా అనుమానాలూ, భావనలూ కేవలం నా ఊహ అపోహలే. వాళ్ళు నా నుండి పెద్దరికపు ప్రేమ తప్ప మరేమీ ఆశించడం లేదనే నిజం నాకు చాలా తృప్తినీ ఆనందాన్నీ ఇస్తోంది. ఈ తృప్తీ ఆనందమూ ఏ బాధనైనా తట్టుకునే శక్తినిచ్చాయ్. అందుకే త్వరగా కోలుకుంటున్నాను. ఈ ప్రమాదం జరగకపోయుంటే - నా కేదైనా జరిగితే నా పిల్లలు ఎంత తల్లడిల్లిపోతారో నాపై వాళ్ళకెంత మమకారం ఉందో నాకెపుడూ తెలిసి ఉండేదికాదు. మనమీద భార్యాపిల్లలకెంత ప్రేమాభిమానాలున్నాయో తెలుసుకోడానికి ఈ మంచాన పడటం ఓ నీలిలిట్మస్ టెస్ట్ లాటిది. ఇటు వంటి తృప్తిని రుచిచూడటానికైనా నా వయసువాళ్ళు ఇలా ఓసారైనా మంచాన పడితే మంచిదనిపిస్తోంది. మొన్నటిదాకా వాళ్ళు నా పిల్లలు. వాళ్ళకి నేను తండ్రిని. కానీ ఇపుడు వాళ్ళు నన్ను తండ్రిలా కాక ఓ చంటిపిల్లాడ్ని చూసుకునేంత ప్రేమతో మమకారంతో బాధ్యతగా చూసుకోవడం చూస్తుంటే ఎంత అదృష్టం చేసుకుని మ్మంచాన పడ్డాను అనిపిస్తోంది - అన్నాడు నవ్వుతూ. ఈ వయసులో మంచాన పడటం అందరూ ఓ శాపంగా భావిస్తే నాకిదో వరంలా తోస్తోంది" అన్నాడు మళ్ళీ.

ఇలా కబుర్లు చెప్పుకుంటూండగానే కూతుళ్ళూ అల్లుళ్ళూ వచ్చారు కేరేజీల్తో. నన్ను చూసి " అంకుల్" అంటూ వాళ్ళ ముఖాల్లో ఆనందం. అప్పుడది ఓ హాస్పిటల్ వాతావరణంలా అనిపించలేదు. ఓ పండుగ జరుపుకుంటున్నట్టుంది నవ్వుల్తో, జోకుల్తో. బాగా చీకటి పడేవరకూ కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం. ఏడున్నరకు వినయ్ నన్ను తన బైక్పై బస్ స్టాండ్కి దింపడానికి వచ్చాడు.

" మీ డాడీ చాలా అదృష్టవంతుడు వినయ" అన్నాను దారిలో.

" లేదంకుల్, అపురూపమైన వ్యక్తిత్వం, ఉన్నత విలువలు గల ఆయన కడుపున పుట్టడం మేం చేసుకున్న అదృష్టం. ఆయన జీవితమంతా ఓ డొక్కు సైకిల్ తోనే సరిపుచ్చుకుని నాకు బైక్ కొనిచ్చారు. భయంకరమైన అద్దె ఇళ్ళలో ఆయన జీవించి నాకు ఓ సుందరమైన భవంతినిచ్చారు. ఆయన తండ్రి ఆయనకు అప్పులు అప్పగిస్తే, డాడీ మాకు ఏనాడూ అప్పుచేయాల్సిన అవసరం లేకుండా చేసారు. ఇంతకన్నా ఏం కావాలి అంకుల్. పునర్జన్మలంటూ ఉన్నాయో లేదో నాకు తెలియదు గానీ, ఉంటే మాత్రం ఎన్ని జన్మలకైనా నాకు ఈ తండ్రే కావాలి అంకుల్. నిన్నటిదాకా నేను ఆయన కొడుకుని. ఇపుడు ఆయనే నాకు కొడుకు అంకుల్" - అంటుంటే చాలా

ముచ్చటేసి వినయ్‌ని నా హృదయానికి హత్తుకున్నాను. నా కొడుకుని హత్తుకున్నట్టే. బస్సు కదిలేవరకూ వినయ్ నాతోనే ఉన్నాడు కబుర్లు చెబుతూ.

లోకంలో తల్లిదండ్రులకి నరకం చూపించే సుపుత్రులే కాదు, కన్నవాళ్ళని నెత్తిని పెట్టుకునే కొడుకులూ ఉన్నారు. లోకమూ, జీవితమూ వైరుధ్యాల పుట్టగదా! చల్లగాలి రివ్వున వీస్తూంటే మాగన్నుగా నిద్రపట్టినట్టయి పావుగంటలో ప్రయాణం పూర్తయినట్లనిపించింది. గుమ్మంలో అడుగుపెడుతూంటే. సరిగ్గా ఫోన్ రింగవడం వినిపించింది. ఒక్క ఊపున ఫోన్ దగ్గర కూలబడ్డాను. ఠంచనుగా రాత్రి తొమ్మిదిన్నరకి నా కొడుకు ఫోన్ చేస్తాడు రోజూ. రెండు నిమిషాలైనా వాడి గొంతు వినకుండా నాకు నిద్రపట్టనట్టే, 'బుజ్జీ' అనే నా స్వరం వినకపోతే వాడికీ తోచదు. అందుకే ఏ పన్లో ఉన్నా తొమ్మిదిన్నరకి ఫోన్ దగ్గరే నిరీక్షిస్తుంటాను. వేలమైళ్ళ దూరాన్నుండి విద్యుత్ వేగంతో 'డాడీ' అనే వాడి మధురమైన పిలుపు నా చెవిలోంచి నా హృదయాన్ని తాకుతోంది నన్ను పరవశింపచేస్తూ. జన్మపరంపరల గోల నాకెందుకు - నాకెపుడూ ఈ కొడుకే కావాలి.

●●●

## వాల్మీకి — గన్నవరపు నరసింహామూర్తి

**ఆ రోజు నేను ఆఫీసుకి** వెళ్ళేసరికి మా సూపరింటెండెంట్ రామారావు నా ఛాంబర్‌కి వచ్చి "మీకీ విషయం తెలుసా సార్! ఈ వారంలో ఎప్పుడైనా ప్రద్యుమ్నరావ్ గారిం టిని ఏసీబీ వాళ్ళు రైడ్ చేస్తారని మన ఆఫీసులో గుసగుసలు వినిపిస్తున్నాయి. అతను మీకు క్లోజ్ ఫ్రెండనీ, మీకీవిషయం తెలిస్తే అతన్ని ఎలర్ట్ చేస్తారనీ మీకు చెబుతున్నాను. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచండి" అంటూ వచ్చినంత త్వరగా వెళ్ళిపోయాడు.

అతను చెప్పిన విషయం వినగానే నాకు ఆందోళన పెరగడం మొదలైంది "ప్రద్యుమ్న ఇంటిమీద రైడ్ జరగబోతోందా? అతనికీ విషయం తెలుసా? అతనికి రాజకీయ వర్గాల్లో చాలా పలుకుబడి ఉంది కాబట్టి బహుశా తెలిసే ఉండాలి, అయినా ఒక స్నేహితుడిగా అతనికి చెప్పడం నా ధర్మం, ముందుగా తెలిస్తే జాగ్రత్త పడతాడు" అనుకుంటూ సెల్ తీసి వాడికి ఫోన్ చేసాను,

కొద్ది క్షణాల తర్వాత అవతల్నుంచి ప్రద్యుమ్న "చెప్పరా రాఘువా; ఏమిటి విషయాలు?" అన్నాడు

"ప్రద్యుమ్నా! నేను చెప్పింది జాగ్రత్తగా విను. ఈ వారంలో ఎప్పుడైనా ఏసీబీ వాళ్ళు మీ ఇంటిని రైడ్ చేస్తారని నాకు తెలిసింది. నీ జాగ్రత్తలో నువ్వుండు; మిగతా విషయాలు తరువాత మాట్లాడతాను" అంటూ ఫోన్‌ని డిస్‌కనెక్ట్ చేసాను.

నాకు ప్రద్యుమ్న ఆప్తమిత్రుడు. ఇరవై ఏళ్ళ క్రితం కాకినాడలో జె.యన్.టీయూలో ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు పరిచయం అయ్యాడు. కొద్ది రోజులకే ఇద్దరం బాగా సన్నిహితం అయ్యాం. చదువు పూర్తైన తరువాత ఇద్దరం ఒకేసారి సర్వీసు కమీషన్ పరీక్ష వ్రాసి రాష్ట్ర ప్రభుత్వంలోని నీటి పారుదల శాఖలో జూనియర్ ఇంజనీర్లుగా జాయినయ్యాం.

మేము పనిచేసే శాఖలో డబ్బు సంపాదించడానికి అవకాశాలు, రాజకీయనాయకుల జోక్యాలూ రెండూ ఎక్కువే. తమ మాటలు వినకపోతే కాంట్రాక్టర్లు ఏ ఎమ్మెల్యేనో, మంత్రినో పట్టుకుని ప్రాధాన్యత లేని పోస్టుల్లోకి బదిలీ చేయిస్తారు.

నేనుకూడా ఆ బాధితుల్లో ఒకణ్ణే. ఉద్యోగంలో చేరిన కొత్తల్లో ఇద్దరం చాలా నిజాయితీగా ఉండేవాళ్ళం. మా ఇద్దర్నీ కొత్తగా నిర్మిస్తున్న ఒక రిజర్వాయర్ ప్రాజెక్ట్‌లో వేసారు. అయితే జాయినైన ఆరునెలలకే ఒక కాంట్రాక్టర్‌తో మట్టిపని విషయమై గొడవ రావడం వల్ల అతను మంత్రితో పైరవీ చేయించి నన్ను హైదరాబాద్ లోని హెడ్డాఫీసుకి బదిలీ చేయించాడు, అప్పట్నుంచీ ఇప్పటిదాకా నేను డిజైన్స్ సెక్షన్‌లో ఉంటూ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయికి చేరుకున్నాను.

ఇక ప్రద్యుమ్న విషయానికి వస్తే మొదట్లో అతను కూడా నిజాయితీగా ఉండేవాడు. అందువల్ల మొదటి నాలుగేళ్ళలో ఆరుసార్లు బదిలీ చేయబడ్డాడు. ఇంతలో మా ఇద్దరికీ ఒకేసారి పెళ్ళిళ్ళు జరిగాయి. పెళ్ళి తరువాత ప్రద్యుమ్న చాలా ఇబ్బందులు పడ్డాడు. ఒకసారి ఏదో ట్రైనింగ్ పనిమీద హైదరాబాద్ వచ్చినపుడు వాణ్ణి మా ఇంటికి తీసుకెళ్ళాను. అప్పుడు వాడు పడుతున్న బాధల్ని ఏకరువు పెట్టాడు.

"రాఘవా! ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు మనం ఎన్ని కలలు కన్నాం చెప్పు, నిజయితీగా బతకాలనీ, సమాజానికి సేవ చెయ్యాలనీ ఎన్నో అనుకున్నాం. లంచాలు స్వీకరించకూడదని ఒట్టు పెట్టుకున్నామా లేదా? కానీ అదే ఇవాళ పెద్ద నేరమై కూర్చుంది. సమాజంలో నీతి నియమాలన్నవి ఎండమావులై పోయాయిరా" అన్నాడు ఆవేశంగా.

అప్పుడు వాడి మాటలు నాకు ఆవేశం కలిగించాయి. అప్పటిదాకా ప్రద్యుమ్న ఏదో బాధలు పడుతూ ఉద్యోగాన్ని నెట్టుకొస్తున్నాడనుకున్నాను. కానీ వాడి మాటలు వింటుంటే ఏదో ఇబ్బందుల్లో ఉన్నట్లనిపించి" ఏం జరిగింది? ఏమైనా సమస్యలా?" అని అడిగాను.

"నిజాయితీగా ఉండటాన్ని ఈ సమాజం హర్షించడం లేదురా. పిల్లనిచ్చిన అత్తమామల దగ్గర్నుంచి జీవితాంతం తోడుగా ఉండవలసిన భార్యదాకా అందరూ నా పంథాని వ్యతిరేకిస్తున్నారు. అప్పట్లో ప్రభుత్వంలో జాయింట్ డైరక్టర్ హోదాలో ఉండే మా మామగారు నాకు పిల్లనిస్తానంటే బహుశా నా చదువుని, మంచితనాన్ని, నిజాయితీని చూసి అనుకున్నాను. కానీ నా ఉద్యోగంలో డబ్బులు అక్రమంగా సంపాదించే అవకాశాలు ఎక్కువనీ, తద్వారా నేను త్వరగా లక్షలు సంపాదిస్తానని ఆశించే నాకు పిల్లనిచ్చాడని తరువాత తెలిసింది. అందుకే పెళ్ళైన తరువాత ఎన్నోసార్లు -నిజాయితీగా మడికట్టుకుని కూర్చుంటే జీవితంలో పైకి రాలేననీ, తోటి ఉద్యోగుల్ని చూసైనా నేర్చుకోమని- ఎన్నో సలహాలివ్వడం మొదలు పెట్టారు. ఈలోగా నాకు ఇద్దరు పిల్లలు పుట్టడం, ఇంట్లో ఆర్థిక సమస్యలు పెరగడంతో బాటు తరచు బదిలీలు అవుతుండడంతో నాలో ఆవేశం తగ్గిపోయి సమస్యలకు లొంగిపోవడం మొదలు పెట్టాను. ఇప్పుడు నేను రాజీపడిన ప్రద్యుమ్నని" అంటూ వాపోయాడు.

ఆ తరువాత చాలా సంవత్సరాలు వాణ్ణి కలవటం కుదరలేదు. ఈలోగా వాడు కూడా నాలాగే ఎక్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందాడు. రెండేళ్ళ క్రితం వాడు ఒక టెక్నికల్ సెమినార్‌కి ఇక్కడికి వచ్చినపుడు వాడి వేషభాషలు, ప్రవర్తనలో పెద్ద మార్పుని గమనించాను. ఆ రోజు వాణ్ణి మా ఇంటికి భోజనానికి రమ్మంటే ...

"ఎప్పుడూ ఇంటిదగ్గర ఏం తింటాం లేరా, గ్రాండ్ కాకతీయాలో నా రూమ్ ఉంది అక్కడకు వెళ్ళి హాయిగా కబుర్లు చెప్పుకుంటూ తిందాం పద అన్నాడు. ఆ తరువాత గంటలో అక్కడికి చేరుకున్నాం. కాకతీయాలో డీలక్స్ రూం అంటే రోజుకి పదివేలు. మేం కారు దిగగానే మేనేజర్ మమ్మల్ని సాదరంగా ఆహ్వానించాడు. కాసేపటి తరువాత ఇద్దరం రూములో కూర్చుని లంచ్ చెయ్యడం మొదలుపెట్టాం. దానితో పాటు ఖరీదైన డ్రింక్స్. నేను వాటిని సున్నితంగా తిరస్కరిస్తే ప్రద్యుమ్న చౌదరి మాత్రం గ్లాసులో పోసుకుని త్రాగడం మొదలుపెట్టాడు. ఎప్పుడూ డ్రింక్స్ అంటే వ్యతిరేకించే ప్రద్యుమ్న ఇవాళ అలవోకగా త్రాగుతుండడం చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఏదైనా వాడిలో చాలా మార్పుని గమనించాను.

భోజనం చేస్తూ వాడితో మాటలు మొదలు పెట్టాను.

"ఏరా! చదువుకున్న రోజుల్నుంచి నీ వ్యక్తిత్వం, ఆలోచనా ధోరణి అన్నీ నేనెరుగుదును. నాలుగేళ్ళక్రితం నువ్విక్కడికి వచ్చినపుడు కూడా అవన్నీ నీలో ఉన్నాయి. కానీ ఈరోజు మాత్రం నీలో ఒక కొత్త ప్రద్యుమ్నని చూస్తున్నాను. నీలో ఈ మార్పుకి కారణం?"

నా ప్రశ్నకి చాలా సేపటి వరకు వాడి దగ్గర్నుంచీ సమాధానమే లేదు.

తరువాత వాడి నోటినుంచి గంగా ప్రవాహంలా మాటలు మొదలయ్యాయి.

"నేను నిజాయితీగా ఉన్నంతకాలం ఇంటా బయటా ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను, ముఖ్యంగా నా కుటుంబంనుంచీ నాకు మద్దతు లభించలేదు. వీటికితోడు ఆర్థిక సమస్యలు నన్ను బాగా కృంగతీసాయి! మా పల్లెలో వ్యవసాయం దెబ్బతినడంతో ఇల్లు గడవని స్థితిలో తల్లితండ్రులు, ఇంకో పక్క జీతం సరిపోక కుటుంబంలో సమస్యలు. ఆ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో తోచలేదు,. ఇంట్లో రోజూ గొడవలు, నా భార్య సుశీల ఎప్పుడూ నన్ను నా కొలీగ్స్‌తోను, వాళ్ళ అన్నలు, బావలతోనూ పోలుస్తూ మానసికంగా హింసించేది. వాళ్ళందరూ రెండు చేతులా సంపాదిస్తూ ఎన్నో ఆస్తులు కూడబెడుతుంటే నేనేమో నిజాయితీని పట్టుకుని వ్రేలాడుతుండడం దీనివల్ల ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవడం నాకు ఇబ్బందిగా అనిపించసాగింది. వీటికి తోడు పుండు మీద కారం చల్లినట్లు సంవత్సరానికి రెండు మూడుసార్లు బదిలీలు, ఆఫీసర్ల నుండి వేధింపులు. అలా ఇవన్నీ నా ఆలోచనా ధోరణిలో మార్పుని తీసుకు వచ్చాయి. అప్పటికే నా రక్తంలో వేడి తగ్గింది, ఆశయాల స్థానంలో ఆశ పెరగడం మొదలైంది. రాను రాను నేను కూడా తప్పుడు పనులకు అలవాటు పడ్డాను. మనిషి రక్తానికి అలవాటు పడితే పులి ఎలా మేనీటర్‌గా మారుతుందో డబ్బు సంపాదనకి అలవాటు పడ్డ మానవుడు కూడా అలాగే మని ఈటర్‌గా మారతాడనడానికి నేనే ప్రత్యక్ష ఉదాహరణ. ఆ విధంగా సంపాదన అనే ఊబిలో కూరుకుపోయాను. కాకపోతే సమాజంలో నా హోదా, గౌరవం పెరిగాయి. నాలుగు ఇళ్ళు, పల్లెలో పాతికెకరాల పొలం, కోట్లలో డబ్బు, బంగారం, కార్లు.. ఇలా ఎన్నో సంపాదించాను. నాకూతుర్ని ఓ ఐయ్యేఎస్ కిచ్చి పెళ్ళిచేసాను. ఎమ్మెల్యే కూతుర్ని నా కోడలిగా చేసుకున్నాను. ఇప్పుడు నేను కోరుకున్న చోట పోస్టింగ్. ఎమ్మెల్యేల దగ్గర్నుంచి మంత్రులదాకా పరిచయాలు" ప్రద్యుమ్న ఆవేశంగా నిజాలు చెప్పుకుపోతున్నాడు, వాడు చెబుతుంటే నేను మౌనయోగిలా వినసాగాను.

ఆ తరువాత మా మధ్య నిశ్శబ్దం చాలా సేపటివరకు మాట్లాడుకోలేదు. తరువాత నేనే ఆ మౌనాన్ని ఛేదిస్తూ "ప్రద్యుమ్నా, ఇప్పుడు నువ్వు కోట్లు సంపాదించావు. సమాజంలో చాలా గౌరవ ప్రతిష్టలు సంపాదించావు. అయినా ఇప్పుడు నీకు మానసిక ప్రశాంతత ఉందా? నువ్వు ఆనందంగా ఉన్నావా?" అని అడిగాను.

ఊహించని నా ప్రశ్నలు వాడిని ఉక్కిరి బిక్కిరి చేసినట్లున్నాయి కాబోలు అందుకే వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు వాడు. ఈలోగా మా భోజనాలు పూర్తయ్యాయి. వెంటనే లేస్తూ వాడు "రాఘవా ఇందాక నువ్వడిగినవి నిజానికి చాలా చిన్నప్రశ్నలు. కానీ వాటికి సమాధానాలు ప్రస్తుతానికి నా దగ్గర లేవు. ఎప్పుడైనా తెలిస్తే నీకు తప్పక చెబుతాను" అన్నాడు.

ఆ తరువాత మళ్ళీ వాడిని కలవడం కుదరలేదు.

●●●

అనుకున్నట్లుగానే వారం రోజులు తరువాత "ఏసీబీకి చిక్కిన నీటి పారుదల శాఖ ఇంజనీరు" అంటూ పేపర్లలోనూ, "ఏసీబీ వలలో అతి పెద్ద అవినీతి తిమింగలం" అంటూ ఛానళ్ళలోనూ వార్తలొచ్చాయి. ఆ తరువాత ఏం జరిగిందో మాత్రం తెలియలేదు. నేను కూడా ఆ విషయాల మీద పెద్దగా ఆసక్తి చూపలేదు.

ఆర్నెల్ల తరువాత ప్రద్యుమ్న వాలంటరీ రిటైర్మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు నాకు తెలిసింది. ప్రభుత్వం కూడా వాడి అభ్యర్థనని అభ్యర్థనని ఆమోదించి సర్వీసు నుంచి రిలీవ్ చేసింది. ఆ తరువాత వాడి వివరాలు నాకు తెలియలేదు.

కానీ సంవత్సరం తరువాత వాడి దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో - తాను ఇప్పుడు ఒంటరిగా తన పల్లెలో ఉంటున్నట్లు వీలైతే ఒకసారి వచ్చి కలవమని రాసి ఉంది. నాక్కూడా ఆ ఉత్తర చదివిన తరువాత వాడిని చూడాలనిపించింది. ఎంతైనా ఇద్దరం చిరకాలమిత్రులం కదా. అందుకే పదిహేను రోజుల తరువాత వాడిని కలవడానికి వాడి ఊరు బయలుదేరాను.

●●●

ఉదయం పదిగంటలకు ఆ పల్లెలో ఆర్టీసీ బస్సు దిగాను. పట్నవాసపు రణగొణధ్వనులతో విసిగి పోయిన నాకు అక్కడి ప్రశాంత వాతావరణం హాయిగొలపసాగింది. నేను వస్తున్నట్లుగా ముందుగానే ఫోన్ చెయ్యడం వల్ల బస్టాండ్ దగ్గరకు ప్రద్యుమ్న వచ్చాడు. నన్ను చూసి ఆనందంతో కౌగిలించుకున్నాడు. ఆప్యాయతతో కూడిన ఆ స్పర్శ నాకెంతో ఆనందాన్ని కలిగించింది. ఇద్దరం నడుస్తూ వాడింటికి బయలుదేరాం.

కొద్ది సేపటికి మేం ప్రశాంతంగా పారుతున్న ఏటి ఒడ్డుకు చేరుకున్నాం. ఆ ఒడ్డునే మామిడి తోట, ఆ చెట్ల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో ఉంది వాడి ఇల్లు. దాన్ని ఇల్లు అనేకన్నా ఆశ్రమం అంటే బాగుంటుందేమో! అక్కడ ఉన్న చెట్ల క్రింద చాలా మందిపిల్లలు చదువుకుంటున్న దృశ్యం నన్ను ఉక్కిరి బిక్కిరి చెయ్యసాగింది. మరి కొంత దూరం వెళ్ళేసరికి కొందరు ఆడపిల్లలు సంగీత సాధన చేస్తూ కనిపించారు. అలా కొద్దిసేపు ఆ పరిసరాలన్నీ తిరిగి మరలా ఏటి ఒడ్డుకి వచ్చి అక్కడ ఉన్న మామిడి చెట్టుకింద కూర్చున్నాం.

"ప్రద్యుమ్నా ఏమిటిదంతా? ఈ ప్రదేశాన్ని, ఆశ్రమం లాంటి నీ ఇంటిని చూస్తుంటే నాకు చాలా అబ్బురంగా కనిపిస్తోంది. నువ్వేంటి ఈ పల్లెలో ఉండటమేమిటి?. అదీకాక ఈ గురుకులం ఎప్పట్నుంచీ ప్రారంభించావు? ఇవన్నీ చూస్తుంటే నాకు చాలా అయోమయంగా ఉంది" అని ప్రశ్నల పరంపర కురిపించాను.

కానీ వాడి దగ్గర్నుంచీ సమాధానం లేదు. దూరంగా ఎక్కడినుంచో మృదుమధురంగా కోకిల కలకూజితం వినపడుతోంది.

"ఏం చెప్పనురా. ఆరోజు నీ దగ్గర్నుంచీ ఏసీబీ వాళ్ళు రైడ్ చేస్తారని ఫోన్ వచ్చిన తరువాత నాలో కలవరం మొదలైంది. ఏం చెయ్యాలో తోచలేదు. అప్పటికి ఇంట్లో నా దగ్గర ఇరవై లక్షల దాకా డబ్బు, రెండు కేజీల బంగారం ఉన్నాయి. అవి కాక లాకర్లలో డబ్బు నగలు లక్షల్లో ఉన్నాయి. ఎవర్నీ సలహా అడగలేని పరిస్థితి.

ఆ మర్నాడు ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లోని లాకర్లోని ఉన్న డబ్బు బంగారాన్ని విశాఖ దగ్గర పల్లెలో ఉన్న నా స్నేహితుడి ఇంట్లోకి తరలించాను. దస్తావేజులన్నీ వేరే స్నేహితుడింట్లో పెట్టాను. ఆ తరువాత రెండురోజులకి మా ఇంటిమీద రైడ్ జరిగింది. ముందే నీ దయవల్ల జాగ్రత్తపడటం వల్ల వాళ్ళకేమీ దొరక్కపోవడం చేత కేసుకూడా రిజిస్టర్ చేయకుండా నన్ను వదిలేసారు. కానీ అప్పటికే జరగవలసిన అనర్థం అంతా జరిగిపోయింది. ఊరూవాడా నా ఇంటిమీద జరిగిన రైడ్ గురించి ఎన్నో పుకార్లు. ఇక పత్రికల్లోనూ, ఛానెల్స్ లోనూ ఆరోజంతా అదేపనిగా వార్తలు, బ్రేకింగ్ న్యూస్‌లు. దాంతో నేను మానసికంగా దెబ్బతిన్నాను జీవితంలో ఎప్పుడూ లేనిది మొదటిసారి ఏడ్చాను. కానీ దురదృష్టవశాత్తూ ఆ రోజు నన్ను ఓదార్చే వాళ్ళే కరువయ్యారు" ప్రద్యుమ్న చెబుతూ ఆగాడు. అతడి కళ్ళల్లో సన్నటి ధారని గమనించాను.

"ఆ మర్నాడు నా భార్య సుశీల నా దగ్గరికి ఏడుస్తూ వచ్చి 'బయటకు వెళ్ళాలంటేనే సిగ్గుగా ఉంది. నిన్నటి దాకా గర్వంగా తలెత్తుకుని బ్రతికిన మనల్ని అందరూ దొంగల్లా చూస్తున్నారు. నిన్నటిదాకా ఆకాశానికెత్తేసే నా స్నేహితురాళ్ళు ఇవాళ నా గురించి చాలా నీచంగా మాట్లాడుతుండటం నేను తట్టుకోలేకపోతున్నాను. చివరకు పని మనుషులు కూడా అంటరాని వాళ్ళుగా చూస్తున్నారు. ఈ రోజు మా అన్నయ్య ఇంట్లో వాడి కొడుక్కి వివాహం జరుగుతున్నా వెళ్ళబుద్దికాలేదు. వెళితే వాళ్ళు చేసే అవమానాన్ని నేను తట్టుకోలేను. వాళ్ళు అడిగే ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేను. వాళ్ళ సూటిపోటీ మాటలు వినే ధైర్యం నాకు లేదు. ఇక రేపట్నుంచీ అందరి ముఖం ఎలా

చూపించాలో అర్థంకావట్లేదు. అయినా ఇంత డబ్బు అవసరమా మనకి చెప్పండి? ఈ రోజు ఈ డబ్బు మనకి వచ్చిన చెడ్డపేరుని కొద్దిగానైనా తొలగిస్తుందా? ఈ విషయం తెలిసి మన వియ్యాలవార్లు మనింటికి పరామర్శకు కూడా రాలేదు. ఇక పిల్లలిద్దరూ అయితే మీరు చేసిన ఈ పనికి చాలా బాధపడుతున్నట్లు ఫోన్ చేసి చెప్పారు' అంది.

ఆమె మాటలు నాకు ఆశ్చర్యంతో పాటు విస్మయాన్ని కలగచేసింది. "అదేంటి సుశీలా, నేను ఆ రోజుల్లో ఎంతో నిజాయితీగా ఉంటే నువ్వు నీ తల్లితండ్రులే కదా నన్నో పనికిరానివాడిగా జమకట్టి నా చేత తప్పుడు పనులు చేసేటట్లు పురిగొల్పారు. నిజానికి నేను ఈ తప్పుడు పనులు చెయ్యడానికి ఒక విధంగా నువ్వు, పిల్లలే కారణం. అయినా ఇంత డబ్బు నేను ఎందుకు సంపాదించాననుకుంటున్నావు? నీ కోసం పిల్లల కోసమే కదా! ఈ డబ్బే లేకుంటే ఈ ఇల్లు, కార్లు, బంగారం, హోదా వచ్చి ఉండేదంటావా? పిల్లలికి అంతేసి డొనేషన్లు కట్టి పెద్ద పెద్ద చదువులు, డబ్బున్న సంబంధాలు. ఇవన్నీ జరిగి ఉండేవా చెప్పు. డబ్బు వల్ల వచ్చే సుఖాలను అనుభవించినప్పుడు దానివల్ల వచ్చే కష్టనష్టాల్ని కూడా ఓర్చుకోవాలి. ఇదంతా నా కోసం నేను సంపాదించలేదు. మీ అందరికోసం. మన కుటుంబం కోసం. సుఖాలన్నింటినీ అనుభవించి ఇప్పుడు కష్టంరాగానే నాదే బాధ్యతనడం చాలా తప్పు" అన్నాను.

ఆమె కానీ, పిల్లలు కానీ నా మాటలు వినలేదు. తప్పంతా నాదేననీ అందువల్ల నాతో కలిసి ఉండలేమని చెప్పి నన్ను ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయారు."

ప్రద్యుమ్న మాటలు నాకు ఆశ్చర్యంతో బాటు బాధని కూడా కలగచేసాయి. నాకెందుకో వాడి భార్య, పిల్లలు చేసిన పని నాకు నచ్చలేదు"

వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత నా కళ్ళు తెరుచుకున్నాయి. నెలరోజుల తరువాత వాలెంటరీ రిటైర్మెంట్‌కి దరఖాస్తు చేసుకున్నాను. స్నేహితులింట్లో దాచిన డబ్బు, నగల్ని తిరిగి ఇంటికి తెచ్చాను. సుమారు నాలుగుకోట్ల రూపాయలు అవి. వాటిని తిరుపతి వెళ్ళి శ్రీవారి హుండీలో వేసాను. ఆ తరువాత నా పి.యఫ్, గ్రాట్యూటీతో వచ్చిన ముప్పై లక్షల రూపాయలతో ఈ ఊరు వచ్చి పేద విద్యార్థులకోసం ఈ ఆశ్రమ పాఠశాలని నిర్మించి ఇక్కడే ఒంటరిగా ఉంటున్నాను" అన్నాడు ప్రద్యుమ్న.

"ప్రద్యుమ్నా నిన్ను చూస్తుంటే నాకెందుకో ఇప్పుడు వాల్మీకి గుర్తుకు వస్తున్నాడురా. అతని భార్యా పిల్లలు కూడా అతని పాపాలను వద్దన్నారు. తరువాత అతనిలో ప్రాయశ్చిత్తం మొదలై చివరకు మహర్షి అయాడు. నిన్ను చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. డబ్బు సంపాదించినవాడు దాన్ని అంత సులభంగా వదులుకోలేడు. కానీ నువ్వు మాత్రం దాన్ని తృణప్రాయంగా వదిలించుకుని పవిత్రమైన ఆశ్రమవాసాన్ని గడుపుతున్నావు" అన్నాను కంటి నీటిని తుడుచుకుంటూ.

"రాఘవా ఒకసారి హోటల్లో నన్ను డబ్బుతో నీకు ప్రశాంతత ఉందా?" అని అడిగావు. ఆ రోజు నేను సమాధానం చెప్పలేకపోయాను. కానీ ఈ రోజు దానికి సమాధానం దొరికింది. అవినీతితో సంపాదించిన ఆ డబ్బంతా దేవుడి హుండీలో వేసిన మరుక్షణం నాకు ప్రశాంతత ఆవహించింది. ఇప్పుడు నేను ఏ బాదర బందీలేని విరాగిని. ఇప్పుడు మానసికంగా నేను చాలా ప్రశాంతంగా ఉన్నాను" అన్నాడు ప్రద్యుమ్న.

వాడి మాటలు నాకు అమృతప్రాయంగా తోచాయి. ఆ ఆనందంతో వీడ్కోలు చెప్పి హైదరాబాద్‌కి బయలుదేరాను.

# విధివిన్యాసాలు

డా.కె.వి.ఎస్.జ్ఞానేశ్వరరావు

**జీవితం ఎన్ని మలుపులు తిప్పుతుందీ** అన్నదానికి మా సత్యం మాష్టారి అనుభవాలే మచ్చుతునకలు. అంతటి ఉత్తముడినీ, సంస్కారవంతుడినీ మళ్ళీ చూడబోము. ఎంతటి నిగ్రహం. ఎంతటి ఓర్పు, ఎంతటి సహనం ఎంతటి ఆత్మాభిమానం. ఆ విలువలు ఈనాడు కలికానికైనా కనిపిస్తున్నాయా? ఆ రోజులే వేరు - ఆ మనుషులే వేరు.

●●●

"ఏమిటి మాస్టారూ - మొహం వడిలిపోయి ఉంది?

"ఏమీ లేదమ్మా - కొంచెం నీరసంగా ఉందంతే"

"ఈ మండుటెండల్లో సరైన చెప్పులు, గొడుగుకూడా లేకుండా అంతంత దూరాలు ఎలా నడిచి వస్తున్నారు మాష్టారూ? ఎక్కడి కస్బా? ఎక్కడి కొత్తపేట? నిజం చెప్పండి - ఏమైనా తినివచ్చారా లేదా? మీ పేరులోనే సత్యం ఉంది మరువకండి"

"ఇంత చిన్న విషయానికి అబద్దమెందుకమ్మా? ట్యూషన్ పిల్లలు ఎవరూ సరైన సమయానికి జీతం ఇవ్వరు. మూడు పూటలబట్టీ పిల్లి లేవలేదు."

"అయ్యయ్యో - ఎంతమాట? ఇప్పటికే ఆరుగురు సంతానం! ఎలా నెట్టుకు వస్తున్నారు? ఉండండి - పట్టెడన్నం తినిపోదురుగాని. తెల్లారి లేచింది మొదలు పొద్దుగూకేదాకా పేగులు తెగిపోయేలా ఎలిమెంటరీ స్కూలు పిల్లల్తో ఎలావేగుతున్నారో?"

మా అమ్మది జాలిగుండె చూస్తూ చూస్తూ ఒక బక్క ప్రాణం ఆకలితో అలమటిస్తుంటే ఊరుకోలేక విస్తట్లో అన్నీ వడ్డించి వరండాలో ఆయన ముందు పెట్టింది.

పాపం - ఆయన కడుపు తరుక్కుపోయింది. "ఏం మాష్టారూ - పదార్థాలు బాగాలేవా?"

"అన్నన్న - ఎంత మాటమ్మా? పంచ భక్ష్య పరమాన్నాలతో సమానమైన బ్రాహ్మల భోజనానికి వంకపెట్టగలనా అన్నపూర్ణ తల్లీ? ఒక్క మారు మా ఇంటివద్ద కటిక ఉపవాసాలు ఉంటున్న మా ఇంటావిడా, పిల్లలూ గుర్తొచ్చి"

"ముందు కాస్త ఎంగిలి పడండి మాస్టారూ. తర్వాత ఓ పది రూపాయలు ఇస్తాను కొంత సర్దుబాటవుతుంది"

ఆ రోజుల్లో పదిరూకలకి బస్తా బియ్యం వచ్చేవి. కానీకి, దమ్మిడీకి గూడా విలువ ఉండేదంటే అతిశయోక్తికాదు.

●●●

అప్పుడు నేను మూడోక్లాసు చదువుతున్నాను. సత్యం మాష్టారు మా చేత గుండ్రంగా ముత్యాల కోవలాంటి అక్షరాలు రాయించి స్కూల్లో చెప్పే పాఠాలే కాకుండా పెద్ద బాలశిక్ష, సుమతీ శతకం, కృష్ణ శతకం, దాశరధీ శతకం వల్లెవేయించేవారు. మగపిల్లలచేత కుమార శతకం, ఆడపిల్లలచేత కుమారీ శతకం బట్టీపట్టించేవారు. మాచేత గజేంద్ర మోక్షం, ఆడపిల్లలచేత రుక్మిణీ కల్యాణం చదివించేవారు. ఆయన లెక్కలు బోధపరిచినాక ఆ మెలుకువలు జన్మలో ఎన్నడు మరపురాకుండా ఉండేవి.

ఒకరోజు మా ట్యూషన్ ఐనాక మా అమ్మమ్మ అడిగింది.

"మాష్టారూ! మండపం దగ్గర కూరల మార్కెట్టు వద్ద ఎలిమెంటరీ స్కూల్లో మీరు టీచరుగా పనిచేసేవారటగా? అది ఏమయింది?"

"ఏం చెప్పనమ్మా? కోటవీధి చివర గుడిసెలో మా కాపురం. మిలటరీనుండి తిరిగి వచ్చిన తర్వాత ఏ దారీలేక ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా చేరాను. అందరిలో మంచిపేరు తెచ్చుకున్నాను. ఖర్మకాలి నా తల్లికి మతిచలించి చూరులో దాచిన నా సర్టిఫికెట్లన్నీ చించి పొయ్యిలో పెట్టి తగలేసింది.

దరిద్రుడు తలకడిగితే వడగళ్ళ వానట. అన్ని దరిద్రాలూ నా నెత్తికే చుట్టుకుంటాయి. ఆ మర్నాడు ఇన్‌స్పెక్షను. హెడ్మాష్టరు రంగమన్నారుతో జరిగినదంతా చెప్పాను. ఆయన అసలే చండశాసనుడు. ఐనా ఏ మూలో రవ్వంత మానవత్వం లేకపోలేదు.- సరేలే ఏదో ఒకటి కమ్ముకుని వస్తాను. పాఠాలు తిన్నగా చెప్పి నా పేరు దక్కించు.- అన్నాడు. సరేనని ఆ విషయంలో తప్పుపట్టకుండా జాగ్రత్త పడ్డాను. పైగా పిల్లల తల్లిదండ్రులందరి సమర్ధనా వుండి ఆ సరికి బైటపడ్డాను. కానీ ప్రతి ఆరునెలలకీ అదే తంతు. అంతేకాక పిల్లలందరి దృష్టిలో నేను దేవుణ్ణని పేరు తెచ్చుకోవడం కూడా నా పాలిట శాపమయింది. గిట్టని సహోపాధ్యాయులు ఒకసారి స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌కి నిజం చెప్పేశారు. దాంతో అతడు రెచ్చిపోయి హెడ్ మాస్టర్‌ని తలవాచేలా చివాట్లు పెట్టి నా ఉద్యోగం ఊడగొట్టాడు. దరిమిలా నేను రోడ్డున పడ్డాను.

పాపం. సాతాని వైష్ణవుడైన రంగమన్నారుగారు ఎన్నదగిన మనిషి. ఉపకారస్తుడు.

'ఏం చేస్తాం సత్యం? నా చేతిలో ఉన్నదంతా నేను చేశాను. దైవం అనుకూలించలేదు. చుట్టూవుండే శనిగ్రహాల ప్రభావం నీపైన పడింది. ఆ మాత్సర్యాలు తట్టుకోవడం దేవతలకే సాధ్యం కాదు. మానవ మాత్రులం మనమెంత? - సరే ఒక పని చెయ్యి ఈ స్కూల్లో చదివే పిల్లలందరి తల్లిదండ్రులతో చెప్పిచూస్తాను. వాళ్ళ ఇళ్ళకి పోయి ట్యూషన్లు చెప్పుకుని జీవనం సాగించు. అసలే బహు కుటుంబీకుడివి. ఐనా నారుపోసినవాడు నీరుపొయ్యక మానడులే' అని నన్ను ఓదార్చి మాట నిలబెట్టుకున్నారు. అప్పటినుండి బతుకుబండిని ఈ విధంగా నెట్టుకొస్తున్నానమ్మా?"

"మరి పిల్లలెవరైనా చేతికందారా?"

"ఏం చెప్పనమ్మా? అంతా నత్తా నామా. పెద్దవాడు త్రిపాద నక్షత్రంలో పుట్టాడేమో? అగమ్మకాకిలా అల్లరిచిల్లరగా తిరుగుతూ చివరికి అయోధ్యామైదానం పక్కన మారుతీ వ్యాయామ శాలలో చేరి సాముగరిడీలు నేర్చుకుంటూ, కుస్తీపోటీలకి తయారౌతున్నాడు. ఏమిరా చదువు మానుకుని ఏమిటీపని? - అని వాడి తల్లి అడిగితే - అక్కడైతే మూడు పూటలా తిండిపెట్టి పందెపుగొర్రెని మేపినట్టు చూడు తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ తిండిలేక మలమలమాడుతూ ఎముకల గూళ్ళలా ఎలా తయారయ్యారో? నన్నైనా తిన్నగా బతకనీ - అని సవాలు విసిరాడు. మరి వాడు చెప్పిందీ నిజమేకదా?"

"ఔను మాష్టారూ - అవన్నీ కఠోర సత్యాలు. నిజమెప్పుడూ నిష్ఠూరంగానే ఉంటుంది."

మాష్టారు వెళ్ళడానికి ఉద్యుక్తులై లేచి చివరి మెట్టుపై ఒక్క క్షణమాగి ఆలోచనలో పడ్డారు. ఆయన ఎంతటి స్వాభిమానపరుడో అమ్మమ్మకి తెలుసు.

"ఏం మాష్టారూ - ఏదో అడగబోయి ఆలోచిస్తున్నట్లున్నారు?"

"ఏమీ లేదమ్మా - మా ఆవిడకి ఒక దబ్బకాయ పచ్చడి ముక్క వుంటే?"

"సంకోచమెందుకు? మా ఇంటినిండా ప్యారీవారి పింగాణీ జాడీల నిండా రకరకాల ఆవకాయలు, పచ్చళ్ళు ఏటి పొడుగునా సిద్ధంగా ఉంటాయని తెలుసుగా? ఉండండి తెస్తా" అని చెప్పి చిన్న జాడీనిండా ఆ సరుకు నింపి -

"మళ్ళీ విశేషమా?"

ఆయన సిగ్గుపడిపోయి "ఔనమ్మా" ఆ జాడీ తీసుకుని నిష్క్రమించారు.

"పాపం దరిద్రనారాయణులకే గంపెడంత సంతానం. డబ్బుతో పుచ్చిపోయేవాళ్ళకి కొనుక్కుందామన్నా పిల్లలు దొరకరు" - అనుకుంది అమ్మమ్మ. ఆనాటికి సంతాన నిరోధం అనే మాటే ఎరగరు ప్రజాబాహుళ్యం.

●●●

పదిహేనేళ్ళ తరువాత విశాఖపట్నంలో లెక్చరర్ ఉద్యోగం వెలగబెడుతున్న నేను ఏదో పనిమీద మా ఊరు వచ్చాను పూల్‌బాగ్ రోడ్డులో రాజారాం మేడవద్ద ఎప్పటిలాగే ఎండలో గొడుగులేకుండా చెమటతో తడిసి ముద్దయి తలవంచుకుని ఏదో ఆలోచిస్తూ నడిచి వెళుతూ కనపడ్డారు సత్యం మాష్టారు.

నేను ఎదురెళ్ళి పలకరించాను. వెండి బుట్టలా నెరిసిన జుత్తుతో, ముడతలు పడిన మొహంలో లోతైన కళ్ళలో మినుకు మినుకుమంటున్న దీపంలా వెలిగే జీవశక్తితో నావైపు చూశారు. గుర్తుపట్టలేదు. నేను వంగి పాదాభివందనం చేశాను. ఆయన కళ్ళు చెమర్చాయి.

"ఎవరు బాబూ నువ్వు?"

నన్ను పరిచయం చేసుకుని "మాష్టారూ - అంతా కులాసాయేనా?" అని అడిగాను.

ఆయన వేదాంతిలా గంభీరంగా నవ్వారు.

పిల్లలంతా చెరోదారీ పట్టారు. భార్య గతించింది, ఒంటరిగా మిగిలిన ఆయనకి ఆఖరి కూతురు ఆసరా అయింది. ఆమె మగని మంచితనం వల్ల అభిజాత్యం చంపుకుని వాళ్ళ పంచనచేరి జీవితం వెళ్ళమారుస్తున్నారు మాష్టారు. అలవాటు మార్చుకోలేక ఒకటో రెండో ట్యూషన్లు చెపుతూ అలా వచ్చిన నాలుగురాళ్ళూ కూతురిచేతిలో, మనవడి చేతిలో పెడుతున్నారట.

ముందు ఆయనని నీడలోకి తీసుకువెళ్ళి చల్లటి సోడా ఇప్పించాను. (అప్పటికి ఇంకా కోక్, పెప్సీలాంటివి దిగుమతి కాలేదు) సేద తీరాక వంద రూపాయల నోటు ఆయన చేతిలో పెట్టాను.

"ఏమిటి బాబూ ఇది?"

"గురుదక్షిణ మాష్టారూ - ఉంచండి"

సజల నయనాలతో "ఏనాడో నావద్ద చదువుకున్న నువ్వు నన్ను గుర్తుంచుకుని పలకరించడమే పదివేలు. ఈ రోజుల్లో నీలాంటి వాళ్ళు ఎంతమంది ఉన్నారయ్యా? కాలం మారుతోంది - మనుషులూ మారుతున్నారు. వాళ్ళతో పాటు విలువలూ మారుతున్నాయి. పదికాలాలపాటు చల్లగా ఉండి వృద్ధిలోకిరా నాయనా" నిండుగా మనసారా దీవించారు.

పని ఒత్తిడి వల్ల ఆయనతో ఎక్కువసేపు గడపలేనందుకు క్షమాపణ కోరి వదలలేక వదలలేక బయలుదేరాను. మళ్ళీ ఆ నడిచే దైవాన్ని చూడగలనో లేనో?

●●●

మరో పదేళ్ళకి ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాను. మా డిపార్ట్‌మెంట్ రజతోత్సవాలు ఘనంగా ఏర్పాటు చేశాం. ఆ సందర్భంగా సెమినార్లకి దేశ విదేశాలనుండి ఎంతోమంది వక్తలు హాజరై తమ విద్యుత్తును ప్రదర్శించారు. ఎన్నారైలు తమవంతుగా మాటసాయం ఆర్థిక సాయం అందజేస్తామని వాగ్దానం చేశారు. ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన సభలు ముగిసేరోజు వచ్చింది. ఆనాడు అందంగా హుందాగా ఉన్న ఒక మహిళ నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

"మీది విజయనగరం అట కదా?"

నేను వినయంగా "ఔనండీ" అన్నాను.

పూర్వకాలంలో గజపతుల ఆస్థానంలో ప్రఖ్యాతిగన్న అడిదం సూరకవి వంటి మేటి కవులే కాక గురజాడ వారు, అజ్జాడ, ఆదిభట్ల నారాయణదాసుగారు, ద్వారం వెంకటస్వామి నాయుడుగారు, కోడిరామ్మూర్తిగారు వంటి ప్రసిద్ధులకీ, సంస్కృత, సంగీత, శాస్త్రీయ కళాశాలలకీ నిలయమైన విజయనగరమందు ఆమెకి గల ఆసక్తి ఏమిటో?

అక్కడక్కడ నెరిసిన కురులు సవరించుకుంటూ ఉద్విగ్నతతో - "ఎన్నో విషయాలు గుర్తుకొస్తున్నాయి. చాలాకాలం కిందట నా క్లాస్ మేట్ సత్యనారాయణ అని కోట ఎదురుగా వీధిలో ఉండేవాడు. ఆ స్ఫురద్రూపి ఇప్పుడు ఎలా ఉన్నాడో - ఏం చేస్తున్నాడో? ఐనా తాడూ బొంగరం లేకుండా మాట్లాడితే మీకేం తెలుస్తుంది? ఇది ఏనాటి మాట? ఐనా లక్షోపలక్షల్లో ఆయన జాడ ఎలా కనుక్కోవడం?"

"ఆయన ఎన్నడైనా మిలటరీలో పనిచేశారా?"

"నేనూ మీరూ ఒకే వ్యక్తి గురించి మాట్లాడితే సత్యనారాయణ చాలా గంభీరమైన వ్యక్తి. నిండైన వ్యక్తిత్వంగల మనిషి. మేమిద్దరం ప్రేమించుకున్నాం. వాళ్ళు సిష్టి(సృష్టి)కరణాలు. మేము క్షత్రియులం. కులాలు వేరని వాళ్ళ అమ్మ మా వివాహాన్ని తిరస్కరించింది. అతను విరక్తితో మిలటరీలో చేరాడు. నేను పై చదువులకై విదేశాలకి పోయాను. అక్కడే స్థిరపడ్డాను. మళ్ళీ ఇదే పుట్టినగడ్డకి తిరిగిరావడం."

నేను నాకు తెలిసిన సత్యం మాష్టారి కథ చెప్పాను. ఆమె హృదయం ద్రవించింది.

"నేను నా సత్యాన్ని కలవాలి. అతనిని అవహించిన పెద్దమ్మని పారద్రోలాలి. నా ఆస్తినంతా అతనిపేర రాసి అతని పాదసేవలో నా శేషజీవితం సార్థకం చేసుకోవాలి. నాతో మీరుకూడా వచ్చి మీ మాస్టార్ని చూపగలరా?"

"అంతకంటే మాహాభాగ్యమా మేడమ్?"

మాటల్లో ఆమె అవివాహిత అని తెలుసుకున్న నాగొంతులో ఏదో అడ్డం పడినట్లయింది, ఆందోళనతో నా నోట మాటరాలేదు.

రైల్వే స్టేషన్లో దిగి పెద్ద చెరువు గట్టమ్మట, గంట స్థంభం దాటి, పైడితల్లమ్మ గుడిదాటి, మూడు లాంతర్లు - బొంకులదిబ్బ దాటి, కోట ముఖద్వారం దాటి, మూడు కోవెళ్ళు దాటి, కస్పా కోట వీధి చేరుకున్నాం.

భోగట్టా చేసి అతికష్టం మీద మాష్టారి కూతురింటికి వెళ్ళాం. చంకలో బిడ్డతో ఆమె గుడిసె బయటకి వచ్చి ప్రశ్నార్థకంగా చూసింది.

ఉద్వేగం అణచుకుని "సత్యం మాస్టారు.." అర్ధోక్తిలో ఆగాను.

ఆమె కన్నీరు మున్నీరై "మనకికలేరు. రెండు నెలలైయింది" అని దుఃఖం ఆపుకోలేక లోనికిపోయింది.

మేమిద్దరం శిలా ప్రతిమల్లా నిశ్చేష్టులమై నిలిచాము.

●●●

# కృష్ణమూర్తి కళ్ళు

నాగేంద్ర కాశి

**కృష్ణమూర్తి పుట్టి బుద్దెరిగాక ఏ ఒక్కడికీ ఏ చిన్న సహాయమూ** చేసి ఎరగడు. దారినపోయేవాడికి కనీసం పచ్చిమంచినీళ్ళయినా ఇచ్చిన పాపాన పోడు. అందుకే కాబోలు కృష్ణమూర్తి ఇంటిదగ్గర, ఆ చుట్టుపక్కలా కాకులు కూడా పెద్దగా కనపడవు. అవికూడా మనల్ని రోజూ చూస్తాయిగా. ఆ మాత్రం గ్రాహక శక్తి ఆ దేవుడు వాటికీ ఇచ్చే ఉంటాడు.

అలాంటి కృష్ణమూర్తిని ఓ చిన్న సాధారణ సంఘటన, చిన్నపాటి కలకలాన్ని రేపింది అతని మనసులో. అది ఏమిటంటే..

ఆ సాయంత్రం పూట ట్రాఫిక్ చాలా ఎక్కువుంది. ఏదో పనిమీద బయటికెళ్ళిన కృష్ణమూర్తి ఆ ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాడు. ప్రభుత్వాన్ని, పెద్ద పెద్ద హారన్‌లు కొడుతున్న బస్సుల్నీ, జనాల్నీ తిట్టుకుంటూ స్కూటర్ నడుపుతున్నాడు. ఇంతలో ఓ చౌరస్తా దగ్గర రెడ్ సిగ్నల్ పడింది. కీచుమంటూ అన్నీ ఆగాయి.

రెడ్ సిగ్నల్ పడిన వెంటనే బిలబిలమంటూ అడుక్కునే వాళ్ళు, చిన్న చిన్న బొమ్మలు అమ్మేవాళ్ళూ కార్లమధ్యా, స్కూటర్ల మధ్యా, బస్సుల మధ్యలో దూరిపోతున్నారు.

ఒక ముసలాయన ముందుకు పడిపోతూ కృష్ణమూర్తి భుజాన్ని పట్టుకుని లేచి "ధర్మం సేయండి బాబూ" అన్నాడు.

అసలే కోపం మీదున్న కృష్ణమూర్తి వాడు చెయ్యి మీద వేసేసరికి మరింత కోపోద్రిక్తుడై "ఏం కళ్ళు కనబడడంలేదా? చెయ్యేసి మరీ అడుగుతున్నావ్" అన్నాడు.

"సమించండి బాబూ. నేను పుట్టి గుడ్డిని"

పాపం గుడ్డివాడ్ని తిట్టానన్న చిన్న పశ్చాత్తాపంతో తనకలవాటు లేని ఓ పనిచేశాడు. ఒక రూపాయి దానం చేసి బండిపోనిచ్చాడు.

కళ్ళు లేకపోతే నిజంగా బాధే. అమ్మా, నాన్న, అక్క, తమ్ముడూ ఎలా ఉంటారో తెలీదు. పొద్దున్నంటారు, సాయింత్రం అయిందంటారు అవెలాగుంటాయో తెలీదు. చివరికి తినే అన్నం ఎలా ఉంటుందో కూడా తెలీదు. పాపం వాళ్ళ జీవితం నిజంగా దుర్భరమే అని ఆలోచిస్తూ వెళుతుండగా పెద్ద హోర్డింగొకటి కనిపించింది కృష్ణమూర్తికి.

"మీరు లోకాన్ని చూడ్డం అయిపోతే మీ కళ్ళు మాకివ్వచ్చుగా. మేమూ చూస్తాం" అని దానిమీద రాసుంది.

నగరంలో పేరున్న ఒక ఐ బ్యాంక్ చారిటీ సంస్థ వారిదా ప్రకటన.

చూశాడు. పట్టించుకోలేదు.

కానీ అది మనసు పొరల్లోకి వెళ్ళి నిక్షిప్తమై, దాక్కుందనీ ఏదో రోజు దావానంలా బయటికొస్తుందని ఆ క్షణానికి కృష్ణమూర్తికి తెలీదు.

ఆయాసపడుతూ ఇంటికొచ్చాడు. భార్య అనసూయమ్మ మంచినీళ్ళిచ్చింది.

"ఏంటండీ ఆలస్యం" అని అడిగింది.

"వెధవ ట్రాఫిక్కు" అంటూ మున్సిపాలిటీ వాళ్ళని తిట్టాల్సిన తిట్లన్నీ భార్యదగ్గర వెళ్ళగక్కాడు.

రాత్రి భోజనం చేస్తుండగా కరెంటు పోతే చార్జింగ్ లైట్ తీసుకొద్దామని హాల్లోకి వెళ్ళి సరిగా కనిపించక టీపాయ్ మీద పడ్డాడు కృష్ణమూర్తి. మోకాలికి కొంచెం దెబ్బ తగలడంతో "అమ్మా" అని అరిచాడు. దాంతో కంగారు పడిన భార్య "మీకెందుకండీ.. కనిపించనప్పుడు నే తీసుకొస్తాగా" అంటూ లేవదీసింది కృష్ణమూర్తిని.

సరిగ్గా కరెంటొచ్చింది. కృష్ణమూర్తి ఊపిరి పీల్చుకున్నాడు. 'రెండు నిమిషాలు కరెంటు పోతే మూడో నిమిషంలో పడ్డానే పాపం వాడు ఆ ట్రాఫిక్ లో ఎలా తిరిగాడో పాపం' అనుకున్నాడు మనసులో.

కృష్ణమూర్తి రిటైరై రెండు సంవత్సరాలు కావొస్తుంది. కొడుకులు, కూతుళ్ళకు పెళ్ళిళ్ళయి వేర్వేరు ఊళ్ళలో కాపురముంటున్నారు. ఏదో పండగకో పబ్బానికో వచ్చిపోతుంటారు. ఇక ఆ ఇంట్లో ఉండేది కృష్ణమూర్తి అతని భార్య అనసూయమ్మే.

పడుకున్నాక మోకాలు కొంచెం నొప్పిగా ఉండడంతో చేత్తో కాలుని నిమురుకుంటూ ఆలోచిస్తున్నాడు. ఆ రోజంతా జరిగిన సంఘటనల సమాహారం కళ్ళెదుట కనబడింది. ముఖ్యంగా ఆ 'హోర్డింగ్'. కళ్ళు మూసుకున్నాడు. అంతా చీకటి. శూన్యం.

మరి జీవితాంతం ఇదే చీకటయితే ఇంత శూన్యమే అయితే ఠక్కున కళ్ళు తెరిచాడు.

మనిషి మారడానికి ఒక్క సంఘటన చాలు. ఒక్క మాట చాలు నిజంగా మనసుతో స్వీకరిస్తే.

కృష్ణమూర్తి సగం మారాడు

కొన్నాళ్ళకి కృష్ణమూర్తికి బాగా జబ్బుచేసింది. హాస్పిటల్‌లో చేర్చారు. కొడుకులొచ్చారు. కూతుళ్ళొచ్చారు.

కృష్ణమూర్తి పెద్దకొడుకుని పిలిచి "బాబూ నేను నా కళ్ళు దానం చేద్దామనుకుంటున్నాను. నేను చనిపోయిన తర్వాత నా కళ్ళు ఒకరికి వెలుగునిస్తాయని, వారి జీవితంలో సంతోషంతో నింపుతాయని తల్చుకుంటేనే గొప్ప ఉద్వేగం కలుగుతుంది.

నువ్వు దానికి సంబంధించిన ఏర్పట్లు చూడు. అలాగే రామ్మూర్తిని కూడా ఒకసారి పిలిపించు. వాడితో ఒకసారి మాట్లాడాలి" అన్నాడు.

"అయినా నీకేం కాదు నాన్నా. డాక్టర్ గారితో మాట్లాడాను. ఏం పర్వాలేదన్నారు. రెండు మూడురోజుల్లో డిశ్చార్జి చేస్తామన్నారు. నువలాంటి ఆలోచనలేం పెట్టుకోకు.

కళ్ళుదానం చేయడానికి పెద్ద ఏర్పాట్లేం అవసరం లేదు. చిన్న సంతకమొకటి చాలు. అదెప్పుడైనా చెయ్యొచ్చు.

"సరే నేను రామ్మూర్తి అంకుల్‌కి ఫోన్ చేసి రమ్మంటాను" అన్నాడు.

"పుట్టుక గురించి మనకు తెలియకపోవచ్చు గానీ ఆత్మీయంగా పలకరించడానికొచ్చే మరణం గురించి మన అంతరాత్మకు ముందే తెలిసిపోతుంది. మరణం ఓ గొప్ప సుఖం" అన్నాడు కృష్ణమూర్తి. కొడుకేమీ మాట్లాడలేదు.

కొంతసేపటికి స్నేహితుడు రామ్మూర్తి వచ్చాడు. అంతకముందే రామ్మూర్తికి పెద్దకొడుకు అన్నీ చెప్పాడు కళ్ళదానం గురించీ, ఆరోగ్యం గురించి, కొంచెం వింతగా మాట్లాడుతున్న వాళ్ళనాన్న గురించి.

"మంచి పనిరా కళ్ళివ్వడం. నాకు తెలిసిన ఓ కుర్రాడున్నాడు. పాపం వాళ్ళది మధ్య తరగతి కుటుంబం. కుర్రాడు బాగా తెలివైన వాడు. వాళ్ళది మధ్య తరగతి కుటుంబం. కుర్రాడు బాగా తెలివైన వాడు. వాడికిస్తే వాడికి, వాడి కుటుంబానికి గొప్ప మేలు చేసినవాడవవుతావు" అన్నాడు రామ్మూర్తి ఆరోగ్యం గురించి వాకబు చేస్తూ.

"సరే కానీ ఆ కుర్రాడిని ఒక్కసారి నా దగ్గరికి తీసుకురాగలవా?" అన్నాడు.

"అదేం భాగ్యం రేపే తీసుకొస్తాను" అని వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఆ కుర్రాడిని వెంటబెట్టుకుని వచ్చాడు.

"బాబూ. ఏం పేరు నీది?" అడిగాడు కృష్ణమూర్తి.

"కారుణ్య సార్." అన్నాడు వినమ్రంగా చేతులు కట్టుకుని.

"నా కళ్ళు నీకిస్తాను. కానీ ఒక్క షరతు మీద. అది ఏమిటంటే నీకు కళ్ళొచ్చిన తర్వాత 'నువ్వు ఏమేం చూశావ్', 'నీకు లోకం ఎలా ఉంది', 'అసలు కళ్ళెందుకు ముఖ్యం' ఇవన్నీ ఒక డైరీలో రోజూ వ్రాయి. నేను ఏదో రోజు వస్తాను. అదంతా చూస్తాను. వీడు చచ్చిపోతే ఎలా వస్తాడని అనుకోకు. తప్పకుండా వస్తాను" అన్నాడు గంభీరంగా.

"సరేసార్, నేను వ్రాస్తాను"

కుర్రాడితో పాటు రామ్మూర్తి వెళ్ళిపోయాడు.

ఇది జరిగిన కొన్నాళ్ళకి కృష్ణమూర్తి చనిపోయాడు. అతని కళ్ళు కారుణ్యకి అమర్చారు.

కారుణ్యకి ఇప్పుడు కళ్ళొచ్చాయ్. చెప్పిన మాట ప్రకారం అతనూ రోజూ వ్రాసుకుంటూ పోతున్నాడు.

ఇక కృష్ణమూర్తిదే ఆలస్యం రావడానికి, అది చదవడానికి. ఐదు సంవత్సరాల తర్వాత ఒకరోజు జోరుమని వర్షం పడుతుంది ఆ రాత్రి. పెద్ద పెద్ద ఉరుములు, మెరుపులు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం. కరెంట్ కూడా పోయింది. మెరుపుల వెలుగులో క్యాండిలొకటి వెలిగించి టేబుల్ మీద పెట్టి చిన్నగా కిటికీ తలుపు తీసి పడుకున్నాడు కారుణ్య.

కృష్ణమూర్తి వచ్చాడు.

అతను వ్రాస్తున్న డైరీ టేబుల్ పైన ఉంది.

కృష్ణమూర్తి చదవడం ప్రారంభించాడు.

●●●

సార్. ఈ రోజు మొట్టమొదటి రోజు. కళ్ళకి ఆపరేషన్ చేసారు. కొంచెం నొప్పిగా ఉంది. కళ్ళకు చుట్టిందేదో గుడ్డ తీస్తున్నారు.

నాకు. ఆనందం. కళ్ళొస్తే అన్నీ చూడొచ్చు. వెలుగులు, వెన్నెల రంగులు, నింగి, నేల, నీరు, నిప్పు, అమ్మ, నాన్న. మనసులో ఎంతో ఉత్కంటత, ఉద్వేగం, సంబరం. కళ్ళు నెమ్మదిగా తెరవమన్నారు డాక్టరుగారు. తెరిచాను. ఎదురుగా అమ్మ.

కానీ నాకు దైవం కనపడింది. నాకిన్నాళ్ళూ దేవుడు ఎక్కడో గుళ్ళోనూ, కొండలమీద ఉంటాడని చెప్పారందరూ.. అ

కానీ మొదటిసారి అది తప్పనిపించింది నాకు.

దేవుడు ఆకలేస్తే అన్నం తినిపిస్తాడని, బాధొస్తే తల నిమురుతాడనీ, నిద్రొస్తే లాలిపాడతాడనీ, నేనేడిస్తే తనూ ఏడుస్తాడనే, నవ్వితే తనూ నవ్వుతాడనీ నాకెవ్వరూ చెప్పలేదు సార్.

మా అమ్మ.

నా కనులు చేసిన ఆది కార్యం.

కళ్ళొక్కటే చేయగలిగిన పుణ్యకార్యం.

పాపం నాకోసం బెంగపెట్టుకుందనుకుంటాను. కళ్ళకింద నల్లని చారలు, ఒరిసిన చేతులు, పగిలిన పాదాలు. నేను చూసేసరికి మా అమ్మ కళ్ళవెంబడి కన్నీళ్ళు. ఒక్కమాట మాటాడ్లేదు. నన్నింకా ముట్టుకోనూ లేదు. కానీ అశ్రుధార... ఆ బాధ మనసు కల్పించిందే కావచ్చు కానీ వ్యక్తపరిచేది ...నిశ్శబ్ధంగా ఒక్క కళ్ళు మాత్రమే.

అది చూసిన నా కళ్ళ వెంబడి మహోత్కృష్టమైన గంగా ప్రవాహం వంటి జలధార. ఇవేనా కన్నీళ్ళంటే?

ఇంత బాధకి, ఇంత ఆనందానికి, ఇంత గొప్ప ప్రేమకీ భౌతిక రూపం... కళ్ళు వెలువరిస్తాయా?!

కళ్ళు కావాలి సార్..

మనకోసం పరితపించే ఎన్నో అశ్రునయనాలను చూడడానికి, మనల్ని ప్రేమించే 'మూర్తి'ని చూడడానికి, స్పృశించడానికీ కళ్ళుకావాలి. కళ్ళొక్కటే కావాలి.

ఆ రోజు నాకు నిద్రపట్టలేదు. కళ్ళు మూసుకుంటే చీకటి. ఇన్నాళ్ళూ నన్ను భయపెట్టిన చీకటి శాశ్వతం అయిపోతుందేమోనని భయం.

తర్వాత రోజు.. మా ఊరు ప్రయాణం. రైల్లో కిటికీ పక్కన కూర్చున్నాను. రైలు కదిలింది. పొలాల మధ్యనుంచీ, కొండలు, గుట్టల మధ్యనుంచీ రైలుతో పాటూ చెట్లు, చేమలు, కొంగల గుంపులూ, అన్నీ పరిగెడుతున్నాయ్. అబ్బ ఎంత బాగుందీ లోకం.!

దేవుడు ఎంత బాగా సృష్టించాడు. ప్రతీదాంట్లో అందంతోపాటూ, ఆనందం కూడా పెట్టి ఉంచాడేమో. అందుకే అందంగా ఉన్నదేదయినా ఆనందాన్నిసుంది కళ్ళకి.

కృష్ణమూర్తి మనసు ఝల్లుమంది. ఇంకో పేజీ తిప్పాడు.

మనం విన్న ఒకమాటగానీ, మనం నోటిద్వారా వ్యక్తపరిచే ఒక భావంగానీ కళ్ళతో మాట్లాడిన దానికి ఏమాత్రం సరిపోవు.

భావాన్ని వ్యక్తపరచడానికి భాషను ఆశ్రయిస్తే ఆ భాషలోని అక్షరాలు ఆభావం తాలూకు బరువుని ఏ మాత్రం మొయ్యలేవు. ఆ అక్షరాల శక్తి సరిపోదు ఒక బలమైన భావానికి, అది మోసే క్రమంలో రూపాంతరం కూడా చెందుతూ ఉంటుంది. ఇది ఋజువయ్యింది నా ప్రేమ విషయంలో సార్.

ఈ రోజు చివరి రోజు కాలేజీలో. అన్ని రోజుల్లో నేను ఒక్కమాట కూడా మాట్లాడలేదు ఆ అమ్మాయితో కేవలం కళ్ళతో తప్ప.

'నేనంటే ఇష్టమేనా?' అని చాలామంది అడుగుతుంటారు ఎదుటివాళ్ళని.

నాకెందుకో ఆ అవసరం లేదు అనిపిస్తుంది. మనస్సు నిర్మలంగా ఉంచుకుని అవతలి వ్యక్తి కళ్ళల్లోకి చూస్తే సరిపోతుంది. అవతలి మనసులో ఏముందో తెలుసుకోడానికి నేనదేపని చేశాను. నాకు తెలిసింది ఆ అమ్మాయి నన్నూ ప్రేమిస్తుందనీ.. నేను విన్న ఆ పాట కూడా అదే చెప్పింది.

"గుండెల్లో ఏముందో... కళ్ళల్లో తెలుస్తుంది.."

మరో పదిపేజీలు తిప్పాడు కృష్ణమూర్తి.

నాకు ఉద్యోగం వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. కష్టాలన్నీ తీరిపోతాయని, అమ్మా, నాన్న, చెల్లిని బాగా చూసుకోవచ్చనీ..

నాకు కళ్ళు రానప్పుడు ఒకరోజు మా అమ్మని అన్నం తినిపిస్తుంటే 'అన్నం ఎలా ఉంటుందమ్మా?' అని అడిగాను సార్.

'అన్నం తెల్లగా స్వచ్ఛంగా ఉంటుంది బాబూ. అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని చెప్పింది మా అమ్మ.

నేను నవ్వి 'తెలుపెలా ఉంటుందీ' అనడిగాను. మా అమ్మ ఏడ్చిందనుకుంటాను. ఆమె కన్నీళ్ళు నా చేతులపై పడుతున్నాయ్. ముక్కు తుడుచుకుంటూ 'నీ మనసులాగే ఉంటుంది బాబూ' అంది. కొంచెం పోల్చుకోగలిగాను. కానీ పూర్తిగా కాదు. కానీ ఈ రోజు తెలిసింది. మా అమ్మ తప్పు చెప్పింది.

అది మా అమ్మా, నాన్నల్లా ఉంటుందని అది కూడా కళ్ళు గ్రహిస్తాయని పేజీలు తిప్పుతున్నాడు.

ఏదైనా మనకు వినిపించి అర్ధం కాకపోయినా, మనం మాట్లాడి ఏదైనా చెప్పలేకపోయినా కళ్ళతో ఆ పని చెయ్యొచ్చు. అర్ధమయ్యేట్లు చెయ్యొచ్చు. కళ్ళకి మాత్రమే ప్రతిపాదింపబడిన గొప్ప వరం అది. అక్షరాలు అవసరంలేని, లిపితో సంబంధంలేని భాష

ఏదైనా ఉందీ అంటే ప్రపంచంలో... అది కళ్ళతో మాట్లాడే భాష మాత్రమే. విశ్వజనీనమైన భాష. 'యూనివర్సల్ లాంగ్వేజ్' అది కళ్ళకి మాత్రమే సాధ్యం అని తెలుసుకున్నాను సార్.

నేను చూసిందానికన్నా, వ్రాసిందానికన్నా మీరు ఇంకా గొప్పగా చూసుంటారు ఈ ప్రపంచాన్ని కళ్ళతో.

కృష్ణమూర్తికి గతుక్కుమంది గుండెలో.

మొన్నెవరో అంటుంటే విన్నాను సార్. కళ్ళు దానం చేసిన వారు చనిపోయిన తర్వాత పైలోకంలో గుడ్డివాళ్ళుగా బాధలు పడతారని, వచ్చే జన్మలో గుడ్డివాళ్ళుగా పుడతారని.

నాకు నవ్వొచ్చింది.

నేత్రదానం చేశారు కాబట్టి పైలోకం అంటే స్వర్గానికే వెళతారు వాళ్ళ మాటల ప్రకారమే అనుకుందాం.

స్వర్గంలో ఏముంటుందీ బాధలు, కష్టాలు, కన్నీళ్ళు - ఇవేమీ లేని ప్రదేశం - ఇది కూడా వాళ్ళ మాటల ప్రకారమే. ఏ బాధ లేకుండా ఉంటే కొన్నాళ్ళకి అది కూడా తీవ్రమైన బాధైపోతుందని నా అభిప్రాయం.

ఇక్కడ కష్టం ఉంటుంది కాబట్టి సుఖం విలువ తెలుస్తుంది. బాధ ఉంటుంది కాబట్టి ఆనందం విలువ తెలుస్తుంది.

స్వార్థం ఉంటుంది కాబట్టి ప్రేమ గొప్పతనం అర్థమవుతుంది. చెడ్డమనుషులుంటారు కాబట్టి మంచి మనిషిగా బతికే అవకాశముంటుంది.

ఇవేమీ లేని లోకం నిజంగా అందంగా, ఆనందంగా ఉంటుందా? ఇంత గొప్పలోకం చూడని కళ్ళు చచ్చిన తర్వాత వేరే లోకంలో ఉపయోగపడతాయి అని అనుకోవడంలో స్వార్థంలేదూ?

మీరుంటే సరాసరి మీ దగ్గరికే తీసుకు వచ్చేవాడిని. మానవత్వం మనిషి రూపంలో ఉంటే ఎలా ఉంటుందో చూపించడానికి.

మీరిచ్చిన ఈ కళ్ళతో మంచి మంచి పుస్తకాలు చదివాను. మంచి ప్రదేశాలు చూశాను. మంచి మనుషుల్ని చూశాను.

పండు వెన్నెలలు, పరవశించి పారే సెలయేళ్ళు, ఉద్ధృతంగా సాగే నదులు, మారే ఋతువులు, విరిసే పువ్వులు, చంటి పాప నవ్వులు, నింగిన పోయే పక్షులు. ఒకటేమిటి విశ్వసృష్టిలో నేను చూడగలిగినన్ని.

ఎన్ని జన్మలెత్తినా మీ ఋణం తీర్చుకోలేను సార్.

నా తల్లితండ్రులు నన్నీలోకానికి తీసుకొస్తే, మీరు ఈ లోకం ఎలా ఉంటుందో చూపించారు.

అందుకే మీ కళ్ళు నాతోనే చచ్చిపోకూడదని నేనూ దానం చేసేశాను ఈవాళ. నా మరణాంతరం తీసుకోమని.

కృష్ణమూర్తి ఒక్కసారి తన గతాన్ని గుర్తుచేసుకున్నాడు. కళ్ళతో ఇన్ని చెయ్యొచ్చా?!

చేతులున్నాయ్. కాళ్ళున్నాయ్. అలాగే కళ్ళున్నాయ్ అనుకున్నాను ఇన్నాళ్ళూ.

అయ్యో! ఇప్పుడేం చేసిలాభం.

అవును. ఒకసారి నేను ఆఫీసుకెళ్ళి ఇంటికి లేటుగా వచ్చినప్పుడు నా భార్య గేటు దగ్గరే నుంచునుంది. వెళ్తూనే 'చీకట్లో ఎందుకు నుంచున్నావ్' అని కసురుతూ వెళ్ళిపోయానే గానీ ఒక్కసారి ఆమె మొహం వంక చూడలేదే! ఆ ప్రేమని నా కళ్ళతో పరికించలేకపోయానే.

వర్షం వస్తుంటే తలుపేసుకున్నా గానీ కొంచెం సేపు ఆ వర్షంలో అందం, ఆనందం కళ్ళతో ఆస్వాదించలేదే?

వయసు మీద పడుతున్న మా అమ్మ మొహం మీద ముడతల్ని గమనించిన నా మనవడి చిరునవ్వుని దగ్గరగా గమనించానా.. ఈ కళ్ళతో!

జరిగినవన్నీ తలుచుకుంటే కృష్ణమూర్తికి దుఃఖం ఆగలేదు. ఉప్పెనలా పెల్లుబికింది. అలలా మనసులోంచి ఎగసింది. మళ్ళీ డైరీ వంక చూశాడు.

'ఈ రోజు నేను ఆఫీసు నుండి వస్తుంటే మధ్యలో ఒక హోర్డింగ్ కనిపించింది సార్. అది కొంచెం పక్కకి వంగిపోయింది. దానిమీద.

'మీరు లోకాన్ని చూడడం అయిపోతే మాకివ్వచ్చు కదా. మేమూ చూస్తాం' అనుంది నా ఆశయాన్ని గుర్తుచేస్తూ. వెళ్ళి నా ఆశయాన్ని నిలబెట్టాను.

రోజుకెంతోమంది చనిపోతుంటారు. వారిలో సగం మంది అయినా నేత్రదానం చేస్తే ఎంతోమంది జీవితాలు బాగుపడతాయి. ఇదే ఆశయంతో ముందుకెళుతున్నాను మీ స్ఫూర్తితో.

ఇంక దుఃఖం ఆగలేదు కృష్ణమూర్తికి.

కారుణ్య ఉలిక్కిపడి లేచాడు ఒక్కసారిగా. మొహం అంతా తడిసిపోయింది. కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయ్. ఆపుదామన్నా ఆగడంలేదు.

ఎందుకో అర్థంకాలేదు కారుణ్యకి.

చుట్టూ చూశాడు. బయట వర్షం తగ్గింది. క్యాండిల్ ఇంక ఆరిపోతూ ఉంది.

టేబుల్ వైపు చూశాడు.

**ఆ సన్న వెలుగులో డైరీలో పేజీలు రెపరెపలాడుతున్నాయ్ !**

●●●

# సంధ్యావందనం

సత్యం మందపాటి

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో ఎంపికైన ఉత్తమ కథానిక

**ఆ రోజు తల్లితో పాటూ తను కూడా షాపింగుకి వెళ్ళింది సంధ్య.**

అమ్మ ఇండియన్ కూరగాయలూ పప్పులూ మొదలైనవి కొంటుంటే సంధ్యకి ఏమీ తోచక షాపు బయటికి వెళ్ళే చోట, తలుపుకి పక్కనే వున్న మేగజైన్లు చూస్తున్నది.

శుక్రవారం సాయంత్రం అవటం వల్ల లక్ష్మి తీరిగ్గా షాపింగ్ చేస్తున్నది.

పదేళ్ళ సంధ్య తల్లితో పాటూ ఇండియన్ గ్రోసరీ షాపుకి వచ్చింది. అక్కడ పుస్తకాలూ, పేపర్లూ చూస్తున్న సంధ్య దృష్టిని ఆకర్షించింది 'ఆస్టిన్-ఇండియా' మాసపత్రిక. నెలకి ఒకసారి వచ్చే ఆ ఇంగ్లీష్ పేపర్లో అమెరికాలో ఇండియన్స్ గురించి,

ఆస్టిన్ సిటీ వార్తలే కాకుండా హ్యూస్టన్, డల్లస్ మొదలైన నగరాల వార్తలూ విశేషాలూ వేస్తుంటారు. అంతేకాదు అలాటి పత్రికలు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. దానిలో ముఖ్యంగా ముందు పేజీలో వున్న ఒక కథనం సంధ్యని అక్కడినించీ కదలనీయలేదు. ఆ పత్రికని చేతుల్లోకి తీసుకుని చదవటం ప్రారంభించింది.

ఈలోగా లక్ష్మి తన షాపింగ్ పూర్తిచేసుకుని వచ్చి 'పద వెడదాం!' అంది సంధ్యతో.

కారులో లక్ష్మి సంధ్యతో ఏదో మాట్లాడుతూనే వున్నా, సంధ్య పేపర్ చదవటంలో నిమగ్నమయిపోయింది.

'ఏమిటే! అంత దీక్షగా చదువుతున్నావ్?' అని అడిగింది లక్ష్మి నవ్వుతూ.

'ఉదయ్! ఉదయ్ గురించి. నాకు దీంట్లో కొన్ని మాటలు పూర్తిగా అర్థం కావటం లేదు' అంది సంధ్య.

అమెరికాలో పుట్టి పెరిగిన సంధ్య, లక్ష్మి తెలుగులో అడుగుతుంటే ఎక్కువగా ఇంగ్లీషులోనే సమాధానాలు చెబుతుంది.

'ఉదయ్ అనే ఈ అబ్బాయి డల్లస్ దగ్గర వేకో అనే వూళ్ళో వుంటాడుట. అతనికి ఏదో జబ్బు వచ్చిందిట... ఆ పేరే ఏమిటో తెలియటం లేదు... నేనెప్పుడూ వినలేదు' అంది సంధ్య.

'స్పెల్ చేయి' అడిగింది లక్ష్మి.

'ఎల్ ...' అంటూ నెమ్మదిగా ఒక్కొక్క అక్షరమే, ఆ స్పెల్లింగ్ చెప్పింది సంధ్య.

'అయ్యో! పాపం. లుకీమియా వచ్చిందా... అబ్బాయికి ఎన్నేళ్ళేమిటి?' అడిగింది లక్ష్మి.

'నా వయసే! పదేళ్ళుట! లుకీమియా అంటే ఏమిటి...' అడిగింది సంధ్య.

'లుకీమియా అంటే ఒక విధమైన కాన్సర్. కాన్సర్ లాటి వ్యాధుల్ని తొందరగా కనుక్కుంటే తగ్గించే అవకాశాలు వున్నాయి కానీ, కనుక్కోవటం ఆలస్యమయితే... కష్టం' అంది లక్ష్మి.

'అంటే పాపం, ఉదయ్ చచ్చిపోతాడా?' అడిగింది సంధ్య.

'ఛ! మనకి వివరాలు తెలియకుండా అలా అనకూడదు. ఒక పని చేద్దాం. ఇంటికి వెళ్ళాక నేను కూడా ఆ కథనం పూర్తిగా చదువుతాను. అప్పుడు చెబుతాను అదేమిటో.. '

అలాగేనని తలవూపింది సంధ్య.

****

అప్పటికే ఆఫీసునించీ వచ్చాడేమో, సూరి కాఫీ కలుపుకుని తాగుతూ, ఆ రోజు మైల్ చూస్తున్నాడు.

తెచ్చినవన్నీ పాంట్రీలోనూ, ఫ్రిజ్‌లోనూ సర్దుకునేటప్పటికి పావుగంట పట్టింది. అప్పటి దాకా పేపర్లో ఆ కథనాన్ని చదువుతూనే వుంది సంధ్య. అంటే ఆ వార్త ఆ పిల్లని ఎంతగా ఆకర్షించిందో లక్ష్మికి అర్థమయిపోయింది. వెంటనే వెళ్ళి సోఫాలో సంధ్య పక్కనే కూర్చుని తనూ చదవసాగింది. లక్ష్మి చదువుతున్నంతసేపూ, ఆమెనే చూస్తూ కూర్చున్నది సంధ్య.

చదవటం పూర్తయాక లక్ష్మి చెప్పింది 'ఉదయచంద్రన్ పదేళ్ళ కుర్రాడు. అమెరికాలో పుట్టి పెరిగాడు. బాగా నీరసంగా వుంటుంటే, అతని నాన్నగారు రామచంద్రన్ ఎన్నో పరీక్షలు చేయించారుట. అప్పుడే తెలిసింది అతనికి లుకీమియా (కాన్సర్) వచ్చిందని. కీమోథెరపీలాటివి - అంటే ఎన్నో కెమికల్స్ శరీరంలోకి ఎక్కిస్తారన్నమాట, అవి చేస్తున్నారుట కానీ ఏమీ ఫలితం కనపడటం లేదుట! అతని శరీరంలో రక్తం కూడా రెండుసార్లు పూర్తిగా మార్చారుట!'

'మరయితే ఆ అబ్బాయికి ఎలా తగ్గుతుంది?' కుతూహలంతో అడిగింది సంధ్య.

సూరి కూడా ఆసక్తితో తల్లీకూతుళ్ళ సంభాషణ వింటున్నాడు.

'బోన్ మేరో పరీక్ష అని, అది చేయాలి. బోన్ మేరో అంటే నడుము దగ్గర వున్న ఎముకలలో నించి జెల్లీలాటి ఒక పదార్థాన్ని తీసి, ఆ అబ్బాయికి ఎక్కించి వైద్యం చేస్తారన్నమాట. అలా చేస్తే అతని రక్త కణాల్లో నిరోధక శక్తి పెరుగుతుంది. అవి కాన్సరుని నిర్మూలించటానికి ప్రయత్నం చేస్తాయి'

'మరి ఆ పని ఏదో చెయ్యొచ్చు కదా!' అడిగింది సంధ్య.

'చెయ్యవచ్చు. కానీ అంత సులభం కాదు. ఇక్కడ అమెరికా లెక్కల ప్రకారం 20 వేల మంది దగ్గర బోన్ మేరో తీసుకుంటే, ఒక్కళ్ళది మేచ్ అయే అవకాశాలు వుంటాయిట. మన భారతీయ సంతతికి చెందినవారిలో ఆ నిష్పత్తి ఇంకా ఎక్కువ. ఆ అబ్బాయికి భారతీయుల బోన్ మేరోనే మేచ్ అయే అవకాశాలు ఎక్కువ. అయినా అలా బోన్ మేరో ఇవ్వటానికి సిద్ధంగా వున్నవాళ్ళు ఇక్కడ మనలో అంతమంది లేరుట. అందుకని ఈ వార్త చదివిన వాళ్ళందరినీ బోన్ మేరో ఇవ్వగలిగితే ఇవ్వండి అని అతని నాన్నగారు, ఒక స్వచ్ఛంద సంస్థ కలిసి అడుగుతున్నారు' అంది లక్ష్మి.

'మరి ఒక మనిషి అలా చచ్చిపోతుంటే మనవాళ్ళు ఎందుకు ముందుకి రారూ?' అడిగింది సంధ్య.

సూరి అన్నాడు 'అమెరికన్స్ లాగా ఎక్కువమంది ముందుకు రాకపోయినా, మనవాళ్ళల్లోనూ కొంతమంది వస్తారు. కానీ వాళ్ళంతట వాళ్ళు రావటం తక్కువ. చూద్దాం బోన్ మేరో దొరుకుందనే ఆశిద్దాం'

సంధ్యకి వాళ్ళమ్మ చిన్నప్పుడు ఆ అంటే వస్తుందా, ఊ అంటే వస్తుందా అని చెప్పిన కథ గుర్తుకి వచ్చింది. అందుకే నవ్వింది. 'ఆశిద్దాం అంటే వస్తుందా? మనమేం చేయక్కర్లేదా?' అని అడిగింది.

ఆ చురుకైన ప్రశ్నకి బిత్తరపోయాడు సూరి.

'నీకెందుకే ఆ అబ్బాయి మీద ఒక్కసారిగా అంత ఇష్టం వచ్చిందీ?' అంది లక్ష్మి ఆశ్చర్యపోతూ.

'మనవాళ్ళు ఎవరూ ముందుకి రారన్నావు, మరి మనమూ అంతేనా? మనం ముగ్గురం పరీక్ష చేయించుకుంటే?' అంది సాలోచనగా సంధ్య.

సూరి ముఖకవళికలు ఒక్కసారిగా మారిపోయాయి. 'అవును. మనం కూడా పరీక్ష చేయించుకుని చూద్దాం. బోన్ మేరో సరిపోతే అంతకన్నా కావాల్సింది ఏముంది' అన్నాడు.

చేతిలోని పేపర్ అతనికి అందించింది లక్ష్మి 'ఇందులో రామచంద్రన్ ఫోన్ నెంబరూ, ఆ సేవా సంస్థ ఫోన్ నెంబరూ వున్నాయి. పిలవండి' అంది.

వాళ్ళకి ఫోన్ చేసి చాలసేపు మాట్లాడాడు సూరి.

అతను ఫోన్‌లో వున్నంతసేపూ, తండ్రినే చూస్తూ వింటున్నది సంధ్య.

ఫోన్ పెట్టేశాక అన్నాడు సూరి. 'ఎన్నో ప్రశ్నలు అడిగారు, వయసెంత, ఆరోగ్యంగా వున్నారా, మీ పేరు బోన్ మేరో డేటాబేస్‌లో పెడితే మీకు అభ్యంతరమా. ఇప్పుడు కాకపోతే, తర్వాత ఎవరికైనా సరిపోయే అవకాశం వుంది కదా.. ఇలా ఎన్నో... అసలు విషయం మర్చిపోయాను. బోన్ మేరో ఇవ్వాలంటే కనీసం 18 ఏళ్ళ వయసు వుండాలిట'

'ఆ మాట వినగానే నిరుత్సాహపడింది సంధ్య. అయితే నేను ఇవ్వటానికి వీల్లేదా?' అంది నీరసంగా.

లక్ష్మి సంధ్యని దగ్గరకు తీసుకుని 'మేమిస్తున్నాంగా. అదీ నువ్వు చెప్పాకనే! కనుక అది నువ్వు ఇచ్చినట్టే' అంది.

'నేను సోమవారం ప్రొద్దున్నే ఆఫీస్ పని మీద శాన్‌హోసే వెడుతున్నాను. రాగానే మనం చేసే మొదటి పని ఇదే!' అన్నాడు సూరి.

****

అన్నం తిన్న తర్వాత, మేడ మీద తన గదికి వెళ్ళిందే కానీ, ఆ ఆలోచనలు సంధ్యని వెన్నాడుతూనే వున్నాయి. చికాగోలో చదువుకుంటున్న అన్నయ్యని అడిగింది మనం ఏమన్నా చేయాలి అని.

'నీ కెందుకే! నువ్వు చదువుకో! పెద్దవాళ్ళున్నారు, వాళ్ళు చూసుకుంటారు' అన్నాడు.

ఆస్టిన్‌లోనే వున్న స్నేహితుడు వాసుని అడిగింది. అతను తనకలాటివి ఇష్టం లేదు అన్నాడు. చివరికి వందనని పిలిచింది. వందనకి పదహారేళ్ళు దాటాయి. సంధ్యకి వందన అంటే చాల ఇష్టం. అక్కా అక్కా అని పిలుస్తుంది.

వందన అంతా విన్నది. 'నేను కూడా బోన్ మేరో ఇవ్వటానికి వీల్లేదు. ఇంకా రెండేళ్ళాగాలి. ఇప్పుడేం చేద్దామంటావ్?' అని అడిగింది.

సంధ్య సాలోచనగా అంది 'ఉదయ్ బోన్ మేరో త్వరగా ఇవ్వకపోతే బ్రతకడు. మా నాన్నేమన్నాడంటే మనవాళ్ళు బోన్ మేరో ఇస్తారు కానీ, వాళ్ళంతటవాళ్ళు ఇవ్వరు అన్నాడు. మనం మనవాళ్ళందరి దగ్గరికీ వెళ్ళి అడిగితే? వాళ్ళ చేత పరీక్షలు చేయిస్తే?' అంది.

వెంటనే వందన ఉత్సాహంగా అంది 'అదే మనం చేయగలిగింది. ఇక్కడ తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, గుజరాతీ, హిందీ... ఎన్నో రకాల భారతీయులు వున్నారు కదూ. వాళ్ళల్లో ఏ ఒక్కళ్ళది సరిపోయినా చాలు, ఉదయ్ బ్రతుకుతాడు. మనిద్దరం మొదలు పెడితే, మన స్నేహితులు ఎంతమందో మనతో చేరతారు. అంతేకాదు మా నాన్న డాక్టర్ కదా. స్వంత క్లినిక్. కావలసిన పరీక్షల సంగతి ఆయన చూసుకుంటాడు. నాన్నతో మాట్లాడతాను. ఈలోగా నువ్వూ, నేనూ వేరు వేరు లిస్టులు తయారుచేద్దాం, ఎవరు మనకి సహాయం చేస్తారో, ఎవరు బోన్ మేరో ఇవ్వటానికి ముందుకు వస్తారో.. '

వందన ప్రోత్సాహమిస్తుంటే సంధ్య ఆనందానికి అవధుల్లేకపోయాయి. సంతోషంగా అంది 'ఇప్పుడే మొదలు పెడు తున్నాను లిస్టు. రేపు నేను మీ ఇంటికి రానా?' అడిగింది.

వందన ఇల్లు సంధ్య ఇంటికి రెండు రోడ్ల కవతల వుంటుంది. సంధ్య అంది 'నాకు కారు లైసన్స్ వచ్చేసిందిగా. మా అమ్మ కారు తీసుకుని నేనే వస్తాను. మంచి ప్లాన్ తయారు చేసి, రేపే పని మొదలెపెడదాం' అంది.

రాత్రి పన్నెండు గంటల దాకా వ్రాసుకుంటూనే వుంది సంధ్య.

సూరి క్రింద టీవీలో ఏదో సినిమా చూసి, పైకి వస్తూ 'ఏం నాన్నా! ఇంకా పడుకోలేదా?' అన్నాడు.

'పడుకుంటున్నాను' అని లైట్ ఆర్పేసి, ఆలోచిస్తూ పడుకుంది సంధ్య.

****

మర్నాడు ప్రొద్దున్నే వందన పెద్ద లిస్టు పట్టుకుని, తనతో పాటూ వాళ్ళ పక్కింటి డానీని కూడా తీసుకువచ్చింది. సంధ్య కూడా తను తయారు చేసిన లిస్టు ఇచ్చింది. ఇక ముగ్గురూ కూర్చుని ఒక ప్లాన్ తయారుచేయటం మొదలుపెట్టారు.

ముందుగా పేపర్లో పడిన వార్తని, బోన్ మేరో కావాలని అడిగిన విషయాలకి కొంత సమాచారం కలిపి, కొన్ని కాపీలు తీయించటం. డానీ అన్నయ్య మైక్‌కి ఒక కాపీ సెంటర్ వుంది. అతను ఫ్రీగా ఎన్ని కాపీలు కావాలన్నా చేసి ఇస్తానన్నాడు.

ఆ రోజు శనివారం. అక్కడవున్న హిందూ గుడి, సాయిబాబా సెంటర్, చిన్మయ మిషన్... అన్నిట్లోనూ ఒక పక్కన బల్ల వేసుకుని కూర్చోవటం. వచ్చే పోయేవారికి కాగితాలు పంచిపెట్టి అడగటం. వివరాలు ఇవ్వటం.

డానీ మర్నాడు ఆదివారం వాళ్ళు వెళ్ళే చర్చిలోనూ, తెలిసిన ఇంకా కొన్ని చర్చిలలోనూ పెడతానన్నాడు. అలాగే కొన్ని



కౌముది

ఇండియన్ షాపుల్లోనూ, రెస్టారెంట్లలోనూ కౌంటర్లు, కరపత్రాలు పెట్టటం. ఇంటింటికీ వెళ్ళి అడగటం, లేదా ఫోన్ చేసి అడగటం. సంధ్యకీ వందనకీ గర్ల్ స్కౌట్స్‌గా ఇలాటి వాటిల్లో అనుభవం వుంది. కాకపోతే ఈసారి ఇది కొంచెం పెద్ద ఎత్తున చేయాల్సివస్తున్నది. అదీకాక అన్నిచోట్లకీ వీళ్ళు ముగ్గురే వెళ్ళటం కష్టం. అదే ఎలా చేయాలో అర్థం కాలేదు. ఆ రెండు రోజుల శెలవు వాడుకోకపోతే, మళ్ళీ వారాంతం దాకా ఎవరికీ తీరికవుండదు. అందుకే ఎంతోమంది వాలంటీర్లు కావాలి.

'ఏం చేస్తున్నారే?' అంటూ వచ్చిన లక్ష్మిని చూడగానే, అదే అన్నది సంధ్య.

'నేనూ, నాన్నా సహాయం చేస్తాం. అంటే అప్పుడే ఇద్దరు. వందన వాళ్ళ అమ్మా నాన్నా. అంటే అప్పుడే నలుగురు'

సంధ్యకి అంతా అర్థమయిపోయింది. గబుక్కున వెళ్ళి తల్లిని ముద్దు పెట్టుకుంది.

వందన వచ్చి లక్ష్మిని కావలించుకున్నది.

లక్ష్మి డానీని దగ్గరకు తీసుకుని, అతని తల నిమిరింది ఆప్యాయంగా.

లక్ష్మి తీసుకువచ్చిన సమోసాలని సంధ్యకీ వందనకీ డానీకీ ఇచ్చి 'నిర్మలగారికీ సునీతాబెనర్జీకీ నీకు సహాయం కావాలని చెబుతాను. వాళ్ళు నిన్ను పిలిచి మాట్లాడతారు. సరేనా. ఒక్కమాట. చిన్న పిల్లలయినా మీరు ఎంతో మంచి పని చేస్తున్నారా. థాంక్యూ' అంటూ క్రిందకి వెళ్ళింది లక్ష్మి.

మెట్లు దిగి వస్తున్నప్పుడు ఆనందంతో చెమర్చిన కళ్ళు తుడుచుకుంది లక్ష్మి.

****

అనుకోవాలే కానీ, అనుకున్నది సాధించటం అన్నది మనిషికి వున్న గొప్ప లక్షణం. ఈదే చేపలని చూసి నావలనీ, జలాంతర్గాముల్నీ కనిపెట్టాడు. ఎగిరే పక్షుల్ని చూసి విమానాలు కనిపెట్టాడు. చంద్రమండలం మీద జెండా పాతాడు. స్వలాభాపేక్షతో, బద్ధకంతో, సామరస్య సహజీవనాన్ని మరిచిపోయి మూఢనమ్మకాలతో వెనక్కి వెడుతున్న, వెనక పడుతున్న మనుష్యులని ముందుకు నెట్టటానికీ, స్పందన అందించటానికీ, ఒక మహాత్మా గాంధీనో, మదర్ థెరసానో, అన్నా హజారేనో రానక్కర్లేదు. నిర్మల హృదయం, పట్టుదలలతో జీవితం మీద విలువ, విలువలతో జీవించటం తెలిసిన ఎవరికైనా అది సాధ్యమే! ఆఖరికి చిన్న పిల్లలయినా సరే ఆ స్పందన వచ్చిన తర్వాత ఇక ఆగరు.

ఆదివారం సాయంత్రానికల్లా నూట ఎనభై మంది బోన్ మేరో ఇవ్వటానికి ఒప్పుకుని, పరీక్షకి సిద్ధమయారు!

లక్ష్మికి సంధ్య పట్టుదల, ప్రాణం పోతున్న ఒక కుర్రాడికి ప్రాణం పోయాలనే తహతహ, వయసుకి మించిన కృషీ చూస్తుంటే, ఈ చిన్నపిల్లనేనా తను కని, పెంచింది అని ఆశ్చర్యంగా వుంది. తనని మించి పెరిగిపోయిన ఆ వ్యక్తిత్వం చూస్తుంటే లక్ష్మి మాతృహృదయం పొంగిపోతున్నది.

తను చేయవలసిందల్లా, సంధ్యకి అండగా నిలబడి కావాల్సిన సహాయం, సలహా అందించటం మాత్రమే.

సోమవారం ప్రొద్దున్నే, సూరిని ఎయిర్ పోర్ట్‌లో దించి వచ్చింది లక్ష్మి.

ఆరోజు రాత్రి సంధ్య ఉదయ్‌తో మాట్లాడతానంటే లక్ష్మి ఫోన్ చేసింది. ఉదయ్ నాన్న రామచంద్రన్ ఫోన్ తీసుకున్నాడు.

లక్ష్మి 'ఉండండి మా అమ్మాయికి ఇస్తాను' అని సంధ్యకి అందించింది ఫోన్ .

పక్కనే కూర్చుని వాళ్ళ మాటలు వింటున్న లక్ష్మికి అంతా వింతగా వుంది.

తనూ వందన, డానీ చేస్తున్న పనులన్నీ వివరంగా చెప్పింది. వచ్చే వారాంతం లోపల కనీసం నాలుగు వందల మందిని

డేటాబేస్‌లో పెట్టటం వాళ్ళ లక్ష్యం అని చెప్పింది. ఈలోగా వీళ్ళల్లో ఎవరి బోన్ మేరో అయినా సరిపోతే చెప్పమంది.

ఆయన ఏం చెప్పాడో కానీ సంధ్య కళ్ళల్లో నీళ్ళు వస్తున్నాయి. చివరికి ఉదయ్‌తో మాట్లాడవచ్చా అని అడిగింది. ఫోన్ తీసుకుని మేడమీద తన గదిలోకి వెళ్ళింది.

అప్పటికప్పుడే అతను పరిచయమైనా సంధ్య, ఉదయ్ ఎంతో ఆత్మీయులుగా మాట్లాడుకున్నారు. ఒక గంట పైగా!

దాదాపు ప్రతి రోజూ రాత్రి సంధ్య, ఉదయ్ ఫోన్‌లో చాలసేపు మాట్లాడుకుంటున్నారు. ఒక్కొక్కసారి సంధ్య సంతోషంగా వుంటుంది. ఒక్కొక్కసారి ఫోన్‌లో మాట్లడేటప్పుడు ఆ పిల్ల కళ్ళల్లో నీళ్ళు వస్తుంటాయి.

లక్ష్మి చూసి కూడా చూడనట్టు వుంటుంది.

****

రోజూ స్కూల్‌నించీ రాగానే గబగబా ఏదో తినేసి సంధ్య, లక్ష్మి కలిసి ఇంటింటికీ వెడుతున్నారు. ఫోన్ చేస్తున్నారు. అలాగే వందన, డానీ, మిగతా వాలంటీర్లు. సహాయం చేయటానికి ముందుకు వచ్చిన వాళ్ళు రామచంద్రన్నీ, సేవా సంస్థనీ పిలిచి, అప్పటికప్పుడే వివరాలు తెలుసుకుంటున్నారు. వాళ్ళు చెప్పినట్టు, చెప్పిన చోట పరీక్ష చేయించుకుంటున్నారు. ఆ వివరాలు కూడా వెంటనే వాళ్ళ డేటాబేస్‌లో పెట్టేస్తున్నారు. శనివారం సాయంత్రానికి, అంటే వారం రోజుల్లో మొత్తం నాలుగు వందల ఇరవై మంది సైన్ అప్ చేశారు. సూరి, సంధ్య వందన కలిసి మొదలుపెట్టిన పని ఎంత చకచకా నడుస్తున్నదో చూసి ఆశ్చర్యపోయాడు.

'మీ లక్ష్యాన్ని చేరుకున్నారు కానీ, ఇంతటితో ఆగవద్దు. ఇంకా ఎంతమంది ముందుకి వస్తారో చూద్దాం' అన్నాడు.

సంధ్య చెప్పింది 'రేపు మనం ముగ్గురం వేకో వెడుతున్నాం. ఉదయ్ రమ్మన్నాడు. వందన, డానీ, డానీ అన్నయ్య మైక్ వేరే కారులో వచ్చి మనల్ని అక్కడ ఒంటిగంటకు కలుస్తామన్నారు. సరేనా!'

'తప్పకుండా వెడదాం!' అన్నాడు సూరి.

మర్నాడు అనుకున్న టైముకి రామచంద్రన్ ఇంటికి వెళ్ళారు, సంధ్య, లక్ష్మి, సూరి.

రామచంద్రన్ భార్య సరస్వతి వచ్చి తలుపుతీసింది. చిరునవ్వుతో లోపలికి ఆహ్వానించింది. సంధ్యని దగ్గరకు తీసుకుని బుగ్గ మీద ముద్దుపెట్టింది. లక్ష్మి చేతిని ఆప్యాయంగా నిమిరింది.

రామచంద్రన్ మోకాళ్ళ మీద కూర్చుని, సంధ్య చేతిని తన చేతిలోకి తీసుకుని 'గ్రేట్ లిటిల్ లేడీకి ఎన్నో ఎన్నో థాంక్స్' అన్నాడు.

పక్కనే గదిలో పడుకుని వున్న ఉదయ్ దగ్గరికి వెళ్ళారు అందరూ. ఉదయ్‌కి జుట్టు పూర్తిగా వూడిపోయింది. బాగా సన్నగా వున్నాడు. కానీ ఆ ముఖంలో పసితనం, అందం తరగలేదు. సంధ్యని చూసి చిరునవ్వు నవ్వాడు. సంధ్య తన చేతిలో వున్న హాట్ అతనికి అందించింది.

ఈలోగా వందన, డానీ, మైక్ కూడా వచ్చారు.

డానీ, మైక్ ఇద్దరూ తమ చక్కటి రాగిరంగు జుట్టుని తీసేసి, నున్నగా గుండు కొట్టించుకు వచ్చారు.

వందన తను తెచ్చిన బేస్ బాల్, గ్లవ్ ఉదయ్‌కి అందించింది.

అందరూ అక్కడే ఉదయ్ మంచం దగ్గర కూర్చున్నారు.

రామచంద్రన్ అన్నాడు 'చిన్నపిల్లలయినా మీరు చేస్తున్న ఈ గొప్ప పనికి మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియటం లేదు. ఉదయ్ ఎవరు? మీరెవరు? ఎందుకు అంత సహాయం చేయాలి మీరు? మీలో నేను చూస్తున్నది మీరు చేస్తున్న సహాయం

ఒకటే కాదు. మనిషిలోని మానవత్వం ఎంత ఉన్నతంగా వుంటుందో, ఎలా స్పందించి బయటికి వస్తుందో! ఈ వయసులోనే సంధ్య, వందన, డానీ – వాళ్ళ వెనక పూర్తిగా నిలబడి ప్రోత్సాహమిస్తున్న, లక్ష్మి, సూరి, వందన తల్లిదండ్రులు, మైక్ ...'

ఆయన గొంతు గద్గదంగా అయింది. ఒక్క క్షణం ఆగి, కొంచెం తేరుకుని అన్నాడు.

'మీకొక చిన్న కథ చెపాలి. జరిగిన కథ. మహాత్మా గాంధీ స్వాతంత్ర పోరాటం జరిగే రోజుల్లో, ఒరిస్సా అనే రాష్ట్రంలో చరఖా సంఘం వారికి రోడ్ల మీద ప్రజల దగ్గర ధన సహాయం అర్థిస్తున్నాడు. ఇచ్చినవాళ్ళు ఇస్తున్నారు. లేని వాళ్ళు లేదు. ఇంతలో ఒక బిచ్చగత్తె, చిరిగిన బట్టలు, చింపి జుట్టు, చంకలో ఎండిపోయిన పసికూనతో వచ్చింది. ఒక రాగి నాణెం – ఆ రోజుల్లో దమ్మిడీ అంటారు – అమెరికాలో ఒక సెంటు, ఇండియాలో ఒక పైసలాటిదన్నమాట – ఆయన చేతిలో పెట్టి వెళ్ళిపోయింది. గాంధీగారి పక్కన వున్నాడు ఆ సంఘానికి కోశాధికారి జమన్‌లాల్ బజాజ్. తనకి ఎన్నో వందల రూపాయలు అందిస్తున్న గాంధీగారు, అతనికి ఆ రాగినాణెం ఇవ్వకుండా దాస్తుంటే అదేమిటని అడిగాడు బజాజ్. నీకు ఇస్తున్న వందల రూపాయల కంటే ఇది ఎంతో విలువైనది. పవిత్రమైనది. అందుకే నా దగ్గర భద్రంగా దాస్తున్నాను అన్నారు. మాకు ఉదయ్ విషయంలో ఎంతోమంది సహాయం చేస్తున్నా, సంధ్యా! నువ్వూ నీ స్నేహితులూ చేస్తున్న సహాయం నేను నా జన్మలో మరిచిపోలేను' అన్నాడు.

ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. మాట్లాడలేకపోయాడు. సరస్వతి ఆయన భుజం మీద చేయి వేసింది.

అక్కడ వున్న వాతావరణాన్ని కొంచెం తేలికపరుస్తూ డానీ 'ఊడే! నా గుండు కన్నా, మైక్ గుండు కన్నా కూడా నీ గుండే అందంగా వుంది' అన్నాడు మైక్ గుండు మీద చేత్తో రుద్దుతూ.

ఉదయ్ పకపకా నవ్వి, డానీ గుండు మీద చూపుడు వేలితో ఒక చిన్న దెబ్బ వేశాడు.

అందరూ లేచి వెళ్ళి పోబోతున్నప్పుడు ఉదయ్ అందరికీ నమస్కారం చేశాడు. సంధ్య చేయి పట్టుకుని మృదువుగా నొక్కాడు. డానీనీ, మైక్‌నీ కౌగలించుకుని, తన దగ్గర వున్న బేస్ బాల్ కాప్స్ ఇద్దరికీ తన గుర్తుగా ఇచ్చాడు.

సంధ్యకీ, వందనకీ పూలగుత్తులు ఇచ్చాడు.

****

తర్వాత రెండు రోజులకి రామచంద్రన్ దగ్గరనించీ ఫోన్ కాల్ వచ్చింది. సంధ్య తీసుకుంది.

ఆ అమ్మాయి ముఖ కవళికలు క్షణక్షణం మారుతున్నాయి.

లక్ష్మి ఆతృతగా సంధ్యనే చూస్తున్నది.

ఆయన మాటలు వింటున్న సంధ్యలో ఒక్కసారిగా సంతోషం పెల్లుబికింది.

'గుడ్ న్యూస్ అంకుల్. థాంక్స్. మా అమ్మకి చెబుతాను' అంది.

ఫోన్ పెట్టేశాక అంది 'మేచింగ్ బోన్ మేరో దొరికిందిట. ఐ యాం సో హాపీ' అంది ఎంతో ఆనందంగా.

లక్ష్మి ముఖం వికసించింది. 'ఎవరిదిట? మన ద్వారా ఇచ్చిన వాళ్ళేనా?' అడిగింది.

సంధ్య నవ్వింది. 'తెలీదు. నేను అడగలేదు. మనం చేయాల్సింది మనం చేశాం. ఎవరిదయితేనే, ఫలితం దక్కింది. ఉండు. వందనకి ఈ శుభవార్త చెప్పనీ!' అంది తృప్తిగా.

●●●

మరోలోకం

వేమూరి వేంకటేశ్వరరావు

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో ఎంపికైన ఉత్తమ కథానిక

**మిడతంభొట్లు మేష్టారు** తిరుగుడు కుర్చీలో కూర్చుని నెమ్మదిగా, గుండ్రంగా తిరుగుతూ గదంతా మరొకసారి కలయజూసేరు. ఎదురుగా గోడ మీద ఉన్న ప్రశంశా పత్రాలని ఇంకోసారి చూసుకున్నారు. గదిలో గోడలని ఆనుకుని నిలువెత్తు బీరువాలు పుస్తకాలతో పిటపిటలాడుతున్నాయి. నేల మీద ఖాళీ అట్ట పెట్టెలు పుస్తకాలని అందుకోటానికి తయారుగా ఉన్నాయి.

..ఎప్పటి ఆంధ్ర విశ్వకళా పరిషత్తు రోజులు? నలభై ఏళ్ళు నలభై నిమిషాలలా దొర్లిపోయాయి! ఎన్ని దూషణ భూషణ తిరస్కారాలు? ఇంకెన్నాళ్ళు ఈ పరిశోధన? ఇంకెన్నాళ్ళు ఈ దుక్ఌంకరణాలు? "సదసద్ వస్తువుల మధ్య గల తారతమ్యాన్ని తత్త్వవేత్తలు మాత్రమే గ్రహించగలరు" అని గీతలో చెప్పనే చెప్పేడు. శక్తి, గరిమ; అలలు, రేణువులు; అస్తిత్వం, నాస్తిత్వం; నిత్యం, అనిత్యం; అమరత్వం, మృత్యువు; దేహి, దేహం అనే ద్వయీభావాల మధ్య ఉండే అంతరాలు బహు సూక్ష్మం. ప్రకృతి రహశ్యాలని భౌతికశాస్త్రం ఛేదించలేకపోతే తత్త్వశాస్త్రమే శరణ్యంలా ఉంది. ఈ కోణం నుండి సత్యశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది ..

ఇలా ఆలోచనలు ఆయన మస్తిష్కంలో ఝుమ్మని చెలరేగుతున్నాయి.

మిడతంభొట్లు మేష్టారు నెమ్మదిగా కూర్చున్న కుర్చీలోంచి కిందకి ఒంగి నేల మీద చిందరవందరగా ఉన్న కాగితాలలో కొన్నింటిని ఏరి చేతిసంచిలో సర్దుకున్నారు. ఎదట బీరువా పై అరలో ఎన్నాళ్ళ బట్టో ధూళి పొరలు సంతరించుకుంటూన్న తత్త్వశాస్త్రపు పుస్తకాలు రెండు అందుకుందామని లేచి నిలబడ్డారు. వెంటనే కళ్ళు గిర్రున తిరిగి చీకట్లు కమ్మేయి. పడిపోకుండా బీరువానే సరాగా పట్టుకున్నారు.

..నెత్తురుపోటు ప్రభావం అయియుంటుంది. ఇటుపైన ఉన్నపట్టున గభాల్న లేవకూడదు ..

కొద్ది క్షణాలలో తేరుకుని కళ్ళు తెరచేరు. బీరువా పై వరుసలో ఉన్న పుస్తకాలన్నీ కంటి మట్టానికి ఒక అడుగు దిగువనే కనిపిస్తున్నాయి. బుర్ర కిందకి వంచి చూసేరు. కాళ్ళు నేలని ఆనటం లేదు! ఇది కళ్ళు తిరగటం కాదు; కాళ్ళు తేలటం!

నలభై ఏళ్ళ క్రితం సంగతి. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రాంగణంలో, అంతర్జాతీయ భౌతికశాస్త్ర సమావేశం జరుగుతోంది. ఆ సందర్భంలో ఇదే రకం అనుభవం కలిగింది ఈయనకి. మనిషి ఉన్నపాటున అమాంతం గాలిలో తేలిపోయేడు. భూమి ఆకర్షణ శక్తి ప్రాంతీయంగా పలచబారిందని - శాస్త్రీయత లోపించకుండా, కట్టుదిట్టంగానే - ఒక ఉపపాద్యాన్ని ప్రతిపాదించేడు. ఎవ్వరూ నమ్మలేదు. పైపెచ్చు కన్ను చెదిరిందేమో అన్నారు. కనికట్టు అన్నారు. పైత్యోద్రేకం అంటూ నాటు వైద్యాలు చేసేరు. గాలిదోషమేమో అంటూ భూత వైద్యుణ్ణి పిలిపించేరు. సీల ఒదులై ఉంటుందని హేళన చేసేరు. క్రమేపీ అంతా మరచిపోయేరు. ఇన్నాళ్ళ తరువాత మళ్ళా అదే అనుభూతి!

ఇప్పుడు పూర్వపు మిడతంభొట్లు కాదు. ఈయన సిద్ధాంతాలని అవహేళన చేసినవాళ్ళు ఎంతమంది ఉన్నారో ఆదరించి అందలం ఎక్కించినవాళ్ళూ అంతమంది ఉన్నారు. నోబెల్ బహుమానం గెలుచుకున్న తొలి తెలుగువాడు! అయినప్పటికీ సాపేక్షత్వ

వేగంతో ప్రయాణం చేసే కేరం బోర్డు పిక్కతో కొట్టి తోటి సహాధ్యాయుడిని హత్య చేసేడన్న నేరం మీద తీహార్ జైల్లో వారం రోజులు నిర్బంధించేరు. సాక్ష్యాధారాలు సరిపోక ఒదిలేసేరు. అఖండ మేధావంతుడు అని కొందరనుకుంటే, చిత్తచాంచల్యం ఉన్న వ్యక్తి అని అనుకునేవాళ్ళు లేకపోలేదు.

.. వైద్యుడిని చూసే వేళవుతోంది. రాధ వచ్చి తీసుకెళతానంది ..

ప్రస్తుతపు పరిస్థితులలో వైద్యం వల్ల ఉపశమనం ఉండదని ఆయనకి తెలుసు. వైద్యుడు చెయ్యబోయే రోగనిర్ణయం ఏముంటుంది? వార్ధక్యం వల్ల వచ్చే వర్టిగో అనబడే తలతిప్పు కావచ్చు అంటాడు. దానికి కారణం మధ్య చెవిలో ఉండే కాలువలలో ఖటిక రేణువులు పేరుకోవటం వల్ల సంతులన యంత్రాంగం సరిగ్గా పని చెయ్యకపోవటం అంటాడు. ఇవన్నీ కళ్ళు ఎందుకు తిరుగుతున్నాయో చెబుతాయి కాని గాలిలో కాళ్ళు తేలిపోవటం సంగతి? దానికి మానసిక వైద్యం కావాలంటాడు. మానసిక వైద్యుడేమంటాడో కూడ మిడతంభొట్లు మేష్టారు ఊహించగలరు. ఈ పరిస్థితికి ఏ డిసోసియేషన్ డిసార్డర్ అనో ఒక ఇంగ్లీషు పేరు పెట్టి భూస్థాపిత ప్రక్రియలలాంటివి సాధకం చేస్తే సరిపోతుందంటాడు. వాళ్ళెవరూ ఏమీ చెయ్యలేరని తనకి తెలుసు.

ఏ మానసిక నిపుణుడి సహాయం లేకుండానే మిడతంభొట్లు మేష్టారు పుస్తకాల బీరువా అంచు పట్టుకుని నెమ్మదిగా నేల మీదకి దిగేరు. కుర్చీలో కూర్చుని ఉద్విగ్నతకి, రాటానికి తావివ్వకుండా నిదానంగా ఆలోచించటం మొదలు పెట్టేరు.

ఇంతలో దోమల హోరులా మంద్ర స్థాయిలో అస్పష్టమైన రొద వినబడింది. కంటికి ఎదురుగా వర్ణనాతీతమైన ఒక అసమాన్య దృశ్యం సాకారం పొందటం మొదలయింది. ఎదురుగా ఉన్న ప్రదేశం ప్రకాశమానమై, క్రమేపీ సాంద్రమానమైన ఒక కారం సంతరించుకుంటోంది. పారదర్శకంగా ఉన్న ప్రదేశం ముందుగా మసకబారింది. క్రమేపీ రేఖాకృతి చెందింది. అటుపైన స్థూలరూపం దాల్చి, దరిదాపు మానవాకృతిలో, ఎదురుగా ప్రత్యక్షమైంది - ఒక శాల్తీ!

అది కలా, కనికట్టా, మాయా? లేక, పొరుగు గదులలో పూర్ణప్రతిబింబాలతో ( హోలోగ్రాములు తో) ప్రయోగాలు చేస్తూన్న విద్యార్థులు ఈ గదిలోకి వారి సమాచారాన్ని ప్రక్షేపిస్తున్నారా?

ఎదురుగా ప్రత్యక్షమైన శాల్తీ సన్నగా, నిలువెత్తు పొడుగు ఉంది. మిలమిల మెరిసే రజత అంగరక్ష లాంటి ఉడుపులు. రెండు కాళ్ళు. పాదాలు మాత్రం వెనక్కి తిరిగి లేవు! ..నాలుగు చేతులు ఉన్నాయా? అవి చేతులేనా? .. శిరోభాగం కూడ మిలమిల మెరుస్తూ కోలగా, నున్నగా ఉంది. మానవాకృతి ఉంది కాని మానవుడు కాదేమో!.

"ఏమి అనుకుంటున్నారో తెలుసు నాకు. ఇది మనిషా కాదా అని కదూ?"

..ఇదేదో మాట్లాడుతోంది! పైపెచ్చు తనకి అర్థం అయే భాషలో మాట్లాడుతోంది! గొంతుక ఎప్పుడో, ఎక్కడో విన్నట్లు ఉందే ..

మదిలో మెదులుతూన్న బెదురుని అదుపులో ఉంచి, అవును. అదే అనుకుంటున్నాను అంటూ బింకంగానే సమాధానం చెప్పేరు మేష్టారు.

"భూలోకిని కాదు నేను. మరోలోకం మాది. అరవై జ్యోతిర్వర్షాల దూరం నుండి వచ్చేను. మీ ధనూరాశిలో కనిపిస్తుంది మా తార. ప్రభుత్వపు సిబ్బందిలో పనిచేసే నౌకరుని; కలనయంత్రాల అదుపులో చాకిరీ చేసే చాకరుని కాను. బుద్ధిశాలిని. బాధ్యత తెలిసిన వాడిని. ఇంతవరకు చెప్పేది నమ్మగలరా?"

"నమ్మజాలని నిజాలు ఎన్నో చూసేను. సిద్ధాంతాలకి లొంగని నిజాలని చూసిన తరువాత నా సిద్ధాంతాలనే సవరించుకున్న సందర్భాలు ఉన్నాయి. నేను కనేది, వినేది తర్కరహితం కానంతసేపు నమ్మటానికే ప్రయత్నం చేస్తాను."

" నమ్మకం కుదిరిందా? అంత జోరుగా?"

"పామరులు, స్వకపోలకల్పితాలైన సిద్ధాంతాలని గుడ్డిగా నమ్మేవాళ్ళు నమ్మకపోవచ్చు. పాండిత్యము, ప్రతిభలతో పాటు తెగువ ఉన్నవాళ్ళు నమ్మగలరు . నువ్వు ఫలానా రాశిలోని, ఫలానా నక్షత్రం చుట్టూ తిరిగే ఫలానా గ్రహం నుండి వచ్చేనని చెబుతున్నావు కదా. నీ ఆకార వికారాలు చూసినా, నీ మాట విన్నా నమ్మాలనే అనిపిస్తోంది."

" ఇప్పుడు ఎందుకు వచ్చేనో తెలుసుకోవాలని లేదా?"

"ఎందుకు లేదు? కుతూహలం అనేది లేకపోతే శాస్త్రవేత్తని ఎలా అవుతాను?"

"భూలోకులందరిని, కాపాడటానికి వచ్చేను."

"ఇప్పుడు మాకొచ్చిన ఉపద్రవం ఏమిటి? ఈ భూగ్రహం మీద ఉన్న ప్రజలంతా ఎల్లప్పుడు ఏదో ఒక మిష మీద కొట్టుకు చస్తూనే ఉన్నారు, నిజమే. కణికాస్త్రాలు, అణ్వాస్త్రాలు ఎప్పుడు ఏ ముప్పు తెస్తాయో తెలియదు కదా. హరితగృహ వాయువులు పెరిగిపోయి మా గ్రహం వేడెక్కిపోతే ఎదురయే ప్రళయాన్ని తలుచుకుని కొందరు భయపడుతున్నారు. గతి తప్పిన గ్రహశకలాలు వచ్చి భూమిని గుద్దుకుంటే జీవకోటి అంతా చచ్చిపోతుందని కొందరు ఆందోళన పడుతున్నారు. ఇవన్నీ మా ఈతి బాధలు; మీవి కావు. ఒక మహాకవి చెప్పినట్లు పీత కష్టాలు పీతవి. వీటి నుండి తప్పిస్తామంటూ ఎక్కడో జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న మరొక లాతి సమాజం మాకు దూతని పంపటమా? ఈ ప్రతిపాదన తర్కబద్ధంగా లేదు."

"ఎదురుగా వస్తోంది పెను ముప్పు. ఈతి బాధలని మీరు జాబితా వేసిన ఇబ్బందులన్నీ - ఏమిటబ్బా ఆ మాట ఆం కేవలం నేపథ్యపు రొద. చిరాకు పెట్టేవి. చెప్పులోని రాళ్ళ వంటివి. తల్చుకుంటే వాటిని ఎదుర్కో గలరు మీరు. వచ్చేది పెద్ద ప్రమాదం. మరొక 200 ఏళ్ళల్లో - అదే, మీ కాలమానంలో - మీ పొరుగున ఉన్న ఒక పెద్ద తారలో పెనుమార్పు వచ్చి పేలిపోతుంది. ఈ పేలుడులో పుట్టే శక్తి తరంగాలు ఎంతో వేగంతో వచ్చి మీ పరిసరాలని ఢీకొనటం వల్ల మీ పొరుగు తారలన్నీ పూర్తిగా నశించిపోతాయి. చుక్కలే నాశనం అయిపోతూన్నప్పుడు వాటితోపాటు గ్రహాలకి కూడ అదే గతి. గ్రహాల మీద ఉన్న జీవాలు అంతం అవటం తప్పేది కాదు."

" మా లోకం అంతం అయిపోతోందని జోశ్యం చెప్పి మమ్మల్ని బెదిరించటానికి ఇక్కడే మాకు ఎంతోమంది ఉన్నారు. రేపటితోటో మాపటితోటో మా పని సరి అని రారా చెబుతూనే ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నాం. మీరు చేసిన విశ్లేషణ తో మీలో మీకు ఏకాభిప్రాయం ఉందా?"

" నమూనాల మీద, అంచనాల మీద మాకు గట్టి నమ్మకం ఉండబట్టే మావాళ్ళు ఇంత దూరం దూతని పంపేరు. ఈ రకం పేలుడు మీ పొరుగునే ఉన్న క్షీరసాగరంలో జరగబోతోందని మా నమూనాలు ఒకసారి చెప్పేయి. చెప్పినట్లే ఈ మధ్య అటువంటి పేలుడు జరగటం వల్ల మా నమూనాల మీద నమ్మకం పెరిగింది మాకు. "

..సా. శ. 1987లో పాలపుంత క్షీరసాగరానికి పొరుగున ఉన్న పెద్ద మేజిలాన్ మేఘంలో ఉన్న ఎస్.ఎన్ 1987 అనే నీలి బృహత్ మహాతార బృహత్ నవ్యతారగా మారి పేలిపోవటం హబుల్ స్పేస్ టెలిస్కోప్ నమోదు చేసి సంచలనమే సృష్టించింది; అప్పటివరకు అరు బృహత్ మహాతారలే బృహత్ నవ్యతారలై పేలిపోగలవనే సిద్ధాంతం వీగిపోయింది. మన సూర్యుడు ఇలా పేలిపోటానికి అవకాశం లేదు కాని, మన పొరుగున ఉన్న ఎన్నో నీలి బృహత్ మహాతారలలో ఒకటి ఇలా పేలిపోవచ్చు. మన ఇల్లు దిట్టంగా ఉన్నప్పటికీ పొరుగున ఉన్న ఇల్లు కాలిపోతే అది మన మనగడకి ముప్పు తెస్తుంది కదా. పొరుగువాడు ఎలాపోతే మనకేమి అని చూస్తూ ఊరుకోటం విజ్ఞుల లక్షణ ం కాదు కదా! ఈ ఆగంతకుడితో మరికొంచెం మాట్లాడి చూడాలి.

" దూతని పంపవలసిన అవసరం ఏమి వచ్చింది? వార్తని పంపితే సరిపోయేది కదా? "

" వార్తనో, దూతనో పంపాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం, చాల కాలం నుండి. నలభై ఏళ్ళ క్రితం - మీ కాలమానం ప్రకారం - దూతని పంపి ఈ వార్తని మీకు అందజేద్దామని మొదట ప్రయత్నించేం. అప్పట్లో దూ-రవాణా మీద మా పరిశోధనలు పండలేదు; మా ప్రయోగం పూర్తి కాకుండా గిపోయింది. "

"అప్పుడు దూతని ఎక్కడికి పంపటానికి ప్రయత్నం చేసేరు?"

"మీ దగ్గరకే! నలభై ఏళ్ళ క్రితం గాలిలోకి తేలిపోతూన్నట్లు అనుభవం అయింది మీకు. అవునా? అనుభవం కలగటానికి అప్పుడు మేము చేసిన ప్రయోగాలే కారణం. చూడండి! మా శాల్తీలని దూ-రవాణా చెయ్యాలనుకున్నప్పుడు పెద్దగా ఉన్న శాల్తీని రవాణా చెయ్యటం కష్టం. అందుకని శాల్తీలలో ఉన్న జన్యు సమాచారాన్ని ముందు కుదిస్తాం. కుదించి, ఒక గణిత సమీకరణంలో ఇముడ్చుతాం. ఇమిడ్చి, సమీకరణాన్ని మాత్రం వాకేతాలుగా మార్చుతాం. మార్చి, వాటిని స్థలకాల సమవాయంలో ఉన్న గుళిక సొరంగాల ద్వారా ప్రసారం చేస్తాం. అలా అవి అడ్డదారుల వెంట ప్రయాణం చేసి గమ్యం చేరుకున్న తరువాత మా సమీకరణం చెప్పిన ప్రకారం గమ్యంలో ఉన్న పదార్థాన్ని కూడగట్టి దానికి రూపు, ఆకారం వచ్చేలా చూస్తాం. ఈ పని జరిగేటప్పుడు గమ్యంలో యాధృచ్ఛికంగా పడున్న పదార్థం క్రమబద్ధం అవుతుంది. అప్పుడు సమీప ప్రాంతాలలో అబందరం తరుగుతుంది. ఈ తరుగుదల ప్రకృతి ధర్మానికి విరుద్ధం. అందుకనే ఆ ప్రాంతంలో మట్టుకు గురుత్వాకర్షణ నశించినట్లు భ్రాంతి కలుగజేస్తుంది."

గురుత్వాకర్షణ సిద్ధాంతం, తాపగతిశాస్త్రం, గుళిక సిద్ధాంతాలలో సిద్ధహస్తుడైన మిడతంభొట్లుకి ఈ సాంకేతిక భాష అర్థం అయింది. పైపెచ్చు ఎప్పుడో నలభై ఏళ్ళ కిందట ఆయన అనుభవించిన అనుభూతిని ఇంత స్ఫూర్తితో విశ్లేషించి చెప్పినవారు ఇంతవరకు ఎవ్వరూ తారసపడలేదు. కాని ఆయనకి ఇంకా సందేహాలు పూర్తిగా నివృత్తి కాలేదు.

.. గుళిక సొరంగాలలో కాంతి వేగాన్ని అధిగమించి ప్రయాణం చెయ్యగలిగే స్థోమత ఉంటేకాని ఈ దూరప్రయాణం సాధ్యంకాదు ..

"మీ ప్రయోగాలు ఈ మధ్యంతర కాలంలో చెయ్యకుండా, నలభై ఏళ్ళు పోయిన తరువాత మళ్ళా ఇప్పుడు ఎందుకు చేసేరు?"

"మీరనుకుంటూన్నది నిజం కాదు. ఇరవై ఏళ్ళ క్రితం మరొక ప్రయోగం చేసేం. అప్పుడు దూతని పంపకుండా కేవలం వార్తని పంపి చూసేం. వార్తని అందుకున్నారు మీరు. అందుకున్నట్లు దాఖలాలు ఉన్నాయి మా దగ్గర. వార్తని విన్నారు మీరు. అది ఎక్కడనుండి వస్తోందో చెప్పలేకపోయారు మీరు. అందువల్ల ఎలా స్పందించాలో తెలిసినట్లు లేదు మీకు. ఎవ్వరూ నమ్మినట్లు కూడా లేదు, మీ మాటని. అదే సమయంలో ఒక తార పేలిపోవటం కనబడింది, మీ ఆకాశంలో. దానిని చూసి, మేము మీకు పంపిన వార్త మరొకరిని ఉద్దేశించింది అనుకున్నారు. అనుకుని మీ మెదడులో చెలరేగిన వార్తకి తప్పుగా వివరణ చెప్పుకున్నారు. మా వార్తని పక్కకి తోసిపుచ్చి సమాధానం పడిపోయేరు."

మిడతంభొట్లు ఆశ్చర్యానికి అంతు లేదు. ఇరవై ఏళ్ళ క్రితం విశ్వాంతరాళం లోతుల్లోంచి మాట్లాడుతున్నాం అంటూ ఒక కంఠధ్వని వినిపించింది. ఇదే కంఠం. ఇదే మాట తీరు. మీ సూర్యుడు పేలిపోతున్నాడు, జాగ్రత్త పడండి అన్న వార్త విన్నప్పుడు అది ఆకాశవాణో లేక తన అంతర్వాణి పెడుతూన్న ఘోషో అర్థం కాలేదు. అయినా మనస్సు చెబుతూన్న మాటలు నమ్మి బ్రహ్మాండం బద్దలవుతోంది అనుకుంటూ ఎంతో ఆరాటపడి ఎందరికో చెప్పి చూసేడు మిడతంభొట్లు. ఆ రోదన అరణ్య రోదనే

అయింది. ఇది మూడో తడవ అంతర్ గ్రహ జీవులు భూలోకులని హెచ్చరించటానికి చేస్తూన్న ప్రయత్నం అని మిడతంభొట్లు మనస్సులో ఒక ఆలోచన ప్రవేశించింది. దీనిని నిర్ద్వందంగా నిర్ధారించుకోవాలనే తీర్మానానికి వచ్చి,

"ఈ వార్త మోసుకురావటానికి నిన్నే ఎందుకు పంపేరు? నీ ప్రత్యేకమైన అర్హతలు ఏమిటి?"

"అంతర్ గ్రహ సేవలు అనే ఉద్యోగ విభాగంలో నేను పని చేస్తాను. ఉద్యోగ హోదాలో ఉండటం వల్ల ఈ అవకాశం వచ్చింది నాకు. నా ప్రత్యేకత ఏమీలేదు. ఎవ్వరయినా వచ్చి ఉండేవారు ఆ విభాగం నుండి. "

" ఏ అమెరికా అధ్యక్షుడినో, భారత ప్రధానినో పట్టుకుంటే పని జరుగుతుంది కాని నాలాంటివాడితో ..?"

"అదీ ఆలోచించేం. మీ నాయకులకి రెండు నెలలలో వచ్చే ఎన్నికలమీద ఉన్న శ్రద్ధ రెండువందల సంవత్సరాల తరువాత రాబోయే ఉపద్రవం మీద ఉండదు."

"మరయితే ఏమిటి చేద్దామని?"

" వార్తని అందించేను. మా ప్రభుత్వం, మా సిబ్బంది మీకు సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాం. వ్యోమనౌకలలో మిమ్మల్ని తరలించుకు పోతాం. మీ ప్రజలని, ప్రభుత్వాలని ఒప్పించగలరు మీరు." సమాధానం కోసం ఎదురు చూస్తూన్నట్లు ఆ-గంతకుడు చెప్పటం పేడు.

తక్షణ కర్తవ్యం ఏమిటో మిడతంభొట్లుకి అవగాహన కాలేదు.

.. వార్తాహరుడు మరొక లోకం శాల్తీ లాగనే ఉన్నాడు. ఆ శాల్తీ చెబుతూన్న వార్త నిజంగా మరోలోకం వాళ్ళు పంపినదే కావచ్చు. కాని వార్తాహరుడి వార్త నమ్మదగ్గదిగా లేదు. అరవై జ్యోతిర్ వర్షాల దూరం నుండి వార్త రావాలంటే కనీసం 60 సంవత్సరాలు పడుతుందే గత నలభై ఏళ్ళల్లో రెండు సార్లు వార్తని పంపేమంటాడు. మూడో తడవ ఆసామీ ఎదురుగా నిలబడ్డాడు. ఇది సాధ్యమా? పోనీ అని తెగించి ఈ శాల్తీ మాటని తను నమ్మినా తన మాటని ఎవరు వింటారు? పైపెచ్చు తనని అస్తిత్వం లేనివాటిని కని, వినే మనోవిదళన రోగిగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అగ్ర రాజ్యాలన్నిటిని ఒక తాటి మీదకి తీసుకు రావటం అంటే మాటలా? అంతర్జాతీయ వేదికలమీద మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చుంటే ఆసన్నమయే ఆపద గుతుందా?.....

వేళ్ళతో కణతల మీద రుద్దుకుంటూ, "మీరు వ్యోమనౌకని అక్కడనుండి తీసుకువచ్చి ఎంతమందిని రక్షించగలరు? ఎవరెవరిని రక్షించాలో ఎలా నిర్ణయిస్తారు? మానవజాతిని రక్షిస్తే సరిపోతుందా? మానవుడి మనుగడకి మిగిలిన జీవకోటి మూలాధారమే. సర్వభూత సమాహారం మాటేమిటి? వెనకటికి పెనువరద వచ్చినప్పుడు నోవా అనే వ్యక్తి పడవేసుకుని వచ్చి జాతికో జంట చొప్పున జీవకోటిని రక్షించేడని మా బైబిల్ చెబుతోంది. అలా మీరు కూడ ఆపద ఆసన్నమైన తరుణంలో వచ్చి మీకు తోచిన వాళ్ళని రక్షిస్తే పోలా? నా సిఫారుసు ఎందుకు?"

"మా ఆలోచన అది కాదు. భూలోకంలో ఉన్న ప్రజలందరినీ - వీరు, వారు అనే తేడా లేకుండా - అందరినీ మోసుకుపోతాం. అదీ మా ఆలోచన."

"ఎప్పుడో 200 సంవత్సరాల తరువాత ఏదో ఆపద రాబోతోంది కనుక ఇప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలని నేను చెబితే ఎవరు పట్టించుకుంటారు? మా రాజకీయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ రేపు రాబోయే ఎన్నికల మీద, ఈ కందాయంలో రాబోయే లాభాల మీద గురిపెట్టి ఉంటుంది. ఒక ప్రణాళికా బద్ధంగా దూరదృష్టితో పనులు చెయ్యటం కష్టమైపోతోంది. పైగా మా భూలోకులకి సమష్టిగా పనిచెయ్యటం చేత కావటం లేదు. ఈ ప్రపంచాన్ని, ఈ అమెరికావాళ్ళని, ఈ చైనావాళ్ళ ని, ముస్లిం రాజ్యాలని, కమ్యూనిష్టులని, వీళ్ళందరినీ నమ్మించి ఒప్పించటం ఎలా సాధ్యం? పోనీ అంతర్జాతీయ సమితిలో ఉన్న 192 సభ్య దేశాలు, ఏడు బిలియన్ల ప్రజలు

నమ్మేరనే - మాటవరసకి - అనుకుందాం. అప్పుడు వీళ్ళ ందరినీ ఒప్పించి వ్యోమనౌకలు ఎక్కటానికి సహకరించేటట్లు చెయ్యటం ఎలా?"

"భయమేల మీకు? ఆ సేవాతంత్రాలన్నీ చూసుకుంటాం మేము. వ్యోమనౌకలని తయారు చేసే పద్ధతులు నేర్పుతాం మీకు. ఇక్కడ ఉన్న ఏడు బిలియను ప్రజలని ఒక క్రమ పద్ధతిలో వ్యోమనౌకలు ఎక్కించి వారిని పంపే ఏర్పాట్లు దగ్గరుండి చూస్తాం మేము. ఇదంతా జరిపించటానికి 200 ఏళ్ళు పడుతుంది. వ్యవధి లేదు. ఒకటి మాత్రం మరచిపోకండి. మీ మంచి కోరి, మీకు సాయం చేద్దామనే కోరికతోటే ఈ పని చేస్తున్నాము కాని ఇందులో సొంత లాభం ఏమీ లేదు మాకు."

..స్వలాభాపేక్ష లేకుండా ఎవరుంటారు? కేవలం పరోపకార బుద్ధితో పని చేసే వ్యక్తులు నూటికో కోటికో ఒకరు ఉంటే ఉండవచ్చు. కాని స్వీయప్రయోజనాలని ఆశించకుండా రాజ్యాలు ఏలటం కష్టం. కాందిశీకులు దేశంలోకి వెల్లువలా వస్తే వారు ఉండటానికి చోటు, తినటానికి తిండి పెట్టటమే ఎంతో కష్టం. అటువంటిది ఏడు బిలియన్ల ప్రజలకి రవాణా సౌకర్యాలు కల్పించి వారి బాధ్యతలని నెత్తిమీద వేసుకోవటం అంటే సామాన్యమైన పని కాదు. ఇందులో తర్కానికి అందని కిటుకు ఉందేమో .. ఈ లోచనని బయట పెట్టకుండా,

" మీరు తలపెట్టిన పని సాధ్యపడేది కాదు. ఇది నాకు తలకి మించిన పని. మా ప్రజాస్వామ్యంలో పురెకో బుద్ధి. మా ప్రభుత్వం అత్యవసరమైన పరిచర్యలే ప్రజలకి అందించలేక పడరాని పాట్లు పడుతోంది. అంతర్జాతీయంగా ఇది అస్సలు పొసగదు. ఏ రాజ్యానికీ ఇతర రాజ్యాల మీద నమ్మకం లేదు. కనుక మా బతుకేదో మేము బతుకుతాం. మీ సహృదయానికి మా జోహార్లు."

" పోనీ ఎవరు వస్తామంటే వారినే , మీ బైబిల్‌లో నోవా చేసినట్లు జాతికో జంటని, తీసుకెళతాం."

" అదీ జరగని పనే! మా దేశంలోనే మిలియన్లకి పైబడి ఆకలితో అలమటిస్తూన్న అనాథలు ఉన్నారు. వారిని దత్తత చేసుకుని తమతమ దేశాలు తీసుకుపోయి పెంచుకుంటామని విదేశీయులు ఎంతగా బతిమాలినా మా ప్రభుత్వం ఒప్పుకోవటం లేదు. అటువంటిది మీరు మమ్మల్ని అందరినీ ఉద్ధరిస్తామంటే ఎవరు ఒప్పుకుంటారు?"

"పోనీ మాతో వచ్చెయ్యండి మీరు."

"నేను ఉద్యోగ విరమణ చేసి వేదాంత తత్త్వం అధ్యయనం చేద్దామనే ప్రయత్నంలో ఉన్నాను. ఈ వయస్సులో నన్ను తీసికెళ్ళి మీకేమి లాభం?"

"ఆ ఆలోచన వద్దు మీకు. మీ జీవిత కాలాన్ని సునాయాసంగా రెట్టింపు చెయ్యగలం. మీ యవ్వనాన్ని పునరావృత్తం చెయ్యగలం. మీకు సంసార సుఖాలు అందివ్వటానికి రాటపడే అందమైన డవాళ్ళు ఉన్నారు మా దగ్గర. మీ వంటి మేధావి అవసరం ఎంతైనా ఉంది మాకు. వచ్చెయ్యండి నాతో. తీసుకుపోతాను."

..ఆవు అందం ఎద్దుకి తెలిసినట్లు మనిషికి తెలుస్తుందా?.....

"ఎందుకయ్యా ప్రయాస పడతావు! నేను ఇల్లు దాటి బయటకి వెళితే చలామణీ కాను. నా ఆచారవ్యవహారాలు నావి. నా వెర్రి నాది. ఎవరి వెర్రి వారికి ఆనందం. పైగా నేను శాకాహారిని. నాకు అలవాటయిన ఆహారం కూడ మీ దగ్గర మూడొంతులు ఉండదు."

"భయం లేదు మీకు. మాసం తినటం మానేశాం మేము. గతంలో ఒక అదృశ్యమైన విషాణువు కారణంగా మా లోకాన్ని అంతటినీ ఒక అంటువ్యాధి చుట్టుముట్టి మా ప్రజలందరినీ దరిదాపుగా రూపుమాపింది. దీనికి కారణం కొన్ని జాతుల ప్రాణులని చంపి తినటం వల్ల విషాణువు జంతు గణాల నుండి మా గణాలలోకి గెంతు వేసిందని మా శాస్త్రవేత్తలు తీర్మానించేరు.

అప్పటినుండి ఇతర ప్రాణులని తినటం మానేసేం. మా పోషణ కి కావలసిన ఆహారాన్ని అంతటినీ మేము కర్మాగారాల్లో తయారు చేసుకుంటాం. సహజంగా దొరికేవాటిని కూడ తినం; వాటిని మా కర్మాగారాల్లో మాకు అనుకూలమైన ఆహారాలుగా మార్చుకుని తింటాం. మా ఆర్థిక వ్యవస్థలో ఏదీ వృధాగా పోనివ్వం. అన్నిటినీ పదేపదే వాడుకుంటాం. ప్రాణం ఉన్న ప్రతి జీవిని బాధ్యతతో పోషించి కాపాడుతాం. ప్రాణం పోయిన తరువాత - దేహికి పునర్జన్మ ఉందో లేదో తెలియదు కాని - మా వ్యవస్థలో ప్రతి దేహానికి పునర్ వినిమయం ద్వారా పునర్జన్మ ఉంది. మా జీవావరణంలో ఎంత ఎక్కువ జీవకోటి ఉంటే అంత సమర్ధవంతంగా పునర్ వినిమయం జరుగుతుంది. మేము తినే హారం అంతా ఇలా పునర్ వినిమయం చేసే కర్మాగారాలలోనే తయారవుతుంది."

" మీరు తినేవన్నీ ఇలా రీ సైకిల్ చేసినవేనా?"

"అవును. అందుకనే ఎంతమందినైనా పోషించగలమనే ధైర్యం ఉంది మాకు."

తనడిగిన ప్రశ్నకి ఈ రకమైన సమాధానం వచ్చేసరికి మేష్టారి మెదడులో ఒక అనుమానం కదలాడింది. ఇదేనా గంతకుడి రాకకి అసలు కారణం? నిజానిజాలు పెరుమాళ్ళకే ఎరుక. కాని అనుమానం పెనుభూతం.

"మాలో ఒక మహాకవి, 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్నాడు. అంటే జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన భూమి స్వర్గతుల్యాలు. ఇది మా జన్మభూమి. ఇక్కడ పుట్టేం. ఇక్కడ పెరిగేం. ఇక్కడే చచ్చిపోతాం. అరవై జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న మరోలోకం వెళ్ళి మరో అరవై ఏళ్ళు బతికి బావుకునేది ఏముంది? నా శేష జీవితం - అరవై రోజులైనా సరే - ఇక్కడే గడుపుతాను. ప్రాణం పోయిన తరువాతా? పార్థివ దేహాన్ని అగ్నికి అప్పగించటం మా ఆచారం. కనుక దయచెయ్యి మరి!" ఇదే చివరి మాట అన్నట్లు నిష్కర్షగా చెప్పేసేరు మిడతంభొట్లు!

తలుపు మీద టకటక చప్పుడయింది.

"సరే! మళ్ళా కలుద్దాం. అప్పుడు మిమ్మల్ని ఒప్పిస్తాను."

"మళ్ళా కలవక్కరలేదు. క్షేమంగా వెళ్ళు."

ఇంతలో దోమల హోరులా, మంద్రస్థాయిలో, అస్పష్టమైన రొద వినబడింది. కంటికి ఎదురుగా ఉన్న వ్యక్తి చుట్టూ ఉన్న ప్రదేశం ప్రకాశమానమైంది. సాంద్రమానమైన ఆగంతకుడి కారం క్రమేపీ మంచు విగ్రహం కరిగినట్లు కరిగిపోయి అదృశ్యమైపోయింది.

తలుపు మీద టకటక శబ్దం మరొకసారి అవుతూనే తలుపు తెరుచుకుంది.

" ఎవరితో మాట్లాడుతున్నారు?" అంటూ చొరవగా లోపలికి వచ్చిన రాధ గదంతా కలయచూసింది. ఏమీ కనబడలేదు. " పదండి ఇంటికి వెళదాం " అంటూ చెయ్యి పట్టుకుని బయటకి దారి తీసింది ఆయన సహధర్మచారిణి.

●●●

# అనుక్కున్నదీ..అయినదీనూ

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో ప్రశంసాపత్రం పొందిన కథానిక

***అనుక్కున్నది (తొలిభాగం):***

"హే..వి..శ్రీ.., నిజంగానే?"

"కాదండీ, అబద్ధంగా. నాకలవాటుకదూ అబద్ధాలాడటం.."

"హబ్బా, మాటవరసకడిగాను, ఇంతకీ నిజంగానే ?"

"హద్దిగో మళ్ళీ, ఈ విషయం మీకందరికీ, ఎప్పుడెప్పుడు, ఎప్పుడెప్పుడు చెబుదామా అని పొహుద్దున్నించీ ఒహటే కడుపుబ్బరం, ఇదిగో ఇప్పటికి తీరింది"

"ఇంతకీ ఎక్కడట?"

"మన రామాలయంలో టండీ.."

"హేవిటీ, దేవుడి గుళ్ళోనా. వీళ్ళ దుంప తెగ..."

"మరే, మరీ ఇంత పచ్చిగా.."

"పచ్చిగానో, పండుగానో. సరే, సరే తరవాత చెప్పండి.."

"తరవాత చెప్పడానికి నేనేవన్నా వాళ్ళ మధ్యలో దూరాననుకున్నారా ఏవిటీ?"

"హబ్బా, ఛంపక నీకు తెలిసింది చెప్పవయ్యా మగడా.."

"మరదే, తొందరంటే..వస్తున్నా, వస్తున్నా, అక్కడికే వస్తున్నా."

"ఇంతకీ ఎవరుటా?"

"కొత్తగా వీసా మీద మన గుడికి వచ్చిన కుర్ర పూజారిట.."

"ఏవిటీ, గుంటడా. నేను వాడి వాలకం చూడగానే అనుకున్నానుసుమండీ.."

"ఏవనీ?"

"వీడేదో కొంపలు ముంచే రకమని. వాడు మగవాళ్ళకి శఠగోపం పెట్టేప్పుడు నెత్తిన ఠంగు మని మొడతాడండీ, మాడు పగిలే లాగ. అదే ఆడవాళ్ళకి సుతి మెత్తగా తగిలిస్తాడట. కుర్ర చేష్టలూ వీడూను."

" మరే, వయసల్లాటిదీ. వేదం నేర్చుకున్నంత మాత్రాన, వయసు చెప్పిన మాట వింటుందిటండీ?"

" హబ్బో, వేహెదం, హేవిటండీ వీడికొచ్చిన వేదం, ఒహటే ముక్కని, అటు మూడు సార్లూ, ఇటు మూడు సార్లూ తిప్పి తిప్పి, తిప్పి, తిప్పి, పై స్థాయిలోనూ, కింది స్థాయిలోనూ చదివేస్తే వేదం అయిపోతుందా? పాటి వేదం నాకూ వచ్చును."

"మరి మీరే అప్లయి చేసుండాల్సింది పూజారి పోస్టుకి. ఇప్పుడు చూడండి, ఛాన్స్ మిస్సయిపోయారు.."

"హదిగో, వెధవ డబల్  మీనింగు డైలాగులాపండి. ఛాన్సేవిటండీ, ఛాన్స్.."

"నేనన్నది పూజారయ్యే ఛాన్స్ గురించండీ.."

"సరే, తరవాత వింటారా, వినరా?"

"వింటాం మహాప్రభో, మీరు చెప్పండి..."

"ఇంతకీ ఆవిడ ఎవరో తెలుసునా?""........"

"****** ఆవిడట"

"హా, ఏదీ, మన ****** ఆవిడా?"

"మన ఏవిటండీ, మన? మీకు "మన" ఏమో, మాకు కాదు.."

"సర్లెండి, తరవాత చెప్పండి.., ఇంతకీ ఆవిడ వాడికన్నా పదేళ్ళన్నా పెద్దది కాదూ?"

"ఏమో, నేనుఖ్ఖట్టలేదు. అయినా 'రెండు' వదిలేసిన వాళ్ళకి, పెద్దేవిటీ, చిన్నేవిటీ, నా మొహం..."

"మరే, మా బాగా అన్నారు.."

"ఇంతకీ ఆవిడకిదేం ఖర్మండీ, చక్కగా అంత ఎత్తు, పొచ్చుటి మనిషి, హిల్లా, మెరిసిపోతూ ఉంటుంది, ఏం చేస్తాం, కలికాలం.."

" పాపం ఆవిడకేం కష్టాలో, ఇంట్లో  మొగుడు వెధవ కొట్టి ఛంపేస్తున్నాడేమో..."

" మీరు వాణ్ణెప్పుడన్నా చూసారా, చీమ తుమ్మితే, చెట్టుమీంచి పడిపోయేలా ఉంటాడు, సన్నగా, అతి పొట్టిగా. పిపీలకంగాడు. వాడి సొడిభ్యానికి తోడు పెళ్ళాన్ని కొట్టడం ఒహటీ.."

"మరింకేం కారణవుంటుందంటారూ ?"

"కనుక్కుని చెబుతాను స్వామీ, లేహపొతే ఏవిటీ, ఇలాంటి వాటన్నిటికీ ఒహటే కారణం, అది ఆడా, వాడు మగాను. ఇంతకంటే వేరే కారణం కావాలిటండీ?"

"మరే, మరే."

"మొన్న శ్రీరామ నవమికి నవరాత్రులు చేసారు కదా. ప్రతీ రోజూ ఉదయాన్నే ఈవిడ మడి బట్టలతో వెళ్ళి వాడికి ప్రసాదాలు అందిచ్చేదిట"

"మడి బట్ట అంటే, తడి బట్టే కదండీ?"

"హబ్బ, ఆపవయ్యా నీ డొట్లు, అసలే ఇక్కడ టెన్షన్  తో ఛచ్చిపోతూంటే, మీరు చెప్పండి స్వామీ.."

" వాడు అందరికంటే ముందు, ఈవిడిచ్చిన ప్రసాదాలే నైవేద్యం పెట్టడంట. వాణ్ణి చూసి ఈవిడ బెంగెట్టేసుకోనూ, ఈవిణ్ణి చూసి వాడు బెంగెట్టేసుకోనూ. వెళ్ళ లేక వెళ్ళలేక ఆఫీసుకెళ్ళేదిట. మళ్ళా సాయంత్రం వచ్చేసేదిట, భజనకి. అయితే, నవరాత్రుల ఆఖరి రోజున అందరూ ఇళ్ళకెళిపోయినా, ఆవిడ మాత్రం అక్కడే ఉండిపోయిందిట. సెల్  ఫోను గుళ్ళో మర్చిపోయానని గుర్తొచ్చి మా ఆవిడ వెళ్ళిందిట, రాత్రి ఏడున్నరకి. హంతే, ఇంకేవుందీ, వెళ్ళి చూసింది కదా, అదీ, వాడు కూర్చుని ఉన్నారుట. వాడేమో ఏడుపు, ఆవిడేదో ఓదారుస్తోందిట."

"అవును, బహుశా మళ్ళీ ఎక్కడ కలుసుకోవాలో మాట్టాడుకుంటున్నట్టున్నారు.."

"మరే, కామాతురాణం న భయం న లజ్జా, చెప్పాడుగా శాస్త్రకారుడు..."

"ఆమట్నించి, మా ఆవిడ సెల్  ఫోను తీసుకుని, ఏమీ ఎరగనట్టు వచ్చేసిందిట. ఇహ చూసుకోండి. వెంఠనే వాళ్ళు గుడికి తాళా లెట్టేసి, వాడటు క్వార్టర్సులోకి పోయాట్ట, ఈవిడ కారెక్కి తుర్రుమందిట."

"మరే, దొరికిపోయారు కాదూ, అంచేతే..."

"అయినా మన కమిటీ వాళ్ళననాలి. కాస్త నిఖార్సయిన వాళ్ళని చూసి తెచ్చుకోరూ ఎవరన్నా. అసలు  మాటకొస్తే మా బామ్మరిదే ఉన్నాడు, నిప్పు, నిప్పంటే నమ్మండి. కానీ మనం ఎరిగున్నవాళ్ళని, మన చుట్టాలనీ తెచ్చుకోకూడదని రూలు కదా. ఆనక మన తాలూకు అని తెలిస్తే వీసా కూడా కేన్సిలు చేసి పారేస్తారు. అసలే  కమిటీలో సయోధ్యలు అంతంత మాత్రం."

"ఎంచి ఎంచి ఎంగిలాకులో కాలేసినట్టు, వీడెల్లా దొరికాడండి కమిటీ వాళ్ళకి?"

" ఏవుందీ, ఉన్న వాళ్ళలో కాస్త నోరూ వాయా లేకుండా, ఇచ్చిన జీతం తీసుకుని, కుక్కిన పేనులా పడుంటాడు, కుర్రాడు కదా అనుకునుంటారు, ఇప్పుడేమో కథ అడ్డం తిరిగింది..."

"ఇంతకీ ఇప్పుడేవంటారు కమిటీవాళ్ళు, ఏవన్నా ఏక్షను తీసుకుంటున్నారా, లేదా?"

"అందరూ దొంగలేనండీ, వాళ్ళు వీడిదగ్గర ఏదో కమీషను కొట్టేసుంటారు. అందుకనే కిక్కురు మనట్లేదు"

"అయినా మనకెందుకులెస్తురూ, ఈ భాగోతాలన్నీని.అన్నట్టు నిన్న రాత్రి టీ.వీ చూసారా, ఫలానా హీరోయిన్ను పడుపు వృత్తి చేస్తూ, పట్టుబడిపోయిందిట, వాడెవడితోటో బేరం కుదరలేదుట, వాడేమో కడుపుమండి, కంప్లెయింటిచ్చేసాట్ట..."

***అయినది (తుది భాగం):***

శ్రీరామ నవమి - నవరాత్రుల తొలినాడు (చైత్ర శుద్ధ పాడ్యమి నాడు)..

ఉదయం ఆరవుతోంది. కొత్తగా వచ్చిన కుర్ర పూజారి అప్పటికే రాములవారికి సుప్రభాత సేవ పూర్తి చేసి ఎవరికోసమో ఎదురు చూస్తున్నాడు. ఆవిడ వచ్చింది, నైవేద్యంతో.

"నీకీవిషయం చెప్పకూడనే అనుకున్నాను. కానీ చెప్పకపోతే, తరవాత తెలిస్తే ఇంకా మధన పడిపోతావని ఫోనులో చెప్పాను నిన్న. కానీ మీ క్వార్టర్సు లో ఫోను వేరే వాళ్ళు వింటారని చెప్పడంతో, నాకు రాక తప్పింది కాదు."

"ఇప్పుడెల్లా ఉంది" అన్నాడతను కళ్ళలో నీళ్ళు తిరుతూండగా.

"జెరం మళ్ళీ తిరగబెట్టిందిట. ఏవిటేవిటో, ఎప్పటి సంగతులో కలవరిస్తున్నారట. నిన్న మావయ్య చెప్పాడు, ఇంకేం లాభం లేదట.."

"నేను వెళిపోతానక్కా..."

"వద్దురా. నలుగురు ఆడపిల్లల తరవాత పుట్టిన మగ బిడ్డవి. నిన్ను అభివృద్ధిలోకి తీసుకురావాలని నాన్న జీవితాంతం ఎంత కష్టపడ్డాడో మనందరికీ తెలుసు. ఆరోగ్యం సహకరించకపోయినా, ఎండనక వాననక, నలభైఏళ్ళు పూజలు, వ్రతాలూ, పెళ్ళిళ్ళూ చేయించీ, చేయించీ, రూపాయి రూపాయి కూడబెట్టి, మానలుగురి పెళ్ళిళ్ళూ చేసాడు. నీదగ్గరకొచ్చేసరికి, చదువు చెప్పించే తాహతు కూడా పోయిందిరా. అందుకే వేదం చెప్పి, నిన్నూ తన వృత్తిలోనే పైకి తీసుకురావాలని తాపత్రయ పడ్డాడు.

తను పడ్డ కష్టాలన్నీ నువ్వు పడకూడదని, అందరి కడుపులూ కాళ్ళూ పట్టుకుని, నాలుగేళ్ళు కాళ్ళరిగిపోయేలా తిరిగి, నీకు ఈ అమెరికా అవకాశం వచ్చేలా చేసాడు. పాపం, మావయ్య కూడా ఆఫీసుల చుట్టూ తిరిగి, అమ్మవీ, అత్తయ్యవీ గాజులమ్మి నీకీ టిక్కెట్టూ, వీసా చేయించాడురా. ఇప్పుడు నువ్వెళ్ళిపోతే మళ్ళీ నిన్ను రానివ్వరు. జీవితాంతం నువ్వూ నాన్నలాగే కష్టాలు పడాల్సిందే అందుకే

అమ్మా,అత్తయ్యా, మావయ్యా అసలు నీకీ సంగతులు చెప్పద్దని అన్నారు. కానీ ఎంత ఆపుకుందామనుకున్నా ఆగింది కాదురా, ఒక్కగానొక్క తమ్ముడివి, నీకు చెప్పక పోవడం భావ్యం కాదనిపించి, చెప్పేసాను రా. అయినా నువ్వేం భయపడకు. మనకి అన్నిటికీ రాములవారున్నారు.

నేనీ తొమ్మిదిరోజులూ ఉదయాన్నే నైవేద్యం తెస్తాను, మడిగా. ముందుగా స్వామివారికి ఇవే ఆరగింపు పెట్టు. మనం ఏనాడూ ఎవరికీ అన్యాయం చెయ్యలేదు, మనకి కూడా దేవుడు ఎప్పుడూ అన్యాయం చెయ్యడు. మీ బావ కూడా నిన్ను ధైర్యంగా ఉండమన్నారు. ఒక్క విషయం గేపకం పెట్టుకో. మనిద్దరం తోడబుట్టినవాళ్ళవన్న సంగతి మూడోకంటివాడికి కూడా తెలియనివ్వకు. తెలిస్తే, ఇన్నాళ్ళూ బావా, నాన్నా, మావయ్యా చేసిన ప్రయత్నాలన్నీ, బూడిదలో పోసిన పన్నీరయిపోతాయి. కమిటీ వాళ్ళు నిన్ను వెనక్కి పంపించేస్తే, అది చూసి నాన్న తట్టుకోలేడు. బాధతోనే వెళ్ళిపోతాడు. నీకు తెలుసా, ప్రతీ రోజూ నీగురించి కలవరిస్తున్నాట్ట "ఒరేయ్ మారుతీ, నవరాత్రులు బాగా చేయించు నాన్నా, అమెరికావాళ్ళు నభూతో నభవిష్యతి అనుకునేలా జరిపించు, మన వంశం పేరు నిలబెట్టు నాన్నా.." అంటూ.

"సరే అక్కా, ఇక అంతా రాములవారిదే భారం. నాన్నకి ఏమీ కాదుకదా అక్కా.."

"ఏమీ కాదురా. నువ్వు అధైర్యపడకు. నేను రోజూ వస్తాగా..."

అన్నట్టుగానే ఆవిడ రోజూ వచ్చింది. నవరాత్రుల ఆఖరి రోజున కుర్రాడు చాలా బిజీ అయిపోయాడు పూజలతో. అన్నీ అయ్యేసరికి సాయంత్రం రయింది. అలసిపోయిన భక్తజనం అంతా ఇళ్ళకెళిపోయారు. మిగిలిన పూజారులంతా కాస్త ఊపిరి తీసుకోవడానికి క్వార్టర్సుకి వెళ్ళారు. ఉన్నదల్లా కుర్రాడొక్కడే అప్పుడు ఆవిడ మళ్ళీ వచ్చింది. ఈవిడ ఇలా రావడం వెళ్ళడం మరో సీనియర్ పూజారి కనిబెడుతున్నాడు ఎనిమిది రోజులనించీ. ఇంక రోజు కూడా విడ లోపలికెళ్ళడం చూసి, కన్ఫర్మ్ చేసేసుకుని, కమిటీ వాళ్ళని తీసుకురాడానికి బయల్దేరాడు. టైము ఆరున్నర.

"తమ్ముడూ, నాన్నకిప్పుడు కాస్త నెమ్మళంగా ఉందిట. నిన్ననే జావ తాగించారుట" అంది ఉత్సాహంగా.

"హమ్మయ్య, అక్కా, నిజంగా రాముడున్నాడే.."

"అవునురా. నేచెప్పలా. ఎంత ఖంగారు పడిపోయామో. పోనీలే గండం గట్టెక్కింది కదా, ఇంక నువ్వు శ్రద్ధగా పూజలు చెయ్యి. నాన్న పేరు నిలబెట్టాలి నువ్వు. "

"అవునక్కా. కానీ నాకెప్పుడూ అనిపిస్తుంది, ప్రపంచంలో ఎంతో మంది ఎన్నో అన్యాయాలు చేస్తూ, డబ్బూ, పొలాలూ, నగలూ, మేడలూ ఇలా హాయిగా బైతికేస్తున్నారు, మనకెందుకు ఇన్ని కష్టాలని. ఒక కుటుంబం వాళ్ళం, ఒక చోట బతికే అదృష్టానికి కూడా నోచుకోలేదు మనం. దేవుణ్ణి నమ్ముకున్న మనకెందుకక్కా ఇన్ని కష్టాలు?" కళ్ళనించి నీరు బొట్టూ బొట్టూ కారుతోంది.

"హాయి అనేది మనం అనుకోవడంలో ఉందిరా. అది హాయి అని మనం అనుకుంటున్నాం, మనమే హాయిగా ఉన్నామని వాళ్ళనుకుంటారు. ఎక్కడ ఉండవలసిన సమస్యలు అక్కడ ఉంటాయిరా, చిన్నవాళ్ళకి చిన్న సమస్యలు, పెద్దవాళ్ళకి పెద్ద పెద్ద సమస్యలూను."

వీళ్ళిలా మాట్లాడుకుంటూండగా సెల్ఫోను మర్చిపోయినావిడ వచ్చింది. చూసింది. బైటికెళ్ళింది. తను చూసింది ఎల్లా ఉంటే రసవత్తరంగా ఉంటుందో అల్లా ఊహించుకుంది. ఇంటికెళ్ళి వాళ్ళాయన చెవిలోఊదేసింది. ఈవిణ్ణి చూసిన కుర్రాడు గుడికి తాళం వేసి క్వార్టర్సులోకి పరిగెత్తాడు. తని అక్క కారెక్కి వెళిపోయింది. కుర్రాడు క్వార్టర్సులోకెళ్ళేసరికి కమిటీ వాళ్ళంతా సిద్ధంగా ఉన్నారు, సీనియర్

పూజారితో సహా. కుర్రాడు చెప్పింది వాళ్ళెవ్వరూ నమ్మలేదు. కుర్రాడు గాయత్రిమీద ప్రమాణం చేసి చెప్పాడు. అయినా వాళ్ళు నమ్మలేదు. ఆవిడ తన అక్క అనీ, తమ కుటుంబ పరిస్థితుల వల్ల, తప్పనిసరై, తనకి ఎవరూ లేరని చెప్పవలసి వచ్చిందనీ, మొత్తం కథ అంతా పూసగుచ్చినట్టు చెప్పి కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమిలాడాడు కుర్రాడు.

"శాల్ , ఇది క్షమించరాని నేరం, కుదరదంటే కుదరదు" అన్నారు ప్రెసిడెంటు గారు. అది చూసి, వెంఠనే వైసు ప్రెసిడెంటుతో సహా మిగితా కమిటీ వాళ్ళు " ఎందుక్కుదరదూ, కుదురుతుంది, కానీ నువ్వు ఆవిడ మీఅక్క అని రుజువు చెయ్యాలి" అనేసారు ఏకగ్రీవంగా.

మరో గెంటకల్లా, అక్క,బావ, పిల్లలూ వచ్చారు వాళ్ళ పెళ్ళి ఆల్బమ్ములు పట్టుకుని. నిర్ధారణ పూర్తవంగానే తామే గెలిచామన్నట్టు మిగితా కమిటీ అంతా ప్రెసిడెంటుగారికేసి చూసారు. ఆయన వీళ్ళకన్నా ఓ మెట్టు పైన ఉండాలని " అయితే మారుతీ, నీకు తక్షణమే రెండు వారాలు సెలవిస్తున్నాను. హాయిగా ఇంటికెళ్ళి నాన్నగారి ఆరోగ్యం పూర్తిగా బాగుపడంగానే వచ్చేయ్ . నీమీద తప్పుడు ఆరోపణలు చేసినందుకు, ఇదిగో ఈ పూజారి, నువ్వొచ్చేదాకా నీ డ్యూటీ కూడా చేసేస్తారు" అనేసి సభ చాలించి, ఠీవిగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు. మర్నాడు మారుతి ఇండియా వెళ్ళాడు. అసలు విషయం తెలుసుకున్న జనం లెంపలేసుకున్నారు.

●●●

# ముళ్ళ గులాబీ

ఉమాభారతి కోసూరి

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో
## నా మొట్టమొదటి కథ విభాగంలో బహుమతి పొందిన కథ

**"మమ్మీ! కరెక్ట్‌గా ఆరుగంటలకి,** మిల్పిటాస్‌లో, బాబా టెంపుల్కివచ్చేయ్. నేను, మాలిని అక్కడనిన్ను మీట్ అవుతాము, తరువాత డిన్నర్కి వెళదాము....సరేనా?" ఫోన్‌లో కిరణ్. ఉత్సాహంగా ఉన్నాడు మావాడు. న్యూయార్క్ లా స్కూల్ నుండి డిగ్రీ తీసుకొని, కార్నెల్ - క్వీన్స్ -ఎక్జిక్యూటివ్ ఎమ్.బి.ఎ చేసాడు. ఆరు నెలల క్రితమే, శాన్ హోజే కాలిఫోర్నియాలో, కార్పరేట్ లిట్టిమన్‌కి పని చేయడం మొదలెట్టాడు.

తన స్నేహితురాలు, క్లాస్మేట్ మాలిని, న్యూయార్క్ నుంచి మమ్మల్ని కలవడానికి వస్తుందని రెండురోజులక్రితమేచెప్పాడు. ఊరెళ్ళిన మా వారు,

రేపు సాయంత్రం ఇంటికి వచ్చేలోగానే నన్ను కలుస్తానని మాలిని తొందర పడితే, ఇలా ఏర్పాటు చేసాడు కిరణ్. సాయిబాబా టెంపుల్ దగ్గరే ఉన్న పిన్నివాళ్ళింట ఉందిట, అమ్మాయి. "వర్క్ నుంచి బయలుదేరి, మాలినిని తీసుకొని రావడానికి గంట పైనే పడుతుంది మమ్మీ," అన్నాడు కిరణ్ ...

నాకూ కొంత అదుర్దాగానే ఉంది మాలినిని కలవాలని. అంత ప్రత్యేకంగా అమ్మాయి మమ్మల్ని కలవను రావడమంటే, విషయం మేమూహించేదే అయ్యుంటుంది. సాయంత్రం వరకునాకు ఎన్నో ఆలోచనలు. మా కిరణ్ ఎంచుకున్న అమ్మాయిని మేము కాదనేది ఉండదు కాబట్టి, మాఇంట త్వరలో కోడలు అడుగెడుతుందన్న మాట. మనస్సంతా సంతోషంతో నిండిపోయింది.

లేట్‌గా వెళితే కిరణ్ కిష్టముండదని, గుడికికాస్త ముందుగానే బయలుదేరాను. మేముండేది మిల్పిటాస్ గుడికి అరగంట డ్రైవ్ . కిరణ్ అపార్ట్‌మెంట్, వర్క్‌కి దగ్గరగా, మాకు వంద మైళ్ళ దూరం ఉంటుంది. వీకెండ్ (శనాదివారాలు) అయితేనే ఇంటికి వస్తుంటాడు. ఆలోచించుకుంటూ గుడి ఆవరణలోకి వచ్చేసాను. ఆ రోజు గురువారం,గణేష చతుర్ధి కూడా కావడంతో ఆ- లయప్రాంగణం జనంతో నిండిపోయుంది. ప్రసాదాలు,పువ్వులు పట్టుకొని మెట్లెక్కుతున్న చిన్న పిల్లల్ని గమనిస్తూ పైమెట్టు మీదకూర్చున్నాను.

పదినిముషాలకి అల్లంత దూరాన కిరణ్ , పక్కనే మాలిని గబగబా నా వైపు వస్తూ కనబడ్డారు. నీలిరంగు పంజాబీ డ్రెస్ వేసుకొని, కిరణ్ ప్రక్కన కాస్త పొట్టిగా, సన్నగా ఉంది మాలిని. దగ్గరగా వచ్చి నన్ను కలిసి, చేతులు జోడించి, "నమస్తే ఆంటీ, మీరొచ్చి చాలా టైం అయ్యిందా?" అంది మృదువుగా, సుళువు లేని తెలుగులో. మా పిల్లలు తెలుగు మాట్లాడినట్టే ఉంది.

నీలి మేలిముసుగులో పొందిగ్గా తోచింది. తెల్ల గులాబీలా సుకుమారంగా అనిపించింది. దేవుణ్ణి దర్శించుకొని, ప్రసాదం తీసుకొని మెట్లపై కూర్చున్నాము. చక్కగా మాట్లాడుతూనే ఉంది మాలిని. " కిరణ్ మంచిస్నేహితుడు ఆంటీ, నాకు కాలేజీలో, చదువులో హెల్ప్ చేసేవాడు, మా అమ్మా వాళ్ళకి కూడా కిరణ్ అంటే చాలా ఇష్టం"అంది. కిరణ్‌పై ఉన్న అభిమానం బాగా తెలుస్తోంది మాలిని మాటల్లో. ముచ్చటేసిందినాకు. మావాడి మనస్సులోని వలపుల తలపులకి నేమురిశాను. సాయంత్రమంతా కబుర్లు సంతోషాలతో గడిచింది. "ఇవాళ డిన్నర్ వద్దులే, ఆలస్యమయిపోయింది, శని వారమింటికివచ్చి, డాడీని కలవండి"అని ఇద్దరికీ చెప్పి ఇంటిముఖం పట్టాను.

ఇంటికొచ్చి ఎంతో ఉత్సాహంగా, "అమ్మాయి నాకు నచ్చింది, కిరణ్ అంటే బాగా ఇష్టమని చెప్పకనే చెప్పిందండీ, శనివారం కిరణ్‌తో కూడా ఇంటికి వస్తుంది, మీరూ కలుస్తారుగా! దీవించేస్తే మన కిరణ్ ఓ ఇంటివాడవుతాడు,"అని మా ఆయనకి ఫోన్ చేసి చెబుతూనే పోయాను. మా ఆయన కూడా సంతోషించారు. ఆనందంతో రాత్రి నిద్రపోలేదు. ఎదిగి ప్రయోజకుడైన మా ప్రియపుత్రుడు కోరి వరించిన అమ్మాయిని తప్పక ఆనందంగా ఆమోదిస్తాము, ఆహ్వానిస్తాము.

**

శనివారం హడావిడిగా వంట ముగించాను. కిరణ్, మాలిని వచ్చి సాయంత్రం వరకు ఉన్నారు. చాల సరదాగా గడిచింది సమయం. చదువులునుండి, మాలినివాళ్ళ కుటుంబ విషయాల వరకు ఎన్నో సంగతులు మాట్లాడుకొన్నాము.

" అంకుల్, మీకూ కిరణ్‌కి చాలా పోలికలున్నాయి"

అంటూ మా వారితో ఎన్నో కబుర్లు చెప్పింది మాలిని.

మాలినితో మాట్లాడాలనీ, తన గురించి తెలుసుకోవాలనీ, మా భావాలు, ఆనందాలు, రుచులు, అభిరుచులు తనతో ప్రస్తావిస్తూ, తనవి అడిగి తెలుసుకుంటూ, తరువాత కూడా కొన్నిసార్లు కలిసాము. ఆప్యాయంగా మాట్లాడేది మాలిని. మా అమ్మాయి నిషి కూడా మాలినిని కలవడానికి ఓసారి చికాగో నుంచి వచ్చింది. ఇద్దరూ స్నేహితులయ్యారు. మాలినితో మాకందరికీ సాన్నిహిత్యమేర్పడింది. "అమ్మాయి బాగా నచ్చింది కూడాగా నీకు, కిరణ్‌తో ప్రస్తావించి, వాళ్ళ ఫ్యామిలీని ఆహ్వానించు", అని మా

అయన ప్రోత్సహించారు. ఆత్మాభిమానం, చురుకుదనం, చొరవతో పాటు మా వాడంటే అమ్మాయి కున్న అభిమానం, ఆకర్షణ నాకెంతో నచ్చాయి. మనసులు కలిసాయి. ఇక మనువులే తరువాయని, సందేహపడకుండా సందేశంతోపాటు, మంచిరోజు చూసి మా ఆతిధ్యాన్ని అందుకోమని మాలినివాళ్ళ కుటుంబాన్ని ఆహ్వానించాము.

కిరణ్ అమ్మాయికి ప్రొపోజ్ చేసి, మా ఇరువురి కుటుంబాల సమక్షంలోనే డైమండ్ ఉంగరం వేలికి పెట్టాడు. మరికొంతకాలం సంతోషాలు, సమావేశాలు, కాబోయే వియ్యంకులతో కబుర్లు, కమామీషు, ఉత్సాహంగా గడిచింది.

మాలిని కుటుంబ పరివారంతో చిరకాల స్నేహితుల్లా మెలిగాను. మాలిని వాళ్ళమ్మ లక్ష్మి, నాన్న నారాయణగారు, చెల్లెళ్ళు, అంతా మమ్మల్ని కలవడమానందంగా ఉందన్నారు. లక్ష్మిగారు అయితే "కిరణ్‌లాంటి అబ్బాయి అల్లుడు అవడం మా అదృష్టం, అంతకన్నా ఎక్కువ మీవంటి అత్తగారు దొరకడం, మాలిని చేసుకున్న పుణ్యం" అని పొగిడేసింది. నారాయణగారు కూడా అంత సంతోషాన్నీ వ్యక్తపరిచారు. కిరణ్ అంటే ఇష్టపడే ఆ అమ్మాయే కాదు, కుటుంబమంతా అభిమానంగా ఉన్నారు, వాళ్ళకీ అబ్బాయిలు లేరు కనుక, కిరణ్‌ని వారి సొంత కొడుకులా భావిస్తారు కూడానని అనిపించింది. ఆ మాటేవాళ్ళతోనూ అన్నాను. కట్నాలు ప్రసక్తే అస్సలు లేదు, కిరణ్ కి అలాంటివన్నీపడవు. మాకూ అంతే. ఇరువురూ సంతోషంగా సంసారం చేసుకొని వందేళ్ళు మంచి జీవితం గడపాలనే తప్పవేరే ఆలోచన లేదు.

ఇక జరగవలసిన కార్యక్రమం నిశ్చితార్థం. ఇక్కడా? అక్కడా?ఏ భోజనం?ఎవరి సాంప్రదాయం?దేవునిగుడిలోనా? కళ్యాణ మండపంలోనా? ప్రశ్నలు, సందేహాలు, సంప్రదింపులు, సన్నాహాలు. వీటన్నిటి నడుమ వచ్చింది వేసవికాలం. మాఇంట మొదటి శుభ కార్యానికి అమ్మమ్మ, తాతయ్యల దీవెనలుతోపాటు, ఏడుకొండల వెంకన్న ఆశీస్సులుకోసం హైదరాబాద్ , తిరుపతి పయనమయ్యాము. " ఆంటీ, కిరణ్ తో, మీతో ఇండియా వెళ్ళాలని ఉంది. ప్లీజ్ , మీకు కష్టం కాదంటే మీతోపాటే వెళ్ళేలా ప్లాన్ చేసుకొంటాను. అమ్మవాళ్ళకి అభ్యంతరమే లేదు," అంది మాలిని ఫోన్‌చేసి. మాలినితో పాటు బయలుదేరాము.

అచ్చట, ముగ్ధలా మౌనంగా మెలిగింది అమ్మాయి. సహజంగా ఓర్పున్న పడతిలా తోచింది. కాకపోతే నాలుగు రోజులు జబ్బు పడింది.

దగ్గరుండి చూసుకున్నాము నేను,కిరణ్ . ఢిల్లీ, ఆగ్రా వెళ్ళడం మానుకొని, తన ఆరోగ్యం తేలికయ్యాక తిరుపతి వెళ్ళాము. దర్శనం బాగా జరిగింది. అందరిని చూసాము, అంతటా తిరిగాము, ఆశీస్సులతో, ఆనందాలతో, ఇల్లు చేరాము.

**

నిశ్చితార్థానికి ముహూర్తాలు పెట్టించాము. ఆడపిల్లవారి ఊరి కోవెలలో జరప నిశ్చయించాము. కెంపులు చెక్కిన వజ్రాలహారం, పగ్గాలమీద చెంగావి పట్టుచీరతో పాటు అద్దాలగాజులు, జలతారువోణీలు తయారుచేయించి మాలినికి కానుకలుగా, తెప్పించాము. శుభదినాన, శుభముహూర్తానికి, శుభాకాంక్షలతో శివారుల్లోని ఆలయప్రాంగణానికి బయలు దేరాము. మా బంగారుకొడుకు, ఉల్లి పొర రంగు టస్సార్ సిల్క్ దుస్తుల్లో, నుదుట తిలకంతో, చెంపన దిష్టిచుక్కతో, ఉదయించే సుర్యుడులా వెలిగిపోయాడు. ప్రతినిత్యం వాణ్ణలా అందంగా ఆనందంగా చూడాలని, మనస్సులోనే దేవుడికి దణ్ణం పెట్టుకొన్నాను.

తాంబూలాలు, కట్నకానుకలు సర్దుకొన్నాము, సపరివారసమేతంగా వడివడిగా కదులుతున్నాము. అంతలో అందింది కోవెల నుండి మాలిని పిలుపు. "ఇదిగోవస్తున్నామే తల్లీ!" అంటూనే ఉన్నాను. అటునుండి అలజడిగా బిగ్గరగా కిరణ్‌తో ఫోన్‌లో వాదిస్తున్నదని, అదీ గొడవపడుతున్నట్టు అర్థమయి, అవాక్కయ్యాము. మమ్ముల తోడ్కొని వెళ్ళడానికి వచ్చిన అమ్మాయి తండ్రి , నారాయణగారు నచ్చజెపుతున్నా, నా కన్నకొడుకు పై కక్షగా అరుస్తూనే పోయింది, ఫోనులో మాలిని. అదురుతున్న గుండెల్ని అదుపు

చేసుకొని అసలు సంగాతేమిటా అని వాకబు చేసాము. మా విడిదిలో, మా పరివారంతోఉన్నందుకు,ఇక్కడే మావాడి స్నానాలంకారాలు అయినందుకు, తనని, తన వాళ్ళని ఒక్కింతకూడాలెక్కచేయలేదంటూ మావాడిని నిష్కర్షగా తిడుతూనే పోయింది.

అనూహ్యమైన ఈ విపరీత మాటలకి, చేష్టలకి నా మనసున అశాంతులుచెలరేగాయి. ఉద్వేగంతో దు:ఖమాగలేదు, - ఆలోచనసాగలేదు. అదిరింపులు, బెదిరింపులు ఎరుగని వాడు,సుకుమారంగా,రాకుమారుడిలాఎదిగినవాడు, నాకంటి దీపం,మా కిరణ్ ,సున్నితమైనవాడు,మావాడు మూగవోయాడు నాడు. తనకి తెలిసిన మాలినియేనాని వాపోయాడు. అంతలో నారాయణగారు, తనపై కూడా ఫోన్‌లో బిగ్గరగా అరుస్తున్న మాలినితో

" సరే, ఇంక శాంతించు, ఆంటీ బాధపడుతుంది, మేము బయలుదేరుతున్నాము, అని ఇటు మాకూ సర్ది చెప్పి పదండమ్మా, ఆలస్యమౌతుంది, అంటూ చేతలుడిగిన మమ్మల్ని బయలుదేర దీశారు.

ఎంతటి జాణతనం?ఎంతటి జ్వాలతనం? కిరణ్ మనసు మలిన పడకుండా ఏమి చేయాలి, వాడిని ఎలా ఆదుకోవాలి? ఆగని కన్నీటితో కలలోలా కదిలాను. ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి. మావారు నా కన్నీళ్ళకి చలించి పోయారు, మనసు పాడయి జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనలేదు. మాతో వచ్చినా నిశ్చితార్థ తంతు నుంచి దూరంగా గుడిలోనే ఉండిపోయారు.

నేను మాత్రం కిరణ్‌ని అంటిపెట్టుకొనే ఉన్నాను. నిషి మా వెంటే ఉంది. నిశ్చితార్థం అంటూ జరిగిన కార్యక్రమం మావారు అక్కడ లేకుండానే జరిపించారు. ఏమయిందో ఎలా జరిగిందో మాటమంతీ లేకుండా తిరిగి విడిది చేరుకొన్నాము. పై ఊరు వెళ్ళిపోయాము. మనస్సు మొద్దుబారి పోయింది.

నా ఆలోచనంతా కిరణ్ గురించే. మా జీవితాలు ఎటువంటి మలుపులు తిరుగుతాయో ఇకమీదట అని నా తలముక్కలై పోసాగింది.

**

రెండు నెలల వ్యవధి తరువాత, కిరణ్ ప్రయత్నాలు మొదలెట్టాడు. కలిసి కూర్చుని, విషయాలన్నీ మాట్లాడుకొని, ఇరువైపులా పరస్పర అవగాహన తెద్దామని అమ్మాయిని ఎన్నో మార్లు అడిగాడు. అయినా లాభం లేకపోయింది. ఇంతటి మొండి అమ్మాయితో అసలు జీవితం ఎలా ఉంటుందోనని, కిరణ్ విషయంలో భయం వేసింది.

అంతటితో ఆగని అమ్మాయి వీరంగం, వటుడు అంతై, అంతంతై అన్న సామెతగా, నన్ను దుయ్యబట్టేంత వరకూ వచ్చింది. కిరణ్‌కి ఏవో అప్రస్తుతపు మాటలు చెపుతూ, వాడికి నాపై కోపం రావాలని, బాహాటంగానే నన్ను తూలనాడుతూ, మాటల్లోనే కాక, లేఖలు కూడా రాసింది.

తానంటే ఇష్టపడక, తన కంటే అందం అంతస్తులున్న కోడలి కోసం నేను ఆరాట పడుతున్నానని, నా పై అబద్ధపు అభాండాలు మోపింది. నాముఖం చూడనంది, నా ఉనికే వద్దంది. మా నుండి వాడిని వేరుచేయడమే ఆ అమ్మాయి ధ్యేయమయ్యిందని అర్థమైపోయింది. మా కిరణ్ కావాలనుకొన్నదేదైనా, దేనికైనా వాడికి సంపూర్ణస్వాతంత్ర్యముందని, అసలు వాడు ఏది చెయ్యాలన్నా మేము వద్దనడంగాని, వాడిని దేనికైనా మభ్యపెట్టడంగానీ, మా పద్ధతేకాదని, ఆ అమ్మాయికి తెలిసినట్లు లేదు.

ఇంతా జరిగాక, పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేకుండానే, తాను నిర్ణయించిన సమయానికల్లా వివాహం అవ్వాల్సిందే అని నిశ్చయించేసింది, మాలిని. నన్ను బహుదూరముంచుతానని నిర్మొహమాటంగా ప్రతిజ్ఞ కూడా చేసింది. పైగా యివన్నీ రాసేది మా వాడికీ, నాకూను. ఇంతటి వెరపులేనిదనం,

తెగింపు, పాపభీతే లేని కరుకుదనం, ఓర్వలేనితనం ఎందుకో? తెలియక నిస్సత్తువయ్యాను. విలవిలలాడాను, వేసారిపోయాను.

మనస్సు రాయిచేసుకొన్నాను. నా మంచితనం నిలుపు కోవాలి. మా పిల్లలికి నేను అన్యాయంచేయలేను. ఏదోలా ఆ అమ్మాయిని మళ్ళీ మచ్చిక చేసుకోవచ్చునేమో, మనసు మార్చవచ్చునేమో, నామీద కలిగిన అ యిష్టత, అనుమానం దూరం చేయవచ్చునేమో అని ఆలోచించాను. తను చిన్నపిల్లేగా, నిషిలానే కదా. తెలియకే ఇలా చేస్తుందేమో అనికూడా అనుకొన్నాను. కిరణ్ మనసు,వాడి సుఖం,సంతోషమే నాకు ముఖ్యం కావున, మాలిని పుట్టినరోజున, నేనొక్కతినే వెళ్ళి కలవాలని కూడా అనుకొన్నాను.

నా ఒక్కగానొక్క కొడుకు మనసు బాధపెట్టి, ఇలా పోట్లాటలు పెంచి, జీవితాన్ని దుర్భరం కానివ్వదలుచుకోలేదు. కిరణ్‌కి తెలుసు నేను ఏంచేసానో, ఎటువంటి మనిషినో, కొడుకుగా నన్ను బాగా తెలుసుకొన్న వాడే అయినా ఈ గొడవంతా ఎలా సమర్ధించాలో తెలియని అయోమయంలో మునిగాడు.

మాలిని నన్ను చూడ్డానికి ఇష్టపడలేదని అర్ధమయ్యింది. అయినా కిరణ్‌తో, "కన్నా, నీవే ఎలాగో మమ్మల్ని కలుపు, పెళ్ళి చేసేసుకో, అన్నీ సర్దుకుంటాయిలే" అన్నాను.

ఆపై నాకు వచ్చిన జవాబు నన్ను నిశ్చేష్టురాలిని చేసింది. నేనెరుగని ఓ కొత్త సాంప్రదాయం. వింత షరతులు విధించి, కాబోయేవాణ్ణి వేధించి, తలితండ్రులైన మమ్ములతక్షణమే వీడవలెననీ, అత్తింటి వారి ఉనికే వలదనీ, లేదేని మనువుండదని కిరణ్‌కి తెలియ పరిచిందిట, మాలిని. వాళ్ళమ్మ నాన్నలతో మాట్లాడాలంటే "అంతా నాఇష్టమే, వాళ్ళ ప్రమేయమే లేదుకాబట్టి నేనెలాఅంటే అలాజరగాలి " అని నాకే జవాబిచ్చింది. పైగా పెళ్ళి జరిగే ఛాయలకే, నేను రాగూడదని కిరణ్‌కి ఆదేశాలు జారీ చేసిందని కూడా నిర్దిష్టంగాతెలిసింది.

గత పాతికేళ్ళగా నా ప్రపంచమే నాపిల్లలుగా ప్రశాంతంగా సాగిన నా జీవన కొలనులో పిడుగులే పేలాయి. ప్రేమతో కట్టుకున్న ఆశా సౌధాలు కూలాయి. మాబిడ్డని మానుండి చీల్చాలని వేచి ఉన్న ఓ తోడేలులా అనిపించింది గులాబీలా కనిపించే ఈ యువతి విషపూరిత ముళ్ళ గులాబీయే మాలిని అనిపించింది. సుఖ సంతోషాల్ని పంచాలనుకొనే వారితో పాటు, వాటిని హరించాలనుకొనే మాలిని లాంటి వారూ ఈ పుడమిన మెదిలేరు కదా అనుకొన్నాను. ఓపిగ్గా శ్రద్ధతో, జీవిత కాలం పాటు ఆటు పోట్లకి తట్టుకొని, ఏర్పరుచుకున్న జీవన సౌధాన్ని, ఎవరో ఎక్కడినుంచో వచ్చి, ఆనందాలు హరించి, కూల్చను ప్రయత్నించగలరు, కూల్చనూ గలరు అనుకొన్నాను. ఈ క్లిష్ట సమస్యనుండి బయటపడే మార్గమన్వేషిస్తూ, నిత్యం నా మనస్సు అలిసిపోయేది.

యువతలో పురోగతి, విద్యా విజ్ఞానాలతో పాటు కొందరిలో ఓ తెగింపు, ధిక్కార ధోరణి వల్ల ఇలాటివి జరుగునేమోనని కూడా అనుకొన్నాను.

అర్ధంకాని ఈ వైనం, విపరీతమైన ఆ యువతి నైజంకి నిర్ఘాంతపోయినా... అయోమయావస్థలో ఉన్న అమ్మాయిపై జాలేసింది.

కాలం నత్త నడకలు నడుస్తూ మరో నెల గడిచింది. ఈ మధ్య కిరణ్ బిజీగా ఉంటున్నాడు. చూసి నెల పైనయింది. ఆ రోజు శనివారం. పొద్దున్నే ఫోన్ చేసి, "ఐ యాం కమింగ్ ఇన్ టెన్ మినిట్స్ , టెల్ డాడి టు స్టే హోం .. మీ ఇద్దరితో మాట్లాడాలి" అన్నాడు కిరణ్. కాస్త దుఃఖంగా ఉన్నా, వాడికి ఇష్టమైన ఎగ్ కర్రీ, పూరి చేయడంలో ఉండిపోయాను.

ఓ అరగంటలో వచ్చి, నన్ను, వాళ్ళ డాడిని లైబ్రరీలో కూర్చోబెట్టి, తానూ ఎదురుగా కార్పెట్ మీద చతికిలబడ్డాడు కిరణ్ . మావంక చూస్తూ, "ఆఫ్టర్ లాట్ ఆఫ్ థింకింగ్, నేను మాలినితో బ్రేక్ అప్‌కే డిసైడ్ అయ్యాను. మాలినివి, చాల ఇన్ ఎప్రొప్రియేట్ టాక్ అండ్ బిహేవియర్. నాకు నచ్చలేదు. ఎవరికీ మంచిది కాదు. అందరు అన్ హేపీగా ఉండడం బాగా లేదు,"

అంటూ పైకి లేచి, " సో, అదీ సంగతి, నేను కూడా జాబ్‌లో బిజీగా ఉండబోతున్నాను. నువ్వు డాడి కూడా, ఇక ఏమీ దిగులు పడవద్దు..ఐ యాం హంగ్రీ, ఫుడ్ ప్లీజ్ ," అంటూ కిచెన్‌లోకి దారి తీసాడు కిరణ్ .

●●●

## అదృష్టం

పి.ఎస్.నారాయణ

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్‌లో** రాత్రి పదిన్నర గంటలకు బయల్దేరుతుంది.

బాబాయి కూతురు వివాహానికి శుభలేఖ వారం రోజుల క్రితం వచ్చిననాడే ప్రయత్నించినా సెకండ్ స్లీపర్ టిక్కెట్టు దొరక్క ఏసీలో తెప్పించుకున్నాను. నాకయితే దాంట్లో అంత డబ్బు తగలేసి వెళ్ళటం సుతరామూ ఇష్టంలేదు. కాస్త ఇబ్బందయినా బస్సులో కూర్చుని వెళితే సరిపోతుంది. కానీ, ఆయనగారు పోరు పెట్టటంతో తీసుకోక తప్పలేదు.

"పెళ్ళిళ్ళ సీజనులో నీకు సెకండ్ స్లీపర్‌లో బెర్త్ దొరుకుతుందని ఎట్లా అనుకుంటావ్? ఈ సంవత్సరం నేను ఇంతవరకూ ఎల్టీసీ ఉపయోగించుకోలేదు. ఇంకా రెండు నెలలు దాటిందంటే అది కాస్తా మురిగిపోతుంది. నువ్వూ పిల్లవాడూ దాంట్లో వెళ్ళిరండి హాయిగా!" అన్నారు ఆయన.

'సరే డబ్బు మనది కానప్పుడు ఎంత షోకు చేసుకుంటే మాత్రం నష్టమేమిటి' అనుకుని అంగీకరించాను. ఆయనగారికేమో ఆఫీసులో ఇన్స్‌పెక్షన్‌ట. చేసేది బోడి జూనియర్ ఆఫీసరు ఉద్యోగమే. అయినా తను ఒక్కరోజు లేకపోయినా ఆ ఆఫీసేదో కుప్పకూలిపోతుందన్నట్లుగా మాట్లాడుతుంటారు.

శుభలేఖ రాగానే ఓ నిర్ణయానికి వచ్చేశాను - బందరులో పెళ్ళి చూసుకుని ఒక రోజు విజయవాడలోనూ, మరో రోజు గుంటూరులోనూ స్నేహితురాళ్ళతో గడిపేసి రావాలని.

ఐదేళ్ళ క్రితం పెళ్ళయి హైదరాబాద్‌లో కాలుపెట్టిం తరువాత వాళ్ళతో ఫోన్లమీద తప్ప తీరిగ్గా కూర్చుని మాట్లాడిందేలేదు. అందుకే రానూపోనూ టిక్కెట్లు తెప్పించుకున్న రాత్రే వాళ్ళకు ఫోను చేసి నేనుండే ఆ రెండు రోజులూ ఎలాంటి ప్రోగ్రాములూ పెట్టుకోవద్దనీ, ఇంట్లోనే ఉండమని హెచ్చరించాను.

ఆయనతో పెట్టుకుంటే ఇవేవీ అయ్యే పనులు కాదు. అందుకే ఆయన రానననటంతో ఈ అవకాశాన్ని నేను ఆ విధంగా సద్వినియోగం చేసుకోదలుచుకున్నాను.

నాన్న పోయింతరువాత మా బాబాయే మాకు పెద్ద దిక్కయి మంచికీ చెడుకూ నిలబడింది. నా పెళ్ళికూడా ఆయన చేతులు మీదగానే జరిగింది. వాళ్ళమ్మాయి పెళ్ళికి నేను వెళ్ళకుండా ఉండటమనేది భావ్యంకాదు.

నేను స్టేషన్‌లో కాలు పెట్టటమేమిటి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీదకు రావటమేమిటి ఒకేసారి జరిగినయ్. నాకు కావాల్సిన బోగీ దగ్గరకు వస్తూనే పోర్టరు ముందు ఎక్కుతూ బెర్త్ నంబరు అడిగాడు. చంకన పిల్లాడితో వెనగ్గా నేను ఎక్కాను. నేను ఏనాడు చేసుకున్న పూజాఫలమో ఆయన నుండి ఏ విషయంలోనూ ఎలాంటి సహాయమూ లభించదు. కొంపలంటుకుంటయ్యేమో అన్నట్లుగా అర్ధరాత్రి బయలుదేరే ఈ బండికి - 'కాస్త స్టేషన్ దాకా తోడు రావయ్యా మొగుడా' అంటే, 'మా ఆఫీసు ఇన్స్‌పెక్షన్ కొచ్చిన పెద్ద మనిషి సినిమాకు వెళదామా సీతారామాంజనేయులు గారూ అన్నాడు - కాదంటే ఎలాంటి వెధవ రిపోర్టు రాస్తాడో - ఆటోలో వెళ్ళు, అక్కడ పోర్టరు నెత్తిన పెట్టె పెట్టి, నువ్వు దర్జాగా వెనక నడు - నువ్వు ఎక్కుతున్నది ఏసీ కంపార్ట్ మెంటని గుర్తుంచుకో' అంటూ ఓ బోడి ముక్తాయింపు.

ఆయన మాటలకు నా తల నేనే బాదుకుని, మా ఇంటాయన (ఓనర్) కొడుకు, బిటెక్ రెండో సంవత్సరం చదువుతున్న శంకరాన్ని సాయంగా తీసుకుని స్టేషన్‌కు బయల్దేరాను. పాపం మంచి కుర్రాడు - 'పోర్టరు ఎందుకు ఆంటీ? ఆ పెట్టెను నేను పట్టుకోలేనా?' అన్నాడు. 'కాదులే నాయినా.. తోడు వచ్చావు చాలు - ఈ బరువు మోత కూడా దేనికి? ' అంటూ వారించాను. నేను పెట్టెలో కాలుపెడుతూనే వెనక్కు తిరిగి శంకరానికి థాంక్స్ చెబుతూ చేయూపాను.

నా పెట్టె బెర్త్ మీద పెట్టి నాకోసమే ఎదురు చూస్తున్న పోర్టర్ దగ్గరకు ఎదురొస్తున్న జనాన్ని తప్పుకుంటూ వెళ్ళాను. అప్పటికే ఎదురు బెర్తుమీద ఓ మహారాణి శ్రీరంగ నాథ స్వామిలా హాయిగా పడుకుని ఏదో పుస్తకం చదివేస్తోంది. పాపం ఇంట్లో టీవీ సీరియల్స్ చూస్తూ పుస్తకాలు చదివేందుకు తీరుబడి ఉండి ఉండకపోవచ్చు. నాకున్న కుంకలాగానే ఆమెగారికీ పక్కన ఓ కుంకిణి ఉన్నది.

పోర్టరు డబ్బులు పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

దుప్పటి తీసి బయట పడేసుకుందాం అన్నట్లుగా పెట్టె మూత తీస్తుండగా ఎదురు మహారాణి, ఆమెనే ఓరగా చూస్తున్న నా వంక ఒక్కసారి మెడతిప్పి చూచింది. ఎక్కడో చూచినట్లుగా ఉన్న ముఖం. కళ్ళు చికిలించాను. పెట్టె మూతమీద చేయి అలాగే ఉంచి మనస్సు పొరలను ఒక్కొక్కటే విడదీసి చూడసాగాను. ఎక్కడ చూసానబ్బా?

"నువ్వు సుజాతవు కదూ?" ఆ అమ్మాయే చటుక్కున లేచి కూర్చుంటూ అన్నది నవ్వు ముఖంతో.

అప్పుడు గమనించాను - నవ్విన ఆమె నోట్లోని కుడివైపు పంటిమీద పంటిని -ఆమె విజయ. ఐదేళ్ళ క్రితం మా ఇంటిపక్క ఇంట్లో ఉన్న రాక్షసి.

గతం గుర్తుకు రాగానే ఒళ్ళంతా కంపరమెత్తినట్లయిపోయింది. శుభమా అని మా బాబాయి కూతురు పెళ్ళికెళుతుంటే ఇదెక్కడి పీడ నాకు.

నా అదృష్టాన్ని రెండు కాళ్ళతో తన్ని అందలమెక్కి కూర్చున్న దానివంక చూడాలంటేనే ఒళ్ళుమండిపోతోంది.

అది నన్ను చూస్తూ ఆనందంగా నవ్వుతున్నట్లే అనిపించిందిది - గుండెల్లో గునపాన్ని దించిన దానికేం రోగం. దింపించుకున్న నేను ఏడవాలిగాని. డబ్బున్నదనే పొగరు ఎంతటి నీచానికైనా దిగజారుస్తుంది. అందులో పరిచయాలు, స్నేహాలు గుర్తుకు రావు. మర్యాదలు తెలియవు. అన్నీ మంట కలిసి బూడిదయిపోతాయి.

కనబడుతూనే ఉన్నది కదా దాని అహం. అర్ధరాత్రి రైలు ప్రయాణంలో కూడా తన అంతస్తు ప్రయాణీకులకందరికీ తెలియాలీ అన్నట్లుగా మెడలో సొమ్ములు.

పెళ్ళయింతరువాత కాస్త రంగు తేలినట్లునది. నలుపు విరిగి ఛామనఛాయలోకి వచ్చింది. డబ్బుంటే ఎలుకతోలును కూడా ఎర్రతోలు చేయవచ్చు. ఇప్పుడు ప్రతిదానికీ సర్జరీ అంటూ ఒకటి ఏడ్చి చచ్చిందికదా.

పెట్టెలోనుంచి రెండు దుప్పట్లు బయటపడేసి టక్కున మూత వేసేశాను విసురుగా.

"ఏఁవిటి నన్ను గుర్తుపట్టనేలేదా అయిదేళ్ళ క్రితం గుంటూరు బ్రాడీపేట పద్నాలుగో అడ్డరోడ్డులో మీ పక్కింట్లో ఉన్న విజయను" అన్నది పకపకా నవ్వుతూ - మండుతున్న నా ఒంటికి మరింత కారం పుస్తున్నట్లుగా.

●●●

నిజమే ఆవిడగారు మా పక్కింట్లో ఉన్నమాట వాస్తవమే.

నాతో పాటు ఏసీ కాలేజీలో డిగ్రీ ఏడ్చి అత్తెసరు మార్కులతో పాసయినానిపించుకున్న విజయే.

నేను ఎంత అందగత్తెనయితేనేం, నాకు డిగ్రీలో ఫస్ట్ ర్యాంక్ వస్తేనేం దాని డబ్బు నన్ను ఈడ్చి ముఖం వాచేలా తన్నింది. నా అదృష్టాన్ని మంటకలిపింది.

బడిపంతులు కూతుర్ని నేను. రెండు చేతులా ఎడాపెడా సంపాదిస్తున్న ఉద్యోగి ఆవిడగారి తండ్రి. ఇంట్లో అడ్డంగా సంపాదించిన డబ్బంతా అటకల మీద బియ్యపు బస్తాలో మూలుగుతుంటుందనేది మా వీధిలోని అందరూ చెవులు కొరుక్కుంటుండే బహిరంగ రహస్యం.

మా నాన్న ఓ అరడజను చెప్పులు అరగదీసుకుని, నేను కంప్యూటర్స్‌లో ఏవో వెధవ కోర్సులతో ఒళ్ళు విరగ్గొట్టుకుంటుండగా ఓ సంబంధం తీసుకు వచ్చాడు. మా కుటుంబంలా ప్రతిదానికీ వెనుకా ముందూ చూసుకుండే అవసరం లేకుండా కాస్తంత ఉన్నవాళ్ళే. పెళ్ళి చూపుల్లో పది నిమిషాలు చూచిన నాకు అతడు అందాల రాకుమారుడులాగానే కనిపించాడు. అతనూ డిగ్రీ చేసి ఏదో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. మంచి సంప్రదాయ కుటుంబమని మా నాన్న అమ్మతో చెబుతుండగా విన్నాను. ఈ సంబంధం కుదిరితే సుజాత చాలా అదృష్టవంతురాలు అని అనటం కూడా నా చెవినిపడింది. నా అందానికి సరిజోడీ అయిన అతడు నా భర్త అయితే ఇంకా నాకు కావాల్సిందేమున్నది? వాళ్ళు అటువెళ్ళగానే మా అమ్మ నా అభిప్రాయం అడిగినప్పుడు - నాకు అతడు నచ్చాడు, మిగతా విషయాలు మీకు నచ్చితే ఓకే చేయండి అని నా అంగీకారాన్ని బిడియపడకుండా చెప్పేశాను. ఎవరిబాగు వాళ్ళు చూచుకోవాలనేది ఇప్పటి చదువుల్లో నేర్చుకున్న మొదటి పాఠం.

ఆ రాత్రే మధ్యవర్తి, ఆలస్యం భరించలేనట్లుగా, ఫోన్ చేశాడు - నేను వాళ్ళింట్లో పెద్దవాళ్ళందరికీ నచ్చినట్లేట.

కానీ తరువాత వారం రోజుల్లోనే, ఓడల్ని బండ్లు చేస్తున్నట్లుగా, మధ్యవర్తి మహాశయుడు వచ్చి వాళ్ళు మీ పక్కింటి పద్మనాభం గారి కూతురు విజయను చేసుకోవటానికి నిర్ణయించుకున్నట్లుగా తెలిసింది అని చెప్పాడు - ఆ వార్త మా ఇంట్లో అందరిమీదా కంటే, వారం రోజులబట్టీ అందమైన కలలు కంటున్న నా మీదే పెద్దబాంబులా పడింది.

మాకు అంతా అయోమయమయిపోయింది. అసలు దాన్ని ఎప్పుడు చూశారు వాళ్ళు?

మా నాన్నకు ఆ మాట వింటూనే నన్ను మించిన తిక్కరేగింది - నా కంటే అందంలేనిది, నాకంటే చదువు తక్కువ ఉన్నదయిన దాని వలలో అతగాడు పడటానికి కారణం - అందం కాదు, చదువుకాదని - అది వాళ్ళ నాయన అడ్డదిడ్డంగా సంపాదించి బస్తాల్లో కుక్కిన డబ్బేనంటూ మా నాన్న బయట వాళ్ళద్వారా ఆరా తీసి, ఆపైన ఆ కుటుంబాన్నీ, ఆయన చేస్తున్న ఉద్యోగాన్నీ తిట్టిన తిట్టు తిట్టకుండా వదిలేశాడు.

దాని పెళ్ళి, నా ఆశల యువరాజుతో జరిగి, నేను కట్టుకున్న రంగు రంగుల భవంతిలో అదికాస్తా కాలుపెట్టేసింది. ఆ కసితోటే నేనూ వెంటనే పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకున్నాను. మా నాన్న మరో నాలుగు జతల చెప్పులు మార్చేసి చివరకు ఆయనకు తెలిసిన

మరో బడిపంతులు కొడుకు సీతారామాంజనేయులుతో నా వివాహం జరిపించి గుండెలమీద కుంపటిని దించేసుకుని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

●●●

ఎదురు సీట్లో కూర్చుంటూనే మా గుంటడ్ని విసురుగా బెర్త్ మీద కూలేసి, "అవును గుర్తొచ్చావ్. ఇప్పుడెక్కడుంటున్నారు అమెరికాలోనా, ఆస్ట్రేలియాలోనా?" అన్నాను కాస్తంత ఈర్ష్యగా.

అసలు అప్పుడు జరిగిన ఆ సంఘటనతో కూడిన కోపంతో, వాళ్ళు మా ఇంటికి వచ్చి ఎంతగా పిలిచినా, నేనా పెళ్ళికి వెళ్ళలేదు. నావాడు అవ్వబోతున్నాడు అనుకున్న వాడు మరో అమ్మాయి పక్కన పీటలమీద కూర్చుని మూడు ముళ్ళు వెయ్యటం నేను చూడలేని విషయం. భరించలేని విషయం. మా అమ్మా నాన్నా మొహమాటానికి వెళ్ళి, ముహూర్తం అవ్వగానే కాసిని అక్షింతలు వాళ్ళ నెత్తిన చల్లి రెండు మెతుకులు గతికి ఇంటికి వచ్చేశారు.

"అమెరికాలోనూ, ఆస్ట్రేలియాలోనూ ఏమున్నది అందం. హైదరాబాద్ లోని అంబర్‌పేటలో మూడు బెడ్ రూమ్లు డూప్లెక్స్ కట్టుకుని హాయిగా ఉంటున్నాం" అన్నది కాస్తంత కళ్ళు చికిలించి గర్వంగా.

ఆ వెధవ చూపులకే నా ఒళ్ళు మండేది.

"అమ్మా నాన్నా ఏ ఊళ్ళో ఉన్నారు?" దరిద్రుడు - బల్లక్రింద చేయి ఏ రోజు తడవకపోయినా అన్నం సహించేది కాదట - నా మొహం ఇంకా బల్లకింద చేతులు ఎవరు పెడుతున్నారు - అంతా బల్లపైనే బాహాటంగా - అలా జనాన్ని పీడించటమనేది దారికాచి దోపిడీ చేయటం కన్నా హీనం.

"ఎక్కడో ఏం ఖర్మ. విశ్రాంతి జీవితం గడుపుతూ నా దగ్గరే ఉన్నారు"

"అంటే ఇంట్లో వంటపని కూడా తప్పిందన్నమాట" కాస్తంత ఎగతాళిగా మనస్సులోని అక్కసును వెళ్ళగక్కాను. "బజారు పన్లకూ నాన్న ఉండనే ఉంటాడు" నేను నా ఇంట చూస్తున్నాను గదా - సీతారామాంజనేయులుగారికి ఆఫీసే మరో పెళ్ళాం అది గీచిన గీటు లక్ష్మణ రేఖే అగ్గిపుల్ల కావాలన్నా నేనే పరిగెత్తాలి రోడ్డుమీదకు, వీడిని చంకనేసుకుని ఇంటికి తాళం పెట్టి. మా అమ్మా నాన్నకు కొడుకూ, కోడలికి సుప్రభాత సేవనుంచి, పవళింపు సేవవరకూ అన్నీ అమర్చటంతోటే సరిపోతోంది. ఆయనగారు రిటైరయిన తరువాత మరీ.

వనజ పకపకా నవ్వింది. "ఏం చేస్తాం. ఎవరి అదృష్టం వారిది. చేసుకున్నవాళ్ళకు చేసుకున్నంత మహదేవ"

"మీ నాన్న ఏసీబీ దాడులు లేకుండా రిటైరయి హాయిగా ఉన్నారా?" అని అడుగుమని నోటిదాకా వచ్చిందిగానీ, మరీ పచ్చిగా ఉంటుందేమోనని అడగలేకపోయాను - ఎవరి ఖర్మ వాళ్ళే అనుభవిస్తారు - పైన దేవుడు లేడూ - అలాంటి వాళ్ళను ఓ కంట కనిపెట్టి ఉండటానికి - అందునా నాలాంటి మరో పిల్ల నోట దుమ్ము కొట్టిన తరువాత.

పిల్లవాడు కదులుతుంటే బెర్త్ తడుపుతాడేమోనని, దబదబా ఎత్తుకుని టాయిలెట్ వైపుకు నడిచాను. తిరిగి వచ్చేటప్పటికి ఆవిడగారూ పిల్లను ఎత్తుకుంటున్నది. అప్పుడు చూచాను ఆ పిల్లవంక. ఏమాటకామాటే చెప్పుకోవాలి. నాలుగు సంవత్సరాలు ఉంటాయేమో, బాబ్డ్ హెయిర్‌తో బంగారు బొమ్మలా మెరిసిపోతున్నది - అంతా తండ్రిపోలికే.

ఇంకా నయం - ఆయనగారుకూడా రాలేదు - మరీ ఉడుక్కు చావాల్సి వచ్చేది. ఆయన్ను చూస్తుంటే మనస్సు నిలిచేదికాదు. పెళ్ళిచూపులనాటి ఆ రూపమే గుర్తుకువచ్చి ఈ మహమ్మారి మూలకంగా నేనెంత నష్టపోయానో ఊహించుకుంటూ తెల్లవార్లూ ఈ దరిద్రపు బెర్త్‌మీద కంటికి కునుకు లేకుండా పడి చావల్సి వచ్చేది.

పాప అందం చూస్తుంటే ఈర్ష్యగా ఉన్నా మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. "పిల్ల చక్కగా ఉన్నది" నువ్వెలా ఉన్నావు అన్న మాటను మనస్సులోనే మ్రింగేసుకుంటూ అన్నాను. "పేరేం పెట్టారు?"

"ఐశ్వర్య"

నాకు గుండెల్లో మరోసారి మంట ఎగతన్నింది - అంత మంచిపేరు పెట్టినందుకు. మంచి మంచి ఆలోచనలు కూడా అలాంటి అదృష్టవంతులకే వస్తుంటయి. నా ఖర్మకాకపోతే సీతారామాంజనేయులు గారు తన కొడుక్కు కావాలని మరీ, నేనెంత వద్దంటున్నా వినకుండా, హనుమంతరావు అని పెట్టారు - ఊళ్ళోవాళ్ళంతా హనుమంతూ అని పిలవటం - వీడు కుప్పిగంతులు వేస్తూ పరుగెత్తటం - వాళ్ళింట ఎంతమంది పుట్టినా ఆ పేర్లే చెలామణీ అవ్వాలిట - అది రామభక్తుడయిన వాళ్ళ ముత్తాతగారు చచ్చేముందు పెట్టిన ఆంక్షట. ఆ ఇంట కాలు పెట్టిన కోడళ్ళే తలలు పగలకొట్టుకు చావాలికానీ వాళ్ళు మాత్రం మారరు.

పిల్లను తీసుకువచ్చి పక్కన పడుకోబెట్టుకుంటూ లైటార్పింది.

"ఎంతదాకా ప్రయాణం?" ఇప్పుడు ఇదీ నాతోపాటే బందరు దాకా తగలడుతుందేమో - నాకు తెల్లవార్లు నిద్రలేకుండా చేస్తూ.

"విజయవాడ - మా ఆడబడుచు కూతురుకు రేపు సీమంతం వెళ్ళకపోతే ఆవిడగారికెక్కడ కోపమొస్తుందో అని బయలుదేరాను. మళ్ళా రేపు రాత్రికే తిరిగివచ్చేయాలి. నేను లేకపోతే ఇంట్లో ఒక్క క్షణం గడవదు" అన్నది కళ్ళు మూసుకోవటానికి ప్రయత్నిస్తూ. అంటే మొగుణ్ణి బుట్టలో బాగానే వేసుకున్నదన్నమాట - మా సీతారామాంజనేయులూ ఉన్నాడు. ఇంట్లో పెళ్ళాం ఉన్నదనే ధ్యాసే ఉండదు. ఎప్పుడూ ఆఫీసూ ఆఫీసు. ఇందాక అదన్నట్లు దేనికైనా మనం పెట్టి పుట్టాలి. కొందరి జీవితాలు ఇంతే. ఇంత అందముండీ ఏం లాభం. ఆయనగారికి నాలాంటి పెళ్ళాన్ని వాడిపోని పువ్వులా చూసుకోవాలనే ఇంగిత జ్ఞానం లేనప్పుడు.

"మీ అత్తగారు ఎలా ఉంటారు. మంచివారేనా?" అడిగింది నన్ను ఒంకరగా చూస్తూ.

"పాపం మంచిదే అమాయకురాలు కూడా. కూతురు కడుపులో గడ్డ పుడితే కడుపు అని సంబరపడిపోయి మా ఆడబడుచును కాలు కదలకుండా కూర్చోబెట్టి చేసిన పిండివంట చేయకుండా చేసి మూడు నెలలు తినిపించింది" అన్నాను అది ఉడుక్కోవాలన్నట్లుగా. "అవునూ - ఇందాకటి నుంచి అడుగుదామని - ఎప్పుడూ మీ ఆయన్ను అడగలేదా - మా పక్కింటి పిల్లను చూశావుగదా, ఆ అమ్మాయీ బాగానే ఉంటుంది కదా - ఎందుకు తిరస్కరించావని"

వనజ విచిత్రంగా ఒకసారి నా వంక ఆ గుడ్డివెలుగులో చూసినట్లనిపించింది. తరువాత కొద్దిక్షణాలు ఆగి, "ఏమో ఆయన్ను అడగాలనే ఆలోచనే రాలేదు నాకు. కానీ, ఒకసారి మా అత్తగారే ఏదో మాటల్లో అన్నారు" అంటూ ఆగింది.

నేను ఆత్రంగా లేచి కూర్చున్నాను. "ఏమని?"

వనజా లేచి కూర్చున్నది. కొద్దిక్షణాలు చెప్పాలా వద్దా అన్నట్లుగా తటపటాయిస్తున్నట్లుగా మౌనంగా ఉండిపోయింది. "మావారి మనస్సులో కాస్తంత న్యూనతా భావం ఉన్నదిటలే. నాకయితే ఎప్పుడూ అలాంటి భావన కనబడలేదనుకో. ఆ అమ్మాయి నాకంటే అందంగా ఉన్నది, నాకంటే ఎక్కువగా ఏవేవో కోర్సులు చేస్తున్నట్లున్నది. నలుగురూ నన్ను ఎగతాళిచేస్తే నామర్దాగా ఉండదా - అంటూ వాళ్ళు ఎంత చెప్పినా వినకుండా నిన్ను కాదన్నారట" అంటూనే ఐశ్వర్య కదులుతుంటే మళ్ళా పిల్లమీద చేయి వేసుకుని చిచ్చికొడుతూ పడుకున్నది.

నా గుండెల్లో పెద్దబరువు తీరినట్లనిపించింది ఆ మాటలకు. ఆయనగారికి నేను నచ్చక కాదన్నమాట. తనకంటే నేనే అందగత్తెనని గుర్తించాడన్నమాట. చదువుకూడా ఆయనగారికంటే నాదే ఎక్కువనే వాస్తవాన్ని కూడా గ్రహించి నన్ను చేసుకోవటానికి జంకాడన్నమాట. నాకు పెద్దరిలీఫ్. ఆపైన కాస్తంత గర్వంకూడా వేయటంతో పెదవుల మీదకు చిరుదరహాసం తెచ్చుకుంటూ బెర్త్ మీదవాలాను.

అన్నిటికీ మించి ఆవిడగారి తండ్రి తను సంపాదించిన అడ్డమైన గడ్డితో నన్ను ముంచలేదనేది పెద్ద రిలీఫ్.

ఆవేశం తగ్గగా ఆవలింతలు రావటం మొదలు పెట్టినయ్.

"మీవాళ్ళు ఎంత కట్నమిచ్చారేం?"

"వాళ్ళు అడగలేదు. మావాళ్ళు ఇవ్వలేదు"

"అవునులే ఒక్కతే కూతురు. వాళ్ళు చస్తే ఆలప్పంతా వచ్చేది ఈవిడగారికేగా. ఇంకా కట్నం తీసుకుని లోకువ్వవ్వటం దేనికి. కట్నం తీసుకోకుండా అందరిముందూ పెద్ద హీరోలా కాలరెగరేయచ్చు" మనస్సులోనే అనుకున్నాను.

"విజయవాడదాకా వెళుతున్నావు కదా. గుంటూరు వెళ్ళటం లేదా. నేనయితే ఒకరోజు పూర్తిగా అక్కడ కార్యక్రమం పెట్టుకున్నాను. బందరులో మా బాబాయి కూతురు పెళ్ళవ్వగానే విజయవాడలో ఒకరోజు, గుంటూరులో ఒకరోజు గడిపి అక్కడినుంచే సరాసరి హైదరాబాదు వచ్చేద్దామని. పాత స్నేహితురాళ్ళెవ్వరూ ఇంకా అక్కడలేరా?" కుతూహలంగా అడిగాను. ఇప్పుడు వనజ మీద నాకు అంత కోపం లేదు, అంత కసీ లేదు. అది మాత్రం ఏం చేస్తుంది, అతగాడికే నన్ను భార్యగా చేసుకోవటం ఇష్టంలేనప్పుడు.

"నేను ఎక్కడికీ వెళ్ళేదిలేదు. రేపు రాత్రి మళ్ళీ ఇదే ఎక్స్‌ప్రెస్‌లో కొంపకు జేరకపోతే అది కొల్లేరయి కూర్చుంటుంది. నాన్నకు పక్షవాతమొచ్చి మంచంలోనుంచి లేవలేడు. అమ్మకు కూర్చుంటే ఆయాసం, నిల్చుంటే నీరసం."

"ఏం ఒకరోజు సాయం చేసిన మీ ఆయన ఇంకోరోజు చేయలేడా. మరీ విచిత్రం పోతున్నావ్ ఒక్కరోజుకు"

తన మొగుణ్ణి అనేటప్పటికి కోపమొచ్చినట్లున్నది చటుక్కున మరోసారి లేచి కూర్చున్నది - ఏం చెప్పాలా అన్నట్లుగా నా వంకే చూస్తూ కొద్దిక్షణాలు మౌనంగా ఉండిపోయింది. తరువాత తనని తాను నిగ్రహించుకుంటున్నట్లుగా మొహం పక్కకు తిప్పుకుంటూ, "ఇంకెక్కడి ఆయన!? పెళ్ళయిన రెండో ఏటే యాక్సిడెంట్‌లో పోతే" గొణుగుతున్నట్లుగా అన్నా ఆ మాటలు నాకు స్పష్టంగా వినబడినయి.

నా గుండె గుభేలుమన్నది - నేను కోరుకున్నట్లుగా ఆయనే నా భర్త అయి ఉన్నట్లయితే కళ్ళంతా బూజర్లు క్రమ్మగా నాకు ఏమీ కనబడటంలేదు.

పట్టాలు మారుతున్నదల్లే ఉన్నది - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ పెద్ద శబ్దంతో నన్ను అటూ ఇటూ ఊపేస్తోంది.

●●●

## కాలచక్రం — అపర్ణ మునుకుట్ల గునుపూడి

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"**చెప్పిన మాట విను నాన్నా! నా బంగారు తండ్రివికదూ.** నేనిప్పుడే బజారుకెళ్ళి చిటికెలో వచ్చేస్తాగా. "

అమ్మ వెనకాల బజారుకి వెళ్ళాలని మారాం చేస్తున్న మా తమ్ముడ్ని బుజ్జగిస్తోంది. ఎంత చెప్పినా వినడం లేదు తమ్ముడు. అవును మరి, ఎవరైనా వీధిలోకి వెళుతూంటే ఎంచక్కా వాళ్ళతో వెళ్ళాలని ఎవరికుండదు.

''అబ్బబ్బ, చెప్పినమాట వినరు బాబు ఈ పిల్లలు ఎలా చేసుకోవాలో ఏమిటో'', అనుకుంటూ, ''ఇదిగో సుందరీ చూడు, తమ్ముడిని కొంచెం చూసుకో. నేనిప్పుడే బయట పనులు చూసుకుని వచ్చేస్తాను'' అంటూ నాకు హుకుం జారీచేసి చటుక్కుని బయటకెళ్ళి తలుపు దగ్గరగా వేసేసింది అమ్మ.

''వాడు చేసే అల్లరి ఇంతా అంతా కాదు. అమ్మ చెప్పినమాటే వినడంటే ఇక నేచెప్పిన మాట వింటాడూ? వాడు చేసే అల్లరి వాడు చేస్తూ ఉంటాడు. వాడు అల్లరి చేసేడని మళ్ళీ నన్నే కోప్పడతారు'' అని గొణుక్కుంటూ సరేనన్నాను..

నాకప్పుడు పదకొండేళ్ళు. చెల్లికి తొమ్మిదేళ్ళు, తమ్ముడికి ఆరేళ్ళు. చెల్లెలు దానిపాటికి అది బొమ్మలాటలు, బొమ్మ పెళ్ళిళ్ళతో హాయిగా కాలక్షేపం చేసేస్తుంది. ఎటొచ్చి తమ్ముడే ఏక అల్లరి. ఒకచోట ఉండడు సరికదా తోక తెగిన కోతల్లే అస్తమానం గెంతుతూ ఉంటాడు. వాడిని కూచోపెట్టి ఏదైనా పని చేయించడం వాడిని పుట్టించిన బ్రహ్మతరం కూడా కాదు. పైగా వాడు అల్లరి చేసినప్పుడల్లా అందరినీ కలిపి ''చెప్పినమాట వినరమ్మా ఈ పిల్లలు'' అంటుంది అమ్మ. నేనే ఎప్పుడూ వింటాను. ఇప్పుడు విన్నానా లేదా? అప్పుడప్పుడే వినను. ఎందుకంటే బుద్ధిగా అమ్మ చెప్పినమాట విన్నానంటే నేను అస్తమానం ఏవో పనులు చేస్తూనే ఉంటాను. మరి నేనెప్పుడు ఆడుకోవాలి. అందుకే అప్పుడప్పుడు వినను. అలాంటప్పుడే అమ్మ వెళ్ళి నాన్నతో చెబుతుంది. నాన్నేమో ''చెప్పినమాట వినేడువు. అసలే ఆడపిల్లవి కూడాను'' అని కోప్పడతారు. ఆడపిల్లనయితే మాత్రం నేనెందుకు వినాలో నాకర్థం కాదు. తమ్ముడిని ఎప్పుడూ మగపిల్లాడివి చెప్పినమాట విను అనడం నే వినలేదు. సరే ఎలాగైతేనేం, అప్పుడప్పుడు వింటూ, మరొకప్పుడు వినకుండా మెల్లిగా హైస్కూలు మంచి రాంక్‌లో ముగించేను.

ఇప్పుడు అసలు గొడవ మొదలైంది. అమ్మేమో ''అంత మంచి మార్కులువచ్చేయి చక్కగా ఇంజినీరు చదవ్వే'' అంటోంది. నాన్న సరే సరి, నేను బయాలజీ తీసుకుని డాక్టర్నపోయినట్టు ఊహించేసుకుంటున్నారు. నాకేమో తెలుగు తీసుకోవాలని ఉంది. అమ్మ చెప్పినమాట వినాలా, నాన్నచెప్పినమాట వినాలా, నాకు నచ్చింది చేయాలా? వాళ్ళు చెప్పింది చెయ్యడం పెద్ద కష్టం కాదు. కాని నేను చెప్పింది వాళ్ళు ఎందుకు వినకూడదు అన్నది అసలు ప్రశ్న. ''ఆడపిల్లకి డాక్టరీ చదువు ఎందుకండి, రాత్రి పగలు పని చేస్తే పిల్ల నలిగి పోతుంది అంది'' అమ్మ.

అంత మాటంటుందా, అమ్మ. ఆడపిల్లనైతే ఏం, పని చేయలేనా అనుకుంటూ, అమ్మ ఆలోచనలు తల్లక్రిందులు చేయడానికైనా డాక్టర్ అవాలని పౌరుషం వచ్చేసింది. అందుకే బయాలజీలో చేరి M.B.B.Sకి ప్రయత్నం చెయ్యడం, అది విఫలమవుతే B.A తెలుగులో చేరిపోవడం అన్న పథకంతో బయాలజీలో చేరిపోయేను. అమ్మ మీద పంతమో, నా గ్రహ బలమో, మొత్తానికి ఇంటరు మంచిమార్కులతో పాసయి, Entranceలో కూడా మంచి రాంక్ వచ్చేసింది. తెలుగు చదవాలన్న నా కలలు కరిగిపోతూంటే, ఎందుకో గాని ఇదంతా అమ్మా, నాన్న కలిసి నన్ను మాయ చేయడానికి ఆడిన నాటకమేమో అన్న అనుమానం వచ్చింది. ఎందుకంటే అప్పుడు ఆడపిల్ల డాక్టరీ కష్టం అదీ ఇదీ అన్న అమ్మ ఇప్పుడు అస్సలు నోరు విప్పడం లేదే ఇదమిద్ధంగా ఏదీ తేల్చుకోకుండానే M.B.B.S సీటు రావడం, పెద్దగా ఆలోచించే వ్యవధి లేకపోవడం, సరే ఎలాగూ పంతం పట్టేనుకదా అదైనా తీర్చుకుందాం అనుకుని అందులో చేరిపోవడం జరిగి పోయేయి. నాన్న తన పంట పండిందని పొంగిపోయి ఉంటారు. చెల్లెలు తమ్ముడు కూడా పెద్ద చదువులకి వస్తున్నారు కనక, వాళ్ళు నన్ను చూసి కొంచెం వళ్ళు దగ్గర పెట్టుకుని బుద్ధిగా చదవడం మొదలు పెట్టేరు. ఇదీ ఒకందుకు మంచిదే అనిపించింది. కాని మనసు మారుమూల ఎక్కడో అమ్మా, నాన్న ఏదైనా పథకం వేసి నన్ను ఇందులోకి తోసేరా అన్న అనుమానం లేకపోలేదు. ఆ విషయం తరచి తర్కించే తీరిక ఇప్పుడు లేదు.

నేను M.B.B.S చదువుతూండగానే తోటి విద్యార్థి మాధవ్‌తో పరిచయం.ఆ పరిచయం ప్రేమగా మారడం జరిగేయి. డిగ్రీ అయ్యాక పెళ్ళి చేసుకుందాం అన్న నిర్ణయం కూడా చేసుకున్నాం. ఈ విషయంలో మాత్రం అమా నాన్న, నేను చెప్పినమాట విని తీరాలని తీర్మానించుకున్నాను. నేను వాళ్ళన్నట్టు M.B.B.S చదవడం వల్ల నన్ను గౌరవించాలనుకున్నారో, లేక మాధవ్ మంచిపిల్లాడనుకున్నారోగాని మొత్తానికి మా ప్రేమను పరిణయం చెయ్యడానికి సంతోషంగానే ఒప్పుకున్నారు. చెల్లెలు M.Sc లో చేరింది. తమ్ముడు మామూలే, ఇంజినీరింగులో చేరేడు. చూస్తూండగా చెల్లెలు చదువు అయ్యేలోపల దాని పెళ్ళి కుదరడం, నాకు కొడుకు పుట్టడం చకచకా జరిగిపోయేయి. రెండూ చాలా ఆనందకరమైన విషయాలే కాని చెల్లెలు దాని మొగుడితో అమెరికా వెళుతూంటే చాలా దిగులు పుట్టింది. దిగులు కాదూ మరి. ఎంత చెప్పినమాట వినకపోయినా మేం ముగ్గురం ఒకర్ని విడచి ఒకళ్ళం ఎప్పుడూ ఉండలేదు. ఇప్పుడు అది అంత దూరం వెళుతూంతే మరి గుండెల్లో ఏదో బాధ, భయమూను. దాన్నించి తేరుకుని అటునించి ఇటు తిరిగేప్పడికి నాకు రెండో కొడుకు పుట్టడం, తమ్ముడు పై చదువులకి అమెరికా వెళుతున్నాననడం! ఇదేమిట్రా ఇద్దరూ నన్ను వదలి అంత దూరం వెళుతున్నారు అని బాధపడ్డాను. నా పిల్లలు నావాళ్ళని దూరం చేస్తున్నారా అని కోప్పడ్డాను. ఏం పడ్డా, ఏదీ ఆగలేదు.

పిల్లలు మెల్లిగా పెద్దవాళ్ళవుతున్నారు. బళ్ళో చేరడాలు, చదువుకి కావలిసినా సరంజామా కొనడాలు, హోంవర్కులూ, ఒకటేమిటి, అన్నీ మొదలయ్యాయి. చిన్నతరగతుల్లో ఉన్న వాళ్ళచేత చదివించడం నా తరం కావడం లేదు. పిన్నీ, మావయ్యా కలిసి వీళ్ళిద్దరినీ తెగ ముద్దు చేసేరేమో వీళ్ళదగ్గర లేని ఆట బొమ్మ లేదు. ప్రొద్దస్తమానం వాటితోనే కాలక్షేపం చేస్తామంటారు. అది నాకు కుదరదు. ఏ తలితండ్రులకి మాత్రం కుదురుతుందేమిటి?

"చూడు విజయ్! చెప్పినమాట విని హోంవర్కు ముగించేసి ఎంత సేపైనా ఆడుకో" అని నచ్చచెప్పేను.

"వినయ్! వచ్చి కూచుని ఈ ఎక్కాలు బట్టీ పట్టమ్మా! రా చెప్పినమాట విను నాన్నా, నా తండ్రివికదూ (స్మృతి పథంలో ఓ తునక తళుక్కుమంది). ఇద్దరూ చదువు పని ముగించి తరవాత ఆడుకోండి" అని నేను ఒక వైపు అరుస్తూనే ఉన్నాను, వాళ్ళ ధోరణిలో వాళ్ళు ఉన్నారు.

పిల్లల్ని అదుపులో పెట్ట లేక మాధవ్‌ని పిలిచేను. "ఏదో ఆడుకోనిద్దూ, ఇప్పుడుకాకపోతే ఇంకెప్పుడు ఆడుకుంటారు. చదువులు వాటంతట అవే వస్తాయి" అని తేలిగ్గా తీసిపారేసేడు. చివరికి మాధవ్ కూడా నే చెప్పినమాట వినడంలేదు. ఎవరు చెప్పిన మాట ఎవరు వింటారు. జీవితం అంతా మనం ఎవరో చెప్పిన మాట వినాలి, లేకపోతే మనం చెప్పినమాట ఇంకొకరు వినాలి. అందులో ఎవరు ఎంత ఎక్కువమందిచేత వినేట్టుచేస్తారో అన్నది వారి ప్రతిభ సూచకం. పిల్లల్ని పట్టించుకోకుండా అలా వదిలేస్తే ఏమైపోతారన్న బెంగ కూడా లేదు మాధవ్‌కి. ఇలా అయితే ఎందుకూ పనికిరాకుండా పోరూ. వాళ్ళచేత చెప్పినమాట వినేలా చేయడం ఒక పెద్ద తతంగం. స్కూలు ఫైనల్ ముగించిన అమ్మ ముగ్గురు పిల్లల్ని ఎంత సమర్థవంతంగా పెంచింది!? ఇంత చదువుకున్న నేను మరి ఇద్దరిని అదుపులో పెట్టలేకపోతున్నానేమిటి? వాళ్ళపాటీ చెయ్యలేకపోతే ఇంకెందుకూ? అమ్మా నాన్నల మీద గౌరవం కోటింతలు పెరిగిపోయింది. వాళ్ళ ఫొటో తీసుకొచ్చి దేముడి పటం పక్కని పెట్టి రోజూ దండం పెట్టాలనిపించింది. ఈ పిల్లల్ని boarding schoolలో చేర్పిస్తేనో! ఛ, ఛ, ఉన్నవాళ్ళకి దూరంగా ఉండి చదువుకోవడం అదేం ఉద్ధరింపూ? పోనీ కనీసం ఓ tution master పెట్టవొచ్చునుకదా. ఆ పని చెయ్యగలను. ఇంతలో అనుకోకుండా నాన్న పోవడం జరిగింది. చెల్లెలు, తమ్ముడూ పై దేశంలో ఉండడంతో అమ్మని నాదగ్గరికి తీసుకు వచ్చి పెట్టుకున్నాను. అమ్మకి కూడా పిల్లలతో కాస్త కాలక్షేపం అవుతుందనుకున్నాను.

కాలక్రమేణా పిల్లలు పెద్దవాళ్ళయ్యేరు. నేను చెప్పింది ఏదీ ఒక్కడూ చెయ్యలేదు. అలాగని పెద్దగా చెడిపోనూ లేదు. మేం డాక్టర్లం కదా M.B.B.S. చెయ్యరా అంటే "అబ్బెబ్బె, డాక్టర్ ఎవడు చేస్తాడు. నేను commerce తీసుకుని M.B.A/C.A. చేస్తాను" అన్నాడు

విజయ్. పోనీ ఏదో ఒకటి చదువుతానన్నాడు కదా. సరే నువ్వయినా M.B.B.S. చెయ్యరా వినయ్ అంటే అబ్బె, నాకు ఆటలంటే ఇష్టం క్రికెట్ టీంలో చేరుతానన్నాడు. క్రికెట్ ఆడడం ఒక పెద్ద ఉద్యోగం అన్నట్టు. అదేమిటంటే

"అమ్మా! మీకేం తెలీదు. మీ ఆలోచనలన్నీ పాతకాలంవి. డాక్టర్ చదవడం, ఇంజినీరవడం, ఇదంతా చాలా పాత ఫేషన్" అన్నాడు వినయ్.

"మరి కొత్త ఫేషన్ ఏమిట్రా?"

"అలా అడుగు చెబతా విను. క్రికెట్, పుట్‌బాల్, టెన్నిస్ లాంటి టలాడడం, లేకపోతే టీంలో చేరి ఏదైనా పని చెయ్యడం! ఎంత మజాగా ఉంటుందో తెలుసా!"

"ఒహో! అలాగా! మరి డబ్బులెలా వస్తాయిరా కన్నా?"

"డబ్బులా! అమ్మా, నీకసలు ఏమీ తెలీదు. చూడు ఇలా వచ్చి కూర్చో, చెప్తాను. అమ్మా, డబ్బులు మనం కావాలనుకుంటే వచ్చేవి, వద్దనుకుంటే పోయేవి కావమ్మా. మనం మన life లో మనకి ఇష్టమైనదీ మన మనసుకు నచ్చినది చేసేసుకుంటూ పోవడమే. డబ్బులు వాటంతట అవే వస్తాయమ్మా. మనం పుట్టిననాడే దేముడు మన ఖాతాలో వ్రాయవలసింది, రావలసింది జమ చేసేసేడు. మనం ఎంత శ్రమ పడ్డా దానికన్నా ఒక్క పైసా ఎక్కువకాని, తక్కువకాని సంపాదించలేం. దానికి ఎందుకింత హడావిడి చెప్పు. కొంచెం లైటు తీసుకో. "చాలా నాటకీయంగా చెప్పుకుంటూ పోతున్నాడు వినయ్.

మాయాబజారులో చెప్పినట్టు కాల మహిమ కాకపోతే, వేలెడు లేడు, వీడుకూడా నాకు చెప్పేవాడే వీడెన్ని మాటలు నేర్చేడు అని వాపోతూ "అలాగా! అతి సూక్ష్మంలో మోక్షం చూపించేవుగా! వెళ్ళి మరి ఓ క్రికెట్ ఆట ఆడి ఓ రెండువేలు పట్రా! అప్పుడు చెప్పు నీ ఫిలాసఫీ కబుర్లు. అప్పటిదాకా మేం చెప్పినమాట విను!" అనగలమాట అన్నానేగాని అంటే నా మొగుడింటాడా అన్నట్టు నామాట వాడి చెవికెక్కే దూరం దాటి మేడమీద గదిలోకి వెళ్ళిపోయేడు వినయ్. వాడన్న మాటలు మళ్ళీ తలుచుకుని నవ్వుకుంటూ, అమ్మ గదివైపుకి వెళ్ళేను.

నాన్నగారు పోవడంతో అమ్మ బాగా ఒంటరిదైపోయింది. ఇంట్లో మేం ఉన్నా మమ్మల్ని ఇబ్బంది పెట్టకూడదన్న భావంతో బయటకు వచ్చేది కాదు. తనకి ఎలా నచ్చితే అలాగే ఉండనీ అని నేను పెద్దగా పట్టించుకోలేదు. నేను నా పిల్లల్ని బాధ్యతాయుతంగా పెంచాలన్న హడావిడిలో సతమతమవుతూ నా బాధ్యతని విస్మరించడంతో అమ్మకి మతి స్తిమితం తగ్గుతోందన్న విషయం కొంచెం ఆలస్యంగా తెలుసుకున్నాను. అప్పటికప్పుడు చెప్పిన విషయాలే మర్చిపోవడం, పిల్లలు గట్టిగా అల్లరి చేస్తే వాళ్ళమీద కసరడం మొదలయినప్పుడు ఏదో పరధ్యానం అనుకుని పట్టించుకోలేదు. ఇంట్లో ఇద్దరు డాక్టర్లు ఉండగా, నా కళ్ళ ముందు ఈ విధంగా జరగడం చాలా పెద్ద దెబ్బే. ఎటువంటి అమ్మని ఇటువంటి పరిస్తితుల్లో చూస్తానని జన్మలో కూడా అనుకోలేదు. వంట మనిషి మధ్యాహ్నం పెట్టి వెళ్ళిన భోజనం పళ్ళెం అలాగే ఉంది.

"అమ్మా! ఏమిటమ్మా ఈ అల్లరి? మధ్యాహ్నం భోజనం చెయ్యలేదేమ్మా? "

"ఎందుకూ భోజనం?" అంది.

"అదేమిటమ్మా అలాగంటావు. భోజనం చెయ్యకపోతే నీరసపడిపోవూ?" నేనన్న మాటలు అర్థం అవనట్టుగా వెర్రి చూపులు చూస్తూ ఉండిపోయింది.

కాల మహిమ కాదూ మరి, ఆనాడు తనమాట పిల్లలు వినడం లేదని బేంబేలు పడిపోయి యుక్తి ప్రయుక్తులతో ఎంతో విజయవంతంగా మమ్మల్ని సమర్థులని చేసిన అమ్మ, ఈనాడు తన పిల్ల చేత చెప్పించుకోవలసిన పరిస్థితిలోకి వస్తుందని నేను కలలోనైనా ఊహించే లేదు.

అలా అమ్మని చూస్తూ గుండెల్లోంచి తన్నుకు వస్తున్న దు:ఖం ఆపుకోలేక "పోనీ, హార్లిక్స్ కలిపి పట్టుకురానా" అంటూ జవాబుకెదురుచూడకుండా గబ గబా వంటింట్లోకెళ్ళి సాయంత్రానికి కాచిన పాలు ఓ గ్లాసుడు తీసుకుని అందులో హార్లిక్స్ కలిపి పట్టుకొచ్చి దగ్గరగా వెళ్ళి "అమ్మా, కాస్త హార్లిక్స్ తాగు!" అన్నాను. ఇంకా అదే చూపు! పెదవులు బిగించి భీష్మించుకున్న తల్లి పక్కనే కూచుని వీపుచుట్టూ ఆప్యాయంగా చెయ్యి వేసి "రాను రాను చంటిపిల్లవయిపోతున్నావు. నే చెప్పిన మాట విను, నా బంగారు తల్లివికదూ, ఓ గుక్కెడు హార్లిక్స్ తాగమ్మా!"అన్నాను.

●●●

## ఆనవాలు

**వనజ వనమాలి**

**పురిటి గడ్డని ఓ..నాలుగేళ్ళ తర్వాత చూస్తున్నానేమో ఎద లయలలో ఎక్కడో రేగుతున్న ఎడతెగని ఉద్వేగపు అలజడి కన్ను మూతపడ నివ్వడం లేదు. పక్క కుదరడంలేదు.**

పక్కనే మెసులుతున్న సవ్వడికి ఏమో నా భార్య లేచి బద్దకంగా ఆవలిస్తూ "ఏమండీ! ఇకనైనా నిద్రపోరా?ఎంతసేపని ఆలోచిస్తారు. మీకే విషయం మీద ఒక అభిప్రాయం లేనిదే ఇక మీ నాన్నకి చెప్పి ఏం ఒప్పించ గల్గుతారు? ఆయనకన్నా సెంటిమెంటల్ ఫూల్ మీరు" అనేసింది.

నేను ఏం సమాధానం చెప్పలేదు.

"మీరు నిద్రపోతారో లేదో మీ ఇష్టం. తెల్లవారుఝామున లేచి మెయిన్ డోర్ బయట లాక్ చేసుకుని మీరు వెళ్ళిపొండి. నాకసలే నిద్ర చాలడం లేదు" అని చెప్పేసి ముసుగు తన్ని పడుకుంది.

తనకి అంత సుతిమెత్తనైన మనసు లేకపోవడమే మంచిదేమో!ఎదుటి వారి మనసు గాయ పడుతుందో లేదో చూసుకోకుండానే అనాల్సిన మాట అనేసి ఎదుటి మనిషిని బాధ పెట్టామనే బెరుకు కూడా లేకుండా అతి మాములుగా ఉంటుంది.

ఈ మాటలే ఆమెతో అన్నాననుకోండి. "మీలా ఉంటే ఇక ఈ లోకంలో బ్రతికినట్లే ! అయినా మిమ్మల్ని అని ఏం లాభం..మిమ్మల్ని అలా పెంచిన ఆ పుణ్యమూర్తులని ఎంతైనా సరే మెచ్చుకుని తీరాల్సిందే. " అంటూ..గాలిదుమారంలా..మాటలని విసురుతూ విషయాన్ని అమ్మ నాన్నల వైపు మళ్ళిస్తుంది. లోకంలో భార్యామణుల అసంకల్పిత ప్రతీకార చర్యకి ఎప్పుడూ బలయ్యేది భర్త వైపు బంధువులే అనుకుంటాను. ఇలా ఆలోచిస్తూ.. ఒక గంటలోపే గడిపేసానేమో. ఇక ప్రక్క పై నుండి లేచి బయటకి వచ్చాను. హాల్లో దక్షిణం వైపు గోడకి అమ్మ ఫోటో.. మినుకు మినుకు వెలుగుతోన్న దీపం..నాలో మిగిలినవనుకున్న జ్ఞాపకాల గుర్తుల్లా..

అక్కడి నుండి నా చూపు క్రిందికి దిగి దివాన్ కాట్ పై పడింది. ఒక ఇరవై రోజుల క్రితం వరకు నాన్న స్థానం అది. అప్పుడప్పుడు నాన్న పడక పిల్లలతో పాటే వాళ్ళ గదిలో కబుర్లు, హాయిగా క్రింద ఏ చాపో దుప్పటో పరచుకుని ఏ ఆంక్షలు లేకుండా

నేలంతా డోల్లాడుతూ "ఉష్ అమ్మ వస్తుంది! " అనే హెచ్చరికల మధ్య..కాశీ మజిలీ కతలు, సుమతీ శతకం వల్లే వేయించడాలు, పిల్లల అల్లరి ప్రశ్నలు..నాన్న ఓపికైన సమాధానాలతో అదో చైతన్యం.

కాలం అలాగే గడచి పోతుందనుకున్న ఆశ అడియాశ అయిపోయింది.

నాన్న ఇక్కడి నుండి వెళ్ళిన రోజు ఏం జరిగిందో కళ్ళ ముందు మెదిలింది. నాన్న వల్ల పిల్లలకి క్రమశిక్షణ లేకుండా పోతుందని.. క్లాస్‌లో రాంకింగ్ పడిపోయిందని..ఇలాగే ఉంటే.. పల్లెటూర్లో మట్టి పిసుక్కో డానికి కూడా పనికిరారని నా భార్య నిశ్చితాభిప్రాయం.

"మామగారు..మీ పాత కాలం సుద్దులు, శతకాలు వాళ్ళని ఏ అందలాలు ఎక్కించాలేవు. మీరు లేనప్పుడే నయం నేను చెప్పిన మాట వినేవారు. ఇప్పుడు మీ అలుసు చూసుకుని ఈవెనింగ్ ట్యూషన్‌కి వెళ్ళడం లేదు "అంది.

"ట్యూషన్‌లో చేర్పించు తల్లీ! నేనే రోజు సాయంత్రం తీసుకునివెళ్ళి మళ్ళీ జాగ్రత్తగా ఇంటికి తీసుకుని వస్తాను " అన్నాడు నాన్న మృదువుగా..

"మీకెందుకు ఆ శ్రమ !? ఎలాగు గొడ్డు చాకిరి చేసుకుంటూ ఇంటాబయటా కష్ట పడి సంపాదిస్తున్నాను కదా. ఇంటికే వచ్చి ట్యూషన్ చెప్పి వెళ్ళే ఏర్పాటు చేసాను లెండి. మీరు వాళ్ళ చదువుకి అడ్డు రాకుంటే చాలు" అంది పెడసరంగా.

"అమ్మా! తాత గారిని ఏమన్నా అన్నావంటే ఊరుకోను. నేనే ఎగ్జాంకి బాగా ప్రిపేర్ అవలేదని చెపుతున్నాను కదా..!"అన్నాడు రిషి.

"ఏంటిరా..ఎదురు సమాధానం చెపుతున్నావ్? చీరేస్తాను" అంటూ వాడి వెంట పడింది.

ఆ రోజు రాత్రి .. "మీ నాన్న ఇక్కడ ఉంటే..నా పిల్లలు నా మాట వినరు. వాళ్ళ భవిష్యత్ బాగుండాలనే కదా.. ఉద్యోగం చేస్తున్నాను" అంది. తను ఒక రియల్ ఎస్టేట్ వారి ఆఫీస్‌లో వర్క్ చేస్తుంది.

"అందుకే నాన్న ఉంటే మన ఇద్దరం వచ్చేవరకు వాళ్ళకి ఒంటరి తనం ఉండదు కదా! అయినా ఆయనేం చేసారు మధ్యలో" అన్నాను.

"ఆయన ఆరోగ్యం బాగోలేక ట్రీట్‌మెంట్ తీసుకుని ఏదో కొద్ది రోజులు ఉంది వెళ్ళిపోతారు అనుకున్నాను. ఆయన ఇక్కడే ఉండిపోతారని అనుకోలేదు. అదివరకులా ఆ పల్లెలోనే ఉండవచ్చు కదా"అంది.

"ఉన్నది నేను ఒక్కడిని. అమ్మ పోయిన పదేళ్ళ నుండి చుట్టపు చూపుగా రావడమే తప్ప ఆయనెక్కడ ఎప్పుడైనా ఒక నిద్ర అయినా చేసారా? ఆరోగ్యం బాగోలేని స్థితిలో ఆయన అక్కడ ఉండటం ఏం బాగుంటుంది?" అన్నాను.

"మీరు ఏం చేస్తారో నాకు తెలియదు. ఆయన ఇక్కడ ఉండటానికి లేదు." ఖండితంగా చెప్పింది. నేను ఇంకా వాదిస్తే నాన్నకి వినబడుతుందని నేను మాట్లాడలేదు.

వూళ్ళో పదెకరాల పొలంలో వచ్చే ఆదాయం అంతా తీసుకుని వచ్చి నాన్న కోడలికే ఇచ్చేవారు..

"ఇల్లాలంటే సంసారం నడిపే రథ సారథి. మగవాళ్ళకి ఏం తెలుస్తాయి ఖర్చులు అవీ. పొద్దస్తమాను కష్టపడటం ఇంటికి వచ్చి తిని పడుకోవడం తప్ప" అనేవారు.

అమ్మ ఉన్నప్పుడు అంతా అమ్మే చూసుకునేది. తాతలు ఇచ్చిన రెండెకరాల పొలాన్ని పది ఎకరాలు చేసి, ఇరవయ్యి ఏళ్ళు నా పట్నం చదువుల కోసం అహర్నిశలు శ్రమించిన ఆయన్ని నా ఇంట్లో విశ్రాంతిగా ఉండనివ్వలేని నా చేతకానితనంకి సిగ్గుపడాల్సి వచ్చేది. లోలోప దుఃఖం. "బాబు..ఇలాగేనా నువ్వు మీ తండ్రికి ఇచ్చే గౌరవం?" అని అమ్మ నిలదీసి అడిగినట్లు ఉండేది.

తెల్లవారాక నేను లేచేటప్పటికే నాన్న తన బట్టల సంచీతో ఊరికి వెళ్ళడానికి తయారుగా ఉన్నాడు.

"నాన్నా.. ఇప్పుడు ఊరికి వెళ్ళడం ఎందుకు? మీరు వెళితే పిల్లలకి ఎవరు తోడూ ఉంటారు? " అన్నాను. నా మాటలు అతుకు పెట్టినట్లుగా ఉన్నాయని నాకు తెలుస్తూనే ఉన్నాకూడా.

"మళ్ళీ వస్తానులే బాబు.. ఏమిటో ఆర్నెల్లు అయ్యిందిగా ఊరిపై పీకుతుంది "అన్నాడు నాన్న.

"తాతగారు.. మళ్ళీ ఎప్పుడు వస్తారు? " అని కావ్య ఏడుపు మొహం పెట్టింది.

"మళ్ళీ త్వరగానే వచ్చేస్తాను కదా.. తల్లి. అలా ఏడవ కూడదు" అంటూ మనుమరాలిని ఓదారుస్తూనే అటు వైపు తిరిగి నాన్న కళ్ళు తుడుచుకున్నారు.

నేను ఏమి మాట్లాడకుండా కాలకృత్యాలు తీర్చుకుని నాన్నని బస్‌స్టాండ్‌లో దింపి వచ్చాను.

నేను వచ్చేటప్పటికి భార్యామణి ఫోన్‌లో వాళ్ళ అక్కతో అనుకుంటాను మొహం అంతా వెలుగుతూ ఉండగా చెపుతూ ఉంది.

"అబ్బ .. ఆ ముసలాయన పీడా వదిలిపోయింది. ఆర్నెల్ల నుండి నా ఇల్లు నాకు పరాయిదై పోయింది. రోజు గంట కొట్టినట్లు అయిదున్నరకల్లా ఆయనగారికి కాఫీలు అందించడం, ఏడు గంటలకి టిఫిన్లు పెట్టడం.. విసుగేసిపోయింది అనుకో. ఆయన నాలుగు గంటలే లేవడం, వాకింగ్‌కి కొడుకుని లేపడం. పూలు కోసుకు వచ్చి పూజ చేసుకో అమ్మా .. అని చెప్పడం, నేను లేవడం ఆలస్యం అయితే వంట ఇంట్లోకి జొరబడి కాఫీలు కలిపి కొడుకుకి ఇవ్వడం. నా వంట ఇల్లు అంటా అరాచకం అయిపోయింది అనుకో. పైగా ఆయన ఉంటే మా ఆయన నైటీ వేసుకోనివ్వారు. పెద్ద వాళ్ళ ముందు.. గౌరవంగా ఉండటం నేర్చుకోమని పోరు. నా స్వేచ్ఛ, నా ఇష్టా ఇష్టాలు అన్నీ..గాయబ్. అందుకే మొహమాటం లేకుండా పిల్లల చదువు వంక చెప్పి గట్టిగా క్లాస్ తీసుకున్నాను. తెల్లారేసరికి సంచీ సర్దేసాడు." చెపుతోంది.

అటు వైపు ఏం అడిగారో కానీ నా గురించి ఒక స్టాండ్ మార్క్ స్టాక్ డైలాగ్

"మా ఆయన ఒట్టి సెంటిమెంటల్ ఫూల్. ఆయన వెంటబడి బస్ స్టాండ్ దాకా వెళ్ళాడు. మళ్ళీ ఈ సారి ఆ ముసలాయనని ఈ ఇంటికి రాకుండా ఏం చేయాలో ఏమిటో..? ఫిక్స్‌డ్ డిపాజిట్ లాగా ఫిక్స్‌డ్ లైఫ్ ఉంటే బాగుండును. సీనియర్ సిటిజన్స్ అనేది లేకుండా.." అని పగలబడి నవ్వుతూ వెనుకకి తిరిగి నన్ను చూసింది కానీ ఏమి తొట్రుపడలేదు.

పైగా "జోక్ బాగా పేల్తుంది కదండీ.."అంది.

"నోర్ముయ్యి"అని మాత్రం అనగలిగాను. ..

"మా ఆయనలో సెన్సాఫ్ హ్యూమరే లేదు. అన్నిటికి విసుగే.. " అని చెపుతోంది.

నిజమే.. నాలో సెన్సాఫ్ హ్యూమరే ఏమిటీ.. హ్యూమానిటీ కూడా తగ్గుతోంది అనుకుని అక్కడినుండి దూరంగా పారిపోయాను. నాలా భార్యల ముందు పిరికిగొడ్డులా పారిపోయేవాళ్ళు యెంత మందో!

అలా నాన్న వెళ్ళాక ఫోన్ సమాచారమే తప్ప ప్రేమగా ఆయనని నేను వెళ్ళి చూసే తీరిక లేకపోయింది.

నిన్న సాయంత్రం నా భార్య ఆఫీసు నుండి హడావిడిగా వచ్చి చెప్పుల్లో కాళ్ళు అయినా తీయకుండానే

"ఏమండీ..ఇది విన్నారా..!?" అని అడిగింది.

ఏమిటన్నట్లు చూసాను. "మన వూరు ఉంది చూసారు." ఆగింది.. నేను ఏమి అంటానో అని అనుకుంటాను..

మన వూరు అని అందంటే ఏదో ప్రమాదం ముంచు కొచ్చినట్లే అని నా మనసు సంకేతం అందించింది. నేను చెప్పు అనకుండానే చెప్పడం మొదలెట్టింది.

"మన వూరిలో మన పొలం ప్రక్క నుండే బైపాస్ రోడ్డు పడుతుంది అట. మన పొలం ప్రక్కన ఉన్న పొలంని ఓ ఇరవయి ఎకరాల వరకు మా రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేస్తారట. ఆ వెంచర్ కోట్ల లాభాలు ఆర్జించి పెడుతుందని చెప్పుకుంటున్నారు. అయితే ఆ కొనే పొలానికి దారి మన పొలం లోనుండే వెళుతుందట." అని చెప్పుకొచ్చింది.

"అది దారి కాదు కాలువ కట్ట. ఆ కాలువలో నుండి వచ్చే నీళ్ళే మాగాణి భూములకి ఆధారం. అలాగే వరదలు వచ్చినప్పుడు చేలల్లో నీళ్ళు అన్నీ ఆ కాలువ ద్వారానే బయటకి వెళ్ళాలి" అని చెప్పాను.

"నిజమే అనుకోండి..కానీ ఇపుడు వ్యవసాయం ఏం గిట్టు బాటుగా ఉందండీ. మనం ఆ కాలువని ఆనుకుని మన పొలం పొడుగూతా కొన్ని గజాలు దారికి ఇచ్చామంటే మన పొలంకి బోలెడంత రేటు పెరుగుతుంది. మనం ఇచ్చిన స్థలానికి రేటుకి రేటు ఇచ్చి మనకి సిటీలో డూప్లెక్స్ ఇల్లు ఇస్తామంటున్నారు. ఇచ్చేద్దా మండి.. " అని చెప్పింది. ఒహో..యెంత పకడ్బందీ ప్లాన్ వేసేవే! భార్యా మణీ అనుకున్నాను.

" నాన్నని ఒక మాట అడిగి " అన్నాను. ఆమె మాటని తక్షణం కాదంటే ఏం ఉపద్రవం సృష్టిస్తుందో తెలిసి.

"మీరు గట్టిగా చెపితే ఆయన ఏమంటారు. ఆయనకీ మనం కాక ఎవరం ఉన్నాం. మన మంచి-చెడు ఆయనకీ కాక ఎవరికి చెప్పుకుంటాం?" అంది. నేను ఆమె మాటలకి ఆశ్చర్యపోలేదు. పదేళ్ళుగా ఆమె రెండు నాలకల ధోరణికి అలవాటు పడిపోయాను.

"రేపే వెళ్ళి మీ నాన్నగారికి ఈ విషయం చెప్పి ఒప్పించండి." హుకుం జారీ చేసింది. నాన్న ఒప్పు కుంటాడో లేదో! కానీ నాన్నని ఒకసారి చూసినట్లు ఉంటుంది. వూరికి వెళ్ళి రావాలి అనుకుని, ఆమె తో. "సరే వేళతానులే!" అన్నాను.

అలా నాలుగేళ్ళ తర్వాత ఊరికి వెళుతున్నాను. సమయం నాలుగు గంటలవుతోంది. ఇక మళ్ళీ పడుకోకుండా స్నానం చేసి తయారు అయ్యాను. బయలుదేరేముందు ఎందుకైనా మంచిదని నాన్నకి ఫోన్ చేసాను. నాన్న ఆశ్చర్య పోతూనే

"బండి మీద వద్దు.. దట్టమైన పొగ మంచు కురుస్తోంది. బస్ ఎక్కి రా.." అని చెప్పాడు.

నేను బస్ దిగేటప్పటికి నాన్న బస్ స్టాప్‌లో నా కోసం ఎదురు చూస్తున్నాడు. నేను బస్ దిగగానే నా చేతిలో ఉన్న సంచిని అందుకోబోయాడు. నేను సున్నితంగా తిరస్కరించాను. చాలా కాలంకి రావడం మూలంగా నేమో,

"బాబు.. బాగున్నావా? చాలా ఏళ్ళ తర్వాత వచ్చావ్? నాన్నని మళ్ళీ తీసుకు వెళ్ళడానికి వచ్చావా?" లాంటి ప్రశ్నలతో, ఊరివాళ్ళంతా, నన్ను నాకు గుర్తు చేస్తున్నారు.

అందరిని పలకరింపులకి సమాధానం ఇస్తూ ఇంటికి వచ్చేటప్పటికి ఓ పావు గంట పట్టింది.

"పిల్లలు ఎలా ఉన్నారు..? పద్దాక వాళ్ళే గుర్తుకు వస్తున్నారు" అడిగాడు నాన్న.

"బాగున్నారు నాన్నా. నిన్ను తీసుకురమ్మన్నారు " అబద్ధం చెప్పాను.

నిజానికి నేను ఇక్కడికి వచ్చేదే తెలియదు వాళ్ళకి - అని మనసులో అనుకుంటూ ..

నాన్న చేది పట్టిన బావిలోని నీళ్ళు పాకుడు పట్టకుండా తెల్లగా రాసిన రాతి తొట్టి నిండా తొణికిసలాడుతున్నాయి నా మనసులో నిండిన సంతోషంలా.

కాళ్ళు కడుక్కుని కాస్త మొహం మీద నీళ్ళు చిలకరించుకుని కర్చీఫ్‌తో తుడుచుకుంటుంటే నాన్న తన భుజం మీద తువ్వాలు తీసి ఇచ్చాడు అమ్మ చీర కొంగుతో తుడుచుకున్న ఆత్మీయ స్పర్శ గుర్తుకు తెచ్చేలా.

"ఇటు కూర్చోరా.. ఇప్పుడే కాఫీ తెచ్చి ఇస్తాను" అన్నాడు నాన్న. అతిథి మర్యాదలు జరపడానికి నాన్న తప్ప ఆ ఇంట్లో ఎవరు లేరు. ఉండాల్సిన అమ్మ పది ఏళ్ళక్రితమే కాలం చేసింది. అమ్మ ఉన్నప్పుడు మరుగున పడిన నాన్న ప్రేమ ఇప్పుడు తెలుస్తూ ఉంటుంది..

నాన్న కాఫీ కలుపుతూ ఉంటే ఇల్లంతా తిరిగి చూసాను. పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయి ఉన్న సున్నం గోడలు, పగలంతా ఎనిమిది గంటల కరంట్ కోతతో చీకటితో నిండిన గదులు. ఒక విధమైన ముక్కు వాసన అబ్బ ఈ వాసనలో, ఈ చీకటిలో నాన్న ఎలా ఉంటున్నాడో..!?

అందరి ఇళ్ళు బాగున్నాయి. తను బ్యాంకు లోన్ తీసుకుని అయినా మంచి ఇల్లు ఇక్కడే కట్టుకోవాలి. ఎక్కడ ఎక్కడో పెద్ద ఇల్లు ఉంటే మాత్రం ఏం గొప్ప? పుట్టిన ఊర్లోనే గొప్పగా ఉండాలి అనుకున్నాను.

అమ్మ ఉన్నప్పుడు ఎంతో శుభ్రంగా ఉండే ఇల్లు ఇలా అయిపోయింది. క్రింద గచ్చు అంతా కూడా తవట వేసినట్లు మచ్చలు మచ్చలుగా ఉంది. నాన్న వంట ఇంట్లో ఏదో అవస్థలు పడుతున్నట్లు ఉన్నాడు.

నా కోసం ఏమి ప్రత్యేకంగా చేయ వద్దు అని చెప్పడానికి అన్నట్లు వంట ఇంట్లోకి వెళ్ళాను. వంట ఇంటి గోడపై అమ్మ సంప్రదాయం కొనసాగిస్తూ ఉన్నట్లు బల్లులు రాకుండా ఉంటాయని అమ్మ పెట్టినట్లుగానే కోడి గుడ్డు డొప్పలు తగిలించే ఉన్నాయి. శుభ్రంగా కాగితాల పిండితో అలికిన చేట, గోడకి కొట్టిన గ్యాస్ లైటర్ స్టాండ్. అన్నీ అమ్మ ఉన్న ప్పుడు ఉన్నట్లే ఉన్నాయి. బియ్యం డబ్బా తీసి చూసాను పురుగు పట్ట కుండా ఎండిన వేప ఆకు కలిపి వుంది. కాఫీ తాగుతూ పెరట్లో తిరుగుతుంటే .. నాన్న బియ్యం కడిగి ఆ నీటిని కరివేపాకు చెట్టు మొదట్లో వంచుతూ కనబడ్డాడు. చిన్నప్పుడు తను నిద్ర లేచేటప్పటికే ఎర్రగా మండుతూ సెగలు కక్కే బొగ్గుల కుంపటి, పొగగొట్టం తుప్పు పట్టి కనిపించాయి. అమ్మ పక్కనే ఉండి సరదాగా పొగ ఊది అవస్థలు పడిన రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. విసన కర్ర తీసుకుని బొగ్గుల పొయ్యిని బాగా రాజింపజేసిన జ్ఞాపకం,

ఎన్నో రోజులుగా కోయకుండా రాలిపోయి ఉన్న సన్నజాజులు మనుషులు ఒకరి తర్వాత ఒకరు రాలిపోతున్న విధంకి ప్రతీకగా కనిపించాయి.

నిజానికి తన వూరు ఊరంతా ఖాళీ అయిపొయింది. తన తండ్రి తరం వారు కొద్దిగా, వాళ్ళ తండ్రుల తరం వారు వేళ్ళ సంఖ్యలోనూ గత వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ రోజులు వెళ్ళదీస్తున్నారు. ఒకమాదిరిగా ఉన్న కుటుంబాలలోని పిల్లలందరూ చదువుకుని దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరపడి పోయి వాళ్ళ ఆర్థిక అభివృద్ధికి చిహ్నంగా పాత పెంకుటిళ్ళు కూల్చి మేడలు కట్టారు, కార్లు అమర్చారు కానీ అందులో ఉంటున్నది మాత్రం జీవచ్చవాలే! ఏడాదికో రెండేళ్ళకో ఆ ఇళ్ళకి ఓ పది రోజులు పండగ వస్తుంది. అంతే! వచ్చినప్పుడు కూడా ప్రేమగా, ఆత్మీయంగా హత్తుకోలేని అడ్డు గోడలు.. ఒట్టి పోయిన పశుశాలలు.

కాన్వెంట్ చదువుల కోసం మిగిలిన కుటుంబాలు దగ్గరలోని సిటీకి కాపురాలు మార్చడం.. నామ మాత్రంగా మిగిలిపోయిన వ్యవసాయం, విస్తరించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం.. ఇది తన ఊరు ముఖ చిత్రం.

దాదాపుగా అన్ని ఊర్లు పరిస్తితి ఇంతేనేమో. పల్లె వెళ్ళి పట్నంలో కలుస్తోందా ?పట్నం వచ్చి పల్లెని కబలిస్తోందా? ఏదో చెప్పలేని పరిస్థితి.

ఎండ పెరిగింది. లోపలి వచ్చాను. గోడల చల్లదనం హాయిగా ఉంది. చలువరాతి పరిశుభ్రమైన ఇంటిలో ఉంటున్న తను ఈ ఇంటి వాతావరణంకి అలవాటు పడటానికి ఓ గంట పట్టింది. అయినా ఇక్కడ ఏదో తెలియని హాయి ఉంది. నాన్న ఏదో రెండు కూరలు వండాక, తనకి పెద్దమ్మ వరుసకయ్యే ఆమె వచ్చి "మా ఇంట్లో భోజనం చేయి బాబు. పాపం నాన్న ఏం చేయి కాల్చుకుని చేస్తాడు?" అంది.

"లేదులే పెద్దమ్మా! నాన్న వంట చేసేసాడు. ఇక్కడే తింటాను.." అని చెప్పాను.

" సరే రాత్రియినా మా ఇంట్లో భోజనం చేయి.."అని చెప్పింది పెద్దమ్మ.

రాత్రీ.. ఇక్కడ ఉండటమా? ఆలోచన. సరే అన్నట్లు తల ఊపాను. నాన్న ముఖంలో సంతోషం. ఆ మాట ఈ మాట చెప్పుకుంటూ ఓ గంట తర్వాత భోజనం చేసాం. నాన్న కొసరి కొసరి వడ్డించాడు. ఇంట్లో నాలుగు రకాల కూరలలో లేని రుచి ఏదో తగులుతోంది. అది ప్రేమ రుచి అనుకుంటాను.

కాసేపు అలా పందిరి మంచం మీద పడుకున్నాను. చిన్నప్పుడు నుండి ఈ మంచం మీదే కదా పెరిగి పెద్దయ్యింది. ఎందుకో ఆ మంచం మీద అమితమైన ప్రేమ పుట్టుకొచ్చింది. ఏనాడు నాన్నని ఏది అడగని నేను..

"నాన్నా ఈ పందిరి మంచం కావాలి నాకు" అడిగాను. నాన్న నవ్వి

"అలాగేలేరా..వేసి పంపనా? " అన్నాడు.

"నేనే వేసుకెళతానూ" అన్నాను. నాన్న అర్ధమైనట్లు తల ఊపాడు. ఓ గంట పాటు చిన్న కునుకు తీసి నాన్న ఇచ్చిన టీ తాగి

"నాన్నా !అలా మాగాణి పొలంలోకి వెళ్ళి వద్దామా?" అడగాలనుకున్నాను.

అంతలో నాన్నే అడిగారు "అలా. మాగాట్టి చేలోకి వెళ్ళి వద్దాంరా" అని అన్నాడు.

"సరే.." అని బయలుదేరాం.

మాగాణి పొలాల మధ్య నుండి నున్నని తారు రోడ్డు. పల్లె నుండి పట్టణానికి జ్ఞానాన్ని, సంపదనంతటిని మోసుకుని వెళ్ళడానికి వేసినట్లు. "ఈ రోడ్డుని వెడల్పు జేసి బందరు దాకా బైపాసస్ రోడ్డు వేస్తున్నారు రా" అన్నాడు నాన్న.

"పేపర్లో చదివాను.. " చెప్పాను.

ఆ రోడ్డు నుండి చీలి ఎడమ వైపు ఉన్న మా పొలంలోకి దిగాము. వరికోసి వేశాక రెండో పంటకి నీళ్ళు అందుతాయో లేదని అపనమ్మకం వల్ల ఏమో.. ఎవరూ మళ్ళీ దాళ్వా సాగు చేయడం లేదు. ఆరు తడి పంటలు వేసారు. మా చేనుకి తూర్పు ప్రక్కన ఉన్న పంట కాలవ దగ్గరికి వచ్చాం. కాలువ ఎండి పోయి ఉంది.

"ఈ కాలవని దానికి ఆనుకుని ఉన్న మన పొలంలోని ఓ పన్నెండు అడుగుల వెడల్పుకి వచ్చే దారినే కదా వాళ్ళు ఇమ్మని అడుగుతోంది." అడిగాడు నాన్న.

నేను షాక్ అయ్యాను. "నాన్నా మీకు ఇది ముందే తెలుసా"? అడిగాను.

"లేదురా..కోడలు నువ్వు బయలు దేరి వచ్చాక ఫోన్ చేసి చెప్పింది." చెప్పాడు నాన్న. పీకల దాక మాయావిడ మీద కోపం ముంచుకొచ్చింది.

"నాకు ఇవ్వడానికి అభ్యంతరం ఏం లేదురా. పిల్లలకి నగరం నడిబొడ్డుకి స్కూల్‌కి వెళ్ళడానికి గంటలు తరబడి బస్‌లలో మగ్గిపోవాల్సి వస్తోంది. మనం ఈ దారి ఇస్తే మనకి ఇల్లు ఇస్తారు. బాగానే ఉంటుంది కానీ. వాళ్ళు ఈ కాలువ మొత్తాన్ని పూడ్చేసి రోడ్డు వేసేస్తారు. ఈ కాలవ క్రింద ఉన్న పొలాలకి యెంత ఊపిరో నీకు తెలుసు. ఈ కాలవ కింద అందరు ఎకరం రెండెకరాల రైతులు. ఇప్పటికే వ్యవసాయం గిట్టు బాటు అవక అప్పుల్లో ఉన్నారు. మనం దారి ఇస్తే రియల్ ఎస్టేట్ వాళ్ళు సిండికేట్ అయి వాళ్ళ అవసరాలని తెలుసుకుని కారు చవకగా కాజేద్దామని చూస్తారు. ఊరు ఊరు గాకుండా పోతుంది" అని వివరంగా చెప్పాడు నాన్న.

"అయినా ఇక్కడ వచ్చి ఎవరు ఉంటారు రా..ఇక్కడ ఏమన్నా కాలేజీలా పాడా? ఏదన్నా రోగం నొప్పి వచ్చిన పాతిక మైళ్ళు పరిగెత్తాలి."

"అది కాదు నాన్నా! ఏదో ఇళ్ళ నిర్మాణంకి అంటున్నారు."

"లేదురా! ఆమాటలన్నీ నిజం కాదు ఏదో నల్ల డబ్బు ఉన్న వాళ్ళ పన్నాగం ఇది. ఇక్కడ ఇళ్ళ ప్లాటులు వేసినా వెర్రి బట్టినట్టు కొనేది పట్నం వాళ్ళే రా. ముందు ముందు పెరగకపోతాయా.. అని ఆశ. ఇంకొన్ని ఏళ్ళకి ఇది కూడా దొరకదని భయం. లేని డిమాండ్ సృష్టించి నోటి మీద లక్షల లెక్క పెంచేస్తున్నారు. రెండేళ్ళనాడు లక్ష రూపాయలు కూడా రేటు పలకని పొలాలు ఈ ఏడాది ఇరవై లక్షలకి కొని ఏం చేస్తారు? పంట గట్టిగా పండినా ఇరవై వేలకి మించి ఆదాయం రాదు. ఇరవై లక్షల రేటు అనడమే కానీ ఆరు లక్షలకి మించి ఎక్కడా బేరం జరగడం లేదు. అంతా వ్యాపారుల మాయా జాలం" చెప్పాడు నాన్న.

"మనం ఇప్పుడు దారి ఇస్తే కాలవ లేకుండా పోద్ది. ఈ ఊరులో వ్యవసాయం చేసేవాడు ఉండడు. అయిన కాడికి అమ్ముకుని అప్పులు తీర్చుకుని బాధల నుండి బయట పడతారు, జల్సాలు చేస్తారు." చెప్పాడు నాన్న సూక్ష్మంగా అన్నీ పరిశీలించి. నాకు ఆశ్చర్యం వేసింది. నాన్నది ఏడో తరగతి చదువు మాత్రమే! అయినా యెంత అవగాహన!! చదువు కన్నా అనుభవం ముఖ్యం అంటారు అందుకే!

నేను ఆలోచించసాగాను.

"మనం దారి ఇవ్వవద్దు నాన్నా! ఎక్కడ పడితే అక్కడ ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టి నీటి పారుదల వ్యవస్థని, మురుగునీటి వ్యవస్తని నాశనం చేసి చెరువులు ఊళ్ళు, ఊళ్ళు చెరువులు అయ్యే పరిస్తితిని అడ్డుకోవాలి అంటే మనం మన వంతు బాధ్యతగా ఉండాలి" అన్నాను నేను.

"మామ దూరపు బంధువు నాకు బాబాయి కొడుకు రవి.. నీకు బాబాయ్.. అవుతాడు అతను తెలుసు కదా! పొలాలకి రేట్లు పెరిగినాయి అని ధీమా వచ్చి వడ్డీలకి తెచ్చి మరీ వ్యాపారం చేసాడు. అటు వ్యాపారం కలసి రాలేదు. ఇప్పుడు..లక్షలకి లక్షలు రేటు పలుకుతుందని అనుకున్నపొలం కొనే నాథుడే లేడు. కొనుక్కునే వాడు ఆరు లక్షలు అంటాడు. అమ్ముకునేవాడు ఇరవయి లక్షలు ఉండేది అంతకన్నా తక్కువ అయితే ఇవ్వనని భీష్మించుకుని కూర్చుని ఆఖరికి అప్పుల వాళ్ళ బాధలు పడలేక పురుగు మందు తాగి చచ్చిపోయాడు. ఉన్న పొలం అప్పులవాళ్ళు ఎగదన్నుకుపోయారు. పెళ్ళాం బిడ్డలు రోడ్డున పడ్డారు. " నాన్న బాధగా చెప్పాడు.

అలా వ్యవసాయం ఇబ్బందులు చెప్పుకుంటూ..ఇంటికి వచ్చాం.

ఆ రాత్రికి ఆలోచిస్తూ ఉన్నాను. అర్ధరాత్రి లేచి నాన్నని లేపి మరీ చెప్పాను,

"నాన్నా.. దారి ఇవ్వం. మా పది ఎకరాలు పొలం మొత్తం ఎకరం ఇరవయ్యి లక్షల చొప్పున ఇస్తాం అని చెపుదాం" అన్నాను.

"వాళ్ళు ఖచ్చితంగా వద్దని అంటారు రా. ఎందుకంటే మనం దారి ఇస్తే వాళ్ళు కొనే పొలం రేటు ఎకరం ఆరు లక్షలు. మన పొలం ఇరవై లక్షలు. ఎట్టి పరిస్థితుల్లోను కొనరు.. " అన్నాడు నాన్న.

"అదే మనకి కావాల్సింది. ఇక వ్యాపారులెవరు మన పోలాలకేసి కన్నెత్తి చూడరు" చెప్పాను.

నాన్న తలపంకించాడు .

తెల్లవారి నాలుగు గంటలకే.. నా సెల్ ఫోనే మోగింది. నా భార్య నుండి ఫోన్. నాన్న పొలం ఇవ్వడానికి ఒప్పుకున్నాడా లేదా అన్నది తెలుసుకోవాలని ఆత్రం.

"నీకొక శుభవార్త .. నాన్న మన పది ఎకరాలు పొలం అమ్మడానికి ఒప్పుకున్నాడు. ఎకరం ఇరవై లక్షలు రేటు వస్తుంది. మనకి రెండు కోట్లు వస్తాయి" చెప్పాను ఆశగా ఊరిస్తూ..

"అవునా మామయ్యా గారు ఒప్పుకున్నారా? మై గుడ్‌నెస్ చాలా హేపీ అండి." అంది.

"ఒక మాట నువ్వు ఎమనుకోనంటేనే .!? ".అడిగాను.

"చెప్పండి" అంది భార్యామణి.

"మరి నాన్న పొలం అమ్మేశాక ఎలా ఎక్కడ ఉంటారు?" అన్నాను.

"అయ్యో..అదేం మాటండీ. ఆయనకి మనం కాక ఇంకా ఎవరున్నారు. మనతోనే ఉంటారు. ఇంటికి పెద్ద దిక్కు. పిల్లలు కూడా ఆయనపై దిగులు పెట్టుకున్నారు. ఆయన రానన్నా సరే బలవంతంగానైనా తీసుకుని రండి..."చెప్పింది సంతోషంగా రెండు కోట్లు వస్తున్నాయి అనే ఆనందంలో.

అలాగే మరొక ఫోన్ చేసాను. "దారి ఇవ్వం పొలం ఇరవై లక్షల ఖరీదు అయితే ఇస్తామ"ని చెప్పాను. వాళ్ళు అంత ఎక్కువైతే వద్దని చెప్పేశారు. నాకు ఇప్పుడు ఎంతో హాయిగా ఉంది. నా పొలం జోలికి ఇప్పట్లో ఎవరూ రారు.

నిజానికి ఆ పొలం అమ్మడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు. నా భార్య మాటల్లో నేను ఎప్పుడు ఓ..సెంటిమెంటల్ ఫూల్‌ని. కానీ నా వూరు, నా వాళ్ళ విషయంలో నేను ఎప్పుడు సెంటిమెంటల్ ఫూల్‌నే అని నా భార్యకి అర్థమయ్యేదాక ఒర్చుకోక తప్పదు కూడా.

అలాగే నా భార్య పరిస్తితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా ఉంటుంది. ఇప్పుడు ఆమె నాన్నని కాదని అనలేదు.

అలా నేను అనుకున్న రెండు పనులు అలా విజయవంతంగా నెరవేరాయి.

నాన్నా, నేను కలసి పందిరి మంచం వేసుకుని పట్నం బయలుదేరాం. మా బొగ్గుల పొయ్యిని, పొగ ఊదే గొట్టాన్ని తీసుకున్నాను. నా కొడుకు రిషికి అవి అపురూపంగా చూపాలని.

చిరు చీకట్లు ముసురు కుంటున్నాయి అక్కడ అక్కడ చిరు కాంతులతో నా వూరు పల్లె ఆనవాలు మిగులుస్తున్నట్లు ఉంది.

అవును.. నా తరం వరకుఅయినా నేను నా పల్లె ఆనవాలు కాపాడాలని కంకణం కట్టుకున్నాను.

●●●

## మార్పు మంచిదే కానీ.. కన్నెగంటి అనసూయ

**ఉదయం పదిన్నర కావటంతో** ఆ ఆఫీసులో పనిచేసే ఉద్యోగులంతా ఒక్కొక్కళ్ళే విధుల్లోకి చేరుకుంటున్నారు.

ఒక పక్క పనులమీద ఆ ఆఫీసుకి వచ్చేవాళ్ళూ వెళ్ళేవాళ్ళు మరోపక్క బీరువాలు తెరచి ఫైళ్ళు టేబుల్ మీద పడెయ్యటం, ఇంకో పక్క టకటకలాడే టైప్ మిషన్ శబ్దాలతో మొత్తం మీద ఆఫీసంతా సందడి సందడిగా ఉంది.

కాస్త అటూ ఇటూగా పదకొండింటికల్లా అందరూ వచ్చేశారు.

అదిగో అప్పుడొచ్చాడు భుజంగం.. మూడడుగుల పొడవు, ఆరంగుళాల వెడల్పూ ఉన్న అట్ట ఏదో అటెండర్‌తో పట్టించుకుని. వచ్చీ రావటంతోనే ఆ అట్ట అందరికీ కనిపించేలా టేబుల్ మీద పెట్టి బాగా కనిపిస్తుందా లేదా అన్నట్టుగా ఒకటికి రెండుసార్లు అన్ని కోణాల్లోనూ పరిశీలించి, బాగా కనిపిస్తోందని సంతృప్తి చెందాక ఫైళ్ళ కోసమని బీరువా తెరిచాడు భుజంగం. భుజంగం ఆ ఆఫీసు సూపరింటెండెంట్ ఇంకా ఒక సంవత్సరం సర్వీసుంది అతనికి.

ఆ ఆఫీసు చాలా పొడుగ్గా ఉంటుంది. లోపలికి ఎంటరైన వెంటనే ఆ పక్కా ఈ పక్కా టేబుల్స్ వేసుంటాయి. మధ్యలో దారికి తిన్నగా ఆఫీసు సూపరింటెండెంట్ టేబుల్ అడ్డంగా వేసుంటుంది అందరూ అతనికి కనిపించేలా. అతని వెనుక ఆఫీసరు రూము.

అంతా ఎవరి పనుల్లో వాళ్ళుండగా ఒక్కసారిగా భుజంగం అరుపులు

''ఏవయ్యా నీకు బుద్ధుందా తాటికాయంత అక్షరాలతో ఎదురుగా కనపడ్డంలా. నాకే లంచం ఇవ్వజూపుతావా హౌ డేర్ యు ఆర్'' అంటూ అగ్గిమీద గుగ్గిలంలా భగ్గుమంటున్న భుజంగం వైపు ఆశ్చర్యంతో చూసిన వాళ్ళకి

''లంచం తీసుకోవటమే కాదు ఇవ్వటమూ నేరమే'' అని రాసి ఉన్న అట్ట తిన్నగా టేబుల్ మీద కనిపించేసరికి ఒక్కసారిగా అవాక్కయిపోయారు. సునామీ వచ్చినంత పనయింది అందరికీ. ఉన్నట్టుండి పెద్ద ఈదురు గాలేదో విసురుగా తగిలినంత విస్మయానికి గురయ్యారంతా.

కాళ్ళూ చేతులూ ఆడక కాసేపు అలానే ఉండిపోయారు. ఎవరి మనసులూ స్థిమితంగాలేవు. అందరిలోనూ ఒకటే ఆశ్చర్యం అలజడి. ఏమీ అర్థం కాక వెర్రి వాళ్ళల్లా ఒకరి ముఖాల వంక ఒకరు చూసుకుంటున్నారు. రోజూ అయితే రాగానే బీరువాలు తెరిచి ఫైల్స్ ముందేసుకుని పనిలో మునిగిపోయేవారు. ఈ రోజెవరికీ ఏ పనీ చేయబుద్ధికావటం లేదు. ఎక్కడి పనులక్కడే స్థంబించిపోయాయి. ఒంటి గంటవుతున్నా పరిస్థితిలో మార్పులేదు. అందరి మనసుల్లో ఒకటే సందేహం, కలవరం.

ఇదెలా సాధ్య? అసలేం జరిగింది?

భుజంగం ఇంత అకస్మాత్తుగా ఎలా మారిపోయాడు? ఏమిటి దీనిక్కారణం? కానీ ఆఫీసవర్స్ కావటంతో ఏమీ మాట్లాడలేని పరిస్థితి. వీటన్నిటికీ సమాధానం దొరకాలంటే లంచ్ టైమే సరైన సమయం. అప్పటిదాకా ఆగాల్సిందే

ఒంటిగంట ఎప్పుడవుతుందా అని ఉగ్గబెట్టుకుని కూర్చున్నారేమో టైమవ్వగానే గుసగుసలు మొదలయ్యాయి. ఆఫీసు బయట గుంపులు గుంపులుగా నిలబడి కొందరు, క్యాంటిన్లో టీ తాగుతూ మరి కొందరు, చెట్లకింద నీడలో నిలబడి కొందరు ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్.

భుజంగం.! మామూలు ఉద్యోగి కాదు. కరుడుకట్టిన లంచావతారి. ఆఫీసు సూపరింటెండెంట్‌గా ప్రతి ఫైలు మీదా అతని సంతకం తప్పనిసరి కావటంతో అతను చెప్పిందే వేదం. నిర్ణయించిందే రేటు. ఎంతో కొంత సమర్పించుకోకపోతే అసలాయన టేబుల్ మీదినుంచి ఫైలుకి ఎప్పటికీ మోక్షం రానే రాదు. ఆ విషయంలో అంత కర్కోటకుడు. లంచం తీసుకోవటంలో ఎలాంటి మినహాయింపులూ లేవు అతనికి.

ఒక్క మాటలో చెప్పాలంటే కరుడు కట్టిన అవినీతికి ఆదిపురుషుడు భుజంగం. అతని సర్వీసు ఇంకో సంవత్సరమే ఉండటంతో సాధ్యమైనంతవరకూ దండుకోవాలనే దురాశతో ఆ పనిలోనే పూర్తిగా లీనమైపోయి మిగతా వాళ్ళతో మాటలు కూడా తగ్గించేశాడు టైము వేస్టని. అసలు తింటున్నాడో లేదో కూడా అనుమానమే.

అలా అని అతన్ని చూసి అసూయపడే వాళ్ళూ తక్కువ మందేం లేరు. వాళ్ళ చిలక్కొట్టుళ్ళు వాళ్ళకి ఉన్నప్పటికీ భుజంగానికి వరదలా వచ్చిపడుతున్న ఆదాయం చూసి కన్నెర్ర. మనది మనకున్నా పక్కాణ్ణి చూసి ఏడవటం అనేది మామూలే కదా.

అతని ఆదాయానికి ఎలాగైన గండికొట్టాలని ఒకరికి తెలియకుండా మరొకరు చేయని ప్రయత్నం లేదు. పైవాళ్ళకి ఫిర్యాదు చేయుటమే కాదు, ఆకాశరామన్న పేరుతో ఏ.సి.బి వాళ్ళకి ఉత్తరాలు కూడా రాసారు. అయినా అతని లాబీయింగ్ నైపుణ్యం ముందు అవేవీ పనిచేయలేదు. చివరికి టీవీ ఛానల్స్‌కి ఉప్పందించారు. ఎలా మేనేజ్ చేశాడో ఏమో మరి భుజంగం విషయంలో అవన్నీ ముందే మూగబోయాయి.

ఇంకేమీ చేయలేక ''హు ఎప్పుడో ఒకప్పుడు పండు ముగ్గక పోతుందా నేల రాకపోతుందా పెరుగుట విరుగుట కొరకే. అన్నింటికీ ఆపై వాడున్నాడు'' అని వేదాంతిలా నవ్వుకోవటం తప్ప ఏమీ చేయలేకపోయారు.

చివరికి వీళ్ళ వత్తిడికి తట్టుకోలేక పై ఆఫీసరు కూడా లంచం తీసుకోవద్దని ఎన్ని మెమోలూ ఎన్ని వార్నింగులూ ఇచ్చాడో భుజంగానికి లెక్కేలేదు. అయినా వాటిదారి వాటిదే ఈయన దారి ఈయనదే ఎప్పుడు చూసినా ఆఫీసునే పట్టుకుని వేళ్ళాడతాడు మరి వీళ్ళందరినీ ఎలా డీల్ చేస్తాడో, ఎప్పుడు చేస్తాడో అంతా చిదంబర రహస్యం.

భుజంగంలోని ఈ మార్పు ఆఫీసర్‌కి కూడా ఆశ్చర్యంగానే ఉంది. ఇలా ఎలా అయిపోయాడా అని.

ఓవర్ నైట్ ఇంత మార్పు సినిమాల్లో సాధ్యమౌతుంది. కానీ భుజంగం? ఎంత ఆలోచించినా ఎవరికీ ఏమీ అర్థం కావటంలేదు. ఎలా తెలుస్తుంది? ఆయన్నడిగే ధైర్యం ఎవరికీ లేదు.

ఎంతకీ అర్థం కాక మిగతా వాళ్ళంతా తలలు పట్టుక్కూర్చుంటే భుజంగం మాత్రం ఇదేమీ పట్టనట్టు తన పని తాను చేసుకుపోతున్నాడు.

ఎలాగైనా తెలుసుకోవాలని వాళ్ళల్లో వాళ్ళే తర్జన భర్జనలు పడి అంతా ఒక నిర్ణయానికొచ్చి ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న ఫైలొకటి బయటికి తీసి సాయంత్రానికల్లా సదరు వ్యక్తికి కబురెట్టి అతనొచ్చాకా చెప్పాల్సిందంతా చెప్పి ఆ ఫైలు అతనికిచ్చి మర్నాడు సూపరింటెండెంట్ టేబుల్ దగ్గరకి పంపారు.

అతను మెల్లగా సూపరింటెండెంటుని మాటల్లోకి దింపి అతను చూసేటట్లుగా మెల్లగా బెంచ్ కింద చేయిపెట్టి నోట్లని అటూ ఇటూ ఆడించటం మొదలెట్టాడు. అందరూ ఎవరు పనుల్లో వాళ్ళున్నట్లు నటిస్తూ చెవులు మాత్రం అటొదిలేశారు.

అయితే కిందేంటో కదులుతూందని అటు చూసిన సూపరింటెండెంట్ గాల్లో ఆడుతున్న నోట్లను చూసి ఇంతెత్తున ఎగిరాడు అతని మీద. అంతేనా "టేబుల్ మీద - లంచం ఇవ్వటం కూడా తప్పే" అని ఇంత లావు అట్ట పెట్టినా నాకే లంచం ఇవ్వచూపుతావా రాస్కెల్" అంటూ వాడి మీద ఇంతెత్తున ఎగరటమే కాక పోలీసుల్ని, పనిలో పనిగా టీవీ ఛానల్స్ వాళ్ళని కూడా పిలిచేసి అవినీతికి వ్యతిరేకంగా ఇంతలావు స్పీచ్‌ని ఇచ్చి అంతా ముక్తకంఠంతో అవినీతిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చాడు.

సాయంత్రానికల్లా టీవీల్లో ఏ ఛానల్ చూసినా, మర్నాడు ఏ పేపర్లో చూసినా ఈతని గురించే, కావల్సినంత పబ్లిసిటీ వచ్చేసరికి ఉబ్బితబ్బిబ్బై పోయాడు.

ఈ ఉజ్జోగులు ఉసిగొల్పినాయన మాత్రం కటకటాలపాలయ్యాడు. అనుకోని ఈ పరిణామానికి అంతా తలలు పట్టుక్కూర్చున్నారు. చివరికి రహస్యంగా ఒకచోట కలుసుకుని అనేక తర్జన భర్జనలు పడ్డ మీదట తలో కొంతా వేసుకుని అసలు కారణం శోధించటానికి డిటెక్టివ్‌ని నియమిద్దామని అంతా ఒక నిర్ణయానికొచ్చారు.

మూడోనాడు డిటెక్టివ్ ఆఫీసునుండొచ్చిన రిపోర్ట్ చూసి శోష వచ్చినంత పనైంది అందరికీ. ఇంతకీ అందులో ఉన్న విషయం ఏమిటంటే.

భుజంగం నాలుగురోజులు క్రిందట అవినీతిని అంతమొందించటానికి ప్రముఖ ఉద్యమకారుడు జాతీయ స్థాయిలో చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా జరిపిన ర్యాలీలో పాల్గొన్నాడట. ఇక ముందు కూడా భుజంగం మద్దతు ఆ నాయకునికి ఉంటుందంట - దిగులుపడ్డారంతా.

"ఇదంతా నేన్నమ్మను. కొలీగ్స్‌మి. మనమేదైనా పనిమీదెళ్ళినా పైసలడిగే కరప్షన్ కింగ్ ఇంత తొందరగా ఎలా మారిపోతాడు. నిజంగా మారిపోయాడు అంటే అతనికింతకంటే లాభసాటి బేరమేదో తగిలే ఉంతుంది. అదేదో నేనే ఛేదిస్తాను" అన్నాడు. ఆఫీసులో ఇటీవలే చేరిన ఓ కుర్ర ఉద్యోగి అతనిక్కూడా. ఆ ఉద్యమం పట్ల చాలా ఇంట్రస్ట్. అతను చాలా చురుకైనవాడు అంతేకాక ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ కూడా. కానీ ఈ విషయం ఆఫీసులో తెలియదెవ్వరికీ.

మర్నాడు ఆఫీసవర్స్ అయిపోయాకా భుజంగాన్ని కలిసి అభినందిస్తున్నట్టుగా షేక్ హేండిచ్చి ఇంత మంచి నిర్ణయం తీసుకున్న శుభసందర్భంలో భుజంగాన్ని రాత్రికి బార్ ఒన్ బార్‌కి పార్టీకి పిలిచాడు. భుజంగానికి ఆ కుర్రాడంటే కాస్త సాఫ్ట్ కార్నర్ ఉండటంతో సరేనన్నాడు భుజంగం.

అయితే ఆ రాత్రి అతని ఫుల్లుగా పట్టించి నెమ్మదిగా మాటల్లోకి దింపి అసలు విషయం అడిగాడా కుర్రాడు. అప్పటికే మాంచి మత్తుమీదున్నాడేమో ఆ మాటలకి పకపకా నవ్వాడు భుజంగం. భుజాలు కదిపీ కదిపీ మరి నవ్వాడు.

"తాగినోడి నోట నిజం తన్నుకుని వస్తాదన్నా? మిత్రమా పాడి గేదెలాంటి సీటయ్యా నాది. ఎంతలేదన్నా రోజుకి వేలల్లో కళ్ళజూసే ఉజ్జోగం నాది. అలవాటు పడిన పేనం. నా సర్వీసు చూస్తే ఇంక ఏడాదేగా ఉంది. అందుకే అందుకేనయ్యా నీతి ముసుగేశా. ఎందుకంటే రిటైర్ అవ్వాలంటే ఇదొక్కటే ప్రస్తుతం నా ముందున్న మార్గం. ఆల్రెడీ చాలామంది ఆయా ఉద్యమాల్లో సర్దుకున్నారు. ఎక్కడా కాళీల్లేవు."

"మరి మరి మిమ్మల్ని ప్రభుత్వ సర్వీస్‌లో ఉంది ఇలాంటి ఉద్యమాల్లో పాల్గొన్నందుకు సస్పెండ్ చేస్తే?" ఆశ్చర్యంగా అన్నాడు.

భళ్ళున నవ్వాడు భుజంగం. నవ్వీ నవ్వీ నవ్వుతూనే ఆగి

"ఎక్కడో అమాయకప్పక్షిలాగున్నావే. చెయ్యనియ్యవయ్యా. చేస్తే ఏమౌతుంది నాకే నయం ఇంకా నా పట్ల సింపితీ పెరుగుతుంది. న్యూస్ చానళ్ళ వాళ్ళు చర్చలు పెడతారు. అదింకా పబ్లిసిటీ కదా నాకు ఏమంటావ్. నేను చెప్పేది పూర్తికానియ్యి. ఎక్కడదాకా వచ్చాను. ఆ. అంతా టైట్ అయిపోయింది కదా. ఏ పార్టీలో చూసినా నో వేకెన్సీ బోర్డే ఇంక ఇందులోనంటావా ముందు ముందెలాగూ ఈ ఉద్యమానిదే భవిష్యత్తు కాస్త ముందున్నాననుకో స్టేట్ ప్రెసిడెంట్ అయ్యే అవకాశాలు కూడా లేకపోలేదు ఏమంటావ్? ఒక్కసారి ప్రెసిడెంట్ అయ్యే అవకాశాలు కూడా లేకపోలేదు ఏమంటావ్. ఒక్కసారి ప్రెశిడెంట్ అయ్యానంటే రిటైర్మెంట్ ఉండదాపనిలో. తర్వాత నా పని నాదే నీతా గాడిదగుడ్డా సర్వీసుని త్యాగం చేసి ఉద్యోగంలోనికి వచ్చాననే పేరెలాగూ ఉంటుంది కాబట్టి నేను ఫ్రాడ్ చేశానని తెలిసినా ఎవరు నమ్ముతారు చెప్పు. నమ్మేరెవరూ కావాలంటే నువ్వే చూద్దుగాని. ఎంతైన అలవాటు పడ్డ ప్రాణమయ్యా రోజా వేలకి వేలు కళ్ళజూసిన వాణ్ణి ఎలా మానతాను చెప్పు."

"అయినా మీకు మనసెలా ఒప్పుతుందండీ. ఎన్నో ఆటుపోట్లనెదుర్కుంటూ ఇంత మంచి కార్యక్రమానికి వాళ్ళు శ్రీకారం చుడితే మీలాంటి వాళ్ళు చేరి దానిని అపవిత్రం చేయటం మీకు తగునా సార్? అయినా మీకు రిటైర్ అయిన తర్వాత చెయ్యాలనుకుంటే ఎన్ని పనులు లేవు సర్" బాధగా అన్నాడు.

నవ్వాడు. అంచెలంచలుగా నవ్వాడు. పడీపడీ నవ్వాడు. నవ్వీ నవ్వీ అలిసిపోయి ఇక నవ్వలేక ఆగి.

"ఎంత అమాయకుడివయ్యా అంటే నీ ఉద్దేశ్యం అతని కూడా ఉన్నవాళ్ళందరూ నీతిమంతులేననా నీ అభిప్రాయం. మరి అతను దీక్షచేసినపుడు ఎంతో మంది రాజకీయ నాయకులు మద్దతు పలికారు. ఆ పేరు చెప్పి పాదయాత్రలే చేసేశారు. వాళ్ళంతా నీతిమంతులా? చెప్పు పేపర్ చదువుతావా రోజూ. లోకజ్ఞానం పెంచుకోవయ్యా కాస్త ఏదైనా వస్తువు పోయింది వెతకండయ్యా అంటే దొంగిలించినవాడే ముందు మొదలెడతాడు వెతకటం. అలాంటిదే ఇదీను" అంటూ పకపకా నవ్వి

"అయినా నీ పిచ్చిగానీ అందరూ గాంధీల్లా బిల్డప్ ఇస్తారంతే. అణువు అణువునా ఉన్న అవినీతిని పెకలించటానికి మళ్ళీ ఆ గాంధీయే వచ్చినా అవ్వదయ్యా. ఇక కాటికి కాళ్ళు చాపుక్కూర్చున్న ఆ ముసలాయన వల్ల ఏమవుతుంది చెప్పు. అవినీతి అంతం గంజాయి వనంలో తులసి మొక్కుంటే పీకటం తేలిక కానీ మొత్తం గంజాయి వనమే ఉన్నప్పుడు ఒక్క తులసి మొక్క ఏమంటావ్" అంటూ మరింత ముందు గ్లాసులో ఒంపుకుంటూ

"మొన్న ర్యాలీలో పాల్గొన్నానయ్యా టీవీలన్ని నన్ను చాలా హైలెట్ చేశాయి. వెధవది ఎంత సర్వీసిచ్చానయ్యా ఎప్పుడూ టీవీలో కనపడలా. అలా టీవీలో కనిపిస్తూంటే ఎంత పబ్లిసిటీ వచ్చిందనుకున్నావ్ నాకు. అది మరీ నచ్చిందయ్యా. ఈ ఉద్యమంలో ఉంటే తొందరగా సెల్రబిటీ అయిపోతాను. అదయ్యా అది నాక్కావలసింది. ఇంకో విషయం గమనించావో లేదో నీతిమంతుడిగా ఉండి ఉద్యమం చేసేవాడికిచ్చే విలువ కంటే ఒక అవినీతి పరుడు నీతిపరుడుగా ఉద్యమం చేస్తే దాంట్లో కిక్కుంటుందయ్యా అదే ఇక ముందు నా పెట్టుబడి ఇప్పుడు చెప్పు నేను అమాయకుడినా? సంవత్సర ఆదాయం పోగొట్టుకోవటానికి" నవ్వుతూ ఒకింత గర్వంగా అన్నాడు భుజంగం.

"లేదు సార్ లేదు మీరు చెబుతున్నదీ, చేస్తున్నదీ చాలా తప్పు. వెనకటికి ఒక పాప సముద్రం ఒడ్డుకు వెళ్ళిందట ఆడుకోవడానికి. అక్కడ చాలా చేపలు ఒడ్డుకి వచ్చేసి గిలగిలా కొట్టుకుంటున్నాయట అక్కడే మరికొంతమంది పెద్దవాళ్ళు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారే గానీ గిలగిలా కొట్టుకుంటున్న ఆ చేపల్ని తీసి నీళ్ళల్లో వేయటం లేదట. పైగా ఆ పాప తన బుల్లి బుల్లి చేతులతో ఒకొక్కటీ తీసి నీళ్ళల్లో వేయటం చూసి వేళాకోళంగా నవ్వుతూ.

"నీకెందుకొచ్చిన శ్రమ పాపా. వాటిని అలా వదిలెయ్. ఒకొక్కటీ ఒకొక్కటీ వేస్తూ ఎంతసేపని వేస్తావూ ఎన్ని చేపలని వేస్తావ్?" అన్నారట.

ఆ మాటలకి ఆ చిన్నిపాప "మీరు కూడా నాతో కలిస్తే తొందరగా వేయగలం "అన్నదట. ఆ మాటకి వాళ్ళంతా సిగ్గుపడి ఆ పాపతో కలిశారట అందరూ కలిసి కొద్ది సమయంలోనే చేపలన్నిటినీ నీళ్ళలో వేయగలిగారట" ఈ వ్యవస్థ మారాలి. ఉన్నవాడు మరింత ఉన్నావాడిగా లేనివాడు మరింత లేనివాడిగా మారటానికి ఈ అవినీతే కారణం ఇంతకాలానికి ఒక్కడు ముందుకొచ్చాడు. ఒక్కడు ఒకే ఒక్కడు ధైర్యంగా నిలబడతానంటున్నాడు దయచేసి మీలాంటి వాళ్ళు అందులో చేరి ఆ ఉద్యమాన్ని నీరు గార్చొద్దు సార్" అన్నాడు రెండు చేతులెత్తి దండం పెడుతూ మళ్ళీ అంతలోనే నమస్కరించిన రెండు చేతుల్ని శంకంలా చేసి

"ఇలా ఉంటే ఏమిటో తెలుసా సార్ మీకు ఇది పొట్టసార్. భగవంతుడు మనకిచ్చిన పొట్ట. అంటూ రెండు చేతుల్నీ దోసిడిలా చేసి

"ఇదేంటో తెలుసా సార్ దోసిలి. అంటే గుప్పెడు పొట్టకి దోసెడు ఆహారం చాలు సార్. అంతకంటే ఏం చేసుకుంటాం చెప్పండి సార్. ఇంతకాలం మంచీ చెడూ అన్నీ వదిలేసి సంపాదించుకున్నారు. మీ జోలికి ఎవరూ రాలేరు. దయచేసి ఆ ఉద్యమం జోలికి మీరు వెళ్ళకండి సార్."

అతనా విధంగా ప్రాధేయపడటం చూసి దిక్కులు పిక్కటిల్లేలా నవ్వాడు భుజంగం తెరలు తెరలుగా, అంచెలంచెలుగా నవ్వుతూ నవ్వుతూ ఢామ్మని శబ్దం వినపడి నవ్వటం ఆపి క్రిందకి చూశాడు.

క్రిందపడి విలవిలా కొట్టుకుంటున్నాడు ఆ కుర్రాడు ప్రస్తుత మన దేశ పరిస్థితిలా అతని చొక్కా గుండెకి అమర్చిన కెమేరా మాత్రం తన పని తాను చేసుకుంటూ పోతుంది.

●●●

# నాన్న రాసిన ఉత్తరం

యామిజాల జగదీశ్

**ప్రియమైన చిరంజీవీ,**

నీకు ఉత్తరం రాయడం ఇదే మొదటిసారనుకుంటాను. ప్రస్తుతం నువ్విది చదివి అర్థం చేసుకునే వయస్సు కాదు. నువ్వు భాష వేళ్ళు పట్టుకుని ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్న ప్రాయం నీది. నీ భాషలో నీకు రాయాలంటే నేనిప్పుడు దేవుడి భాష తెలుసుకోవాలి. ఒకప్పుడు నాకది తెలిసిందే అయినా ఇప్పుడు మరచిపోయాను. ఇలా అనడం అన్యాయమేగా? నేనిప్పుడు రాస్తున్న ఈ మాటలు నీకు అర్థం కాదు. అంతమాత్రాన దీనిని పారేయకు. దాచుకో.

బెంగాల్ చలన చిత్రసీమలో సుప్రసిద్ధ దర్శకుడిగా పేరు ప్రఖ్యాతులు గడించిన సత్యజిత్‌రే చిన్న వయస్సులో ప్రతి పుట్టిన రోజునాడూ తల్లితో ఆశీస్సులు పొందడానికి వెళ్ళినప్పుడు టాగూర్ ఆయనకు ఒక కవిత రాసిచ్చారట. ఆ కవిత.

**నేనీ లోకంలో**
**ఎన్నో దేశాలను సందర్శించాను**
**గొప్పగా చెప్పుకునే నదులను తిలకించాను**
**లోయల్ని చూశాను**
**రకరకాల పక్షుల్ని చూశాను**
**ప్రకృతిలో**
**ఎన్నో ఎన్నెన్నో అందాలను చూశాను**
**కానీ ఒక్క లోటుండిపోయింది**
**నా ఇంటి తోటలో**
**పచ్చికను తడిపి ముద్దాడిన**
**మంచు బిందువుల్ని చూడలేకపోయను**

- ఈ కవితనిస్తూ టాగూర్ సత్యజిత్ రేతో ఇలా అన్నారు -

"ఈ కవిత ఏం చెపుతోందో ఇప్పుడీ వయస్సులో నీకు అర్థం కాకపోవచ్చు. పెరిగి పెద్దవాడైన తర్వాత దీన్ని చదువు. అర్థమవుతుంది ఇందులోని సారాంశం" అని.

అనేక సంవత్సరాల తర్వాత సత్యజిత్‌రే ఆ కవితను మళ్ళీ చదివారట. అందులోని భావాన్ని గ్రహించిన సత్యజిత్ పథేర్ పాంచాలీ సినిమా రూపొందించారట.

నేనూ నీకిదే చెపుతున్నాను. నువ్వు పెరిగి పెద్దవాడైన తర్వాత నేను రాసిన ఈ ఉత్తరాన్ని మళ్ళీ చదువు. నీకు నీ తండ్రిగా నేనిచ్చిన ఆస్తి ఇదేనని తెలుసుకుంటావు.

ముద్దొచ్చే నీ లేలేత పాదాలు నా గుండెని తన్నినప్పుడు నిన్ను హత్తుకుని ఆనందించాను. చెప్పలేని అనుభూతి పొందాను.

నీలో నా రూపం చూసుకున్నాను. నీ చిట్టి చిట్టి వేళ్ళు నా ఒంటిమీద కదులుతుంటే నేను కన్నీళ్ళు కారుస్తూ వాటి వంకే చూశాను.

ప్రపంచంలో గొప్ప సంతోషమేది? అమ్మ ఒడా? ప్రియురాలి ముద్దా? భార్య దగ్గరవడమా? ఇవేవీ కాదు.

నువ్వు మైమరిపించిన క్షణాలన్నీ నాకు గొప్ప ఆనందాన్నిచ్చాయి. నీ బోసి నవ్వులు, వద్దన్నకొద్దీ నోట్లో వేలేసుకుని నా వంక చూసిన చిలిపి చూపులు, కేరింతలు, ఏడుపులు, నవ్వులు, తలను నిలబెట్టడం, నేలంతా నీదేనన్నట్లు పాకడం, నీ అంతట నువ్వే లేచి నిల్చోడానికి ప్రయత్నించడం, అడుగులు తడబడటం, కిందకు పడిపోవడం, మళ్ళీ లేవడం, పరుగులు తీయడంతో పాటు చిలక పలుకులు పలికి భాషను స్వాగతించిన క్షణాలు ఇలా ఒకటేమిటి ఎన్నని చెప్పను? ఈ అన్ని సమయాల్లోనూ నువ్వు మనింట ఆ దేవుడ్ని తీసుకొచ్చావు.

ఈ ప్రపంచం ఇంతే. ఏడ్పులు. నవ్వులూనూ.

జీవితాంతం పిల్లల చేష్టల్లాగే సాగిపోతే ఎంత బాగుంటుందనిపిస్తుంది.

జీవితంలోని వివిధ దశల్లో నువ్వు ఒక్కో పాత్ర పోషించాలి.

చదువుకో. అదే సమయంలో అనుభవపూర్వకంగా వీలున్నంత ఎక్కువ నేర్చుకో. నిప్పు వేడిగా ఉంటుందని చదివి తెలుసుకోవడం కాదు తాకినప్పుడు కలిగే గాయంతో నిజం తెలుసుకో. అప్పుడు కలిగిన అనుభవం ఎప్పటికీ ఒక పాఠంగా మిగిలిపోతుంది. ఆఖరి శ్వాస విడిచేవరకు ఈ జీవన సూత్రాన్ని మరచిపోకు. శరీరంలోంచి బయటకు వచ్చి నిన్ను నువ్వు చూసుకో.

అన్ని వేళలా ప్రేమగా ఉండు.

ప్రేమను మించింది ఈ లోకంలో మరొకటి లేదు.

ప్రేమానందంతో ఈ లోకాన్ని తడుపుతూ ముందుకు సాగడం అలవరచుకో. ప్రేమ తృప్తినెరగదు. ఎంత తాగినా ఇంకా కావాలనిపించేది ప్రేమేనని చలం అన్నాడు. ఇందులో ఎంతో గొప్ప నిజముంది.

నీ తాత యాభయ్యో పడిలో విమానాన్ని చూసి ఉండొచ్చు. నేను నా యుక్తవయస్సులో విమానాన్ని చూశాను. కానీ నువ్వు నీ రెండో ఏటికే విమానాన్ని చూశావు. రేపు నీ కొడుకు రాకెట్‌ని నెలల ప్రాయంలోనే చూడొచ్చు.

ఈ మార్పు ఒక తరంలో అమాంతం వచ్చింది కాదు. దీని వెనుక అనేకుల కఠోర శ్రమ, అంకితభావం వంటివన్నీ కలగలిశాయి.

నీ ముత్తాత అడవుల్లో తిరిగి ఉండొచ్చు. నీ తాత పల్లెలో పెరిగి ఉండొచ్చు. నేను పట్టణంలో పెరిగి ఉండొచ్చు. నువ్వు నగరంలో పుట్టి పెరుగుతున్నావు.

నీ తాత భూమిని చదును చేశాడు. నీ తండ్రి విత్తనం నాటాడు. నువ్వు సాగు చేస్తావు. సత్ఫలితాన్ని అనుభవించు. అక్కడితో ఆగిపోకు. నీ సంతానానికి అవసరమైన విత్తనాలను నీ గుప్పెట్లో ఉంచుకో.

శ్రమించేందుకు వెనుకాడకు. అదే నిన్ను ముందుకు తీసుకుపోతుంది.

కలలు కను. దేవతలు నీ కలల్ని ఆశీర్వదిస్తారు.

స్త్రీని ప్రకృతి శక్తిగా చూడు. ఆరాధించు. ఆనందించు.

నా తండ్రి నా నుంచి దాచిన రహస్యాలను భద్రపరచిన పెట్టె తాళాల కోసం వెతికినట్లే నువ్వూ వెతకొచ్చు. అన్వేషణ ఫలించాలి. నీకు తెలియంది లేదు. అడుగులు చూసి వెయ్యి. పరిశ్రమ ప్రధానం.

ప్రయాణాల అనుభవాలు నీకు వీపుమీదా కళ్ళు తెరిపించొచ్చు.

పుస్తకాలను ప్రేమించు. ఒక్కో పుస్తకాన్ని తాకినప్పుడు నువ్వు ఒక్కో అనుభవాన్ని స్పర్శించినట్లే. నీ తాత ముత్తాతలు పుస్తకాలను పట్టించుకోలేదు. కానీ నువ్వు అలా ఉండకు. దొరికిన దానికన్నా నచ్చిన పని చెయ్యి. అందులో ఆనందాన్ని అనుభవించు.

ఒడిదుడుకులు ఎదురైనప్పుడు స్థిరంగా నిల్చునేందుకు ప్రయత్నించు. డీలా పడిపోకు.

ఎవరైనా అడిగితే వీలైన మేరకు సాయం చెయ్యి. లేదనకు. సాయం చేయడంలో ఉన్న ఆనందన్ని అనుభవించు. అందులో నిన్ను నువ్వు చూసుకో.

చుట్టాలతో చనువుగా ఉండు. అదే సమయంలో ఎడంగానూ ఉండు.

ఈ భూమ్మీద బంధాలన్నింటిలో మృదువైంది, తీయనైనది స్నేహం. దీనిని మించిది మరొకటి లేదు. మంచి మిత్రుల్ని చూసుకో. జీవితం తిన్నగా సాగిపోతుంది.

ఇవన్నీ నా తండ్రి నాకు చెప్పక చెప్పినవే.

నేను నీకు చెప్పాలనుకుని చెపుతున్నవివి.

నా ఆనందాన్ని నువ్వు పుట్టిన తర్వాత నా తండ్రి ప్రేమను అర్థం చేసుకున్నాను. రేపు నీకు పుట్టబోయే బిడ్డలో నా ప్రేమను నువ్వూ గుర్తుకు తెచ్చుకుంటావు.

బిడ్డ కలగడం, తల్లికీ, తండ్రికీ ఆత్మాభివృద్ధికి అవసరమని తోచినప్పుడే బిడ్డని పోషించడానికి, బిడ్డకి తగిన శిక్షణ ఇవ్వడానికి సరైన పరిస్థితులు ఉన్నప్పుడే బిడ్డని సృజించుకోవాలి. గుడ్డిగా అప్రయత్నంగా, తమ ఉద్దేశ్యమూ, ఒళ్ళూ తెలీక బిడ్డల్ని కని, తమనీ, వాళ్ళనీ, ఈశ్వరుణ్ణీ కర్మనీ తిట్టుకునే స్థితిలో పడటం, బిడ్డని చంపడం కన్న ఘోరమైన కార్యం అని చలం చెప్పిన కొన్ని వాక్యాలు గుర్తుకొచ్చి నీ విషయమై ఆలోచించాను. నేను నీకు ఏ మేరకు న్యాయం చేశానో కదూ?

ప్రతి శిశువు ఉత్త చేతుల్తో రాదు. ఒక సందేశంతోనే వస్తుంది. దేవుడింకా మనిషిని నిరుత్సాహపరచలేదనే ఠాగూర్ మాటల్లోని లోతును చూడు. ఆ మాటల్నే నీ ఎదుగుదలలో చూడాలన్నది నా ఆశ.

అప్పుడే పుట్టిన శిశువుని చూసి ఆనందించి పొందే అనుభూతల్లే గొప్ప హృదయంతో ప్రతి సూర్యోదయాన్నీ స్వాగతించు. పలకరించు.

సౌందర్యం అసలు సిసలు నవ్వులో ఉంటుందనే విశ్వకవి మాటలు మరచిపోకు.

వాస్తవాలు ఎన్నైనా కావచ్చు. కానీ నిజం మాత్రం ఒక్కటే.

ఇలా చెప్పుకుంటే పోతే ఇది ఉత్తరం కాదు పెద్ద పుస్తకమైపోవచ్చు. చెప్పడానికేం బోలెడుంటాయి. అందుకే అంటున్నా.

నువ్వు నీ మనవడో మనవరాలితోనో ఏదో ఒక ఊళ్ళో ఎక్కడో అక్కడ ముద్దాడి మాట్లాడేటప్పుడు నా జ్ఞాపకం వస్తే ఈ ఉత్తరాన్ని మళ్ళీ చదువు. నీ కళ్ళలోంచి కారే కన్నీటిలో నేనుంటాను.

**ఇట్లు**

**నీ నాన్న.**

తుంగచాప

ఎమ్మార్వీ సత్యనారాయణ మూర్తి

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో ఎంపికైన ఉత్తమ కథానిక

**"శివా! బయలుదేరుతున్నావా?"** సునీల్ ప్రశ్నకు ఆశ్చర్యపోయాడు శివన్నారాయణ.

"ఎక్కడికి సునీల్?" అడిగాడు శివ.

"అదేమిటి, నీకింకా తెలియదా? మన జానకిరామయ్య మాష్టారు చనిపోయారు. ప్రొద్దున్నే తీసికెళ్ళిపోయారట. రామకృష్ణ చెప్పాడు. మాష్టారుగారి అబ్బాయిలు, అమ్మాయిలు నడుపూడి వచ్చేసార్ట. నువ్వు వెంటనే బయలుదేరి వచ్చేయ్" ఫోన్ పెట్టేశాడు సునీల్.

శివన్నారయణ భార్య పార్వతితో ఊరుకెళ్ళాల్సిన పని బడిందని చెప్పి బట్టలు ఎయిర్ బాగ్‌లో సర్దుకుని బయల్దేరాడు.

అప్పటికి రాత్రి పదిగంటలయ్యింది. ఆటోమీద ఎం.జి.బి.ఎస్‌కి వచ్చి విజయవాడ బస్సెక్కాడు శివన్నారాయణ.

బస్సు బయలుదేరింది. శివన్నారాయణ ఆలోచనలు కూడా గతంలోకి ప్రయాణించసాగాయి.

●●●

వశిష్ఠ గోదావరీ తీరాన ఉన్న గ్రామం నడుపూడి. గ్రామంలో ఉన్న ఏకైక ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు జానకిరామయ్య. ఆయనకు సహాయకుడిగా ఉన్న మరొక ఉపాధ్యాయుడు కాశిపతి పక్కనే ఉన్న చినమల్లం గ్రామం నుండి రోజూ వచ్చి వెళతాడు.

నడుపూడిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ఎంతో పురాతనమైనది. జానకిరామయ్య మాష్టారు రోజూ గోదావరిలో స్నానం చేసి సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకుని ఆ తర్వాత ఇంటికి వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వర్తించేవాడు.

వెయ్యిమంది జనాభా ఉన్న ఆ గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉంటారు. ఎన్నికలు ఎప్పుడూ జరగలేదు. గ్రామస్తులు సర్పంచ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకుని జిల్లా కలెక్టరుకు సమాచారాన్ని పంపేవారు.

గ్రామంలో రైతులు వరి, పసుపు పండిస్తారు. గ్రామంలోని వారు ఎక్కువగా వ్యవసాయ పనులమీదే ఆధారపడి జీవిస్తారు.

శివన్నారాయణ తండ్రి రాముడు రిక్షా డ్రైవరు, తల్లి గౌరమ్మ. మాష్టారి ఇంట్లో, షావుకారు గురవయ్య ఇంట్లో పాచిపని చేస్తుంది. వ్యవసాయం పనులు ముమ్మరంగా ఉన్నప్పుడు కూలి పనికి వెళుతుంది. వాళ్ళకి శివుడు ఒక్కడే సంతానం. జానకిరామయ్య మాష్టారే వాడికి శివన్నారాయణ అని పేరు పెట్టారు. శివ, కేశవులకు భేదం లేదనేది ఆయన ప్రగాఢ విశ్వాసం.

రోజూ సాయంకాలం ఐదుగంటలకు మాష్టారు ఇంటివద్ద ప్రైవేటుకి క్రమం తప్పకుండా వెళ్ళేవాడు శివన్నారాయణ. ఏ విధమైన ఫీజు లేకుండా ఉచితంగా ఎవరు వచ్చినా ప్రైవేట్ చెప్పేవారు మాష్టారు. ఎవరైనా ఫీజు ఇవ్వబోతే సున్నితంగా తిరస్కరించేవారు. "స్కూల్లో బోధిస్తున్నందుకు నాకు ప్రభుత్వం జీతం ఇస్తోంది. నా కుటుంబం గడపడానికి అది చాలు" అనేవారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయానికి ఎదురుగా ఉన్న వీధిలో మాష్టారిది పెద్ద పెంకుటిల్లు. వీధి వైపు వున్న రెండు అరుగులు విశాలంగా ఉన్నాయి. ఒక అరుగు మీద మాష్టారి సైకిలు ఇతర సామాగ్రి ఉంటాయి. రెండవ అరుగు మీద మాష్టారు రోజూ సాయంకాలం పిల్లలకు ప్రైవేట్ చెబుతారు.

మాష్టారి భార్య సీతమ్మగారు వారి పిల్లలతో సమానంగా ప్రైవేట్‌కు వచ్చే పిల్లలకు జంతికలు, చేగోడీలు పెట్టేవారు. ఏమీ లేకపోతే మరమరాలైనా పెట్టేవారు. కానీ ఏ రోజూ పిల్లలకు ఏదో చిరుతిండి పెట్టకుండా ఇంటికి పంపేవారు కాదు. ముఖ్యంగా శివన్నారాయణ అంటే చాలా ప్రేమగా చూసేవారు.

'ఒరేయ్ శివుడూ' అంటూ ఎంతో ఆప్యాయంగా పిలిచేవారు. దొడ్లో ఉన్న అరటి చెట్లు గెలలు వేస్తే కోతులు తినేయకుండా ఉండేందుకు గోనెసంచులు శివన్నారాయణ చేతే కట్టించేవారు. అరటికాయలు పండాక దేవుడికి నైవేద్యం పెట్టి ముందుగా శివన్నారాయణకే పెట్టేవారు.

ప్రైవేట్ పిల్లలందరూ శివన్నారాయణని 'సీతమ్మగారి దత్తుడ'ని సరదాగా వేళాకోళమాడేవారు.

నడుపూడిలో ఏడవ తరగతి చదివాకే హైస్కూలు చదువుకి సిద్ధాంతం వెళ్ళాలి. శివన్నారాయణ తండ్రి రాముడు "నీకు చదువు చెప్పించలేను. మునసబుగారింట్లో పాలేరుగా చేరిపో" అని కరాఖండిగా చెప్పేసాడు. దిక్కుతోచని శివన్నారాయణ మర్నాడు ప్రొద్దునే మాష్టారింటికెళ్ళి భోరున ఏడ్చేశాడు. మాష్టారు సముదాయించి అడిగితే "మా నాన్న చదివించనంటున్నాడు. నాకు చదువుకోవాలని ఉంది" అని చెప్పాడు. సీతమ్మగారు లోపల్నుండి వచ్చి "వాడి చదువు ముందుకు వెళ్ళేటట్లు చూడండి. వెర్రి నాగన్న బెంబేలెత్తిపోతున్నాడు" అని భర్తకు చెప్పింది.

మాష్టారు రాముడికి నచ్చచెప్పి శివన్నారాయణని స్వయంగా సిద్ధాంతం హైస్కూలులో చేర్పించి పుస్తకాలు కొని ఇవ్వడమే కాక ఫీజులు కూడా కట్టేసారు. పనిలో పనిగా శివుడికి కొత్త సైకిలు కూడా కొని ఇచ్చారు. లేదంటే ఆరు కిలోమీటర్లు రోజూ శివుడు నడిచి వెళ్ళాల్సి వచ్చేది.

సిద్ధాంతం హైస్కూల్లో చేరిన శివన్నారాయణ సాయంకాలం జానకిరామయ్య మాష్టారు ఇంటికి వచ్చి తెలియని పాఠాలు మాష్టార్ని అడిగి తెలుసుకునేవాడు.

మాష్టారి ఇంటి సావిట్లోని తాటాకుల చాపను ప్రైవేటుకి వచ్చిన విద్యార్థులు తెచ్చి అరుగు మీద పరిచేవారు. మాష్టారు చాపమీద కూర్చుని రాత్రి ఏడుగంటలవరకూ ప్రైవేట్ చెప్పేవారు. ప్రైవేట్ పూర్తయ్యాక మళ్ళీ జాగ్రత్తగా తాటాకుల చాపను చుట్టచుట్టి దానికి ఒక తాడును కట్టి మరలా సావిట్లో పెట్టి వచ్చేవారు విద్యార్థులు. ఈ రెండు పనుల్నీ శివన్నారయణ, సునీల్ వర్మ చేసేవారు. అలాగే దొడ్లోని అరటి మొక్కలకు, మందార మొక్కలకు బావిలోంచి నీళ్ళు తోడి బకెట్లలో తెచ్చిపోయడంలో వీళ్ళిద్దరే పోటీపడేవారు.

మాష్టారుగారమ్మాయి శారదను పెళ్ళివారు చూడటానికి వస్తున్నారని మాష్టారు రాజమండ్రి వెళ్ళి ఒక పెద్ద తుంగచాపను కొని తెచ్చారు. శారద పెళ్ళిచూపులు ఆదివారం నాడు జరగడంతో శివన్నారాయణ, సునీల్ ప్రొద్దుటే మాష్టారింటికి వచ్చేసారు. ఏమైనా పనులుంటే చెప్పమని సీతమ్మగారి వెనకాలే తిరిగారు. ' పనులేమీ లేవు హాయిగా అరుగుమీద కూర్చో' మని చెప్పారు సీతమ్మగారు.

నేదునూరు నుండి వచ్చిన పెళ్ళివారు శారదని చూసి నచ్చిందని అన్నారు. రాజమండ్రి నుండి తెచ్చిన తుంగచాప మీద రంగులతో ముద్రించిన రెండు నెమళ్ళు, వాటి మధ్యలో శారదని చూసి ఆనందంతో పొంగిపోయాడు వినయ్.

మగపెళ్ళివారి అభ్యర్థన మేరకు సీతమ్మగారు లోపలికి వెళ్ళి వీణ తెచ్చి శారదకిచ్చింది. "అదిగో అల్లదివో శ్రీహరివాసము" అన్నమయ్య కీర్తనను మృధుమధురంగా వీణపై పలికించింది శారద. పెళ్ళివారి మొహాలు కీర్తన వినగానే మెర్క్యూరీ లైట్లలా వెలిగిపోవడంతో

తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు జానకిరామయ్య, సీతమ్మ దంపతులు. మరుసటి నెలలోనే శారద పెళ్ళి జరగడం అత్తవారింటికి వెళ్ళిపోవడం చాలా స్పీడ్‌గా జరిగిపోయాయి.

ఆ తర్వాత కొత్త తుంగచాప మాష్టారి ప్రైవేట్ వినడానికి రాకపోకలు ప్రారంభించింది. శివన్నారాయణ తుంగచాప తెచ్చి అరుగుమీద వేసి చాపమీద ఉన్న నెమలి బొమ్మల్ని అరచేతితో తాకి పులకించి పోయేవాడు.

సంవత్సరం గడిచేసరికి తుంగచాప చివర్లు కదిలిపోయి ఈనెలు బయటకు వచ్చేసాయి. అది గమనించిన శివన్నారాయణ సీతమ్మగారితో ఈ విషయం చెప్పగా తన పాత చీర ఒకదానిని చింపి తుంగచాప నాలుగు పక్కలా దానిని జతచేసి సూదీ దారంతో కలిపి కుట్టేసారు. అప్పటికి గానీ శివన్నారాయణ హృదయం శాంతించలేదు.

మాష్టారు ఎంతో ముచ్చటపడి కొన్న తుంగచాప తన ప్రాభవాన్ని కోల్పోవడం శివన్నారాయణకు నచ్చలేదు. అందుకే సీతమ్మగారికి ఒకటికి రెండుసార్లు చెప్పి తుంగచాపకు కొత్త సొగసులు చేరేవరకూ విశ్రమించలేదు.

తుంగ చాప మీద ఉన్న రెండు నెమళ్ళ మధ్య కూర్చుని ఉన్న శారద రూపం గుర్తుకు వచ్చినప్పుడల్లా శివన్నారాయణ అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి నమస్కరించేవాడు. శారద సరస్వతీదేవి అంశతో పుట్టిందని వాడి ప్రగాఢ విశ్వాసం. ఆ మాట సీతమ్మగారితో అంటే ముసి ముసి నవ్వులు నవ్వేవారు ఆవిడ.

జానకిరామయ్య మాష్టారు ప్రైవేట్ చెప్పడం పూర్తికాగానే ఎంతో భక్తిగా ఆ తుంగచాపను చుట్టి సావిట్లో పెట్టి వచ్చేవాడు శివన్నారాయణ.

పదవతరగతి పాసయ్యాక రోటరీ క్లబ్ వారి ఆర్థిక సహకారంతో ఇంటర్మీడియట్ చదివి ర్యాంకు సాధించి విశాఖపట్టణం ఇంజనీరింగ్ కాలేజీలో చేరాడు శివన్నారాయణ. చదువు పూర్తికాగానే హైద్రాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. పెళ్ళయ్యాక ఉద్యోగం, పిల్లలు వాళ్ళ చదువులతో బిజీ అయిపోయాడు. ఏడాదికోసారి సంక్రాంతికి నడుపూడి వచ్చేవాడు. ప్రొద్దుటా, సాయంత్రం మాష్టారి ఇంటికి వెళ్ళేవాడు. మాష్టారు రిటైరైనా ఇంకా స్కూలు పిల్లలకు ఉచితంగానే ప్రైవేట్ చెప్పడం చూసి ఆశ్చర్యపోయేవాడు. సంపాదనే ధ్యేయంగా చేస్తున్న ఉద్యోగాలకు "లాంగ్ లీవు" పెట్టి కార్పొరేట్ స్కూళ్ళల్లో పనిచేసే ఉపాధ్యాయులు నడుపూడి వచ్చి మాష్టారులాంటి వారిని చూసి ఉపాధ్యాయ వృత్తిపట్ల గౌరవం పెంచుకుంటే ఎంత బాగుంటుంది? అనుకునేవాడు శివన్నారాయణ.

ప్రైవేట్ పిల్లలు వెళ్ళిపోయాక, తుంగచాప మడత పెడుతున్న విద్యార్థి చేతిలోంచి చాపతీసుకుని మడత పెట్టి లోపల సావిట్లో పెట్టి వచ్చేవాడు. అది చూసి సీతమ్మగారు నవ్వుతూ "శివుడూ ఇప్పుడు నువ్వు ఇంజనీరువిరా. నీకెందుకు ఇవన్నీ" అనేవారు.

"అమ్మా! నా చదువు, నా జీవితం అంతా మాష్టారి భిక్ష కదమ్మా. నేను జీవితాంతం మీ సేవ చేసినా నా ఋణం తీరదమ్మా" అని కళ్ళమ్మట నీళ్ళు చిప్పిల్లగా అనేవాడు శివన్నారాయణ.

గుళ్ళో అమ్మవారిలా నిరంతరం చిరునవ్వు నవ్వుతూ వరాలిచ్చే దేవతలాంటి సీతమ్మగారు మాష్టారితో కాశీవెళ్ళి స్నానం చేసి ఆ మెట్ల మీద ప్రాణాలు వదిలారని తెలిసి హుటాహుటిన నడుపూడి వచ్చి మాష్టార్ని పలకరించి పదిరోజుల కార్యక్రమాలు పూర్తయ్యాకే వెళ్ళాడు శివన్నారాయణ.

విచిత్రం ఏమిటంటే సీతమ్మగారి సంవత్సరీకం జరిగిన వారం రోజులకే మాష్టారు మరణించారు.

శివన్నారాయణ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ బస్ హారన్ వేస్తూ విజయవాడ బస్టాండులోకి వచ్చి ఆగింది. బస్ దిగిన శివన్నారాయణకు అప్పుడే బయలుదేరబోతున్న కాకినాడ బస్ కనిపించింది. వెంటనే ఆ బస్ ఎక్కేశాడు. సిద్ధాంతంలో దిగి ఆటో మీద నడుపూడి చేరుకునే సరికి ఉదయం ఏడుగంటలయ్యింది. బరువెక్కిన హృదయంతో మాష్టారు ఇంటికి వెళ్ళాడు శివన్నారాయణ.

●●●

ప్రతిరోజూ ఏ అరుగు మీద కూర్చుని మాష్టరు పిల్లలకు ప్రైవేట్ చెప్పేవారో అదే చోట మాష్టారి పార్థివ దేహాన్ని ఉంచారు. నెమళ్ళు ఉన్న ఆ తుంగ చాప మీద జానకిరామయ్య మాష్టారు దీర్ఘనిద్రలో ఉన్నారు.

మాష్టారి పెద్దబ్బాయి ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతూ శివన్నారాయణని కళ్ళతోనే పలకరించాడు. చిన్నబ్బాయి దూరంగా ఊళ్ళోని కమ్మవారి అబ్బాయిలతో, రాజుల అబ్బాయిలతో నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

నడుపూడిలో కొన్నివేలమందికి అక్షర భిక్ష పెట్టి వారి జీవితాల్లో వెలుగుపూలు పూయించిన వ్యక్తి ఈ గ్రామాన్నీ, ఈ లోకాన్నీ విడిచి వెళ్ళిపోతే ఎవరికీ పట్టకపోవడం చూసి శివన్నారాయణ మనస్సు కుతకుత ఉడికిపోయింది.

మాష్టారికి అంతిమ సంస్కారం చేసుకుందామని అరుగు దగ్గరకు వచ్చిన శివన్నారాయణని చూసింది శారద.

"శివుడూ మీ మాష్టారు మమ్మల్ని అనాథల్ని చేసి వెళ్ళిపోయారు" అని ఘొల్లుమంది. అంతవరకూ ఆపుకున్న దుఃఖం శివన్నారాయణుడిలో కట్టలు తెంచుకుని బయటకు వచ్చింది. చాలాసేపు అలాగే కన్నీళ్ళు కారుస్తున్న శివన్నారాయణని రామకృష్ణ వచ్చి పక్కకు తీసుకెళ్ళి సముదాయించాడు.

అపరకర్మలు చేయించే బ్రాహ్మడు రాగానే కార్యక్రమాలు మొదలుపెట్టి, ఒక గంట గడిచాక శ్మశానంకు తీసుకువెళ్ళి మాష్టారి అంత్యక్రియలు నిర్వహించారు మాష్టారి పిల్లలు.

శివన్నారాయణ సాయంత్రం రహస్యంగా చాకలి రంగయ్యని కలిసి తన మనసులోని మాట చెప్పాడు. అది వినగానె రంగయ్య హృదయం చలించిపోయింది. పెంటమీద పారేసే వస్తువు ఇతనికి అపురూప వస్తువయ్యిందా? అని ఆశ్చర్యపోయాడు.

మాష్టారి పదిరోజుల కార్యక్రమాలు పూర్తయ్యాకా శివన్నారాయణ రంగయ్యని ఇంటిదగ్గర కలిసి అతనిచ్చిన వస్తువుని పవిత్రంగా కళ్ళకద్దుకుని తీసుకున్నాడు.

"నీ మేలు ఎప్పటికీ మర్చిపోలేను రంగయ్య" అని చెప్పి రంగయ్య వద్దంటున్నా బలవంతంగా ఐదువందల రూపాయల నోటు అతని చేతిలో పెట్టి ఇంటికి బయలుదేరాడు శివన్నారాయణ.

●●●

శివన్నారాయణ మర్నాడు సాయంత్రం ఆఫీసునుండి రాగానే నడుపూడి నుండి తెచ్చుకున్న వస్తువుని భద్రంగా తీసుకుని టైలర్ రహీం దగ్గరకు వెళ్ళాడు.

"రహీం భాయ్ ఈ చాప చుట్టూ ఉన్న క్లాత్ పోయింది. ఎరుపు రంగు మొఖమల్ క్లాత్ తీసుకుని చుట్టూ అంచులా కుట్టు. అక్కడక్కడ వదులై జారిపోతున్న ఈనెలను కూడా దగ్గరగా చేర్చి దారంతో కలిపి కుట్టు. రేపు సాయంత్రానికి కావాలి" అని చెప్పి రెండువందల రూపాయలు అతనికిచ్చి ఇంటికి తిరిగి వచ్చాడు.

ఒక పాత తుంగచాపకు ఇంత రిపేరు చేయిస్తున్న శివన్నారాయణ వంక ఆశ్చర్యంగా చూసాడు రహీం. రెండు వందల రూపాయలకు దళసరిది కొత్త తుంగచాప వస్తుంది. కానీ పాతబడిపోయిన ఈ చాపలో ఏదో విశిష్ట గుణం ఉండి ఉంటుంది. అందుకే శివన్నారాయణ ఇంత శ్రద్ధ తీసుకుంటున్నాడని భావించాడు రహీం.

ఆ మర్నాడు సాయంత్రం రహీం దగ్గరకు వచ్చి తుంగచాపను చూసి సంతృప్తిగా నవ్వి, రహీంకి 'థాంక్స్' చెప్పి ఇంటికి వచ్చాడు శివన్నారాయణ.

వీధి గదిలో తను కూర్చునే సోఫాకి వెనకాల గోడకి మేకులు కొట్టి తుంగచాప వ్రేలాడదీశాడు. వెంటనే స్నానం చేసి వచ్చి ఉతికిన లుంగీ కట్టుకుని వచ్చి తుంగచాపను కళ్ళకద్దుకుని మనసులో రూపాన్ని ఊహించుకుని నమస్కరించాడు.

శివన్నారాయణ భార్యకి మాష్టారికి, భర్తకి ఉన్న అనుబంధం తెలుసు కాబట్టి ఏమీ పట్టించుకునేది కాదు. కానీ శివన్నారాయణ కొడుకు సుధీర్‌కి తండ్రి ప్రవర్తన వింతగా తోచేది. ఇంటికొచ్చే స్నేహితులు కూడా పాత తుంగచాపను చూసి ఆసక్తిగా సుధీర్‌ని ప్రశ్నించేవారు. మరికొంతమంది జోక్ చేసేవారు. "పూర్వం గోడలకి రవివర్మ చిత్రాలను అలంకరించుకునేవారు, డబ్బున్న వాళ్ళు పులి చర్మాలు వేలాడదీసేవారు. కాలం మారినందున తుంగచాపను కూడా డ్రాయింగ్ రూమ్ ఎట్రాక్షన్‌గా చేయొచ్చని సుధీర్ వాళ్ళ నాన్న నిరూపించారు" అని హేళనగా మాట్లాడేవారు.

శివన్నారాయణకి ఒక అమ్మాయి, అమ్మాయి. అమ్మాయి సీతారత్నంకు పెళ్ళై అత్తవారింటికి వెళ్ళిపోయింది. కొడుకు సుధీర్ బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఇంకో రెండు సంవత్సరాల్లో శివన్నారాయణ రిటైర్ అవబోతున్నాడు.

ఒకరోజు సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి వంటింట్లో భార్యా, కొడుకు వాదించుకుంటున్నారు.

"నువ్వు నాన్నగారితో చెప్పమ్మా. క్లాసులో కూడా అందరికీ మనింట్లో తుంగచాపే టాపిక్‌గా మారిపోయింది. డ్రాయింగ్ రూంలో తీసేసి వేరేచోట పెట్టమని చెప్పమ్మా."

"చూడు సుధీర్ మీ నాన్నగారికి మాష్టారంటే ఎంతో భక్తి, గౌరవం. ఆ తుంగచాపలో ఆయన్ని చూసుకుంటూ సంతృప్తి పొందుతున్నారు. అలాంటప్పుడు ఆయన మనసు గాయపడేలా నేను మాట్లాడలేను."

" అమ్మా ఒక పని చేయవచ్చు కదా! మాష్టారి ఫోటో ఒకటి తెచ్చి అక్కడ ఉంచి దణ్ణం పెట్టుకోమని నాన్నగారికి చెప్పు."

ఏమీ బదులు చెప్పలేక కొడుకు కేసి నిస్సహాయంగా చూసింది శివన్నారాయణ భార్య.

మౌనంగా బెడ్ రూంలోకి వెళ్ళిపోయాడు శివన్నారాయణ. రాత్రి దీర్ఘంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆఫీసులో కూడా కొలీగ్స్ మధ్య తుంగచాప చర్చ జరుగుతోందని ప్యూన్ చెప్పాడు. తనకి ప్రమోషన్ కోసం ఇంట్లో చాప వేలాడదీసాడని కొందరు, రాత్రిళ్ళు ఆ తుంగచాప మీద కూర్చుని పూజలు చేస్తాడని మరికొందరు చర్చించుకుంటున్నారని ప్యూన్ ద్వారా తెలుసుకున్నాడు.

మర్నాడే డాబా మీద ఒక గది నిర్మాణాన్ని ప్రారంభించాడు శివన్నారాయణ. రెండు నెలల్లో ఒక విశాలమైన గది, ఎటాచ్డ్ బాత్‌రూం ఏర్పాటు చేసుకుని రాత్రుళ్ళు తన పడక, నిద్ర అక్కడికి మార్పు చేసుకున్నాడు. తుంగచాప కూడా మేడమీద గదిలోకి మారిపోయింది. తనకోసం ఎవరు వచ్చినా క్రింద డ్రాయింగ్ రూంలోనే మాట్లాడుతున్నాడు. శివన్నారాయణ కొడుకు ఆనందించాడు ఈ మార్పుకి.

కానీ శివన్నారాయణ భార్య మాత్రం చాలా మనోవేదనకు గురయ్యింది. భర్త ఒకచోట, తను మరొకచోట నిద్రించే పరిస్థితి ఏర్పడింది కదా అని నిరంతరం చింతించేది.

●●●

ఒకరోజు శివన్నారాయణ మిత్రుడు ఫోన్ చేశాడు.

"శివా హైదరాబాద్‌లో రెండురోజులు పనిబడింది. రేపు ఉదయానికి వస్తాను"

"రామకృష్ణా తప్పకుండా మా ఇంటికేరా ఎక్కడా దిగవద్దు. నీతో ముఖ్యమైన పనివుంది" అన్నాడు శివన్నారాయణ.

నర్సాపూర్ - హైదరాబాద్ రైలుకి బయలుదేరాడు రామకృష్ణ. ఉదయమే సరాసరి శివన్నారాయణ ఇంటికి ఆటోమీద వచ్చాడు అతను వచ్చేటప్పటికి శివన్నారాయణ ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి. డాబా మీద గదివద్ద జనం గుమికూడి ఉండడం గమనించాడు రామకృష్ణ. గబగబా మెట్లు ఎక్కి డాబాపైకి చేరుకున్నాడు.

శివన్నారాయణ భార్యా, కొడుకు విషణ్ణ వదనాలతో కనిపించారు.

నేలమీద శివన్నారాయణ దీర్ఘనిద్రలో ఉన్నాడు. తలకింద నడుపూడి నుండి తెచ్చుకున్న 'తుంగచాప' మడతపెట్టి పెట్టుకున్నాడు.

"ఎప్పుడు జరిగింది?" శివన్నారాయణ భార్యని అడిగాడు రామకృష్ణ.

"పొద్దున్నే స్టేషన్‌కి వెళ్ళి రామకృష్ణని తీసుకురావాలి. నన్ను నిద్రలేపు. అని రాత్రి చెప్పారు. ఉదయం 5 గంటలకే లేచి పైకి వచ్చి చూస్తే ఇదీ పరిస్థితి" కన్నీరు కారుస్తూ చెప్పింది ఆమె.

ప్రశాంతంగా ఉంది శివన్నారాయణ మొహం.

"మాష్టారి ఒడిలో తలపెట్టుకుని నిద్రించావా శివా! నువ్వు నిజంగా ధన్యుడివి శివా. భీష్ముడిలా స్వచ్ఛంద మరణం పొందావు" జేబులోంచి కర్చీఫ్ తీసుకుని కళ్ళు తుడుచుకున్నాడు రామకృష్ణ.

ఆ రోజు భీష్మ ఏకాదశి! భీష్ముడు తనువు చాలించిన రోజు.

●●●

## గొంగళిపురుగు ఎమ్.సుగుణరావు

### వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో ప్రశంసాపత్రం పొందిన కథానిక

**సీతామహాలక్ష్మి చేతులకు గోరింటాకు వేసుకుంటోంది.** చిన్నప్పుడు నిద్రపోతున్న తనకు తల్లి వెయ్యడం గుర్తుకొచ్చింది. అది ఆరేవరకు తల్లి నిద్రపోయేది కాదు. ఇపుడూ తల్లి లేదు. ఎర్రగా పండిన గోరింటాకులా మిగిలిన తల్లి జ్ఞాపకాలు.

"గోరింట బాగా పండింది, మంచి మొగుడొస్తాడేవ్" అనేది. తల్లి ఎందుకలా అనేదో కానీ తనకు మంచి మొగుడే వచ్చాడు. భర్త శ్రీరామ్ గుర్తుకు రాగానే ముఖంలో నవ్వు మెరిసింది సీతామహాలక్ష్మికి. ఇంతలో శివాలయంలో గంట మ్రోగింది. గుడిలో గంట మ్రోగగానే భర్త వచ్చేస్తాడు అనుకుంటూ గబగబా చేతులు కడుక్కొని కాఫీ పెట్టడానికి కిచెన్‌లోకి వెళ్ళింది. పదినిమిషాల తర్వాత కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తియ్యగానే శ్రీరామ్.

"నా ప్రాణం గాడొస్తున్నాడోచ్" అన్నాడు భార్యను చూసి హుషారుగా.

"మీ బాస్ భానుప్రకాష్ గారా?" అంది.

"బాస్ ఏమిటి? వాడి బొంద. మా కంపెనీకి బాస్ అయినా నాకు మిత్రుడే" అన్నాడు శ్రీరామ్.

"మనింటికి వస్తారా?" అంది అతడి కళ్ళలోకి చూస్తూ.

"రావడమేమిటి మనింట్లోనే ఉంటాడు" అన్నాడు శ్రీరామ్.

"బాబోయ్, అంతటి కోటీశ్వరుడికి మనింట్లో సదుపాయంగా ఉంటుందా?" అంది సీత అనుమానంగా.

"మనింటికేం తక్కువ. మూడు బెడ్ రూముల ఇల్లు. నువ్వు పెద్ద స్టార్ హోటల్‌లో హౌస్ కీపింగ్ మేనేజర్‌వి, నీ హోటల్ మేనేజ్ మెంట్ ప్రావీణ్యంతో ఎప్పటికప్పుడు ఇల్లు సర్దుతూ ఇంటిని అద్దంలా ఉంచుతావ్?" అన్నాడు.

ఆ మాటలకు నవ్వుతూ కాఫీ కప్పు భర్తకు అందించి "మన పెళ్ళికి రాలేదేం మీ స్నేహితుడు?" అంది.

"యు.ఎస్‌లో మన కంపెనీ ప్రాజెక్ట్ మొదలు పెట్టాడు కదా. ఆ టైంలో అక్కడే ఉన్నాడు, లేకపోతే దగ్గరుండి తనే మన పెళ్ళి జరిపించేవాడు" అన్నాడు. అలా అంటూనే కాఫీ తాగడం పూర్తి చేసి సోఫామీద వెనక్కి వాలాడు.

భానుప్రకాష్‌తో తను విశాఖలో గడిపిన రోజులు గుర్తుకొచ్చాయి. తను ఇంటర్‌లో క్లాస్ మేట్. ఒకే మనసుగా బతికారు. తరువాత యూనివర్సిటీలో ఇంజనీరింగ్. ఇద్దరూ యు.ఎస్‌లో ఎమ్.ఎస్ చేద్దామనుకున్నారు. తన ఆర్థికస్థితి అందుకు సహకరించలేదు. భాను మాత్రం యు.ఎస్ వెళ్ళాడు. ఇంజనీరింగ్ తర్వాత తను రకరకాల ఉద్యోగాల్లోకి మారాడు. సంవత్సరం క్రితం హైదరాబాదులో ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టాడు. ప్రభుత్వరంగ సంస్థలకు ఔట్ సోర్సింగ్. తననే ముందుగా తీసుకున్నాడు. తను బాగా వృద్ధి చేసాడు. ఇపుడు సాఫ్ట్‌వేర్ రంగంలో భానుప్రకాష్ కంపెనీ ద్వారా తనకు మంచి గుర్తింపు. అతడితో స్నేహం తన బతుకుపుస్తకంలో తియ్యటి పేజీ! అలా మిత్రుడి గురించిన ఆలోచనల్లో ఉన్న శ్రీరామ్ భార్య మాటలతో ఇహంలోకి వచ్చాడు. "రేపు సెలవు పెడదామనుకుంటున్నాను, అయితే సాయంత్రం ఏదో సెమినార్, నేను ఈవెంట్ మేనేజర్‌ని. మధ్యాహ్నం లంచ్ తర్వాత మీ ప్రోగ్రామ్" అంది సీత.

"ఫరవాలేదు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత మేం ఆఫీసుకు వెళ్ళిపోతాం. నువ్వు డ్యూటీకి వెళ్ళిపోవచ్చును. ఐదింటికి నన్ను లేపు. ఎయిర్ పోర్టుకు వెళ్ళి భానును తీసుకురావాలి" అన్నాడు.

●●●

సీత బాల్కనీలోంచి చూస్తోంది. అప్పటికి ఆమె ఐదోసారి అలా చూడడం. ఫ్లైట్ లేటయిందేమో అనుకుంది. ఆమెకు చాలా టెన్షన్‌గా ఉంది. పెళ్ళయిన ఆరు నెలలకు వస్తున్న తొలి గెస్ట్. భర్త ప్రాణ స్నేహితుడే కాకుండా భర్త పనిచేసే కంపెనీకి అధిపతి. ఏ లోపం రాకూడదు అనుకుంది. ఇల్లు శుభ్రంగా సర్దింది. మంచాల మీద దుప్పట్లు మార్చింది. సోఫాలకు ఎంబ్రాయిడరీ చేసిన కవర్లు తొడిగింది. ఫ్లవర్ పాట్‌లో తాజా గులాబి పువ్వులు ఉంచింది. రెండు రకాల టిఫిన్లు చేసి టేబుల్ మీద సర్దింది. తలస్నానం చేసింది. మేకప్‌కిట్ ముందేసుకుంది, సెమినార్‌కి తయారవ్వాలి, భర్త, ఆయన స్నేహితుడు వెళ్ళగానే టైము సరిపోదు. గబగబ తయారయిపోయింది. పదినిమిషాల తర్వాత కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీసింది. ముందు భర్త, వెనుక భానుప్రకాష్, తెల్లగా, పొడుగ్గా, కొద్దిగా పెరిగిన గెడ్డం, పసుపురంగు టీషర్ట్, జీన్స్ ఫ్యాంట్. హాయ్ అంటూ చేయి అందించాడు. షేక్‌హ్యాండ్ ఇవ్వకుండా రెండు చేతులు జోడించింది. ఆమెను చూసిన భానుప్రకాష్ 'స్టన్నింగ్ బ్యూటీ' అనుకున్నాడు మనసులో కాదు పైకే. సీతకు ఒక్కసారి షాక్‌గా అనిపించింది ఆ మాట. భర్తవంక చూసింది. బహుశ వినలేదేమో? మామూలుగా కనిపించాడు. వెంటనే శ్రీరామ్‌తో "నీది మంచి సెలక్షన్ మరి ఆవిడది" అంటూ చిన్నగా నవ్వాడు భానుప్రకాష్. ఆమెకు మరొక షాక్. ఏమిటీ ఈయన మాటలు అనుకుని చివుక్కుమన్న ఆ బాధను అణుచుకుంటూ ట్రేలో మంచినీళ్ళ గ్లాసులు పట్టుకొచ్చింది. ఇద్దరికీ ఇచ్చింది. భానుప్రకాష్ ఇంటిని పరిశీలనగా చూసాడు. పొందికగా సర్దిన ఫర్నిచర్. బాల్కనీలోంచి వస్తున్న నైట్ క్వీన్ పరిమళం. కనులకు ఇంపుగా కనిపిస్తున్న లేతరంగు కర్టెన్లు. నేలమీద పరచిన పువ్వుల తివాచీ.

"మీ ఆవిడది మంచి టేస్టు" అన్నాడు. శ్రీరామ్ భార్యవైపు గర్వంగా చూసాడు.

టిఫిన్ ప్లేట్లను డైనింగ్ టేబుల్ మీద ఉంచింది. టిఫిన్ చేస్తూనే క్రీగంటితో గమనిస్తున్న భానుప్రకాష్ చూపులు ఆమెను ఇబ్బంది పెట్టాయి.

"అన్నట్టు, సీతది మీ ఊరే. అదే అమలాపురం" అన్నాడు శ్రీరామ్.

"అమలాపురంలో ఎక్కడ మీ ఇల్లు?" అనడిగాడు భానుప్రకాష్.

"కూచిమంచి అగ్రహారం, మా నాన్నగారి పేరు రమణమూర్తి, ఇప్పుడు లేరు" అంది.

"రమణమూర్తా ఎప్పుడో విన్నట్టుంది ఈ పేరు? ఆయన ఏం చేసేవారు?" అన్నాడు తలెత్తి మరోసారి సీతవంక చూస్తూ.

"రాజోలు జమిందారుగారనేవారు, ఆయన పేరు భూపతిరామరజు, వారింట్లో మా నాన్న గుమాస్తాగా పనిచేసేవాడు" అంది మెల్లగా.

"మైగాడ్" అంటూ తలెత్తి ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసాడు భానుప్రకాష్.

శ్రీ రామ్ అతడి మాటలకు గట్టిగా నవ్వి "భూపతిరామరాజు అంటే ఎవరనుకున్నావ్?" అన్నాడు సీతతో.

"ఏమోనండి." అంది సీత తలొంచుకుని.

"ఆయన మన భాను నాన్నగారు" అన్నాడు.

వెంటనే భానుప్రకాష్ వంక పరిశీలనగా చూసింది.

'ఔను ఇతగాడు ఆ జమిందారుగారి కొడుకు, తను బాగా చిన్నది పదేళ్ళ వయసు పదిహేనేళ్ళ క్రితం ఇదివరకు చూసినట్టే ఉంది ఆ ముఖం' అనుకుంది.

ఇంతలో భానుప్రకాష్ హఠాత్తుగా నవ్వాడు. సీత, శ్రీరామ్ ఇద్దరూ ప్రశ్నార్ధకంగా ముఖం పెట్టారు.

"అన్నట్టు నీకు ఆ రోజుల్లో ఒక నిక్‌నేమ్ ఉండేది" అన్నాడు.

ఆ మాటలకు సిగ్గుపడింది సీత.

"ఏమిటీ ఆ నిక్‌నేమ్" అన్నాడు, శ్రీ రామ్ సీత వైపు చూసి. సమాధానం చెప్పకుండా గబగబా లోపలకు వెళ్ళింది.

భానుప్రకాష్ వెంటనే "నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. అప్పటి సీతకు, ఇప్పటి సీతకు ఎంత తేడా? ఎలా దొరికింది నీకీ దొండపండు" అన్నాడు. లోపలనుండి ఆ మాటలు విన్న సీతకు మరోసారి బాధ. అసలు అంత డైరెక్టుగా మాట్లాడుతున్నాడే తను దొండపండా. అంటే భర్త కాకిముక్కా! భర్త నల్లగా ఉన్నాడనా ఆ వెటకారం. నా భర్త ఎలా ఉంటేనేం. నాకు నవమన్మధుడు. అందం మనిషిలో ఉండదు, మనసులో ఉంటుంది. బ్యూటీ ఈజ్ బిహేవియరల్. ఆలోచనల్లో ఉన్న ఆమెకు "సీతా" అనే పిలుపు. స్నేహితులిద్దరూ టిఫిన్ తినడం పూర్తిచేసారు. చీర భుజాలనిండా కప్పుకుని వెళ్ళింది. భాను ప్రకాష్ చూపులు తినేస్తున్నాయ్. అది నిజమా లేక భ్రమా అనుకుంది.

"ఏదో సెమినార్ ఉందన్నావ్ హోటల్‌లో దించేస్తాం" అన్నాడు భర్త.

"ఫరవాలేదు నేను ఆటోలో వెళతాను" అంది.

"భలేదానివే. ఇంతెండలోనా?" అన్నాడు.

"ఔను. మీ ఆయన నీ మేకప్ చెరిగిపోతుందని, నీ అందం తరిగిపోతుందని భయపడుతున్నాడు" ఆమెను పరిశీలనగా చూస్తూ అన్న భానుప్రకాష్ మాటలకు ఒక్కసారి నిస్సత్తువ వచ్చినట్టయింది. ఇద్దరూ మెట్లు దిగారు. ఇంటికి తాళం వేసి తను వారిని అనుసరించింది.

"ఎక్కడ ఉద్యోగం?" అన్నాడు కారు ముందు సీట్లో శ్రీరామ్ పక్కన కూర్చుంటూ భానుప్రకాష్.

"సీత హోటల్ మేనేజ్ మెంట్ చేసింది, మన నగరంలోని బ్లూ డైమండ్ హోటల్‌లో మేనేజర్ హౌస్ కీపింగ్, తను మానేస్తానన్నా హోటల్ వాళ్ళు ఒప్పుకోవడంలేదు" అన్నాడు శ్రీరామ్.

"ఔను ఇంత బ్యూటిఫుల్ ఏంజిల్‌ని ఎవరు వదులుకుంటారు?" అన్నాడు భానుప్రకాష్.

సీత ఆ మాటలకు దిక్కులు చూస్తూ కళ్ళు మూసుకుంది. కారు ముందుకు వెళుతోంది. సీతకు మనసులో ఏవో ఆలోచనలు. తనకి పెళ్ళయి ఆరునెలల్లో శ్రీరామ్ తనని ఎప్పుడూ నొప్పించలేదు. తనను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. శ్రీరామ్‌తో తన పెళ్ళి విచిత్రంగా జరిగింది. బ్లూ డైమండ్ హోటల్‌లో శ్రీరామ్ ఏదో సెమినార్ ఏర్పాటు చేసాడు వాళ్ళ ఎక్జిక్యూటివ్‌ల కోసం. అలా అతడితో కలిసి తను కొన్ని సెమినార్లకు పనిచేసింది. ఒకరోజు తనే ప్రపోజ్ చేసాడు. తను పిన్ని, బాబాయ్‌లతో మాట్లాడమంది. పిన్ని, బాబాయ్ చూసారు శ్రీరామ్‌ని.

"అబ్బాయి మంచివాడులాగానే ఉన్నాడు. పొడుగ్గా ఉన్నాడు కానీ, నలుపు పరవాలేదా?" అన్నారిద్దరూ.

"ఎలా ఉంటేనేం. మీరు చెప్పినట్టు ఆయన మనస్సు వెన్న. రంగు ఎలా ఉంటేనేం?" అంది.

అలా తమ పెళ్ళైపోయింది. తను, శ్రీరామ్‌లు ఆనందమైన వైవాహిక జీవితం అనుభవిస్తున్నారు. మరి తమ మధ్యలో వచ్చిన ఆ ఈ గెస్ట్ తమ జీవితాల్లో ఏ రకమైన కల్లోలం రేపుతాడో. అనుకుంటూ ఆమెలో భయం నీడలు.

"హోటల్ వచ్చేసింది" అన్న భర్త కారును ముందుకు పోనిచ్చాడు. యాంత్రికంగా సెమినార్ ఏర్పాట్లు చేసింది. ఒకవైపు మనసులో మెదులుతున్న భయానికి ఆనకట్ట వెయ్యలేకపోతోంది. సెమినార్ పూర్తయ్యేసరికి నాలుగయ్యింది. అప్పటికే తలనొప్పి అనిపించింది. తన బాస్ దగ్గర పర్మిషన్ తీసుకుని ఆటో ఎక్కింది. ఇంటి మెట్లెక్కుతుంటే సెల్‌లో ఏదో మెసేజ్.

"నిక్‌నేమ్ గుర్తొచ్చిందా?" క్రిందపేరు లేదు. ఆ మెసేజ్ ఎవరిచ్చారో అర్ధమై ఏడుపొచ్చింది. గబగబా తలుపులు తీసి నిర్లిప్తంగా సోఫాలో కూలబడింది. మనసు గతంలోకి జారుకుంది.

పదిహేనేళ్ళ క్రితం అమలాపురంలో కూచిమంచి అగ్రహారంలో తను అందరి హేళనకు గురయ్యేది. పదేళ్ళ వయసున్న తనది చింపిరి జుట్టు, చీమిడి ముక్కు. అమ్మ బతికున్నంత కాలం తను రాణిలా ఉండేది. రోజూ రెండుసార్లు తల దువ్వి ముస్తాబు చేసేది. పౌడర్ రాసి బుగ్గన దిష్టిచుక్క పెట్టేది. అమ్మకు హఠాత్తుగా బాగా జబ్బు చేసింది. డాక్టర్లు గర్భసంచి తీసెయ్యాలన్నారు. అలా ఆపరేషన్ టేబుల్ మీద బాగా రక్తస్రావం కావడంతో అమ్మ చనిపోయింది. అమ్మ చనిపోయిన తరువాత తన చెల్లికి, తమ్ముడికి తనే అమ్మ అయింది. వంటపని, ఇంటిపని రోజంతా బొగ్గుల పొయ్యి ముందు కూర్చుని ఊదడంతో సరిపోయేది. పొగ ముక్కులోకి వెళ్ళిపోయి ఎప్పుడూ కారుతూ ఉండేది. తల దువ్వుకునే టైము లేదు. చింపిరి జుట్టుతో దెయ్యంలా కనిపించేది. అందరూ తనకి ఒక పేరు పెట్టారు. సీతామహాలక్ష్మిలో ఆపుకుందామనుకున్నా దుఃఖం ఆగలేదు. తను మరచిపోయిన ఆవేదనా పూరిత గతాన్ని మళ్ళీ భానుప్రకాష్ గుర్తు చేసాడు.

ఆ రోజుల్లో తను నాన్న పని చేసే ఆ రాజోలు జమిందారుగారింటికి వెళ్ళేది. తనను ఆ ఇంట్లోకి రానిచ్చేవారు కాదు, తన వాలకం చూసి ముఖ్యంగా భానుప్రకాష్ తనను అసహ్యంగా చూడడం లీలగా గుర్తుకొస్తోంది. భానుప్రకాష్‌కి గొంగళిపురుగంటే భయం అప్పట్లో. వీధిలో పిల్లలు గొంగళి పురుగు మీదకి విసిరి భయపెట్టేవారు. అలా గొంగళిపురుగుని చూసి చీదరించుకుని భయపడే భానుప్రకాష్ తనని చూసి అలాగే చీదరించుకునేవాడు. అలా తనకి గొంగళిపురుగు అనే నిక్‌నేమ్ వచ్చేసింది. తను ఆ ఇంట్లోకి రాగానే గొంగళిపురుగు వచ్చిందర్రో అనేవారు. తను సిగ్గుతో కుంచించుకుపోయేది. ఆ జమిందారుగారి పిల్లలు పెట్టిన పేరు వీధిలోకి పాకింది. తన పేరు అలా స్థిరపడిపోయింది. అమ్మ పోయిన తర్వాత నాన్నకు తాగుడు అలవాటయింది. అమ్మ ఆపరేషన్ కోసం చేసిన అప్పులు.

వస్తున్న కొద్దిపాటి జీతం. ఈ నేపథ్యంలో తాగుడుకు బానిసైన నాన్నను అదీ మింగేసింది. తనను, చెల్లెళ్ళి, తమ్ముడిని తమ ముగ్గురు బంధువులు జాలిపడి దత్తత తీసుకున్నారు. తనను హైదరాబాదులో ఉంటున్న పిన్ని తీసుకెళ్ళింది. వారికి పిల్లల్లేరు. మళ్ళీ రాణివాసం. పిన్ని బాబాయ్ తనను కాన్వెంటులో వేసారు. ముద్దుగా చూసుకునేవారు. పిన్ని తనను చక్కగా ముస్తాబు చేసేది. మంచి డ్రెస్సులు కొనేది. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు. తన గొంగళి పురుగు గతంలోంచి బైటపడింది. తనను అసహ్యంగా అమానుషంగా ఎవరూ చూడకూడదనుకుంది. అందుకే సహజమైన తన అందానికి మెరుగులు దిద్దేది. అలా గొంగళిపురుగు దశను దాటిన సీత సీతాకోక చిలుక అయ్యింది మళ్ళీ ఇన్నేళ్ళకు తనకు ఆ నిక్‌నేమ్ గుర్తు చేసి భానుప్రకాష్ తన మనసును గాయపరిచాడు. ఏడుస్తూనే సీత సోఫా మీద వాలిపోయింది. అలా అరగంటసేపు ఉండిపోయింది. అప్పుడు గుర్తొచ్చింది. భర్త, భానుప్రకాష్ డిన్నర్‌కు వస్తారన్న విషయం. ముఖం కడుక్కుని గబగబా వంటకు ఉపక్రమించింది. కుక్కర్‌లో రైస్ వేసి చపాతీలు, కూర చేసింది. అప్పటికే ఏడయ్యింది. స్నానం చేసి వారికోసం నిరీక్షిస్తూ కూర్చుంది. ఏడుదాటి మరో రెండు గంటలు గడిచినా ఇద్దరి జాడాలేదు. ఫోన్ చేద్దామనుకుంది. బిజీగా ఉన్నారేమో ఎందుకు డిస్టర్బ్ చేయడం అనుకుంది. అలాగే సోఫా మీద వాలిపోయింది. అలా ఎంతసేపు నిద్రపోయిందో తెలీదు. డోర్ బెల్ మోగుతున్న చప్పుడు. టైము చూసింది. పన్నెండు. భర్త స్వరం వినిపించింది. తలుపు తీసింది. గుప్పుమన్న వాసన. భర్త, ప్రక్క భానుప్రకాష్. "సారీ తాగింది నేను హోటల్‌కు వెళ్ళిపోతానన్నా మీ ఆయన ఒప్పుకోలేదు. " ముద్దగా వస్తున్న మాటలు.

"సీతా కాస్త పెరుగన్నం కలుపు. " భర్త మెల్లగా చెప్పాడు. ప్లేట్లో పెరుగన్నం కలిపి, స్పూన్‌తో అందించింది. గబగబా తినడం ముగించి సోఫాలో వాలిపోయాడు. అతగాడి బూట్లను తీస్తున్న భర్త పాపం, స్నేహితుడంటే ఎంత ప్రాణమో అనుకుంది.

ఆ రోజు రాత్రి భానుప్రకాష్ గురించి తీవ్రమైన అంతర్మథనానికి గురైన ఆమెకు నిద్రపట్టలేదు. భర్తతో అతగాడి గురించి చెబుదామనుకున్నా గొంతులో మాట బైటకు రాలేదు.

●●●

ఉదయం లేచి కాఫీ కప్పుతో బెడ్ రూములోకి వచ్చింది. అప్పటికే వాకింగ్ ముగించుకొచ్చిన శ్రీరామ్, "అన్నట్టు నేను అమెరికా వెళుతున్నాను. రాత్రి చెబుదామనుకున్నాను. నువ్ తొందరగా పడుకున్నావ్. భానుప్రకాష్ అమెరికాలో మా కంపెనీ క్రొత్త ప్రాజెక్ట్ మొదలుపెడుతున్నాడు. దానికి నన్ను ప్రాజెక్ట్ లీడరుగా అపాయింట్ చేసాడు. నేను ఇంకో ఇద్దరం వెళుతున్నాం."

"రెండు నెలల కేంపా? నేను ఒంటరిగా ఉండాలా? " అంది దిగులుగా.

"బెంగపడకు, మీ పిన్ని, బాబాయ్‌ల ఇంటికి వెళుదువుగాని. భానుప్రకాష్ ఇక్కడే ఉంటాడు, ఏదైనా అవసరం వస్తే," భర్త మాటలతో ఆమెలో దిగులు మేఘం కమ్ముకుంది.

●●●

రెండు వారాల తర్వాత శ్రీరామ్ అమెరికా వెళ్ళాడు. మొదటి రోజుకే బెంగపడింది సీత. రెండు రోజుల తర్వాత భానుప్రకాష్ వచ్చాడు. చేతిలో ఏదో ప్యాకెట్టు. "హాయ్" అంటూ చేయందించాడు. ఎప్పట్లాగే ఆమె రెండు చేతులూ జోడించింది.

"మీ పెళ్ళికి రాలేదు. ఇది నా గిఫ్ట్. " అన్నాడు. ఆమెకు అందిస్తూ దాన్ని చూడగానే ఆమెకు అర్థమైపోయింది అది ఎంత విలువైనదో. అతనే గబగబా ప్యాకెట్టు విప్పాడు. డైమండ్ నెక్లెస్. కంగారుగా ఆ ప్యాకెట్టు అతడికి తిరిగి ఇచ్చేస్తూ. "వద్దు సార్. ఇంత ఖరీదైంది" అంది.

"సెలక్ట్ చేసింది మీ ఆయనే. శ్రీరామ్ అమెరికా వెళ్ళేముందు చూసాం. మీ ఆయనకు ఫోన్ చేస్తాను" అంటూ గబగబా ఫోన్ చేసాడు.

"అయినా వద్దండి. అమ్మో ఇంత ఖరీదైందా?" అంది.

ఆమెకు మనసులో అలజడి. అంతలో సెల్ మోగింది. "ఫరవాలేదు తీసుకో. రేపు కంపెనీ వార్షికోత్సవం కదా. భానుప్రకాష్ కంపెనీ వృద్ధి చేసినవారికి ఏవో బహుమతులు ఇస్తున్నాడు" భర్త సెల్ ఫోన్‌లో చెపుతున్న మాటలకు ఏం చెయ్యాలో పాలుపోక అయోమయంగా నిలుచుండిపోయింది.

"రేపు సాయంత్రం హోటల్ కళింగలో ఫంక్షన్. శ్రీ రామ్ లేడు కదా నువ్వు రావాలి" అంటూ గబగబా మెట్లు దిగాడు. కారు కదిలిన చప్పుడు. భానుప్రకాష్ అంతరంగం మెల్లగా అర్థమవుతోంది సీతకు. భర్తకు చెప్పేద్దామా. చెపితే ఎలా రియాక్ట్ అవుతాడో. స్నేహితుడంటే ప్రాణం. ఆలోచనలు తెగక 'భగవంతుడా. నన్ను రక్షించు.' అనుకుంది.

●●●

తరువాత రోజు సాయంత్రం కారొచ్చింది. సీత హోటల్‌కి బయలుదేరింది. అంతకుముందే భర్త ఫోన్ చేసాడు వెళ్ళమని. హోటల్ రిసెప్షన్ ముందు భానుప్రకాష్ 'ఈమె సీత.. నా చైల్డ్‌హుడ్ మేట్' అంటూ అందరికీ పరిచయం చేస్తున్నాడు. వైఫాఫ్ శ్రీరామ్ అనకుండా అలా పరిచయం చేయడంతో ఆమెకు ఆశ్చర్యం. ఆందోళన. ఫంక్షన్ జరుగుతున్నంతసేపు ముడుచుకుని కూర్చుంది సీత.

తరువాత రోజు తనకి వీక్లీ హాఫ్. బద్ధకంగా లేచింది తీరికగా పనులు చేసుకుంటోంది. ఇంతలో కారు ఆగిన చప్పుడు. నిమిషం తర్వాత మెట్లు ఎక్కుతుంటే గుండె చప్పుడు మరీ ఎక్కువయింది. వచ్చేసాడు, రాగానే నవ్వుతూ "నువ్ హోటల్‌లో ఉద్యోగం చెయ్యడం అంత అవసరమా?" అన్నాడు.

"ఔను సార్. మా తమ్ముడు, చెల్లెలు ఉన్నారు కదా, శ్రీ రామ్‌గారికి వాళ్ళ భారం పూర్తిగా మోపడం దేనికి. వేడినీళ్ళకు చన్నీళ్ళు" అంది.

"మన కంపెనీలోనే ఉద్యోగం చెయ్యి. రెట్టింపు జీతం" అన్నాడు ఆమె కళ్ళలోకి చుస్తూ.

"నేను చదివింది హోటల్ మేనేజ్‌మెంట్ కదా సార్. ప్రొఫెషన్‌ను వదిలి పెట్టడం ఎందుక"ంటూ ఆగిపోయింది.

"సరే ఆలోచించు. నేను రేపు యు.ఎస్ వెళుతున్నాను. శ్రీరామ్‌కు ఏమైనా చెప్పాలా?" అన్నాడు.

"తొందరగా వచ్చెయ్యమని చెప్పండి సార్" అంది.

"తొందరగానా. ప్రాజెక్ట్ పూర్తికావద్దూ. నేను పదిరోజుల్లో తిరిగొచ్చేస్తా" అన్నాడు క్రీగంటతో చూస్తూ. ఆ మాటలతో ఆమెలో మరింత బాధ, దాన్ని అణచుకుంటూ "కాఫీ తెస్తాను సార్" అంటూ కిచెన్‌లోకి వెళ్ళింది.

పాలు, స్టవ్ మీద ఉంచి ఫిల్టర్‌లోని కాఫీ డికాషన్ తీస్తుంటే సెల్ మోగింది, ఏదో మెసేజ్. "శిల్పంలా తీర్చిదిద్దినట్టున్న కనుబొమ్మల క్రింద చేపపిల్లలాంటి పెద్ద కళ్ళు, సంపెంగలాంటి ముక్కు, బయట కురిసిన వెన్నెల ఈ ఇంట్లోకి వచ్చింది. పైలోకం నుంచి నా కోసం వచ్చావా దేవకన్యా?"

మెసేజ్ క్రింద నెంబరు చూసి ఒక్కసారి వణికిపోయింది. వణుకుతున్న చేతులతో కాఫీ కప్పులోకి వంపింది. చాలావేగంగా ఆ కప్పు తీసుకువెళ్ళి టీపాయ్ మీద ఉంచి వెనక్కొచ్చేసింది. పావుగంట వరకూ అక్కడ నుంచి కదలలేదు. "సీతా సీతా" అంటూ పిలుపు. అయినా అలాగే ఉండిపోయింది. మెట్లు దిగుతున్న చప్పుడు. కారు కదిలిన తర్వాత డ్రాయింగ్ రూములోకి వచ్చింది. ఇపుడు ఆమెకు పూర్తిగా అర్థమైపోయింది. భానుప్రకాష్ అంతరంగం అవగతమైపోయింది. నిస్సత్తువగా సోఫాలో వాలిపోయింది. వంట్లో అలజడి. ఎవరో నరనరాలను ఒక్కసారి ఒడిసి పట్టినట్టనిపించింది. మనసును మరోవైపు మళ్ళించేందుకు టీవీ ఆన్ చేసింది. వరుసగా ఛానెల్ తిప్పుతోంది.

ఏ ఛానెల్స్ చూసినా సీరియల్స్. విసుగొచ్చి టీవీ ఆఫ్ చెయ్యబోతుంటే ఏదో ఛానల్‌లో ప్రజాస్పందన కార్యక్రమం. విషయం, నేడు స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు, ప్రేమ పేరుతో సాగుతున్న దాడులకు కారణం ఏమిటి? యాంకరింగ్ చేస్తున్న అమ్మాయి ఆవేశంగా మాట్లాడుతోంది.

"నేటి మార్కెట్ విష సంస్కృతిలో స్త్రీ ఒక వినియోగదారుల ముడిసరుకుగా మారిపోయింది. ఏ ప్రాయోజిత ప్రకటనైనా స్త్రీ అంగాంగాలను స్పృశించేదే అలా ఒక మార్కెట్ మోడల్‌ను అనుసరిస్తూ తమను తామే కోల్పోతున్న అతివలు. ఆ క్లిప్పింగ్ చూడండి" అంది యాంకర్.

కెమెరా ఒక అమ్మాయి వైపు ఫోకస్ అయ్యింది. స్లీవ్‌లెస్ జాకెట్టు, టైట్‌ఫిట్ డ్రస్సు. ముఖాన దట్టంగా మేకప్ పెదాలకు లిప్ స్టిక్. ఆమెను అనుసరిస్తూ అనేకమంది అబ్బాయిలు. ఆ ప్రక్కనే ఇంకో అమ్మాయి, చుడీదార్ పైజమా, చున్నీ భుజాల నిండా కప్పుకుని వెళుతోంది. ఆమె ప్రక్కన ఏ అబ్బాయి లేడు.

వెంటనే యాంకర్ మాట్లాడడం మొదలు పెట్టింది.

"చూశారా. ఇది లైవ్ టెలికాస్ట్. ఒకమ్మాయి ఎక్స్‌పోజ్ చెయ్యడంలో ఆమెను ఎలా వెంబడిస్తున్నారో. అలాగని ఆడవాళ్ళమీద లైంగిక దాడులు జరగడానికి కొంతవరకూ ఇది కారణం అని గట్టిగా చెప్పేందుకు నేను వెనుకాడటం లేదు. "

సీత వెంటనే ఆ ఛానెల్ మూసేసింది. ఆమెలో అలజడి ఉధ్రుతం అయింది. ఎదురుగా డ్రస్సింగ్ టేబుల్ అద్దంలో తనను చూసుకుంది. టైట్ చుడీదార్ పైజమా. చెవులకు పెద్ద రింగులు. ముఖానికి కొద్దిగా మేకప్. తను మేకప్ కావడం తన వృత్తి ధర్మం. అలాగే తన వేషధారణ హోటల్ వాళ్ళిచ్చిన తన డ్రస్ కోడ్ చిన్నప్పుడు తనని అందరూ ఏడిపించేవారు. చీదరించుకునేవారు. ఆ దశను దాటాలనే చేసిన ప్రయత్నంలో తన హోటల్ ఉద్యోగంలో సహజంగా అందమైన తను ఆకర్షణీయంగా మారింది. అందుకే భానుప్రకాష్ తన వెంట పడుతున్నాడా? ఆమె ఆలోచనల సుడిలో చిక్కుకుపోయింది. తనను భానుప్రకాష్ వేధిస్తున్నాడని చెపితే, శ్రీ రామ్ కుమిలిపోతాడు. బాధపడతాడు. తను దూరంగా ఉన్నాడు కనుక మరింత బెంగపడతాడు. అంతలో ఫోన్ మోగింది. పిన్ని నుంచి.

"ఏం తల్లీ ఒక్కదానివే ఉన్నావ్ వచ్చెయ్యవచ్చు కదా. బాబాయ్ క్యాంపుకి వెళ్ళారు. వారం రోజులదాకా రారు".

"అలాగే పిన్నీ వచ్చేస్తున్నాను" అంటూ గబగబా బట్టలు బ్యాగ్‌లో కుక్కుకుంది. డ్రస్సింగ్ టేబుల్‌లోని మేకప్ కిట్ అలాగే ఉంచేసింది. ఆటో ఎక్కింది. పావుగంటలో బాబాయ్‌గారింటికి చేరుకుంది.

పిన్ని సీతను చూసి "ఏమిటే అలా అయిపోయావ్. జీరో సైజు అనుకుంటూ తిండిమానేస్తున్నావా, అలా మానేస్తే ఏదో జబ్బు వస్తుందట. ఏంటది?" అంది.

"ఎనరాక్సియా నెర్వోజా ఆ జబ్బు పేరు పిన్ని. నీ ఇష్టం వచ్చింది వండిపెట్టు హాయిగా తినేస్తాను" అంది నవ్వుతూ. సీత భోజనం టైంటేబుల్ మారిపోయింది. మార్నింగ్ టిఫిన్. రెండుపూటలా భోజనం. హాయిగా నిద్రపోవడం. నో మేకప్, నో బ్యూటీ పార్లర్. డ్యూటీకి మాత్రం యధాప్రకారం హాజరయ్యేది.

పదిహేను రోజుల తర్వాత ఒక ఆదివారం పూట సుష్టుగా భోజనం చేసి హాయిగా నిద్రపోతోంది. పిన్ని ఎవరింటికో వెళ్ళింది. తలుపు కొట్టిన చప్పుడు. కళ్ళు నులుముకుంటూ తలుపు తీసింది. ఎదురుగా రావణాసురుడు. ఒక తలే ఉంది. విదేశీ అత్తరు పరిమళం. 'వీడు ఇక్కడికి తగలడినట్టున్నాడు. అమెరికానుంచి ఎప్పుడొచ్చాడో' అనుకుంటూ "నమస్తే సార్. శ్రీరామ్ ఎలా ఉన్నారు?" అంది.

సీతను చూసి షాక్ తిన్నట్టు అయిపోయాడు. "మైగాడ్ ఏంటీ అలా అయిపోయావ్, భర్త దూరంగా ఉంటే చిక్కిపోవాలి గానీ" అన్నాడు ముఖం చిట్లించి.

చిన్నగా నవ్వుతూ "పిన్ని బాగా వండి పెడుతోంది సార్" అంది.

"పిన్నిగారింట్లోనే సెటిల్ అయిపోయేటట్టున్నావ్. అక్కడకు రావన్నమాట" అన్నాడు.

"ఔను సార్ శ్రీరామ్ అదే అన్నాడు అక్కడ ఒక్కదానివే ఎందుకని" అంది.

"సరే శ్రీ రామ్ నీ కోసం ఈ గిఫ్ట్ పంపాడు" అంటూ ఆమె కందించాడు. భర్త పంపిన ప్యాకెట్టు విప్పింది. చక్కగా ఎంబ్రాయిడరీ చేసిన చుడీదార్ పైజమా. మెడమీద వేసుకునే దుపట్టా. అలాంటిది కావాలని ఒకసారి శ్రీరామ్‌ని అడిగింది. తనకోసం ఆ డ్రస్ ఇప్పుడు పంపాడు. తన అందాన్ని మరింత ద్విగుణీకృతం చేసే ఆ డ్రస్సు తను వేసుకోవాలా? సీతకు ఏడుపొచ్చింది. దుఃఖాన్ని మనసులోనే అణుచుకుంది. ఇంతలో భానుప్రకాష్ "మన కంపెనీ షేరు ధర పెరిగిన సందర్భంగా రాత్రికి ఆ ఫీసులోనే పార్టీ" అన్నాడు.

"అలాగే సార్" అంది. గబగబా మెట్లు దిగాడు. ఇంతలో సెల్ మోగింది. మెసేజ్ వచ్చింది "మెరిసే మెరిసే ఓ తార. అవుతావా నా జీవన సితార. " ఈసారి ఆ వర్తమానానికి సీత భయపడలేదు. తను రావణాసురుడిని ఎదుర్కోగలదు అనుకుంది. ఈ సీతని రక్షించడానికి శ్రీరాముడు లేడు. ఏ లక్ష్మణుడు రాడు. తనను తాను రక్షించుకోవాలి. ఇప్పుడేం చేయాలి? అనుకుంటూ ఆలోచనల్లో పడింది. దుఃఖం వచ్చినప్పుడు, దిగులు వేసినప్పుడు ఏదో ఒక పని చెయ్యి అంటూ భర్త చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఆ రోజు వచ్చిన దినపత్రిక తిరగేసింది అన్యమనస్కంగా. స్త్రీల వేషధారణ వారికి శాపమా! అనే అక్షరాల దగ్గర ఆమె కళ్ళు ఆగిపోయాయి. గబగబా ఆ వ్యాసం చదవడం మొదలెట్టింది.

అమ్మాయిల వస్త్రధారణ వల్లే లైంగిక దాడులు జరుగుతున్నాయన్నది సరికాదు. పాపం కొండ ప్రాంతంలోని గిరిజన స్త్రీలు, ఇంకా పసిపిల్లలు, వృద్ధ మహిళలపై జరుగుతున్న లైంగిక హింస మాటేమిటి? వారేం వస్త్రాలు ధరిస్తున్నారని? తరతరాలుగా పురుషుడి పశుబలం ముందు స్త్రీ ఓడిపోతోంది. రావణాసురుడు కీచకుల పురాణకాలం నాటి నుంచి నేటి పరమాణు యుగం వరకూ స్త్రీలపై దాడులకు అంతంలేదు. బురఖా ధరించినా, సాంప్రదాయంగా చీర కట్టుకున్నా, జీన్స్ వేసుకున్నా ఎలా ఉన్నా దాడులు ఆగడం లేదు. అత్యాచారం, లైంగిక హింస అనేవి స్త్రీల వస్త్రధారణకు సంబంధించినది కాదు. అది మగాడి క్రూరత్వానికి దర్పణం. అందుచేత వీటిని ఎదిరించడానికి ముందుకు స్త్రీలే సిద్ధం కావాలి. శారీరకంగా, మానసికంగా స్త్రీ శక్తిమంతురాలు కావాలి.

సీతకు ఆ వ్యాసం చూడగానే ఒక్కసారి ఆగిన ఊపిరి తిరిగి వచ్చినట్టయ్యింది. "ఔను ఈ వ్యాసం రాసినవారు చెప్పింది నిజమే. నిరంతరం ఆడవాళ్ళు ఎందుకు భయపడాలి? ఎవరికో భయపడి తమ ఆనందాన్ని ఎందుకు చంపుకోవాలి? అందరూ తనను గొంగళి పురుగు అని ఏడిపిస్తూ ఉంటే ఎంతటి మానసిక క్షోభ అనుభవించింది. అందమే ఆనందం, ఆనందమె జీవిత మకరందం అన్న కవి మాటల్లో పరమార్ధం లేదా! తను భానుప్రకాష్‌కు భయపడి తిరిగి గొంగళిపురుగు దశలోకి పరకాయ ప్రవేశం చేయాలనుకుంది. తన కిష్టంలేని పనిచేయడానికి పూనుకుంది. తను గొంగళిపురుగులా తయారవనక్కరలేదు. తను సీతాకోకచిలుకలా ఉంటూనే తనలోని గొంగళి పురుగుని బయటకు తీసుకు వస్తాను గొంగళి పురుగంటే భయపడే భానుప్రకాష్‌ను భయపెడతాను" అనుకుంది. అలా అనుకుంటూ సీత గబగబా తయారయ్యింది. హాయిగా తలారా స్నానం చేసింది. భర్త పంపిన డ్రస్సు వేసుకుంది. ఇంటి తాళం వేసి పక్కింట్లో ఇచ్చింది. ఆటో ఎక్కి పావుగంటలో ఆఫీసుకు చేరుకుంది. రిసెప్షన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్న భానుప్రకాష్ ఒక్కసారిగా వెనక్కి తిరిగి మార్వలెస్ అంటూ తన చేయి అందించాడు. ఎప్పుడూ చేతులు జోడించే సీత అతని చేయి అందుకుంది. అతను ఆశ్చర్యపోతూ ఆమె వంకే చూస్తున్నాడు. అతని చేతిని ఆమె బలంగా పట్టుకుంది. చాలా బలంగా –

చిన్నప్పట్నుంచీ కాయకష్టం చేసుకుంటూ పెరిగిన సీత, అలా దృఢంగా ఎదిగిన సీత సుకుమారంగా జమిందారుల ఇంట్లో పెరిగిన భానుప్రకాష్ చేతిని గట్టిగా నొక్కింది. ఒక అబల సబలగా మారి చేసిన ఆ ధిక్కార చర్యతో అతని తల్లి గుర్తుకొచ్చింది కాబోలు అమ్మా!

అంటూ అరిచి తన చేయి చూసుకున్నాడు. అతడు వేసిన కేక ఆ ప్రదేశమంతా ప్రతిధ్వనించింది. ఒక్కసారి సీత వంక భయంగా చూసాడు. బెదిరిపోతూ చూశాడు. వెనక్కి రెండడుగులు వేసి అక్కడనుంచి వేగంగా కదిలాడు.

దూరంగా తనని చూసి, చూడనట్లు నటిస్తున్న భానుప్రకాష్ ఎవరికీ పరిచయం చెయ్యడంలేదు.

హాయిగా, తృప్తిగా సంతోషంగా ధైర్యంగా ముందుకు నడుస్తోంది సీతా మహాలక్ష్మి ఎలియాస్ గొంగళి పురుగు.

●●●

## గ్రీన్ విలేజ్ — రవి వీరెల్లి

### వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో నా మొట్టమొదటి కథ విభాగంలో బహుమతి పొందిన కథ

**కాలం ఓ ఐదు జతల చీకటి - వెలుగుల్ని అవలీలగా మింగి,** తన వీకెండ్ తలుపులు బార్లా తెరిచి ఓ సారి ఒళ్ళు విరుచుకుంది. అమెరికాలో ఐదు రోజులు ఐదు సెకండ్లలా గడిచిపోతాయి, పిల్లలుంటే మరీను. వీకెండ్ రోజు కనీసం ఓ గంట సేపైనా ఎక్కువ నిద్రపోకపోతే జీవితంలో అతి విలువైనదేదో పోగొట్టుకున్నట్టు వెలితిగా ఉంటుంది. ఈ రోజు ఎలాగైనా ఈ నిద్ర సుఖాన్ని పూర్తిగా అనుభవించాలి అనుకున్నా. కానీ అంత అదృష్టం ఎక్కడిది? మా చిన్నోడు పొద్దున్నే లేచి కప్పుకున్న నా దుప్పటి లాగేసి "డాడీ ఈ రోజు నాయనమ్మ, తాతయ్యల పెళ్ళిరోజట అమ్మ చెప్పింది. తొందరగలే.. తాతయ్యకు ఫోన్ చేద్దాం" అంటూ ఒకటే తొందర పెట్టాడు.

స్నానం చేసి కిచెన్‌లో అడుగు పెట్టేసరికి మా ఆవిడ వేడి వేడి ఛాయ్ కిచెన్ కౌంటర్ మీద రెడీగా ఉంచింది. నిగనిగలాడుతూ ఈ మధ్యే వేయించిన గ్రానైట్ కౌంటర్ అందంగా కనిపించింది. ఓ చేత్తో చాయ్ తాగుతూ రెండో చేత్తో ఇండియాలో ఉన్న నాన్నకు డయల్ చేసి పెళ్ళిరోజు శుభాకాంక్షలు చెప్పాక, అమ్మా నేనూ కాసేపు మా ఊరు కబుర్లు చెప్పుకున్నాం.

"అమ్మా, ఈ రోజు పెళ్ళిరోజు కదా, బాపు నీకేమైనా గిఫ్ట్ కొన్నిచ్చాడా?" అని అడిగాను.

"అసలు ఈరోజు పెళ్ళిరోజనే గుర్తులేదురా" అని నవ్వింది అమ్మ.

"బాపు కొనివ్వకపోతే యేం? నేను కొనిస్తా, ఏం కావాలమ్మా?" అని అడిగాను.

"ఆ ఏమొద్దురా మీరు అక్కడెక్కడో ఉన్నారన్న బాధ తప్ప మాకు పెద్దగా కష్టాలేం లేవు. బాపు నీకు చెప్పిండో లేదో కానీ మనూరి మీద ఇప్పుడు కోతులు రాజ్యమేలుతున్నయిరా. ఏన్నించి వచ్చినయోగానీ ఓ వందకు పైనే ఉంటయ్. ఓ రెండురోజుల్లో పోతయ్‌లే అనుకున్నాం గాని ఇప్పటికి రెండేళ్ళకెక్కువ అయింది. వీటితో పెద్ద తలకాయ నొప్పైపోయింది. పట్నం వోళ్ళ తరీక మేం ఎప్పటికి దర్వాజా మూసి ఉంచంగదా. అందుకె ఇంట్ల ఏది దొరుకుతే అదే ఎత్తుకపోతున్నయ్. ఏదన్న తిండి వస్తువ ఉంటే సాలు, ఎత్తుకపోవుడేనాయె. చిన్న పిల్లగాండ్లని సుత గోర్లతో గీకుతున్నాయ్. ఆఖరికి మన ఇంటెనుక కాసిన కాయగూరలు సుత ఉంచుతలేవు" అంటూ అమ్మ ఆవేదనగా చెప్పింది.

"నాలుగు తన్ని ఎల్లగొట్టకపోయిండ్రే" అని నవ్వుతూ సింపుల్‌గా అన్నాన్నేను.

"అయ్యో. కోతి దేవుడు. కొట్టి సంపద్దురా. పాపం తగులుతది" అమాయకంగా అంది.

'అయితే జంతువులను తీసుకపోయి అడవిలో వదిలే గవర్నమెంటు ఆఫీసు ఉంటది. వాళ్ళకు నేను చెప్పి చూస్తానులే" అన్నాను.

"వాళ్ళకు సుత సెప్పి సూసినం. ఏం లాబం లేదురా. ఈ కోతులలొల్లి నుంచి మనూరికి ఏదైనా మార్గం చూపియ్యరా." బతిమాలుతున్నట్టు అడిగింది.

పక్కనుండి ఇదంతా వింటున్న నాన్న "ఇగ నువ్వు వానికి చెప్పింది చాల్లే" అంటూ ఫోన్ లాక్కుని "అరేయ్ చిన్నోడా, నువ్వు చిన్నప్పుడు ఆడుకున్న మనూరు గుట్ట" అంటూ ఈ కోతుల సమస్య అసలు ఎలా మొదలయ్యిందో చెప్పటం మొదలెట్టాడు.

నాన్న చెప్పిన మాటలు నన్ను చాలా డిస్టర్బ్ చేసాయి.

●●●

నల్ల గొంగడి కప్పుకుని పచ్చగా నవ్వుతూ ఆజానుబాహునిలా నిటారుగా నిలబడి ఊరుకు కాపలా కాసిన ఆ నల్లగుట్ట ఇప్పుడు లేదట? మా ఊరు పక్కనే ఊరుకు పెద్దదిక్కై ఉండే కొండ ఇప్పుడు లేదట. నేను పొట్ట చేతబట్టుకుని వలస పోయినట్టే మా ఊరుగట్టా ఊరు విడిచి వెళ్ళిపోయిందట. నే పిలిస్తే పలికి, నవ్వితే నవ్వే మా ఊరు నల్లగుట్ట ఇప్పుడు పట్నం పెద్దిండ్లలో పెద్ద పెద్దోల్ల పాదాలు మోస్తుందట. మనసు బాగాలేనప్పుడు నన్ను రమ్మని తన పొత్తిళ్ళలో పొదువుకునే ఆ కొండ సొరికెలు కూలిపోయినయట. కవ్వించి పైపైకి రమ్మని ఆహ్వానించే ఆ పెద్ద పెద్ద గుండ్లు ఇప్పుడు లేవట. ఊరువాళ్ళ తలెత్తి గర్వంగా చూసే ఆ గుట్ట ఇప్పుడు కాళ్ళు విరిగి కూలబడ్డదట.

ఎలా? ఏదో ఒకటి చేయాలి. పుట్టి పెరిగిన ఊరికి ఈ మాత్రం సహాయం చేయకపోతే ఈ జీవితం దండగ అనుకుంటూ ఆలోచనలో పడ్డా. నాన్నకు నా మీద బలమైన నమ్మకం. వీడు చదివిన చదువు ఇలానైనా ఊరుకు ఉపయోగపడాలి అనుకున్నాడేమో. కానీ, నేను చదివిన చదువు ఒకటి, చేస్తున్న ఉద్యోగం మరోటి అని నాన్నకి తెలియదు. నాన్న ఎంతో ఇష్టంగా నన్ను సివిల్ ఇంజనీరింగ్ చదివించి, 'ఎన్విరాన్మెంటల్' లో ఎమ్మెస్ చేయించారు. కానీ కొన్ని కారణాలవల్ల నేను సాఫ్ట్వేర్ ఉద్యోగంలో స్థిరపడాల్సి వచ్చింది.

ఈ కోతుల సమస్య మొదట్లో చాలా చిన్నగానే అనిపించినా, సమస్యకు మూలం ఏమిటో తెలిసేసరికి అది ఎంత పెద్ద సమస్యో ఇప్పుడే కొద్ది కొద్దిగా అవగాహనకు వస్తుంది. అసలు ఈ పని నేను చేయగలనా లేదా అన్న సందేహం కూడా కలగకపోలేదు. కానీ చెయ్యాలి. ఏదో ఒకటి చేయాలి. ఎంతమంది సహాయం తీసుకుని అయినా సరే, చేయాలి.

ఈ విషయంలో ఎవరు సహాయం చేయగలరు అని ఆలోచిస్తే వెంటనే నాకు గుర్తుకొచ్చినవాడు నా ప్రాణమిత్రుడు రామకృష్ణ.

రామకృష్ణ నాలాగే ఎన్విరాన్మెంటల్లో ఎమ్మెస్ చేసి 'వరల్డ్ బ్యాంకు ఎన్విరాన్మెంట్ డిపార్ట్మెంట్'లో 'ఎన్విరాన్మెంటల్ స్పెషలిస్ట్'గా పనిచేస్తున్నాడు. ఏడాదికి ఓసారి ఆఫీస్ పనిమీద అమెరికా వస్తుంటాడు. అలా వాడు చేసే ప్రాజెక్ట్స్ మీద కూడా నాకు పూర్తిగా అవగాహన ఉంది. ఈ కోతుల సమస్యకి పరిష్కారం కొద్దిగా దొరికినట్టయింది.

వెంటనే ఢిల్లీలో ఉంటున్న రామకృష్ణకు డయల్ చేసాను.

ఫోన్లో కాసేపు కబుర్లు చెప్పుకున్నాక, మెల్లగా నా అసలు సమస్య బయట పెట్టాను. విని "ఆర్ యు కిడ్డింగ్?" అని పెద్దగా నవ్వాడు.

"ఒక కొండను రీస్టోర్ చెయ్యాలి. దానికి నీ సహాయం కావాలి" మళ్ళీ దృఢంగా చెప్పాను.

"ఆర్ యు మాడ్? ఎండిపోయిన కొండను రీస్టోర్ చేయడమా? క్వారీయింగ్ చేసి గ్రానైట్ రాళ్ళను వెలికి తీసి పడగొట్టబడ్డ ఓ కొండను మళ్ళీ రీస్టోర్ చేయడమా? చెట్టు పెట్టడం చూసా కానీ గుట్ట పెట్టడం వినటానికే విడ్డూరంగా ఉంది" అంటూ మళ్ళీ నవ్వబోయాడు. కానీ నా గొంతులోని సీరియస్నెస్ విని నవ్వాపుకున్నట్టున్నాడు.

"రీ స్టోర్ అంటే గుంతలు పూడ్చి, చిందరవందరగా పడున్న శిథిలాలను క్లీన్ చేయించడం పెద్దపనేం కాదు, కానీ అన్ని చెట్లు నాటడం ఎలా? ఆ కొండను ఒక చిన్న అడవిలా ఎలా మార్చగలం?" అంటూ రామకృష్ణ తనలో తాను ఆలోచిస్తూ పైకే అన్నాడు.

రామకృష్ణ తనలో తాను ఆలోచిస్తూ పైకే అన్నాడు.

రామకృష్ణ అంటే నాకు చాలా ఇష్టం అంతే కాదు గౌరవం కూడా. జాయిన్ అయిన మూడు సంవత్సరాల్లోనే ఎంతో విసిబిలిటీ ఉన్న వరల్డ్ బ్యాంకు రూరల్ ప్రాజెక్ట్స్ డివిషన్‌కు మేనేజర్ అయ్యాడు. అతను మిజోరాంలో ఎక్జెక్యూట్ చేసిన 'స్టెబిలైసింగ్ ల్యాండ్ స్లైడ్ - ప్రోన్ హిల్ సైడ్స్' అనే ప్రాజెక్ట్‌కి మంచి గుర్తింపు వచ్చింది. నేననుకుంటున్న ఈ ప్రాజెక్ట్ డిజైన్ చేసి ప్లానింగ్ చేయగలిగే సత్తా ఉన్నవాడు.

"రీస్టోర్ చేయడానికి చాలా రోజులు పడుతుంది. ఏదైనా ఆల్టర్నేట్ సొల్యూషన్ ఆలోచించావా" అని అడిగాడు.

"అన్నీ ఆలోచించా. ఏనిమల్ కంట్రోల్, ఫారెస్ట్ డివిజన్ వాళ్ళకు చెప్పి కోతులను మైగ్రేట్ చేయించ వచ్చేమో? కానీ ఇది మా ఒక్క ఊరు సమస్యే కాదు. మా జిల్లా అంతటా ఉంది. అందుకే ఈ సొల్యూషన్ వర్క్ అవుట్ కాదు. సమస్య మూలాలను అన్వేషించి, గుర్తించి, వాటిని అధ్యయనం చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తేనే మంచిది. నిన్న జింకలు, ఈ రోజు కోతులు, రేపు పులులు ఇలా ఉండటానికి గూడు లేక అన్నీ అంతరించి పోవడమే కాకుండా ప్రజలను కూడా ఇబ్బందులు పాలు చేస్తున్నాయి. అందుకే జంతురాశి ఉనికికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడటం మన బాధ్యత. పర్యావరణాన్ని పరిరక్షించే ఇలాంటి ప్రాజెక్ట్స్ చేయడం వల్ల ప్రజల్లో పర్యావరణం మీద అవగాహన పెరుగుతుంది. సోషల్ రెస్పాన్సిబిలిటి కూడా పెరుగుతుంది. ఇది జనాభా ఎక్కువగా ఉన్న మనలాంటి దేశానికి చాలా అవసరం.

గ్రానైట్ రాళ్ళు తీసిన కంపెనీ, వాళ్ళ పని అయిపోగానే ఎక్కడి గుంతలు అక్కడే వదిలేసి ఎప్పుడో వెళ్ళిపోయారు కాబట్టి, అక్కడ మళ్ళీ బ్లాస్టింగ్ సౌండ్స్ వినిపించే అవకాశం లేదు. ఉండటానికి చెట్లు లేక, బ్లాస్టింగ్ సౌండ్స్‌కి బెదిరి గుట్టను వదిలిన కోతులు, గుట్టను మనం పచ్చగా చేస్తే తప్పకుండా ఊరు వదిలి వెనక్కి కొండకు వెళతాయి" కాన్ఫిడెంట్‌గా అన్నాన్నేను.

"అది కాదురా, నేను ప్రాజెక్ట్ ఫండింగ్ గురించి ఆలోచిస్తున్నాను" నెమ్మదిగా తన డవుట్ బయటపెట్టాడు రామకృష్ణ.

"ఈ పదేళ్ళ అమెరికా వాసం నాకు చాలా నేర్పింది. నాలుగైదు పెద్ద ప్రాజెక్ట్స్ కూడా వాలంటీర్ చేసాను. ఇక్కడున్న ప్రతీ ఒక్క ఎన్నారై తన దేశానికి ఏదో ఒక మంచిపని చేయాలనే ఆలోచనలోనే ఉన్నారు. మా కాలేజి అల్యూమిని ద్వారా మేము ప్రతీ ఏడాది ఏదైనా ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి ఒక ప్రాజెక్ట్ చేస్తున్నాం. వాళ్ళ సహాయం కూడా తీసుకోవచ్చు. ఫండ్స్ రెయిస్ చెయ్యడం పెద్ద పనేం కాదు. ప్రాజెక్ట్ డిజైన్ చెయ్యడానికి నువ్వెలాగూ ఉన్నావు. కానీ నాటడానికి అన్ని మొక్కలు, 'మాన్ పవర్' ఎలా? మొక్కలు సర్వైవ్ కావాలంటే వాతావరణం కూడా మొదట్లో సపోర్ట్ చెయ్యాలి" అన్నాన్నేను.

"నాకు కొద్దిగా సమయం కావాలి. దీన్ని ఎనలైస్ చేసి నీకు కాల్ చేస్తానురా" అంటూ రామకృష్ణ ఫోన్ పెట్టేసాడు.

●●●

నెల రోజుల తర్వాత ఓ రోజు రామకృష్ణ దగ్గిరనుండి మెయిల్ వచ్చింది. మెయిల్‌కి అటాచ్ మెంటుగా ఓ యాభై పేజీలపైనే ఉన్న ప్రాజెక్ట్ ప్లాన్ పంపించాడు. ప్రాజెక్ట్ ఫీసిబుల్ అని రామకృష్ణ రాసిన రిపోర్ట్ చదివిన తర్వాత కాస్త కాన్ఫిడెన్స్ వచ్చింది. అయితే చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి.

ప్రాజెక్ట్‌లో అన్నిటికంటే కష్టమైన పనులలో మొదటిది గ్రామ ప్రజలను ఒప్పించడం, రెండవది సహాయం చేసే వాలంటీర్స్‌ను వెదకడం, మూడవది మొక్కలు పెంచే నర్సరీలను మనకు కావలసిన మొక్కలు పెంచమని ఒప్పించడం. ఇవన్నిటిని మించి వరుణదేవుడు

సహకరించాలి. అందుకే వచ్చే వర్షాకాలం మొదట్లో మొదటి విడత ప్రాజెక్ట్ మొదలు పెడదామని అనుకున్నాం. ఫండ్స్ రెయిస్ చేయడానికి మా కాలేజి అలుమిని వాళ్ళు ఒప్పుకున్నారు. గ్రామ ప్రజలను ఒప్పిస్తే మొక్కలు నాటే పని కాస్త సులువు అవ్వచ్చు. నేను పనిచేస్తున్న 'జనరల్ ఎలక్ట్రిక్' కంపెనీ హైదరాబాద్ బ్రాంచి వాలంటీర్లు ఇంతకు ముందు ఒక స్కూల్ బిల్డింగ్ నిర్మాణంలో మాకు సహాయపడ్డారు. వాళ్ళకు కూడా ఈ ప్రాజెక్ట్ నచ్చి సహాయం చేయడానికి ముందుకొచ్చారు.

ఓ మంచిరోజు చూసుకుని మా ఊరికి బయలుదేరాను.

●●●

ఒక పెద్ద కొండగుహలో నేను ఒంటరిగా. గుహకు రెండువైపులా పచ్చని కాయలతో సీతాఫల్ చెట్లు. అక్కడికి ఎలా వచ్చానో కూడా తెలియదు. చిత్రంగా ఆ గుహ నేను చిన్నప్పుడు ఆడుకున్న మా ఊరి గుట్టదే. పక్కనే పండిన సీతాఫల్ తింటూ ఓ కోతిపిల్ల. ఎందుకోగాని, ఎప్పుడూ చెట్ల కబుర్లు మోసుకొచ్చే పిట్ట ఈ రోజు రాలేదు. అంతలో సన్నటి విసిల్ శబ్దం వినిపించింది. ఎవరో విసిల్ ఊదుతున్నారు. మొదట్లో సన్నగా ఆ తర్వాత కాస్త లౌడ్‌గా. ఆ వార్నింగ్ శబ్దం ఏమిటో అర్థమయ్యేసరికి ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. వెంటనే గుహనుండి బయటికి పరిగెత్తా. కానీ అప్పటికే సమయం మించిపోయింది. పెద్ద విస్ఫోటం. "ధన్" భూమి ఒక్కసారిగా కంపించింది. వెంటనే వెనక్కి గుహలోపలికి పరుగుతీశా. గుహ పైనుండి పెద్ద పెద్ద రాళ్ళన్నీ జారుతున్న శబ్దం. ఓ పెద్ద బండరాయి నేనున్న ఆ గుహను పూర్తిగా మూసేసింది. అంతా చీకటి. ఈ చప్పుళ్ళకు భయపడ్డ కోతి నా తలపైకి ఎక్కి కూర్చుంది. వెంటనే మరో పెద్ద బ్లాస్టింగ్. గుహ కూలిపోతున్న దృశ్యం. రాళ్ళు నన్ను పాతరేస్తున్న దృశ్యం. గాయాలతో ఒళ్ళంతా రక్తం. "అమ్మా" అంటూ పెద్దగా అరిచాను.

"ఆర్ యు ఆల్ రైట్?" అంటూ భుజాలను పట్టి కుదుపుతూ, నా కళ్ళలోకి చూస్తూ ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ ఆఫీసర్. లండన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ టెర్మినల్ ఫైవ్ లాంజ్ చైర్‌లో కూర్చుని పగటి కలలు కంటున్న నన్ను వో ఆఫీసర్ తట్టి లేపాడు.

"ఐ యామ్ పర్ఫెక్ట్లీ ఆల్ రైట్. ఇట్ ఇస్ జస్ట్ ఎ డ్రీం" అంటూ సిగ్గుపడ్డాను. గత నెలరోజుల నుండి ఇలాంటి కలలు రావడం నాకు కొత్తేం కాదు. టైం చూసుకున్నాను. హైదరాబాద్ వెళ్ళే బ్రిటిష్ ఎయిర్ వేస్ ఫ్లైట్‌కు ఇంకా ఒక గంట టైం ఉంది.

●●●

"ఏందీ గుట్టకు చెట్లు వెడుతవా? పిస్స గిట్ల లేసిందా?" ఇది నాకొచ్చిన మొదటి రెస్పాన్స్, అదీ గ్రామసభలో ఓ గంట చెట్లు అవసరం గురించి  చెప్పాక కూడా.

కొద్దిగా నీరసం వచ్చింది. మళ్ళీ గొంతు సర్దుకుని మాట్లాడటం మొదలు పెట్టా.

"ఈ ప్రపంచం ఎలా పుట్టిందో తెలుసా?" అంటూ 'బిగ్ బ్యాంగ్' థీరి వాళ్ళకు అర్థమయ్యేట్లు చెప్పుకుంటూ. ఆదిమ మనిషి అవతరించినప్పటి నుండి నాగరికత ఎలాంటి మలుపులు తిరిగింది, ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కాలుష్యమూ ఎలా పెరిగింది, ఇవన్నిటికి తగ్గట్టు మనిషి మారుతూ తన మనుగడ కోసం ఎలా పోరాటం చేస్తున్నాడు. ఎండాకాలంలో చీమలు, వానాకాలం కోసం ఆహారం ఎందుకు దాచుకుంటాయో, మనం కూడా ఇప్పుడు పర్యావరణాన్ని రక్షించుకుంటేనే రాబోయే కాలంలో మన పిల్లలు ఎలా సుఖంగా ఉంటారో చెప్పాను.

"సమాజంలో అందరూ ఇలాగే తమ వ్యక్తిగత స్వార్థం చూసుకుంటే, మనిషి మనుగడకే అర్థం మారి, ఈ ఊరు, ఈ ప్రపంచం ఇంకా ఎన్నో రోజులు నిలవదు" అంటూ ఓ క్షణం ఆగి,

"ఓ మల్లన్నా, నీకు ఎన్నెకరాల భూమి ఉందే?" అంటూ ఓ రైతునడిగా.

"నాలుగెకరాలు ఉందయ్యా" అన్నాడు మల్లన్న.

"నువ్వు చిన్నగ ఉన్నప్పుడు అందులో ఎన్ని చెట్లు ఉండె?" అడిగాన్నేను.

"మా పొలం సుట్టూతా పడారిలా రెండు గజాల వెడల్పుతో యాప చెట్లు, రేగు, వాయిల్, చింత, మోతుకు, దురిసేన గిట్ల ఎన్నో చెట్లు ఉండె"

"ఇప్పుడు ఎన్ని చెట్లు ఉన్నయ్?" సూటిగా అడిగాన్నేను.

"ఓ రెండు పుట్లు ఎక్కువ పండుతయని గవన్నీ ఎప్పుడో కొట్టేసిన. గిప్పుడనిపిస్తది, పొలం పని చేసి గొడిసేపు నీడకు కూకుందామంటే ఒక్క చెట్టైనా లేకపాయె"

"ఇలా అందరూ ఏదో వంకతో అన్ని చెట్లు కొట్టేసింౢడు. అందుకే చెట్లమీద ఉండే కోతులు మీ ఇళ్ళ కప్పుల మీద కాపురం చేస్తన్నయ్. మీ పిల్లల్ని రక్కుతున్నయ్. మీకు తెలుసో తెలవదో గాని, ఒక చెట్టు ఓ వెయ్యి జీవులకు ఇల్లు. మన అత్యాశ వల్ల మన మనుగడకే కాకుండా జంతువుల మనుగడకూ ముప్పు తెస్తున్నాము. ఈ మధ్య టి.విలో చూస్తున్నారు కదా, పులులు ఇళ్ళమీదకి ఎలా వస్తున్నాయో"

ఏం అర్థం అయ్యిందో కానీ కొంతమంది నిజమే నిజమే అంటూ నాకు సపోర్ట్‌గా మాట్లాడారు.

హమ్మయ్య కొంత మందినైనా కన్విన్స్ చెయ్యగలిగా, అలా అనుకున్నానో లేదో మరో అడ్డంకి ఈసారి రాజకీయం రూపంలో వచ్చి పడింది.

మా ఊర్లో రెండు రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఒక పార్టీ చేసే పనిని ఇంకో పార్టీ సమర్ధించదు, ఆ పని నిజంగ ఊరుకు ఉపయోగపడేదే అయినా సరే. రెండవ పార్టీని ఒప్పించటానికి నేను కూడా రాజకీయం రంగు వేసుకోవలసి వచ్చింది.

ఎలాగైతేనేం, అందర్నీ ఒప్పించి మర్నాడు మా జిల్లాలో ఉన్న మొక్కలు పెంచే నర్సరీలతో కూడా ఒప్పందం కుదుర్చుకుని అమెరికా తిరుగు ప్రయాణమయ్యాను.

●●●

కాలం గద్ద మూడేళ్ళను ముక్కున కరచుకుని ముందుకెళ్ళింది. ఈ మూడేళ్ళలో మూడుసార్లు మా ఊరు వెళ్ళొచ్చా. మొదటి రెండు సంవత్సరాలు రెండు విడతల్లో గుట్టపై నాటిన మొక్కలు ఎండకు మిడతల్లా మాడిపోయాయి. మూడవ సంవత్సరం వర్షాకాలంలో కొద్దిగా వర్షాలు పడటం వల్ల కొన్ని మొక్కలు దక్కితే మరికొన్ని ఊర్లో ఉన్న మేకల కడుపు నింపాయి.

నా కిచెన్‌లో వేసిన గ్రానైట్ కౌంటర్ మాత్రం నన్ను రోజూ వెక్కిరిస్తూనే ఉంది.

●●●

ఓ పదేళ్ళ తర్వాత అనుకుంటా, "అరేయ్ చిన్నోడా మనూరికి 'గ్రీన్ విలేజ్ ' అవార్డ్ వచ్చిందటరా" అంటూ ఓ రోజు నాన్న కాల్ చేసాడు.

"మన గ్రీన్ గుట్ట ప్రాజెక్ట్ సూపర్ డూపర్ ఫెయిల్ అయింది కదా బాపు, అయిన 'గ్రీన్ విలేజ్' అవార్డు రావటం ఏమిటి?" కాస్త ఆశ్చర్యంతో అడిగాను.

"పోయిన పదేండ్లలో మనకు తెలవని కొన్ని సంగతులు జరిగినయిర. నువ్వు నింపిన చైతన్యమో మరేందో కానీ, ఊరి జనాలు చాలా మారిపోయింౢడు. రైతులు గుట్ట ప్రాజెక్ట్‌కు సాయం చేసినప్పుడు మనకు తెలవకుండా మరో మంచి పని కూడా చేసింౢడు. నర్సరీ నుండి తెచ్చిన మొక్కలు కొన్ని వాళ్ళ పొలాల చుట్టూ ఇండ్ల చుట్టూ నాటుకున్నారు. ఇప్పుడు అవి పెరిగి పెద్దగయినయ్. ఊరు ఊరంతా

పచ్చగా మారింది. గుట్టకు దక్కిన కొన్ని రేగు, ఇతర చెట్ల కారణంగా కోతులు కూడా చాలా వరకు వెనక్కి పోయినయ్" సంతోషంగా చెప్పాడు నాన్న.

●●●

**ఉపసంహారం:**

దేశం పచ్చగా ఉండాలంటే ముందుగా మనుషుల మనసులు చిగురించాలి. అప్పుడే ఏ పల్లైనా, పట్నమైన, ఈ మొత్తం ప్రపంచమైనా పచ్చగా మరేది. ఈ నిజం తెలుసుకున్న తర్వాత మళ్ళీ నా గ్రీన్ వాలంటీర్ ప్రాజెక్ట్‌కు డబ్బు అవసరం ఎక్కువగా రాలేదు.

అంతరిక్షంలో ఉందో లేదో తెలియని మరో నేల కోసం ఎందుకు ఆ ఆరాటం. ముందు మనల్ని మనం నాటుకునైనా ఈ నేల తల్లికి నీడనిద్దాం.

**- మీలాంటి ఓ వాలంటీర్.**

●●●

## రాతిముక్క కథ — గన్ను కృష్ణమూర్తి

### వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పదిహేడవ ఉగాది రచనల పోటీలో ప్రశంసాపత్రం పొందిన కథానిక

**అదొక క్వారీ.** ఒకవైపు మరలు. మరోవైపు మనుష్యులు. చెవులు చిల్లుల పడేలా రొద. మరలు మనుష్యులౌతోంటే, మనుష్యులు మరలౌతున్నారు. పర్వతాలని పిండి చేస్తున్నారు.

పర్వతాలు బండలుగా, బండలు రాతిముక్కలుగా, రాతిముక్కలు రేణువులుగా మారి, మంట గలిసిపోతున్నాయి. భూమట్టమైపోతున్నాయి.

పర్వతాలు విరిగి పడుతోంటే, భూమ్యాకాశాలు దద్దరిల్లుతున్నాయి. దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. కానీ, మనిషి చలించడంలేదు. అతని కన్ను చెమర్చడం లేదు. చేయి చివురు తొడగడం లేదు.

ఈ మరణకాండలో సమ్మెట దెబ్బపడి, విరిగిపడ్డ ఓ రాతి ముక్క బాధతో విలవిలా తన్నుకుంది. వలవలా ఏడ్చింది.

దాని బాధని ఎవరూ పట్టించుకోలేదు. దాని ఏడ్పుని ఎవరూ వినిపించుకోలేదు. దాని రోదన అరణ్యరోదనై పోయింది.

ఐనా, అది ఏడుపు మానలేదు. గుక్కపెట్టి ఏడ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ మృగప్రాయపు మనుష్యుల మధ్య.

ఇంతలో ఓ కర్కశ పాదం దానిపై బడింది. దాన్ని త్రొక్కిపెట్టింది. గొంతుని నొక్కి పెట్టింది.

ఏమైతేనేం? ఎలాగైతేనేం? అది ఏడుపు మానింది.

ఎవరిదో కాలి బొటన వ్రేలు తగిలి, కొండ అంచు నుండి గలగలా దొర్లి, కళ్ళు తిరిగి రోడ్డుమీద వెల్లకిలా పడిపోయింది. స్పృహ తప్పిపోయింది.

దాన్ని ఎవరూ చూడ్డంలేదు. ఎవరూ పట్టించుకోడంలేదు.

అందరూ దాన్ని త్రొక్కుకుంటూ వెళుతున్నారు. దాటుకుంటూ వెళుతున్నారు.

ఒకనాడు భూమిని తన తలపై మోసిన పర్వతం నేడు మనుష్యుల కాళ్ళ క్రిందబడి నలుగుతోంది. ఒకనాడు నక్షత్రాలతో ముచ్చటించిన ఆ కొండ నేడు రాతిముక్కై మట్టిలో దొర్లుతోంది. ఒకనాడు కొండలా నిల్చిన ఆ కొండ నేడు గాలికి సైతం కంపించిపోతోంది.

క్షణాలు నిమిషాలయ్యాయి. నిమిషాలు గంటలయ్యాయి. ఆ రాతిముక్క తేరుకుంది. ప్రక్కనే ఉన్న ఓ గుంటలోంచి గుక్కెడు నీళ్ళు త్రాగింది. తెప్పరిల్లింది.

ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగడం లేదు. ఒంటినిండా దెబ్బలే, నొప్పులే. పోల్చుకోలేకుండా ఉంది దాని ఆకారం.

దానికి గత వైభవం లీలగా గుర్తుకు రాసాగింది. దుఃఖం మరింత పొర్లుకు రాసాగింది.

ఎవరితో చెప్పుకోవాలి?

ఏమని చెప్పుకోవాలి?

ఇలా తన జాతి అస్తమించి పోవాల్సిందేనా? మంట గలిసి పోవాల్సిందేనా? దాని గుండెల్లో ప్రశ్నలు సముద్ర కెరటాల్లా లేవసాగాయి. అవమానం కార్చిచ్చులా దహించవేయసాగింది.

వీల్లేదు. అలా ఎన్నటికీ వీల్లేదు. నేనంతమైనా ఫరవాలేదు. కానీ నా జాతి అంతం కాకూడదు. నామరూపల్లేకుండా పోకూడదు. దేవునికే నివేదించుకుంటాను. నిలదీసి అడుగుతాను అనుకుంది. ప్రయాణానికి నడుం కట్టింది.

అడవుల్లోంచి, ఎడారుల్లోంచి, పల్లెలు, పట్నాలలోంచి వెళ్తోంది. దొర్లుతూ వెళ్తోంది. వగర్చుతూ వెళ్తోంది.

దానిపైనుంచి సైకిళ్ళు, రిక్షాలు, కార్లు, బస్సులు వెళ్తున్నాయి. వేగంగా దూసుకుపోతున్నాయి.

కానీ, దానివంక ఎవరూ చూడ్డంలేదు. పలకరించడం లేదు. తమ చేతినందించడం లేదు. దానికి ఒళ్ళంతా చెమటలు పట్టింది. కాళ్ళు పీక్కుపోతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. ఒక మేడ నీడలో కాసేపు విశ్రాంతికై నిలిచింది.

ఎక్కడిదో మట్టిపెల్ల తటాలున తలపై రాలింది. ప్రేలిపోయింది. తల బొప్పికట్టింది. బాధగా తలపైకెత్తి చూసింది.

ఆ ఇంటిపై కప్పు నుంచి మరో పెళ్ళ నేలరాలి పడింది. కాస్తయితే మళ్ళీ తలపై పడేదే తృటిలో ప్రమాదం తప్పింది.

ఇంతలో ఏవో మూలుగులు లీలగా వినిపించాయి. చెవులు రిక్కించి వింది. నలువైపులా పరికించి చూసింది.

తన జాతి వాళ్ళే. తన జాతిరాళ్ళే, గోడల క్రింద పునాదుల్లో ఇరుక్కుని నలిగిపోతున్నాయి.

మన రాతి ముక్క కళ్ళు చెమర్చాయి. గుండెలు కరిగిపోయాయి.

బాధతో అడిగింది.

"ఎంతకాలం నుంచీ మీకీ బాధ? ఎందుకు సహిస్తున్నారు మీరిలా?"

"ఏం చేయమంటావు? మా తలరాతలిలా మిడికాయి. ఇటుకల క్రింద నలిగిపోతున్నాం. సిమెంటు చేతుల్లో బందీ అయిపోయాం. తప్పించుకోలేకుండా ఉన్నాం. పారిపోలేకపోతున్నాం" అన్నాయి.

"ఇంతకూ మీరు చేసిన నేరం?"

"రాళ్ళుగా జన్మించడమే, అన్నిటినీ సహించడమే?"

"విచారించకండి. నేను దేముడి దగ్గరికే వెళుతున్నాను. మనగోడు వినిపిస్తాను. మనజాతి అంతరించకుండా చూడమని నివేదించుకుంటాను" అంది ఆ రాతిముక్క.

"త్వరగా వెళ్ళిరామ్మా" అంటూ దీవించి పంపాయవి. ఆ రాతిముక్క మళ్ళీ పడుతూ లేస్తూ, ప్రయాణం సాగించింది.

కొంత దూరం వెళ్ళాక.

"సిగ్గులేదూ? మా పైనుండి నడుస్తున్నావు?" అన్నమాటలు వినపడ్డాయి. కళ్ళు చిట్లించుకుని చూసింది రాతిముక్క.

అది కంకర రోడ్డు. రోడ్డుమీద పరచబడ్డ రాతిముక్కలు పలికిన పలుకులవి. గుండెల్లో దిగే ములుకులవి.

మన రాతిముక్క కించెత్తు బాధపడ్డమాట వాస్తవమే. కానీ తన సాహస యాత్రని గూర్చి వివరించిన మీదట ఆ రాళ్ళు సంతోషించాయి. తమ బాధని సైతం దేముడికి విన్నవించమని వేడుకున్నాయి.

మరికొంత దూరం నడచిన తరువాత దోవలో రోడ్డు ప్రక్కన రంగుల్లో మునిగి, భూమిలోకి పాతుకుపోయి నిల్చున్న మైలురాళ్ళు, వంతెనల్ని మోస్తున్న రాతి స్థంభాలు కనిపించాయి. కంట తడిపెట్టుకున్నాయి. విషయమంతా విన్నాక.

"మేం కదల్లేం. మెదల్లేం. మా బాధని సైతం నువ్వే నివేదించు" అన్నాయి. అక్కడినుంచి మళ్ళీ కదిలించి రాతిముక్క. మరికొంత దూరం వెళ్ళాక భూమి దద్దరిల్లేలా ధ్వనులు, ఏడ్పులు, అరుపులు వినిపించాయి.

కళ్ళు చిట్లించుకు చూస్తే ఏముంది? తనలాంటి రాతిముక్కలే. రోడ్డురోలరు క్రిందపడి నలిగిపోతున్నాయి. "రక్షించండి. రక్షించండి." అంటూ దీనాతిదీనంగా అరుస్తున్నాయి.

ఒక్కడూ వాటిగోడు విన్నవాడు లేడు. చేతినందించిన వాడు లేడు. ఒక్క క్షణమైతే తాను కూడా ఆ రోలరు క్రిందపడి నలిగి నశించిపోయేదే కానీ త్వరగా విషయాన్ని అర్థం చేసుకుని ప్రక్కకి గెంతింది. తన జాతికి పట్టిన గతికి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ మళ్ళీ ప్రయాణం సాగించింది.

ఎంత దూరం వెళ్ళిందో తెలీదు. క్రమక్రమంగా, మట్టిగా, రోడ్లు, వంతెనలుగా మారిన రాళ్ళపైనుండి వెళ్తోంది. పర్వతాలపైనుంచి వెళ్తోంది.

తన బ్రతుకుపై తానే నడుస్తూ, తన చరిత్రపై తానే దొర్లుతూ వెళ్తోంది. రోదిస్తూ వెళుతోంది.

కాళ్ళు అరిగిపోయాయి. చేతులు విరిగిపోయాయి. తల మొండెంలా, మొండెం తలలా, శరీరం బంతిలా తయారయింది.

భూమిపై భూమిలా దొర్లుతూ వెళుతోంది. పరుగిడుతూ వెళుతోంది.

దోవలో ఒక గుడిసె ముందు ఒక రోలూ, ఒక విసుర్రాయీ కనిపించాయి. మన రాతిముక్క విషయమంతా వివరించింది.

"మాక్కూడా సుఖం లేదు. రోజు రోజుకూ చిక్కి శల్యమై పోతున్నాం. కాకపోతే మనుష్యుల కడుపులు నింపుతున్నామన్న సంతృప్తి మాత్రం మిగుల్తోంది" అన్నాయవి.

పరిస్థితులతో రాజీపడ్డ జీవితాలు. అంతకన్నా ఏముంటాయి.

వీటితో లాభం లేదనుకుని మళ్ళీ ప్రయాణం కట్టింది రాతిముక్క.

మరికొంత దూరం వెళ్ళాక దోవలో ఎదురైన ఏట్లో, ఇన్ని నీళ్ళు త్రాగి సేదదీరి ఆ ఏటి నీట్లో నలిగిపోతున్న రాళ్ళని అడిగింది.

"నాతో వస్తారా?"

"ఎక్కడికి?" ప్రశ్నించాయవి.

రాతిముక్క మళ్ళీ విషయమంతా వివరించింది.

"నిజమే ఈ ఆలోచన మాకు రానేలేదు సుమా. ఈ ఏటి నీటి సంగీతంలో మునిగి అరిగిపోతున్నాం తప్ప? కరిగిపోతున్నాం తప్ప, నువ్వెళ్ళిరా తిరుగు ప్రయాణంలో ఏమయిందీ మాతో చెప్పు" అన్నాయి.

"పతనాన్నే ప్రగతిగా భావించే జీవితాలు. మృత్యువునే జీవితంగా భావించే జీవితాలు. కష్టాల కొలిమిలో అందంగా మాడిపోయే శలభాలు. అంతకన్నా ఏమంటాయి?"

మన రాతిముక్క మళ్ళీ ప్రయాణం కట్టింది.

మొత్తానికి అతి కష్టం మీద ఒక విష్ణ్వాలయాన్ని చేరుకుంది.

ఆ గుడి ఓ చిన్న గుట్టపై ఉంది. గుడి పైకి వెళ్ళడానికి మెట్లున్నాయి. మన రాతిముక్క గుట్టపైకి వెళ్తోంటే మెట్లు పలకరించాయి.

"ఎక్కడికి ప్రయాణం?" అంటూ.

తన కథనంతా చెప్పుకొచ్చింది రాతిముక్క

అంతా విన్నాక.

"సర్లే వెళ్ళు ఎవరికని చెప్పుకుంటావు? అక్కడుందీ ఓ రాతిముక్కే. కాకపోతే మనకన్నా కాస్త పెద్ద సైజు" అంటూ పగలబడి నవ్వాయి.

అయినా రాతిముక్క ధైర్యం చెడలేదు. గుట్టపై దాకా వెళ్ళింది.

అక్కడ ఓ రాతిపైన భక్తులంతా కొబ్బరికాయలు కొడుతున్నారు.

"అందరి విషయం ఏమోకానీ నేను మాత్రం సుఖంగా ఉన్నాను. రోజంతా కొబ్బరి నీళ్ళు త్రాగుతూ, కొబ్బరి నీళ్ళలో స్నానం చేస్తున్నాను. దోసిలి పట్టు. నీకూ ఇన్ని పోస్తాను" అంటూ తీర్థం వడ్డించింది.

తీర్థం పుచ్చుకుని గుడిద్వారాన్ని సమీపించింది.

దేవుడు వరమిచ్చినా పూజారి వరమీయడన్నట్లు గుడి ద్వారానికి ఇరువైపులా కాపలా కాస్తున్న జయవిజయుల రాతి విగ్రహాలు మన రాతిముక్కని అడ్డుకున్నాయి లోనికెళ్ళడానికి వీల్లేదంటూ.

"ఎందుకు? " ప్రశ్నించింది రాతిముక్క

"ఇది మనుష్యులు కట్టించిన గుడి. మనుష్యులకే ప్రవేశం. రాళ్ళకా హక్కు లేదు" అన్నాయవి.

"ఎవరిచ్చారు మనుష్యులకీహక్కు? మన జాతిని ముక్కలు చెక్కలుగా చేసే హక్కు? పాతరలేసే హక్కు? నాశనం చేసే హక్కు?" అంటూ గొంతు చించుకుంది.

"అదంతా మా కనవసరం. నీవు మాత్రం లోనికెళ్ళడానికి వీల్లేదు?"

అన్నాయవి నిష్కర్షగా.

చాలాసేపు వాగ్యుద్ధం చేసింది మన రాతిముక్క.

అప్పటికి వచ్చిన భక్తజనులంతా వెళ్ళిపోయారు.

విష్ణుమూర్తుల వారు తీరిగ్గా ఉన్నారు. మన రాతిముక్క పడుతున్న గొడవని చూసి, విషయమేమిటో అర్థంకాక దాన్ని లోనికి వదలమన్నారు.

ఆ రాతికి మన రాతిముక్క పొర్లుడు దండాలు పెడుతూ లోనికి ప్రవేశించింది. తన గోడునంతా విన్నవించుకుని-

"స్వామీ అన్యధా శరణం నాస్తి. "నీవే మా జాతిని రక్షించాలి?" అంటూ వేడుకుంది.

స్వామి వారు మందహాసం చేస్తూ

''వత్సా భయపడకు. రాళ్ళన్నీ మాయమైనా, పర్వతాలు నుగ్గు నుగ్గయినా నీవు చింతించాల్సిన అవసరం లేదు. మానవత్వాన్ని కోల్పోతున్న ఈ మనుష్యుల గుండెలన్నీ బండలౌతూ రాళ్ళుగా మారిపోతున్నాయి. నీ జాతి ఎన్నటికీ అంతరించే ప్రసక్తి లేదు. నిశ్చింతగా వెళ్ళు'' అన్నాడు.

అప్పుడు మన రాతిముక్క పరమానందంతో వెనక్కి మళ్ళింది.

●●●

# మనసు చూడ తరమా!

జి.ఎస్.లక్ష్మి

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

''ఏంటమ్మా ప్రపంచం మునిగిపోతున్నట్టు అలా కూర్చున్నావ్?''

ఎవరో కొత్త మనిషిని చూసినట్టు కూతుర్ని చూసింది యశోద. తల్లి చూపులని అర్థం చేసుకోలేక ''ఏంటో ఈ మధ్య నీకు చాదస్తం ఎక్కువైపోతుంది'' అనుకుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది ఉదయ. వెడుతున్న కూతుర్ని చూసి ''ఈ పిల్ల ఇలా తయారవడానికి తను ఎంతవరకూ కారణ''మని ఆలోచనలో పడింది యశోద.

ఆ ఆలోచనల వేడికి యశోదకి మనసంతా ఆందోళనగా తయారైంది. మనసుకి నచ్చింది బుద్ధికి నచ్చటం లేదు. బుద్ధి చెప్పింది మనసొప్పుకోవడం లేదు. ఈ రెండింటినీ ఎలాగొలాగు సమన్వయపరిచి తనలోని భావాల్ని మాటల్లో చెపితే కూతురిలా తీసిపడేస్తోంది. ఇప్పుడేం చెయ్యాలి. స్తబ్దమైన మనసుతో అలా కూర్చుండిపోయింది యశోద.

జీవితంలో తోడుంటే ఉండే నిండుదనం ఈ ఒంటరి బతుకుల్లో ఉండదని ఇంతంత చదువులు చదువుకున్న ఈ కాలం పిల్లలకి ఎందుకు తెలీట్లేదో ఆమెకి అర్థం కావటంలేదు.

అనురాగానికి ఆవగింజంతయినా ప్రాధాన్యత ఇవ్వకుండా చదువు, కెరియర్ చుట్టూ పరిగెడుతున్న ఇప్పటి యువతని తన కూతురిలో ప్రత్యక్షంగా చూస్తోంది యశోద.

ఇంజనీరింగ్ పూర్తయి ఉద్యోగంలో చేరేవరకూ అసలు ఉదయమీద ఏ విధమైన కంప్లైంట్లూ లేవు. చదువులో చురుగ్గా ఉండేది. చెప్పిన మాట వినేది. యశోద ఏ బట్టలు తెస్తే అవి బాగున్నాయని మురిసిపోతూ వేసుకునేది. తల్లి చేసిపెట్టినవన్నీ ఇష్టంగా తినేది. స్నేహితులు ఉన్నా అది కాలేజీ వరకే పరిమితం. ఎక్కడికెళ్ళాలన్నా అమ్మా, నాన్నలతోనే వెళ్ళేది. అసలు చుట్టుపక్కాలందర్లోనూ ''మంచిపిల్ల'' అని సర్టిఫికెట్ తెచ్చుకున్నది ఉదయే.

ఇంజనీరింగు అయ్యేటప్పటి ఇరవైయొక్క ఏళ్ళు. అంత తొందరగా పెళ్ళెందుకులే అనుకునో, పెళ్ళి సంబంధాలు చూసినా కుదిరేదాకా అనుకునో, కాంపస్ ఇంటర్వ్యూలో సెలక్టయి ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం రావడం వల్లనో ప్రస్తుతం రోజులు అల్లాగే ఉన్నాయనుకునో కారణం ఏదైతేనేం ఉదయ ఉద్యోగంలో చేరడానికి మూర్తీ, యశోదా ప్రోత్సహించేరు.

ఆ సమయంలో ఉదయని తనెందుకు ప్రోత్సహించిందా అన్న ఈ పాయింట్ దగ్గరే యశోద ఆలోచిస్తోంది.

ఆ వయసులో ఉదయకి చాలా సంబంధాలొచ్చాయి. వాళ్ళకి ఎలాంటివారు కావాలంటే అలాంటి వారిని ఎన్నుకునే అవకాశాలు చాలా ఉన్నాయి. కానీ తనంతట తనకు తనమీద మనసులో ఉన్న ఏదో అసంతృప్తి తన కూతుర్ని ఉద్యోగంలో చేర్పించిందా అన్నదే యశోద ఆలోచన.

యశోద కూడా పోస్ట్ గ్రేడ్యుయేషన్ చేసింది. ఉద్యోగం చెయ్యాలని చాలా కోరికగా ఉండేది. కానీ మూర్తి ట్రాన్స్‌ఫర్లంటూ ఊళ్ళు తిరుగుతుండడం వల్ల ఆ సర్దుబాటుల్లోనే ఆమెకి సరిపోయింది. మూర్తి మంచివాడే కానీ తనకంటూ సంపాదన లేకపోయినప్పుడు ఖర్చు పెట్టిన ప్రతిపైసాకీ మూర్తికి సమాధానం ఇచ్చుకోవలసిరావడం అన్నది యశోదకి బాధ కలిగించేది. అటువంటి పరిస్థితి కూతురుకి రాకూడదని చిన్నప్పటినుంచీ ఉదయని బాగా చదువుకోవాలనీ, తన కాళ్ళమీద నిలబడాలనీ నూరిపోసింది. అందుకే ఉదయ ఉద్యోగంలో చేరినప్పుడు ఉదయకన్నా యశోదే ఎక్కువగా సంతోషించింది.

అలా స్వతంత్రంగా బతకమని చెప్పడమే తను చేసిన తప్పా అని ఇప్పుడాలోచిస్తుంటే కాదనే తోస్తుంది యశోదకి. ఎందుకంటే ఉద్యోగం చేసిన మూడేళ్ళు కూడా ఉదయలో ఏం మార్పులేదు. పొద్దున్న ఆఫీస్‌కి వెళ్ళడం సాయంత్రం ఇంటికి రావడం. అంతే. మూర్తి కూతురి డబ్బు ఎప్పుడూ ఆశించలేదు కనక వచ్చిన జీతం వచ్చినట్టు తల్లి చేతిలో పెట్టేది. యశోద కూడా ఆ డబ్బుని రెండు మూడు నెలలు అలా ఉంచి కాస్త మొత్తమయ్యాక తీసి కూతురికి మెడలోకో, చేతులకో ఏదో ఒకటి కొనేది.

అదిగో సరిగ్గా ఆ సమయంలోనే యశోదలో కూడా కూతురు తెస్తున్న డబ్బుకి ఒక హంకారపు పొర లేచింది.

ఇప్పుడు ఆలోచిస్తుంటే అక్కడే తన ఆలోచనలు బుద్ధి చెప్పినట్టు వినకుండా మనసుకి లొంగిపోయాయేమో అని యశోదకి అనిపించింది.

ఉదయ ఉద్యోగంలో చేరిన రెండేళ్ళ తర్వాత సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. ఇరవైనాలుగేళ్ళ అమ్మాయి. ఒక్కతే కూతురు. మంచి వయసు. చూడముచ్చటగా ఉంటుంది. చదువూ, ఉద్యోగం బాగున్నాయి. ఈ కారణాల వల్ల మంచి సంబంధాలు చాలానే వచ్చాయి.

ఎవరి పిల్ల వాళ్ళకి ముద్దు. యశోద, మూర్తికూడా ప్రతి సంబంధాన్నీ భూతద్దంలో చూడడం మొదలుపెట్టారు. అవికాక వీళ్ళ కోరికలు వీళ్ళకున్నాయి. జాతకాలు కుదరాలి. పిల్లవాడి కుటుంబం మంచి స్థితిలో ఉండాలి. చదువు బాగుండాలి. వయసు తేడా రెండేళ్ళకి మించి ఉండకూడదు. ఉదయ ఉద్యోగం చెయ్యడానికి అభ్యంతరం చెప్పకూడదులాంటివి.

ఇంకా వీళ్ళు సంబంధాలు చూస్తూనే ఉన్నారు. ఉదయ ఎంట్రెన్స్ రాసి ఎం.బి.ఎలో సీటు తెచ్చుకుంది. మంచి కాలేజి. రెండేళ్ళు ఎంతలో గడుస్తాయిలే అయినా ఇంకా పాతికేళ్ళు కూడా లేవు. మంచి సంబంధం చూద్దామన్నా వయసుకు తగ్గ పెళ్ళికొడుకు మంచి పొజిషన్‌లో ఉన్నవాడు ఉండాలికదా అనుకున్న తల్లితండ్రుల మాటని నిజం చేస్తూ ఆ ఎమ్.బి.ఎ డిగ్రీ కూడా తెచ్చేసుకుంది. చదివినది మంచి కాలేజ్ అవడంవల్లా అందులోనూ టాప్‌లో రావడం వల్లా ఇంకా చదువు పూర్తవకుండానే పెద్ద కంపెనీలో మంచి పొజిషన్ ఆఫర్ వచ్చింది. ఇంకనేం అందరికీ సంతోషమే.

అప్పుడు మళ్ళీ సంబంధాలు చూడడం మొదలు పెట్టారు మూర్తీ, యశోదా. అదిగో అప్పుడే వచ్చింది చిక్కంతా.

ఈ రెండేళ్లలో ఉదయ ఆలోచనల్లో మార్పొచ్చింది. వ్యక్తిత్వం రూపు దిద్దుకుంది. చదివిన చదువు ఆమెకి అమ్మా, నాన్న చెప్పినదానికి బుర్రూపకుండా స్వతంత్రంగా, తార్కికంగా ఆలోచించడం నేర్చుకుంది. తన జీవితభాగస్వామిని ఎంచుకోవడంలో ఎటువంటి తప్పటడుగులు వెయ్యకూడదో తెలుసుకుంది. ఉదయలో మార్పు ఎంతలా వచ్చిందంటే.

ఆమె ఆహారపుటలవాట్లు మారాయి. అమ్మ వండిన ప్రతిదానికీ వంకలు పెట్టడం వచ్చింది. వేసుకునే బట్టల తీరు మారింది. ప్రతీదీ "బ్రాండెడ్" కావాలి.

బైటకెడదామంటే ఇదివరకులా చుట్టాలింటికి కాకుండా ఔటింగ్ అంటుంది. సైట్ సీయింగ్ అంటుంది. రిసార్ట్స్ అంటుంది. లైఫ్‌ని ఎంజయ్ చెయ్యాలంటుంది. ఇంట్లో కన్నా బైటే బాగుందంటుంది.

కారు కొత్త మోడల్ రాగానే మార్చాలంటుంది. ఎక్కడికి వెళ్లాలో, ఎక్కడికి వెళ్లక్కర్లేదో, ఎంత ఆలస్యంగా వెళ్లాలో, ఎంత మూతి బిగించుకుని గంభీరంగా ఉండాలో, మాట మాట్లాడినా మొహంలో భావం కనిపించకుండా ఎంత జాగ్రత్తపడాలో, నలుగురిలో ఉన్నప్పుడు ఎంత నాజూకుగా తినాలో అన్నీ నేర్చుకుంది.

ఎవరైన ఇంటికొస్తే ముందు వాళ్ళు ఎంత ఖరీదైన కారులో దిగేవారో చూసేది. వాళ్ళు కట్టిన బట్టలు, పెట్టిన నగలు, మాట్లాడిన మాటలు అన్నింట్లోనూ లోపాలే వెతికేది. యశోద, మూర్తి తీసుకొచ్చిన ప్రతి సంబంధంలోనూ ఏదో ఒక లోపం వెతికి పట్టుకుని తిప్పికొట్టేది. ప్రతిదానినీ డబ్బుతో కొలవడం నేర్చుకుంది.

అదిగో అక్కడే యశోదకి భయం పట్టుకుంది. ఇన్నాళ్లూ కూతురి మీదున్న అలవిమాలిన ప్రేమతో ఉదయ అందర్నీ వెక్కిరిస్తుంటే దానికి తగ్గట్టే నవ్వుతూ కూతుర్ని ప్రోత్సహించింది.

కానీ ఎప్పుడైతే ఒక్కసారి యశోద బుద్ధికి కూతురు అందర్నీ వెక్కిరించే వెక్కిరింపులు స్థాయి దాటాయనిపించిందో వెంటనే ఆమె బుద్ధి మేల్కొంది. అంతే అప్పట్నుంచీ కూతుర్ని కూతురిలా కాకుండా ఎవరో వేరే మనిషి మాట్లాడుతున్నట్టు వినడం మొదలుపెట్టింది. ఎప్పుడైతే యశోద బుద్ధి పనిచెయ్యడం మొదలుపెట్టిందో అప్పుడే కూతురిలో కొత్తగా ఏర్పడింది ఆత్మవిశ్వాసం కాదనీ, అతిశయమనీ ఇంకా పచ్చిగా చెప్పాలంటే అహంకారమనీ ఒక నిర్ణయానికి వచ్చేసింది. దాంతో ఇంక ఈ పిల్లకి పెళ్లిచెయ్యగలనా అన్న భయం యశోదని వణికించేసింది.

"ఏంటమ్మా ఇంకా అలాగే కూచున్నావ్. ఆకలి దంచేస్తోంది కానీ. ఆ దిక్కుమాలిన ఆలోచన్లాపి కాస్త తినడానికేవైనా పెట్టు"

ఎంతో మృదువుగా మాట్లాడే ఉదయ ఇలాంటి భాష ఎప్పుడు నేర్చుకుందా అని ఆలోచిస్తూ యశోద మూర్తికి, ఉదయకి డైనింగ్ టేబుల్ మీదున్న కంచల్లో అన్నం వడ్డించసాగింది.

"ఏంటి ఇవాళా అన్నమేనా? అమ్మా నువ్వింకా ఎప్పుడు నేర్చుకుంటావ్? నీలాగే నన్ను పిప్పళ్లబస్తాలా చెయ్యాలనా? కాస్త పుల్కాలు చెయ్యొచ్చుగా."

ఉదయ మాటలకి అన్నంలో కూర కలుపుకుంటున్న మూర్తి గబుక్కున ఆపేసాడు.

"నాకొద్దులే ఆ పెరుగూ అన్నం తింటే శుభ్భంగా నిద్రొస్తుంది తప్పితే బ్రైన్ షార్ప్‌గా పనిచెయ్యదు. ఎన్నిసార్లు చెప్పిన మళ్లీ ఆ అన్నమే వండుతావేంటమ్మా" అంటూ మొబైల్ ఫోన్ తీసి రెస్టారెంట్‌కి ఫోన్ చేసి పుల్కాలు, రెండు రకాల కూరలూ హోమ్ డెలివరీ ఇమ్మని ఆర్డర్ చేసి, లాప్‌టాప్ తెరిచి మెయిల్ చూసుకోడం మొదలుపెట్టింది.

మూర్తి, యశోద ఒకళ్ల మొహం ఒకళ్లు చూసుకున్నారు. కలుపుకున్న అన్నం తినాలో మానాలో మూర్తికి తెలీలేదు. ఎదుటి మనిషి తింటున్న దానిని "ఛీ" అనే కుసంస్కారం తన కూతురిలో చూస్తుంటే మూర్తికి నోటమాటరాలేదు. తనకన్నా ఎక్కువ కూతురు సంపాదిస్తున్నందుకు ఎంతో పొంగిపోయిన ఆ పితృహృదయం ఆ సంపాదనే ఆమెలో నింపిన అతిశయానికి కుంగిపోయాడు.

దీని గురించి ఉదయతో వాదించడమంటే బురదలో రాయేసినట్టు, మూర్ఖులతో చర్చించినట్టేనని అతనికి బాగా అర్థమైంది. అందుకే మౌనంగ ఉండిపోయాడు.

కానీ యశోద అలా ఉండలేకపోయింది. చేస్తున్న వడ్డన ఆపి ఉదయ ఎదురుగా కూర్చుంది. దెబ్బతగిలిన కూనలా అల్లల్లాడుతున్న మనసుని అదిమిపెట్టి బుద్ధిని అనుసరించి ఉదయతో తర్కానికి దిగింది.

"ఏంటే నీ ఉద్దేశం? మేం తినే తిండి నీకంత అసహ్యంగా కనిపిస్తోందా. మొన్నటిదాకా నువ్వు తిన్నదీ అదే" తల్లి మాటలకి విసుగ్గా సమాధానమిచ్చింది ఉదయ.

"అదే నా ఖర్మనుకుంటున్నాను. మా గ్రూపులో కొంతమంది పేరెంట్స్‌ని చూడు. వాళ్లు చిన్నప్పట్నించి పిల్లలకి కార్న్ ఫ్లాక్స్, బ్రెడ్, ఛీజ్, జ్యూస్, జామ్ లాంటి వన్నీ పెట్టడం వల్ల వాళ్ల బ్రైన్ ఎంత షార్ప్‌గా పనిచేస్తోందో నాకన్నా చిన్నవాళ్లైనా సరే నాకన్నా గొప్ప ఐడియాలొస్తుంటాయి. ముందు తనకేం కావాలో అది తీసుకునేవాళ్లు కెరియర్‌లో ముందుకి దూసుకుపోతున్నారు. అలాంటివేమీ మీరు చెప్పలేదు కనకే నేను నా కెరియర్ లో ఎంత వెనకబడిపోయేనో తెల్సా."

ఎదురు దాడికి దిగిన ఉదయని చూసి యశోద నిర్ఘాంతపోయింది. కానీ ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"సరే మాకు పెంచడం తెలీలేదు. కానీ ఈ మధ్య నువ్వు నలుగురితో తిరుగుతూ చాలా నేర్చుకున్నావు కదా. అందులో అమ్మానాన్నల మాటలు వినొద్దని ఎవరైనా చెప్పారా?" అంది.

"నేనెప్పుడు మీమాట వినలేదు. విన్నాను కనకనే ఇంకా ఎంతో ఎత్తులో ఉండాల్సినదాన్ని ఇక్కడే పడికొట్టుకుంటున్నాను."

"ఏం విన్నావ్? అంత మంచి సంబంధమని చెపుతుంటే దానిక్కూడా నువ్వు వంకలే పెడుతున్నావ్"

పకపకా నవ్వేసింది ఉదయ.

"ఏదీ నిన్న నువ్వు చెప్పిందా? వాడితో మాట్లాడేను కదా వాడుత్త యెస్ ఫాదర్ టైపమ్మా"

యశోదకి కోపం ఉవ్వెత్తున లేచింది.

"తండ్రి చెప్పిన మాట వింటే తప్పేంటి?"

"ఎన్నాళ్లు వింటాడమ్మా. ఈ రోజుల్లో మూడేళ్ల పిల్లాడు వింటంలేదు. ముప్పైయేళ్లొచ్చాక మా డాడీ మీతో మాట్లాడమన్నారండీ. అంటే ఏమనుకోవాలి"

"అది అతని సంస్కారమనుకోవాలి. పెద్దలకిస్తున్న గౌరవం అనుకోవాలి"

"ఏంకాదు. స్వంత అభిప్రాయాలేవీ లేనివాడనుకోవాలి. రేపొద్దున్న సినిమా కెళ్లాలన్నా మా నాన్న నడిగొస్తానంటాడు."

"పోనీ మొన్న పేపర్‌లో చూసింది బానే ఉందికదా"

"అతను నా కన్నా ఏకంగా నాలుగేళ్లు పెద్దవాడమ్మా. నాలాగ మెరిట్ స్టూడెంట్ కాదు. యావరేజ్ అన్నమాట"

"పోనీ ఆ మేరేజ్ బ్యూరోవాళ్లు చెప్పిందానికేవంటావ్"

"అతను పనిచేసే కంపెనీ చాలా చిన్నదమ్మా"

యశోద ఊరుకోలేకపోయింది.

"అసలు నాకోసంగతి అర్థం కావట్లేదు. చెప్పు. చదువులో, పొడుగులో, ఉద్యోగంలో అన్నింటిలో నీకన్నా ఎక్కువుండాలి. కానీ వాడెక్కడ మొగుడనే జులుం చెలాయిస్తాడోనని నీ భయం. పోనీ నీకన్నా తక్కువ చదివినా, చిన్న కంపెనీలో చేస్తున్నా నీకు పనికిరావట్లేదు. మరింకెలా కుదుర్తుందే నీకు సంబంధం?"

తన మనసుని అద్దంలో చూసినట్టు చదివేసిన అమ్మ తెలివికి తెల్లబోయింది ఉదయ. దానిని కప్పిపెట్టుకుంటూ.

"అబ్బ ఇవాళ నువ్వీ పిచ్చిగోల మొదలుపెట్టేవేంటీ?" విసుక్కుంది ఉదయ.

"పిచ్చిగోల కాదు. సైన్స్ కూడా చెప్తోంది. ముప్పై దాటాక పిల్లల్ని కనడం కష్టం డాక్టర్లు చెపుతున్నారు. "ఇలాగైన ఒప్పించొచ్చని చెప్పింది యశోద.

"అమ్మా మెడికల్ సైన్స్ చాలా అడ్వాన్స్ అయింది. ఈ రోజుల్లో యాభైయేళ్లొచ్చేక కూడా హాయిగా పిల్లల్ని కనొచ్చు." నవ్వుతూ తల్లి మాటల్ని తీసిపడేసింది ఉదయ.

"అంటే ఇలా ఇంకా ఎన్నాళ్లు సంబంధాలన్నీ తిప్పికొడతావ్? నీకంటూ ఒక కుటుంబం ఏర్పాటు చేసుకోవాలని లేదా?"

"ఎందుకులేదు. కానీ అన్నీ నచ్చాలి కదా. అభిప్రాయలు, అభిరుచులు కలవనివాళ్లని చేసుకుని తర్వాత బాధపడే బదులు ముందే అన్నీ కనుక్కుని చేసుకోవచ్చుకదా"

యశోద వెంటనే అంది. "ఎలా కలుస్తాయే ఇద్దరి వ్యక్తుల అభిప్రాయాలూ, అభిరుచులూను. ఒక ఇంట్లో పుట్టి, ఒక్కచోటే పెరిగిన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల అభిప్రాయాలే ఒకలా ఉండవుకదా. మరి వేరె వేరే పరిస్థితుల్లో పెరిగినవాళ్లని ఎలా కలుస్తాయి?"

"అంటే ఏమీ కలవకుండానే పెళ్లి చేసుకుని మీ అందరిలాగా పోట్లాడుకుంటూ ఉండాలా?" విసురుగా అదిగింది.

"మాలాగ పోట్లాడుకోకూడదనే మిమ్మల్ని ఇంతింత చదువులు చదివింది. ఆ చదువుని మీరు కేవలం డబ్బు సంపాదించుకుందుకే ఉపయోగించుకుంటున్నారు. ఇలా బైట తిరగడం వల్ల మీకు ఎదుటి మనిషితో ఎలా మాట్లాడాలో, ఎలా పనులు చేసుకోవాలో అన్నీ తెలుస్తున్నాయి. ఆ పద్ధతి లోనే మీ సంసారాన్ని పోట్లాటలు లేకుండా స్వర్గంలా చేసుకునే సామర్థ్యం మీలో ఉంది. ఏదైనా సంబంధాన్ని వద్దంటే దానికి సరైన కారణం ఉండాలి. ఆ అబ్బాయి తాగుబోతు అవకూడదు. తిరుగుబోతు అవకూడదు. అంతే కానీ ఇలా పిచ్చి పిచ్చిగా ఆలోచిస్తే ఇంక నీకు పెళ్లవడం కష్టమే" విసురుగా అంది యశోద.

"హమ్మయ్య ఎంత మంచిమాట చెప్పావ్. హాయిగా ఇలాగే ఉంటాను"

కూతురి వితండవాదానికి యశోదకి ఏం చెప్పాలో తెలీలేదు. కాలికేస్తే మెడకేస్తోంది. మెడకేస్తే కాలికేస్తోంది. సహాయానికి రమ్మన్నట్టు మూర్తివైపు చూసింది. మూర్తి ఇంక మాట్లాడవద్దన్నట్టు సైగ చేసి అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మనసు కాస్త నెమ్మది చేసుకుని మూర్తితో మాట్లాడింది యశోద.

"మనం ఉదయని సరిగ్గా పెంచలేకపోయామేమోనండీ"

"అంటే"

"చిన్నప్పట్నించీ దాన్ని చుట్టాలిళ్లకీ, స్నేహితులిళ్లకీ తీసికెళ్లకుండా చదువూ చదువంటూ అందులోనే మునిగిపోయేలా చేసాం.

ఒక్కతే అవడం వల్ల దానికి కావల్సినవన్నీ కష్టం లేకుండా నిమిషాల్లో దానికాళ్ల దగ్గర తెచ్చిపెట్టాం. వీటన్నింటివల్లా దానికి డబ్బు పెడితే ఏదైనా వచ్చేస్తుందన్న ధోరణి వచ్చేసింది. దేన్నైనా ఇంకోళ్లతో పంచుకుంటే ఉండే ఆనందం ఏంటో దానికి తెలీకుండాపోయింది."

"కానీ ఈ చదువులు కూడా అలాగే ఉన్నాయికదా ప్రిపరేషన్ కాస్త తగ్గినా వెనకబడిపోతారు. మరి ఆ కాస్త టైములోనె చుట్టాలు, తిరగడాలు అంటే ఎలాగ"

"కానీ జీవితంలో స్థిరపడడమంటే చదువూ, ఉద్యోగమే కాదుకదా. ఆడవాళ్లకైనా, మగవాళ్లకైనా ఒక కుటుంబం ఏర్పరచుకున్నప్పుడే కదా స్థిరపడడం అంటాం"

"కాని ఆ కుటుంబాన్ని ఏర్పరచుకోడంలో కూడా మనకి కావల్సినట్టు, నచ్చినట్లుగా చేసుకోవాలీ అంటే ఈ రోజుల్లో ఇలాంటి చదువులూ, ఉద్యోగాలూ ఉండితీరాలి యశోదా"

"నిజవే కానీ పెళ్ళంటూ చేసుకుంటూ ఈ ఆడవాళ్ళ కెరియర్ సెకండరీ అయిపోతుంది. అతనికెక్కడ జాబ్ వస్తే అక్కడికి వెళ్ళాలి. ఇప్పటిక్కూడా ప్రపంచం మొత్తం మీద కుటుంబాన్ని పోషించాల్సింది మగవాడేకదా"

"అదిగో సరిగ్గా అక్కడే వస్తోంది చిక్కంతా. మగవాళ్లతో సమానంగా చదువుకుని, ఒకొక్కసారి అంతకన్నా ఎక్కువగనే తెలివితేటలున్న ఆడపిల్లలు ఇక్కడే పెళ్లంటే కాస్త ఆలోచిస్తున్నారు. అప్పటికే వ్యక్తిత్వం ఏర్పడిపోయిన వాళ్లకి మొగుడు దానిని ఎక్కడ అంగీకరించడోనని భయం."

"అన్నీ ముందే మాట్లాడుకుంటున్నారు కదండీ. ఇదివరకులా పెళ్లాలు మేం చెప్పినట్టే వినాలని మగపిల్లలెవరూ అనడంలేదు. అదీకాక మొన్న ఏదో పేపర్లో చూసాను. ఇప్పుడు పెళ్లివయసున్న మగపిల్లల నంబర్ ఆడపిల్లల నంబర్ కన్నా ఎక్కువుందిట. అందుకని ఆడపిల్లల డిమాండ్స్ అన్నీ మగపిల్లలు ఒప్పుకుంటున్నారుట. ఇన్నిరకాలుగా అనుకూలంగా ఉన్నప్పుడు ఇలా ప్రతివాళ్లకీ ఏదో వంక పెడుతుంటే ఎలాగండీ"

"చూడు యశోదా, నువ్వు టెన్షన్ పడకు. దేనికైనా టైం రావాలి అంటూంటారు. అలా టైమ్ వచ్చేటప్పటికి అల్లుడు గుమ్మం ముందుకొచ్చి తలుపుకొడతాడు చూడు"

మూర్తి నవ్వులాటగా తేల్చేయబోయాడు.

"ఆ సమయం ఎప్పుడు వస్తుంది అని?"

"ఆ సంగతీ అడిగానండీ సిద్ధాంతిగారిని ఆ టైం ఎప్పుడు వస్తుంది అని"

"ఏవన్నారు?" మూర్తి ఆతృతగా అడిగాడు.

"ప్రతివాళ్ళ జాతకంలోనూ కొన్నేళ్లకొకసారి కలిసి వచ్చే సమయమంటూ గ్రహాలన్నీ అనుకూలంగా ఉంటాయిట. ఆ టైములో మనం సరైన డెసిషన్ తీసుకోకపోతే మళ్లీ కొన్నేళ్లవరకూ అలాగ గ్రహాలన్నీ అనుకూలపడవుట. ఇదివరకు మనం మూర్ఖంగా మంచి సంబంధాలన్నింటికీ వంకలు పెట్టేం చూడండి. అదిగో ఆ టైమునే మనం పొగరుగా వదిలేసుకున్నాం. ఇప్పుడూ మళ్లీ అలాంటి టైము వచ్చిందిట. అప్పుడు మనం చేసినట్టే ఇప్పుడు అది అన్నింటికీ వంకలు పెడుతోంది. నాకేవిటో ఈ టైము కూడా దాటిపోతుందేమోనని భయంగా ఉందండీ. అందులోనూ ఇప్పుడు వచ్చిన సంబంధం ఎంత అనుకూలంగా ఉంది? అన్నీ చక్కగా సరిపోయాయి. వాళ్ళు కూడా చాలా మంచివాళ్ళని విన్నాను" బేలగా అంది యశోద.

మూర్తి ధైర్యం చెప్పాడు. "ఉదయ గురించి నాకోటి అనిపిస్తోంది యశోదా"

"ఏంటండీ అది?" ఆతృతగా అడిగింది.

"హాయిగా జరిగిపోతున్న తనకి పెళ్ళిచేసుకుంటే ఎడ్జస్ట్ అవలేనేమోనని భయపడుతోందనుకుంటా. అది కప్పిపెట్టుకుందుకు పైకి ఇలా అందరికీ ఏదో ఒక వంక పెడుతోందనుకుంటా"

"అలాగైతే మరింక పెళ్లే చేసుకోదంటారా?"

మూర్తి, యశోద ఇద్దరూ ఏం చెయ్యాలో తెలీక అలా కూర్చుండిపోయారు.

ఆలోచిస్తుంటే యశోద యధలాపంగా అన్న ఒక మాట మూర్తికి నచ్చింది.

తను ఒంటరిగా ఉండిపోకుండా తోడు మరొకరు కావాలన్న నిజాన్ని ఉదయ బాగా తెలుసుకోవాలి. ఎల్లకాలం అమ్మానాన్నలు ఉండరనీ, తనకంటూ ఒక కుటుంబం, తన పిల్లలూ ఉండాలనీ తెలియాలి. అలాగ స్థిరపడాలంటే ఈ సమయం దాటిపోతే వయసు

మించిపోతుంది. నలభైలకి దగ్గర పడ్డాక ఒంటరితనం బాధపెడితే అప్పుడు ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఆ విషయం ఈ కాలం పిల్లలకి తెలీటంలేదు.

తెలియచెపుదామనుకుంటున్న పెద్దల మాటలని వాళ్లు వినటంలేదు. పంచుకోడంలో ఉన్న ఆనందం, మరొకరితో కలిసి జీవించడంలో ఉన్న మాధుర్యం, ఒడిదుడుకులెదురైనప్పుడు ఒకరికొకరు అండగా ఉన్నారన్న ధైర్యం ఇవన్నీ ఎన్ని సంపదలకు సరితూగుతాయి?

వెంటనే అన్నాడు యశోదతో.

"ఈ పాయింటే గట్టిగా పట్టుకో యశోదా ఈ పాయింట్ మీదే నువ్వు ఉదయనేమైనా కాస్త దారికి తేగలవు"

మూర్తి చెప్పింది నిజమేననిపించింది యశోదకి కూడా. కానీ ఈ విషయాన్ని ఉదయకర్థమయేలా ఎలా చెప్పడం?

"పోనీ ఓ పనిచేద్దాం. మీరు రిక్వెస్ట్ ట్రాన్సఫర్ చేయించేసుకోండి. మనం దూరంగా ఉంటే ఇంకో మనిషి అవసరం దానికి తెలుస్తుందేమో"

కాస్త ఆలోచించాడు మూర్తి. "అలా లాభం లేదు. ఎందుకంటే ప్రస్తుతం అది కన్ఫ్యూజ్డ్ మైండ్‌తో ఉంది. ఈ టైములో మనం దూరంగా ఉంటే ఎవరైనా తప్పుడు అభిప్రాయాలు చెపితే అటు మొగ్గే ఛాన్స్ ఉంది. అందుకని మనం ఈ సమయంలో దాన్ని అసలు వదలకూడదు. దానిలోపలి ఫ్రస్టేషన్ పోడానికి మనం ఔట్‌లెట్‌గా ఉపయోగపడుతున్నాం. అది పోగొట్టొద్దు"

"మరింకెలాగ?"

"ఆలోచించు. మనం ఇక్కడే ఉండాలి. డబ్బును చూసుకుని తెచ్చుకున్న దాని అహంకారాన్ని పోగొట్టాలి. ఆలోచించు యశోదా అంతా దాని మంచికోసమే కదా. బంగారాన్ని వేడిచేసి, సమ్మెటదెబ్బ పడితేనే కానీ అందమైన ఆభరణం తయారవదు. బాగా ఆలోచించు"

బాగా ఆలోచించింది యశోద.

అలా ఆలోచిస్తున్న యశోదకి ఎప్పటికీ నిద్రపట్టలేదు. ఎలా ఉదయని ఒప్పించాలా అన్న ఆలోచనతో పాటు ఒకవేళ ఉదయ తన మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా ఇలాగే పెళ్లి కాకుండా ఉండిపోతే తమ తర్వాత ఎక్కడ ఒంటరిదైపోతుందోనన్న భయం ఆమెని నిలువెల్లా వణికించేసింది. అదే విషయం పదే పదే ఆలోచించడం వల్ల ఆమె మనసు నలిగిపోయింది. నలిగిపోయిన మనసులో సన్నగా నొప్పి మొదలైంది. ఆ నొప్పి అలా అలా ఎక్కువకాసాగింది. మరింక తట్టుకోలేని స్థితిలో మూర్తిని నిద్రలేపింది.

పరిస్థితి గ్రహించిన మూర్తి హుటాహుటిన యశోదని హాస్పిటల్‌లో చేర్పించి వెంటనే చికిత్స అందేలా చూసాడు. ఒకరోజంతా డాక్టర్లు ఏమీ చెప్పలేమన్నారు.

తన తిక్క మాటల వల్ల అమ్మ ఇలా ప్రాణం మీదకి తెచ్చుకుందేమోనన్న అపరాధ భావన ఉదయ మనసులో ప్రవేశించింది.

హాస్పిటల్‌లో తల్లి పరిస్థితి చూసి మూర్తి పడిన ఆవేదనని చూసిన ఉదయ ఆశ్చర్యపోయింది. పిచ్చివాడిలా డాక్టర్ల వెనకాల తిరిగాడు. బేలగా వేళ్లాడిపోయాడు. ఉదయని పట్టుకుని చిన్నపిల్లాడిలా ఏడ్చేసాడు.

అమ్మంటే నాన్నకింత ఇష్టమా. మరి ఎప్పుడూ అమ్మకి గులాబీలేనా తెచ్చినట్టు తనకి తెలీలేదే తనకి కావాల్సినది అధికారంతో చేయించుకోడం తప్పితే, ఎప్పుడూ ప్రేమగా మాట్లాడినట్టు కూడా తను గమనించలేదే

ఎట్టకేలకి డాక్టర్ల ప్రయత్నం ఫలించింది. యశోదకి గండం గడిచిందని తెలీగానే మూర్తీ, ఉదయ భగవంతునికి వేలవేల నమస్కారాలు చేసుకున్నారు. నాలుగు రోజులయ్యాక యశోదని ఐ.సి.యు నుంచి రూముకి షిఫ్ట్ చేసారు.

ఆ రోజే మళ్లీ ఆఫీస్‌కి వెళ్లిన ఉదయని విషయం అడిగి తెలుసుకున్న రజని ఓదార్పు మాటలు చెపుతూ "ఇంకొక్కసారి ఆలోచించవే. ఇలా నువ్వు సంబంధాలన్నీ తోసిపడేస్తుంటేనే మీ అమ్మగారికి పాపం బెంగతో అలా అయ్యిందేమో అయినా మొన్న మీ అమ్మగారు చెప్పిన సంబంధంలో నాకేమీ లోపం కనిపించలేదు. మరి నువ్వెందుకు వద్దన్నావో కాని"

ఆ సంగతే ఆలోచిస్తున్న ఉదయ "ఏమోనే హాయిగా ఉన్నాం కదా పెళ్లి చేసుకుంటే ఈ స్వేచ్ఛ ఉండదేమోనని అనిపిస్తోందే" అంది.

"ఎన్నాళ్లు ఉంటాం చెప్పు. అయినా మన అమ్మా, నాన్నలకన్నా మనం చాలా బెటర్ తెలుసా. ఇప్పటిక్కూడా లైఫ్‌లో సెటిలవకపోతే రేప్పొద్దున్న మనం మన పిల్లలకి అమ్మా, నాన్నల్లా అనిపించం. తాతా, మామ్మల్లా అనిపిస్తాం. ఎప్పటికీ ఇలాగే ఉంటామంటావా ఆ రమని చూడు అప్పుడే జుట్టు అక్కడక్కడ తెల్లబడుతోంది కూడానూ"

ఉన్న నిజాన్ని అంత తేటతెల్లంగా చెపుతున్న రజని మాటలు ఉదయని ఇంకా ఇంకా ఆలోచింపచేసాయి. ఈ రొటీన్ జీవితం నుంచి కాస్త మార్పు కావాలని ఉదయక్కూడా ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది. తనమీద తనకి నమ్మకం ఉన్నప్పుడు అమ్మ అన్నట్టు రేపేదో చెడుగానే జరుగుతుందని ఎందుకనుకోవాలి? ఆలోచనలో పడింది ఉదయ.

సాయంత్రం ఆరయింది. ఉదయ ఆఫీస్ నుంచి తిన్నగా హాస్పిటల్‌కే వచ్చింది.

ఉదయ వచ్చేసరికి మూర్తి యశోద బెడ్ పక్కన కూర్చుని జాగ్రత్తగా ఆమె చేత జ్యూస్ తాగిస్తున్నాడు. తండ్రి మొహం అలా చూస్తూండిపోయింది ఉదయ. భార్యపట్ల తనకు ఉన్న అనురాగాన్నీ, ఆప్యాయతనీ ఆ పండ్లరసంలో కలిపి తాగిస్తున్నా అన్నంతగా తాదాత్మ్యతతో ఆ జ్యూస్ తాగించి, పక్కనే ఉన్న నేప్కిన్ తీసుకుని, కాస్త గట్టిగా తుడిస్తే నొప్పి పెడుతుందేమోనన్నట్టు అతి సున్నితంగా యశోద పెదవుల్ని నేప్కిన్‌తో అద్దుతున్నాడు మూర్తి.

"అమ్మంటే నాన్నకింత ఇష్టమా. "కొత్త విషయమేదో తెలిసినట్టైంది ఉదయకి.

చిత్తరువులా నిలబడిపోయిన ఉదయని చూసి నవ్వాడు మూర్తి. తండ్రి దగ్గరున్న చనువు ఉదయని ప్రశ్న అడగకుండా ఆపలేకపోయింది.

"నాన్నా, అమ్మంటే నీకింత ఇష్టమైనప్పుడు ఇంట్లో ఎప్పుడూ అమ్మకిలా ఎందుకు చెయ్యలేదు?"

కూతురి ప్రశ్న విన్న ఆ తండ్రి ఉదయకి అర్థమయ్యేలా చెప్పే సమయం వచ్చిందనుకున్నాడు.

"రా తల్లీ కూర్చో ఈ రోజులు వేరు. ఆ రోజులు వేరు. భార్యాభర్తలకి ఒకరంటే ఒకరికి ఎంత ప్రేమాభిమానాలున్నా అవి ఆ రోజుల్లో పైకి చూపించుకునేవారు కాదు. ఇప్పటిలాగా పొద్దున్నే కాఫీ ఇస్తే థాంక్స్ చెప్పడం, ఇష్టంలేని పనిచేసి సారీలు చెప్పడం అప్పుడు తెలీవు. భార్యమీద అధికారం ఉందని భర్త అనుకునేవాడు, తనని ప్రేమగా చూసుకోవాల్సిన బాధ్యత భర్తదేనని భార్య విశ్వసించేది. అలాగే అభిప్రాయాలూ, అభిరుచులూ వేరైనా కూడా "పిల్లలు" అనే బంధానికి మాత్రం వాళ్లిద్దరూ కట్టుబడి ఉండిపోయేవారు. అదే ఎదుటి మనిషిని బలహీనతలతో సహా అంగీకరించడమంటే సంవత్సరాల తరబడి ఒకరి గురించి ఒకరు ఆలోచించుకోడంతో ఒకరంటే మరొకరికి అభిమానం ఏర్పడిపోతుంది. అప్పుడు ఈ అభిప్రాయాలూ, అభిరుచులూ చాలా చిన్న విషయాలైపోతాయి. ఈ రోజుల్ని బట్టి చూస్తే మీమీ అభిప్రాయాలూ, అభిరుచులూ కలవలేదని అనుకుంటున్నారు తప్పితే అతి ముఖ్యమైన వివాహబంధానికి ప్రాధాన్యతనిచ్చి, ఒకరి అభిరుచిని మరొకరు గౌరవించుకోవచ్చుకదా"

తండ్రి ఏ ఉద్దేశ్యంతో ఇంత చెప్పాడో అర్థం చేసుకున్న ఉదయ మరో ప్రశ్న అడిగింది.

"అలా ఎలా కుదురుతుంది నాన్నా. నేను ఉద్యోగం చెయ్యాలనుకుంటాను. అతను వద్దంటాడు. అప్పుడెలాగ?"

"అవన్నీ పెళ్ళికి ముందే మాట్లాడుకుంటున్నారు కదా"

మూర్తి నవ్వాడు.

"మీరు కాగితం పులిని చూసి భయపడిపోతున్నారు. మీలో ఉన్న శక్తిని తెలుసుకోలేకపోతున్నారు"

"అంటే"

"అంటే మేము మిమ్మల్ని ఆర్థికంగా నిలబెట్టాము. అటువంటి పరిస్థితులొస్తే మీ వ్యక్తిత్వమే మిమ్మల్ని నిలబెడుతుంది. అంతేకానీ ఎప్పుడో ఏదో అవుతుందని బంగారంలాంటి జీవితాన్ని అనుమానాలతో పాడుచేసుకోవద్దు"

మూర్తి మళ్లీ ఇంకో మాట చెప్పాడు.

"చూడమ్మా ఇలా ఒకరికి ఒకరం అన్న భావం సహజమైన సన్నజాజుల పరిమళం లాంటిది. నేనిలా ఉంటాను. నువ్వెలా ఉంటావు అని లెక్కలు వేసుకుని పెళ్లిళ్లు చేసుకోవడం కృత్రిమమైన సెంట్ లాంటిది. రెండింటిలో ఏదికావాలో తేల్చుకోవలసింది నువ్వే."

తండ్రి మాటల్లోని అర్థం తెలుసుకున్న ఉదయ నెమ్మదిగా తల్లి దగ్గరికి వెళ్లి యశోద చేతిని తన చేతిల్లోకి తీసుకుని నెమ్మదిగా "అమ్మా, నువ్వు ఇంటికొచ్చాక తొందరగా కోలుకుని ఆ "ఎస్. ఫాదర్" అబ్బాయి వాళ్లకి కబురంపమ్మా" అంది.

కూతురి మాటలు విన్న యశోద మనసు సంతోషంతో దూదిపింజెలా తేలిపోయింది.

●●●

# గుడ్ బై మిష్టర్ సంపత్ యల్లాప్రగడ

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**సి.యమ్.ఆర్ సెంట్రల్ చాలా రద్దీగా ఉంది.** ఫుడ్ - షాపింగ్ - సినిమా ఒకే చోట.

"స్వప్నా, నీకో శుభవార్త. నాకు ప్రమోషన్ మీద హైదరాబాద్ ట్రాన్స్ఫర్ అయింది. జీతం పదివేలకు పైనే పెరుగుతుంది. మనం తప్పకుండా హైదరాబాద్ వెళ్ళాలి. నువ్వు నీ లెక్చరర్ జాబ్‌కి గుడ్‌బై కొట్టాలి. తప్పదు. నాకోసం ప్లీజ్. కావాలంటే హైదరాబాద్ వెళ్లిన తర్వాత అక్కడ నువు మళ్లీ ఉద్యోగంలో ఏదొక కాలేజీలో లెక్చరర్‌గా చేరవచ్చును.

నా 'కెరీర్'లో నేను పైకి రావాలంటే ఇది చాలా మంచి మలుపు. భార్యగా నీ సహకారం తప్పదు, అలా మౌనంగా ఉంటే అర్థం?

మౌనం అర్ధాంగీకారమా అర్ధాంగిగారూ?" - అన్నాడు సంపత్ నవ్వుతూ.

స్వప్న ఆలోచనలో పడింది.

రిలయిన్స్ వస్త్రాలయం లైట్ల కాంతిలో వెలిగిపోతోంది.

●●●

సాయంకాలం ఆరుగంటలు దాటింది. వేసవి తాపానికి, జనం గుంపులు గుంపులుగా నెక్లెస్ రోడ్డు చేరుకుంటున్నారు సేదతీరటానికి. స్వప్న సంపత్ లాన్‌లో కూర్చున్నారు.

"స్వప్నా! ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నాలు ఆపు. నాకు విజయవాడకు బదిలీ కాబోతోంది. జీతం పెరుగుతుంది. క్వార్టర్ ఇస్తారు. ఖర్చు విషయంలో ఈ హైదరాబాద్ కన్నా విజయవాడే నయం, నీవు ఏమీ తోచక షాపింగంటూ డబ్బు దుబారా చేస్తున్నావు. అది తగ్గించాలి. తోచకపోతే టి.వి ముందు కూర్చో. ఇప్పుడు నువ్వు 'ప్రెగ్నెంట్' లేడీవి. ఎక్కువ తిరగకూడదు. ఏమంటావ్ డియర్?" అంటూ స్వప్నను దగ్గరకు తీసుకున్నాడు సంపత్.

●●●

విజయవాడ కనకదుర్గమ్మ గుడిదగ్గర సందడిగా ఉంది. స్వప్న, సంపత్ కొండపై నుండి నగరాన్ని చూస్తున్నారు.

"స్వప్నా! మనం ఖర్చులు తగ్గించుకోవాలి. నా ఒక్కడి సంపాదన సరిపోదు. నీవుకూడా ఉద్యోగం చేయాలి. మనం ఇప్పుడూ ఇద్దరం కాదు ముగ్గురం. మనకు పెళ్లయి మూడు సంవత్సరాలు దొర్లిపోయాయి, అవి బంగారు రోజులు, ఇక రాబోవు రోజులన్నీ గడ్డు రోజులే. ఇద్దరం ఉద్యోగాలు చెయాలి. అప్పుడు గానీ మనం ఒక చిన్న 'ఫ్లాట్' కొనలేం. అర్థమయిందా? ఏమంటారు రాణీగారూ? - సంపత్ నవ్వుతూ స్వప్న వంక చూస్తున్నాడు.

స్వప్న ఆలోచనలో పడింది.

"స్వప్నా! నాకోసం నీవెందుకు నీ 'కెరీర్'ని త్యాగం చేయాలి? ఫిజిక్స్‌లో పి.హెచ్.డి చేశావు. ఎందుకు ఖాళీగా కూర్చోవాలి?

నువ్వు కేవలం గృహిణిగా నా కళ్లముందు ఏ పనీపాటా లేకుండా ఉండటం వలన లోకువయిపోతున్నావు తెలుసా? నీకింతవరకూ నేను చెప్పలేదు, నీవు బాధపడతావని. నువ్వు కూడా ఉద్యోగం చేస్తే చిల్లర ఖర్చులకి నామీద ఆధారపడవలసిన అవసరం ఉండదు. ఏమంటావ్ డార్లింగ్?" నవ్వుతూ సంపత్.

●●●

స్వప్న సంపత్ బీసెంట్ రోడ్డులో షాపింగ్ చేసి దగ్గరలోని హోటల్లో కూర్చున్నారు, కాఫీ ఆర్డరు ఇచ్చి "స్వప్నా! నీకు బార్క్, టి.ఐ.ఎఫ్.ఆర్‌లలో సైంటిస్టుగా ఉద్యోగం వచ్చినందుకు నాకూ సంతోషమే. కానీ, పూణే, బొంబాయిలాంటి నగరాలలో మధ్య తరగతి వాళ్ల బతుకు దుర్భరం. నీకు తెలియని విషయం కాదు, అక్కడ మా కంపెనీ లేదు. నేను వేరే చిన్న ఉద్యోగం వెతుక్కోవాలి. నా కెరీర్ మళ్లీ మొదటికొస్తుంది. పైగా మన బాబు చదువు కూడా 'డిస్టర్బ్' అవుతుంది. డబ్బూ మిగలదు, శ్రమా తప్పదు, ప్రాణానికి సుఖం ఉండదు. నేను చెబుతున్నది - 'నీవు పైకి వస్తావు. నన్ను దాటిపోతావు' - అన్న అసూయతో కాదు. కనుక నీవా ఉద్యోగాలకి 'గుడ్‌బై' చెప్పు.

మనం ఇక్కడే హాయిగా ఉండచ్చు. ఇక్కడే నీవు చిన్న జాబ్‌లో చేరినా సరిపోతుంది. ఏమంటావ్ దేవి? "' నవ్వుతూ సంపత్ ప్రేమగా, అనునయంగా....

●●●

నాలుగుగంటలు దాటింది. స్వప్న టి.వి చూస్తోంది. సంపత్ బయటనుండి వస్తూనే సంతోషంగా హుషారుగా - "స్వప్నా! నీకు శ్రీ నాగార్జున యూనివర్సిటీ సైన్స్ కాలేజీలో లెక్చరర్‌గా జాబ్ వచ్చినందుకు కంగ్రాట్యులేషన్స్. మొబైల్‌లో నాకు ఎలా తెలుస్తుంది? నువ్వు ఈ విషయం చెబుతున్నప్పుడు ఎంతలా నీ మొహం వెలిగిపోతోందో! ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను.

మమతా హోటల్లో చిన్న పార్టీ ఏర్పాటు చేశాను, నీకు జాబ్ రావడానికి నా స్నేహితుడు శేఖర్ రికమెండేషన్ కూడా కారణం తెలుసా? వాడూ మీ యూనివర్సిటీలోనే రీడర్‌గానో, ప్రొఫెసర్‌గానో చేస్తున్నాడు. రాజకీయ నాయకుల అండదండలున్నవాడు. వాడిని కూడా ఫ్యామిలీతో పార్టీకి పిలిచాను. పార్టీ సాయంత్రం ఆరుగంటలకి. నువ్వు వెంటనే రెడీకావాలి. ఆఫీస్‌లో నా ఫ్రెండ్స్ బలవంత పెట్టారు, ఏదో సింపుల్‌గా ఏమంటావ్ దేవీ.?"నవ్వుతూ సంపత్.

●●●

ఓ రోజు ఉదయం ఇంటిలోనే - "స్వప్నా! నీకా శేఖర్ సంగతి తెలీదు, వాడు స్త్రీలోలుడు. ఇకమీదట మర్యాదకోసమైనా వాడు కనిపించి మాట్లాడించినా మాట్లాడవద్దు. ఎంత లేటైనా బస్సులోనో, వేరే ఫ్రెండ్స్ కార్లలోనో - చాలామంది స్టాఫ్ విజయవాడ నుంచి వెళుతున్నారుగా, నువ్వు ఇంటికి రావచ్చును. కావాలంటే నేనే నీకోసం ఓ కారు కొంటాను త్వరలో సరేనా? డియర్" - అంటూ సంపత్ స్వప్నను దగ్గరకు తీసుకున్నాడు ఎంతో ఆప్యాయత కనబరుస్తూ.

●●●

మరో రోజు రాత్రి ఇంటిలోనే "స్వప్నా! నువ్వు ఉద్యోగానికి రాజీనామా చేయాలి. నా స్నేహితుడొకడు తను చేయబోయే వ్యాపారంలో నన్ను భాగస్వామిగా ఉండమన్నాడు. ఇకపై మనకి డబ్బు సమస్య ఉండదు. ఏమంటావ్, మాట్లాడవేంటి? అవున్లే ఆ శేఖర్‌ని వదలాలంటే బాధగా ఉందికదూ! ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో. నేను ఏం చేసినా అది నీ ఆనందం కోసమే కదా డియర్. నీ ఆనందమే నా ఆనందం. ఈ ఉద్యోగానికి నువ్వు 'గుడ్ బై' చెప్పాలి, తప్పదు. మాట్లాడు డియర్. మూగనోమా! "- నవ్వుతూ వినోదంగా విలాసంగా సంపత్.

స్వప్న రెండు భుజాలపై చేతులేసి "చెప్పుడియర్" అంటూ ఆవేశంగా గుంజుతున్నాడు. కోపంతో ఊగిపోతూ చెంపమీద కొట్టాడు.

స్వప్న అంతకంటే ఆవేశంగా -

"నీ దోపిడి, దగా, స్వార్థం, అహం, కుళ్లు, కపటానికి అంతులేదా? ఛీ! నీదీ ఓ బతుకేనా? ఇకనుంచి అయినా అబలగా నీకు సదాతోడుగా నీవెన్నంటి నిలిచే స్త్రీని గౌరవించడం నేర్చుకో. ఎవరూ 'కీ' ఇస్తే ఆడే మరమనుషులుకారనీ, వాళ్లకీ ఒక మనసుంటుందని తెలుసుకో. నీస్వార్థంతో, అర్థంపర్థంలేని అనుమానాలతో ఎదుటవారిని అనుమానిస్తూ వారి జీవితాలతో ఆడుకోకు. గుడ్‌బై మిష్టర్ సంపత్" - అంటూ సూట్ కేసులో అవీ ఇవీ సర్దుకొని విసురుగా బయటకి వెళ్లిపోయింది స్వప్న.

సంపత్‌కి దిమ్మ తిరిగిపోయింది. అనుకోని పరిణామానికి.

●●●

# సర్దుబాటు

ఆకెళ్ళ కృష్ణకుమారి

**"చూడవే పద్మా, ఈ రమ, మన ఇల్లు అమ్మేసి వేరే** ఇంటికి వెడితే బాగుంటుంది అంటోంది. నువ్వైనా చెప్పు దానికి ఇది ఎంత అర్థం లేని పనో" అని ఫోను చేసింది సుశీల, కూతురికి. పద్మ ఆలోచనలో పడింది.

సుశీల, భర్త రంగారావు హైదరాబాదులో ఉంటారు. రంగారావు ఇంజినీరుగా పని చేసి రిటైరు అయాడు. కన్సల్టెంట్‌గా పనిచేస్తూ కాలం గడుపుతున్నాడు. వాళ్లకు ఇద్దరే కూతుళ్లు. ఇద్దరికీ చదువులు చెప్పించి, మంచి సంబంధాలు చూసి పెళ్లి చేసారు. పెద్దమ్మాయి పద్మ, భర్త న్యూజెర్సీలో ఉంటారు. పద్మ అక్కడ టీచరుగా పనిచేస్తోంది. వాళ్లకు ఇద్దరు పిల్లలు. రెండోది రమ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ న్యూయార్క్‌లో భర్త ఇద్దరు పిల్లలతో ఉంటుంది.

రంగారావు సుశీల పిల్లల పురుళ్లకని తరువాత మనమలతో శలవలు గడపటానికని అమెరికా వస్తూ, పోతూ ఉన్నారు. కొన్నేళ్ల క్రిందట పిల్లలు ఇద్దరు కూడా "తల్లి, తండ్రి పెద్దవాళ్లు అవుతున్నారని, ఇకనుంచి అమెరికాలోనే తమతోపాటు ఉంటే బాగుంటుందని, తమకు కూడా సహాయంగా ఉంటుందని" ఆలోచించి, "గ్రీన్ కార్డ్‌కి స్పాన్సర్ చేస్తాం, ఇక్కడే ఉండిపొండి. మెడికల్ ఇన్సూరెన్సు తీసుకోవటానికి ఇప్పుడు అయితే ఏమీ ప్రాబ్లం ఉండదు" అని చెప్పారు. రంగారావు దూరం ఆలోచించి, సరేనన్నాడు. కానీ సుశీలకి మాత్రం ఇష్టం లేకపోయింది.

"హాయిగా హైదరాబాద్‌లో ఉంటే మా జీవితం మాకు ఉంటుంది. మా అన్నయ్య, అక్కయ్య వాళ్ల పిల్లలు దగ్గరలో ఉన్నారు. బోలెడు మంది స్నేహితులు ఉన్నారు. ఎక్కడికైన వెళ్లాలంటే మేమే వెళ్లగలం. ఇక్కడిలాగా ఎవరిమీదా ఆధారపడనక్కరలేదు. మాకు అక్కడే బాగుంది" అని చెప్పేసింది. కూతుళ్లు నచ్చచెప్పటానికి చూసారు కానీ లాభం లేకపోయింది.

ఇంక చేసేదేమీ లేక వాళ్లకు వీలైనప్పుడు వాళ్లే వెళ్లి కొన్నాళ్లు హైదరాబాదులో వాళ్లతో గడుపుతూ వచ్చారు. కానీ వాళ్ల పిల్లలు పెద్దవాళ్లై పెద్ద క్లాసులలోకి వచ్చిన కొద్దీ అలా వెళ్లటానికి కూడా టైం దొరకటం కష్టంగా ఉంటోంది.

రంగారావుకి, సుశీలకి వయసుతో వచ్చిన బ్లడ్ ప్రెషర్, డయాబిటీస్ ఉన్నాయి. కానీ మందులతో అన్నీ కంట్రోల్ చేసుకుంటూ కులాసాగానే ఉన్నారు. రంగారావుకి 75 సంవత్సరాలకి హఠాత్తుగా పక్షవాతం వచ్చి కుడికాలు, చెయ్యి స్వాధీనంలో లేకపోయాయి. మాట కూడా సరిగ్గా రాలేదు. వెంటనే హాస్పిటల్లో చేర్చి వైద్యం చేయించారు కానీ ఆయన పూర్తిగా కోలుకోలేకపోయాడు. ఫోన్ చెయ్యగానే రమ వచ్చి, ఆయనకు కొంచెం తగ్గేవరకూ ఉండి చూసుకుంది.

ఆయన ఇంటికి వచ్చిన తరువాత కూడా, ఆయన పనులు ఆయన చేసుకోలేకపోయాడు. ఒకళ్ల మీద ఆధారపడే పరిస్థితిలో ఉన్నాడు. అప్పుడు రమ, "అమ్మా, నాన్నను నువ్వు ఒక్కదానివి చూసుకోవటం కష్టం. ఒక నర్సుని ఏర్పాటు చేస్తాను. రోజంతా నాన్నను చూసుకుంటుంది. నీకు తోడుగానూ ఉంటుంది" అని చెప్పింది.

కానీ సుశీల "నాకు ఒంట్లో బానే ఉంది. మీ నాన్నని నేనే చూసుకుంటాను. అలా చేస్తేనే నాకు తృప్తిగా ఉంటుంది. వేరే నర్సు వద్దు" అని చెప్పింది. ఇంక ఏమీ చెయ్యలేక బాధపడుతూనే విమానం ఎక్కింది.

కొన్నాళ్లైన తర్వాత ఒకరోజు హైదరాబాద్ నుంచి ఫోను వచ్చింది. పద్మ కజిన్ ఫోను ఫోన్ చేసాడు "మీ అమ్మకు ఒంట్లో బాగుండలేదు. డయాబెటిస్ ఎక్కువై కళ్లు తిరిగిపడిపోయింది. హాస్పిటల్లో చేర్చాం" అని.

వెంటనే పద్మ వెళ్లింది. కొన్నాళ్లు ఉండి తల్లికి కొంచెం తగ్గిన తర్వాత ఇంటికి తీసుకు వచ్చింది.

ఇంట్లో ఇప్పుడు ఇద్దరూ పేషంట్లే. పద్మ వెళ్లిపోతే వీళ్లని ఎవరు చూసుకుంటారు? పోనీ, తనతో అమెరికా తీసుకువెడితే? మెడికల్ ఇన్సూరెన్సు ఉండదు. ఇప్పుడు ఉన్న జబ్బులతో ప్రైవేటు ఇన్సూరెన్స్ దొరకటం కష్టం. హాస్పిటల్‌కి తీసుకువెళ్లాలంటే వేలకొద్ది డాలర్లు కావాలి. అందుకని తను తీసుకు వెళ్లలేదు. పోనీ ఈ ఊళ్లో చూసుకునే వాళ్లు ఉన్నారా అంటే సుశీల అన్న, అక్క కూడా పెద్దవాళ్లే. వాళ్లని చూసుకోవటానికే వాళ్ల పిల్లలు కష్టపడుతున్నారు.

ఇవన్నీ ఆలోచించి, తల్లికి గట్టిగా నచ్చచెప్పి ఒప్పించి, హెరిటేజ్ హాస్పిటల్ నుంచి ఒక నర్స్ వచ్చి, రోజంతా ఉండి వీళ్లని చూసుకునేటట్లు, ఒక కేటరర్ రోజూ రెండు పూటలా వీళ్లకి భోజనం పంపించేటట్లు ఏర్పాటు చేసింది. తన డాక్టర్ స్నేహితురాలు అప్పుడప్పుడు వచ్చి వీళ్లని చూసుకుంటానని చెప్పింది. అన్నీ చేసింది కానీ, దగ్గర ఉండి చూసుకోలేకపోతున్నానే అన్న బాధతోనే అమెరికా వెళ్లింది.

ఈ ఏర్పాటు కొన్నాళ్లు బాగానే నడిచింది కానీ నర్సు మధ్యమధ్యలో రాకపోవటం, భోజనంలో నూనెలు, కారాలు ఎక్కువ వెయ్యటంతో వంట తల్లే చేసుకోవలసి రావటంతో మళ్లీ సమస్యలు మొదటికి వచ్చాయి.

ఈసారి అక్కచెల్లెళ్లిద్దరికీ బాగా అర్థమైంది. ఇన్నిసార్లు ఇండియా వెళ్లి వచ్చినా ఏదో తాత్కాలికంగా ఆ సమస్య తీరుతోంది కానీ అసలు పరిష్కారం ఏమిటని తెలటంలేదని. పోనీ, ఇద్దరిలో ఒకరైనా ఇండియాకి వెళితే బాగుంటుంది అనుకుంటే, ఇద్దరికీ పిల్లలు హైస్కూలులో ఉన్నారు. కాలేజీలో చేరటానికి తయారవుతున్నారు. ఇలాంటప్పుడు మళ్లీ ఉద్యోగాలు మార్చుకుని, కొత్తచోటకి వెడితే పిల్లలకి, తమకి కూడా మంచిదికాదు ఏం చెయ్యాలో తెలియక అమెరికాలో ఉన్న తమ స్నేహితులతో మాట్లాడి ఏదైనా పద్ధతి ఉందా అని ఆలోచించటం మొదలుపెట్టారు.

ఉన్నట్టుండి ఒకరోజు పద్మ కొలీగ్ రమేష్ ఒక కబురు తెచ్చాడు. "అతని క్లాస్‌మేట్ డాక్టరు ప్రభాకర్, అతని భార్య డాక్టర్ ఉమ, అమెరికాలో ఉన్నవాళ్ల (NRI) తల్లితండ్రుల కోసం ఒక ఆశ్రమం హైదరాబాద్‌లో పెట్టారుట. వాళ్ళిద్దరూ అమెరికాలో కొన్నేళ్లు పనిచేసి వెళ్లారు. అందుకని అమెరికాలో ఓల్డేజ్ హోం పద్ధతిలో, ఇండియాకి కావలసిన మార్పులతో పెద్దవాళ్లు ఉండటానికి వీలుగా ఉందిట. బాగా చూసుకుంటున్నారట" అని. ఈ కబురు చెప్పి రమేష్, మీకు కావాలంటే నేను ప్రభాకర్‌తో మాట్లాడి ఏర్పాటు చేయగలను అని చెప్పాడు.

ఇది వినగానే పద్మ, రమ చాలా సంతోషించారు. అవి క్రిస్మస్ శలవలు కావటం వల్ల రమ వెంటనే ఇండియా వెళ్లింది. హైదరాబాద్‌లో ఆ ఆశ్రమం చూసింది. ఊరు బైట కొన్ని ఎకరాల స్థలంలో చిన్న కాటేజిల్లాగా కట్టారు. పెద్ద, పెద్ద చెట్లు, మధ్యలో లాన్, పెద్దవాళ్లు నడవటానికి వీలుగా రోడ్లు, పక్కనే పూలచెట్లు. మధ్య మధ్యలో కూచోవటానికి రాతిబల్లలు. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. ఒక పక్కగా చిన్న గుడి కూడా ఉంది. అక్కడ ఉన్న వాళ్లంతా సంతోషంగా కనిపించాయి.

అందులో ఉన్న వాళ్లకి వైద్య సదుపాయం ప్రభాకర్, ఉమ చూసుకుంటారు. అవసరమైతే దగ్గరలో ఉన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి వాళ్లే తీసుకువెడతారు.

నర్సులు, ఆయాలు రోజూ వచ్చి లేవలేని వాళ్లకు సహాయం చేసి స్నానం, వ్యాయామం అన్నీ చేయిస్తారు. చేసుకోగలిగితే కాటేజీలోనే ఎవరికి వాళ్లు వంట చేసుకోవచ్చును. చేసుకోలేకపోతే అక్కడే కాంటిన్లో ఎవరికి ఎలాంటి పథ్యం భోజనం కావాలో అలాంటి భోజనం తయారు చేసి మూడుపూటలా కాటేజికి తెచ్చి ఇస్తారు. అందరూ కలిసి మాట్లాడుకోవటానికి, ఏవైనా ఆటలు ఆడుకోవటానికి పెద్ద హాలు ఉంది. అక్కడే అందరూ కలిసి టీవీ, వీడియో చూడవచ్చును. మధ్య మధ్యలో ఏదైనా ప్రవచనం గానీ, సినిమా గానీ, భజనలు

కానీ, ప్రోగ్రాములు పెడతారు. లైబ్రరీ, మందుల షాపుకూడా ఉన్నాయి. ఎవరైనా ఊళ్లోకి వెళ్లి షాపింగ్ చెయ్యాలనుకుంటే ఒక వాన్ కూడా ఉంది. నడవలేని వాళ్లను వీల్‌చైర్‌లో కూచోపెట్టి కాంపౌండ్‌లో నర్సులు తిప్పుతారు. ఇక్కడ ఉండాలంటే ఒక కాటేజి కొనుక్కోవాలి. ఇదికాక నెల, నెల ఈ సర్వీసుకి డబ్బు కట్టాలి.

ఇది చూసి వచ్చి రమ, పద్మతో మాట్లాడింది. ఇద్దరికీ ఈ ఏర్పాటు చాలా నచ్చింది. ఇక్కడి పాత ఇల్లు అమ్మేసి ఒక కాటేజీ కొని, పైన డబ్బు కొంత వాళ్లు పంపిస్తే తల్లితండ్రులకి వీలుగా ఉంటుంది అనుకున్నారు రమ తండ్రితో మాట్లాడితే ఆయన ఒప్పుకున్నాడు. కాని ఒకమాట అన్నాడు. "ప్రస్తుతం ఇక్కడ ఇళ్లధరలు ఎక్కువ అవుతున్నాయి. ఇప్పుడు ఇక్కడి ఇల్లు అమ్మితే మీరు మళ్లీ ఈ చోట కొనుక్కోలేరేమో. ఆలోచించుకోండి" అని.

దానికి రమ "మీ ఆరోగ్యం, మీరు హాయిగా ఉండటం మాకు ముఖ్యం. తక్కినవేమీ ఆలోచించకండి నాన్నా" అని సర్ది చెప్పింది.

తర్వాత రమ తల్లితో ఏ ఏర్పాటు గురించి చెప్పింది. ఆవిడకు ఇది నచ్చలేదు. దాని ఫలితమే ఈ ఫోను.

పద్మ "అమ్మా, మేము ఇల్లు అమ్మమన్నామని కోపం తెచ్చుకోక కొంచెం మెల్లిగా ఆలోచించమ్మా. మీరు ఇక్కడ మాతో ఉండటానికి ఒప్పుకోలేదు. మీరు అక్కడ చేసుకోలేకపోతున్నారు. మేము మా సంసారాలు, ఉద్యోగాలు వదులుకుని నెలల తరబడి అక్కడ ఉండలేము కదా. అందుకని మీకు సౌకర్యంగా ఉండేటట్లు, చేతనైనంత హాయిగా ఉండేటట్లు చేద్దామని మా తాపత్రయం. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో నాన్నకు ఈ ఆశ్రమంలో బాగుంటుంది. వైద్యం బాగా జరుగుతుంది. అది కదా మనకు ముఖ్యం. నీకు కూడా పని తేలికగా ఉంటుంది. మీ ఇద్దరికీ బాగా కాలక్షేపం అవుతుంది. ఒంటరిగా కాకుండా మనుష్యుల మధ్యలో ఉంటారు. ఇల్లు అమ్మాలంటే చాలా కష్టంగా ఉంటుంది. నిజమేనమ్మా. నీ బాధ నేను అర్థం చేసుకోగలను. కానీ చూడు మనం ఆ ఇల్లు బాగా ఎంజాయ్ చేసాము. అందరికి మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ ఇప్పటి పరిస్థితిలో నువ్వు ఆ ఇంట్లో ఉండి నాన్నను చూసుకోలేవు. ఈ ఆశ్రమంలో ఇల్లు తీసుకుంటే నాన్నకు నీకు మంచి వైద్యసదుపాయం ఉంటుంది. ఇప్పుడు మీ ఇద్దరి ఆరోగ్యం ముఖ్యం కాని ఇల్లుకాదుకదా. నీకు దొడ్డమ్మని, మామయ్యని చూడాలని అనిపిస్తే ఒక టాక్సీలో వెళ్లిరావచ్చును. మా మీద కోపం తెచ్చుకోకుండా నిదానంగా ఆలోచించు. నీ ఇష్టప్రకారమే చేస్తాము" అని చెప్పింది.

సుశీల రెండు రోజులు పిల్లల మీద విసుక్కుంది. "వీళ్లకేం అమెరికాలో కూచుని ఇలాగే చెపుతారు. ఈ వయస్సులో మళ్లీ కొత్త చోటుకి, కొత్తమనుష్యులలోకి వెళ్లాలంటే ఎంత కష్టం? వాళ్లందరితో మళ్లీ సర్దుకోవాలి. సొంత ఇల్లు, తెలిసిన చోటు, తెలిసిన మనుషులని వదిలేసి వెళ్లాలంటే పడే బాధ వాళ్లకేం తెలుస్తుంది?" అని. "పిల్లలు ఏమి చెపితే దానికి ఒప్పుకుంటారు" అని భర్తమీద కోపం తెచ్చుకుంది.

మెల్లిమెల్లిగా కోపం తగ్గిన తర్వాత పద్మ చెప్పిన మాటల గురించి ఆలోచించింది. ఎంత ఆలోచించినా మనస్సు సమాధాన పడలేదు. చివరికి ఒకరోజు వాళ్ల అక్కయ్య శాంతమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ ఆవిడతో తన బాధంతా చెప్పుకుంది.

అన్నీ విని, ఆవిడ "చూడమ్మా, మనకు ఓపిక ఉన్నన్నాళ్లు మన సొంత ఇంట్లో ఉండటం బాగా ఉంటుంది. ఓపిక తగ్గిపోయిన తర్వాత మన సంగతే మనం చూసుకోలేక ఇంకొకరి మీద ఆధారపడవలసి వస్తుంది. అప్పుడు మనకు కావలసింది మనని చూసేవాళ్లు కానీ సొంత ఇల్లు కాదు. నీకు ఓపిక లేక, మీ ఆయన్ని చూసుకోవటానికి ఎంత అవస్థపడుతున్నావో చూస్తున్నాను కదా. నీకు ఆరోగ్యం బాలేదు. మేము నీకు సహాయం చేసే పరిస్థితిలో లేము. ఇవన్నీ ఆలోచిస్తే పిల్లలు చెబుతున్నది బాగానే ఉంది అనిపిస్తోంది. నువ్వు చెప్పిన దానిని బట్టి ఆ ఆశ్రమంలో ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి. నీకు, మీ ఆయనకు అక్కడ సుఖంగా ఉంటుంది అనిపిస్తోంది. అన్నిటినీ మించి రమ ఆ ఆశ్రమం చూసి వచ్చింది. పిల్లలిద్దరూ మీకు అక్కడ సదుపాయంగా ఉంటుంది అనుకుంటున్నారు. కన్న పిల్లల కన్నా మన మంచి

కోరేవాళ్లు, మన సంగతి ఆలోచించి, చూసుకునే వాళ్లు ఎవరు ఉంటారు చెప్పు? ఇంక సర్దుకోవటం అంటావా, మన కాళ్లు, చేతులు బాగా ఉన్నన్నాళ్లే మన ఇష్టం కాని, లేవలేకపోతే ఎవరితోనైనా సర్దుకోవలసిందే. మన పిల్లలతో ఉన్నా కూడా వాళ్లతో నైనా సర్దుకోవలసిందే కదా.

ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో, మనం అమ్మ, నాన్న పెద్దవాళ్లైన తర్వాత ఎంత తాపత్రయపడేవాళ్లమో, వాళ్ల చివరి రోజులు హాయిగా, ప్రశాంతంగా ఉండాలని, వైద్య సదుపాయం బాగా ఉండాలని. ఇప్పుడు నీ పిల్లలు కూడా అలాగే ఆలోచిస్తున్నారు. నువ్వు ఈ సంగతి అర్థంచేసుకుంటే నీకు ఇంత బాధ ఉండదు" అని సలహా చెప్పింది.

ఆ కోణం నుంచి సమస్యను చూస్తే పిల్లలు చెబుతున్నది సరిగ్గా ఉంది అనిపించి, మనస్సు చాలా తేలికైంది సుశీలకి. వెంటనే పద్మకి ఫోను చెయ్యటానికి వెళ్ళింది.

●●●

# ప్రేమ - ప్రేమ్ - ప్రేమాయణం తాడికొండ కె.శివకుమార్ శర్మ

**ప్రేమ్ ప్రేమని కలవడం కాకతాళీయంగానే జరిగింది;** ప్రేమాన్వేషణలో భాగంగా కాదు.

ప్రేమనీ, ప్రేమించడాన్నీ కూడా ఎంతో ప్రేమించే ప్రేమ, ప్రేమ్‌ని కలవడం కొంత ఆలస్యంగానైనా సరే జరిగింది.

ప్రేమ్‌కి ప్రేమతో తొలిపరిచయం ఇరవయ్యేళ్ళ అతని అక్కయ్య రాధ ఏడేళ్ళ అతని వేలు పుచ్చుకుని పార్కుకి నడిచివెళ్ళి మాధవ్ కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసుకుంటున్నప్పుడు, "అలా ఎంతసేపు చూసుకుంటారక్కా?" అన్న ప్రశ్నకి తడబడి ఆమె ఇచ్చిన "మేం ఒకళ్ళనొకళ్ళం చూడడంలేదురా, మా ఇద్దరిమధ్యా ఉన్న ప్రేమని చూస్తున్నాం" అన్న జవాబు వల్ల జరిగింది. అతనికి ఆ నాలుగు కళ్ళ మధ్యలో ఏమీ కనబడకపోవడం వల్ల, "నేను చందన కళ్ళల్లోకి చూస్తే నాకు అక్కడ కనిపిస్తుందా?" అనడిగాడు. చందన పక్కింటివాళ్ళ ఏడేళ్ళ అమ్మాయి.

అతన్ని ఆట పట్టించడానికి మాధవ్, "పెద్దదైన తరువాత కనిపిస్తుంది" అన్నాడు. ఒకళ్ళు పెద్దైతే చాలేమోనన్న సందేహ నివృత్తికై "మరి యామిని కళ్ళల్లోకి చూస్తే అక్కడ కనిపిస్తుందా?" అనడిగాడు ప్రేమ్. ఇరవయ్యేళ్ళ యామిని మాధవ్ చెల్లెలు. రాధతో మాధవ్ పరిచయం యామిని వల్లే. కిసుక్కుమని నవ్వింది రాధ. "ప్రేమ ఇంకా అందంగా ఉంది" అన్నాడు మాధవ్ తన్మయత్వంతో. అదిగో, అప్పుడు మొదలయ్యింది ప్రేమ్ ప్రేమాన్వేషణ.

"ఏమిటే వీడు చిన్నా పెద్దా తేడా లేకుండా అలా కళ్ళల్లోకి చూస్తూంటాడు?" అన్నది అత్త వరసయిన ఒకావిడ రాధతో.

"ప్రేమని వెతుక్కుంటున్నాడేమో నత్తయ్యా" అన్నది రాధ ఆమెని ఆటపట్టిస్తూ.

"నా మొహం! ఆయనే ఉంటే మంగలాడెందుకని, ఈ కళ్ళల్లో ఏం కనిపించలేదో ఆ వెధవముండ కళ్ళల్లో ఏం కనిపించిందో ఆయనకే తెలియాలి" అన్నదావిడ ముక్కు చీదుతూ. వాళ్ళాయనికి ఉన్న రెండో సెటప్ గూర్చి మర్చిపోయి అలా మాట్లాడినందుకు రాధ నాలిక్కరుచుకుంది.

ప్రేమ రూపు రేఖలని అన్వేషిస్తున్నట్లు అతనికి తెలియని కాలంలో సినిమాలు కూడా అతని కుతూహలాన్ని ఆర్పలేకపోయాయి. "నిన్ను ప్రేమిస్తున్నాను రాధా" అనే హీరో డైలాగ్ కానీ, "నీ ప్రేమకోసం జీవితాంతం వేచివుంటాను గోపీ" అనే హీరోయిన్ డైలాగ్ కానీ

అతనికి అన్వేషణలో సహకరించలేకపోయాయి. అయితే, పదవతరగతిలోకి రాకుండానే రాజేష్ సుప్రియ ప్రేమలో పడ్డాడు అని స్నేహితులు అనేటప్పటికి ప్రేమ రూపం గూర్చి ఒక క్లూ దొరికింది. అది ఏ గొయ్యిలాంటిదో, నుయ్యిలాంటిదో అయివుండాలనుకున్నాడు.

ఎత్తుగా ఉన్న వసారాలో నిలబడి రోడ్డుమీద వెళ్ళేవాళ్ళను కాంపౌండ్ వాల్ మీదుగా చూస్తూ తలదువ్వుకుంటున్న సుప్రియని చూస్తూ రోడ్డుమీది గోతిలో కాలేసి ముందుకు పడ్డ రాజేష్‌ని చూసి ఆమె నవ్విందని, అప్పటినుంచీ రాజేష్ ఆమెతో కళ్ళు కలిపినప్పుడల్లా - రోడ్డుమీద స్నేహితురాళ్ళతో కలిసి ఆమె ఎదురుగా వచ్చినప్పుడు - ఆమె నవ్వుతూ స్నేహితురాళ్ళవైపు తల తిప్పుతుందని, అది ఖచ్చితంగా ప్రేమవల్లనేనని మిత్రబృందం తీర్మానించింది. ఆమె రాజేష్ కన్నా రెండేళ్ళు వయసులో పెద్దది కావడం ప్రేమకేమీ అడ్డురాదని వాళ్ళు అతణ్ణి ప్రోత్సహించారు కూడా. ప్రేమంటే ఏమిటని ఒకసారి పొరపాటున ప్రేమ్ స్నేహితులని అడిగినప్పుడు, "పేరులో మాత్రం ప్రేమ. కానీ వీడికి ప్రేమంటే ఏమిటో తెలియదట్రా" అని నవ్వేసి అక్కణ్ణించీ వెళ్ళిపోయేసరికి, ప్రేమ్‌కి అనుమానం వచ్చింది - వాళ్ళకి తెలిసి చెప్పట్లేదా లేక తెలియదని చెప్పడానికి ఇష్టంలేక పారిపోతున్నారా అని!

ఇంజనీరింగ్ చదివే రోజుల్లో కూడా క్లాస్ మేట్లు ఎదురుగాఉన్న ఆర్ట్స్ కాలేజీ అమ్మాయిలతో కలిసి (ఆర్ట్స్ కాలేజీ అమ్మాయిలు, ఇంజనీరింగ్ చదివే అబ్బాయిలు - దట్ కాంబినేషన్ ఈజ్ మేడ్ ఇన్ హెవెన్) ఒకే కప్పులో ఐస్‌క్రీంని తిన్నప్పుడు, ఒకే సీసాలోంచి కూల్ డ్రింకుని తాగినప్పుడు, ప్రేమకి తీపి అవసరమనీ, కొండొకచో ఒకే మిరపకాయ బజ్జీని ఒక అమ్మాయీ ఒక అబ్బాయీ చెరొకవైపూ కొరికి తింటున్నప్పుడు ఉప్పు, కారాలు కూడా అవసరమనీ, ఇవన్నీ తనకంటే మిగిలిన వాళ్ళకే ముందు తెలుస్తున్నాయని బాధపడ్డాడు. (కళ్ళల్లోకి చూస్తే అతని అలవాటుకి భయపడి అమ్మాయిలు అతన్ని దూరంగా ఉంచడం వల్ల అతని బాధాకాలం పెరుగుతూనే వచ్చింది.) రూమ్మేట్ రామారావ్ ఒకరాత్రి వారం రోజులకి సరిపడే భోజనం డబ్బుల్ని గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి ఐస్‌క్రీం తినడానికీ, సినిమాకెళ్ళడానికీ వాడెయ్యడం వల్ల ఆ వారం రోజులూ ఒకపూట పస్తుపడుకోవలసి వచ్చిందని తెలిసి ప్రేమకి కోరికలుంటాయనీ, అవి త్యాగాన్ని కూడా కోరుతాయనీ అర్థమై భయపడ్డాడు. ప్రేమకి సినిమాలు కూడా అవసరమని నోట్ చేసుకున్నాడు.

ఒక రోజు హాస్టల్‌కి తిరిగి వచ్చేసరికి అతని రూంకి రెండు రూములవతల ఒక గుంపు కనిపించింది. సందు చేసుకుని తొంగి చూశాడు. కబీర్ చేతిలో బీరు బాటిల్ పట్టుకుని కుర్చీలో వెనక్కి వాలి గది కప్పుకేసి చూస్తున్నాడు. చుట్టూ నిలబడ్డవాళ్ళు చేతుల్లో ఉన్న బాటిళ్ళని నోళ్ళతో తృప్తిపరుస్తూ, "ఊరుకో బ్రదర్" అనేటప్పుడూ మాత్రం సీసాలకి ఆ తృప్తిని కరువుచేస్తున్నారు. కబీర్ "నీవేనా నను తలచినది" అన్న ట్యూన్‌లో పాటందుకున్నాడు.

"ప్రేమించానని అన్నావు, నేనే నీవని అన్నావు.

పెళ్ళెప్పుడనీ అడగంగానే ప్రేమా పెళ్ళీ వేరన్నావు, అన్నావూ" అని పాటనాపి,

"తను ఊరికే ఎంటర్ టెయిన్ మెంటుకి ప్రేమించిందట" అని, చేతిలో ఓపెన్ బీర్ బాటిల్ ఉన్నదన్న ధ్యాసే లేకుండా ఆ చేత్తో "మంజరి ఇక్కడ, ఇక్కడ చేసింది బ్రదర్, పెద్దగాయం" అంటూ గుండెమీద తట్టుకోవడం వల్ల అతని గుండెగాయంలోంచి ప్రవహిస్తున్న బీరు ఆ సీసాలోకి చేరుతున్నట్లు కనిపించింది. అందరి చేతుల్లోని బీరు బాటిళ్ళని చూసి అప్పటికే ఆ గాయం బీరు వరదలని సృష్టించిందని ప్రేమ్ అర్థం చేసుకున్నాడు.

"అది మంజరికాదు గురూ చేసింది, ప్రేమ. ఉన్‌కో ఛోడ్ దో!" అన్నాడు బీరు వరదలని సృష్టించడంలో అనుభవశాలి అయిన ఒక దేవదాసు. పెద్దగా చెప్పరుగానీ ఆ హాస్టల్లో అందరికీ 'గుండె గాయాలకోసం కొట్లాడుతాది' - బీరంటే ప్రాణం కావడంవల్ల! అప్పుడప్పుడూ మాత్రమే వచ్చే వరదలవల్ల అంత ప్రయోజనమేమీ లేదని "ప్రేమబాధితుల సహాయ నిధి"కై హాస్టల్లో అందరి దగ్గరినుంచీ నెలనెలా డబ్బులు వసూలు చేసి క్రమబద్ధంగా పార్టీలు ఇచ్చినా, వరదలొచ్చినప్పుడే అందరికీ ఎక్కువ ఆనందం.

ప్రేమకి గాయం చేసే గుణం ఉన్నదని అర్థమైంది ప్రేమ్‌కి - అది బాణం వల్ల, బుల్లెట్ వల్ల, కత్తివల్ల, 'బై' చెప్పడం వల్ల - దేనివల్లనయితేనేం? అయితే, ప్రేమ్‌ని ఇంకాస్త కన్‌ఫ్యూజ్ చేశాడు కబీర్ -

"హాయిగా మత్తుగా ఆడవే అందాలభామా

ఆడాకా చూపించు కాసింత ప్రేమా"

అని పాటనందుకుని, దానివల్ల ప్రేమ్‌కి అర్థమైంది, ముందు కావలసింది అందాలభామ. ఆమె బీరు తీసుకోవాలి. తరువాత ఆడాలి. (ఈ ఆడడమేమిటో అర్థంకాలేదు. టెన్నిస్ ఆడితే సరిపోతుందా? తరువాత ఎవరినైన అడగాలి అని ప్రేమ్ మైండ్‌లో నోట్ చేసుకున్నాడు.) అప్పుడు ఆమె ప్రేమ చూపించాలి. ఎక్కడ? ఎట్లా? హనుమంతుడు గుండెని చీల్చినప్పుడూ అక్కడ రాముడు, సీత కనిపించినట్లుగా ఆ అందాలభామ ప్రేమని చూపిస్తుందా? అక్కడ ఏమని ఉంటుంది? ప్రే...మ.. అని రెండక్షరాలుంటాయా లేక ప్రేమ రూపేదైనా కనిపిస్తుందా? అతని మైండ్‌లోని ప్రశ్నలకి ఇంకొన్ని జతగూడాయి.

"రోజూ క్రమం తప్పకుండా ప్రేమాట ఆడుతున్నావ్ కదా, ఇంకా ఏం కనిపించలేదా?" ఎంక్వయిరింగ్ మైండ్స్ వాంటెడ్ టు నో.

"ప్రేమ వేసే ఏసులకి మూర్ఛపోవడమే వాడి ఆట" వెక్కిరించారు కొందరు.

ఈ ప్రేమ చేతిలో టెన్నిస్ రాకెట్ పట్టుకుంటుంది. పట్టుకుని ఊర్కేనే నిలబడకుండా టెన్నిస్ కోర్టుమీద బాలుని రాకెట్‌తో అటూ ఇటూ కొడుతూంటుంది. ఆమె ప్రత్యర్థులు అడపాదడపా రాకెట్‌తో ఆ బంతిని కొట్టినా క్రిందపడిన బంతుల వెంట పరిగెత్తడం, వంగి వాటిని తియ్యడం అప్పటిదాకా - అంటే ప్రేమ్ కోర్టులో దిగేదాకా - చేసినపని. ఆమె షాటుకొట్టినప్పుడల్లా - ముఖ్యంగా విన్నింగ్ షాట్ కొట్టినప్పుడు - ఫోటోగ్రాఫర్లకి సహకరించడం కోసం ఆ పొజిషన్లో, మొహంలో ఎక్స్‌ప్రెషన్స్‌తో సహా కావాలని రెండు మూడు క్షణాలు ఎక్కువగా ఫ్రీజ్ అయివుంటుందని ఎప్పుడో అందరూ కనిపెట్టేశారు గానీ ఎవరికీ ఆమె ఆడుతున్న కోర్టుల చుట్టు పక్కల కెమెరా మెన్‌లని చూసిన గుర్తులేదు - ముఖ్యంగా ప్రేమ్‌తో ఆడుతున్నప్పుడు.

ఒకసారి ప్రేమ ఏసు వేసినప్పుడు ఆ ఫ్రీజింగ్ షాట్‌కి ఎక్కువ ఎక్స్‌పోజర్ టైంని ప్రేమ్ కావాలని ఇవ్వడం జరగలేదు. ఆమె సర్వ్ చేసిన బంతి కోర్టుమీద వున్న చిన్న గులకరాయిమీద పడి, గతి మార్పిడి చెంది ఆ బంతి కోసం తయారుగా ఉన్న అతని రాకెట్టుని తాకకుండా ఊహించని విధంగా అతని గుండెని తాకింది. ఆ నెప్పిని బట్టీ గాయం చెయ్యడానికి ప్రేమ టెన్నిస్ బంతికూడా కావచ్చు అని అతను నోట్ చేసుకున్నాడు. అతను చెప్పిన నిజాన్ని నమ్మని స్నేహితులు మాత్రం అతని కార్టూన్‌ని గీసి "ప్రేమ కొట్టిన దెబ్బలు" అని హెడ్డింగ్ పెట్టి రోజుకో రెడ్ క్రాస్ మార్క్ ప్లస్ గుర్తులు పెట్టేవాళ్లు.

ప్రేమకి ఆటలమీద ఆసక్తి కలుగుతుందని ఆమె తల్లిదండ్రులు ఊహించలేదు - వాళ్ళకు ఆమె ఎంత ఆడితే అదే ఆట, ఎలా పాడితే అదే పాట. ప్రేమ ముగ్గులు వేసే రోజుల్లో - అదే, పిల్లి మొగ్గలు వేసే రోజుల్లో - ఆమె ఫ్రీజ్ అయి, ఫోటో తియ్యమని డిమాండ్ చేసినప్పుడు మొదట్లో ఉత్తిత్తినే కెమేరాని క్లిక్‌మనిపించి ఆమెని మభ్యపెట్టినా ఆ కెమేరాలో ఫిల్మ్ వేసి దాన్ని డెవలప్ చేయించి ఆమెకి ఫోటోలని చూపడం తప్పనప్పుడు, రోజులో కనీసం 43,200 సార్లు - అదే, రోజులో ఆమె నిద్రలేచివుండే పన్నెండు గంటల సమయంలోని సెకన్లు - కెమేరాని క్లిక్ చేస్తే వేళ్ళు బిగదీసేస్తాయనీ, కాకపోయినా, ఆ ఫోటోలన్నీ డెవలప్ చెయ్యడానికయ్యే ఖర్చుకి ఆస్తంతా తగులపెట్టినా, ఆ ఫోటోలని స్టోర్ చెయ్యడానికి గల చోటు ఇంట్లో ఉండదనీ గ్రహించిన ఆమె తండ్రి ఆమె గదిని అద్దాల మందిరంగా మార్చాడు. ఆమె అప్పటినుంచీ రకరకాల పోజులని ఫ్రీజ్ చేసి చూసుకుంటూ తనగదిలో తనని ప్రేమించడం మొదలుపెట్టింది.

ఆమె తనమీద ప్రేమని వ్యక్తం చెయ్యడం పక్కమీదనుంచీ లేవకుండానే, కళ్ళు తెరవకుండానే మొదలుపెడుతుంది. ఏ ఏంగిల్‌లో తనను ఆ రోజు మొదటగా చూసుకోవాలో నిర్ణయించుకున్న తరువాత కానీ కళ్ళు తెరవదు. బ్రష్‌తో పళ్ళు తోముకుంటున్నప్పుడూ, బాత్ రూంలో సబ్బుతో తోముకుంటున్నప్పుడూ, షాంపూ నురగని తలకి పట్టించుకుంటున్నప్పుడూ, ఎటాచ్డ్ బాత్రూంలోనుంచీ అద్దాల మందిరంలోకి వచ్చి తడి టవల్‌ని కుప్పగా పడేస్తున్నప్పుడూ, పౌడర్ రాసుకుంటున్నప్పుడూ, డాబామీదకెళ్ళి (బట్టలేసుకున్న తరువాతే!) షాంపూవాళ్ళ అడ్వర్టయిజ్‌మెంట్ కోసం అన్నట్లు జుట్టుని ఆరబెట్టుకుంటున్నప్పుడూ, శానిటరీ నాప్‌కిన్లకిచ్చే అడ్వర్టయిజ్ మెంట్లల్లో మోడల్స్‌లాగా పరిగెడుతున్నట్లు, టెన్నిస్ ఆడుతున్నట్లూ ఫోజుపెట్టినప్పుడూ ప్రేమ తనను అమితంగా ప్రేమించుకుంటుంది. తనను తాను ప్రేమించడంలో పూర్తిగా సఫలీకృతురాలు కాలేకపోతున్నదనీ గ్రహించి, తన ప్రేమకు న్యాయం చెయ్యడంకోసం పరుగెత్తడం, టెన్నిస్ ఆడడం మొదలుపెట్టింది. ఆ ఆటలో ప్రేమ్‌ని కలిసింది.

ప్రేమ ప్రేమ్‌తో కలిసి ఐస్ క్రీం తినడానికీ, ఒకే సీసాలోంచి కూల్ డ్రి ంక్ తాగడానికీ కారణం, ఒకవేళ వాళ్ల మధ్యనున్నది ప్రేమే అయితే దాన్ని ప్రేమించడంకోసం. ప్రేమ్‌కి కూడా ఇది బాగానే ఉంది. నాలుగుకళ్ళు కలిసి, ఒకే కప్పునీ కూల్ డ్రింక్ సీసానీ షేర్ చేసుకుంటున్న వాళ్ళ మధ్య ఉన్నది ప్రేమే అయితే దాని స్వభావ స్వరూపాది భౌతిక ధర్మాలేవో తెలుసుకోవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా అతనికా అవకాశాన్నివ్వడానికే అన్నట్టుగా అతని కళ్ళల్లోకి మొదటిసారి తిరిగి చూసినది ఈ ప్రేమే.

"మునిగిపోయాడు గురుడు" అన్నారు అతని స్నేహితులు కొందరు. గొంతుపట్టుకుని చూపిస్తూ, "ఇక్కడిదాకా కూరుకుపోయాడు" అన్నారు ఇంకొందరు. "కొట్టుకుపోతున్నాడు" అన్నారు మరికొందరు.

"ఈత రానివాడు దూకే నది వంటిదా ప్రేమ? లేక అదేమయినా ఊబివంటిదా? టోర్నడోనా?" అని సత్యాన్వేషణలో అతను అడిగిన ప్రశ్నలని వాళ్ళు ప్రేమ పైత్యం కింద జమకట్టి "మొదటి ప్రేమా గురూ?" అని ప్రశ్నించారు. "మాకు తెలిసినంతవరకూ నీ వైపు కన్నెత్తి కూడా చూసిన ఆడపిల్లలెవరూ ఉండకూడదు. అయినా కన్‌ఫర్మ్ చేసుకుందామని అడిగానంతే" అన్నాడొకడు జాలిగా చూస్తూ.

"బీరు బాటిల్స్ పక్కన పెట్టి మాట్లాడండి. ఒక్కతే ప్రేమ ఇక్కడ" అన్నాడు ప్రేమ్ చికాకుపడుతూ.

"నువ్వు ప్రేమబాధితుడవయితే నీ హృదయంలో ద్రవించే బీరుని సేవించి ఆ బాధకి ఉపశమనాన్ని అందించగలంగానీ, బాధలేనివాళ్ళకి చెప్పగల జవాబులేమీ మా దగ్గరలేవు" అన్నారు వాళ్ళు అతనికన్నా ఎక్కువ చికాకుపడి.

పట్టుదలగా ఓడిపోకుండా టెన్నిస్ ఆడుతున్న ప్రేమ్ మీద ప్రేమకు కోపం వచ్చింది. ఆమె సర్కిల్‌లో అమ్మాయిలెవరూ టెన్నిస్ ఆడకపోవడం వల్ల ప్రేమ ఎప్పుడూ అబ్బాయిలతోనే ఆడేది. అప్పటిదాకా ఆమెతో ఆడినవాళ్ళు ఆమె ఒక షాట్ కొట్టగానే ఆ బంతినందుకోవడానికి ట్రై చెయ్యకుండా చప్పట్లు కొట్టినవాళ్ళు. అందువల్ల ఆమెకు తీరిగ్గా ప్రతీ షాట్‌కీ పోజివ్వడానికి వెసులుబాటు కలిగేది. ఈ ప్రేమ్ రూల్సన్నీ మార్చి ప్రతీ షాట్‌నీ తిప్పికొట్టడంతో పోజివ్వడానికి సమయం లేకపోవడమే కాక రికవరీ టైం తక్కువ అయి ఆ షాట్‌ని అందుకోలేక ఆమె ప్రతీసారీ ఓడిపోతోంది కూడా. "ఒక్కసారన్నా ఓడిపోతే వీడికొంప ఏమైనా మునిగిందా?" అని ఆక్రోశించింది ప్రేమ హృదయం. ఆ కోపాన్ని కూడా ప్రేమిస్తున్నానని తెలిసి, ప్రేమించడానికి ఇంకొక అవెన్యూని తనకు కలుగచేసినందుకు అతణ్ణి నిజంగా ప్రేమించేసి, తను ఓడినప్పుడల్లా అతనిమీద కోపాన్ని ఇంకా పెంచేసుకుంది. కానీ ప్రేమకీ కోపానికీ మధ్య ఘర్షణని తట్టుకోలేక తండ్రిని సలహా అడిగింది.

"పెళ్ళిచేసుకుంటే సరి. అప్పుడు టెన్నిస్ ఆడకపోయినా ప్రేమించొచ్చు, అందులో ఓడిపోకపోయినా రోజూ బాగా కోప్పడొచ్చు" అన్నాడాయన డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నప్పుడు. "అబ్బా" అని అరిచాడు కూడా వాళ్ళావిడ చేతిలోని గరిటెని ఆయన తలకి పరంబు చేసిన చోటిని చేత్తో తడుముకునే ముందర.

"సీ, మీ అమ్మా, నేను - ఉయ్ వర్క్ ఆజ్ ఎ టీం. నేను డైలాగ్ మాత్రమే చెప్పాను. ఆవిడ యాక్షన్ చేసి సీన్‌ని పూర్తిగా ఎక్స్‌ప్లెయిన్ చేసేసింది" అన్నాడాయన. ప్రేమ ఆ ఇద్దరినీ ప్రేమగా చూసింది. "ఐ లవ్ మై టీం" అని వాళ్ళిద్దరినీ దగ్గరకు లాక్కుని అలా దగ్గరకు తీసుకోవడాన్ని ప్రేమించేసింది.

ప్రేమ ప్రేమ్‌ని పెళ్ళివైపు దారితీయించినప్పుడు ఆ దారిలో అడ్డంగా రాళ్ళుగా బాధపెట్టడానికి ముళ్ళుగానీ కనిపించక సరేనన్నాడు. (అతనికి నియర్ సైటెడ్‌నెస్ అని కళ్ళడాక్టరెప్పుడో చెప్పినా పట్టించుకోకుండా కళ్ళద్దాలు పెట్టుకోకుండానే తిరుగుతున్నాడు) ప్రేమ నుయ్యో గొయ్యో, వాగో వరదో, బీరో ఖీరో, ఐస్ క్రీమో మిరపకాయబజ్జీనో తెలుసుకోకుండానే పెళ్ళిచేసుకుంటున్నందుకు కొంచెం అసంతృప్తికి లోనయ్యాడు. "ఈ జీవితానికింతే" అన్నాడు స్నేహితులతో బీరు తాగుతూ.

"త్యాగమూర్తివయ్యా, నువ్వనురాగమూర్తివయ్యా" అంటూ పాడారు వాళ్ళు.

"ఇందులో త్యాగమేముంది?" ఆశ్చర్యపోయాడు ప్రేమ్.

"ఇంకా అర్థంకాలా? ప్రేమ త్యాగాన్ని కోరుతుంది. నిన్ను నువ్వే అర్పించుకుంటున్నావు. టాటా, వీడుకోలూ, గుడ్ బై ఇంక సెలవు" అని జాలిగా పాడి అతన్ని వదిలి వెళ్ళిపోయారు.

పెళ్లైన తరువాత ప్రేమ స్వరూప స్వభావాలపైన పరిశోధన చెయ్యడానికి విశేషమైన అవకాశాలని ప్రేమ ప్రేమ్‌కి కలిగించింది. అతని మీద కోపం కలగడాన్నీ విసుక్కోవడాన్నీ ఆమె ప్రేమించడంవల్ల కోపం తెచ్చుకోవడానికీ, విసుక్కోవడానికీ కొత్త మార్గాలనెన్నిటినో కనిపెట్టింది. వాటితో బాటు కొత్త కొత్త ఫోజులివ్వడం మొదలుపెట్టి సినిమాల్లోనూ టీవీ మీద కనిపించే ప్రతీ నటీ - కత్రినా కైఫ్, మల్లికా షెరావత్, అనుష్క, తెలంగాణా శకుంతలతో సహా మేము నేర్చుకోవలసినవి ఇంకా చాలా ఉన్నాయ్ అని నిర్ద్వంద్వంగా, నిస్సందేహంగా ఒప్పుకోగలిగేలా ఫ్రీజ్ అయి చూపిస్తూ ప్రేమ్ పరిశోధనలో అతనికి ఊపిరాడనంత పనిని కల్పించింది. ప్రేమ ప్రతీకోణాన్నీ ప్రేమ్ నోట్ చేసుకుంటూనే ఉన్నాడు.

పన్నీటి జల్లులా హాయిగొలిపే, ఉప్పెనలా ముంచేసే, మొగలిపూవులా మత్తిక్కించే, ఉల్లిపాయలా ఏడిపించే, సంపెంగ పూవులా చక్కిలిగింతలు పెట్టే, నిప్పులా కాల్చేసే (ముఖ్యంగా సిగరెట్ చివర్లో కొచ్చిందని చూసుకోనప్పుడు), చీరలా చుట్టేసే, కాఫీ, సిగరెట్ల అలవాట్లని పెంపుజేసే, మల్లెపూవులా మెత్తగా ఉండే ప్రేమ విశ్వరూప దర్శనానికి పెళ్ళి ఎంత దోహదం చేసిందో ప్రేమ్ ప్రతీ క్షణమూ తెలుసుకుంటూనే ఉన్నాడు. అతను తెలుసుకుంటోంది తనగూర్చో లేక ప్రేమస్వరూపం గూర్చో అన్నది తెలియక, ఇది ద్వైతమా లేక అద్వైతమా అన్న మీమాంసలో పడి రెంటికి తగ్గ పోజులనీ ఇవ్వడంలో బిజీగా ఉండిపోయింది ప్రేమ.

●●●

## అపరాధభావం

పోలంరాజు శారద

**పూజకు పూలు కోస్తున్న వర్ధనమ్మ** బయట కారు చప్పుడు వినిపించి గేటు వైపు చూసింది.

"ఏరా విజయ్ హాస్పిటల్‌కి టైం అవలా? పొద్దున్నే ఇట్లా వచ్చావు. పద లోపలికి కాఫీ తాగుదువుకాని." లోపలికి వస్తున్న మనుమడిని పలుకరించింది.

"ఈ రోజు నైట్ డ్యూటీ ఉంది అమ్మమ్మా, అందుకే కొంచెం ఆలస్యంగా వెళ్లొచ్చు. అవునూ సుగుణమ్మ ఏది?" సరాసరి పెరట్లో పని చేసుకుంటున్న నడి వయస్కురాలి దగ్గరకు వెళ్లాడు.

"అమ్మా, ఎట్లా ఉన్నావు?" మాటలు వినబడి ఆమె వెనుకకు తిరిగి చూసింది. కళ్లు సంతోషంతో విప్పారుకున్నాయి.

"విజయ్ బాబూ! ఎట్లా ఉన్నారు? అమ్మా నాన్నా కులాసానేనా?" అతని రెండు చెంపలు తన చేతులలో పట్టుకుని కళ్లల్లోకి ఆప్యాయంగా చూస్తూ అడిగింది.

"అంత బాగానే ఉన్నారమ్మా. నీ ఆరోగ్యం ఎట్లా ఉంది? వేళకు మందులేసుకుంటున్నావా? శివన్న సవ్యంగ ఉంటున్నాడా, లేకపోతే మళ్లీ మొదటికి వచ్చాడా?"

"బాగానే ఉన్నాను బాబూ, ఆయన కూడా మీ పుణ్యమా అని సక్రమంగానే ఉంటూ పనిచేసుకుంటున్నాడు."

"నీ చేత్తో కాఫీ టిఫిన్ తిని చాలాకాలమైంది. తిని పోదామని వచ్చాను. అమ్మా ఈ రోజు ఏం టిఫిన్ చేసావు?" ఆమె భుజాల చుట్టూ చేతులేసి లోపలికి నడుస్తున్న మనుమడిని చూస్తూ ఉన్న వర్ధనమ్మ మనసు పది సంవత్సరాల గతంలోకి తొంగి చూసింది.

వర్ధనమ్మ దంపతుల కొడుకు విదేశాలలో ఉండిపోయాడు. కూతురు పెళ్లయి ఆ ఊళ్లోనే పన్నెండేళ్ల కొడుకు భర్తతో ఉంటుంది అప్పుడప్పుడూ వచ్చి తల్లి తండ్రిని చూసి పోతూ ఉంటుంది. అంత పెద్ద ఇల్లు పెరడు ఇద్దరే ఉంటూ, తోడుగా ఉంటారు, ఇంక పనికి సాయంగా కూడా ఉంటారని సుగుణ దంపతులకు రెండు గదులు కట్టించి తమ కాంపౌండ్‌లోనే అట్టే పెట్టుకున్నారు.

సుగుణ భర్త ఆటో రిక్షా నడుపుకుంటూ ఉంటాడు. కానీ బాధ్యత అనేది బొత్తిగా లేదు వచ్చిన సంపాదన తన విలాసాలకే ఖర్చుపెట్టుకుని భార్యను, పద్నాలుగేళ్ల కొడుకును అసలు పట్టించుకునేవాడే కాదు. సుగుణ వర్ధనమ్మగారి ఇంట్లో వంటపనే కాక ఇంట్లో పనిమనిషి పనులన్నీ కూడా చేస్తూ ఉంటుంది. ఆమెకు తన కొడుకు బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలని కోరిక బలంగ ఉండేది. తమకు ఎట్లా ఈ చాకిరి తప్పదు. కనీసం కొడుకైనా పైకిరావాలన్న తలంపుతో వాడిని పెద్ద స్కూల్లో చేర్పించింది. ఇంట్లో ఉంటే భర్త చేసే రాద్ధాంతంతో చదువుకొనసాగదని హాస్టల్లో పెట్టి మరీ చదివిస్తున్నది. తల్లి ఆశయాలకు తగ్గట్టే వాడు కూడా బుద్ధిగా చదువుకుంటున్నాడు.

ఇంట్లో పనిచేస్తున్నందుకు వర్ధనమ్మగారు బాగానే ముట్టచెబుతుంది. ప్రతిరోజూ అన్నం కూరలు కూడా ఇక్కడి నుండే పట్టుకెళ్లటంతో తనకు అద్దె ఖర్చు భోజన కర్చుకూడా తప్పుతున్నాయి. కానీ వచ్చిన ఆ జీతం రాళ్లు కూడా భర్త ఎక్కడ లాగేసుకుంటాడో అన్న భయంతో కొంత తన ఖర్చుల మటుకు ఉంచుకుని తతిమ్మాదంతా వర్ధనమ్మగారి దగ్గరే దాచుకుంటూ ఉంటుంది.

ఆవిడ కూడా చాలా పెద్దమనసుగల మనిషి. "సుగుణా, నీ కొడుకు చదువు గురించి నువ్వేమీబెంగపడొద్దు. వాడు బాగా చదువుకుని పైకి వస్తానంటే నేనెంత సహాయమన్నా చేస్తాను. నా దగ్గర దాచుకున్న డబ్బులతో వాడి కాలేజీ ఫీజులకు సరిపోకపోతే నన్నడుగు. సాయం చేస్తాను" అంటూ ఆ భార్యాభర్తలు భరోసా ఇచ్చేటప్పటికి సుగుణకు మరింత ధైర్యం కలిగింది.

వర్ధనమ్మకు కొన్ని చాదస్తాలు కూడా ఉన్నాయి. ఆ చాదస్తమే సుగుణకే కాక మరికొందరి జీవితాలను కూడా మలుపు తిప్పింది.

ఆ రోజు సుగుణ పనులు ముగించుకుని "అమ్మగారు మళ్లీ మీ భోజనాల వేళ్టికి వచ్చి వేడివేడిగా రొట్టెలు చేసి పెడతాను. ఇంటికెళ్లి స్నానంచేసి మళ్లీ వస్తాను."

ఇంటికొచ్చిన సుగుణకు పరమానందంగా ఉంది. ఆ సంవత్సరంతో కొడుకు రవి పదవక్లాసు పాసవుతాడు. తరువాత కాలేజీలో చేర్పించాలి. కానీ ఫీజులకి పుస్తకాలకి తను దాచుకున్న డబ్బులు సరిపోతాయా లేదా అన్న బెంగ ఉండేది. కానీ అమ్మగారు బాబుగారు తాము కూడా సాయం చేస్తామనేటప్పటికి సుగుణ ఆనందానికి హద్దులు లేకపోయినాయి.

గబగబ స్నానం చేసి మళ్లీ అమ్మగారింటికి వెళ్లి రొట్టెలు చేసిపెట్టాలని బయల్దేరబోతుండగా రవితో కూడా హాస్టల్‌లో చదువుకుంటున్న శ్రీను పరిగెట్టుకుంటూ వగరుస్తూ వచ్చాడు.

"పిన్నీ, పిన్నీ రవి బళ్లో ఆడుకుంటూ పడిపోయాడు. స్పృహ తప్పింది. టీచర్లు గవర్నమెంట్ హాస్పిటలకి తీసుకెళ్లారు. నిన్ను వెంటనే పిలుచుకు రమ్మన్నారు."

ఆ కబురు విని వెంటనే ఇంట్లోకి వెళ్లి వర్ధనమ్మగారికి చెప్పి శ్రీను వచ్చిన ఆటోలోనే బయల్దేరింది.

హాస్పిటల్‌లో వెంటనే రెండువేల రూపాయలు కట్టాలి అన్నారు. గవర్నమెంట్ హాస్పిటలే కానీ కొన్ని పరీక్షలు చేయాలి, వాటికి ఖర్చు అవుతుంది వెంటనే కట్టాలి అన్నారు. సుగుణ మళ్లీ ఆటోలో ఇంటికి వచ్చింది. ఎంత ఖర్చయినా ఫరవాలేదు. తను అమ్మగారి దగ్గర దాచుకున్న డబ్బు ఉంది. దేవుడా నువ్వే నా బిడ్డను కాపాలి అని పదే పదే వేడుకుంటూ ఇంటికి వచ్చింది.

ఇంట్లోకి వెళ్లి సంగతి వివరించి, "అమ్మగారు, నాకొక అయిదువేల రూపాయలు ఇవ్వండి. నేను హాస్పిటల్లో కట్టేస్తాను." అని అడిగింది.

"అయ్యో అదేంటి సుగుణా, దీపాలు పెట్టింతర్వాత నేను డబ్బు ముట్టుకోనని తెలుసుగా, ఎట్లా ఇవ్వమంటావు?"

"అమ్మగారూ, ఈ సమయంలో ఇట్లాంటివన్నీ పెట్టుకుంటే ఎట్లాగమ్మా? నా కోసం, నా కొడుకు కోసం ఈ ఒక్కసారికి డబ్బు ఇవ్వండమ్మా" వేడుకుంది. కానీ వర్ధనమ్మగారు కొన్ని విషయాల్లో నిక్కచ్చిగా ఉంటుంది. ఎంత ప్రాధేయపడ్డా ఆవిడమటుకు ససేమిరా బీరువా తీయటానికి ఒప్పుకోకపోవటంతో సుగుణ నిరాశగా వచ్చిన దారినే తిరిగి అదే ఆటోలో వెళ్లిపోయింది.

అక్కడ ఈలోగా రవిని చేర్పించిన స్కూలు టీచర్లు డబ్బుకట్టి కావలసిన టెస్టులు చేయించారు. వారికందరికి సుగుణ సంగతి తెలుసు. తమ డబ్బు ఎక్కడికీ పోదన్న ధీమా.

తెల్లారితేకానీ రిపోర్టులు రావన్నారు. ఇంక అక్కడే చెట్లకింద ఆ రాత్రి గడపడానికి నిశ్చయించుకుంది సుగుణ. కూడా వచ్చిన పిల్లలు, టీచర్లు బాగా పొద్దుపోయేదాకా తోడుండి మళ్లీ పొద్దున్నే వస్తామని, ఏమీ దిగులుపడవద్దని ధైర్యం చెప్పి, ఆవిడకు కాఫీ టిఫిన్ ఇచ్చి తినిపించి వెళ్లిపోయినారు.

తెల్లారింది. రవికి ఇంకా స్పృహ రాలేదు. పెద్ద డాక్టరు వచ్చాడు. మిమ్మల్ని పిలుస్తున్నారు, అని పిలిచేటప్పటికి లోపలికి వెళ్లింది.

"అమ్మా మీ వాడికి తల లోపల రక్తం గడ్డ కట్టింది. దానికి కొన్ని ఇంజక్షన్లు ఇవ్వాలి. అవి మాదగ్గర లేవు. వెంటనే వెళ్లి కొనుక్కొస్తే మా ట్రీట్‌మెంట్ ప్రారంభిస్తాము" మందు చీటీ చేతిలో పెట్టారు. పక్కనే ఉన్న మందులషాపుకెళ్లి చూపించింది. అవి చాలా ఖరీదైనవి అని తెలిసింది. మళ్లీ ఆటో వేసుకుని ఇంటికెళ్ళింది.

"ఏం సుగుణా, రవి ఎట్లా ఉన్నాడు?" వర్ధనమ్మగారి భర్త ఆరాటంగా అడిగారు.

సంగతి వివరించి "ఆ ఇంజక్షన్లు చాలా ఖరీదైనవి. వెంటనే కొనాలి. నాకు డబ్బు ఇప్పిస్తే వెంటనే వెళ్లి కొని వాళ్లకు ఇచ్చి వస్తాను."

అప్పుడే తలంటుకుని కాళ్లకు పసుపు రాసుకుని పూజ చేసుకోటానికి వెళ్లబోతున్న వర్ధనమ్మ.

"ఇదేం ఖర్మ సుగుణా? నిన్న కాస్త పొద్దుండగానే వచ్చి ఉంటే నీకీ తిప్పలు తప్పేవిగా, దీపాలు పెట్టాక వస్తివి. ఇప్పుడేమో శుక్రవారప్పూట వస్తివి. ఆ ఆస్పత్రివాళ్లు డబ్బు గుంజటానికి అట్లాగే చెప్తుతారు. నీ దగ్గర డబ్బు లేదని చెప్పు. గవర్నమెంటు ఆస్పత్రి. ఎవడికోసం చచ్చినట్టు వాళ్లే తెప్పించి ఇస్తారు. లేకపోతే మీ అయ్యగారి స్నేహితులు ఉన్నారు. వాళ్లచేత చెప్పిస్తారులే. మీ అయ్యగారి పేరు చెప్పు"

నోటమాట రాక నిలబడిపోయింది సుగుణ.

ఆయన కూడా నచ్చచెప్పబోయాడు. "అదికాదు వర్ధనీ, ఎంత గవర్నమెంట్ హాస్పిటల్ అయినా కొన్ని ఖర్చులు ఎవరిది వారే పెట్టుకోవాలి. ఎంతో కొంత ఇచ్చి పంపించు. ఆలస్యమైతే మళ్లీ కష్టం."

ఎంత చెప్పినా ఆవిడ మటుకు శుక్రవారం నాడు డబ్బు ఇవ్వటానికి ఒప్పుకోలేదు. సుగుణ దుఃఖంతో వెనుతిరిగింది. డబ్బులు ఉండి కూడా సమయానికి ఆదుకోలేకపోయిన తన నిస్సహాయతకు తనమీద తనకే కోపం వచ్చింది. తెలిసిన వాళ్లందరిని అడిగింది. కనీ తన దౌర్భాగ్యం. అది నెల చివర అవటాన ఎవరు ఆదుకోలేకపోయినారు

రవి చదువుతున్న స్కూలుకెళ్లి వాళ్లకు తన పరిస్థితి వివరించింది. అందరూ జాలిపడి తమకు తోచినంత ఇచ్చారు. అంతా పోగేసుకుని, ఆ రోజు మందులకు సరిపోతాయి అనుకుని హాస్పిటల్ దగ్గరకు చేరేటప్పటికి పుణ్యకాలం కాస్తా దాటిపోయింది.

వెళ్లగానే అక్కడి సిబ్బంది విరుచుకుపడ్డారు. "ఏం తల్లివమ్మా, కొడుకు ఇక్కడ చావుబతుకుల్లో ఉంటే నువ్వు తీరిగ్గా ఆర్చుకుని తీర్చుకుని ఇప్పుడు వస్తావా? ఒక్క గంట ముందర ఆ ఇంజక్షన్ తెచ్చి ఉంటే నీ కొడుకు నీకు దక్కేవాడు కదా. అదిగో అక్కడ శవాల గదిలో పెట్టారు. వాళ్లకు ఎంతో కొంత ముట్టచెప్పి బాడీని తీసుకుని వెళ్లు"

వాళ్లు ఇవ్వవలసిన ఇన్ఫర్మేషన్ వాళ్లు ఇచ్చి వెళ్లిపోయారు.

సుగుణకు మొదట్లో ఏమీ అర్ధంకాలేదు. అర్ధం చేసుకునేటప్పటికి ఇంక కాళ్లు చేతులు ఆడలేదు. పోయి రాత్రి కూర్చున్న చెట్టు కిందే కూర్చుని ఆలోచనలో పడింది. ఆ షాక్‌లో ఏడుపు కూడా రాలేదు. ఈ లోగా కబురు విన్న ఆమె భర్త శివన్న కూడా అక్కడకు వచ్చాడు.

కొంత తడవకు తేరుకుని, "నువ్వు ఇక్కడే ఉండు. నేను ఇప్పుడే వస్తాను." హాస్పిటల్ లోపలికి వెళ్లింది.

"పెద్ద డాక్టర్ గారితో మాట్లాడాలి" అని అడిగి ఆయన గదిలోకి వెళ్లింది.

"సారీ అమ్మా సమయానికి మందులు తేనందువల్ల నీ కొడుకును కాపాడలేకపోయాం ఆఫీసులో అడిగి సంతకాలు పెట్టి తీసుకెళ్లవచ్చు."

"డాక్టరుగారు, మీతో కొంచెం మాట్లాడాలి."

ఆయన బయటకు వెళ్లేవాడల్లా ఆగిపోయాడు.

"రవికి తలలోపల దెబ్బ తగిలిపోయినాడన్నారు కదా!"

"అవునమ్మా, ఏం ఏమైనా సందేహమా"

"అంటే తతిమ్మా అవయవాలు అన్ని సక్రమంగానే ఉన్నాయికదా" కొడుకు మరణంతో ఆమెకు ఏమైనా మతి చలించిందేమోనని అనుమానం కలిగింది ఆయనకు. కానీ ఓపిగ్గా ఆవిడ సందేహాలకన్నింటికి సమాధానం చెప్పాడు. ఆవిడ కోరిక విని ఆశ్చర్యపోయాడు. ఆఫీసులో నుండి సంబంధించిన స్టాఫ్‌ని పిలిపించి ఆమెకు పరిచయం చేసాడు.

ఫార్మాలిటీస్ అన్నీ ముగించుకుని సుగుణ, శివ ఇల్లుచేరేటప్పటికి బాగా రాత్రయింది.

ఎవరికోసమూ ఆగని సూర్యభగవానుడు తన డ్యూటీ తను చేస్తూ వచ్చేసాడు.

"ఈ సుగుణ ఈ వేళయినా వస్తుందో, రాదో" అనుకుంటూ తలుపు తీసిన వర్ధనమ్మకు యధాప్రకారం చిమ్మి ముగ్గు పెట్టిన వాకిలి చూసి ఆగింది. ఈలోగా అలవాటు చొప్పున తన దగ్గరున్న తాళాలతో పెరట్లోనుండి వంటింటి తలుపు తీసి సుగుణ పెడుతున్న కాఫీ వాసన ముక్కుపుటాలకు తగిలింది.

"నే చెప్పలేదుటండి. అదిగో సుగుణ అప్పుడే పనిలోకి కూడా వచ్చేసింది." అంటుండగానే కాఫీ కప్పులతో ప్రత్యక్షమైంది సుగుణ.

"నే అన్నట్టే అయిందా సుగుణా. రవిని హాస్టల్‌లో దిగబెట్టి వచ్చినట్టున్నావు. నే చెప్పలా, ఈ డాక్టర్లంతా ఇంతే అయిందానికి కానిదానికి కంగారు పెట్టేస్తుంటారు. ఇట్లాగే ఒకసారేమైందో తెలుసా..?" ఫోన్ మోగుతుంటే ఎత్తి స్పీకర్ ఆన్ చేసింది.

అవతలనుండి అందరికి వినబడేలాగా కూతురు గొంతు వినిపించింది. "అమ్మా, ఎంత శుభవార్తో తెలుసా"

"ఏంటే పొద్దున్నే అంత శుభవార్త. మళ్లీ నీళ్లు పోసుకున్నావా ఏంటి" నవ్వుతూ అడిగింది.

"చాల్లేమ్మా నీ సరసాలు. నిన్న మన డాక్టర్ అంకులు ఫోన్ చేసి డోనర్ దొరికాడు, విజయ్‌ని తీసుకుని రమ్మన్నాడు. రాత్రికి రాత్రే ఆపరేషన్ కూడా చేసేసాడు. రాత్రి అంతా అయేటప్పటికి చాలా ఆలస్యం అయింది. అన్ని క్షణాల మీద జరిగిపోయేటప్పటికి మీకు చెప్పలేకపోయినాను. డాక్టర్ ఇప్పుడే వచ్చి ఆపరేషన్ సక్సెస్ అని చెప్పాడమ్మా" కూతురు గొంతులో ఆనందంతో కూడిన గద్గత విని తల్లి మనసు కదిలిపోయింది.

మనుమడు విజయ్ కొంతకాలం క్రితం ఆడుకుంటుంటే కంట్లో పుల్లగుచ్చుకుని చూపుపోయింది. ఎవరైనా డోనర్ ఉంటే చూపు తిరిగి వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు చెప్పేటప్పటికి అంతా ఆ మంచి సమయం కోసం వేచి చూస్తూ ఉన్నారు.

"ఎవరమ్మా ఆ పుణ్యాత్ములు"

"పాపం ఎవరోనమ్మా, మన విజయ్ వయసు పిల్లవాడేనట, మొన్న స్కూల్లో తలకు దెబ్బ తగిలిందట. పేదరికం వల్ల సకలంలో సరైన విద్యం లభించక నిన్ననే మరణించాడట. అతని తల్లి ఆరోగ్యంగా ఉన్న అతని శరీరాన్ని హాస్పిటల్‌కి డొనేట్ చేస్తూ, అవసరమున్న వారికి అతని అవయవాలు అమర్చమని రాసి మరీ బాడీని వదిలేసి వెళ్ళిందట."

అక్కడే ఉండి న్యూస్ పేపర్ చదువుతున్న ఆయన శిలాప్రతిమ అయిపోయినాడు. ఇంతలో కుళ్లి కుళ్లి ఏడుస్తున్న శబ్దం విన్న వర్ధనమ్మ తల తిప్పి చూసేసరికి అంతా అర్థమైంది. "అమ్మా ఎవరమ్మా ఆ ఏడుస్తున్నది?."

"మళ్లీ నేను ఫోన్ చేస్తాను" అని పెట్టేసి సుగుణ దగ్గరకు వెళ్లి ఏడుస్తున్న ఆమెను గట్టిగా పట్టుకున్నది. తూట్లుపొడిచే చూపులతో తనను చూస్తున్న భర్త వంక చూసే ధైర్యం కూడా లేకపోయింది. ఆ తరువాత కూతురికి అన్నీ వివరించి భోరుమన్నది.

ఆ కన్నతల్లి  కడుపుకోతకు కారణం ఎవరు. తానేనా?

"ఏం అమ్మమ్మా, ఆలోచనలో పడ్డావు? సుగుణమ్మ చేసిన ఈ పెసరట్టు రుచి మరింకెక్కడా దొరకదు తెలుసా?" అంటూ పలకరిస్తున్న మనుమడి కళ్లల్లో కనిపిస్తున్న రవిని దిగులుగా చూసింది.

ఎన్ని సంవత్సరాలైనా ఈ అపరాధభావం వదలటంలేదు

●●●

## నాన్నా ఒకసారి మళ్లీ రావూ! నాగ్ శర్మ రొట్టె

**నేను శూన్యంలోకి చూస్తూ అలా ఉండిపోయాను.**

ఒక పరిచితమైన మొహం కనిపించింది.

ఎక్కువ సేపు పట్టలేదు గుర్తించడానికి అది మా నాన్నే!

మా నాన్న ఫోటోలోలా లేడు. నేను పుట్టినప్పుడు ఎంతందంగా ఉన్నాడో అలా ఉన్నాడు.

నాన్న గుర్తొచ్చాడు. బుగ్గలమీద వెచ్చగా ఏదో తగిలింది. నాన్న తన మునివేళ్లతో నిమిరాడేమో. కన్నీళ్లని తర్వాత తెలిసింది.

"నాన్నా నన్ను వదిలి ఎందుకు వెళ్లిపోయావూ? " అని అడగాలనిపించింది కానీ అడగలేదు. గొంతులో ఏదో అడ్డం పడినట్టుంది. నా గొంతు మూగబోయింది.

"బాధ్యతల బరువునెలా మోసావు నాన్న? " అని అడిగాను డగ్గుకత్తికతో నాన్న నవ్వాడు.

"నేనెపుడూ అది భాద్యత అనుకోలేదురా! " అన్నాడు శాంతంగా.

నిరంతర జీవన పోరాటంలో నాన్న తనకోసం క్షణమైనా ఆలోచించలేదన్న విషయం గుర్తుకొచ్చింది. అదే అడిగాను నాన్నని.

"నీకూ పుట్టారుగా! నీకే తెలుస్తుంది" నర్మ గర్భంగా నవ్వాడు నాన్న.

మళ్లీ ఏవో జ్ఞాపకాలు మనసుని తడిమి అలజడి కలిగించాయి. నాకు జ్వరమొచ్చినప్పుడు నాన్న నుదురు మీద నిమిరి నవ్వేస్తు అన్నాడు "అబ్బే పెద్ద జ్వరమేమీ కాదు" నాన్న స్పర్శకి కళ్లు తెరచి చూసా. జ్వరం నిజంగానే పారిపోయింది. అసలు నాన్న స్పర్శే ఒక అద్భుతం. మెత్తగా వెచ్చగా.

"నాన్నా! నన్నొకసారి మళ్లీ నిమరవా? " అని అడిగాను. నా చెంపలమీద నుంచి కారిపోతున్నాయి కన్నీళ్లు. నాన్న మళ్లీ నవ్వాడు. ఈసారి నాకు కోపమొచ్చింది.

మళ్లీ గుర్తొచ్చింది నాన్నతో ఊరెళ్లినప్పుడు బస్సులో నాన్న ఒళ్లో తలపెట్టి నిద్దురోవడం గుర్తొచ్చింది. ఇప్పుడలా పడుకోవాలనిపించింది. అడిగితే నాన్న మళ్లీ నవ్వుతాడేమో అనిపించి అడగలేదు. అసలు నాన్న ఒళ్లో పడుకుంటే ఊహాకందని సుఖం. కొడుకూ, కూతురైన ప్రతీ వాళ్లకిది అనుభవమే.

ఒకరోజు నేను మాములుగానే బడికి వెళ్లాను. మాది ఒంటిపూట బడి. రెండు గంటలకల్ల ఇంటికి వెళ్లేవాణ్ణి. ఆ రోజు మాత్రం బడి నుంచి చెరుకు తోటలకు వెళ్లాను. ఇంటికి వెళ్లేసరికి నాలుగు. మా వీధిలో అటూ ఇటూ దారి వెంబడి జనాలు. నాన్న శివాలయం

ముందు అరుగుమీద కూర్చుని ఏడుస్తున్నాడు. "నా మీద అంత పిచ్చి ప్రేమ ఎందుకు?" అడిగాను నాన్నని. సమాధానం చెప్పలేదు నాన్న. ఎందుకో ఆ విషయం తలుచుకుని ఇంకా భయపడుతున్నట్టు కనిపించింది ఆయన మొహంలో

నలుగురు పిల్లల చదువులకు పోషణకి ఎన్ని లక్షలు ఖర్చయ్యాయో లెక్కేలేదు. పైగా మితిమీరిన గారాబం..! అడిగాను నాన్నను. వేదాంతిలా నవ్వాడు నాన్న "ఋణానుబంధ రూపాణా పశుపుత్రసుతాలయా" అని నవ్వాడు నాన్న. తామరాకు మీద నీటిబొట్టులాగా సంసారం నుంచి ఉపసంహారం చేయటం నాకు గుర్తే.

"నాన్నా! ముప్పైలోనే బాగ అలిసిపోయాను నాన్నా! " అన్నాను.

"నీ తాపత్రయం ఎప్పుడూ విజయాలు. అపజయాల మీదనే కానీ చేసిన పనిని ఎంత గొప్పగా చేసామన్న విషయం అసలు పట్టించుకోవు" అన్నాడు నాన్న. భగవద్గీత గుర్తుకొచ్చి నాలుక్కరుచుకున్నాను.

మళ్లీ ఏవో ఆలోచనలు. నాన్ననొదిలి అసలు ఉండేవాణ్ణేకాదు. నాన్న లేకుంటే ఈ లోకమే లేదు అనుకునే వాణ్ణి. నాన్న తలనొప్పి కూడా ఎరుగడు. ఎప్పుడన్నా దగ్గో, పడిశమో కొంపతీసి వస్తే గిస్తే చాలా హడావిడి చేసేవాణ్ణి. బాగా ఇబ్బంది  పడేవాడు నాన్న. ఈ హడావిడికి.

ఉద్యోగానికి దూరదేశం వెళ్లాలి. వెళ్లాను. కానీ ప్రతీ రెండు వారాలకీ నాన్నని చూసేవాడిని. ఆ నెల్లో ఏదో బాగా పని. నెలంతా వెళ్లడం కుదరలేదు. ఫోను చేసినప్పుడు అడిగాడు నాన్న. "ఈ వారం వస్తున్నావా?" అని. బదులు పలకలేదు నేను. పని ఒత్తిడి ఎక్కువవడం వల్ల ఏమీ చెప్పలేకపోయాను. ఈ విషయం ఇప్పుడు గుర్తుచేసాను నాన్నకి. నాన్న దిగులుగా చూసాడు. "నువ్వు కొంచెం తొందరపడితే బావుండేది" అన్నాడు.

ఆ రోజు మామూలు రోజుల్లాగే తెల్లారింది. ఏమీ తేడాలేదు. సాయంత్రం ఏడైంది. నా చేతుల్లో ఉన్న శెమ్మం గుడి సీ.డి కింద పడింది ఫోను మోగింది. నేను చచ్చిపోతానని అసలు విషయం నాకు ఫోన్లో చెప్పలేదు.

నాన్న నిర్జీవంగా పడి ఉన్నాడు. "అనాయాసేన మరణమ్" అక్షరాలా అనాయాసంగానే జరిగిపోయింది నిమిషాల్లో. అలా నాన్నని చూసిన నేను చచ్చిపోలేదు. ఎందుకనో మరి? ఆ రోజు ఏ ప్రళయం కూడా రాలేదు మరి? గొప్ప వేదాంతిలా మాట్లాడాను నాన్న పక్కనే కూర్చుని నాన్నని అడిగాను తనకేమనిపించిందో? అని నాన్న మొహంలో గర్వం ఉట్టిపడింది.

పోయిన తర్వాత నాన్న నాకెప్పుడూ కలలోకి రాలేదు. నాన్నకి నా మీద కోపమేమో అనుకున్నను. సంజాయిషీ అడిగాను నాన్నని. "నాకే కోరికా మిగల్లేదురా. కోరికల్లేనివారు కలల్లోకి రారు" అన్నాడు.

ఈసారి నాన్న కాస్త దగ్గరికొచ్చి తన చేతులతో నా మొహాన్ని నిమిరాడు. అదే స్పర్శ మెత్తగా వెచ్చగా ప్రాణం లేచొచ్చింది.

"నాన్నా నాతోనే ఉండిపోవూ! " అన్నాను.

ఈసారేమీ మాట్లాడలేదు నాన్న. నాన్న కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. వెచ్చని కన్నీళ్లు ధారగా నా మొహంపై పడుతున్నయి.

దిగ్గున లేచి కూచున్నాను. నా కూతురు నవ్వుతోంది. నా మొహంపై నీళ్లు చిలకరిస్తూ. ఒక్కసారి నాన్నని మళ్లీ చూడాలనిపించింది. మనసంతా బరువుగా ఉంది ఇంతలో అమ్మ ఫోనొచ్చింది ఇండియా నుంచి. మనస్సు కుదుట పడింది.

"నాన్నా ఒకసారి మళ్లీ రావూ? " అని స్వగతంలో అనుకున్నాను. గట్టిగా అరిచానని తర్వాత తెలిసింది.

కోరికల్లేని వారు కలల్లోకి రారని నాన్న చెప్పడం గుర్తొచ్చింది. నాన్నిప్పుడెందుకు కలలోకి వచ్చాడో ఆలోచించినా బోధపడలేదు.

●●●